# సుందరకాండలోని సౌందర్యము

49714

కృతిపతి :

భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారు

సమర్పకుడు :

డా॥ మల్లాది గోపాలకృష్ణ శర్మ
ఎమ్.ఏ. (త్రయ) ; పిహెచ్.డి.

Rs 30 P 00

హరిహర గ్రంథమాల : పంచమ కుసుమమ్

# సుందరకాండలోని సౌందర్యము

కృతిపతి :

భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారు

సమర్పకుడు :

డా॥ మల్లాది గోపాలకృష్ణ శర్మ
ఎమ్.ఏ. (త్రయ) ; పిహెచ్.డి.

ప్రకాశకులు

ఆర్ష భారతీ ప్రకాశన్స్
ప్లాట్-90, 5వ రోడ్డు
కృష్ణానగర్ కాలని,
మౌలాలి, హైదరాబాద్-40,
ఆంధ్ర ప్రదేశ్.

ప్రథమ ముద్రణము, ఏప్రియల్ 1993

PLACED ON THE SHELF
Date..............................

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారి
ఆర్థిక సహాయముతో
ముద్రించబడినది.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No...49714......
Date..............................
TIRUPATI.

ప్రతులు లభించు చిరునామా :

ఆర్ష భారతీ ప్రకాశన్,
ప్లాట్ నం-90, 5వ రోడ్డు,
కృష్ణానగర్ కాలని,
మౌలాలి పోష్టు,
హైద్రాబాద్-40.
P. C. : 500 040.

# ప్రస్తావన

ఒక కార్యము రూపొందుటకు, తదపేక్షితమగు కారణ సామగ్రి అల్పముగనో, పుష్కలముగనో ముందే యేర్పడి యుండును. అది ప్రాకృతికనియమము. నేను గూడ రామాయణముపై సమాలోచన గ్రంథములను, ఒకదా నివెంబడి మఱియొకటి వెలువరించుట నిర్నిమిత్తకము గాదు.

జన్మాంతరీయ సుకృత మూలమున, నాకనాయాసముగ, గుర్వనుగ్రహ మహాపురుషానుగ్రహ, భగవదనుగ్రహములు, మూడూ సంప్రాప్తములైనవి. గుర్వనుగ్రహమున విద్యాప్రాప్తి, మహాపురుషానుగ్రహమును రామభక్తి, రామానుగ్రహములున్నూ సంప్రాప్తములైనవి. నేను తెనాలిలో సంస్కృత కళాశాలలోను, తాలూకా ఉన్నత పాఠశాలలోను పనిచేయుచున్నపుడు తఱచుగ, నిరంతర బ్రహ్మచింతన తత్పరులును, బ్రహ్మీభూతులును నగు ప.ప. శ్రీశ్రీశ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ స్వామి చరణుల దర్శనమునకు అనంతవరము వెళ్ళుచుండెడి వాడను, వారి బోధలను గూడ వినుచుండెడివాడను. 1949లో వారు బ్రహ్మీభావమును పొందుటకొకటి రెండు రోజులు పూర్వము వారి దర్శనమున కేగితిని. అది సాయం సమయము. శ్రీ కుప్పా లక్ష్మీనారాయణ గారి యింటి ప్రాంగణమున భక్తులందరు మండలాకారమున గుమిగూడియుండిరి. మధ్యలో శ్రీస్వామివారు 'నేరామునీ గంటిని' అను పల్లవిగల నొక కీర్తనమును తన్మయతతో కీర్తించుచు మండలాకారమున తిరుగుచుండిరి. అది మఱపురాని దృశ్యము. నేనా దృశ్యమును తన్మయతతో చూచుచు ఆ భక్తమండలిలో నిలబడియుంటిని. స్వామివారు నన్ను సమీపించి, నన్ను వారి పరిష్వంగములోనికి తీసికొని, ఆ గీతమునే కీర్తించుచు కొంచెము తడవు పరిభ్రమించిరి. తరువాత మఱునాడే శ్రీవారు కార్తిక బహుళ ఏకాదశినాడు బ్రహ్మీభావమును పొందిరి. వారేమి మనసా సంకల్పించిరో నాకు తెలియకున్నను, నాకు తదాది రామాయణ పఠన చింతన మననాదుల ప్రయత్నముగ తటస్థించినవి.

నేను 1956లో అమలాపురమునకు వెళ్ళిన పిదప సాహితీ సమితిలో నా మొదటి రామాయణ ప్రసంగము చేసితిని. సభ్యులందరు ఇట్టి ప్రసంగములు ఇంకను పరమ్పరగ జరుగవలెనని ఐక్యకంఠముతో నుడివిరి. శ్రోతల యుత్కంఠత ప్రోత్సాహములపైన, నా రామాయణ ప్రసంగములు పలు చోటుల, పరంపరగ జరిగినవి. శ్రోతల మెప్పును చూరగొనిన ప్రసంగములు "శ్రీమద్రామాయణ వైభవము" అను పేరుతో 1972లో ప్రథమ సంపుటిగ ప్రచురితములై, పండితులచే ప్రశంసింపబడుటయే గాక, ఆంధ్రప్రదేశ్ విశ్వ విద్యాలయములలో Ph.D.కి, Reference Workగా గృహీతమైనది. ఆ గ్రంథములలో యజ్ఞములపైనను, రామాయణములోని పలు చారిత్రిక ఘటనల పైనను, భారతీయ సంస్కృతిపైనను, తాత్పర్య నిర్ణయము విషయము పైనను వెలువరించిన యభిప్రాయములు, జగదాచార్యులు, బ్రహ్మవేత్తలు, త్రికాలజ్ఞులు, శ్రీకాంచి కామకోటి పీఠ భూత పూర్వాచార్యులునగు వ.వ. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి పరమానుగ్రహమునకున్ను, పాత్రము చేసినవి. శ్రీవారి యాదేశముపైన కాంచీపురములో అణ్ణంగరాచార్య మఠమున, ప్రతివాద భయంకర శ్రీమాన్ ఉభయ వేదాంత ప్రవర్తక, అణ్ణంగరాచార్యులవారి యాధ్యక్ష్యమున "రామాయణము"పై సంస్కృతములో ఉపన్యాసము లిచ్చుట జరిగినది. నా భాషణములు సభలోనున్న పండితశ్రోతృ మండలికి మిక్కిలి మోదమును గూర్చుటచే శివాస్థానములో శ్రీవారు పండిత అణ్ణంగరాచార్యులవారి యాధ్యక్షముననే, కాశ్మీరు శాల్వను ఉచిత పారి తోషికము నిప్పించి పరమానుగ్రహముచేసిరి. ఇతనిపై రామానుగ్రహము పరిపూర్ణముగ నున్నదని గూడ సెలవిచ్చిరి. తత్ఫలితముగ సంస్కృతములో (ఆ మధ్యలో శ్రీమద్రామాయణము; విశ్వశ్రేయము మొ॥ గ్రంథములు ప్రచురించినను) "శ్రీమద్రామయణ మీమాంస"యను సమాలోచనమును బృహత్తర గ్రంథమును వ్రాసి శ్రీవారికి 'హగరి'చాతుర్మాస్యములలో నంకితము గావించితిని. అది ముద్రణ అగుటకు చాలకాలముపట్టినది. చివఱకు 1987లో కేంద్ర ప్రభుత్వమువారి ఆర్థిక సహాయముతోను, ఉదారులగు వదాన్య శేఖరుల యార్థిక సహాయముతోడను దానిని ప్రచురింపగల్గితిని. కాని కొన్ని

చిక్కులవలన ఆ గ్రంథావిష్కరణము జరుగక, మిన్నక యుంటిని. తరువాత 1990లో ఏప్రియల్ రెండవతారీఖున శ్రీవారి యనుమతితో హైదరాబాద్, పబ్లిక్ గార్డెన్స్ జూబ్లీహాలులో నప్పటి యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ చెన్నారెడ్డిగారి యాధ్యక్షమున, శ్రీ పల్లపోతు వేంకటేశ్వరుగారి (ప్రొప్రైటర్, కాకతీయ సిమెంట్స్) గారి వదాన్యతతో జరిగిన సన్మాన సభలో డాక్టర్ శంకరదయాల్ శర్మ గారు (అప్పటి ఉపరాష్ట్రపతులు, ప్రస్తుత రాష్ట్రపతులు) గ్రంథము నావిష్కరించిరి.

ఇక గార్హస్థ్య జీవితములో కొన్ని చిక్కులకులోనై సుందరకాండ కాండ పారాయణమును కడు నిష్ఠతో చేసితిని ఆ పారాయణ సమయములో "సుందరకాండ", "మంత్రరాజ"మను విషయమును గూర్చియు, తన్నామ కరణాది నిమిత్తములను గూర్చియు పెక్కు సందియములు పొడమినవి. దానిని గూర్చి పరిశోధన మారంభించితిని. పెక్కురు రామాయణవేత్తలను సంప్రదించితిని. పెక్కురు పండితుల గ్రంథములను చదివితిని. కాని మనస్సునకు పరితోషము కల్గు సమాధానము లభించలేదు. తరువాత "రామాయణస్య వేదసమ్మితత్వ విచారః॥ అను పరిశోధన ప్రబంధమును నిర్మించుటకై వేదానుశీలనా ధ్యయనాదులు చేయవలసి వచ్చినది. ఆ కాలము లోనే, దేవీ భాగవత, సౌందర్య లహరులపై నల్లకుంట శంకర మఠములో ప్రసంగములు చేయుట తటస్థించినది. దానికై శ్రీ గౌడుపాదులవారి "సౌభాగ్యోదయము", ఇతర ఉపాసన గ్రంథముల యధ్యనము గూడ చేయుట తటస్థించినది - తదధ్యయన - ప్రసంగములు, నామనోగ్రంథి విశ్లేషమునకు చాల సాయపడినవి.

ఆ తరువాత హైదరాబాద్ విద్యానగర్‌లోని 'శివం స్టడీ సర్కిల్' వారు నన్ను 'సుందరకాండలోని సౌందర్యము" అను విషయమును గూర్చి ప్రసంగములు చేయుట కాహ్వానించిరి. ఆ విషయమును వారెన్నుకొనుట, నన్నాహ్వానించుట దైవప్రేరణమే తప్ప వేఱొండుగాదు. ఆ ప్రసంగములు శ్రోతల మెచ్చుకోలునకు నోచుకొనుటతో బాటు ఒకవిశిష్ట స్ఫూర్తిని కల్గింప,

వారు 'సుందరకాండలోని సౌందర్యము' అను విషయము పైనొక సమగ్ర గ్రంథమును ప్రచురింపవలసినదిగ నభ్యర్థించిరి. తదనంతరము అదే విషయముపై ప్రసంగించుటకు "హనుమాన్ జయంతుత్సవ కమిటి, కాకినాడ" వారాహ్వానించిరి.

శివానుగ్రహమున. శివప్రేరణచే, శివంలో జర్గిన "సుందర కాండలోని సౌందర్యము" అను శీర్షికతో చేసిన ప్రసంగములను ఇతరత్రా చేసినవాటిని, అదే పేరుతో నొక గ్రంథమును రూపొందించితిని. ఆ విషయమును భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి యంతరంగ భక్తులగు శ్రీ మహేశ్వరి గార్కి తెలుప, వారు నన్ను పుట్టపర్తికి, తీసికొని వెళ్ళిరి. బాబావారు వెళ్ళిన దినముననే నాకు దర్శనమనుగ్రహించి, యా దినము సాయంకాలమున నాగ్రంథ విషయములను, వివరించుటకు 45 నిముషములు సమయమిచ్చిరి వారు నాగ్రంథములోని విషయములను సాకల్యముగ విని పూర్ణపరితోషమును వ్యక్తముచేయుచు నిట్లు పల్కిరి:

"సుందరకాండ స్వతస్సుందరము. నీ సౌందర్య వ్యాఖ్య యంతకంటె సుందరము." అని.

ఇట్లు పల్కుటయే గాక, నా వ్రేలికి స్వయముగ వజ్రాంగుళీయకమును తొడిగి, నన్నా గ్రంథమును తమకంకిత మొనరించుట కనుమతించి పరమానుగ్రహమును చూపిరి. నన్ను తమ వాత్సల్య స్రవంతిలో ముంచి యెత్తిరి.

పదంపడి, శ్రీబాబావారి పరమానుగ్రహ ప్రాప్తిప్రేరితుడనై, గ్రంథ ముద్రణమున కార్థిక సహాయము కొఱకు నాగ్రంథమును "శ్రీ తిరుపతి దేవస్థానము" వారికి సమర్పింప, వారు పదివేల రూప్యకములను మంజూరు చేసిరి. ఆర్థికముగ బక్కచిక్కినను, బాబావారి యనుగ్రహము నూతంతగ గొని, నెట్టులో పలుశ్రమలు పడి, ఏతన్ముద్రణము పూర్తిగావించి పాఠకుల పరితోషము కొఱకు లోకము ముందుంచుట జరిగినది.

ఏతన్ముద్రణమునకు సహాయపడిన శ్రీ తిరుపతి తిరుమల దేవస్థానము వారికిని, దీనికి సుందరమగు భూమికను సంతరించి యిచ్చిన ప్రొ॥ జి. వి. సుబ్రమణ్యం గారికిని నా హార్దిక కృతజ్ఞతను వెల్లడించుకొనుచున్నాను

— మంగళం మహత్ —

# అంకితము

"ప్రశాంతి నిలయుడు జ్ఞాన సుధాబ్ధి శయనుడు,
దివ్య ప్రేమ వార్నిధి ప్రణత భక్తనందనుడు,

ఆనంద క్షీరసాగరుడు
ఆర్తజన సురక్షకుడునైన

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి
కరకమలముల యందు

తత్ప్రేరణావి నిర్మితమైన
"సుందరకాండలోని సౌందర్యము"

అను నా యీ కృతిని
భక్తి వినమ్రుడనై

ప్రమోదపూర్ణ స్వాంతముతో
సమర్పించుచున్నాను.

—రచయిత.—

## ఇష్ట దేవతా స్తుతిః

"వాగీశాద్యాస్సుమనస సర్వార్థానా ముపక్రమే।
యంనత్వా కృతకృత్యాస్స్యుస్తం నమామి గజాననమ్॥

"నౌమి రామప్రభుం వీరం సీతా లక్ష్మణ సేవితం।
దుష్టానాం దలనం దేవం సాధు సంరక్షణ వ్రతం॥

"సత్య రూపే పరేతత్త్వే రమమాణం పరం శివం।
భజేఽహ మాత్మారామం తం కాంతి సీతా సుశోభితం॥

"దత్తాత్రేయం మునిం సేవే త్రిమూర్త్యాత్మక మీశ్వరం।
ఆనందవార్నిధిం పూర్ణమవధూతం దిగమ్బరం॥

"లీలాలంఘిత వారాశిం భగ్నరక్షో మహాస్మయం।
కృతసీతాసమాశ్వాసం రామదూత మహంభజే॥

## గురుస్తుతిః

"వందేఽహం సచ్చిదానందం గురు మింద్ర సరస్వతిం।
అద్వైత బోధైకరతం పరతత్త్వాశ్రితం మునిం॥

"యోహ్యనంత పరగ్రామే కృతాఽనుగ్రహ విగ్రహః।
సర్వవేదాంత శుద్ధాంత సిద్ధాన్తైక ప్రబోధకః॥

"రామచంద్రస్య హనుమానివ యస్య మహాగురోః।
స్వయంగ్రహ పరిష్వంగ భాగ్యం ప్రాప్తస్సు దుర్లభమ్॥

"వందేహం పరయా భక్త్యా చంద్రశేఖర సద్గురుం।
ఇంద్రం సరస్వతీరూపం జామకోటిమధిశ్రితం॥

"ఉభయాయిత పరశివమూర్తిం చంద్రశేఖర యతీన్ద్ర శ్రీమూర్తిం।
కమనీయతప శ్శ్రీమూర్తిం వందే కాంచీపుర్యధిశ్రితం జ్ఞానమూర్తిం॥

"సందర్శనాద్యస్య భవత్యదృశ్యం దృశ్యంజగద్యన్మహ దింద్రజాలం।
విమర్శరూపం కమపి ప్రకాశం పరాత్పరంతం గురురూపమీడే॥

"వందే గురూన్విద్వదగ్రగణ్యాన్మయి బద్ధభావాన్।
యత్కృపాలవలేశేన ప్రాప్తస్సాక్షరగణ్యతామ్॥

## మాతా పితృ వందనాః

"వందేఽస్మత్పితరం నిరస్తర తపశ్శ్రీతత్పరం సంస్పృతా,
వస్పృష్టం నలినీదలేజలమివ బ్రహ్మణ్య మూర్తిం సదా।
గాయత్రీ జపతత్పరం హరిహరా ద్వైతాను భావోత్తరం
లక్ష్మీకాంత బుధం మమాదిమగురుం మల్లాది వంశోద్భవం॥

"వందేఽహం పరయాభక్త్యా మాతరం మయివత్సలాం।
అన్నపూర్ణాభిధాం నిత్యం పతిశుశ్రూషణే రతాం॥

## ఆద్యకవి స్తుతిః

"నమామి నిత్యం ప్రాచీనా న్వసిష్ఠాదీన్మహామునీన్।
యే మహాకవయశ్శశ్వద్దైవీవాంచముపాసత॥

"తపోరాశిమహం వందే వాల్మీకిం భార్గవంమునిం।
రచయామాసయః కావ్య మాద్యం రామాయణం మహత్॥

## ప్రకృత కృతి ప్రరోచనాః

"వసిష్ఠాద్యైస్సుధీభిర్యః కవిభిస్సముపాసితః।
సౌందర్యోపాసనా మార్గః శ్రేయః ప్రేయో విధాయకః॥

"సఏవ మార్గః కావ్యస్య రససౌందర్య నిర్భరః।
సుందరాఖ్యే కావ్యఖండే సౌందర్య శ్రీసముజ్జ్వలే॥

"ప్రాచేతసేన కవినా ఋషి మార్గాను గామినా।
వివిచ్య దర్శితస్సమ్య క్సౌందర్యోపాసనా పథః॥

"తన్నిరూపణలోభేన స్వవగాహ్యపునః పునః।
సుందరేకవితాపూరే రససౌందర్య సంభృతే॥

"మయా విరచితావ్యాఖ్యా సౌందర్యశ్రీ సముజ్జ్వలా
నవ్యాతనోతు సుధియాం మోదం తత్త్వావ బోధజం॥

# శ్రీ సత్యసాయి మహాప్రభు స్తుతిః

"ఓం తత్సదితి నిర్దిష్టం జ్యోతిః పరముపాస్మహే।
అవతీర్ణం పుట్టపర్త్యాం సత్యానందోజ్జ్వలం మహత్॥

"ప్రశాంతం సచ్చిదానందం ప్రేమరూపం మహోజ్జ్వలం।
స్తుమః ప్రాంజలయో నిత్యం సత్యసాయి మహాప్రభుం॥

"అవతీర్ణం పుట్టపర్త్యాం లోకానుగ్రహ హేతునా।
సత్యసాయి స్వరూపేణ దత్తరూపం మహాప్రభుం॥

"నీలనీరదసంకాశం స్ఫురదంత స్తడిత్తనుం।
భక్తకల్పద్రుమందేవం సత్యసుందరమీయహే॥

"లోకోద్ధిధీర్షయా స్వామీ పుట్టపర్త్యాం విరాజతే।
శివసుందరయామూర్త్యా సత్యాత్మా శ్రితయాముదా॥

"సత్యం శివం సుందరమితి, వేదేష్వప్రథితంచిరాత్।
తదేవ తత్త్వం శ్రీసత్యసాయి రూపేణ రాజతే॥

"సాధుజన సమాశ్రయం ప్రణత దుఃఖ నాశనమ్।
సత్యరూప సముజ్జ్వలం నౌమినిత్య సుందరం॥

"ప్రణతలోక నన్దనం త్రివిధతాప చందనం।
సకలదుఃఖ భంజనం నమామి సత్యసుందరం॥

"విబుధజన సమాశ్రయం సుబుధలోకరంజనం।
అబుధతమోహారిణం నౌమితత్త్వ సుబోధనం॥

"లోకోద్ధిధీర్షయా స్వామీ మానుషంరూప మాశ్రితః।
ఆత్మారామ స్సత్యసాయీ సర్వలోకేశ్వరశ్శివః॥

"సత్యరూపం స్వాత్మతత్త్వం లోకాన్గ్రాహయతి ప్రభుః
ప్రేమ్ణాచతత్త్వబోధైశ్చ సేవాసంఘైర్నిరంతరం॥

"సర్వదేవాత్మకస్సాయీ సర్వలోక ప్రభుశ్శివః।
కర్మభిర్లోక కల్యాణై ర్ధత్తే ప్రేమ్ణాఽఖిలం జగత్॥

"సౌందర్యసముపాసేన శివప్రాప్తిస్సు నిశ్చితా।
శివస్యానుగ్రహేణైవ కోపి తత్పదమాప్నుయాత్॥

"తతః పరమపావిత్ర్యే సత్యసాయి మహాప్రభుం।
సత్యరూపం శివం సాక్షాత్సుందరం సముపాస్మహే॥

"ఆత్మారామం ప్రణత పాలం కర్మయోగిన మీశ్వరం।
ప్రేమరూపం భక్తివశ్యం కారుణ్యాబ్ధి ముపాస్మహే॥

## ప్రకృత గ్రంథ ప్రరోచనా

"సుందరంకాండ మాశ్రిత్య మయా యత్ప్రవచనం కృతం।
శివస్థానే హైద్రాబాదనగరే విద్వదన్తికే॥

"ప్రపంచితశ్చర్ష్యపక్ష సౌందర్యోపాసనాపథః।
నిర్దిష్టః ఫలభేదశ్చ దృష్ట్యోశ్శివ కామ భావయోః॥

"యచ్ఛ్రుత్వా సుందర స్యేమాం వ్యాఖ్యాం మత్తస్స్వయం ప్రభుః॥
ప్రశాంతి నిలయే ప్రేష్ఠాః ధారయద్ధీరకోర్మికాం॥

"తదేవ భక్తైరణయా స్వామినశ్చాను కంపయా।
"సుందరే సౌందర్య"మితి నామ్నా విరచితా కృతిః॥

"కరోత్వియం కృతిర్మోదం సత్యసాయిమహాప్రభోః।
తనోతుమోదం భక్తానాం సౌందర్యాలోకజం మహత్॥

## కృతి సమర్పణ పద్యమాలికా

"సుందరస్య శివస్యాథ సత్యసాయి మహాప్రభోః।
గోపాలకృష్ణనామాహం కరాంభోజయుగే ముదా॥

"భక్త్యా సమర్పయా మీమాం కృతిం ప్రాజ్ఞముదావహాం।
సౌందర్య సాగరోద్భూతిం సౌందర్య శ్రీసముజ్జ్వలాం॥

"తనోతు సుధియాం మోదం కరోతు ప్రభవేముదం।
దధాతు హర్షం భక్తానాం కృతి సౌందర్య భాసురా॥

# కృతి సమర్పణము (ఆంధ్రి)

దీప్తరశ్మితసుతు దివ్యప్రభావుండు।
ధ్యేయుడఖిల భక్తగేయుడైన,
సత్యసాయివిభుని సర్వాతిశాయిని।
ఆత్మదలంతు తన్మహాత్మ్యమరసి॥

"ఏదివ్య పూరుష శ్రీ దివ్యచిత్తంబు,
సకలార్తిజన సుధాస్వాదుజలధి;
ఏ మహామహిమాత్మ శ్రీమదూర్జితదృష్టి,
జగతి తాపంబార్చు చందనంబు;
ఏ సిద్ధసంకల్ప భాసితాంతరభావ,
నిచయంబు సమకూర్చు నిఖిల సిరుల;
ఏ బ్రహ్మభావుని యింపైన బోధల
నిగమాగమ విధాన నిధులెసంగు

నట్టి మహిమాన్వితుండు మహాత్ముడఖిల
భక్తసులభుండు శ్రీ భగవంతుడైన,
సత్యసాయీశ్వరుడు కృతీశ్వరుడుగాగ,
పాదుకొల్పితి నాయెద భక్తిమీర
ప్రాజ్ఞతంగన్న సుందర ప్రాభవమును.

"సుందరకాండ రాఘవుల భారత దెల్పెడినట్టి నిక్కమో,
సుందరకాండ శ్రీహనుమ భారత ధీరత దెల్పినట్టిదో
సుందరకాండ నాహృదయ సుందరనందన మందెసంగు వా
గ్బృందురకాండ ఆదికవి వాక్కు-కు సుందరవాఖ్య యిద్దిగా॥

"సుందరకాండమందుగల సొంపగముల్ గమనించు సాధువాక్,
స్పందనమాదరించి తగ వజ్రపుటుంగరమిచ్చి మెచ్చు సా
యిం, దరిజేసు పండితుల కెంతయు నాశ్రయుడయినవాని నా
నందముతో కృతీశుని గనన్ ఫలియించె మదీయ భాగ్యముల్॥

"దయవల్ల నీకృతిని నెమ్మి రచించిన నాకు సుర్భిన
స్మాదృశులైన భక్తుం కమంగళ హానియు భద్రవస్తు సం
పాపముల్ చెలంగుత: కృపాతంత్ర పరతంత్ర మహాంతరంగ సా
యీ! దురితాంత సత్కశిప క్లిప్తకృతాంత నితాంత సుందరా॥

## మంగళాశాసనమ్

"వేదవేదాన్త వేద్యాయ. మేఘశ్యామల మూర్తయే।
పుంసాం మోహన రూపాయ పుణ్యశ్లోకాయ మంగలమ్॥

"హనుపుత్రసమేతాయ హరీశాభీష్టదాయినే।
వాలి ప్రమథనాయాస్తు మహాధీరాయ మంగలం॥

"శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘిత సింధవే।
హతరావణ వీరాయ రణధీరాయా మంగలం॥

"ఆసాద్య నగరీం దివ్యాం అభిషిక్తాయ సీతయా।
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగలం॥

"మంగళం సాయినాథాయా మహనీయగుణాత్మనే।
నతరాజాధిరాజాయ పుణ్యశ్లోకాయ మంగలం॥

— ఇతి మంగలా శాసనమ్ —

— ఓం తత్సత్ —

## విషయసూచిక

పుటలు


| | | |
|---|---|---|
| 1. | "సుందరకాండ" మను, నామకరణములోని ఔచిత్యము | 1-10 |
| 2. | సౌందర్య చర్వణము : వివిధ స్థితులు | 10-26 |
| 3. | సుందరకాండము : విషయ ప్రవేశము | 27-38 |
| 4. | సుందరకాండ కథావస్తు సంగ్రహము | 38-46 |
| 5. | సుందరకాండలోని పాత్రల పరిచయము | 46-49 |
| 6. | హనుమంతుని లంకా యాత్ర : తద్విశేషములు | 50-60 |
| 7. | లంకానగర వాస్తుకళా సౌందర్యము | 61-79 |
| 8. | అశోకవన వాటిక | 79-86 |
| 9. | చంద్రోదాయ వర్ణనము | 87-93 |
| 10. | ఆధ్యాత్మ సౌందర్యము | 94-112 |
| 11. | హనూమచ్చారిత్రము | 112-119 |
| 12. | హనూమద్దౌత్యము | 119-170 |
| 13. | హనుమంతుని బలపరాక్రమములు | 170-182 |
| 14. | రావణుని కొలువులో హనమంతుడు | 183-189 |
| 15. | లంకాదహనము | 189-191 |
| 16. | హనుమంతుని తిరుగు ప్రయాణము | 192-194 |
| 17. | హనుమంతుని శివస్వరూపము | 195-211 |
| 18. | రావణ దర్శనము | 211-226 |
| 19. | అశోక వనములో సీతాదేవి | 226 267 |
| 20. | సీతాదేవి నిర్వేదము : త్రిజటా సమాశ్వాసము | 267-273 |
| 21. | శ్రీరామునిలోని ఉత్తమ గుణములు | 273-275 |
| 22. | శ్రీరామ విరహ చిత్రణము | 275-279 |
| 23. | సీతారాముల ద్వివిధ ప్రకృతి | 280-286 |
| 24. | త్రిజటా స్వప్న ప్రతీకాత్మకత | 287-293 |
| 25. | శ్రీరాముని పురుషోత్తమత్వము | 293-296 |
| 26. | వైదిక ఋష్యపజ్ఞ సౌందర్యము | 296-306 |
| 27. | సత్యం - శివం - సుందరం | 307-310 |

# 'సుందరకాండ' మను నామకరణములోని ఔచిత్యము

ఆద్యకవి వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యమునందు సుందర కాండ ఐదవ కాండము. సుందరకాండను మినహాయించి, మిగిలిన కాండ లన్నిటికి, ఆయా కాండలలో వర్ణించబడు ఇతివృత్తమును బట్టి రామాయణకవి ఆయా పేర్లు పెట్టెను. ఉదాహరణమునకు, "బాలకాండ" యను పేరు, రామా యణమహాకావ్య నాయకుడగు శ్రీరాముని యొక్క ప్రథమ దశా (బాల్యముతో) సంబద్ధమైన కథ యాధారముగ పెట్టబడినది. అట్లే ద్వితీయ కాండమునకు, 'అయోధ్యా కాండ'మను పేరు, శ్రీరాముడు అయోధ్యా నగర పరిసర ప్రదేశములలో నివసించుచున్నపుడు జరిగిన ఘటనా పరంపర నాధారముగ చేసికొని పెట్టబడనది. అట్లే 'అరణ్యా కాండము' అనుపేరు శ్రీరాముని దండ కారణ్యావాసమునకు సంబంధించిన ఘటనల యాధారముగ పెట్టబడినది. కిష్కింధా రాజ్య ఘటనల యాధారముగ 'కిష్కింధాకాండ' మను పేరు, రామ-రావణ యుద్ధమునకు సంబంధించిన వర్ణన యాధారముగ "యుద్ధకాండ" మనుపేరును వాల్మీకి యిడెనని విదితమగుచున్నది. కాని "సుందరకాండ" మనుపేరు సీతా-రాముల యితివృత్తమున కితరకాండములవలె ముడివడక స్వతంత్రముగ నున్నది. ఇతివృత్తమునకు సంబంధించిన నామకరణము చేయవలయుననుకొనిన, శ్రీమద్రామాయణ మహాకవి, యీ కాండము నకు "హనూమత్సందేశ కాండ"మని పేరు పెట్టియుండెడివాడు. కాని యట్లు నామకరణము చేయక యీ యైదవ కాండ యొక్కదానికే "సుందర కాండ" మని పేరిడుటలో, ఏదియో యొక, నిగూఢమైన భావము రామాయణ కవికి ఉండవచ్చునని ప్రతియొక్కరును ఊహింపవచ్చును. ఈ సుందరకాండము లోని ప్రధానమగు ఇతివృత్తము, ప్రస్రవణగిరిస్థితుడగు శ్రీరాముని సందే శమును గొని, హనుమంతుడు లంకా నగరమునకు పోయి, "రావణు"డను రాక్షసప్రభువుచే, లంకా నగరమందలి, యశోక వనమున, నుంచబడిన

శ్రీరాముని యిల్లాలగు సీతకు శ్రీరామ సందేశమును విన్పించి, తిర్గి "సీత" రామునికిచ్చిన ప్రతిసందేశమును శ్రీరామునికి విన్పించుట. పరస్పర వియుక్తులగు నాయికా నాయకుల, క్షేమవార్తను వారికి దూతద్వారా అందజేసి, వియోగ వ్యధితులగు నాయికా-నాయకుల, వియోగ దుఃఖమును తగ్గించి, వారి ప్రాణములను కాపాడుటయే, యీ సందేశ కావ్యముల యొక్క ముఖ్య ప్రయోజనమని చెప్పవచ్చును. కనుకనే ఆద్యకవి తరువాత పెక్కురు మహాకవులు సంస్కృత భాషలో, మేఘ సందేశ, హంస సందేశ, భ్రమర సందేశ, పవన దూతాది, సందేశ కావ్యములను సుందరకాండ నాధారముగ గొని, రచించిరి.

ఇది యిట్లుండ, శ్రీశంకర భగవత్పాదులవారు, దేవీసౌందర్య వర్ణనపరమగు, నొక తాంత్రికమగు, ఉపాసనాకావ్యమును రచించి, దానికి "సౌందర్య లహరి" యని నామకరణము చేసిరి. పెక్కురు విమర్శకులు, శ్రీశంకరులు తమ దేవీస్తుతిరూపమగు కావ్యమునకు "సౌందర్య లహరి" యను నామకరణము చేయుటకు ప్రేరణ వాల్మీకీయ రామాయణములోని "సుందరకాండ" వలననే పొందియుందురని యూహించుచున్నారు. ఈ సౌందర్య లహరి, దేవీ తత్త్వ ప్రతిపాదన పరము. దేవీ సౌందర్య వర్ణన పరమునునైన ఉపాసనా కావ్యము. కాని, నాయికా - నాయకుల సందేశ-ప్రతిసందేశములకు సంబంధించిన కావ్యఖండము మాత్రము కాదు. అస్తు, భారతదేశమున నెల్లయెడలను "సర్వకార్య సిద్ధికై" సుందరకాండ పారాయణము నేటికిగూడ చేయబడుచుండుట, శిష్టాచార సిద్ధముగ గానవచ్చుచున్నది. ఈ విషయము లన్నిటిని దృష్టిలో నిడుకొని, సుందరకాండ కావ్యార్థమును, అనుశీలనము చేసిన యెడల, ఆద్యకవి, యీ కవితాఖండమునకు లేక కాండమునకు "సుందరకాండము" అని పేరిడుటలోగల, ఉద్దేశ్యమునకు చేరువగ వెళ్లగల్గుదుమేమో యని చెప్పవచ్చును.

సుందరకాండ చింతన తత్పరులగు సమాలోచకులు పై విషయమును గూర్చి వెలిబుచ్చిన యభిప్రాయములలో, ముఖ్యమైన కొన్ని యభిప్రాయముల నిట సంగ్రహించుచున్నాను :—

1. "నష్టద్రవ్యస్యలాభోహి సుందరః పరికీర్తితః ॥" అను, ఆభి యుక్తోక్తి ననుసరించి, శ్రీరాముడు. సీతతోగూడ పంచవటిలో నివసించు కాలమున రావణుడు సీతను అపహరించి, తీసికొనిపోగా, హనూమంతుడను దూతద్వారా శ్రీరాము డామె (అపహృతయగు) వార్తను పొందుటచే, దీనికి 'సుందరకాండము' అను పేరు పెట్టబడినది, అని కొందరనిరి.

2. మఱికొందరు 'సుందర' శబ్దము "వానర" వాచకముగ గూడ నుండుట వలన, సుందరుడగు మారుతి, సీతా ప్రాప్తికై ప్రదర్శించిన, ఉత్సాహ, ధృతి, దూరదృష్టి, చాతుర్య, దాక్ష్య, వీర్యాదులను; అతని మహి మను, కార్యసాఫల్యమును గూడ వర్ణించుటవలన, ఈ కాండమున కీపేరు వచ్చినదని నుడువుచున్నారు.

3. దుఃఖనివారణపూర్వకముగ సుఖప్రాప్తిని కల్గించుటయే "సుందర" శబ్ద లక్ష్యము. కాన, పరస్పర వియోగ దుఃఖితులగు సీతారాము లకు, పరస్పర క్షేమవార్తా, సందేశాదుల నందించుటద్వారా, వారి దుఃఖమును, పోగొట్టి, వారికి సుఖమును కలుగచేయుట; సుగ్రీవుని కఠోర దండమును (మృత్యుదండము) గూర్చి దుఃఖించు వానరులకు, సీతను కనుగొనుటద్వారా, దుఃఖనివారణ మొనర్చి, సంతోషమును కలుగచేయుటను బట్టియు, నీకాండ మునకీ పేరిడెనని కొందరి యభిప్రాయము.

4. నాయికా - నాయకుల సౌందర్యముతో బాటుగ, వారి ప్రగాఢ ప్రేమానురాగములు, ప్రతినాయకుడగు రావణుని నగర సౌందర్యముతో బాటుగ నతనిఐశ్వర్యాది వర్ణనమిందు విశదముగ చేయబడుటయే, ఈ పేరిడుటకు కారణమని, మఱికొందరూహించిరి.

5. నాయికా-నాయకుల శారీర, శీల - చారిత్రములు, ధర్మానురక్తి మొదలగువాని యలౌకిక సౌందర్య నిరూపణము చేయుటద్వారా, వాటిమంగళ మయత్వమును; ప్రతినాయకుని అర్థ - కామమయమగు జీవితముయొక్క కుత్సిత రూపమును, లోకము ముందుంచి, ధర్మ సంయతములగు అర్థ-కామముల సేవన రూపమైన వైదికజీవన పద్ధతిలోని "సౌందర్యము" ఇందు ప్రతిపాదితమగుట వలన దీనికీపేరు పెట్టబడినది.

6. "మెహతా" అను ఒక విమర్శకుడు, సుందరకాండలో వర్ణితము లగు ఘటనలన్నియును "సుందర ద్వీపముల" యందు (అనగా, జావా, సుమత్రా మొదలగు సముద్ర ద్వీపముల) జరిగినందువలన, దీనికి నామకరణము చేయబడినదని వ్రాసియున్నాడు.

ఇక రెండవ తెగవారు ఉపాసనా సంప్రదాయమునకు చెందిన వారు. శ్రీమద్రామాయణమును గూడ వేద సంహితలతో తుల్యముగ భావించి, తత్పారాయణము, ఐహికాముష్మిక శ్రేయః ప్రాప్తికి తోడ్పడునను విశ్వాసముతో శ్రీమద్రామాయణ పారాయణాదులు గావించు ఉపాసనా సంప్రదాయ వేత్తలుగూడ, 'సుందరకాండ" మను నామకరణమును గూర్చి పలు విధములగు ఊహలు చేసియున్నారు. వానిలో గూడ, ముఖ్యమైనవి కొన్ని యిట సంగ్రహింపబడుచున్నవి.

1. సర్వోత్తమమగు 'రామతారక' మహామంత్ర తత్త్వార్థమిందు సుందరముగ వ్యాఖ్యానించబడినందువలన, దీనికి పేరు పెట్టబడియున్నది.

2. 'అసురగుణముల"పై, 'దివ్యగుణ సంపద' యొక్క విజయమును ప్రదర్శించుటతోబాటుగ, దివ్యగుణ సంపదయొక్క సౌందర్యము, అనగా ఉత్కర్ష మిందు చూపబడుటయే, ఈ పేరిడుటకు కారణము.

3. పరదేవతా రూపమగు "సీత" యొక్క సాక్షాత్కార రూపమైన సాధనలో సంభవించిన, యోగవిఘ్నములను, పోకార్చి, హనూమంతుడను యోగి, సుషుమ్నా మార్గమున పయనించి, అశోకవనమున సీతాదేవతా సాక్షాత్కార రూపమైన సిద్ధిని పొందుట యిందు ప్రతిపాదితము. అనగా "సుందరీ సాక్షాత్కార" వర్ణన పరమగుటచే దీనికి "సుందరకాండమని పేరు వచ్చినది.

4. భగవద్వియుక్తమైన, భగవత్పరా ప్రకృతియగు జీవచేతనయే సీత". భగవద్వియోగముచే తపించు "సీతా" రూపమైన జీవునకు, తత్త్వ" సాక్షాత్కారమునొందిన "హనూమంతు"డను గురువు "రామ తత్త్వోపదేశము" చేసి, "రామరక్షణము" తప్పక లభించునను అభయమునిచ్చుటచే, జీవుడు శాశ్వతముగ దుఃఖవిముక్తిని పొందుటతోబాటుగ, శాంతిని పొందుట యను

పరమపురుషార్థ మిందు సుందరముగి వ్యంజిత మైనందువలన దీనికి పేరిడి యుండవచ్చును, అని వేదాంత దేశికులు నుడివిరి.

5. జీవుడు, జ్ఞానావరోధ రూపములగు, అసుర గుణములను నిర్జించి హనూమంతుని వంటి తత్త్వవేత్త బోధవలన, ఆత్మారామప్రాప్తిని పొందుట ద్వారా శాంతిని యనుభవించుట యను చరమ పురుషార్థమిందు వర్ణితము. అనగా శాంతిరూపమైన అమృతశ్రీ (సాహిశ్రీ రమృతాసతామ్) ఇందు వర్ణితము, కావున దీనికి "సుందరకాండము" అను నామకరణము గావించబడి యుండవచ్చునని కొందరూహించిరి.

ఇట్లే రామాయణార్థ సముపాసకులగు మహాత్ములు మఱికొన్ని విధములుగా ఈ నామకరణ సంగతిని గూర్చి యూహలు చేసియుండవచ్చును. పైన చెప్పిన వివిధ అభిప్రాయములలో ఒకటి-రెండు మినహాయించి మిగిలిన వన్నియును, విడి-విడిగా కాకున్నను, సముచ్చితముగ వాల్మీకి తాత్పర్యావగమమునకు చాలవఱకు సహాయపడును. కాని "మెహతా"గారు చెప్పిన వివరణము మాత్రమందులకు సహాయకము కాకపోగా, పెడత్రోవబట్టించుటకు [రామాయణ పఠితలను] హేతువగుచుండుటచే, ఆ విషయమును గూర్చి, దివాన్‌బహాదుర్, శ్రీ కె. ఎస్. రామస్వామి శాస్త్రిగారు చేసిన మెహతామత ఖండనమును ఈక్రింద ఇచ్చుచున్నాను.

1. మెహతాగారు, సుందరకాండలోని ఘటనలు "సుందరద్వీపము" లలో జరిగినట్లుగ నిరూపించుటకు తగిన ఆధారములను, చూపలేకపోయిరి.

2. జావా, సుమత్రా, మొదలగు ద్వీపములకు "సుందర ద్వీపము" లను పేరున్నట్లు, ఎట్టి యాధారములు కానరావు.

3. ఇంతవఱకు నెవ్వరిచేతను, సుందరకాండలో వర్ణితములగు ఘటనలకు - జావా, సుమత్రా మొదలగు ద్వీపములకు, గల సంబంధముగూడ నిరూపించబడలేదు. అందువలన శ్రీ మెహతాగారి వాదము ఉపేక్షణీయము.

పై కారణములన్నిటిని సమీక్షచేయగ, వాల్మీకి "సుందరకాండ"మని, రామాయణములో గల ఐదవ కాండకు పేరిడుటలోగల యుపపత్తిని నేనీ క్రింది విధముగ నూహించుచున్నాను.

కవితాదృష్టితో రామాయణమహాకావ్యములోని ఇతర కాండలుగూడ మిక్కిలి హృద్యములుగ నున్నను, ఈయైదవ కాండము, ఇతర కాండముల కంటె, విలక్షణమగు నొక విశేష సౌందర్యమును సంతరించుకొనియుండుటచే ఈ కాండమునకు "సుందరకాండము" అను నామకరణము చేయబడినదన్న నిస్సంశయముగ చెప్పవచ్చును. ఆ సౌందర్య మేదియను విషయముననే మనకు కల్గివిచికిత్స.

ఈ కాండమునందు, ప్రత్యక్ష, పరోక్ష, ఆధ్యాత్మిక రూపమగు, అనగా క్రమముగ భౌతిక, దివ్య, ఆధ్యాత్మ రూపమగు త్రివిధ సౌందర్యములయొక్క పరాకాష్ఠ ప్రదర్శితమగుటచే దీనికి "సుందరకాండ"మని వాల్మీకి పేరిడియుండ వచ్చును. ఈ కాండలో వర్ణితమగు జడ-చేతన రూపమగు ద్వివిధ జగత్తు, పైన పేర్కొనబడిన సౌందర్య గ్రహణమునకు సాధనభూతము గనే గ్రహించ బడినది. ఇందు గ్రహించబడిన సకల వస్తుజాత రూపమగు సామగ్రి. దీని ద్వారా యభివ్యంజితమగు, పర వస్తు సౌందర్యోపలక్షకమే గాని, స్వస్వరూప గ్రహణమునకు, బయుండదని ఖచ్చితముగ చెప్పవచ్చును.

కనుకనే వేదవేత్తలగు ఋషులు, ఆర్షవాఙ్మయ పరిశీలనము, మూడు దృష్టులతో లేక మూడు విధములుగ చేయవలెనని చెప్పియున్నారు. ఆమూడు దృష్టులు : 1. లోకదృష్టి లేక స్థూలదృష్టి (భౌతిక దృష్టి). 2. శివ దృష్టి లేక దేవదృష్టి [ఆధిదైవిక దృష్టి] 3. సత్యదృష్టి లేక తాత్త్విక దృష్టి [ఆధ్యాత్మిక దృష్టి]. ఈ మూడు దృష్టులు ఆర్షదృష్టికి లేక తత్త్వ గ్రహణమునకు సహాయపడును వారు (ఋషులు) భౌతిక విషయమును గూర్చి ప్రతిపాదించునపుడు గూడ, దానియందే అనగా భౌతిక వస్తువర్ణనము నందే. వారి కథనము, పర్యవసితమని యనుకొనరాదు. ఆ వస్తువు జడ మైనచో, ఆ వస్తువుయొక్క దర్శనము లేక సంబంధమువలన చేతనప్రాణిపై ఏర్పడు ప్రభావము, దానివలన వారి ప్రవృత్తిలోగల్గు వివిధ పరిణామములు, లేక వారి జీవితములో దాని యుపయోగము మొదలగు ఎన్నియో విషయము లను దృష్టిలో నుంచుకొని వారావర్ణనము చేయుదురు. ఇక యది చేతనప్రాణి యైనచో, వివిధ చేతనగతమగు స్వభావ వైవిధ్య, ప్రవృత్తి వైవిధ్య, భావనా

వైవిధ్యములతోబాటుగ: చేతనత్వ రూపధర్మమునుబట్టి తత్తచ్చేతనగతమగు మౌలికమగు దివ్యత్వమును గూడ వ్యంజిత మొనర్తురు. ఇదియే యాధిదైవిక లేక దివ్యదృష్టి. ఇక యనంతమగు జడ-చేతనాత్మకమగు విశ్వసృష్టికి అధిష్ఠానభూతమై, అణువు మొదలుకొని బ్రహ్మవఱకును (ఆ స్తంబ బ్రహ్మ పర్యంతము), గోచరమగు, సమత త్త్వము లేక ఆత్మతత్త్వ దర్శనము. చేయుటయే యాధ్యాత్మికదృష్టి. ఈ దృష్టిత్రయమును మఱియొక విధముగగూడ ప్రకృత వస్తుగ్రహణమునకు అనుకూలముగ ప్రతిపాదించవచ్చును.

1. సౌందర్యదృష్టి (స్థూలదృష్టి లేక భౌతిక దృష్టి) 2. శివదృష్టి (ఆదిదైవిక దృష్టి) 3. ఆధ్యాత్మిక దృష్టి లేక తత్త్వదృష్టి (సత్యదృష్టి). ఈ మూడు దృష్టుల సమాహారమే సత్యం, శివం, సుందరమ్ అను సూత్రము.

త్రివిధ రూపమున గోచరించు తత్త్వ గ్రహణమునకు, పైన చెప్పిన త్రివిధ దృష్టులు అపేక్షితములు. కనుకనే నిరుక్తకారుడగు యాస్కమహర్షి ఋక్కులు [మంత్రములు] త్రివిధములుగ నున్నవని పేర్కొనినాడు

1. పరోక్ష కృతములు.
2. ప్రత్యక్ష కృతములు.
3. ఆధ్యాత్మికములు,* అని.

వీనిలో 'పరోక్షకృతము'లకు మంత్రములను అధిదైవికములని పేర్కొనవచ్చును. ఏలయన "పరోక్ష ప్రియాఇవహిదేవాః॥" అను నార్ష వచనమును బట్టి.

మఱి "ప్రత్యక్ష కృతముల"ను పదమునకు దృశ్యమానమగు లోకమును గూర్చి చెప్పునవి, అని చెప్పవచ్చును.

ఇక మూడవ విధమునకు చెందినవి, దృశ్యమాన జగమున కాధారభూతమై, అఖండమై, అద్వయమై, సచ్చిదానంద ఘనమైయొప్పు యాత్మకు

* "తాస్త్రివిధాఋచః॥ పరోక్షకృతాః, ప్రత్యక్షకృతా, ఆధ్యాత్మిక్యశ్చ"
[నిరుక్తమ్ - దేవతా కాండమ్, 67]

సంబంధించిన దృష్టి. ఇదియే సర్వత్ర సమదర్శనము.

ఇక కావ్యమునందు వాచ్యార్థము స్థూలదృష్టితో గృహీతమగునదియే. పరోక్షకృతమగు అర్థము, ప్రకృతార్థము ద్వారా వ్యంజితమగు పరోక్ష రూపమైన అర్థాంతరము.

ఇక యాధ్యాత్మికమగు అర్థము : శబ్దార్థమయమగు కావ్యప్రపంచము నకు మూలభూతమును, అవ్యక్తమును, శబ్దార్థములు రెంటికిని మూలభూత మగు "పరావాక్" యొక్క తత్త్వ గ్రహణపరము.

కావ్యదృష్టిని బట్టి గూడ వాచ్యమగు అర్థముకంటే, వ్యంగ్యార్థము సుందరము, చామత్కార జనకము, ఆనందప్రదము ఐయున్నది. కేవలము స్థూలదృష్టితో వస్తుగతమగు సౌందర్యమును దర్శించినపు డది దుఃఖమూలము లగు రాగద్వేషముల నుండి మానవుని హృదయమును విముక్తమొనర్చి దివ్యా నందము నొసగజాలదు. ఆధిదైవికదృష్టి, స్థూల భౌతికజగత్తు నుండి మానవుని చిత్తమును పైకిలేవనెత్తి, సూక్ష్మ సౌందర్య దర్శనజనితమగు దివ్యానందము నొసగినను. భేదదృష్టి యుండుటచే శాశ్వతానందము నొసగజాలదు. ఆధ్యా త్మిక దృష్టి మాత్రమే వేద్యాంతర సంస్పర్శ రహితమగు శాశ్వత బ్రహ్మా నందము నొసగగల్గును. కనుక సుందరకాండలో కవి స్థూలవిశ్వమున గోచ రించు, ఇంద్రియ సమ్మోహనమగు సౌందర్యమును వర్ణించి, అంతకంటెను సూక్ష్మమును, ఆనందప్రదమును నగు "శివ" సౌందర్యమును [మంగళప్రద మైన] ప్రదర్శించి, "అశివత్యాగ", "శివ సముపాసనముల" ద్వారా శాశ్వత సత్య సాక్షాత్కారరూపమగు, లక్ష్యప్రాప్తికి తోడ్పడు ఆధ్యాత్మికసౌందర్య మును సుందరమగు కావ్యశైలిలోవర్ణించుటవలన దీనికి "సుందరకాండము" అను పేరు సర్వథాయన్వర్థమనిచెప్పవచ్చును.

ఆధ్యాత్మిక సాధనామార్గమున గూడ మానవుడు భౌతికమగు ఇంద్రి- య కర్షణము నుండి తన యాత్మను విముక్తమొనర్చుకొనుటకై క్షణికమైన జడసముపాసనమును వదలి దివ్య చైతన్యరూపమగు దేవతోపాసనము చేయును. అనగా "జడ చేతన" నుండి దివ్యచేతనలో ప్రవేశించును. కాని ఈ ప్రవేశము,

అధర్మత్యాగ, ధర్మాచరణముల ద్వారానే సాధ్యపడును.* అధర్మమును త్యజించుట, ధర్మమును పాలించుటయను సాధనద్వారా, "అశివ" వినాశక మూలక "శివ" ప్రాప్తియే, దేవతోపాసనము త్రికా "శివ" సముపాసనము ఉపాసకుడు అట్టి దివ్య చేతనలో ప్రవేశించిన పిదప, శివానుగ్రహమున, తన మనస్సులోని సర్వమాలిన్యములు తొలగగ, సర్వసృష్టియందు ఓత-ప్రోతమైన, తనయుపాస్యదేవతా దివ్య సౌందర్య దర్శనమును చేయును. కాని ఇక్కడ గూడ ఉపాస్యోపాసక భేదబుద్ధి, తనయుపాస్య దేవత, తదన్యదేవతా విషయకమగు భేదబుద్ధి పూర్తిగా తొలగనందున, శాశ్వతమును, నిరంతరమును, ఆస్వాద్య-ఆస్వాదక-ఆస్వాద రూప భేదరహితమును, స్వస్వరూప భూతమును సర్వానంద మూల భూతమును నగు బ్రహ్మానంద ప్రాప్తిని సాధకుడు పొందజాలడు. అట్టి బ్రహ్మానంద ప్రాప్తికి, అమృత సామ్రాజ్య లక్ష్మీప్రాప్తికి, ఆధ్యాత్మిక దృష్టియు శివానుగ్రహమున్నూ అపేక్షితములు. దీనిని బట్టి తేలినదేమన సత్య-శివ-సుందరముగ భాసించు, ఏక సత్య ప్రాప్తికి, సాధకుడు సుందరము నుండి శివమునకు-శివానుగ్రహమున శివము నుండి సత్యప్రాప్తికిని తోడ్పడు సుందర-శివ-సత్య స్వరూపముల సిద్ధేశమును ఈ సుందరకాండమున వాల్మీకి రమ్యముగ ప్రతిపాదించియున్నాడు.

భక్తుడు ఉపాసనమను కర్మద్వారా సర్వసృష్టి వ్యాప్తమైన తనయుపాస్య దేవతా సౌందర్య సాగరమున తాను నిమగ్నుడై యట్టి తన్మయీభావనము ద్వారా దివ్యానందము ననుభవించును. ఈ దివ్య సౌందర్యచర్వణమును భక్తుడు వివిధ సంస్కార జుష్టమగు మనస్సుతోను, బహిరున్ముఖములగు ఇంద్రియములతోడను లౌకిక సౌందర్య గ్రహణమువలె చేయక, నిర్మల భక్తిభావనాజుష్టమును, శుద్ధ ప్రేమ సంపృక్తమునునగు చిత్తముతో చేయును. శుకయోగీంద్రాదులు గూడ ఇట్టి దివ్యదృష్టితో భగవత్సౌందర్య దర్శనముగావించి, తన్మయులై, దివ్యానందము ననుభవించి, లోకముగూడ నట్టి దివ్యానందానుభూతి నొందుటకు, దివ్యసౌందర్యవర్ణమును చేసియున్నారు.

---

* "నాఽవిరతో దుశ్చరితాన్నాఽశాంతో నాఽసమాహితః।
నాఽశాంత మానసోవాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్"॥ కఠ ఉపనిషత్

అట్లే, ఇంతకంటెను నుత్తమమగు, ఆస్వాద-ఆస్వాద్య-ఆస్వాదక రూపమగు త్రివిధ భేదములను లయించిన, ఆధ్యాత్మికమగు బ్రహ్మానందానుభూతిని గూడ సాధకుడు పొందుటకు హేతుభూతమగు జ్ఞానమార్గముగూడ వారు నిరూపించియున్నారు. చేతననిష్ఠమగు ఈ దివ్యసౌందర్యము, "యస్యభాసా సర్వమిదం విభాతి" యను శ్రుతి ననుసరించి లోకములో దృశ్యమానమగు సర్వసౌందర్యము, ఏ పరమేశ్వరుని యనంత సౌందర్య సుధాంబుధికి చెందిన సౌందర్య కణికాతుల్యమో, యట్టి సౌందర్యలేశము నాశ్రయించి, దివ్యసౌందర్య సుధాసముద్రమునకు చేర్చి, తదాధారభూతమగు సత్యము, నిత్యము, అజరము, అమరము, అనంతమునగు ఆత్మానందాంబుధి దర్శనము చేయించుటయే వైదికఋషుల సాధనాక్రమము. ఈక్రమమును ప్రాయోగికముగ చూపుటకే వేదవేత్తయును, మహాతపస్వియును, సాక్షాత్కృత సత్యస్వరూపుడును, ఆద్యకవియునునగు భగవాన్ వాల్మీకి "సుందరకాండమును" రచించెనని యూహించుట, సత్యమునకు దగ్గఱయని నాయూహ.

## 2. సౌందర్యచర్చణము వివిధ స్థితులు

"సౌందర్యము" అననేమి ? అను విషయమును గూర్చి మేధావులు చాల చర్చించి యుండుటయేగాక, విశాలమగు వాఙ్మయమునే "సౌందర్యశాస్త్రము" అను పేరుతో ప్రకటించియున్నారు. కాని, సౌందర్యమును గూర్చి ఒక నిశ్చితాభిప్రాయమును సౌందర్య శాస్త్రవేత్తలు ప్రకటించలేకపోయినారని అందరకును తెలియును. ఇక్కడ వివాదాస్పదమగు విషయమేమి యన "సౌందర్యము" అనగా నేమి? 2. అది వస్తునిష్ఠమా, లేక ద్రష్టృనిష్ఠమా, లేక ఉభయ .తమా యని. ఈ విషయములను గూర్చిన ఏకాభిప్రాయ మింత వరకు కుదురలేదని చెప్పవచ్చును.

మొదటి సంశయము : సౌందర్యమన నేమి? యని. ఈ ప్రశ్నకు వెంటనే చెప్పు సమాధానము : సుందరమగు వస్తువు లేక దృశ్యము లేక చేతన ప్రాణియందు ప్రతివారును దర్శించు చిత్తాహ్లాదకరమగు గుణ విశేషము. ఆ తరువాత వచ్చు ప్రశ్న : అసలు "సుందరమని" ఒక వస్తువునుగాని

మఱిఒక ప్రాణినిగాని అనుటకు మూలసూత్ర మేది? ఈ సందేహమునకు మూలము: ప్రపంచములో సర్వత్ర ఈవస్తువు "సుందర"మనిగాని, ఈవస్తువు "అసుందర" మనిగాని వ్యవహారము కానరాదు. భారతదేశమున ఒక స్త్రీని గూర్చి వర్ణించునపుడు, ఆమె కేశపాశము తుమ్మెదల పిండువలెనో, నల్లని తాచువలెనో ఉన్నదని కేశపాశము యొక్క సౌందర్యమును వర్ణింతురు అదియే యూరపీయులు, ఎర్రని లేక బంగారు రంగుగల కుంచితకేశములు అందముగా నుండునని చెప్పుదురు. ఒక దేశమువారు సుందరముగా చూచు వస్తువు, మరియొక దేశమువారికి అసుందరముగా కన్పట్టవచ్చును. తెల్లని చర్మముతో నున్న (శ్వేత చర్మము గలవారు) వారిని భారతీయులు తాకుటకు గూడ ఇష్టపడరు. నల్లని వర్ణము గలవారిని యూరోపీయులు ఇష్టపడరు. ఒకరికి కృష్ణలేక రక్తవర్ణముతో భాసించు నేత్రములు సుందరముగా కన్పింప మరియొకరికి తోడేలువంటి లేక పిల్లి కన్నుల వర్ణముగల కన్నులనిన ఇష్టము. ఒకరికి చిన్న ముక్కు అందముగ కన్పించిన మరియొకరికి దీర్ఘముగ, కొటేరు వేసినట్లుగ ఉన్న నాసిక అందముగనుండును. ఇంకొకరికి చప్పిడి ముక్కు సుందరముగా కన్పించును. ఈ విధముగా చర్చించుచుపోయిన ఇదియే యొక పెద్ద తేలని చర్చయగును. కనుక చర్చను ఇంతటితో నాపి విషయమునకు వత్తము. ఏ దేశమున ప్రజలు, ఏయే వస్తువులను లేక ఏయే చేతన ప్రాణులను, ఏయే ఆకార-ప్రకారములలో, చూచుచున్నారో, ఏయే భాగములు ఏయే యనుపాతములో నుండినదర్శకులకు ముదము కల్గునో యా వస్తువులు సుందరములు. దానికి విపరీతములు అసుందరములు. అట్టి సుందరములగు వస్తువుల లేక ప్రాణుల, లేక దృశ్యములయందు కానవచ్చు ఇంద్రియ, చిత్త ఆహ్లాదకరమగు గుణమే సౌందర్యము. ఈ సౌందర్యము వస్తునిష్ఠమే ఐనను, ఈ సౌందర్య చర్వణము. అను ప్రక్రియ, దర్శకుని మానసిక సంస్కారము లేక భావనా ప్రవణతపైన నాధారపడి యుండుటవలన, చర్వణమున తరతమ భేదము కల్గుచున్నది. అంతేగాదు, ఈ సౌందర్యము కేవలము వస్తు, లేక ప్రాణిగతమేగాక, రూప, స్వభావ, గుణ, కర్మగతమై వైవిధ్యము నొందుచున్నది. ఉదాహరణమునకు ఒక వస్తువు తన బాహ్యమగు ఆకారమునుబట్టి సుందరముగ కన్పట్టకపోయినను, స్వభావమునుబట్టియో, కర్మనుబట్టియో,

గుణములనుబట్టియో లేక ఉపయోగితా దృష్టినిబట్టియో "సుందరము"గ గోచరింపవచ్చును. అందముగ నున్న సచేతన ప్రాణిగూడ, ఉత్తమ గుణములను కల్గియుండకపోయినచో వారి సౌందర్యము అందరకును ఆహ్లాదకరము కాకపోవచ్చును. కనుకనే, పతివ్రతయగు సీతను చెరబట్టి, యామె తన కోరికను మన్నించని కారణమున నంతవరకును ప్రసన్నముగ నుండి, క్షణములో మహోగ్రరూపమును ధరించిన రావణుని భయంకరత్వమును, ఘృణాస్పదత్వమును వర్ణించుచు రామాయణ కవి యీ విధముగ చిత్రించినాడు :-

> "స కల్పవృక్ష ప్రతిమోవసన్త ఇవమూర్తిమాన్।
> శ్మశాన చైత్యప్రతిమోభూషితోపి భయంకరః॥

తా॥ కల్పవృక్షము వలెను, మూర్తిమంతమైన వసంతమువలెను, సర్వాలంకార సుశోభితుడై అంతవరకుండిన రావణుడు స్మశాన చైత్యమువలె పరమ భయంకరముగ నుండెను. ఇక్కడ ధామాయణకవి, రావణుని యందలి తాత్కాలికమైన భీషణత్వమును అతని నిందితమగు ప్రవృత్తి ద్వారా దర్శకునియందు కల్గు ఏవగింపును "స్మశాన చైత్య" రూపమైన ఉపమానము నిచ్చి చాల మార్మికముగ చిత్రించియున్నాడు. హనూమంతుడు క్రోతియేయైనను, తన లోకోత్తర కర్మలద్వారా, సర్వపూజ్యతను, సర్వమాన్యతను పొందుటయే గాక, ఉత్తమ గుణములను మెన్చుకొను వారందరకును అహ్లాద ప్రదుడైనాడు. ఇది కర్మ సౌందర్యము. అట్లే, ఆయా ప్రాణులు, ఆయా భావానుభూతి సమయమున, తమ సహజమైన చేష్టలను ప్రదర్శించినచో నవి సుందరముగ గ్రహించ బడుటయేగాక, యవి దర్శకునకు అమిత ఆహ్లాదమును కల్గించును. ఈ క్రింది కపి చేష్టా చిత్రణమును చూడుడు :-

> "ఆస్ఫోటయా మాస చుచుంబ పుచ్ఛం; ననందచిక్రీడజగౌజగామ।
> స్తంభా నరోహన్నిప పాత భూమౌ ; ప్రదర్శయన్ స్వాంప్రకృతిం
> కపీనామ్" (5/10/54)

హనుమంతుడు లంకలో సీతాదేవి నన్వేషించుచు, రావణుని యంతఃపురమున, నొక దెస ఏకాంతముగ నొక మహార్హ శయనముపై నిద్రించు

సర్వానవద్యాంగియును, స్వర్ణమును బోలిన దేహకాంతి గలదియును. దివ్యా లంకార భూషితయును, రూప యౌవన శోభితయును, మిక్కిలి సౌందర్య వతియును నగు, రావణుని యంతఃపురేశ్వరియగు "మండోదరిని" చూచి" "సీత"యని భ్రమించి, సీతను కనుగొంటినను సంతోషముతో, నతడు చేసిన స్వాభావికములగు కపి చేష్టలను సహజముగ చిత్రించిన చేష్టా చిత్రము, పై ఛందస్సు ద్వారా ప్రదర్శింప బడినది; పై చిత్రములో నాద్య కవి కపులకు సంతోషము కల్గినపుడు కపులు చేయు స్వాభావిక చేష్టలను చిత్రించుచు నిట్లు వ్రాసినాడు.

(మదోదరిని చూచి, సీతను చూచితినను భ్రమలో పడిన హనుమంతుడు. (తన యానందమును పట్టలేక) తన తోకను నేలపై గొట్టెను వాలమును ముద్దు పెట్టుకొనెను. మహానందమును ప్రకటించెను ఆడెను. పాడెను, అటునిటు తిరిగెను, స్తంభములపై ప్రాకెను. తిర్గి ఎక్కిన స్తంభ ములనుండి "ధడేలు"మని క్రిందకు పడెను.

ఇవి సాధారణముగ సంతోషము కల్గినపుడు కోతులు చేయు చేష్టలు హనుమంతుడు ఎంత విద్వాంసుడైనను, వానర జాతిలో జన్మించిన వాడు గనుక సంతోష సమయమున, ప్రాకృతులగు వానరులు చేయు చేష్టలనే తన యానందమును ప్రకటించుటకు చేసెను. కాని యీ వానర ప్రకృతి కను రూపములగు చేష్టల సౌందర్యమును సామాజికుడు దర్శించి. తజ్జన్యమగు ఆనందమును చర్వణచేయును. ఇట్లే, గుణగతమైన సౌందర్యమును గూడ పాఠకులు తమ మనోనేత్రమున దర్శించి మహానందమును పొందుదురు కనుక దీని వలన తేలినదేమి యనగ ఈ సౌందర్యము కేవలము వస్తుగతమగు బాహ్యరూపమునకు మాత్రమే పరిమితముగాక, స్వభావ, కర్మ, గుణాదిగతమై గూడ యుండవచ్చును. ఈ సౌందర్య చర్వణము కేవలము సుకుమారార్థ సందర్శనముననే గాక, భయానక, కరుణాత్మకములగు అర్థముల సందర్శనము వలన గూడ సంభవించుట జరుగును. ఉదాహరణమునకు, ఇద్దరు వీరులకు జరుగు భీషణ యుద్ధము భయప్రదమే యైనను, ఆ యుద్ధములో జరుగు శత్రు (అధర్మాత్ములగు) సంహారము, లోమహర్షకమే అయినను,

సామాజికుల కానందమునే కల్గించునుగదా! వీర, రౌద్ర, భయానక రస చర్వణము, ఇట్టి దృశ్యముల దర్శనముననే సంభవించును. అందువలన, ధర్మాధర్మములకు; న్యాయాన్యాయములకును మధ్య జరుగు ఘోర సంఘర్షముకూడ, సామాజికులను సుందరముగనే కన్పించును. అట్టి సంఘర్షములో న్యాయము కొఱకు, ధర్మము కొఱకున్నూ ప్రాణములను లెక్క చేయక, పోరు వీరులు, ఎంత మంది అధర్మాత్ములను, అన్యాయసమర్థకులకు సంహరించిన, ధర్మ నిష్ఠులగు సామాజికులంత యానందించుదురు. అంతేగాని, అట్టి యధర్మాత్ముల సంహారమును గర్హింపరు. ఇదియే, అనగా అధర్మాత్ముల సంహార రూపమైన నట్టి కర్మల దర్శనమే కర్మగత సౌందర్యమునకు నిదర్శనము. ఈ విధముగ సౌందర్యమనునది, వివిధ రూపములలో, గోచరించుటయే కాక, వివిధ రూపములలో, సహృదయుడగు సామాజికునిచే చరిత్వమగుచున్నది. ఇంత వరకును మానవుడు, తన, మనస్సు ఇంద్రియముల ద్వారా, ఈ లోకమున దర్శించు, రూప, స్వభావ, గుణ చేష్టాది వివిధ వస్తుగత సౌందర్యమును గూర్చియు, తచ్చర్వణ ప్రకారమును గూర్చియు స్థూలముగ తెలిసికొని యుంటిమి. కాని, ఇంద్రియములు, మనస్సు మొదలగు వానితో దర్శించు ఈ సౌందర్యమును, విద్వాంసులు భౌతిక సౌందర్యమనియే యందురు. ఏమన, ఈ సౌందర్య దర్శన-చర్వణములు ఆధిభౌతిక సృష్టికి సంబంధించినవి, కనుక. కాని, ఇంతకంటెను ఉత్తమమైనదియును, సూక్ష్మమైనదియును, కేవలము శుద్ధమగు మనస్సుకు మాత్రమే గోచరించునదియును, స్థూలదృష్టికి గోచరము కానిదియు, స్థాయియునునగు దివ్యసౌందర్యము కలదనియు, దానిని దర్శించిన వ్యక్తి; ఆధిభౌతిక సృష్టిలోను, ఆధిదైవిక సృష్టిలోను గోచరించు సౌందర్య దర్శనమున పొందు ఐంద్రియానందముకంటె, మహత్తరమగు దివ్యానందమును పొందునని ఋషులు పల్కియున్నారు. ఈ క్రింది మంత్ర వర్ణములను చూడుడు:-

"సైషానందస్యమీమాగ్ంసాభవతి। యువా స్యాత్ సాధుయువాధ్యాయకః ఆశిష్ఠో, ద్రఢిష్ఠో, బలిష్ఠ స్తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకోమానుష ఆనందః। తేయే శతం మానుషా ఆనందాః। స

ఏకో మనుష్య గంధర్వాణా మానందః। శ్రోత్రియస్యచాऽ కామ హతస్య।స తేయే శతం మనుష్య గంధర్వాణా మానందాః। స ఏకో దేవగంధర్వాణా మానందః। శ్రోత్రియస్యచా కామ హతస్య। తేయే శతం దేవ గంధర్వాణా మానందాః। స ఏకః పితౄణాం చిరలోక లోకానా మానందః। ...........। తే యేశతం పితౄణాం చిరలోక లోకానా మానందాః। స ఏక ఆ జానజానాం దేవానా మానందః। తేయే శతమాజాన జానాం దేవానా మానందాః। స ఏకః కర్మ దేవానాం దేవానామానందః। యే కర్మణా దేవానపియంతి।.... .......। తే యేశతం కర్మదేవానాం దేవానా మానందాః। స ఏకో దేవానా మానందః

(తై॥ ఉపనిషత్, అను 8, మం 1-3.)

తా॥ ఆనంద మీమాంస యిట్లున్నది. మానుష ఆనందము, అనగా యువకుడు, సాధు స్వభావము గలవాడు, వేదాధ్యయన సంపన్నుడు, రోగ రహితుడు లేక కోరికలు గలవాడు, దృఢకాయుడు. సర్వేంద్రియ ములు స్వస్థముగ నున్నవాడున్నూ ఐనవానికి, ఈ పృథ్వి విత్తపూర్ణమైనచో, మిక్కిలి యానందము కల్గును. ఇట్టి, మానుష ఆనందమునకు నూరు ఇంతలు ఒక మనుష్య గంధర్వా నందమునకు సమానము. అట్టి మనుష్య గంధరావి దుల యానందము నూరింతలైన, ఒక దేవగంధర్వానందమునకు సమానము. అట్టి దేవగంధర్వానందమునకు నూరింతల ఆనందము చిరలోకములందు నివసించు పితరులనుభవింతురు. అట్టి చిరలోక వాసులగు పితరుల యానంద మునకు నూరింతల ఆనందము. ఆ జానజులగు దేవతల (స్వర్గమందు జన్మిం చిన) యొక్క ఒక్క ఆనందమునకు సమానము. అట్టి యాజానజ దేవతల యానందమునకు నూరు రెట్లు ఆనందము, కర్మదేవుల (తాము చేసిన యజ్ఞ యాగాది క్రతువుల పుణ్యఫలముగ స్వర్గమును పొందినవారు) యొక్క యానందమునకు సమానము. అట్టి కర్మదేవుల యానందమునకు నూరింత లైన ఒక దేవానందమునకు సమానము. ఈ పైన చెప్పిన యానందముల నన్నిటిని, నిష్కాముడగు శ్రోత్రియుడు అనుభవించవచ్చును.

మనుష్యలోకమున, ధన ధాన్యాదుల భోగము వలన మనుష్యుడనుభవించు ఆనందమే (భౌతికమగు) మానుషానందము. స్థూలమగు భౌతిక వస్తు భోగమువలన సంప్రాప్తమగు భౌతికానందముకంటె, నృత్య, గీతాది లలిత కళల మూలమున కల్గు మానసికమగు ఆనందము గొప్పది. ఇట్టి మానసికమగు అనందమును మనుష్య గంధర్వులు (గంధర్వాంశగల మనుష్యులు) అనుభవింతురు. మనుష్య గంధర్వులు పొందు కళాత్మకమగు ఆనందము, (మానస) మానుషానందముకంటె నుత్కృష్టము. ఈ మనుష్య గంధర్వుల యానందముకంటె, అంతరిక్ష లోక వాసులగు దేవగంధర్వులకు దివ్య నృత్యగానాది లలితకళా దర్శన జన్యమగు, దివ్యానందము గొప్పది. దేవ గంధర్వుల లోకముకన్న ఉన్నతమైన, చిరకాల స్థాయియగు పితృలోకమున (చాంద్రలోకమున) నివసించు పితృదేవతలనుభవించు ఆనందము గొప్పది. వారికంటె గూడ నున్నతమగు స్వర్గలోకమున నివసించు దేవతలనుభవించు దివ్యానందము ఉత్కృష్టమైనది. అంతకంటె, నాకపృష్ఠమున కర్మదేవులనుభవించు ఆనందము గొప్పది, అంతకంటె శుద్ధసత్త్వ ప్రధానమైన చిత్తముగల అమరులనుభవించు, సాత్త్వికమగు దివ్యానందము ఉత్కృష్టమైనది.

సారాంశమేమియను భౌతికములగు స్థూల వస్తుభోగ ప్రాప్తమగు ఇంద్రియానందముకంటె, మానసానందము, అంతెకంటెను ప్రాణ సంతర్పణమగు పితృలోకానందము, అంతకటెను, దేవతాద్యుపాసన, దే గుణాద్యను చింతన, మహిమాను దర్శన, స్వరూప సాక్షాత్కారాదులచే నుపాసకులు (కర్మదేవులు) పొందు ఆనందము గొప్పదనియు ; అంతకంటెను నుపాస్య దేవతా తాదాత్మ్యనుభూతివలన కలుగు శుద్ధసాత్త్వికమగు దివ్యానందము గొప్పదియనియును వేదఋషులు వర్ణించియున్నారు.

అనగా, స్థూలమగు అధి భౌతికానందము కంటె సూక్ష్మాతిసూక్ష్మములగు, కళాత్మకమగు ఆనందము, ప్రాణ సంతర్పణమగు అమరానందము, శుద్ధ సాత్త్వికములగు దివ్యానందములు ఉత్తరోత్తర ముత్కృష్టములని స్వానుభూతిచే ఋషులు వర్ణించియున్నారు.

ఈ విషయమును మఱియొక విధముగ గూడ వర్ణించవచ్చును. స్థూల భూత, ప్రాణ, తైజసములగు ఉపాధులు, ఉత్తరోత్తరము సూక్ష్మములు గనుక యుత్తరోత్తరముత్కృష్టములు. అట్టి యుపాధులలో జీవుడు పొందు ఆనంద ములు గూడ నుత్తరోత్తరముత్కృష్టములు

పైవిషయమునే వివరించెదము : జీవుడు, అన్నమయమగు శరీరమున జాగరూకుడై పొందు స్థూలమగు భౌతిక సుఖముకంటె, సూక్ష్మమగు ప్రాణమయ శరీరమున (ప్రాణాది వాయువుల సంయమము మూలమున) అనుభవించు ఆనందము ఉత్కృష్టమైనది. అంతకంటెను, ఉపాస్య దేవతయందు మనస్సును సమాహిత మొనరించుట వలన (అనగా ఈశ్వర ప్రణిధానము వలన) లభించు దివ్యానందము ఉత్కృష్టము. మనస్సును నిరంతర సాధనలచే శుద్ధమొనరించుకొని, యట్టి నిర్మల మును, జ్ఞానోద్దీప్తమునునగు మనస్సును బ్రహ్మయందు లయము చేయుట ద్వారా జ్ఞానిపొందు బ్రహ్మానందము లేక యాత్మానందము, సర్వోత్కృష్ట మైనదని బ్రహ్మవేత్తలగు ఋషులయాశయము కారణము - ఇతర ఆనంద ములవలె, ఈ బ్రహ్మానందము, విషయసంపర్కము కలదికాదు. ఇది సహ జము, స్వాభావికము, స్వస్వరూపభూతమైనది. ఈ యానందము, విగళిత వేద్యాంతరము, చర్వణ, చర్విత, చర్వ్యమాణవిషయములను త్రిపుటిలేనిది, చ్యుతిరహితము, అజరము, అమరము, నిత్యము, స్వభావభూతమైనదని, ఉపనిషత్తు లేక స్వరమున ఉద్ఘోషించి యున్నవి. పైన చెప్పిన ఆనందము లన్నిటిని, సాధకుడగు జీవుడు, ఆత్మప్రాప్తికి లేక సత్యప్రాప్తికై, నిరంత రము చేయు తీవ్రసాధనల ద్వారా, స్థూలజగత్తునుండి, సూక్ష్మాతి సూక్ష్మ మును, సర్వ వ్యాపకమును, సర్వాధిష్ఠాన భూతమును, సచ్చిదానందమయమును నగునాత్మదెసకు ప్రయాణించుచు, ఒక్కొక్క మెట్టు క్రమముగ నధిరోహించుచు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశముల

---

x. "అణోరణీయాన్మహతో మహీయా నాత్మాస్యజంతోర్నిహితో గుహాయాం। త, మక్రతుః పశ్యతివీత శోకఃధాతు ప్రసాదాన్మహిమాన మాత్మనః॥"

యందు తాదాత్మ్యభిమానమును క్రమముగ చేయుచు ఆయా శరీరములయందు, ఆయా యానందముల ననుభవించును. ఈ యాత్ర యాత్మప్రాప్తిలేక సత్యసాక్షాత్కారముతో ముగియు చున్నది. ఈ యాత్మప్రాప్తి వలననే జీవుడు ఆత్మ(శరీర)నివృత్తు, మన అధ్యాపాధ్యభిమానమును, శాశ్వతముగ త్యజించి, బ్రహ్మభూతుడై బ్రహ్మానందమనుభవించును. ఈ విషయమును శ్రుతులిట్లు వర్ణించియున్నవి:-

మ॥ "అస్మాల్లో కాత్ప్రేత్య। ఏత యన్నమయ మాత్మానముప సంక్రామతి।
ఏతం ప్రాణమయ మాత్మాన ముప సంక్రామతి।
ఏతం మనోమయ మాత్మాన ముప సంక్రామతి।
ఏతం విజ్ఞానమయ మాత్మాన ముప సంక్రామతి।
ఏత మానందమయ మాత్మాన ముప సంక్రామతి॥" అని
(తై॥ ఉప, అను-8.

అనగా సాధకుడు, స్థూలమగు అన్నమయ కోశమునందు అభిమానమును చేసినపుడు, బాహ్యమగు విషయముల భోగమువలన కలుగు ఇంద్రియ సుఖముననుభవించును. స్థూలమగు అన్నమయ శరీరముకంటె, ఆ శరీర ధారకమగు ప్రాణశక్తి చాల గొప్పది. మానవుడు, ప్రాణశక్తి మూలముననే మహత్తరములగు కర్మలను నిర్వహించుటకు సమర్థుడగు చున్నాడు ప్రాణమయమైన శరీరమునందు తాదాత్మ్యభిమానము చేసినపుడు (అనగా, ప్రాణాయామాదుల నభ్యాసముచే ప్రాణశక్తిని వృద్ధి పొందించినపుడు) తాను మహత్తరములగు కర్మలనాచరించి, భౌతికానందము కంటె నుత్కృష్టమగు ప్రాణానందము ననుభవించుచున్నాడు. ప్రాణమయమగు కోశమునందలి యభిమానమును త్యజించి, యంతకంటెను సూక్ష్మమును, మహాశక్తివంతమును నగు మనోమయమగు* కోశమునందు తాదాత్మ్యభిమానముచే, సర్వలోక సంచారాదులను చేయుటతో బాటుగ, దేవతాద్యుపాసనాదుల

* మనోవశేఽన్యేహ్యభవన్ స్మదేవా, మనస్తునాన్యస్య వశం సమేతి। భీష్మోహిదేవ స్సహసస్సహీ యాన్, యుంజే ద్వశే తం స హి దేవ దేవః॥ "శ్రీమద్భాగవతమ్"

ద్వారా, దేవతా సాన్నిధ్యాది ప్రాప్తిజనితమగు మహోత్కృష్టమగు మానసానందము ననుభవించును. ఇట్టి మనోమయ కోశమును గూడ నిరంతర సాధనల ద్వారా యతిక్రమించి విజ్ఞానమయ కోశమున దృష్టిని కేంద్రీకరించి, తదభిమానమును చేసిన, ఉపాసనాజన్యమగు సత్త్వ ప్రధానమైన దివ్య రసానుభూతిని పొందును. విజ్ఞానమయ కోశమునుండి గూడ ఉత్థితుడై, శుద్ధ సత్త్వ ప్రధానమైన, నిర్మలమైన బుద్ధియందు దృష్టిని సాధకుడు కేంద్రీకరించుటచే బ్రహ్మానందమును పొందును ఆత్మ నిష్ఠుడైన యపుడు, స్వస్వరూపభూతమును, అవిచ్యుతమునునగు ఆత్మానందమునే పొందును. అనగా "ఆనందమయమగుఆత్మ" తానేయని తెలిసికొనును. ఈ యానందమును వాక్కులతో చెప్పనలవిగాదు. ఇది, మనో బుద్ధ్యాదుల ద్వారా పొందబడునదియును కాదు. మనో బుద్ధ్యాదిలయముచే* ప్రాప్తమగును. అందువలన నిది మహోత్కృష్టము. బాహ్య లేక ఆంతర, ఉభయవస్త్వనపేక్షితము. స్వస్వరూపభూతము, అవిచ్యుతము, శాశ్వతమునగుట వలన, సతరానందములన్నిటికంటెను నుత్కృష్టతమము. లోకమున గల ప్రాణులు పొందు ఆయా యానందములు, ఈ యాత్మానంద సాగర లవకణికలుమాత్రమే ఈ విషయమును శ్రుతులు సర్వత్ర అసందిగ్ధముగ* వక్కాణించి యున్నవి. ఈ విధములగు ఆనందములలో ఇష్టవస్తు దర్శన జన్యమగు భౌతికానందము ప్రియము అనియు, మానసికానందము మోదమనియు, బౌద్ధానందము ప్రమోదమనియును, వస్త్వంతరానపేక్షితము, స్వస్వరూపభూతము, ఆస్వాద ఆస్వాదక ఆస్వాద్య రూపమైన త్రిపుటిరహితమగు ఆత్మానందమే, యథార్థమైన ఆనందమనియును శ్రుతి, ప్రతీక రూపమున చాలమనోహరముగ వర్ణించియున్నది:

---

* యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్॥ (తై॥ఉప॥ ఆనందవల్లి

* "ఏష హ్యేవానందయాతి॥" (తై॥ఉ॥ ఆనందవల్లి.

"ఏతస్యైవానందస్య అన్యాని భూతాని మాత్రాముపజీవన్తి॥"

(బృ॥ఉప॥ 4/3/32)

మం॥ "తస్య ప్రియమేవశిరః॥ మోదోదక్షిణః పక్షః॥ ప్రమోద ఉత్తరః పక్షః, ఆనంద ఆత్మా బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా॥"

(తై॥ఉ॥ ఆనందవల్లి)

తా॥ ఆనంద రూపమైన పురుషునికి "ప్రియ"మనునది "శిరస్" స్థానీయము మోదము దక్షిణ పక్షము, ప్రమోదము ఉత్తర పక్షము. ఆనందము ఆత్మ. ఈ యానందమంతయును బ్రహ్మయందు ప్రతిష్ఠ కలిగియున్నది.

కనుక, మానవుడు, శారీర, ప్రాణ, మానస, బౌద్ధ, ఆత్మలయందు స్థితిని కల్గియున్నపుడు, అతని సౌందర్య దర్శనమునందు వైవిధ్యముండుటతో బాటుగ, నా సౌందర్య దర్శన జన్యమగు ప్రియ, మోద, ప్రమోద, ఆనందముల చర్వణమునందును, ఆనందానుభూతియందును వైవిధ్యమున్నట్లు మన కనుభవములో నుండుటయేగాక, శ్రుతిగూడ ఆ వైవిధ్యమును, సాంకేతికముగ సర్వత్ర వర్ణించియున్నది.

తత్త్వద్రష్టయగు రామాయణ కవి. "సత్యం, శివం, సుందరమ్, అను శ్రౌతదర్శనోపలక్షితమైన, సత్య స్వరూపమైన ఆత్మయొక్క సర్వానవద్య మైన "శివ" స్వరూపమును, బ్రహ్మాది స్తంబపర్యన్తము, సర్వవస్తుజాతమున నంతర్యామిగనున్న ఆ సత్యాత్మ యొక్క చక్షుర్మనఃప్రహ్లాదకరమై, సర్వవస్తువుల ద్వారా ప్రతిఫలించు దివ్య సౌందర్యమును, లలిత పద మంజులమైనదియు, గభీరార్థ ప్రతిపాదన పరమును నగు 'సుందరకాండ'మను నీ కావ్య ఖండిక ద్వారా సహృదయలోకమునకు, శ్రుతులవలె సాంకేతికముగ గాక, వాచ్య, లక్ష్య, వ్యంగ్యరూపములగు త్రివిధ శబ్దముల ద్వారా హృదయంగమ మొనరించియున్నాడు.

వాల్మీకి యొక్క యీ సౌందర్య దర్శనము, అనంతమగు ఈ విశ్వము లోని యణువణువున ప్రతిఫలించు సౌందర్యదర్శనముతో పర్యవసితముగాక క్రమముగ "శివ" ప్రాప్తి, సత్యోపలబ్ధులకు సాధనమై, సహృదయలోకమును, మోదమునుండి, ప్రమోద స్థితికిని, ప్రమోద స్థితినుండి, ఆనంద స్థితికిని, తీసికొనిపోయి, మానుష జీవితమునే చరితార్థ మొనరింప సమర్థము.

కనుకనే భారతదేశమునగల సహృదయ ఆస్తిక లోకము సకల మనోరథ సిద్ధికిని, చిత్త శుద్ధికిని, దివ్యానంద ప్రాప్తికిని సుందరకాండమును నేటికి గూడ "మహామంత్రరాజము"గ నెంచి శ్రద్ధతోను, దీక్షతోను పారాయణాధ్యయనాదు లొనరించుచున్నారు. ఈ మహాకావ్య ఖండిక, భౌతికానందముతోబాటు, మానసికానంద, బౌద్ధానందము (బ్రహ్మానందము) లను గూడ ప్రసాదించుచు, పఠితృలోకము నానంద సాగరమున నోలలాడించుచున్నది.

కనుకనే తైత్తిరీ యోపనిషత్తు ఆత్మ-జగత్తుల స్వరూపమును వర్ణించుచు జీవుడు వీని వలన పొందు ఆనందముసిట్లు వర్ణించుచున్నది :-

మం॥ తత్సృష్ట్వాతదేవాను ప్రావిశత్। తదను ప్రవిశ్య। సచ్చ, త్యచ్చా భవత్। నిరుక్తంచాఽనిరుక్తంచ। నిలయనంచాఽ నిలయనంచ; విజ్ఞానంచాఽవిజ్ఞానంచ। సత్యంచాఽనృతంచ సత్యమభవత్ య దంకించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేషశ్లోకోభవతి॥

(తై॥ఉప॥ ఆనందవల్లి, అను-6, మం-1.)

సృష్టి స్వరూపమును వివరించుచు పై శ్రుతి యిట్లు చెప్పుచున్నది. జగత్స్రష్టయగు పరమాత్మ। ఈ యనంతమగు విశ్వమును సృజించి, తాను, అంతర్యామిగ అందు ప్రవేశించెను. అంతర్యామిగ ఆత్మ, విశ్వమున ప్రవేశించుట యను కార్యమును వైదిక ఋషులు, 'ఆత్మానుప్రవేశము" అని వ్యవహరించిరి. ఈ యను ప్రవేశానంతరము, సత్యస్వరూపమగు ఆత్మ మూర్తము (సత్); అమూర్తముగ (త్యత్) నాయెను. ఆ మూర్తామూర్తములనే విశ్లేషించుచు ఋషి యిట్లు పల్కుచున్నాడు. మూర్తమైన జగత్తు నిరుక్తము (ప్రత్యక్షము లేక ఇంద్రియ గోచరము): అమూర్తమైన ఆత్మ అనిరుక్తము, లేక పరోక్షమనియును వ్యవహరించబడుచున్నవి. అట్లే యీరెండునూ క్రమముగ నిలయనము (ఆశ్రయము), అనిలయనము (అనాశ్రయము): విజ్ఞానము (చేతనము), అవిజ్ఞానము (అచేతనము), సత్[illegible] ప్రతీయమానము; అనృతము తద్విపరీత మైనదిగను [illegible] వివరించి[illegible]నవి నిరుక్తా నిరుక్త, నిలయనాఽనిలయన: విజ్ఞానా[illegible]జ్ఞాన, సత్యాఽనృ[illegible]ప



TIRUPATI
49714

మైన ఈ సర్వమును బ్రహ్మవేదత్తలు (స్వము) అనియే పల్కుచున్నారు. ఈ విషయమును గూర్చి ఈ క్రింది మంత్రము ఇట్లున్నది :-

మం॥ అసద్వా ఇద మగ్ర ఆసీత్। తతోవై సదజాయత। తదాత్మానగ్ం స్వయమకురుత। తస్మాత్తత్సుకృ ముచద్యత ఇతి। యద్వైతత్సు కృతం, రసౌవై సః। రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వానన్దీ భవతి। కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్, యదేష ఆకాశ ఆనందోన స్యాత్। ఏష హ్యేవానన్దయాతి। యదా హ్యే వైష ఏతస్మిన్న దృశ్యేఽ నాత్మ్యేఽ నిరుక్తేఽ నిలయనేఽ భయం ప్రతిష్ఠాం విందతే। అథసోఽ భయంగతో భవతి"॥

(తై॥ ఉప॥ ఆనంద 1 అను 7 మం-1)

తా॥ మొదట యీ జగత్తు అసత్తుగనే (అవ్యాకృతమగు బ్రహ్మ రూపముననే) యుండెను. దాని నుండియే సద్రూపమగు నీ జగత్తు (నామ రూపాత్మకమగు, వ్యక్త జగత్తు) పుట్టెను. ఆయసత్తే. బ్రహ్మయే, స్వయముగ తననే (నామ రూపాత్మకమగు) వ్యక్త జగద్రూపముగ నిర్మించుకొనెను. అందువలన నది, సుకృతము (స్వయం కృతము) అని చెప్పబడుచున్నది ఏది స్వకృతముగ ప్రసిద్ధమై, అదియే "రస"మని చెప్పబడుచున్నది. లోక మున గూడ పురుషుడు రసచర్వణముననే యానందమును పొందుచున్నాడు. ఈ విషయమునే శ్రుతి యిట్లు వర్ణించు చున్నది. ఈ పరమవ్యోమమున, అనగా, బుద్ధి రూపమైన గుహాయందు, ఆనందమయమగు బ్రహ్మలేనిచో, ఎవ్వడు, ప్రాణాపానాది రూపమగు క్రియను (ఉచ్ఛ్వాస నిఃశ్వాస రూపమగు కర్మను) చేయును? ఏ బ్రహ్మ మూలమున, ప్రాణాపానాది కృతములగు కార్యములు జరుగుచున్నవో, అదియే లోకమును గూడ ఆనందింప చేయు చున్నది. ఈ యదృశ్యమును, అశరీరయు, అనిర్వాచ్యమును, ఆధార రహితమును నగు బ్రహ్మయందే, ధీమంతుడు, అభయ స్థితి నొందుచున్నాడు

దీనిని బట్టి తేలిన దేమియన, అవ్యాకృతమగు బ్రహ్మయే. వ్యాకృత జగద్రూపమై తనను తాను నిర్మించుకొని, దాని యందు రసాస్వాదము చేయుచు యానందించు చున్నది. ఈ యానందమే బ్రహ్మ ఉచ్ఛ్వాస నిఃశ్వాసములు చేయగల ప్రతి ప్రాణియు ఈ యానందమయమగు ఆత్మమూల

మువనే వ్యాకృత జగత్తునందు గూడ ఆనందమును పొందుచున్నది. ఈ యానంద మూలమగు బ్రహ్మమున నెవ్వడు ప్రతిష్ఠితుడగునో వాడే యభయ స్థితి నొందుచున్నాడు.

ఈ స్వకృతమగు, అనగా నామ రూపాత్మకముగ వ్యాకృతమైన జగత్తు జీవునికి ఆనందహేతువగుట వలన దీనిని ఋషి "రసము" అని వర్ణించియున్నాడు.

ఈ జగత్తు (వ్యాకృతమగు) ప్రాణిజాతమునకు ఎట్లు ఆనంద హేతువగుచున్నది? తన రూపము ద్వారా అనగా, ప్రతిఫలించు సౌందర్యము ద్వారా; అని శ్రుతిసమాధానించుచున్నది:

మం॥ న, తత్ర సుర్యోభాతి న చంద్ర తారకమ్, నేమావిద్యుతో భాంతి కుతోఽయమగ్నిః తమేవ భాంత మనుభాతి సర్వం తస్య భాసా సర్వమిందవిభాతి॥

(కఠ ఉప; పంచమ వల్లి మం-15. ముండక 2-11)

అనగా స్వాత్మభూతమగు ఆ బ్రహ్మయందు (సర్వావభాసకుడైన) సూర్యుడు గూడ ప్రకాశింపడు, అనగా ఆ బ్రహ్మమును ప్రకాశింపచేయుటకు సమర్థుడు గూడ. చంద్ర, తారక, విద్యుత్అగ్న్యాదులు గూడ ఆ బ్రహ్మ మును ప్రకాశింప చేయజాలరు. లోకమున పదార్థములను ప్రకాశింపచేయు సర్వతేజస్సులు, ఆ యాత్మ ప్రకాశము మూలముననే ప్రకాశించుచున్నవి. అనగా సర్వ ప్రకాశములకది ప్రకాశము.

కనుక సర్వ పదార్థ ప్రకాశములగు సూర్య-చంద్రాది ప్రకాశములకు, ప్రకాశక శక్తి ఆ యాత్మ వలననే కల్గుచున్నది. జడ-చేతనములయందు మానవుడు దర్శించు సౌందర్యముగూడ సౌందర్యసాగరమగు ఆత్మయొక్క అనంత సౌందర్యములో నొక్క యంశము మాత్రమే. ఆ సౌందర్య దర్శనమున జీవుడనుభవించు ఆనందము గూడ యానంద సాగరమగు బ్రహ్మ* యొక్క లవలేశము మాత్రమే.

---

* "ఏతస్యైవాఽఽనందస్య అన్యాని భూతాని మాత్రాముపజీవన్తి॥"

కాని క్షర ప్రకృతి ద్వారా గోచరించు అక్షర సౌందర్యమును, శివ దృష్టితో నాస్వాదించగల్గినవాడే శుద్ధమైన, సాత్త్వికమైన యానందానుభూతి నొందగల్గును. ఈ శివదృష్టి కొఱవడిననాడు తత్సౌందర్య దర్శనము వలన, క్షణికములగు ప్రియ, మోదముల ద్వారా, ఇంద్రియ మనస్తృప్తి నొందగల్గినను, శుద్ధము, నిర్విశేషము, స్వాత్మ భూతమగు బ్రహ్మానందమును పొందజాలడు. దాని వలన నతడు, మానుష జీవితలక్ష్య భూతమగు బ్రహ్మానంద ప్రాప్తిని, లేక అభయస్థితిని పొందజాలడు.

సౌందర్యము యొక్క తాత్త్విక దర్శనము, రాగ, ద్వేషాదులచే మలినముగాని, నిర్మలమగు చిత్తముగల వాడే చేయగల్గును. రాగ-ద్వేషాద్యభిభూతమగు చిత్తముగలవాడు, ప్రాకృత సౌందర్య స్వరూపమును, సరిగ, ఎఱుగజాలక, దానియందు మోహమును పొందును. దాన నతని మనస్సు మోహావిష్టమై ద్రష్టయొక్క యాధ్యాత్మికమగు పతనమునకు దారి తీయును రాగ ద్వేషాదుల మూలమైన మలినమైన చిత్తమెట్లు శుద్ధమగు ఆత్మను దర్శింపజాలదో యట్లే, శుద్ధమైన ఆత్మ సౌందర్యమును గూడ దర్శింపజాలదు. శుద్ధ చిత్తముతో సర్వగతమగు నాత్మ సౌందర్యమును, లేక చైతన్యమును దర్శించుటయే శివదృష్టి అట్లే ప్రాకృత పదార్థముల యందు భోగదృష్టి ఏ శివ దృష్టి సాక్షి మాత్రముగ తద్దర్శనమే శివదృష్టి ఈ శివదృష్టి వలననే, సాధకుడు ఆత్మానంద ప్రాప్తికి అధికారియగుచున్నాడు. ప్రాకృతదృష్టి లేక అశివదృష్టి గలవాడు ఆత్మానంద ప్రాప్తికి అధికృతుడు గాక, రాగ-ద్వేషాదుల వలయమున చిక్కుకొని, శాంతిని కోల్పోయి వినాశమందుచున్నాడు. ఈ శివ దృష్టి మూలమున మానవుడు, మానవత్వపరిధుల నతిక్రమించి, దివ్య లోకాంచలముల విహరించగల్గును అశివ దృష్టివలన మానవుడు తన మానవతా పరిధులనుండి గూడ చ్యుతుడై, అసురత్వమును లేక రాక్షసత్వమును, లేక పశుత్వమునకు దిగజారి తన స్థితినే దిగజార్చుకొనుచున్నాడు. కనుక మానవుని సౌందర్య దర్శనము, దాన నతడు పొందు యానందము, శివదృష్టి యుక్తములైనచో, నవి, చిర్విత్త లోని దైవగుణ సంపదను వృద్ధిచేసి యతని చిత్తమునందు బహుజన్మార్జిత ములై పేరుకొనియున్న శుభాఽశుభ సంస్కారజనితములగు సకల సత్సద్వా

సనలను నిర్మూలించి, సర్వత్ర సమదర్శన రూపమగు దివ్య సౌందర్య దర్శనమునకు మార్గమేర్పఱచి, చర్వితకు, దివ్యసౌందర్య. దివ్యానందానుభూతులను శాశ్వతముగ కలిగించుటతో బాటుగ; చర్వితను మర్త్యశోక భూమిక నుండి, దివ్యలోకములందు ప్రవేశమును కల్పించి, దివ్యానంద ప్రాప్తిని శాశ్వతిక మొనరించును. ఇదియే "మృత్యోర్మాఽమృతంగమయ" అను ఆర్ష అనుశాసన రహస్యము.

ఇక్కడ మరియొక విషయమును గూడ పఠితలు మనసునందుంచు కొనవలెను. ఎట్లు ఆత్మ వివిధములగు సదసదుపాధులను కల్గియున్నను, ఆయా యుపాధుల గుణదోషములతో ఈషత్తుగ గూడ సంపర్కమును కల్గియుండక తన నిర్దోషత్వమును, తన సమత్వమును, శుద్ధత్వమును, తన ప్రజ్ఞాన స్వరూపమును, ఆనంద స్వరూపమును కోల్పోవక, తన స్వస్వరూపమున ప్రతిష్ఠితమై యుండునో యట్లే ఆత్మస్వరూప భూతమగు దివ్యసౌందర్యము గూడ మలినములగు నుపాధులలో ప్రతిఫలించినను, అమలినములగు నుపాధులలో ప్రతిఫలించినను, జడ-చేతనములలో నభివ్యక్తమైనను, తన నిజమగు (స్వాభావికమగు) పవిత్రతను కోల్పోవక, చర్వితలచే నాస్వాదితమగుచు వారికి దివ్యానందానుభూతిని కల్గించుచునే యుండును. ఈ విషయము ముమ్ముందు సువిశదముగా నిరూపించబడగలదు.

కనుక దివ్యసౌందర్యోపాసకుడగు వాల్మీకి మహాముని "సుందరకాండ" మను ఈ కావ్యఖండిక ద్వారా లోకము ముందుంచిన శివాఽశివ ఉభయగతమగు సౌందర్యమును, తచ్చర్వణము మూలమున పఠితలో కల్గు అనుభూతి వైవిధ్యమును, దానివలన నుత్పన్నమగు సామాజిక ప్రభావమును, కాంతాసమ్మితముగ చిత్రించియున్నాడు. భగవాన్ వాల్మీకి సద సద్రూపమైన ఈ యనంత విశ్వమున ప్రతిఫలించు చేతన సౌందర్యమును కడు హృద్యముగ చిత్రించుటతోబాటుగ, పాఠకుల సంవేదన శక్తిని తీవ్రతర మొనరించి సర్వత్ర సమ సౌందర్య దర్శన రూపమగు నాధ్యాత్మిక యోగమున నారూఢుని గావించి. వారికి బ్రహ్మానందానుభూతిని యత్నశమముగ కల్గించుటతో బాటుగ, చరాచరాత్మకమగు ఈ యనంత ప్రకృత్యాలంబనకమగు విశ్వప్రేమను

పాఠకుల హృదయమున నుద్దీప్తమొనర్చి, బ్రహ్మానందసబ్రహ్మచారియును, సహృదయైక సంవేద్యమును, స్వేతర విలక్షణమును నగు కావ్యరసము యొక్క చర్వణము ద్వారా చిరంతన ప్రమోదమును కల్గించుచున్నాడు. సారాంశమేమియన, తత్త్వ వేత్తయును రససిద్ధుడును నగు రామాయణకవి, "సుందరకాండ"మను ఈ దివ్యకావ్య ఖండికయందు అధ్యాత్మయోగి సమ కక్షముగ,* కావ్యరస యోగమును** ప్రదర్శించి, రెంటిని సుందరముగ సమన్విత మొనరించి, ఆ రెంటికిని సమప్రయోజనత్వమును నిరూపించి యున్నాడు. వాల్మీకి యీ కావ్యఖండిక ద్వారా సాధించిన అధ్యాత్మయోగ కావ్యరస చర్వణ యోగముల సమన్వయ స్వరూపమును లేక మార్గమును, విశ్లేషించి చూపుటకేనా యీ లఘు పయానము

---

1. (క) "అధ్యాత్మ యోగాధిగమేన దేవం మత్వాధీరో హర్ష శోకౌ జహాతి॥"

(ఖ) "హృదామనీషా మనసాభిక్లప్తో, యఏతద్విదు రమృతాస్తే భవంతి॥"

(కఠ ఉపనిషత్)

2. (గ) రస ఇతికః పదార్థః ? అత్రోచ్యతే। ఆస్వాద్యత్వాత్। కథ మాస్వాద్యతేరసః? అత్రోచ్యతే। యథాహి నానా వ్యంజన సంస్కృత మన్నం భుంజానా రసానాస్వాదయంతి, సుమనసః పురుషా, హర్షా దీంశ్చాऽధి గచ్ఛన్తి, తథా నానా భావాభినయవ్యంజితాన్, వాగఙ్గ సత్త్వోపేతాన్ స్థాయిభావా నాస్వాదయంతి సుమనసః ప్రేక్షకాః। తస్మాన్నాట్యరసా ఇతి వ్యాఖ్యాతాః॥

(భరతః, నాట్యశాస్త్రమ్, అధ్యా-6)

(ఘ) "తేన యే కావ్యాభ్యాస ప్రాక్తన పుణ్యాది హేతుబలాదిభిః సహృదయాస్తేషాం పరిమిత విభావాద్యుస్మీలనేపి, పరిస్ఫుట ఏవ సాక్షాత్కార కల్పః కావ్యార్థః (రసః) స్ఫురతి। అతఏవతేషాం కావ్యమేవ ప్రీతి వ్యుత్పత్తి కృత్। అన పేక్షితనాట్యానామపి। తేషామపి తునాట్యేऽనిపతితాః స్ఫురితాః శశిరశ్మయః॥ ఇతి న్యాయేన సుతరాం నిర్మలీకర్మణమ్। సహృదయానాం చతదేవ నైర్మల్యాధాయి॥"

(అభినవ గుప్తాచార్యః, అభినవ భారతి, నాట్యశాస్త్ర వ్యాఖ్య, 6. వ అధ్యాయము, రసవ్యాఖ్య)

## 3. సుందరకాండము - విషయ ప్రవేశము

పరమేశ్వరుడు అనేక ఉపాధులను అంతర్యామిగా ప్రవేశించి, తత్సదృశమగు రూపము గలవాడగు చున్నాడు. ఎందుకావిధముగ నగు చున్నాడు? అను ప్రశ్నమును సమాధానించుచు భరద్వాజ గోత్రకుడగు గర్గ మహర్షి ఇట్లనుచున్నాడు అట్లు చేయుట ద్వారా తన నిజరూపమును సర్వులకును తెలియచేయ గల్గుచున్నాడు. ఇంద్రుడు పురురూపత్వము నెట్లు పొందగల్గుచున్నాడు? అని ఇంకొక ప్రశ్నము. దానికి సమాధానము: అతడు స్వనిష్ఠమైన మాయల ద్వారా అట్లు బహురూపములను ధరించ గల్గుచున్నాడు.

గీతలయందు పరమాత్మయగు వాసుదేవుడు తాను జన్మనెత్తుటలో తనకుగల స్వాతంత్ర్యమును వివరించుచు నర్జునునితో నిట్లనుచున్నాడు:-

"అజోపి సన్న వ్యయాత్మా భూతానా మీశ్వరోపిసన్।
ప్రకృతింస్వా మధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా॥
(భ॥గీ 4-6)

అక్షీణ జ్ఞానశక్తి గలవాడనైనను, బ్రహ్మాది స్తంబ పర్యంతములగు సమస్త ప్రాణులకు ఈశ్వరుడనే యైనను, స్వతఃగా జన్మాది వికారములు లేనివాడనే యైనను, త్రిగుణాత్మికయగు, ప్రకృతిని మాయను ఆశ్రయించి, అనేక రూపములను (ఉపాధులను) గ్రహించి, పుట్టినట్లగపడుచున్నాను, అని॥

అస్తు, ఆ పరమేశ్వరుడు సహస్రాదీంద్రియ వృత్తులతో నాయా శరీరముల నధిష్ఠించి జీవరూపముస లోకమున ఆయా ఇంద్రియ విషయముల ననుభవించుచున్నాడు.*

సారాంశ మేమియన, పరమేశ్వరుడీయనంత సృష్టి ద్వారా తన నిజ స్వరూపమును లోకమును గ్రహింపచేయు చున్నాడు. అట్లు గ్రహింప

---

* "రూపం రూపం ప్రతి రూపో బభూవ తదస్య రూపం ప్రతి చక్షణాయ। ఇంద్రోమాయాభిః పురురూప ఈయతే యుక్తా హ్యస్య హర యశ్శతాదశ॥ (ఋ॥వే॥ 6-47. 18.)

చేయుటకే తాను అంతర్యామిగ సర్వోపాధులయందు* ప్రవేశించు చున్నాడు.

ఈ రహస్యం మెఱిగిన కవులు (ప్రజ్ఞావంతులు) చేతనా చేతన రూప మైన ఈ యనంత విశ్వములోని ప్రతి యణువులో నుండు యభివ్యక్తమగు, ఆత్మ సౌందర్యమును లేక ఆత్మయొక్క యనంత సౌందర్యమును తమ ప్రజ్ఞానేత్రముతో దర్శించి తాము తన్మయత్వము నొందుటతో బాటుగ, ఆత్మ యొక్క యీ యనంత సౌందర్యమును తమ వాక్కుల ద్వారా, వర్ణించి, సహృదయులగు లోకులకు గూడ తత్సౌందర్య దర్శనానందానుభూతిని కలుగ చేయుచున్నారు. కనుకనే లోకమున నసుందరముగ భావించబడు వస్తువు గూడ కవి దృష్టిలో నొక విలక్షణమగు సౌందర్యమును సంతరించు కొని పాఠకులకు ఒక విలక్షణమగు సౌందర్యానుభూతిని కల్గించుటకు తోడ్పడుచున్నది. కాని ఈ కన్పించు అనంత విశ్వములో కణ-కణమునకు విభక్తమైనట్లుగా కన్పించు, అనంతమైన ఆ యాత్మ సౌందర్యమును సమ్యగ ముగ దర్శించు తత్త్వదర్శియే, లేక మహాకవియే, ఆత్మయొక్క యనంత సౌందర్యమును, ఈ విశ్వములో నవిభక్తముగా** వ్యాపించినట్లు, తన ప్రజ్ఞా నేత్రముతో దర్శించి, బ్రహ్మానందమును తాను పొంది, యితరులకు గూడ, తన దివ్యవాక్కుల ద్వారా కల్గించు చున్నాడు. స్థూలమగు జగత్తునందు సూక్ష్మమును, సర్వవ్యాపకమునునగు ఈ యాత్మ సౌందర్యమును దర్శించి వర్ణించు మహాకవులనే, ఋషులని, సమదర్శనులని మిస్టిక్స్ (mistics) అని లేక రహస్యవాదులని, వివిధ నామములతో సాహిత్య వేత్తలు వ్యవహరించు చున్నారు.

సర్వత్ర సమముగ వ్యాప్తమైయున్న చైతన్య సౌందర్యమును తత్తదు పాధులయందు విభక్తమైనట్లుగా, అనగా పరిమితమైనట్లు చూచుటయే ప్రాపంచిక దృష్టి, ఖండ దృష్టి, ప్రాకృతిక దృష్టి, లేక భేద దృష్టియని శాస్త్రములు స్పష్టముగ నిర్దేశించియున్నవి. ఇట్టి ఖండ దృష్టిగల యజ్ఞానులు,

* "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్॥"

** "అవిభక్తంచ భూతేషు విభక్త మివ చస్థితమ్॥"

(భ॥గీ॥ 13-14)

ప్రాకృతిక విషయములయందే రమించుచు ప్రాకృత గుణములగు కామ, క్రోధ లోభాది గుణములచే నావరించబడిన చిత్తముగలవారై, సుఖ-దుఃఖ-మోహాదులకులోనై నిత్యమవిశ్రాంతి ననుభవించు చున్నారు సర్వత్ర సమ దర్శనులగు మహాత్ములు భేదదృష్టిని లేక ప్రాకృత దృష్టిని విడచి, కామ క్రోదాది భావావేగములను నిర్జించి, శుద్ధమైన సాత్త్విక చిత్తముతో సర్వత్ర చైతన్య సౌందర్యమును దర్శించుచు, నిత్య మాత్మరతులై బ్రహ్మానంద మనుభవించుచున్నారు.*

ఈ సత్యమును లోకమునకుపదేశించుచు ముండకోపనిషత్తు ఇట్లు పలుకుచున్నది:-

"సంప్రాప్యైన మృషయో జ్ఞాన తృప్తాః,
కృతా త్మానో వీతరాగాః ప్రశాంతాః।
తే సర్వగం సర్వతః ప్రాప్య ధీరాః,
యుక్తాత్మానః సర్వమేవాఽఽవిశ న్తి॥ అని"

(ముండక॥ఉప॥ 3-2-2)

తా॥ ధీమంతులగు ఋషులు, ఆకాశమువలె బ్రహ్మాది స్తంబపర్యంతము సర్వవ్యాప్తమై సమముగ నున్న ఆత్మచైతన్యమును, కామాది దోషశూన్యమైన సమాహితమగు చిత్తముతో (ప్రజ్ఞానేత్రముతో) దర్శనము చేసి, సర్వస్వ రూపమగు ఆ యాత్మ చైతన్యమునందే ప్రవేశించి బ్రహ్మానందము ననుభవించు చున్నారు. రాగాదిమలములచే మలినముగాని నిర్మలాంతఃకరణులగు, కృతార్థులగు మహాత్ములు, ఇహ-పరలోకములయందలి మమత్వమును పరిత్యజించి, సర్వత్ర సమదర్శనముచే ప్రశాంతమగు చిత్తముగలవారై

---

* (క) సర్వభూత స్థితం యోమాం భజత్యేకత్వమా స్థితః।
సర్వథా వర్తమానోపి సయోగీ మయి వర్తతే॥

(భ॥గీ॥ 6-31)

(ఖ) "సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్।
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి॥

(భ॥గీ॥ 13-27)

సర్వత్ర ఆత్మచైతన్య రూపమైన సౌందర్యమునే దర్శించుచు బ్రహ్మానందము ననుభవించు చున్నారు, అని"

ఇట్టి సమదర్శనము జ్ఞానప్రసాదముచే నిర్మలమైన చిత్తముగల వారికే లభ్యమగునని గూడ ముండకోపనిషత్తు నిర్ద్వంద్వముగ ప్రకటించియున్నది.*

ఇట్టి సమదృష్టి సర్వత్రబ్రహ్మదృష్టిని చెయుట ద్వారానే సాధ్యమనియు,** సర్వత్ర ఆత్మ సౌందర్యమును దర్శించు క్రాంతదర్శి సృష్టిలోని ఏవస్తువును ఈసడించుకొనడనియు,*** సర్వత్ర ఆత్మ యొక్క యఖండ చైతన్యమును దర్శించు మహాత్ముడు, భేదదృష్టి మూలమున సంప్రాప్తములగు శోకమోహాదులకు లోనుగాడనియను ఈశావాస్యోపనిషత్తు వెల్లడించి యున్నది.

ఇట్టి సమదర్శనమును రజస్తమోగుణములచే అభిభూతముగాని, శుద్ధ సత్త్వగుణయుక్తమగు అంతఃకరణముగల యోగిమాత్రమే చేయగలడు, రజ, స్తమో గుణముల ఉద్రేకముగల ప్రాకృత దృష్టిగల వారికిది సాధ్యపడదు

కనుకనే గీతాకారుడు సత్త్వగుణ ప్రధానమైన చిత్తమే సర్వత్రాత్మ దర్శనము చేయుటకు సమర్థమని నిరూపించుచు, అర్జునునకిట్లుపదేశించినాడు:

---

1. "నచక్షుషా గృహ్యతే నాపి వాచా, నాన్యై ర్దేవై (ఇంద్రియైః) స్తపసా కర్మణావా। జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వః స్తతస్తుతం పశ్యతే నిష్కలం ధ్యాయమానః॥"

(ముండక॥ఉప॥ 3-1 8)

2. "ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్॥"

(ఈశా వాస్యము, మం-1)

3. "యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవాఽనుపశ్యతి।
సర్వభూతేషు చాత్మానం, తతోన విజుగుప్సతే॥ (ఈశావాస్య-6)

"యస్మిన్సర్వాణి భూతాన్యాత్మైవాఽభూద్విజానతః।
తత్ర కో మోహః కః శోక ఏకత్వమను పశ్యతః॥ (ఈశావాస్య-7)

"తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశకమనామయమ్।
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ॥ (భ॥గీ 14-11)

సర్వ ద్వారేషు దేహేఽస్మిన్ప్రకాశ ఉపజాయతే।
జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత॥
(భ॥గీ 14-11)

"సర్వ భూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే
అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్॥
(భ॥గీ॥ 18-20)

తా॥ త్రిగుణములలో సత్త్వగుణము నిర్మలమైనది ఐనందువలన స్వచ్ఛమైనది, తత్త్వ ప్రకాశకమైనది, దుఃఖమును కలుగచేయనిది. అది చిత్తమునకు సుఖముతో బాటు జ్ఞానమునుగూడ కలుగచేయుచున్నది (14-6)

తా॥ ఈ దేహమునందుగల సర్వేంద్రియములయందు, జ్ఞాన స్వరూపమైన ప్రకాశము, సుఖమున్నూ ఎప్పుడు అనుభూతములగుచున్నవో యపుడు సత్త్వగుణము వృద్ధిచెంది యున్నదని యెఱుగవలెను (14-11)

తా॥ ఈ విశ్వమున వేఱువేఱుగ కన్పించు సకల వస్తువులలోను, విభక్తమై యున్నట్లు కన్పించు ఆత్మ చైతన్యమును విచ్ఛిన్నముగ గాక, యవిచ్ఛిన్నముగను, ఏకమైనదిగను, వృద్ధ్యపచయాది వికారములు లేని యఖండ భావ స్వరూపముగ చూచుజ్ఞానమే సాత్త్విక జ్ఞానమని యెఱుగుము. అనగా సర్వత్ర సమదర్శనమను అఖండభావము, సాత్త్విక జ్ఞానము వలన మాత్రమే సాధ్యపడును అని ఇట్టి సమదర్శనము, రజస్తమో గుణములచె సభిభూతమగు చిత్తముగల వారలకు* సాధ్యముగాదు.

---

1. (క) పృథక్త్వేనతు యద్జ్ఞానం నానా భావాన్ పృథగ్విధాన్।
వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధిరాజసమ్॥
(ఖ) "యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యేసక్త మహైతుకమ్।
అతత్త్వార్థ వదల్పంచ తత్తామస ముదాహృతమ్॥
(భ॥గీ॥ 18/21, 22)

సర్వత్ర ఆత్మచైతన్య సౌందర్య సందర్శనము నిర్మలమగు బుద్ధి ద్వారానే సాధ్యమని నిరూపించియుంటిమి. సర్వత్ర సమముగ వ్యాపించియున్న ఈ యాత్మ చైతన్య సౌందర్యము, విశ్వములోని యనంత వస్తువుల ద్వారా అభివ్యక్తమగుచున్నను, అది, యా వస్తువులతో నేవిధముగను సంబద్ధము గాక స్వతంత్రమై యున్నది. దాని వలననే సర్వవస్తువులు తమ తమ ప్రకాశముతో ప్రకాశించుచున్నవని యుపనిషద్వచనము.

సర్వత్ర (బ్రహ్మాది స్తంబ పర్యంతము) అణువణువునను, సర్వదేహధారులందును, వ్యాపించియున్న ఆత్మసౌందర్యము దర్శించుటయే కావ్య ప్రక్రియయందును, అధ్యాత్మయోగమునందున్నూ, "శివ దర్శనము". ఇట్టి శివదృష్టి గలవాడే "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"యని యుపనిషత్తులు వర్ణించిన, సత్య స్వరూపమగు బ్రహ్మ సాక్షాత్కారమును పొంద పరమశాంతి ననుభవించును *

ఆత్మ సత్య స్వరూపము. ఆ యాత్మ, తన నిజ శక్తిద్వారా సృష్టి, స్థితి, లయాది కార్య సమర్థమగు 'శివుని' (సగుణ బ్రహ్మమును) సృజించినది. ఆ శివశక్తి ఈ యనంత విశ్వమును సృజించి, తన నిజస్వరూపమును అంతర్యామిగ నీయనంత విశ్వమున ప్రవేశించి దీనిని సక్రియముగను, ఆత్మ చైతన్య రూపమైన సౌందర్య విలసితముగను నొనర్చినది. కనుక ఆ క్రమము నీ విధముగ వర్ణించవచ్చును.-

1. సత్యము, జ్ఞానము, ఆనందరూపమగు ఆత్మ, మూలము.
2. ఆత్మనుండి శక్తియుక్తమైన శివుడు సగుణబ్రహ్మము: సృష్టి, స్థితి, లయ కరణ సమర్థము
3. ఆత్మ చైతన్య విలసితమగు, సుందరమైన ఈయనంతవిశ్వము, సగుణ బ్రహ్మ ద్వారా సృష్టము

---

1. (క) "యో యోనిం యోని మధి తిష్ఠత్యేకో ;
యస్మిన్నిదం సచ విచైతి సర్వమ్।
త మీశానం వరదం దేవ మీడ్యం
నిచాయ్యేమాం శాంతి మత్యంత మేతి॥
(శ్వేతాశ్వతర ఉపనిషత్ 4-11)

(ఖ) "విశ్వస్యైకం పరివేష్టితారం, జ్ఞాత్వా శివం శాంతి మత్యంతమేతి॥
(శ్వే॥ 4-14)

ఇక సాధనాక్రమము ననుసరించి, ఈ యనంత విశ్వమున పూర్వకర్మ వశమున సృజించబడిన జీవుడు, తన చిత్తమును, సత్త్వోద్రేకముచే, శుభాఽశుభ సంస్కార రూపమైన మాలిన్యమునుండి విముక్తమొనరించు కొనును అట్టి యమలినమైన మనస్సుతో ఈ యనంత విశ్వములోని కణ-కణమునుండి తొంగిచూచు లేక ప్రతిఫలించు, ఆత్మసౌందర్యమును లేక చైతన్యమును దర్శించును ఇక్కడ మఱియొక విశేషము: కణ-కణమున (విశ్వములోని) ప్రతిఫలించు శుద్ధమైన ఈ యాత్మ చైతన్యము, తాను ఏ యుపాధి (వస్తువు) ద్వారా ప్రతిఫలించుచున్నదో, ఆ వస్తువు యొక్క అనగా ఉపాధి యొక్క గుణ దోషములతో కొంచెముగూడ సంబంధము లేనిది: స్వతంత్రము; వస్తు పరతంత్రముగానిది కూడ. సూర్యుడు మలినమైన జలములందు, లేక శుద్ధమైన గంగా జలములందు ప్రతిఫలించినను, తన ప్రతిఫలనమునకు ఆశ్రయములగు జలములలోని, "శుద్ధత"తో గాని "యశుద్ధతతో" గాని, కించిత్తుగగూడ ఎట్లు సంబంధించి లేడో, యట్లే యాత్మ చైతన్యముగూడ త్రిగుణాత్మకమైన ఈ యనంత విశ్వమున కంతర్యామియై, విశ్వములోని కణ-కణమునుండి ప్రతిఫలించు చున్నను, ఆ ప్రతిఫలనాశ్రయములగు వస్తువుల గుణదోషములతో ఈషత్తుగ గూడ సంబంధములేక తన నిజస్వరూపమున (శుద్ధ స్వరూపమున) నుండును. ఈ సత్యమును, యోగ, ఉపాసనా, జ్ఞాన, వివేక, వైరాగ్యాదుల ద్వారా తమ చిత్తమును, జన్మాంతరీయములగు వాసనలనుండి, శుద్ధ మొనరించుకొనిన ధీరులు * (ధీమంతులు లేక కవులు) మాత్రమే ప్రజ్ఞా రూపమైన నేత్రముద్వారా దర్శింపగలరు. సర్వత్ర వస్తు సంస్పర్శ శూన్యమైన ఆత్మ చైతన్యము లేక సౌందర్య దర్శనమే, సమదర్శనము. ఇట్టి సమదర్శులగు మహాత్ములు, సగుణ పరబ్రహ్మమునందు, అనగా ఆత్మయొక్క "శివ" స్వరూపమునందు తమ చిత్తమును సమాహితమొనర్చి, "శివ" సాక్షాత్కారము నొందెదరు. ఇట్టి మహాత్ములు శివమైనసమదర్శనసాహాయ్యముతో సత్యజ్ఞానానందాత్మకమగు ఆత్మ సాక్షాత్కారమును పొందుదురు. ఈ యాత్మపద

1. (క) "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షదావృత్త చక్షురమృతత్వమిచ్ఛన్॥"
(కఠ-ఉపనిషత్)

ప్రాప్తియే, శాస్త్రములందు, సత్య ప్రాప్తి, బ్రహ్మ ప్రాప్తి, స్వారాజ్య ప్రాప్తి, స్వాతంత్ర్యోపలబ్ధి, బ్రహ్మ సాక్షాత్కారము, పరమ పదప్రాప్తి, మోక్ష ప్రాప్తి మొదలగు పేర్లతో వర్ణింపబడినది. ఇట్టి పరమ సత్య ప్రాప్తి కొఱకే మానవ జన్మను జీవుడు ఎత్తునని శ్రుతి, స్మృతీతిహాసపురాణాదులు నిర్దేశించి యున్నవి.*

కనుక అధ్యాత్మయోగము,* అనగా, ఆత్మప్రాప్తి కొఱకు చేయు సాధనాక్రమము, సృష్టికి విపరీతముగనుండును. అనగా ఆయా లోకములలో మోక్ష సాధన కర్మమగు ఉపాధులు ధరించిన జీవులు, తాము నివసించు లోకమున రమించు తమ చిత్తములను, తమ లోకదృష్టి నుంచి మఱల్చి యాత్మోన్ముఖము చేయుదురు. ఇది మొదటి సోపానము. ఆ తరువాత, యోగ, వైరాగ్య, వివేకాదుల ద్వారా నిర్మల మొనరించబడిన తమ చిత్తమును, ఈశ్వర ప్రణిధానము ద్వారా, బాహ్య వస్తులోకము నుండి, దివ్యలోకమున ప్రవేశ పెట్టుదురు. ఈ దివ్య లోకమున సాధకుడు శివప్రాప్తినందును, ఈ శివప్రాప్తి యనంతరము, అతడు తన శివాత్మకమైన బుద్ధిని సత్యజ్ఞానానందాత్మకమగు బ్రహ్మమునందు లయమొనర్చి, పరమశాంతిని, తృప్తిని, బ్రహ్మానందము ననుభవించును. దేహ పాతానంతరము, విదేహముక్తి నందును. కనుక, ఆత్మోపలబ్ధికై సాధకుని యధ్యాత్మయోగ సాధనాక్రమ మీ విధముగ నుండును.

మొదటి సోపానము : సుందరోపాసన (ఆత్మ సౌందర్యదర్శనము) ద్వారా తన చిత్తమును దైవోన్ముఖము గావించుట

రెండవ సోపానము : శివోపాసన ద్వారా శివప్రాప్తి (సగుణ బ్రహ్మ సాక్షాత్కారము.

మూడవ సోపానము : ఆత్మ ప్రణిధానము లేక అధ్యాత్మయోగము ద్వారా సత్యోపలబ్ధి లేక ఆత్మ సాక్షాత్కారము. లేక పూర్ణ స్వాతంత్ర్య ప్రాప్తి.

---

* (అ) ఇహచేద వేదీదథ సత్యమస్తి, నచే దిహావేదీ న్మహతీవినష్టిః।
భూతేషు భూతేషు విచిత్యధీరాః ప్రేత్యాస్మాల్లో కా దమృతాభవంతి॥
(కేనోపనిషత్)

ఈ క్రమమునే "సుందరం - శివం - సత్య"మనియును; జగదావిర్భావ క్రమమును : "సత్యం, శివం, సుందర"మనియును తత్త్వవేత్తలు నుడివి యున్నారు.

అస్తు. సర్వత్ర ఆత్మ దర్శులగు మహాత్ములే ఋషులు. వారు సంసారములో నుండియు, సాంసారికములగు వస్తువుల యందలి మోహమును త్యజించి, సాంసారిక వివిధ ప్రలోభనములకు లోనుగాక, సర్వానర్థ మూలములగు రాగ - ద్వేషాదులను దరిచేరనీయక, సాంసారికములగు ఉపాధులలో సంవ్యాప్తమగు చున్నను, వాని గుణదోషములతో నేవిధముగ సంబంధము లేని శుద్ధమగు ఆత్మను సర్వత్ర దర్శించుచు, శివదృష్టి గలవారై, తమ శివాత్మకములగు సంకల్పముల ద్వారాను, లోక కల్యాణ కరములును, దైవప్రీతికరములునగు కర్మల ద్వారాను, సత్య భూషితమైనదియు, మంగళమైనదియునగు తమ భాషమగు వాణి ద్వారా; రాగ ద్వేషములవలనను, అజ్ఞానము మూలమునను, నిరంతర మశాంతితోను, త్రివిధ తాపములతోడను సంతోప్తమగు మానవాళికి, శాంతిని ప్రసాదించుచు, లోకానుగ్రహమును చేయుటకొరకే తమ పవిత్ర జీవితయాత్రను కొనసాగించుచున్నారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్య సాయిబాబా వారి పవిత్ర జీవితమే ఇందుకు నిదర్శనము వారి సంకల్పములు సత్య-శివ, ప్రాపకములు, వారి కర్మలు లోకోద్ధారకములు, నిత్యసుందరములు, పాప వినాశకములు వారి దృష్టులు - త్రివిధ తాపహరములు, శాంతి ప్రదములు, కలుషహరములు. వారి వాక్కులు సత్య బోధకములు, అశివ నాశకములు, శివత్వప్రాప్తి సాధనములు, తత్త్వోపదేశకములు, శ్రుతి మధురములు. వారి హృదయము : సత్య, శివ, సుందరమయము. వారు స్వయముగ చిరంతన సత్య-శివ-సుందరులు వారి యవతారము సత్య-శివ-సుందర రూపమగు ఆత్మ చైతన్యప్రాప్తికి సకల మానవాళికి సుగమమగు మార్గమును నిర్దేశించుట కొరకు ప్రకటమైన నొక దివ్యజ్యోతి. భారతదేశమున నవతారముగ ఋషులనే స్తుతింపబడిన నవతారపురుషులందరు ఇట్టి దివ్యజ్యోతిః స్వరూపులే. ఒక్కొక్క యవతారము ఒక్కొక్క విశేష లక్షణము కల్గియుండును. ఒకటి జ్ఞాన ప్రబోధమును ప్రధానముగ గ్రహించును (దత్తాత్రేయాద్యవతారములు ఇందుకు నిదర్శనము). ఒకటి శాంతిస్వరూపము (గౌతమ బుద్ధాద

వతారములు) మఱి యొకటి ధర్మ ప్రతిష్ఠాపకము (రామకృష్ణాద్యవతారము లు) మఱియొక్కటి శుద్ధప్రేమ స్వరూపము (శ్రీ కృష్ణ శ్రీ చైతన్య మహాప్రభు, భగవాన్ శ్రీ సాయిబాబా, మొదలగు వారలు) ఇట్లే ఒక్కొక్క విశేష లక్షణముతో, ఒక్కొక్క యవతారము లోక సంగ్రహము కొఱకవతరించు చుండును.

అస్తు, కాని, అవివేకులు మాత్రము, ఈ ప్రపంచమునే సత్యమని నమ్మి ప్రాకృతిక వస్తువులలోని వైవిధ్యమునే తాత్త్వికముగ గ్రహించి, సర్వత్ర భేద దృష్టిని, పరిమిత దృష్టిని కల్గి, ఆయా యింద్రియ విషయములను (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులను) సేవించుచు, తమ అనుకూల్య, ప్రాతికూల్యములను, సుఖ దుఃఖముల నాధారముగ చేసికొని, ఆయా వస్తువుల* యందు లేక యుపాధుల యందు రాగ-ద్వేషములు కల్గి, తమ ప్రేమాస్పదులగు వారిని, ధర్మాఽధర్మములతో నిమిత్తము లేకుండగ, ప్రేమించుచు, వారికి సహాయము చేయుచు; తాము ద్వేషించు వారిని, ధర్మాత్ములే యైనను, నాశనము చేయుటకు యత్నించుచు, తాము పతన మొందుటతో బాటుగ, తమకుకృత్యముల ద్వారా ధర్మమునకు, సాధు సజ్జనులకు నీలోకమున నిలువ నీడ లేకుండగ జేసి, ఈ లోకమును దుఃఖ భాజనము గను, అశాంతికి తావలముగను చేసి, జన జీవితమును దుర్భర మొనరించు చున్నారు. ఇట్టి మహాత్ములే యశివ దృష్టి గలవారు. సౌందర్య పరమార్థమును గ్రహింపజాలని యవివేకులు, అసత్య పరాయణులు, స్వార్థ కేంద్రితులు, పరమూర్ఖ మూఢులు, ప్రకృత్యుపాసకులు, ఈశావాస్యోపనిషత్తు భాషలో ఆత్మ హంతలు, అవివేకులు, లేక అసురులు ఈ యసురులు చదువురాని పామరులే యని యనుకొనరాదు లోక దృష్టిలో వారు విద్యావంతులుగ గూడ నుండ వచ్చును, కాని వారు వివేక రహితులుగ నుందురు ఇట్టి యవివేకులు తమకుకృత్యముల ద్వారాను, అపవిత్ర సంకల్పముల ద్వారాను, లోకమును నరకప్రాయ మొనరింతురు వీరి కేవలము ప్రాకృతదృష్టి లేక అశివదృష్టి, లేక భోగదృష్టి వీరే యాత్మహంతలు

---

1. "ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగ ద్వేషౌ వ్యవస్థితౌ।
తయోర్న వశ మాగచ్ఛేత్, తౌహ్యస్య పరిపంథినౌ॥
(భ॥గీ॥)

వివేకులగు మహాత్ముల దృష్టి అప్రాకృత దృష్టి, శివదృష్టి, సత్యదృష్టి లేక త్యాగదృష్టి ఇట్టి మహాత్ములు నిత్యము పరమార్థ పరులుగ నుందురు. వీరి కర్మలు సేవా పరాయణములు, సుఖ-శాంతి సంస్థాపకములు, ఆర్తుల యార్తిహరములు ధర్మప్రతిష్ఠాపరములు.

ఇట్టి వివేకదృష్టి, లేక తాత్త్విక లేక సుందర దృష్టి, మఱియు సమదృష్టిని, భగవాన్ వాల్మీకి సీతారాముల యందును, హనుమద్విభీషణ, త్రిజటాదుల యందును, సముద్ర, మైనాకాదులయందును చాల నిపుణముగ చూపి యున్నాడు.

ఇక యశివ, అసుందర, ప్రాకృత మోహదృష్టులను, తత్ఫలిత ముగ లోకమున నుప్పతిల్లు మహానర్థములను, సామాజిక పతనమును వాల్మీకి లంకేశ్వరుడగు రావణునియందును అతని యనుచరుల యందును చూపి యున్నాడు అందువలన, స్త్రీ పురుషులిద్దర దృష్టి శివాత్మకముగ నుండుట యవసరము ఇట్టి శివాత్మక దృష్టి సత్య-ధర్మ సంయమాదుల పరిపాలనము శీల-చారిత్రాదుల వలనను, విజ్ఞాన-వివేకముల మూలమున మాత్రమే సాధ్యము. ఈ విషయమును సుందరకాండలో రామాయణ కవి, హనుమంతుని యందును, విభీషణుని యందును, సీతా-రామ-లక్ష్మణాదుల యందును చూపియున్నాడు. ఇక యాధ్యాత్మిక దృష్టితో విచారించినపుడు, హనూమత్సీతా విభీషణ. త్రిజటాదుల యందు శివదృష్టిని: రావణ-ఇంద్రజిత్ ప్రహస్తాది. రాక్షస వీరులయందు అశివ దృష్టిని చూపి వారి యశివ దృష్టివలన, వారి పతనమును, హనూమత్సీతాదుల యందు శివదృష్టి యుండుట వలన, సత్యప్రాప్తి రూపమగు ఆత్మ లాభమును, దానివలన పరమశాంతిని రామాయణ కవి కడు నిపుణముగ ప్రదర్శించి యున్నాడు. ఈ విషయమును మున్ముందు విపులముగా చర్చించి తెలిసికొందము గాక! ఇంకొక విషయమును గూడ శ్రోతలకు లేక పఠితలకు మనవి చేయవలసి యున్నది. అది యేమియన, ఈ సుందరకాండలోని పాత్రలను, చారిత్ర చిత్రణ దృష్ట్యా పరిశీలించినను, ఇందలి రామ, హనూమత్, సీతా పాత్రల చిత్రణము కడుసుందరమై తనరారు చున్నది. ఈ విషయము నొక్క సమాలోచనకుడీవిధముగ తెల్పియున్నాడు:-

"సుందరే సుందరో రామ స్సుందరే సుందరః కపిః।
సుందరే సుందరీ సీతా సుందరం సర్వ సుందరమ్॥

అని. కాని ఈ సౌందర్య దర్శనముగూడ, అసుందరమైన వస్తువు లేక చేతన గతమైన అసౌందర్య దర్శనముతో పోల్చి చూచి నపుడు, విశిష్టముగ నుండును. వర్ణ్యగత సౌందర్యబోధ చాల తీవ్రముగ నుండును. కనుక వాల్మీకి సుందరకాండలోని పాత్రల యొక్క చారిత్ర, శీల, ప్రకృతిగతము లు సౌందర్యమును, భావసౌందర్యమును; తద్విరుద్ధ చారిత్ర, శీల ప్రకృతులుగల వ్యక్తుల చారిత్రములను చిత్రించుట ద్వారా అశివ సౌందర్య దర్శన ప్రభావ మును పాఠకుల హృదయమున గాఢముగ ముద్రితమగునట్లు చిత్రించి యున్నాడు. అందువలన సుందరకాండము ద్వారా కవి పాఠకుల నుందుంచిన. నిరుపమము, అద్భుతమునగు ప్రకృతి సౌందర్యముతో బాటుగ; సచేతన ప్రాణి గతములగు సౌందర్య-అసౌందర్యములను; శివ-అశివ దృష్టులను దర్శించి, అసుందర-అశివ పరిత్యాగ, పూర్వకముగ; సుందర-శివ తత్త్వములను సాక్షాత్కరించుకొని, తదనంతరము నిత్య సత్త్య స్వరూపము ను నాత్మనెఱిగి, శాశ్వతానంద ప్రాప్తిని, సుఖ-శాంతుల నొందుదురు గాక. ఈ విషయము ముమ్ముందు సోదాహరణముగ నిరూపించబడగలదు.

## 4. సుందరకాండ కథా వస్తు సంగ్రహము

సుందరకాండలోని కథా వస్తువు :

సుగ్రీవుడు తాను శ్రీరామచంద్రునకు చేసిన వాగ్దానము ప్రకారము, సీతాన్వేషణము కొఱకు నలు దిక్కులకు, వేలాది కపివీరులను పంపెను. వారిలో తూర్పు దిక్కునగల దేశములను వెదకుటకు పోవు వానరవీరులు "వినతు"డను హరియూధపుని నాయకత్వమునను; పశ్చిమ దిక్కును వెదుక బోవు వానరులకు తార యొక్క తండ్రియగు "సుషేణు"డను వానర వీరుని నాయకత్వమునను; ఉత్తర దిక్కునకు బయలుదేరిన వానరులు "శతబలు"డను వానర వీరుని నాయకత్వమునను; దక్షిణదిశకు బయలు దేరిన వానరులు "అంగదుని" నాయకత్వమునను బయలుదేరిరి. వానర రాజగు సుగ్రీవునకు ఈ సీతాన్వేషణ కార్యమును, హనుమంతుడే సాధించునని గట్టి నమ్మక

ముండెను. అందువలన, సుగ్రీవుడు హనుమంతుని ఉద్దేశించి యిట్లు పల్కెను:-

"త్వయ్యేవ హనూమన్నస్తి బలం బుద్ధిః పరాక్రమః।
దేశ కాలాను వృత్తిశ్చ నయశ్చ నయపండిత॥ (4/44/8

(ఓ హనుమాన్, నీవు నయ పండితుడవు, బల, బుద్ధి, పరాక్రమ సంపన్నుడవు. దేశ కాలాను వృత్తిత్వమును, రాజనీతిని ఎఱిగిన వాడవు.

వానర రాజగు సుగ్రీవునికి హనుమంతుని యందుగల కార్యసాధన వినిశ్చయ బుద్ధిని గమనించి, శ్రీరామ ప్రభువు, స్వనామాఙ్కితమగు "అంగరమును" తన వ్రేలినుండి, తీసి యిచ్చి, దీనిని నీవు సీతాదేవికి చూపిన, ఆమె నిన్ను విశ్వసింపగలదు, అని చెప్పెను. హనుమంతు డాయంగులీయకమును శిరముపై నుంచుకొని, శ్రీరామచంద్రునికి, పాదాభివందన మాచరించి, అంగదాది వీరులతో గలసి దక్షిణ దిశకు బయలుదేరి పోయెను. దక్షిణ దిశకు బయలుదేరిన వానర వీరులందరు, దక్షిణ దిశనగల ప్రదేశముల నన్నిటిని గాలించుచు, వింధ్య పర్వతములలోని (మలయ దర్దుర పర్వతశ్రేణి) స్వయంప్రభ గుహను ప్రవేశించి, తిర్గి యామె యోగ ప్రభావమున. దక్షిణ సముద్రపుటొడ్డున గల సహ్య-మలయ పర్వత పంక్తిని చేరుకొనిరి. అక్కడ జటాయువు అన్నయగు "సంపాతి"యను పతగరాజును దర్శించి, యతని వలన. రావణునిచే నపహృతయగు 'సీత" లంకాపట్టణమున బంధించబడినట్లు తెలిసికొని, సహ్య-మలయ పక్తికి సంబంధించిన, సముద్రపుటొడ్డున గల మహేంద్రగిరికి వానరులందరును చేరుకొనిరి ఈ మహేంద్రగిరి నుండి, నూరు యోజనముల, దక్షిణ సముద్రమును హనుమంతుడు, దాటుటకు చేయు యత్నముతో, "సుందరకాండ" కథా వస్తువు ఆరంభమగుచున్నది.

జాంబవంతుని ప్రోత్సాహమున, హనుమంతుడు, మహేంద్ర పర్వతము నుండి ఎగిరి దక్షిణ దిశగా, లంకానగరము దెసకు సముద్రముపై ఆకాశ యాత్రను కొనసాగించెను మార్గ మధ్యమున, సముద్ర గుప్తుడగు మైనాకగిరి సముద్రుని ప్రేరణచే, సముద్ర తలముపైన ఆకసమునంటు నట్లుగ పెర్గి హనుమంతుని, తన యాతిథ్యమును స్వీకరించి, కొంచెము విశ్రమించి ముందు

నకు యాత్రను కొనసాగించ వలసినదని వేడెను. కాని కార్యసాధన యందు విలంబమును సహించని, హనుమంతుడు, తన హస్తముతో ఆ మైనాకుని స్పృశించి. యతనిని సంతోషపరచి తన యాత్రను కొనసాగించెను. దేవతలు, హనుమంతుని శక్తి-యుక్తులను పరీక్షింపనెంచి, "సురస' యను నాగమాతను ప్రేరేపించ, కామరూపిణి యగు "సురస" హనుమంతుని మ్రింగుటకు యత్నింప ఆమెను యుక్తితో నిర్జించి, హనుమంతుడు ముందునకు యాత్ర సాగించెను. అపుడు "సింహిక"యను ఛాయాగ్రాహిణియగు రాక్షసి, ఆకసమునపోవు హనుమంతుని ఛాయ సముద్రముపై పడగ, ఆ ఛాయ నాధారముగ చేసికొని తన శక్తిచే హనుమంతుని భక్షించుటకై, క్రిందికి కాకర్షింపగ, హనుమంతుడామెను పరిమార్చి, త్రికూట పర్వతముపైదిగి, త్రికూట స్థితమగు లంకానగరమును దర్శించెను. అక్కడనే సాయంకాలము వఱకు వేచియుండి, రాత్రివేళ లంకానగరమును ప్రవేశించి సీతాన్వేషణము చేయుటకు నిశ్చయించి, రాత్రి రాగానే, "మార్జార" ప్రమాణమగు శరీరమును ధరించి, లంకానగరమును ప్రవేశింప యత్నించు హనుమంతుని లంకానగరాధి దేవతయగు "లంక" అడ్డుకొనెను. హనుమంతుడు ఆ లంకాధి దేవతను నిర్జించి ఆమె శుభాశంసన ములతో లంకానగరమును ప్రవేశించి లంకలోని ప్రతి యిల్లు తిరిగి, ఆ నగరమున గల ఉద్యానవనములను, రావణుని భవనమును, మొత్తము నాల్గు అంగుళముల నేలనైనను విడువక సీతకై గాలించి యెచటను ఆ దేవినిగానక నిర్విణ్ణుడై పరి పరివిధముల వితర్కించుకొని చివరి ప్రయత్నముగ రావణుని భవన సమీపముననే ప్రాకారావృతమై యితరులకు చొరగాకుండగనున్న "అశోకవనము'ను ప్రవేశించెను. ఆ యశోక వనమున ఒక శింశపా వృక్షముపై ఆ వనమును కాపలాకాయు వారి కగుపించకుండగ నుండుటకై ఆకుల మధ్యమున దాగుకొని స్తంభ సహస్ర యుక్తముగ నిర్మించ బడిన సుందరమగు "చైత్యప్రాసాద" సమీపమున కటిక నేలపై మూర్తీభవించిన శోక దేవతవలె రామునికై విలపించు విరహిణియగు సీతాదేవిని చూచి తన శ్రమ ఫలించి నందులకు వట్టరాని సంతోషమును పొందియు సీతాదేవి పొందు వ్యసనమును రాక్షస స్త్రీలు ఆమెను పెట్టు బాధలను చూచి మనస్వియగు హనుమంతుడు కొంత తడవు విలపించెను. ఆ చెట్టుపైననే ఉండి సీతాదేవి రక్షణకై నియుక్త

మైన రాక్షసస్త్రీల కనుగప్పి యామెతో సంబాషించుటకై తగిన సమయము కొఱకు నిరీక్షింపసాగెను. తరువాత కొంత సేపటికి తెల్లవారుజామున రాక్షసస్త్రీ పరిగతుడైన లంకేశ్వరుడక్కడకు వచ్చి సీతను తన నయగారపు మాటలతో వశపరచుకొనుటకు ప్రయత్నించి విఫలుడై పతివ్రతయగు సీతాదేవి ఆ సందర్భమున పలికిన పల్కులు హృదయ శల్యములై బాధింప కోపమును పట్టజాలక ఆమెకు తనను వలచుటకై రెండు మాసముల గడువునిచ్చి ఈ లోపుగ నామె తన కోరిక నంగీకరింపకున్నచో తన వంటవాండ్రు ఆమెను వధించి తనకు ప్రాతఃకాల భోజనము కొఱకై ఆమె మాంసమును వండి విందు చేయురని బెదరించి విసరుపలాడుచు తన భవనమునకు తిరిగిపోయెను. ఆ తరువాత రావణుని పరిచారికలు ఆమెను రావణుని వాల్లభ్యమంగీకరింపుమని వేధించిరి. రాక్షస స్త్రీల వేధింపును బెదిరింపులను వినిన "త్రిజట"యను రాక్షస కాంత యా రాత్రి తాను చూచిన స్వప్న వృత్తాంతమును ఆ రాక్షస స్త్రీలకు తెల్పి, సీతను రాముడు ఉద్ధరించగలడనియు రావణుని వినాశము లంకా వినాశము తప్పదని పల్కి, సీతను వేధించుట మాని ఆమెను శరణుపొంది తమ ప్రాణములు రక్షించుకొనుమని వారికి సలహా యిచ్చెను. ఆ తరువాత కొంత యవకాశము దైవయోగమున లభించగ, అదియే యదనని భావించి, హనుమంతుడు ఇక్ష్వాకు వంశ కీర్తనము ద్వారా జీవితముపై నిరాశ చెందిన సీత హృదయములో జీవితాశను రేకెత్తించి, తాను రామదూతనని తెల్పి, ఆమె కోరిన మీదట శ్రీరాముని శారీర సంస్థానమును, దివ్య గుణములను కీర్తించి, సీతా వియోగముచే దుఃఖించు రాముని వ్యధను తెల్పి, శ్రీరాముడామెను అచిరకాలములోననే తప్పక యుద్ధరించగలడని యోదార్చి శ్రీరాముడు అభిజ్ఞానముగ తనకిచ్చిన అంగుళీయకము నామెకు సమర్పించెను. ఆ తరువాత సీతాదేవి దైన్యమును చూడజాలక, హనుమంతుడామెను తన వీపున ఆమె యెక్కినచో, వెంటనే యామెను, ప్రస్రవణగిరిపైనున్న రామునివద్దకు తీసికొనివెళ్లి, ఈ లంకా బంధనమునుండి, శాశ్వతముగ విముక్తి గల్గింపగలనని పలుక, తాను పతివ్రతయగుట వలన నామె యందు కంగీకరించజాలక పోయెను. అందువలన త్వరలో శ్రీరాముడే హరిఋక్ష సైన్యములతో వచ్చి, ఆమె నుద్ధరించగలడని పల్కి ఆమె నేదైన అభిజ్ఞానమిమ్మని యడుగ

ఆమె యతనికి తన చీరకొంగున ముడివేసి యుంచిన 'చూడామణి" నభిజ్ఞాన ముగనిచ్చి తాను తన భర్తతో చిత్రకూటమున నివసించు సమయమున జర్గిన కాకాసుర వృత్తాంతమును తన భర్త యొక పరితన గండ స్థలమున, మనశ్శిలా తిలకముంచుట యను ఘటనను గూడ నభిజ్ఞానముగ తెల్పుమని పల్కెను. అంత హనుమంతుడామె వద్ద సెలవు తీసికొని, రావణుని శక్తి సామర్థ్యములను, నగర రక్షణ వ్యవస్థను, రాక్షస సైనిక వ్యవస్థను గూడ తెలిసికొని పోవుటవలనను విక్రమముచే రాక్షసులను భయపెట్టుట వలన, శ్రీరాముని లంకాయుద్ధము (ముందు జరుగబోవు) సులువగుసని భావించి ప్రమదావన పాలనమునకు నియుక్తులగువారిని చావగొట్టి. యా వనమును (అశోక) ధ్వంసము చేయసాగెను. ఈ విషయమును రాక్షస స్త్రీలు రావణునికి తెలుప యతడు హనుమంతునకు కోపించి "కింకరు"లను మహాబలవంతులగు రాక్షసులను హనుమంతుని నిగ్రహించుటకు పంపుటయు హనుమంతుడు వారిని అవలీలగ హతమార్చ ప్రహస్తపుత్రుడగు జంబుమాలిని పంపెను. హనుమంతుడతనిని వధింప బలవంతులగు సప్తమంత్రి పుత్రులను పంపెను. హనుమంతుడు వారిని గూడ పరిమార్చెను. అపుడు పంచసేనాపతులను, పంపగా వారు గూడ యుద్ధములో నిహతులు కాగా తన పుత్రుడును మహాశూరుడును నగు "అక్షుని" పంపెను. అక్షుడు నిహతుడు ఐనట్లువిని హనుమంతుడు ప్రాకృత వానరుడు కాడని భయపడి ఇంద్రజిత్తును పంపెను. ఇంద్రజిత్తు చాల తడవుపోరి యతనిని వధించుట, కానిపని యనియెంచి, యతనిని బంధించుటకై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. బ్రహ్మవరమును బట్టి యతడు బ్రహ్మాస్త్రమున నసువులు బాయక తన కార్యసాధనకై బ్రహ్మాస్త్ర బంధము నంగీకరించెను. ఆ తరువాత అతనిని త్రాళ్ళతో కట్టి రాక్షస సైనికులు రావణుని సమీపమునకు తీసికొనిపోయిరి. అన్యబంధమును బ్రహ్మాస్త్రము సహింపదు గాన బ్రహ్మాస్త్ర బంధము విడిపోయినను, హనుమంతుడు స్వకార్య సాధనకై బద్ధుడుగనే యుండిపోయెను రావణుని,యతడు కొలువుతీరియున్న సమయమున హనుమంతుడు దర్శించి, అతని తేజః ప్రతాపములను చూచి మిక్కిలి ప్రభావితుడాయెను. రావణుడు గూడ హనుమంతుని చూచి వెఱగందెను. అపుడు వాక్య కోవిదుడగు హనుమంతుడు బహువిధముల రావణునికి హితవు

పల్కి, రామునితో విరోధించి జీవింపవలెనని యనుకొనుట, యవివేక మేయని తెల్పి, శ్రీరాముని యొక్క త్రిలోకేశ్వరత్వము నుగ్గడించి యతని భార్యనతనికి తిర్గియిచ్చి లంకను, రాక్షస సమాజమును తన పరివారమును తనను రక్షించుకొనుమని సలహా యిచ్చెను. దానికి రావణుడు అగ్గి సగ్గిలమై యతనిని వధింపుమని యాజ్ఞాపింపగ విభీషణు డడుపడి "దూతవధ" గర్హితము గనుక, రావణుని వంటి శాస్త్ర పండితుఁబట్టి లోక శాస్త్ర గర్హితమగు పనిని చేయరాదనియు కాగా యతనిని వధించిన ఈ సమాచారము శ్రీరామున కందదనియు దాని వలన నతనిని, వధించుట కుమరదుగనుక స్వకార్య సాధనకొఱకైన నితనిని విడిచి పుచ్చుట మంచిదని పల్కి, యతని యపనయమునకు అంగవైరూప్యాదులలో నేదియేని యొక దండమును విధించి, యతనికి తగిన శాస్తి చేయుమని విన్నవించెను. రావణుడు విభీషణుని విజ్ఞప్తిని మన్నించి, క్రోతులకు, తోక యనిన ప్రేమగనుక, యతని తోకకు నిప్పంటించి శాస్తి చేయుమని యాజ్ఞాపించెను. రావణుని పరిచారకులు హనుమంతుని తోకకు నారపీలికలు చుట్టి తెలముపోసి నిప్పు అంటించిరి. అపుడు భీషణమైన అగ్ని ఉవ్వెత్తిల్లెను. ఈ విషయమును రాక్షస స్త్రీలు సీతాదేవికి తెలుప, ఆమె అగ్నిని హనుమంతుని, దహింపక యతనికి శీతలత్వమును, కలుగజేయుమని ప్రార్థింప యామె పాతివ్రత్య ప్రభావమును హనుమంతుని జనకుడగు వాయు దేవునితో తనకు గల మైత్రిని పాటించి, హనుమంతునికి సంతాపమును కలుగచేయఁడాయెను. దానికి సంతోషపడి హనుమంతుడు తన తోక యందు ప్రచండ జ్వాలలతో మండు అగ్నికి సంతర్పణము చేయనెంచి, రాక్షసుల భవనములలో నొక దాని నుండి మఱియొక భవనమున కెగురుచు మొత్తము రాక్షస భవనములనన్నింటిని రుద్రుడు తన నేత్రాగ్నితో త్రిపురమును దహించి వేసినట్లు కాల్చివేసి, సముద్రములో దూకి తన వాలాగ్నిని చల్లార్చుకొనెను. కాని తరువాత సీతాదేవి గూడ ఈ లంకా దహనములో దగ్ధమైనదేమోయని మిక్కిలి భయపడి ఆమెను ఈ యగ్ని దహింప జాలదని తలపోయుచుండగ చారణులు సీతాదేవి తగలబడకుండ సుఖముగ నుండుటను చూచి ఆశ్చర్యపడి యా వృత్తాంతమును అనుకొనుచుండగ విని, యాశ్వస్తుడై తిర్గి యామెను దర్శించి ఆమె వద్ద

సెలవుతీసికొని, యరిష్ట పర్వతముపైన ఎక్కి తిర్గి వాయువేగ మనోవేగ ములతో సముద్రముపైకెగిరి ఉత్తర తీరమును చేరి అక్కడ తన రాకకై నిరీక్షించు అంగద, జాంబవదాద వానర వీరులకు సీతయొక్క క్షేమవార్తను తెల్పి వారి దుఃఖమును పోగొట్టి యా సంతోషముతో దధిముఖునిచే రక్షింప బడు మధు వనమునకు పోయి యతనిని లెక్కచేయక యంగదుని యాజ్ఞపై యదేచ్ఛముగ మధువును వానరులందరు గ్రోలిరి. ఆ వృత్తాంతమును దధిముఖుడు పోయి సుగ్రీవునకు విన్నింప, వారు కార్యము సాధించిరనూహించి వెంటనే వారిని ప్రస్రవణ పర్వతమునకు రావించవలసినదిగ నాజ్ఞాపింప వారం దరు ప్రస్రవణ పర్వతమునకు తరలి వచ్చిరి. అపుడు హనుమంతుడు "సీత" యొక్క క్షేమవారను విన్పించి, ఆమెను "శ్రీ రాముడు వచ్చి శీఘ్రముగ రక్షింపగలడని" తాను పలువిధముల నోదార్చిన విధమును తెల్పి, సీత తనకిచ్చిన చూడామణిని సమర్పించి, ఆమె పడు వెతలను గూర్చ విన్పించి, ఆమె శ్రీరామునికిచ్చిన ప్రతి సందేశమును శ్రీరామునకు విన్పించు టతో ఈ సుందరకాండ ముగియుచున్నది.

### కథావస్తుగత ఆధ్యాత్మికార్థ సంకేతము :

"సుందరకాండ"మను కావ్య ఖండికకు నాయిక, రామవియోగ కర్శితు రాలగు సీత పరమాత్మ స్వరూపుడగు శ్రీరామచంద్రునికి తాత్త్వికముగ అనన్య భూతయగు జీవరూప పరాప్రకృతి.* ఈ పరాప్రకృతి అపరప్రకృతి, అనగా జడ ప్రకృతికంటె వేఱైనది, జీవరూపమున నంతర్యామిగ నుండి సర్వప్రాణుల ప్రాణధారణమునకు తోడ్పడుచున్న పరమేశ్వరుని కాత్మభూత మగు చేతన ప్రకృతి. ఆమె సర్వదా రామనివిష్ట బుద్ధియేయైనను, మాయామృగ దర్శనముచే, తాత్కాలికముగ మాయామోహితబుద్ధి యైనది. ఆ యదను చూచికొని, శరీరేంద్రియ మనో బుద్ధిరూపమగు అపరాప్రకృతి (లంకానగరము)

---

1. "అపరేయ, మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరామ్।
జీవభూతాం మహాబాహో, యయేదంధార్యతే జగత్॥
(భ॥గీ॥7-3)

యందు దృఢముగ నధిష్ఠితుడైన, కామరూపుడగు** లంకేశ్వరుడు (రావణుడు) ఛలముచే రామసన్నిధిని గల సీత నపహరించి, అపర ప్రకృతి రూపమగు లంకలో బలవంతముగ పడవేయును. ఐనను తన మోహము నెఱిగి, దానికి మిక్కిలి వగచి, తన ప్రభువుయొక్క తాత్కాలికమగు వియోగముచే అనంత వ్యధను పొందు, సీతయొక్క వ్యధను, తన తత్త్వోపదేశముద్వారా శాంతింప చేసి, ఆమె చేయు తపమే యామె మోహమును పూర్ణముగ హరమార్చి, తిర్గి రామ సాక్షాత్కారమును కల్గించుటకు సమర్థము, అను, తత్త్వోపదేశమును చేయుటకు సమర్థుడైన తత్త్వద్రష్టయగు హనుమంతుని, ఆ పరమాత్మయే (రాముడే), తన సందేశమును విన్పించుటకు పంపును. సద్గుణ ప్రాప్తి, భగవదనుగ్రహము వలననే కల్గునని, భక్తుల విశ్వాసము. బ్రహ్మనిష్ఠుడును, పండితుడునగు*** హనుమంతుడు సర్వదిశల యందు కామము చేతను, తత్పరివార భూతములగు నాసు గుణముల చేతను, పరివేష్టితయై సంసార సాగర మధ్యమున, నిమగ్నయై, ఆత్మోద్ధరణమునకు తెలివు గానక రామ సాన్నిధ్య ప్రాప్తికై విలపించు, సీతను, రామప్రేరణచే సమీపించి; శ్రీరాముడు ఆమె యనంత దుఃఖమునకు కారణమైన కామరూపుడగు రావణుని, అతని యనుచరులగు అసురులను సమూలముగ అచిరకాలముననే ఉన్మూలనము చేసి ఈ సంసార సాగర మధ్యమునుండి యామెనుద్ధరించి తన యంకమునకు తీసికొని, ఆమెయొక్క వియోగ దుఃఖమును శాశ్వతముగ నివారించి, ఆమెకు స్వసంయోగ* లాభమును, శాశ్వతానంద ప్రాప్తిని ప్రసాదించ గలడని, తన యుపదేశము ద్వారా ధైర్యమును కల్గించుట యను ఆధ్యాత్మికార్థసంకేతమిందు కడు రమ్యముగ నంతర్గతముగ నిరూపించబడినది.

---

2. "ఇంద్రియాణి మనోబుద్ధి రస్య (కామస్య) ధిష్ఠానముచ్యతే।
ఏతైర్విమోహయత్యేష (కామః) జ్ఞాన మావృత్య దేహినమ్॥
(భ॥గీ॥ ౩-4)

3 "యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః।
జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః॥
(భ॥గీ॥ 4-19)

"జ్ఞానేనతు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః।
తేషామాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్॥
"తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః।
గచ్ఛంత్యపు నరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః॥
"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః॥ (భ॥గీ॥ 4-34)

ఇక్కడ సీతాగతమగు రామవియోగ దుఃఖము, పరమాత్మతో వియుక్తులై సంసార సాగర మధ్యమున చిక్కుకొని, కామక్రోధాదుల పీడనము వలన శాంతిని కోల్పోయి పునఃపరమాత్మసంయోగమునకై విలపించు ప్రపంచ విరక్తులును జ్ఞానులునగు జీవులయందలి యనంత దుఃఖమునకు ప్రతినిధి స్వరూపము.

శ్రీరాముడే పరమాత్మ.

హనుమంతుడు, సర్వ సంకల్పవర్జితుడును, జ్ఞానాగ్ని దగ్ధ కర్ముడును పరమేశ్వర కార్యైకరతుడును, పరమాత్మ సాక్షాత్కారమును పొందిన మహాయోగి, బ్రహ్మనిష్ఠుడైన సద్గురువునకు ప్రతీకము.

ఇందలి శ్రీరామ సందేశమే భక్తుల యనంత దుఃఖ నివారకము, కామ మోహాది విధ్వంసనము ద్వారా జీవులకు భగవత్సాక్షాత్కార విశ్వాస జనకము

అట్టి సందేశ శ్రవణము ద్వారా పరమాత్మ వియోగ దుఃఖకర్శితునగు జీవుడు తన యనంత దుఃఖమును త్యజించి, చిరశాంతినందుటయే దీని ఫలము

రామకృప వలననే సద్గురు ప్రాప్తి కల్గునని పల్కుటద్వారా భక్తుల సమాశ్వాసనమే భక్తులకు ధైర్యావహము.

ఈ విధముగ నీ "సుందరకాండ"మను కావ్య ఖండిక సంసార మూలములగు, అవిద్యా కామములను గురువు తత్త్వ బోధ మూలమున నివారించి ఆత్మప్రాప్తిని కల్గించునను ఆధ్యాత్మిక సత్యమును ధ్వనిత మొనర్చుచున్నది.

## 5. సుందరకాండలోని పాత్రల పరిచయము

శ్రీమద్రామాయణ మహాకావ్యమునకు నాయికా నాయకులు సీతా రామ చంద్రులు. ఈ సుందరకాండమునకు గూడ వారే నాయికా-నాయకులు. ఆలంకారిక పరిభాష ననుసరించి ఫలస్వామ్యముగల వారే కావ్యమునకు నాయికా నాయికలుగ నెంచ బడుదురు. ఈ సుందరకాండము రామాయణ మహాకావ్యాన్తర్గతమైన ఒక సందేశ కావ్యఖండిక, పరవర్తి సందేశ కావ్యము లకు మాతృకగూడ, సందేశ కావ్యములందు. పరస్పర వియుక్తులగు నాయికా నాయికల తీవ్ర వియోగ వ్యథ వర్ణనముతో బాటుగ, నాయకుడు, ఒక దూత ద్వారా, విరహిణియగు నాయికను ఓదార్చుచు, తన కుశలవార్తను, ప్రేమ

సందేశమును పంపగా; నాయిక ప్రతి సందేశమిచ్చుట గూడ వర్ణింపబడును. ఈ సందేశము యొక్క ముఖ్య ప్రయోజనము, నాయికా-నాయకులు, వి హ వ్యథతో నిరాశనెంది ప్రాణత్యాగము చేయకుండుట.

సీతా-రాములిర్వురు, రూప, శీల, వయ, చారిత్ర, ధర్మ నిష్ఠలచే పరస్పరమను రూపమగు దాంపత్యము గలవారు. వారి దాంపత్యము, వారి పరస్పర ప్రేమ, సకల లోకముల కాదర్శ భూతము.

శ్రీరాముడు ఏక పత్నీవ్రతుడు. పరస్త్రీని వియోగ కాలమున గూడ కలలోనైన స్మరించని ప్రేమికుడు. రాక్షసేశ్వరుడగు రావణుడు రాముని యందు ప్రతీకార బుద్ధితో, మోసము చేసి సీత నపహరింపగ, ఆమెనే నిచ్చలు స్మరించుచు, నిద్రాహారములు సైతము* త్యజించి, విరహవ్యథతో మనఃస్థైర్యమును కోల్పోయి, అటు-నిటు పర్వెత్తుచు ఉన్మత్తుని పగిది జీవితమును గడపిన మహాప్రేమికుడు.** మహా మనస్వి మహోదాత్తుడు, ధర్మాత్ముడు. మహా పరాక్రమ సంపన్నుడు. సత్యవ్రతుడు. ఆదర్శ ప్రణయి జీవి.

ఇక యతని యర్ధాంగి వైదేహ జనకుని కూతురు సీతాదేవి. మహా ప్రతివ్రత శచీ, లోపాముద్రా-ఒరుంధతీ అనసూయాది మహా ప్రతివ్రతల శ్రేణిలో లెక్కింప దగిన పరమ సాధ్వి, తన పాతివ్రత్య తేజముచే, త్రిలోక విజేతయును, మహా మాయావియు, లంపటుడునునగు రావణుని ప్రణయమును

---

1. "నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోక పరాయణః।
నాన్యచ్చింత యతే కించిత్ సతు కామ వశం గతః॥
"అనిద్రః సతతం రామః సుప్తోపిచ నరోత్తమః।
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతి బుద్ధ్యతే॥
(సుందర॥ 36/43. 44)

2 ఇత్యేవం విలపన్ రామః పరిధావన్వనా ద్వనమ్।
క్వచిదుద్భ్రమతే వేగా త్క్వచిద్వి భ్రమతే బలాత్
క్వచిన్మత్త ఇవా-ఒభాతి కాంతాన్వేషణ తత్పరః॥
(అరణ్యకాండమ్ 60/36)

తృణీకరించుటయేగాక, తాను తలచుకొనిన నతనిని తృటికాలమున భస్మము చేయగలనని తన వృత్తశౌటీర్యము ను నిర్భయముగ ప్రకటించిన పతివ్రతా తిలకము, మమత, వాత్సల్యము, దయ, మనస్వితృము, ఖ్యాత సహజమగు స్వాభిమానము. భక్తి, పెద్దల యందు గౌరవము, మొదలగు సకల స్త్రీ సహజములగు కల్యాణ గుణములకు నెలవు, ఆమె పతిప్రేమ, ఆమెలోని క్షమ, ధర్మానువృత్తి, పవిత్రత, మనస్వితృము, మొ॥లగు సద్గుణములు సకల నారీ లోకమున కాదర్శభూతములు.

పరస్పర వియోగ వ్యధచే పరమ దుఃఖితులగు సీతారామచంద్రుల పరస్పర క్షేమవార్తను వారి కెఱిగించి వారు వియోగ వ్యధచే ప్రాణత్యాగము చేయకుండగ వారిని కాపాడిన పావన చారిత్రుడు, పవన పుత్రుడగు హనుమంతుడు. ఈ మహాత్ముడు రుద్రాంశ సముద్భూతుడు. "కేసరి"యను వానర పుంగవుని క్షేత్రమున వాయుదేవుని యనుగ్రహమున జన్మించిన మహాపరాక్రమశాలి. బ్రహ్మచర్యవ్రతనిష్ఠుడు. సుగ్రీవుని సచివుడు. పరదుఃఖ కాతరుడు. సకల విద్యానిష్ణాత్యుడు. వాగ్మి, మహాపరాక్రమశాలియైనను, గర్వమెఱుగని నిరహంకారి నిర్భయుడు. అణిమాద్యష్టసిద్ధి సంపన్నుడు నిష్కామ కర్మయోగి. రామ సేవాదురంధరుడు మహాబుద్ధిమంతుడు

రావణుడు. ఇతడే రామాయణ మహాకావ్యమునకు, సుందరకాండము నకు ప్రతినాయకుడు లంకేశ్వరుడు వీరస్మయ దూషితుడు కామలంపటుడు. అధర్మాత్ముడు. మిథ్యాభిమాని, అనృతాచారుడు, అసత్యపరాయణుడు. శీఘ్రకోధి పరులగుణోత్కర్షము నెన్నడును అంగీకరించని అసహనపరుడు. త్రిలోకైశ్వర్యలుంటాకుడు. తనకు ప్రతికూలములగు వచనములను, హితకాము లైనను, సహించని మూర్ఖుడు.

విభీషణుడు

ఇతడు రావణునికి సోదరుడు. రాక్షస కులములో పుట్టినను సచ్చారిత్ర సచ్ఛీల సంపన్నుడు. ధర్మాత్ముడు. అధర్మ భయకాతరుడు ఇతడు తన యన్నయగు రావణునితో బాటు, అతని అనయము వలన లంకకు దాపరించు మహానర్థము నుండి, రాక్షస సమూజమును, తత్ప్రభువగు రావణుని సరక్షి

విధముల కాపాడుటకై శాయశక్తుల ప్రయత్నించిన మహాత్ముడు. రాజనీయ వేత్త, అన్యాయమును సుతరాము సహించని న్యాయ పరాయణుడు. హను మంతుడు పల్కిన ప్రియ వచనములు చెవులకు ములుకులవలె నాటగ, క్రోధోద్రిక్తుడై రాజనయ మర్యాదను సైతమావలకు త్రోచి దూతవధ చేయు మని యాజ్ఞాపించిన తన యన్నయగు లంకేశ్వరుని తన బుద్ధికౌశలముతో శాంతింపచేసి, దూత వధరూపమైన అనయము నుండి తప్పించిన రాజనయవేత్త.

ఇక స్త్రీ పాత్రలలో "సీత" తరువాత పేర్కొనదగిన ముఖ్య పాత్ర "త్రిజట" మాత్రమే. ఆమె గూడ ధర్మచారిత్ర. పరదుఃఖ కాతరురాలు. మనస్విని. రావణుని యాజ్ఞచె సీతాదేవిని పలువిధముల బాధించు రాక్షస స్త్రీలకు హితవుపల్కి పరపీడన రూపమగు అధర్మము నుండి వారిని తప్పించుటకు ప్రయత్నించిన సాధు చారిత్ర. తన స్వప్నవృత్తాంతముమ సీతాదేవికి విన్నవించి పతి విరహిణియు, రావణ పీడితయునగు సీతాదేవిని నిరాశా నిర్వేదముల నుండి కాపాడిన పుణ్యాత్మురాలు.

చివరిగా రెండు మాటలు.

"సుందరకాండ"మను ఈ లఘు సందేశ కావ్యఖండికకు నాయికా-నాయకులు సీతారామచంద్రులే యెనను, వారి దివ్యగుణాదివర్ణనము ప్రధానాంశమేయెనను, ప్రతినాయకుని భోగైశ్వర్యాదులను, రాక్షసజాతి నాగరికతను, లలిత కళాప్రీతిని గూడ మనోజ్ఞముగ వర్ణించిన, సుందరకావ్య కళాఖండమీ సుందరకాండము ఇందు రాక్షసవీరుల బల పరాక్రమములు గూడ రోమాంచ జనకమగు శైలిలో వర్ణించబడినవి.

అన్నిటిని మించి ఈ కావ్యకళాఖండమున రామదూతయును, వాయుపుత్రుడును, సుగ్రీవ సచివుడునునగు హనూమంతుని బలపరాక్రమము ఉద్భుతముగ చిత్రించ బడినవి తరువాతి సందేశ కావ్యములలో గూడ సందేశవాహకుని యొక్క సుదీర్ఘ గుణ వర్ణన యెచ్చటను కానరాదు. సందేశ వాహకుడు దూత యొక్క బలవీర్యములను, సకల సద్గుణములను, మహిమలను నాయక తుల్యములుగా వర్ణించుట యీ సుందర సందేశ కావ్య ఖండిక విశేషము. అందువలననే కొందరు భక్తశిరోమణులు దీనిని హనుమద్విజయ కాండమని గూడ నుడువ వచ్చునని అభిప్రాయపడిరి.

# 6. హనుమంతుని లంకాయాత్ర ; తద్విశేషములు

"సుందరకాండ"యందు వాల్మీకి చేతనా చేతనాత్మకమగు పరాఽపర ప్రకృతుల సౌందర్య విశేషములను కన్నులకు గట్టినట్లు చిత్రించినాడు. అపరా ప్రకృతి సౌందర్యము, పరాఽపరా ప్రకృతుల కధిష్ఠాన భూతమగు "ఆత్మ" యొక్క యనిర్వచనీయమగు సౌందర్యగ్రహణమునకు తోడ్పడుటయేగాక, "పరాప్రకృతి" యనబడు జీవుని యొక్క చిత్తమును, జాగతిక వ్యవహారముల నుండి, తప్పించి చిత్తనయనాఽఽహ్లాదకరమగు తన దివ్యసౌందర్యము ద్వారా, అమూర్తమగు సౌందర్య గ్రహణమునకు, తదనుభూతికిని తోడ్పడి, దివ్యలోకమున ప్రవేశించుటకు తోడ్పడుచున్నది. ఇంక, కేవలము భౌతిక దృష్టితో చూచినను, ప్రాపంచిక వ్యవహారములతో విసిగి వేసారిన మానవునికి, మనోవినోదమును కల్పించుటద్వారా యాహ్లాదమును కల్గించుటతో బాటుగ, నతని చిత్తమును ఉదారము గావించుచున్నది మానవుడు మంచుతో కప్పుబడిన శ్వేత పర్వతము యొక్క (హిమాలయము) అత్యున్నత శిఖరములను చూచినపుడు, అతని హృదయము నావరించిన మాలిన్యము మటుమాయమై మిక్కిలి నిర్మలమగుటతో బాటుగ అత్యున్నతమైన భావములతో నిండిపోవును. అట్లే, అపారము, గభీరము నైన, సముద్రమును చూచినపుడు, సహృదయుడు గంభీరముద్రను వహించును. భావనా సాగర తలమును ముట్టుటకు అతని చిత్తమారాటపడును. అందువలననే, వాల్మీకి శ్రీరామచంద్రుని గాంభీర్యమును వర్ణించునపుడు సముద్రముతోను, ధైర్యమును వర్ణించునపుడు హిమనగము తోడను పోల్చును.* కనుకనే వాల్మీకి మొదలుకొని, తరువాత వచ్చిన భారతీయ కవులందరును సుందరమైన ప్రాకృతిక అంచలములలో, మానవ చేతనను ప్రదర్శించి దాని సౌందర్యమును ఇనుమడింప చేసి యున్నారు. సాహిత్యశాస్త్రవేత్తలు ప్రకృతి వర్ణనము ముఖ్యమగు కావ్యవర్ణ్యాంశముగ ప్రతి పాదించియున్నారు కనుకనే ప్రాచీనాలంకారికుడగు దండి "కావ్యము" యొక్క వర్ణ్యాంశములలో, నగర, అర్ణవ, శైల, ఋతు, చంద్రార్కోదయ వర్ణన, ఉద్యాన, సలిలక్రీడా, మధు

1. "సముద్ర ఇవగాంభీర్యే ధైర్యేణ హిమవానివ॥ (రామా 1-1-17)

పాన, రతోత్సవాదులను** గూడ, కావ్య వర్ణ్యాంశములలో ముఖ్యముగ పరిగణించి యున్నాడు. వాల్మీకి రామాయణములోని, ప్రకృతి వర్ణనము, నేటికిగూడ, నిరుపమైనదిగ నెంచబడుచున్న శ్రీమద్రామాయణ మహా కావ్యాంతర్గతమైన "సుందరకాండ"మను సందేశ కావ్యఖండిక యారంభము గూడ, మహేంద్రగిరి వర్ణనముతో నారంభమగుచున్నది. ఇక్కడ మహేంద్ర గిరి ఒక పెద్ద శిలోచ్చయము (రాళ్ళకుప్ప) వలె గాక, ఒక సచేతన ప్రాణి వలె గోచరమగునట్లు వాల్మీకి వర్ణించియున్నాడు. ఇది రామాయణ కవి సౌందర్యశిల్ప విశేషము. మహేంద్రగిరి యొక్క సహజ సౌందర్యముతో బాటుగ, హనూమంతుడు, మహేంద్రగిరి పైననుండి, లంకవైపు వెళ్ళుటకు, నూరు యోజనముల సముద్రమును దాటవలసి యుండుటచే, తన ప్రాణశక్తి నంతయును ఏకీకృతమొనర్చి, బలముగ పాదములతో, ఆ పర్వతమును నొక్కి, కుప్పించి ఆకసములోనికి ఎగిరెను. హనుమంతుడు బలముగ పాద ములతో మహేంద్రగిరిని నొక్కినపుడు, ఆ గిరియందు నివసించు వివిధ ప్రాణిజాతములు భయాందోళనలతో బాటుగ, ఆ పర్వతమునందు, ఆ నొక్కుటవలన కల్గిన, సుందరములును, వికృతములునునగు పెక్కు వికారములను వాల్మీకి యీ సందర్భమున చిత్రించియున్నాడు. నిజముగ నిది రామాయణ కవి ప్రాకృత శిల్ప విజ్ఞానమున కొక మచ్చుతునక. ఈ క్రింది వర్ణనమును చూడుడు:-

మహేంద్రగిరిలోయలు, నలుపు, ఎఱుపు, మాంజిష్ఠ, పద్మ, శ్వేతాది వివిధ వర్ణములతో నద్భుతముగ ప్రకాశించుచు, విమలములగు పెక్కు ధాతువులతో (Minerals or metals) నేత్ర పర్వము గావించు చుండెను. ఆ గిరి తలములందు మత్తవారణములు విహరించు చుండెను. మహేంద్ర పర్వత గుహలయందు, కామరూపులగు యక్ష, కింనర, గంధర్వ, ఉరగాది దేవయోని జాతులకు చెందినవారు, సిద్ధులు, మహర్షులు మొదలగు వారు నివసించు చుండిరి. ఆ పర్వతము, పుష్ప, ఫల, సంభృతములగు వృక్ష వితానములతోను, లతావితతుల తోడను నాచ్ఛాదితమై [illegible]మ్యముగ నుండెను

2. కావ్యాదర్శనము, (శ్లో-16)

TIRUPATI 49714

ఇక హనుమంతుడు మహేంద్రగిరి నుండి పైకెగురుటకై పాదములతో గట్టిగ నొక్కినపుడు కల్గిన హృద్యమగు, వివిధ వికారముల చిత్రణమును పరికింపుడు:-

హనుమంతుడు పాదములతో నొక్కినపుడు మహేంద్రగిరి తీవ్రముగ కంపించెను. ఆ కంపమువలన, ఆ పర్వతము నావరించి యున్న పుష్పితాగ్రములగు వృక్షములు పుష్పవృష్టులు గురిపింప, ఆ పర్వతమంతయు పుష్పరాశి సమాచ్ఛాదితమై పుష్పగిరివలె తోచెను. మహేంద్రగిరి హనుమంతుని పాదాఘాతముచే భూమితో సమానముకాగా, పర్వతము నలుమూలల నుండి జలధారలు ప్రవహింపసాగెను. అన్నివైపులనుండి ప్రవహించు జలధారాయుక్తమగు ఆ గిరి, మదధారలు స్రవించు మత్తగజమువలె దోచుచుండెను. వివిధ వర్ణములు గల వివిధ ధాతువులపైనుండి ప్రవహించు ఆ జలధారలు; కాంచన, రాజత, ఆంజనాది వివిధ వర్ణములు గల్గి, వివిధ రీతులతో నలంకరించబడినట్లు కనురమ్యముగ నుండెను. కపిపాద తీవ్రపీడనము వలన తీవ్రముగ కంపించు మహేంద్రగిరి నుండి విశాలమగు మణిశిలలు విక్షిప్తములాయెను. విశాలములగు మణిశిలలచే నావృతమగు ఆ మహేంద్రగిరి, ధూమరాజీ సమావృతమైన, అగ్నివలె ప్రకాశించు చుండెను. హరిపాదనిపీడితమైన మహేంద్రగిరి, తీవ్రముగ కంపించుచుండగ, ఆ గిరి యందు నివసించు వివిధ సత్త్వములు, భయోత్కంపితములై, వికృత నాదములు చేయసాగెను ఆ పర్వత స్థితములైన పెద్ద పెద్ద సర్పములు, మహా భయముతో, తమ పడగలను విప్పి, ఘోరమైన విషాగ్నులను వెలిగ్రక్కుచు, తమ విషదంష్ట్రిలతో, ఆ గిరిపై గల, పెద్ద పెద్ద బండలను, తీవ్రముగ కాటువేయ సాగెను. సర్పముల విషదంష్ట్రిలతో దష్టములై, ఆ మహాశిలలు, విషాగ్ని ప్రదీప్తములై, ముక్కలు ముక్కలుగా బ్రద్దలైపోవు చుండెను. ఆ మహా సర్పములు, వెదలగ్రక్కు, ఘోరమైన విషాగ్ని జ్వాలలను, ఆ పర్వతముపైన గల, విషశామకములగు ఓషధులుగూడ నివారింపలేక పోయెను. మహేంద్రగిరి యొక్క విశాలమగు శిలలు, ఘోరమగు విషాగ్ని కీలలచే ఘోరముగ మండుచు, సహస్రశః భిన్నములగుట వలన కల్గిన ఘోరనినాదములను, మహేంద్రగిరి తీవ్ర ప్రకంపములను జూచి, ఆ మహేంద్రగిరి, భూతములచే

ప్రబద్ధలు చేయబడుచున్నదేమోయని భయపడి, తమ భార్యలతో సహితముగ విద్యాధరాధిదేవజాతులవారు అక్కడి పానభూమియందు, తమకొఱకై యుంచబడిన, మద్యసంభృతములగు పానపాత్రములును, వివిధ లేహ్య, భక్ష్య, మాంసయుక్తములగు పళ్లెరములను, హిరణ్మయములగు కమండులువు లను, ఆసనములుగ నుపయోగించు ఋషభ చర్మములను, బంగరు పిడికిళు లతో నొప్పు ఖడ్గములను సైతము విడచి తమ మహావిద్యను ప్రదర్శించుచు నాకసములోనికెగిరిరి. రక్తచందనమును శరీరమునందలదుకొనినవారును, రక్తపుష్పహారధారులు, రక్తనేత్రులును ఐన, ఆ విద్యాధరులు తమ తమ భార్యలతోగూడ నాకసమున నిలబడి, ఆ మహేంద్రగిరిని సంభ్రమాశ్చర్య ములతో చూడసాగిరి. హార, నూపుర, కేయూర, కంకణా ద్యాభరణధారు లగు, విద్యాధరులతో బాటుగ, ఆ గిరిపై నివసించు, సిద్ధ, చారణ, మహర్ష్యాదులు గూడ నాకసమునందు నిలబడి ఈ చోద్యమును చూడసాగిరి. ఈ విధముగ, మహేంద్రగిరి సౌందర్యముతో బాటుగ, అందు నివసించు దేవ, మానవ జాతుల వారికి, ఆ పర్వత సందర్శనమువలన నకాలమున కల్గిన భయ సంభ్రమాశ్చర్యాది వివిధ భావముల వర్ణనతో నీ "సుందరకాండ" మారంభ మగుచున్నది.

మఱియొక విశేషయేమియన, హనుమంతుడు మహేంద్రగిరి నుండి సముద్రముపై నెగురునపుడు జర్గిన ప్రాకృతిక ఘటనలతో బాటుగ, సము ద్రముపైన జరిగిన లంఘన ప్రభావమును గూడ చిత్రమయ శైలిలో రామా యణ కవి మనోజ్ఞముగ చిత్రించినాడు. హనుమంతుని సముద్రోల్లంఘన చిత్రమును తిలకింపుడు:-

రామ కార్యార్థము సముద్రోల్లంఘనము చేయుటకు ముందు హను మంతుడు తన శరీరమును పర్వత ప్రమాణముగ పెంచెను. ఇది యతని మహిమ యను సిద్ధికి నిదర్శనము. మత్తవారణ సంకులమై, హరిత పర్ణ సమాచ్ఛాదితములగు వివిధవృక్షములతో తనరారు మహేంద్రగిరిపై నిలబడిన, హనుమంతుడు, మహా హ్రదమున నున్న మత్తవారణమువలె తోచుచుండెను. పర్వతోత్సేధముగల హనుమంతుడు తన రోమములను కంపింప

చేయుచు, తన శరీరమును ఒక్కసారి విదల్చి, వృత్తాను పూర్వియగు తన తోకను ఆకాశములోని కెగురవేసెను. మహా పరిఘసంనిభము గు తన బాహువులను గట్టిగా బిగించి, ఊర్ధ్వకాయము నధశ్శరీరమున ఇముడునంతగా కుంచించి, రెండు పాదములను దగ్గఱగా చేర్చి, తలను నిక్కించి, హృదయ మున ప్రాణశక్తిని కేంద్రీకరించి, నింగిపై దృష్టిని, నిగుడించి, పాదములతో గట్టిగా నాపర్వతమును నొక్కి, మహావేగముతో పైకి ఎగిరెను. అపుడతని యూరువేగోన్మధితములును, పుష్పభార సమృద్ధములునగు మహావృక్ష ములు, తముపైన నున్న మత్తములగు చీకుకొక్కెరలతో సహా పెల్లగిల్లిన వై. దూర దేశమునకు ప్రయాణించు వ్యక్తిని, అతని బంధువులు, కొంత దూరము పంపి గృహోన్ముఖులైన చందమున, ముహూర్త కాలము, మారుతి, ననుగమించెను. సుపుష్పితాగ్రములగు ఆ వనస్పతులు, తన ననుగమింపగా, పైకెగిరిన హనుమంతుడు, సైన్యములు వెంటరాగా, రణరంగమునకు తరలి పోవు మహీపతివలె నుండెను. ముహూర్తకాలము హనుమంతుననుసరించిన సాల-తాలాది వృక్షములు సముద్రములో పడి, మునిగిపోవుచుండెను సము ద్రములో ఈ విధముగ మునిగిపోవు నగరాజములు, మహేంద్రుని కులిశ ప్రహారములకు వెఱచి సముద్రములో దాగుకొనుచున్న గిరుల చందమున తోచు చుండెను. కపిగమనోత్పన్నమైన మహావాతము యొక్క తాకిడి వలన, రాలిన పుష్పములతో నాచ్ఛాదితమైన నీల సముద్రము, తారాచితమగు వ్యోమ తలమువలె తోచు చుండెను హనుమంతుడు సముద్రముపైన మహా వేగముతో నాకసములో నెగిరి పోవుచుండగ, సముద్రోపరితలమున, నే ప్రదే శము మీదుగ పోవుచుండెనో, యా ప్రదేశము విక్షుబ్ధము కాగా, సముద్రము నుండి పెద్ద పెద్ద కెరటములు లేచి, యాకసము నొరయుచుండెను. ఆకసము నంటు ఆ తరంగములను, హనుమంతుడు తన ఱొమ్ముబలముతో విచ్ఛి న్నము చేయుచు ముందునకు పోవసాగెను హనూమదంగ ప్రతిహతమగు వాయువు, మేఘవాతము, అను ఈ రెండు వాతములూ, కలసి సముద్రమును కలుగుడు పడునట్లుచేయ, సముద్రము నుండి భీకరమగు హోరు విన్పింప సాగెను. హనుమంతుని యంగవేగోన్మధితమైన సాగరము నుండి, మేరు మందర సమములగు పెద్ద పెద్ద కెరటములువెలువడుగ లేచు చుండగ, వానిని

లెక్కించుచున్నట్లుగ వాని మధ్యగుండ నతడు పోవుచుండెను. సముద్రము నుండి నింగికిలేచిన, మహోన్నతములైన కెరటములు మేఘ మండలమును తాకగ, ఆ మేఘముల నావరించిన కెరటములు, శరత్కాలీన మేఘముల పిండువలె తెల్లగా మెఱయు చుండెను. హనుమంతుని శరీర నిర్గతమైన వాయువుచే, సముద్రము పాయలు పాయలుగా చీలిపోవుచుండగా, సముద్రాంతర్లీనములగు, తిమి, నక్ర, మత్స్యాది జల జంతువులు, వస్త్రాప కర్షణముచే బయటపడిన అంగము వలె, బట్టబయలు కాజొచ్చెను. నింగికి లేచు మహాకెరటములను త్రోసికొనుచు ముందునకు హనుమంతుడు మహా వేగమున పోవుచుండగ అతని వెన్నంటిన కెరటములు, శ్వేత మేఘ పంక్తివలె గనట్టుచుండెను. సముద్రపు మహోన్నత తరంగముల మధ్యగా ముందునకు కొనసాగు హనుమంతుడు పెనుగాలిలో చిక్కిన మహా నౌకవలె దోచుచుండెను. అతని యంగోద్భూతమైన మహావాతము తాకిడికి సముద్రము దొప్పవలె నాయెను. ఈ విధముగ హనుమంతుని యంగసముద్భూతమైన వాతము వలన సముద్రములో కల్గిన పలు వికారములను లేక మార్పులను, రామాయణ కవి కడు సహజము ను, సుందరముగను చిత్రించినాడు.

ఇక హనుమంతుడు, లంకను చేరుటకై యాకాశమార్గమున చేసిన యాత్రావర్ణన సందర్భమున, అతని యాత్రకాధార భూతమైన ఆకాశమును గూడ, రామాయణకవి, విలక్షణమును, భావ నిగూఢమునైన శైలిలో వర్ణించి యున్నాడు ఈ క్రింది యాకాశ చిత్రణమును దర్శింపుడు:-

"జలధారాజుష్టము, పతగనిషేవితము, గాన విద్యాచార్యులగు గంధర్వాదులసంచారబహుళము. ఐరావతసంచారశోభితము, సింహ కుంజర, శార్దూల, పతగ, ఉరగాది వాహన సంచారయుక్తము; మహా పుణ్య ఫలముగ స్వర్గమునలంకరించిన పుణ్యాత్ములధిరోహించిన దివ్య విమాన సమలంకృతము. యజ్ఞ యాగాది మహాక్రతువులందు, యజమానులర్పించిన హవ్యములను, దేవతల సంనిధికి గొంపోవు హవ్యవాహనునికి మార్గభూతము; గ్రహ, నక్షత్ర, చంద్ర సూర్య, తారాగణ ప్రదీప్తము, సిద్ధ, ఋషి, గంధర్వ, నాగ, యక్ష సమాకులము, వివిక్తము, విపులము, సకల జగదా శ్రయ భూతము, గంధర్వరాజగు విశ్వావసువున కావాస భూతము, దేవరాజ

గణ సమాక్రాంతము చంద్ర-సూర్యుల మంగళమయి మార్గము; బ్రహ్మచే జీవలోకముపై గప్పుటకు నిర్మించినట్లగ నున్న చాందనీ వస్త్రరూపము, వీరపురుష గమ్యము, విద్యాధర సంకులమునైన ఆకాశమార్గమున హనుమంతుడు ప్రయాణించెను. ఆకాశమును మహా శూన్యముగ గాక, జీవలోక వితానముగను, సర్వదేవతల కావాసస్థానముగను, సర్వలోక సమాశ్రయముగను, హవ్యవాహునికి మార్గభూతముగను, చంద్ర, సూర్య, గ్రహ, తారాగణాది దీప్తి ద్యోతితముగను, యుద్ధమునతనుత్యాగము చేసిన వీరులకు గమ్యముగను, స్వర్గ సాధన భూతములగు వైదిక కర్మలననుష్ఠించిన యజమానుల సుకృతముల ఫలముగను, ఆకసమును దర్శించిన, వాల్మీకి కవి దివ్య దృష్టియు, అతని మంజుల శిల్పమున్నూ నిజముగ, నాన్యతో దర్శనీయములు శిల్ప విన్నాణమునకు నెలవులు.

## ఈ యాత్రలోని మఱికొన్ని విశేషములు :

హనుమంతుడు రామకార్యార్థమై తనపై వొపు చుండుటను గమనించి, ఇక్ష్వాకు వంశజ పరివర్థితమును, ఇక్ష్వాకు కులమానార్థియునగు సముద్రము, తనలో నిగూఢముగ వసించు మైనాకగిరిని, రామ కార్యార్థమై, సముద్రము నుల్లంఘించు, హనుమంతుని కాతిథ్యమొసగి సత్కరించుటకై, ప్రేరేపించెను. తనకాశ్రయ మొసగిన సముద్రుని మాటను మన్నించుచు మైనాకుడు, సముద్ర జలమును ఛేదించుకొని, మేఘమాలను ఛేదించి నింగిని వెల్గు దివాకరునివలె, నొక్కపరి సముద్రతలము పైనుండి నింగిమీఱ కెదిగెను. నానాలతా, గుల్మ, వృక్షాది సమాచ్ఛాదితమును, కింనరోరగాది వివిధ దేవయోనుల కావాసభూతమును, ఉదయ కాలీన సూర్యునివలె, సౌవర్ణకాంతి పుంజముల నీను శాతకుంభ మయములగు శిఖరములతో నొప్పు యాగిరి చాల మనోజ్ఞముగ నుండెను. అప్రతర్కితముగ తన మార్గమున కడ్డుగనిల్చిన మహోన్నతమగు మైనాకగిరిని చూచి, ఇది తన యాత్రకు విఘ్నమును కల్గించుటకై యిట్లు నిల్చినట్లు భావించి, మహావేగ యుక్తుడగు మారుతి, జలధరమును పెనుగాలివలె. తన యురముతో బలముగ తాకెను. ఆ తాకిడి వలన నతని గమన వేగమును గమనించిన మైనాకగిరి మిక్కిలి మోదమందెను. మానుష రూపమున తన శిఖరముపై నిలబడి హనుమంతుని కిట్లు పల్కెను:-

హేహనుమ, నీవు ఉరముతో నన్నుతాకి మహత్తరమగు వీర్యమును ప్రదర్శించితివి. నా శిఖరములయందు కొంత తడవు విశ్రమించి, నీయాత్ర సశ్రమముగ కొనసాగింపుము. అది నీకు న్యాయము. అందుకు కారణములను వినుము:-

రాఘవ వంశోత్పన్నులగు మహారాజులు (సగరపుత్రులు) సముద్రమును వృద్ధిచేసిరి. అందువలన తత్కుల ప్రసూతుడగు శ్రీరామునియొక్క కార్యార్థమై లంకకు పోవు నీకు, సముద్రుడు ఆతిథ్యమొసగి వారిపట్ల తన ప్రత్యుపకార భావమును ప్రకటించుటకై నన్ను నీ యతిథ్యమునకై ప్రేరేపించినాడు. ధర్మకోవిదులు గూడ, ఉపకారులకు ప్రత్యుపకారము* చేయు ఆచారము సనాతనమని నుడువుచున్నారు. ఇక నేను గూడ మీకు ఋణపడియున్నాను. ఎట్లందువా, పూర్వము కృతయుగమునందు పక్షులకువలె పర్వతములకు గూడ తెక్కలుండెడివి. అవి, గరుత్మంతుని వలె నలుదిశల నెగురుటనుచూచి, అవి యెక్కడ తమపై పడునోయని సకల భూతములు మిక్కిలి భయమునందెను. అదిచూచి, శతక్రతువగు ఇంద్రుడు తన వజ్రాయుధముచే వాని తెక్కలు నరుకసాగెను. నాతెక్కలు గూడ నరుకుటకు దేవేంద్రుడుద్యమింపగ, నీ తండ్రియగు వాయుదేవుడు నన్నీలవణ సముద్రమున విసరివేసి కాపాడినాడు. "ఆత్మా వై పుత్ర నామాఽసి"యను వేద వచనము ననుసరించి, అతని యాత్మజుడవగు నిన్ను అర్చించిన నీ తండ్రిని పూజించినట్లేయగును. అందువలన నిన్ను పూజ చేయుటచే నేను గూడ కృతార్థుడను అగుదును, అని

అపుడా గిరివరునకు కపిప్రవరుడిట్లనెను:-

"నీ ప్రియ వచనములకు నేను మిక్కిలి యానందించుచున్నాను. నీవు నీ ప్రియవచనములతోనే నాకాతిథ్యమొసగితివి. ఇక వేఱు యాతిథ్యమవసరములేదు. నేనాతిథ్యమును అంగీకరించిలేదని నాపై కోపింపకుము. కార్యత్వరను బట్టి నేనెక్కడను విశ్రాంతి తీసికొన జనదు. ప్రొద్దుగ్రుంకబోవు

1. "కృతేచ ప్రతి కర్తవ్య యేషధర్మ స్సనాతనః"॥

(సుందరకాండ 1/113)

చున్నది నేను తోటి కపివరుల కిచ్చిన వాగ్దానము ననుసరించి యాత్ర మధ్యలో విలంబము చేయరాదు, అని పల్కి అతని యాతిథ్యాంగీకార సూచకముగ, తన పాణితలముతో నతనిని స్పృశించి ముందున కాకస మార్గమున తన యాత్రను కొనసాగించెను. అతని యీ వీర్యకర్మను సుర, సిద్ధ, మహర్ష్యాదులు మిక్కిలి ప్రశంసించిరి. హనుమంతునిపట్ల మైనాకుడు చూపిన యాదరమునకు సహస్రాక్షుడు మిక్కిలి సంతోషించి, అతనికి వజ్రపాత భయము లేకుండగ నభయమొసగెను.

అపుడు దేవ, గంధర్వ, సిద్ధ, మహర్ష్యాదులు, హనుమంతుని బలమును తెలిసికొనదలచి, నాగమాతయగు "సురస"ను హనుమంతుని బలమును పరీక్షింప ప్రార్థించిరి. ఆమె గూడ వారి ప్రార్థనను మన్నించి సుఘోరమును, సువిపులమును నగు ఆకృతిని ఆవహించి, దంష్ట్రాకరాళమగు తన వక్త్రమును తెఱచికొని హనుమంతుని మ్రింగుటకై, సముద్రాకాశముల మధ్య నిల్చి హనుమంతునితో నిట్లనెను:- "దేవతలచే ఇన్నినాళ్లకు నీవు, నాకాహారముగ ప్రసాదింపబడితివి పూర్వము బ్రహ్మగూడ నాకావరము ఇచ్చినాడు. నిన్ను భక్షించి నాయాకలి తీర్చుకొందును. నా ముఖమున ప్రవేశించి నా యాకలి తీర్పుము," అని

అపుడామెకు హనుమంతుడిట్లనెను:-

"దశరథుని పుత్రుడగు శ్రీరాముడు తన భార్యయగు సీతతోడను, భ్రాతయగు లక్ష్మణుని తోడను దండకలను ప్రవేశించినాడు. రాక్షసులతో బద్ధవైరుడగు రామునికి ప్రతీకారము చేయు బుద్ధితో అతని భార్యను రావణుడు అపహరించినాడు. నేను రామశాసనమున, రాముని దూతగ లంకకు పోవుచున్నాను. అతని దేశ నివాసినివగు (రామునియొక్క) నీవుగూడ రామునికి సాహాయ్యమాచరించుట యుక్తము. అట్లు ఒప్పుకొనవేని, నేను లంకలో నున్న సీతను చూచి, రాముని సందేశ మాయమ్మకిచ్చి, ఆమె ప్రతిసందేశమును శ్రీరామునికి విన్పించిన తత్క్షణమే తిర్గి నీ యొద్దకు వచ్చి, నీకాహారమగుదునని వాగ్దానము చేయుచున్నాను, అని. కాని ఆమె యందుల

కోప్పకొనిక, నాకు ధాతయిచ్చిన వరము ప్రకారము నా ముఖగహ్వరములో ప్రవేశించిన పిదపనే వెళ్ళుటకు వీలగునని పల్కి, విశాలమగు తన ముఖమును పది యోజనముల వఱకు పెంచి మార్గమున కడ్డముగ నిల్చెను. అది చూచి హనుమంతుడు తన కాయమునగూడ పది యోజనములు పెంచెను. అపుడామె తన ముఖమును ఇరువది యోజనములు పెంచెను. అపుడామెపై కోపించి హనుమంతుడు తన శరీరమును ముప్పది యోజనములకు పెంచెను. ఈ విధముగ ఆమె తన ముఖమును, ఎన్ని యోజనములు పెంచిన, హనుమంతుడ తకు పది యోజములు తన శరీరమును పెంచుచూ పోవసాగెను. ఇట్లు, ఆమె నూరు యోజనముల వఱకు తన ముఖమును పెంచగా, హనుమంతుడా యిపను చూచికొని, "అణిమ"యను మహిమనాశ్రయించి తన కాయమును అంగుష్ఠ మాత్ర ప్రమాణముగ తగ్గించి, ఆమె ముఖములోనికి వేగముగ దూరి, తిర్గి మహావేగముతో నింగికెగసి, ఆ దాక్షాయణి (సురస)తో నిట్లు పల్కెను? ఓ దాక్షాయణి, నీకు నమస్కారము. నీవు కోరిన ప్రకారము నీ ముఖమున ప్రవేశించితిని. నీకు ధాతయిచ్చిన వరమును సత్యము గావించితిని. నా త్రోవన నేను పోవుచున్నాను, అని. అపుడతని కార్యకౌశలమును ప్రశంసించి, నీకు కార్యసిద్ధి కల్గుగాక, యని యామె యాశాసించెను. సకల భూతములు హనుమంతునికి సాధు వాదములు పల్కుచుండ హనుమంతుడు తన యాత్రను ముందునకు కొనసాగించెను. ఆకసమున నెగురుచు లంక దెసకు ప్రయాణించు హనుమంతుని చూచి "సింహిక" యను రాక్షసి, చిరకాలమున కింత మహా సత్త్వము తన కాహారముగ దొరికినందులకు, మిక్కిలి సంతోషమందుచు హనుమంతుని మింగివేయుటకై యతని ఛాయను గ్రహించి అతనిని తన్మూలమున క్రిందికి లాగసాగెను. హనుమంతుడు ఈ విధముగ ఛాయా గ్రహణముద్వారా తనను క్రిందకులాగు భూతమేమిటా యని నలుదిశల పరికించి చూచి సముద్ర తలమున నున్న భీషణాకృతిగల సింహికను చూచెను. తనకు పూర్వము వానర రాజగు సుగ్రీవుడు తెల్పిన, ఛాయా గ్రాహియును, మహావీర్యముగల సత్త్వమిదియేయని తెలిసికొని ప్రావృట్కాల జలదము వలె హనుమంతుడు తన శరీరమును పెంచసాగెను. అతడెంత పెంచిన, సింహిక తన వక్త్రమును నంత పెద్దది చేయసాగెను. ఈ విధముగ సింహిక తన వక్త్రమును బాగుగ పెంచిన తరువాత, మహా

మేధావియు వజ్రాంగుడునగు హనుమంతుడు, ఆమె వికృతమగు ముఖమును, కాయమును, మర్మములను బాగుగ దర్శించి, తన శరీరమును మిక్కిలి సంక్షేపించి, సింహిక యొక్క ముఖగహ్వరములోనికి దుమికి, తన వాడియగు గోళ్ళతో ఆమె మర్మఛేదనము గావించి తిరిగి మనోవేగముతో నింగికెగిరెను. హనుమంతునిచే, చీల్చబడిన హృదయముగల సింహిక మిక్కిలి విహ్వలతనొంది, క్రిందికొరిగెను. ఈ విధముగ సింహికను హనుమంతుడు పరిమార్చగ ఆకాశవాసులతని వీర్యమును ప్రశంసించుచు ఇట్లు పల్కిరి:-

"యస్యత్వేతాని చత్వారి వానరేంద్ర యథాతవ।
ధృతి, ర్దృష్టి, ర్మతి, ర్దాక్ష్యం, స, కర్మసు, నసీదతి॥
(సుం॥కాం॥ 1-201)

తా॥ ఓ వానరేంద్ర, నీవలె, ఎవ్వరు, ధైర్యము, దూర దృష్టి, సూక్ష్మ బుద్ధి, కార్యదాక్ష్యము అను నాల్గు గుణములను కల్గియుందురో వారు కార్యకాలమున వ్యథనొందరు, అని.

ఈ విధముగ నాకాశవాసుల ప్రశంసలనందు కొనుచు, మహాబలియగు మారుతి, మొగలి పొదలతోను, వికిగి, కొబ్బరి మొ॥లగు వివిధ వృక్షములతో సమావృతమును, విచిత్ర కూటమును, సముద్రమునకు, ఉత్తర తీరమునందును గల త్రికూటపర్వత శిఖరములపై దిగెను.

హనుమంతుడు మహావేగముతో త్రికూటశిఖరములపై దిగినపుడు, ఆ శిఖరములపైగల వివిధ పుష్పవృక్షములు రాల్చిన పుష్పరాశులతో కప్పబడిన హనుమంతుడు "పుష్పగిరి"వలె నేత్ర పర్వము గావించుచుండెను ఆ త్రికూట పర్వతతలమునగల సముద్రతటమున నీలవర్ణముగల పచ్చిక బయళ్లు చాలదూరము వఱకు వ్యాపించి చాల ముదము గూర్చుచుండెను. అక్కడగల పుష్పభారసంఛన్నములగు వృక్షములు, లతావితానములు మిక్కిలి రమ్యముగ నుండెను, ఆ త్రికూటప్రత్యంతపర్వతములుగూడ సౌందర్యమును ఒలకపోయు చుండెను.

# ౯. లంకానగర వాస్తు కళా సౌందర్యము

మహేంద్ర, త్రికూటగిరి సాగర, ఆకాశాదుల మనోజ్ఞమగు ప్రాకృతిక సౌందర్యదర్శనానంతరము, త్రిలోక వైభవమునకు, మనోజ్ఞ శిల్పకళా నైపుణ్యమునకు మచ్చుతునకయని చెప్పదగిన లంకానగరసౌందర్యమును గూడ తిలకింపుడు. ఈ నగర సౌందర్యమును గాంచి, హనుమంతుడు గూడ నెంతయో ముగ్ధుడైనాడని రామాయణ కవి వర్ణించి యున్నాడు. ఈ సుందరకాండయను మహామంత్రమునకు ద్రష్ట హనుమంతుడు. అతడాజన్మ బ్రహ్మచారి ఋషి. ఇక యందలి సౌందర్య ద్రష్టగూడ యతడే. ఇది మంత్రము యొక్క విశేషము ఆత్మనిష్ఠుడగు ఋషియే ఆత్మసౌందర్యమును సర్వత్ర దర్శింపగలడు. మంత్రములను గూడ నతడే దర్శింప సమర్థుడుగ నుండును, ఋషి గానివాడు మంత్ర దర్శనము చేయజాలడు; సర్వత్ర సమముగ వ్యాప్తమైన చైతన్య సౌందర్యమును గూడ దర్శింపజాలడు.

అస్తు, హనుమంతుడు శతయోజనముల విస్తీర్ణమగు సముద్రమును అవలీలగదాటి, లంకానగరోపకంఠమున దిగి, నీలవర్ణములగు పచ్చిక బయళ్లను, మకరంద సంభృతములును, సురభిళములునగు వివిధ వర్ణముల పుష్పములతో నొప్పు వృక్ష, గుల్మ, లతాదులను, అక్కడ త్రికూట పర్వతోపకంఠమున చూచి పరమానందపడెను. అతడాయుత్తర తీరమున వ్యాప్తములగు విశాల కానన శ్రేణులను చూచుచు, దట్టములగు వృక్షషండముల మధ్యగా నడచుచు, త్రికూట శిఖరని సమీపించి, త్రికూటోపరితలమున నిర్మించబడిన లంకానగరిని చూచి యాశ్చర్యమున మునిగిపోయెను. ఆ నగరమును నిర్మించిన శిల్పి విశ్వకర్మ. పాండుర వర్ణములగు మహాభవనములతో నొప్పు, ఆ లంకానగరము అనంతమగు ఆకాశసాగరమున నీదు చున్నట్లగుపించు చుండెను. ఆ పర్వత తటమున నిలబడి, హనుమంతుడు, పీతదారు, కర్ణికార వృక్షములను, పుష్పసమృద్ధములగు ఖర్జూర వృక్షములను, ప్రియాల, ముచులింద వృక్షములను, సుగంధముల నీను పిప్పరి చెట్లను, కదంబ, సప్త పర్ణ వృక్షములను, ఎఱ్ఱ కాంచనపు చెట్లను, కన్నులకు విందుచేయు, సుపుష్పితములగు కర్ణికారముల సు కేతకీ, గిరి మల్లికాది వివిధ లతా నికుంజ

ములను, ఇంకనూ పుష్ప-ఫల చార సమృద్ధములును, మొగ్గలు తొడిగినవి యును, వివిధ విహగ కూజిత నినాదితములును, మందమారుత ప్రకంపితాగ్ర ములునగు వివిధ వృక్షముల నానగరమున చూచెను. ఇంకను అతడక్కడ హంస-కారండ వాది వివిధ జలపక్షి నిషేవితములను, పద్మోత్పలాది సంఛన్నములును, నిర్మలములగు జలములతోడను నిండియున్న పెక్కు వాపీ కూప పుష్కరిణీ తటాకాది జలాశయములను, క్రీడోద్యానములను గూడ చూచెను. అక్కడ గల యుద్యానవనములు, సర్వర్తు ఫలపుష్ప సమృద్ధములగు వృక్ష సంతానములతో నిండి. ద్రష్టకులకు కనువిందు చేయుచుండెను.

ఇక యా నగరి వాస్తు సౌందర్యమప్రతిమము. ఆ నగర సోయగ మును తన మనోనేత్రముతో దర్శించిన రామాయణ ఋషి గూడ మిక్కిలి యాశ్చర్యమున మునిగి యుండును. విశ్వకర్మ నిర్మితమైన లంకానగరిని ఒక సుందర స్త్రీతో పోల్చుచు, భావుకశేఖరుడగు రామాయణ కవి చిత్రిం చిన ఈ సుందర చిత్రమును దర్శింపుడు:-

'వప్ర ప్రాకారజఘనాం విపులాంబు వనాంబరామ్।
శతఘ్నీ శూలకేశాంతా మట్టాలక వతంస కామ్॥
మన సేవ కృతాం లంకాం నిర్మితాం విశ్వకర్మణా'
(సుం॥కాం॥ 2/23)

తా॥ ప్రాకార వేదికా రూపమైన విశాల జఘనముతో నొప్పుచున్నదియు, విపుల, సాముద్ర జల, వనరూపమైన చీరలు ధరించినదియు, శతఘ్నిశూల రూపములగు కురులు కలదియును, అట్టాలక (కోట బురుజు, లేక గృహ విశేషము) రూపములగు కర్ణభూషణములను ధరించినదియు నగు లంకా నగరిని, విశ్వకర్మ తన చేతులతో గాక మనస్సుతో నిర్మించి యుండునన్నట్లని పించుచుండెను. ఏలయన చేతులతో నిర్మించిన సుందరి, ఇంత సర్వాంగసుందర ముగ నుండ జాలదుగదా! లంకానగరిని, రూపకాలంకార సహాయముచే నొక చైతన్యయుక్తమగు సుందరిగా చిత్రించి రామాయణకవి దర్శకుల సౌందర్య సంవేదనా శక్తిని తీవ్రతరము గావించినాడు. నిజముగా నీ సుందర చిత్రము వాల్మీకి యొక్క సూక్ష్మ సౌందర్యావబోధకు పటుతర నిదర్శనము. హను మంతుడు సీతాన్వేషణార్థమై రాత్రివేళ లంకలో ప్రవేశించి, తన్నగర సౌందర్య

మును. చూచి, చాల ముగ్ధుడాయెను. ఈ సందర్భమున కవి నగర సౌందర్య మునతో బాటుగ నగరవాసుల భోగభాగ్యములను, కళాప్రియత్వమును, నగర రక్షణవ్యవస్థనుగూడ, కన్నులకు గట్టినట్లు చిత్రించినాడు.

లంకా నగరము, పద్మోత్పల సంఛన్నమై. అగాధ జలసంభృతమైన అగడ్తచే పరివృతమై యుండెను. దాని చుట్టు సువర్ణ ప్రాకారముండెను. ఆ నగరమున, శరత్కాల మేఘములవలె తెల్లగానున్న, ఉత్తుంగ విశాలములగు ఆకసమునంటుచున్న, సాప్తభౌమ (ఏడంతస్తుల), అష్టభౌమములగు హర్మ్యములుండెను. సుధా ధవళితములైన నచటి విమానగృహ పంక్తులు, సౌవర్ణములగు గవాక్షములు, బహిర్ద్వారములు, ప్రధాన ద్వారములును కల్గి, చూపరులకు మిక్కిలి యాశ్చర్యమును గొల్పుచుండెను. పాండురోన్నత హర్మ్యములు గల ప్రతోళికలు (రాజవీదులు); లతా నికుంజములు; చంద్ర శాలలు, పతాకాధ్వజములు, బహువిధ మణి జటితములును, సౌవర్ణములునగు బహిర్ద్వారములు గల హర్మ్యములతో నిబిడములగు వీదులుగల, ఆ లంకా నగరము దేవపురిని బోలియుండెను అచటి ఎత్తైన ప్రాసాదములు, ఆకాశమును తమ భుజస్కంధములపై మోయుచున్నట్లుండెను. శ్వేత వర్ణములగు సౌధము లతో నొప్పు ఆ నగరము, కైలాస శిఖరమువలె చాల మనోజ్ఞముగ నుండెను. సాగరానిలసేవితమును, సాగరమువలె మహత్తరమును జనోద్ఘోషచే నుద్ఘుష్ట మునునగు ఆ లంకానగరమున గల పాండుర ద్వార తోరణములతొ నొప్పు హర్మ్యముల ముంగిట మత్తవారణములు కట్టబడి యుండెను. శరత్కాలీన మేఘములవలె తెల్లగా ప్రకాశించు భవనములతో నొప్పుచు సాగరానిల సేవితమై, సముద్రపు హోరును బోలిన జన నిర్ఘోషముతో నుద్ఘోషించు లంకానగరమును హనుమంతుడు దర్శించెను ఆ నగరము బలవంతులగు సైనికులచే రక్షితమై అలకాపురిని బోలియుండెను ఆ నగరములోని మహాసౌధము లబహిర్ద్వారము లందు మత్తవారణములు కట్టబడియుండెను. ఆ భవనముల ద్వారములు, బహి ర్ద్వారములు గూడ శ్వేతకాంతులీను చుండెను. ఆ నగరి, నాగాభిరక్షితమగు భోగవతివలె, సవిద్యుద్ఘనాకీర్ణమై, జ్యోతిర్గణ విషేవితమై, భీమ మయ్యును, మనోజ్ఞముగ నుండెను. చండమారుతముల నిర్హ్రాదము గల్గి, సువర్ణప్రాకార ములతొనొప్పు ఆ నగరమును, సకల సంపదలతో తులతూగు, దేవనగరినిబోలి

యుండెను. ఆ నగరమున గల ఉన్నత భవనములపై చిఱుగంటల సవ్వడు లతో నొప్పు పతాకలెగురవేయబడి యుండెను. ఆ నగర భవనములు, వైదూర్యకృతములగు సోపానములును; మణి, స్ఫటిక, ముక్తామయములగు వేదికలు గల సౌవర్ణ ద్వారములును గల్గి యుండెను మణికుట్టిమములతో విరాజిల్లు నా భవనముల ముంగిట తప్త సువర్ణ నిర్మితములగు బంధనములు గల మత్తవారణములు కట్టబడియుండెను. ఆ భవనములు, రాజతావళ పాండురములును, మధ్య మధ్య పొదగబడిన స్ఫటికముల పాంసు యుక్తములును, ఆకసము నొరయు చున్నటులున్న చతుశ్శాలలతొ నొప్పుచు మిక్కిలి సుందరముగ నుండెను క్రౌంచ, బర్హిణ సంఘుష్టములును, రాజహంస నిషేవితములును, తూర్యాభరణాది నిర్ఘోషములతో సర్వత్ర ప్రతి నినాదితమునునగు, వస్వోకసారభూతమగు అలకాపురిని బోలిన, ఆకస మునకో నెగురుచున్నట్లుగ నున్న లంకానగరిని చూచి హనుమంతుడు మిక్కిలి యానందించెను ఆ నగరిని సర్వాలంకార భూషితయగు ప్రమదతో పోల్చుచు చిత్రించిన ఈ సుందర చిత్రమును గూడ దర్శించి యానందించెను:-

"తాంరత్న వసనోపేతాంగోష్ఠాగా రావతం సికామ్।
యంత్రా గార స్తనీ మృద్ధాం ప్రమదామివ భూషితామ్॥
"తాంనష్టతిమిరాందీ పైర్భాస్వరైశ్చ మహాగ్రహైః।
నగరీంరాక్ష సేంద్రస్య స దదర్శ మహాకపిః॥

(సుం॥కాం. 3/ 8.19)

తా॥ రత్న ప్రాకారమను వసనమును ధరించినదియు, గోష్ఠ, ఆయుధగారాది రూపమైన కర్ణాభరణ భూషితమును; యంత్రాగార రూపము వక్షము గలదియును, సర్వ సంపత్సమృద్ధమును, దీపకాంతులచే నష్ట తిమిర ములును, ప్రభాసమానములునగు మహా గృహముల తోడను, మణిభవ ములతోడను ప్రకాశించు రాక్షసేంద్రుని నగరి, సర్వాభరణ భూషితురాలగు ప్రమదనుబోలి దర్శకులకు ముదముగూర్చుచుండెను.

లంకానగరిలోని మరికొన్ని విశేషములు :

ఆ లంక, వజ్రాంకుశ ప్రతిమలు గలవియు, వజ్రమయములగు గవాక్షములు గలవియు, తూర్యఘోష నినాదితములును, లంకానగరవాసుల

ప్రట్టహాసములు నినాదములతో నొప్పు, ఎత్తైన భవనములతో చాల రమ్యముగ నుండెను. అందలి రాక్షసుల భవనములు, శ్వేతాభ్రములను బోలినవియును, పద్మ, స్వస్తికాది వివిధ సంస్థానములతో చిత్రములై తోచుచుండెను. ఆ నగరమున "వర్ధమానా" భిధములగు గృహములుగూడ ఉండెను, అక్కడి భవనములు, పలు నమూనాలలో నిర్మించబడి యుండెను. ఆ భవనముల నుండి కొన్నిచోటుల, త్రిస్థాన స్వరభూషితములగు మధురగీతనాదములు; మఱికొన్ని చోటుల, మదనా విద్ధలగు మత్తకాశినుల, కాంచీనాదములు, నూపురశింజితములు, మెట్లెక్కు సవ్వడులు విన్పించు చుండెను. కొన్ని చోటుల కరాస్ఫాలన శబ్దములు, సింహనాదములు, మఱికొన్ని భవనములందు రాక్షసుల మంత్ర జప, స్వాధ్యాయ శబ్దములు విన్పించు చుండెను. నగరములోని కొందరు జనులు రావణుని స్తుతి పాఠములు చేయుచుండిరి. మఱి కొందరు గర్జనములు చేయుచుండిరి. ఆ నగర రాజమార్గము, రక్షోగణ సమాక్రాంతమై యుండెను. ఆ నగరమున వ్రతదీక్షితులు, జటాధారులు, గోచర్మాంబరధారులు, దర్భ ముష్టులను ప్రహరణములను ధరించి, అగ్ని కుండములందు హవనములు చేయు రాక్షసులు గూడనుండిరి.

ఇక యానగర మధ్యమ కక్ష్యయందు రక్షణమునకై నియోగించిన పెక్కురు సైనికులు, చారులుగూడ అప్రమత్తముగ నుండిరి.

ఇంకను అక్కడ, ఏకాక్షులును, కుటిల వక్త్రులును, విషమాంగులును, వామనులును, పరమ భయంకరులును నగు రాక్షసులు వసించుచుండిరి. ఆ నగరమున, కూట, ముద్గర, దండ, దనుః, ఖడ్గ, శతఘ్ని, ముసల, పరిఘ, శక్తి, వృక్ష, పట్టిశ, అశని, క్షేపణీ, పాశాది వివిధాస్త్రములను ధరించిన రాక్షస యోధులుండిరి. బహుయుద్ధ విజేతలగు మహారథులు గూడ వారిలోనుండిరి, ఆ సైనికులు విచిత్రములగు కవచములను ధరించి యుండిరి వారిలో కొందరు వికృత రూపులును, మఱికొందరు సుందరాకృతి గలవారు, వర్చస్వులు గూడ నుండిరి. వారు వివిధాకృతులు గలవారుగ నుండిరి ఆ నగరములోని వీరులు, మిక్కిలి స్థూలకాయులు లేక బక్క చిక్కిన వారున్నూగాక, సుదృఢమగు శరీరయష్టి కల్గి యుండిరి. అంత

పొడవు, అంత పొట్టియు గాక మధ్యమ ప్రమాణముగగ్గి యుండిరి. వారు మిక్కిలి తెల్లగా, లేక మిక్కిలి నల్లగాను లేక చామనచాయగ నుండిరి. మఱిగుజ్జు వారుగాని, మిక్కిలి పొట్టివారు గాని వారిలో లేరు.

లంకానగరములోని పెక్కురు నాగరికులు పూలమాలలను ధరించి, చందనాదులను అలదికొని, బహుమూల్యములగు ఆభరణములు ధరించి, వివిధములగు వేషములుగల్గి నగరమంతయు స్వచ్ఛందముగ విహరించు చుండిరి.

ఆ నగర మధ్యమునగల సైనిక గుల్మమున, తీక్ష్ణములగు శూలములను, వజ్రాద్యాయుధములను ధరించిన లక్షమంది రాక్షస సైనికులుండిరి వారం దరు నగర రక్షణ కార్యమున మిక్కిలి యప్రమత్తముగ నుండిరి. ఆ రక్షక భటుల కొఱకు విశాలమగు భవనములు నిర్మించబడియుండెను. ఆ నగరము హాటక నిర్మితమగు బహిర్ద్వారముతో దేదీప్యమానముగ ప్రకాశించుచుండెను.

లంకానగరములోని వీథులన్నియును సువిశాలములై చక్కగా ఊడ్చ బడి, జలావసేకముగల్గి, పుష్పవికీర్ణములై యుండెను. ఆ నగర రాజపథము సువిశాలమై వివిధ సంస్థానములు గల సౌధములతో నిబిడమై తీర్చిదిద్ది నట్లుగ ఉండెను. ఇక యానగరమందంటను రాత్రియంతయును దీపములు వెల్గుచుండుటవలన, చీకటి లేక నిత్యము దేదీప్యమానముగ నుండును. అనంత భోగ భాగ్యములకు నెలవగు ఆ నగరము నిజముగ వస్త్వేకసార భూతము సకల శోభావిలసితము సుందరమగు వాస్తుకళకు శిల్పమునకూ చరమసీమ.

ఇక హనుమంతుడు సీతాన్వేషణార్థమై లంకానగరమున తిలకించిన యచటి నాగరికుల జీవిత విశేషములను, విలాస వినోదములను గూడ తిల కించి వినోదింపుడు:-

రాక్షస గృహములలో కొన్ని గృహములయందు మధురములగు వీణానాదములు విన్పించుచుండెను. మరికొన్ని చోటుల, కొందఱు రాక్షసులు తమ కాంతలతో విహరించుచుండిరి. మరికొన్ని చోటుల, కామినులగు ప్రమదలు, తమ పతుల గాఢాశ్లేషములందు మైమఱచియుండిరి. కొన్ని భవన

ములు, రథశాలాదులతోను భద్రాసనములతోడను నొప్పు ప్రాంగణములు గల్గి, రాక్షసుల భాగ్యలక్ష్మికి అద్దము పట్టుచున్నట్లుండెను. కొన్ని చోటుల, కామినీ-కాముకులిర్వురు మద్యపానపరవశులై, రతిపరవశులై యుండిరి కొన్ని భవనములలోని రాక్షసవీరులు ధనుర్విద్యాభ్యాసమును చేయుచుండిరి. మరికొందరు చిత్రకళాభ్యాసమును చేయుచుండిరి. ఆ భవనములలో నివసించు కొందరు ప్రమదలు, చందనములు మేనున నలదుకొనుచుండిరి. మరికొందరు హాస-పరిహాసములతో వినోదించుచుండిరి. కొందరు ప్రణయకోపముతో దీర్ఘముగ నిఃశ్వసించుచుండిరి. కొందరి ద్వారముల ముందు మదపుటేనుగులు ఘీంకారములు చేయుచుండెను. ఆ భవనములలో నివసించు రాక్షసులలో కొందరు బుద్ధిసంపన్నులును, కొందరు మధుర సంభాషణ చతురులును, కొందరు శ్రద్ధావంతులుగను నుండిరి. కొందరు సుందర రూపముగలవారును, శోభాయమానమగు శారీరకాంతిగలవారై, తమ సద్గుణములచే విశ్వవిఖ్యాతులై యుండిరి. నానా రూప, గుణ సంపన్నులును; గుణానురూపముగ మధుర వ్యవహార యుక్తులును, మహాతేజసంపన్నులును నగు పెక్కురు రాక్షసులనట జూచి, హనుమంతుడు మిక్కిలి యానందించెను. కాని, ఆ నగరముననే పెక్కురు క్రూర కర్ములగు రాక్షసులు గూడ గన్పించిరి. లంకలోని కొన్ని యుత్తుంగములగు హర్మ్యతలములపై, విద్యుల్లతల వలె, కొందరు సుందర స్త్రీలు విహరించుచుండిరి. మఱికొందరు తమ ప్రియుల యంకములపై గూర్చొని, తమ భర్తృవాల్లభ్యమును, చాటుచుండిరి. కొందరు తమ శిరములపైగల మేలిముసుగులను తొలగించుకొని కూర్చొని యుండిరి. మరికొందరు భర్తృవియోగముచే పాలిపోయియుండిరి. కొందరు స్త్రీలు తమ రూప-లావణ్యకాంతులచే, విద్యుల్లతలవలె, చూపరుల కన్నులకు మిరుమిట్లుగొల్పుచుండిరి. కొందరు స్త్రీలు పాన పారవశ్యమున వదరుచుండిరి, కొందరు తాము కోరిన ప్రియులు లభించుటచే సంతోషమున విస్ఫారిత ముఖకమలములతో నొప్పుచు పుష్పమాల్యములను ధరించి యుండిరి. కొందరు స్త్రీలు ప్రియులయందును, పానములయందును నాసక్తలై, భర్తలతోపాటు త్రాగి యానందించుచుండిరి. మరికొందరు ముగ్ధలగు కాంతలు గూడ హనుమంతుని కగుపించిరి.

## లంకలోని విమానగృహ సముదాయము

కామ రూపధరుడగు హనుమంతుడు ఏడంస్తులుగల రాక్షసుల విమాన భవనములందు సీతాదేవిని వెదకసాగెను. ఆ లంకానగరమున రాక్షసవీరుల భవనములు వరుసగా నాటబడి యుండెను. వారి విహారము కొరకు మధ్య మధ్య పెక్కు ఉద్యానవనములు గూడ నిర్మితమై యుండెను. ప్రహస్త మహా పార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి వజ్రదంష్ట్రి శుక, సారణ, ఇంద్రజి, జంబుమాలి, సుమాలి. రశ్మికేతు, సూర్యశత్రు, వజ్రకాయ, దూమ్రాక్ష, సంపాతి, విద్యుద్రూప, ఘన, విఘన, శుకనాభ, చక్ర. శఠ, కపట, హ్రస్వకర్ణ, దంష్ట్రి, లోమశ, యుద్ధోన్మత్త, మత్త, ధ్వజగ్రీవ, ద్విజిహ్వ, హస్తిముఖ, కరాల, పిశాచ, శోణితాక్షాది మహావీరుల మహాభవనములు, వరుసగా నిర్మించబడి యుండెను. వీరి ప్రాసాదముల తరువాత రావణుడు తన కొఱకు నిర్మింప చేసిన భవన సముదాయముండెను.

రావణుని భవన సముదాయ వర్ణనము:

వైదూర్య ఖచితములగు బంగారు కిటికీలు గలదియు, విహంగజాల సమావృతమునునగు రావణుని భవనసముదాయము, విద్యుదుద్దీప్తమగు, వర్షా కాలపు మేఘ సముదాయమువలె మిక్కిలి మనోజ్ఞముగ నుండెను. ఆ భవనములయందు. వివిధాకృతులతో నిర్మించబడిన వివిధ శాలలు (కచ్చేరీ దావడులు); విశాలములగు శంఖ, ఆయుధ, ధనుశ్శాలలు, భవనములపైని విశాలమగు చంద్రశాలలుగూడ ఉండెను. ఆ భవనములందు పొదిగిన అనర్ఘ్యము వివిధ రత్నములను దేవాసురులిర్వురును ఘనముగ కీర్తించుచుండిరి.

శిల్ప విజ్ఞానమంతయును వినియోగించి బహుప్రయత్నపూర్వకముగా శిల్పులచే నిర్మించబడిన ఆ భవనములు, ఏ విధమైన దోషములు (వాస్తు శిల్పాది) లేకుండగ, సర్వగుణోత్తరములై మయుడను శిల్పిచే నిర్మితములగు భవనములవలె కడురమ్యముగ నుండెను.* ఈ భవనములన్నియు, రావణుడు తన పురుషార్థముచే స్వయముగ నిర్మించినవి. (సుం. కా. 7/3)

1. "తాని ప్రయత్నాభి సమాహితాని; మయేన సాక్షాదివ నిర్మితాని।
మహీతలే సర్వగుణోత్తరాణి; దదర్శలంకాధిపతేర్గృహాణి॥
(5/7/4)

రావణుని దివ్యభవన వర్ణనము

రావణుడు నివసించు రాజభవనము, త్రికూట పర్వత శిఖరమున, కొన్ని రాజభవనముల మధ్య నిర్మించబడి యుండెను. ఆ భవనము చుట్టు శ్వేత పద్మములతో నొప్పు లోతైన అగడ్తలుండెను. దానికి నాల్గు వైపుల ఎత్తగు ప్రాకారము నిర్మించబడి యుండెను నిరంతరము దివ్యమగు సంగీత నాదములతోను ఆ భవనము స్వర్గమును మఱపించు చుండెను. వాజిహ్రేషిత సంఘుష్టమును, భూషణనాద నినాదితమునగు ఆ రాక్షసేంద్ర భవనము, సుందరములగు హయములు, గజములు, చతుర్దంతములుగల మత్తవారణములు, మొ॥గువానితో నొప్పు రుచిరద్వారయుక్తమై మిక్కిలి శోభాయమానముగ నుండెను. ఆ భవనమును మహావీరులగు వేలాది రాక్షసభటులు ఏమరక రక్షించు చుండిరి ఆ భవనము, రజతమయములగు పెక్కు చిత్రములు, బంగారముతో ములమ్మా చేసిన పెక్కు ద్వారములు, చిత్ర విచిత్రముగ నిర్మించబడిన పెక్కు కక్ష్యలు కల్గి మిక్కిలి దర్శనీయముగ నుండెను. పరమోదారములైన పెక్కు దృశ్యములతోను, వేలాది మృగ, పక్షిగణముల చిత్రముల తోడను ఆ భవనము నిండి యుండెను. ఆ భవనము, మహామోదములో మున్గితేలు పెక్కురు ప్రమదారత్నములతో నొప్పు చుండెను. వారు ధరించిన బహుమూల్యములగు ఆభరణముల సవ్వడులతో, నాభవనము సముద్రమువలె ప్రతిధ్వనించు చుండెను. ఆ భవనముకు రాజులకు, కావలసిన సర్వ విధమగు భోగసామగ్రితో నిండియుండెను. పలువిధములగు చందనాది సుగంధద్రవ్యములతో నిండియుండెను. మహాజన సమాకీర్ణమగు నాభవనము సింహావాసమగు మహారణ్యమువలె నుండెను. భేరీ, మృదంగాది వాద్య ఘోషములతోను, శంఖఘోషలతోను ఆ భవనము నిత్యము ప్రతిధ్వనించు చుండును. ఆ భవనము నిత్యము చక్కగ నలంకరింపబడుచు నిత్యనూత్నమై విలసిల్లు చుండును. పర్వదినములందు అక్కడ రాక్షసుల పూజా హోమాదులు జరుగు చుండును. మహారత్న పరిచ్ఛదయుక్తమును, నిత్యార్చితమునునగు ఆ రాక్షస భవనము లంకధరించిన మహాభరణము పగిది తోచు చుండెను. (6-15)

ఆ సుందరమగు రావణభవనమున, వివిధాకృతులు గల శిబికలు (పల్లకీలు) విచిత్రములగు లతాగృహములు, చిత్రశాలలు, క్రీడాభవనములు,

దారు నిర్మితములగు క్రీడా పర్వతములు, రమణీయములగు విలాస గృహములు, కామ గృహ, దివాగృహాదులను, హనుమంతుడు దర్శించెను. క్రీడా మయూర స్థానములతోను, ధ్వజయష్టుల తోడను, నొప్పు ఆ రావణుని నివేశన గృహము, అనంతరత్న నిచయములతో పొదగబడి, పలువిధములగు నిధులతో తనరారుచు రావణుని యనంతైశ్వర్యమును ప్రకటించు చుండెను. ఆ భవనమును పెక్కురు ధీర (ధీమంతులగు) పురుషులు పెక్కు కర్మల నాచరించు చుండిరి. పెక్కు నిధి జాలములతో తనరారుచున్నదియు, మందరాలమువలె మిక్కిలి యుచ్ఛ్రితమైన ఆ రావణ నివేశనము, కుబేర భవనము పగిది సర్వసంపత్సమృద్ధమై తనరారుచుండెను. రత్నముల వివిధ కాంతులతోను, రావణుని తేజముతోను నుద్దీప్తమగు రావణుని హాటకమయ రాజభవనము, రశ్మిమాలాస మావృతుడగు భాస్కరుని పగిది వెల్గొందు చుండెను.

ఆ భవనమున గల మంచములు, ఆసనములు అన్నియు బంగారముతో నిర్మించబడి యుండెను. అక్కడ గల పాత్రలు మిక్కిలి యుజ్జ్వలమై పలుకాంతులీనుచుండెను.

ఆ భవన కుట్టిమములు, మధ్వాసవాదులు, పడుటచే, తడిసి యుండెను. మణిమయ భాజన సంకులమగు ఆ భవనము కుబేర భవనమును మించి యుండెను.

కాలి యందెల సవ్వడులతోను, కాంచీనిఃస్వనములతోను, మృదంగ తాళముల ఘోషలతోను ఆ భవనము ప్రతి నినాదితమగుచు మిక్కిలి సందడిగ నుండెను.

ప్రాసాద సంఘాత యుక్తమును, స్త్రీరత్న శత సంకులమును, సువ్యూఢ కక్ష్యమునునగు రావణుని మహాగృహము మిక్కిలి యుచ్ఛ్రితమై, తనకు ప్రతి లేనట్లుగ మహాశోభాయుక్తమై తనరారు చుండెను. ఆ భవన రాజము మహీతల ప్రకీర్ణమగు స్వర్గమో యన్నట్లుండెను. బహురత్న కీర్ణమును, మహాశోభాసంపన్నమును, నానా తరువుల సురభిళపుష్పముల రజోఽవకీర్ణమైన ఆ రాక్షసేంద్ర నివేశనము బహువృక్ష సమావృతమైన పర్వత శిఖరమువలె మిక్కిలి యాకర్షకముగ నుండెను.

రావణుని యా విమాన గృహము బహువిధములగు నారీరత్నములతో కూడి, విద్యున్మాలా సమావృతములగు మేఘముల పిండువలెను; హంస ప్రవేశములచే మోయబడు శ్రీ సంపన్నమైన విమానమువలె, అద్భుత శోభతో తనరారు చుండెను. బహుధాతుచిత్రమగు పర్వతాగ్రము వలెను, చంద్రాది గ్రహ శోభితమగు నభమువలెను, చారు మేఘసమావృతమగు నాకసము వలెను. చిత్ర విచిత్ర శోభలతో నావిమాన గృహము విరాజిల్లు చుండెను. ఆ విమాన గృహమునందు, పర్వతరాజి పూర్ణమగు భూమి, వృక్షవితాన పూర్ణములగు శైలములు, పుష్పవితాన పూర్ణములగు వృక్షములు. కేసరపత్ర పూర్ణములగు పుష్పజాలములు చిత్రింపబడి యుండెను.

ఏకావళ్యలంకార సాహాయ్యముతో వాల్మీకి నిర్మించిన ఇట్టి సుందర శబ్ద చిత్రములు, విశ్వకావ్య చిత్ర భండారమున విరళముగనే లభించును ఇట్టి మనోహర చిత్రములెన్నియో రామాయణ మహాకావ్య చిత్ర భండారమున సురక్షితములై యున్నవి. కడురమ్యమగు విమానగృహ సౌందర్యమును, వాల్మీకి శబ్ద విన్యాస కౌశలముతో బాటుగా దర్శించి యానందింపుడు -

మహీకృతా పర్వత రాజిపూర్ణా, శైలాఃకృతా వృక్షవితాన పూర్ణాః॥
వృక్షాః కృతా పుష్ప వితాన పూర్ణాః, పుష్పం కృతం కేసర పత్ర పర్ణమ్॥
(సుం॥కాం 7/9)

ఈ చిత్ర నిర్మాణమున నుపయోగించిన ఏకావళ్యలంకారము, సహజాతి సహజమై, కావ్య సౌందర్యమును యినుమడింప చేయుచున్నది. సహజ సన్నివేశితములగు అలంకారములు, కావ్య శోభా సంవర్ధకములనుటకు పై శబ్దచిత్రమే నిదర్శనము.

అన్యోన్యాలంకార సాహాయ్యమున వాల్మీకి నిర్మించిన ఈ కుడ్య చిత్రమును గూడ తిలకించి యానందింపుడు -

"కృతాని వేశ్మానిచ పాండురాణి; తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి,
పునశ్చ పద్మాని సకేసరాణి; వనాని చిత్రాణి సరోవరాణి॥
(సుం॥కాం॥ 7/10)

అక్కడ పెక్కు భవనములు నిర్మించబడి యుండెను. సుపుష్ప శోభితములగు పుష్కరములు త్రవ్వబడియుండెను. కేసర యుక్తములగు పద్మములతో నొప్పు సరోవరములుండెను. వాని తటములందు అద్భుతములగు వనములు పెంచబడి యుండెను.

ఇక అక్కడి మనోహరములగు వివిధ శిల్పములను చిత్రించుచు నిర్మించిన ఈ క్రింది శబ్ద చిత్రములను చూచి వినోదింపుడు:-

1. "కృతాశ్చ వైదూర్యమయా విహంగా, రూప్య ప్రవాలైశ్చతథా-విహఙ్గాః। చిత్రాశ్చ నానావసుభిర్భుజంగా, జాత్యానురూపాస్తురగాశ్శుభాఙ్గాః॥

2. "ప్రవాల జాంబూ నద పుష్ప పక్షాః; సలీల మావర్జిత జిహ్మపక్షాః। కామస్య సాక్షాదివ భాన్తి పక్షాః, కృతావిహంగా స్సుముఖా స్సుపక్షాః॥

3. నియుజ్యమానాశ్చగజాస్సుహస్తాః; సకేసరాశ్చోత్పలపత్రహస్తాః॥ బభూవ దేవీచ కృతాసు హస్తా; లక్ష్మీ స్తథా పద్మిని పద్మహస్తా॥

4. "ఇతీవతద్గృహ మభిగమ్య శోభనం, సవిస్మయో నగ మివ చారుకన్దరం। పునశ్చ తత్పరమ సుగంధి సున్దరం; హిమాత్యయే నగమివ చారు కన్దరం॥ (సుం॥ కాం॥ 7 12-15)

తాత్పర్యము : (1) ఆ గృహమునందు వైదూర్యములతోను, వెండితోను, పగడములతోను వివిధములగు పక్షులు నిర్మించబడి యుండెను. నానారత్నములతో నిర్మించబడినవియు, విచిత్రవర్ణములుగలవియునగు సర్పములుగూడ నిర్మించబడెను ఉత్తమ జాత్యశ్వములా, యివి, యని యనిపించు అశ్వములు గూడ నిర్మించబడి యుండెను.

ఆ భవనములలో, అందమైన ముక్కులు, రెక్కలు గల పెక్కు పక్షులు కనువిందు చేయుచుండెను. వాని రెక్కలు, పగడములతో చేయబడి సువర్ణ నిర్మితములగు పుష్పములతో చాల యందముగ నుండెను. ఆ పక్షులు విలాసముగ తమ పక్షములను వక్రముగ వంచి నిలబడియుండెను. నిజముగ ఆ పక్షుల రెక్కలు, కాము దేవుని సాక్షాత్పక్షములవలె, అనగా కామోద్దీపకములుగ వెలయుచుండెను.

8) ఆ భవనమున పద్మోత్పల సంఛన్నములగు సరోవరములు చిత్రింపబడియుండెను. ఆ సరోవరములందు మత్తగజములు, సపత్రములును, సకేసరములునగు నుత్పలములను ధరించిన తొండములతో కడుమనోహరముగ నుండెను. అక్కడ, పద్మాలయయు, తన సుందర హస్తములందు కృతపద్మయునగు లక్ష్మీదేవి స్థాపించబడి యుండెను.

ఇట్టి బహువిధ శిల్పములతో రాజించుచున్న ఆ సుందరభవనము వసంతర్తువులో, చారుకందరమును (గుహలుగల) పరమ సౌగంధ్యయుక్తములగు పుష్పించిన వృక్షముపలెను పరమ శోభాయమానముగ పూలతో నున్న గిరివలెను ఉండెను. అట్టి రామణీయకతకు నెలవగు ఆ రావణుని విమాన గృహమును చూచి, హనుమంతుడు పరమ విస్మయమందెను

రావణుడు తన భవనమున వివిధ ధాతువులతోను, మణులతోను నిర్మింపచేసిన విహంగములను, సలీలముగ నావర్జిత జిహ్మపక్షములతో, చెన్నొందినట్లు మలచుట, శుభాంగములతో నొప్పు జాతీయాశ్వములు నానామణి నిర్మితములగు సర్పములు, పద్మోత్పలాదులను ధరించిన గజములు, తొండములతో లక్ష్మీదేవి నభిషేకించుచున్నట్లుగ మలచిన గజలక్ష్మి శిల్పము, రావణుని శిల్ప, చిత్ర నిర్మాణాదులయందలి యాసక్తిని, కళా వైదగ్ధ్యమును చాటుటతోబాటుగ, ఆనాటి లంకానగర శిల్పుల యొక్క శిల్పకళానైపుణ్యమును, ధాతుమణ్యాది ప్రయోగమునుసూక్ష్మ విజ్ఞానమును, చిత్రకారుల చిత్రకళా వైదగ్ధ్యమును చాటిచెప్పుచున్నవి.

రావణుని యాదివ్య భవనము అర్ధయోజనము వెడల్పు పొడవు ఒక యోజనముండెను. చతుర్దంతయుక్తములును, త్రిదంతములునుద్విదంతమునగు దంతావళములు ఆ యింటిచుట్టూ కట్టివేయబడి యుండెను. ఉద్యతాయుధులగు రాక్షసవీరులు ఆ భవన రక్షణము కొరకై నియుక్తులై యుండిరి. ఆ భవనమంతయు రావణుని పెక్కు రాక్షసజాతి భార్యలలోను, యుద్ధములందు శత్రురాజుల నోడించి చెరపట్టి తెచ్చిన రాజకన్యలలోడను నిండియుండెను. పెక్కు మత్తకాశినుల తోడను, ఉద్యతాయుధులగు వీరులతోను నిండియున్న యా రావణగృహము, నక్ర, మకర మత్స్య, తిమింగిల,

పన్నగాదులతో నిండిన, వాయువేగముచే కల్లోలితమగు సముద్రమువలె తోచుచుండెను.

కుబేర భవనమున చంద్రునిలోను, ఇంద్రభవనమునందున్నా, ప్రతిష్ఠితమైన లక్ష్మి, రావణ గృహమున నిత్య సుస్థాయినియై నివసించుచుండెను. (సుం॥ కాం॥ 9/8)కుబేర, యమ, వరుణాదులంటో సమానమైన, లేక యంతకంటెను బహుళమగు సమృద్ధులతో నాక్షసేంద్ర నివేశనము తనరారుచుండెను. (9/9) ఆ భవన మధ్యమున లతాగృహములు, చిత్రశాలలు, నిశాగృహములు కూడ ఉండెను. (12/1) ఆ భవనముననే మధుశాల, పుష్పగృహము, క్రీడాగృహము, గృహోద్యానము, పుష్పక విమానములుగూడ ఉండెను.

ఆభవనమున రావణోపశాయినులగు పెక్కురు వికృతాకృతులగు రాక్షసస్త్రీలు గూడ ఉండిరి.

శక్తి, తోమర, శూల, ముద్గరాది వివిధాయుధములు ధరించిన రక్షకభట గుల్మములుగూడ ఉండెను. (6-80)

మహాకాయులగు పెక్కురు రాక్షసులు నానా విధములగు ప్రహరణములను (ఆయుధములను) ధరించి ఆ భవనమును రక్షించుచుండిరి. తెల్లని రంగుగలవి, రక్తవర్ణము గలవియునగు పెక్కు, మహాజవోపేతములగు, అశ్వములుగూడ ఉండెను.

కులీనములు, సుందరములును, శత్రుగజములును యుద్ధక్షేత్రమునందు పారిపోవునట్లు చేయగలవియునగు మహాగజములు కూడ ఉండెను. అవియన్నియు గజశిక్షయందు చక్కగా శిక్షితములు, పరసైన్యమును మర్దింపగలవి, ఐరావతమువలె విశాలకాయము గలవిగ నుండెను. అవి జలధారలను వర్షించు మేఘములవలెను, సెలవాగులను ప్రవహింపచేయు గిరులవలెను మద ధారలను గండములనుండి వర్షించుచుండెను. బంగారు ఆభూషణములు ధరించి, తరుణాదిత్యుని వలె కాంతులను వెదజల్లు రాక్షస సైన్యములు గూడ అక్కడ మకాము చేసి యుండెను. భయంకరమగు సింహములతో నొప్పు భీకరమగు వనమువలె, అతిభయంకరులగు సైనికులా భవనమును

కాపాడుచుండెను. ఏనుగుల నధిరోహించిన మావటీం(డు; గత(శ్రమములగు గుఱ్ఱాలు, అపశక్యముగాని వేగముగల అశ్వములు పూన్చిన యరదములు గూడ నచట ఉండెను. సింహ, వ్యాఘ్ర చర్మములతో నిర్మించిన కవచ ములతో నాయరదిములు, ఆచ్ఛాదితములై యుండెను. ఆ యరదములు ఏనుగు దంతములతోను, కాంచన, రజతాదిధాతువులతోను నిర్మించబడిన (ప్రతిమ లచే నలంకరించబడి యుండెను ఆ రథములందు గట్టిన చిఱుగంటలు, వాతచాలి తములై చిఱుధ్వనులు చేయుచుండెను. ఆ భవనము బహురత్నసమాకీర్ణమును, బహుమూల్యాసనములతో నొప్పుచున్నదియు, మహారథ స్థానములతోను, మహావీరుల మహావాసములతోను మిక్కిలి శోభాయమానముగ నుండెను. దర్శనీయములగు వేలాది మృగపక్షుల కావాసభూతమై గూడ నుండెను.

## పుష్పకవిమాన వర్ణనము

ఇక యుదాత్తాలంకార సాహాయ్యమున వాల్మీకి చి(తించిన, ఆ విమాన గృహమునందు, ఉంచబడిన "పుష్పకవిమాన" సౌందర్య చి(త్రమును పరికింపుడు:-

ఆ విమాన గృహ మధ్యమున నిలబడి, ధీమంతుడగు మారుతి, మణి రత్న చి(త్రితమును, జాంబూనదమయములగు గవాక్షములు గలదియునగు విమానమును జూచెను. అందు, అపార సౌందర్యమును తొనకు (ప్రతిమలలం కృతములై యుండెను. ఆకాశమునందు (ప్రతిష్ఠితమై, ఆదిత్యపథ చిహ్నమో యనునట్లుగ నావిమానము దోచుచుండెను. దానిని గూర్చి వాల్మీకి యిట్లు వర్ణించి యున్నాడు:-

"నత(త కించిన్నకృతం (ప్రయత్నతో, నత(త కించిన్న మహార్ఘరత్నవత్।
న, తే విశేషా నియతాస్సురేష్వపి, నత(త కించిన్న మహా విశేషవత్॥
(5/8/3)

"(బహ్మణోర్థేకృతం దివ్యం దివి యద్విశ్వ కర్మణా।
విమానం పుష్పకంనామ సర్వ రత్న విభూషితమ్॥
"పరేణ తపసా లేభేయత్కుబేరః పితా మహాత్।
కుబేర మోజ సాజిత్వా లేభేత(దాక్షసేశ్వరః॥ (5/8/11, 12)

తా॥ ఆ విమానమును సర్వోత్తమముగను, సర్వసుందరముగను నిర్మించుటకు శిల్పిచేయని ప్రయత్నమేలేదు. మహార్ఘములగు రత్నములు ప్రయోగింపని భాగము గూడ లేదు. ఇందుగల విశేషములు, దేవ విమానములందు గూడ గానరావు. ఆ విమానములోని ప్రతియొక్క భాగము, మహా విశేష యుక్తమై తనరారు చుండెను. (1/8/3)

దేవశిల్పియగు విశ్వకర్మ "బ్రహ్మ" కొరకు నిర్మించిన విమానమే ఇది. సర్వరత్నముల ప్రయోగమునిందు విశ్వకర్మ జేసెను.

కుబేరుడు మహా తపముచేసి బ్రహ్మదేవుని నుండి, ఈ దివ్యవిమానమును పొందెను. దానిని, అతని సవతి సోదరుడగు రావణుడు తన పరాక్రమముతో కుబేరుని జయించి, తన స్వాధీనము గావించుకొనెను.

(5/8/ 1, 12)

ఈ విమానము, దాని నధిరోహించిన వారి మనస్సుననుసరించి పోవును. అనేక సంస్థాన విశేషములతో నిది నిర్మించబడినది. దీనితో సమానమగు వేగముగల విమానము లెక్కడనులేవు ఇది వాయు వేగముతో పోవును. ఆశ్చర్యకరమగు శిల్ప, చిత్ర విశేషములుగల ఈ విమానము, విచిత్రకూటమగు ఒక గిరివలె నుండెను. వాసంత పుష్పరాశివలె సుందరమైనదియును, వాసంతలక్ష్మిని మించిన శోభగలదియునైన ఈ విమానమును వానర వీర సత్తముడు దర్శించెను.

రావణుని శయనశాల :

ఇపుడు రావణుని రాజభవనమునగల సుందరమగు శయనశాలను దర్శించుచము గాక! దివ్యమగు పుష్పక విమానము నందుగూడ వెదకి వెదకి, యందును సీతనుగానక హనుమంతుడు అక్కడనుండి బయలుదేరి ఒక యతిసుందరమైన శాల కనబడగ నచటికి పోయెను ఆ శాల మణి సోపానముల తోడను, హేమమయములగు గవాక్షముల తోడను, చాల శోభాయమానముగ నుండెను. ఆ శాలా కుట్టిమమునందు స్ఫటికములు పొదగబడియుండెను. మధ్య - మధ్య గజదంత చిత్రములు చెక్కబడి యుండెను. ముత్యములు, వజ్రములు, పగడములు, వెండి - బంగారములు, మొదలగు వానితో నిర్మించబడిన మణి

స్తంభములపై నాశాల నిర్మించబడియుండెను. మణి స్తంభములపై నిర్మించబడిన ఆ శాల, మణి స్తంభములను విశాలమగు పక్షములతో దివికెగురు పతంగము వలె, చూడముచ్చటగా నుండెను. ఆ శాలయొక్క మణికుట్టిమముపై, భూమండలమును చిత్రించిన ఒక పెద్ద తివాచి పర్వబడి యుండెను. అందు మత్త విహగములు నాదములు సేయుచుండెను. దివ్య సౌరభములు అట, గుబాళించుచుండెను. అగురుధూపముల సువాసనలు ఆ శాలయందంతట వ్యాపించి యుండెను పత్ర, పుష్పోపహారముచే, నర్చితమగు ఆ శాల వివిధ వర్ణములతో తేజరిల్లుచు, తన సువాసనలచే మనస్సునకు ప్రమోదమును కల్గించుచుండెను. అక్కడ బంగరు పాత్రములలో నమర్చబడిన, పాన, భక్ష్యాదుల గంధములు ఘ్రాణతర్పణము గావించు చుండెను. ఆ సుగంధములు, మహాసత్త్వ సంపన్నుడైన హనుమంతుని విందునకాహ్వానించు చున్నట్లుండెను. శోక వినాశకమును, పంచేంద్రియ తర్పణ సమర్థములును, విషయ సంజుష్టమునునగు నాశాలను చూచి, ఇది స్వర్గమా, దేవలోకమా, లేక రావణుని పరమ తపస్సిద్ధియా యని యనుకొని హనుమంతుడు పరమానందము నందెను. ఆ శాలయందు నిశ్చలముగను మందప్రభలతోడను వెల్గు కాంచన దీపములు. జూదమున ఓడిపోయిన జూదగాండ్రవలె వెల-వెలబోవుచుండెను. మంద మందముగ వెల్గు దీపములతోడను, రావణుని ముఖదీప్తి చేతను, అతడు ధరించిన యాభరణ కాంతులతోడను, ఆ శాల యుద్దీప్తమై యుండెను అక్కడ పర్వబడియున్న మహార్హములగు శయనములపై, పెక్కు యాస్తరణములు పరచబడి యుండెను. వానిలో కొన్ని శూన్యములుగ నుండెను. అక్కడ మణికుట్టిమముపై పరచబడియున్న విశాలమైన కుథపై (తివాచీపై) వేలాది సుందర స్త్రీలు, నానావర్ణములుగల చీరలను, పుష్పహారములను, ధరించి, నానా వేషాలంకృతలై, మైమరచి పరుండియుండిరి.

లంకేశ్వరుడగు రావణుడు గాఢసుషుప్తిలో మునిగినట్లు తెలిసికొని, యక్కడ వెలుగు కాంచన దీపములు, నిర్నిమేష నేత్రములతో, నతని కాంతల సౌందర్యమును జూచుకొను చున్నట్లుగ కన్పట్టు చుండెను. ఇట్లు, గాఢ సుషుప్తిలో మగ్నమైన రావణుని కాంతా వనమధ్యమున, జానకిని వెదకికొనుచు, హనుమంతుడు రావణుని "శయన వేదిక"

వద్దకు వచ్చెను ఆ శయన వేదిక, స్ఫటిక, వైడూర్య, రత్న స్థగితమై, గజదంతముపై బంగరుపని చేసిన కోళ్లుగలదియై, దివ్యాస్తరణోపేతమై, దివ్యమాలోప శోభితమై, కడు శోభాయమానముగ నుండెను. దానిపైన, చంద్రధవళమైనఛత్రము విరాజిల్లు చుండెను. దానిపై అశోక పుష్పమాలలు అలంకరించ బడియుండెను. వింజామరలు ధరించిన రాక్షస కాంతలు అక్కడ నిలబడి వీచుచుండిరి. ఆ యాసనము, వివిధ గంధ సుగంధితమును, అగురుధూప ధూపితమును, వరమాలోప శోభితమును, ఆవికాజిన సంవృతమునునై యుండెను. పరమార్ఘ్యాస్తరణోపేతమైన నాశయన వేదిక పైన, తనివితీర మద్యముత్రావి, రతాధిక్య జనిత శ్రమచేతో ఒడలు మఱచి, నల్లని జీమూతము వలె, రావణుడు పడియుండెను. ఆతడు విడచు, పాన గంధపురః సరములగు వినిఃశ్వాసములతో ఆ శయన గృహము నిండి పోయెను. అతని మస్తకముపైగల బంగరు కిరీటము కొంచెము తొలగి యుండెను. ఆ శయన శాలయందు, నాల్గుదిక్కుల వెలుగు కాంచన దీపముల కాంతిలో రావణుని నల్లని రూపము కొట్టవచ్చినట్లగుపించు చుండెను. ఆ స్త్రీ లంకేశ్వరుని పాదములచెంత కొందరు కాంతలు శయనించి యుండిరి.

<u>ఇక సర్వ కామోపేతమగు రావణుని పానశాలనుగూడ దర్శింపుడు :</u>

హనుమంతుడు రావణుని శయనశాల నుండి బయలుదేరి, సర్వకామోపేతమగు నతని పానశాలకు, సీత నన్వేషించుటకై పోయెను.

పానశాల విశేషములు రావణుని పానశాలయందు, లేళ్లు, మహిషములు, మయూరములు, కుక్కుటములు మొదలగు మృగముల మాంసములను వండి, విశాలములగు బంగారు పళ్లెరముల యందుంచిరి, ఆ పళ్లెరములలో సగముతిని వదలివేసిన మాంసములు గూడ పడియుండెను ఇంకను నక్కడ వివిధ భాజనముల యందు, సౌవర్చలమను లవణ విశేషముచే సంస్కృతములగు, వరాహ, వార్ధ్రీణస, శల్య (ఏదుపంది) మృగ, మయూర, మహిషాదుల మాంసములు, మేక, కొక్కెర, కుందేలు, మొదలగువాని మాంసములును; వండిన కొమ్ము చేపలును, ఉడికిన గొఱ్ఱె మాంసములును ఉంచబడి యుండెను. ఇంకను, ఉచ్చావచములగు లేహ్యములు,

భక్ష్యములు గూడ కన్పించెను. అంతేగాక, ఆమ్ల, లవణరస యుక్తము లగు దానిమ్మ, ద్రాక్ష, మొదలగు పండ్ల రసములు పోసిన పాత్రములుగూడ అక్కడ పెట్టబడి యుండెను ఆ శయనశాలయందదతటను, త్రాగినంత త్రావి క్రింద చెల్లాచెదురుగ పడవేసి యున్న మద్యపాన పాత్రములగుపించెను. ఆ పాన భూమియంతయు, అగ్గిలేకుండగనే మండుచున్నట్లు, అగుపించెను. పరసంస్కార సంస్కృతములు, సూచకలానిపుణులగు వంటవాండ్రచే వండబడిన పెక్కు మాంసములట పళ్లెరముల యందమర్చబడి యుండెను. అక్కడ సహజ మద్యములు, కృతకమద్యములు, శర్కరాసవ, మాధ్వీక పుష్ప, ఫలాసవములతో నిండిన పాత్రములును, వివిధ వాసచూర్ణములును కన్పించెను హిరణ్మయములు, రాజతములు, స్ఫాటికములు నగు పెక్కు పాత్రలును; హిరణ్మయములు, రాజతములునగు పెక్కు కలశములు; జాంబూనదమయములగు గిండి చెంబులు, స్ఫటిక నిర్మితములగు భాజనములు; జాంబూనద హిరణ్మయములగు కుంభములు; మణిఖచితములగు ఉంగరు మద్యపాత్రములు గూడ కన్పించెను

ఇక రావణుని యావాస గృహమున హనుమంతుడు, పెక్కు లతా గృహములను, చిత్ర గృహములను, నిశాగృహములను, గూడ దర్శించెను.

ఇక యిపుడు, ఉద్యాన కళకు ఉదాహరణమని చెప్పదగిన, రావణుని ప్రమదావనమగు, అశోకవనికను దర్శించి యానందించుదముగాక!

రామదూతయగు హనుమంతుడు లంకానగరమునగల సకల గృహములను, మధుశాలా, చిత్రశాలాదులను, గృహోద్యాన వీధులను, భూమిగృహ, చైత్యగృహ, విహారగృహములను, ప్రాకారాంతర వీధులను, సీత కొఱకు గాలించెను. కాని యెక్కడను సీత యగుపించక పోవుటచే, చాల నిరాశపడి పరి పరివిధముల తలంచి, రావణ భవన ప్రాకారమునంటియున్న, ప్రమదావనమగు అశోకవనికను, చివరి యత్నముగ నన్వేషింప నిశ్చయించి, అశోక వనిక ప్రాకారముపై దూకి యక్కడనే గూర్చుండి, ఆ వన సౌందర్యమును జూచి, పిదప ఆ వనమున ప్రవేశించెను.

### అశోక వన వాటిక :

లంకలోని యశోకవాటిక, అనాటి ఉద్యానవన నిర్మాణ కళకు,

రావణుని ప్రకృతి ప్రేమకు, కళా వైదగ్ధ్యమునకు భోగదృష్టికిని తార్కాణమని నుడువ వచ్చును. అట్టి యుద్యాన వనమీ భూమండలమునందే యరుదని చెప్ప వచ్చును అశోకవాటిక రావణుని భవనము వెలుపల నిర్మించబడి, ఒక ప్రాకారము ద్వారా వేరు చేయబడి యుండెను.

"రావణుని మహాభవన ప్రాకారపుగోడపై కూర్చొని హనుమంతుడు వసంతాది యందు పుష్పితాగ్రములగు వివిధ వృక్షములను చూచెను. ఆ వనమున పొడుగైన మద్ది చెట్లు, సుందరమైన అశోక వృక్షములు, బాగుగ పుష్పించిన చంపకములు, విరగి చెట్లు, నాగ కేసరములు, మామిడి చెట్లు, కపిముఖాది పెక్కు వృక్షములుండెను. లతా నికుంజావృతమగు ఆమ్ర వణము (మామిడి తోపు) గూడ నుండెను. అతడు ఆ ప్రాకారము నుండి, ధనుర్ముక్తమైన బాణము వేగముతో ఆ వృక్ష వాటికను దాటి అశోక వని కలో ప్రవేశించెను. ఆ యశోక వనిక రాజత, కాంచనాది సుందర వృక్షము లతో పరిగతమై ఉదయించు సూర్యరోచిస్సులను వెదజల్లుచు మిక్కిలి దర్శనీయముగ నుండెను. వివిధములగు మృగసంఘములు, చిత్రములగు వివిధ వనములతో నొప్పు ఆ యశోక వనికయందు నివసించుచుండెను. కోయిలల కుహూరావములతోడను, మత్తషట్పదముల ఝుంకారములతోడను, వివిధ విహగముల మధుర కూజితముల తోడను నా యశోకవనము ప్రతిధ్వ నించు చుండెను. మృగ-పక్షి సమాకులమును, మత్త మయూరముల కేకారావ సంఘుష్టమునగు నావనము, దర్శకులకు మోదమును గూర్చుచుండెను. హను మంతుడు సీతాదేవిని, ఆ వనమున నన్వేషించుచు వృక్షములపై నిద్రించు పక్షులను, కపి స్వభావమును బట్టి లేపగొట్టెను. సంభ్రమమున పైకి ఎగురు విహంగముల పక్షకంపనిర్గతమగు వాతము వలన, అక్కడనున్న వృక్ష ములు, వివిధ వర్ణములగు పుష్పరాశులను వర్షించెను. వివిధ వర్ణములగు పుష్పరాశులచె పరిగతుడగు ఆ హరివీరుడు, అశోకవన మధ్యమున నిర్మిత మగు పుష్పగిరివలె తోచుచుండెను. శరీరావసక్తములగు వివిధ పుష్పములతో శోభించు హనుమ, వృక్షముల గుబురులలో అటునిటు పరుగిడు చుండుటను చూచి, తద్వనస్థితములగు భూతములు "వసంత"మని భ్రమపడిరి. వృక్షముల నుండి రాలిన వివిధ పుష్పములతో నలంకృతమగు ఆ యశోకవన భూమి,

వివిధాలంకారముల నలంకరించుకొనిన ప్రమదవలె తోచుచుండెను. హను మంతుడు తన కపి స్వభావమునుబట్టి యా వనమందలి వృక్షములను వేగముగ నటు నిటు ఊపగా, ఆ వృక్షముల యందలి పత్ర, ఫల పుష్పము లన్నియును, రాలిపోయెను. రాలిపోయిన పత్రశిఖరములు గలవియును, రాలి పోయిన ఫలపుష్పములుగల అ వృక్షములు, వస్త్రాభరణములను జూదములో ఓడిపోయిన జూదగాండ్రవలె దీనముగ దోచుచుండెను. మారుత కంపితములై, మోడులతో మాత్రమే మిగిలిన, ఆ వృక్షములిపుడు, తమ యాకర్షణమును కోల్పోయి, ఏ ప్రాణికిని ఆశ్రయించుటకు వీలులేకుండగ ఐపోయెను. ఆ వనములోని వృక్షములను, లతాకుంజములను తన వాలాఘాతములతోను, హస్తముల చఱపిళ్లతోను, పాదమర్దనముల తోడను ఉజాడు - ఉజాడుగ చేసివేసెను. హనుమంతునిచే నీవిధముగ భగ్నము చేయబడిన యశోక వనికను చూచి, దైన్యవ్యాకులితమైన ఆదికవి సున్నితమైన మనస్సు నుండి వెలువడిన ఈ ఛందశ్చిత్రమును చూడుడు:-

> విధూత కేశీ యువతిర్యథా మృదిత వర్ణకా।
> నిపీత శుభ దంతోష్ఠీ నఖైర్దంతైశ్చ విక్షతా॥
> తథాలాంగూల హస్తైస్తుచరణాభ్యాంచ మర్దితా।
> తథై వాశోక వనికా ప్రభగ్న వనపాదపా॥

(5/14/18,19)

తా॥ విడిపోయిన కేశపాశము గలదియును; మృదితమగు అంగరాగము గలదియు, నిపీతాధ రోష్ఠయును, నఖ-దంత-క్షత పీడితయునగు యువతివలె, హనుమంతుని లాంగూల, హస్త, చరణములతో మర్దింపబడిన, ప్రభగ్నవన వృక్షములుగల అశోకవనిక తోచుచుండెను.

ఆ కపి ప్రవరుడు, ఆ యశోక వనికలోగల, లతావితానములను, ప్రబలమైన గాలి, ప్రావృట్కాల మేఘమాలను, ఛిన్నాభిన్నము గావించి నట్టుగ, ఛిన్నాభిన్నము చేసెను,

అటు తరువాత హనుమంతుడు, వన మధ్యమున ప్రవేశించెను. ఆ యశోక వనిక, కల్పలతలతోను, వివిధ పుష్ప ఫల వృక్షములతోడను నిబిడమై

దివ్య రసములను వర్షించుచు, దివ్యసౌరభములను గుబాళించు చుండెను. అన్ని ఋతువులతోను పుష్పములు తొడగు వృక్షములను, ఫల సంభృతము లగు వృక్షములను గూడ హనుమ యక్కడ జూచెను. ఇక యా వనములోని పుష్పించిన యశోకములు, ఆ యశోక వనికను, తమ రాగ రంజిత ప్రభలతో ముంచి యెత్తుచు సూర్యోదయ సంభ్రమమును కలుగ చేయుచుండెను. ఆ యశోకవనమున వేలాది యశోకములు తనరారు చుండెను. వానితో కొన్ని బంగరురంగు కల్గినవియు, కొన్ని యగ్నిజ్వాలా వర్ణములు, మరికొన్ని నీలాఞ్జన వర్ణములై మెఱయుచు, తన్నామమునన్వర్థము గావించు చుండెను. క్రిందినుండి పైదాకా పుష్పించిన నచటి యశోకములు, శోకనాశకములై మిక్కిలి యానందమును గూర్చుచుండెను. ఆ వనమున గల పెక్కు కృత్రిమ వనములు (పార్కులు) విశాలములగు పెక్కు భూమి భాగములు (మైదానములు), కొండలు, వాగులు, జలపాతములు, కనువిందు గూర్చు చుండెను. అగ్నివలె దేదీప్యమానమై తనరారు పెక్కు సువర్ణ వృక్షములు గూడి నా వనమున నుండెను ఆ సువర్ణ వృక్షములందు గట్టిన చిఱుగంటలు, వాయు ప్రకంపనములచే కదల్పబడి చిఱుఘోషలు చేయు చుండెను. పుష్పితాగ్రములగు సువర్ణ వృక్షములు తరుణాంకుర పల్లవములతో నుద్దీపించుచు, దర్శకుల చిత్తములందు వలపుల ననలొత్త చేయుచుండెను. అక్కడ వకుళ వృక్షములు చాల మనోజ్ఞములుగ నుండెను. ఆ వనమునగల పుష్పించిన గన్నేరు వృక్షములు, బాగుగ పూచిన మోదుగులు తమ పర్యంత ప్రదేశములను తమ కాంతులతో ముంచి యెత్తుచు సర్వతఃప్రదీప్తమైన (దావానలముచే) పర్వత ప్రదేశములను, తోపింప చేయు చుండెను ఇక యక్కడ నున్న పుష్పించిన పునాంగ వృక్షములు, సప్త పర్ణములు, ఇంకను ప్రవృద్ధ మూలములగు పలు పుష్ప వృక్షములు. ఆ వనమును నూత్న-వినూత్న శోభలతో ముంచి యెత్తు చుండెను.

ఆ యశోక వనికలోగల వివిధ పుష్ప ఫల వృక్షములు తమ మదు గంధముల తోడను మధుర రసముల తోడను, మందమారుతముల తోను మృగ గణ, పక్షి సంఘముల మధురా రావముల తోడను దర్శకుల చిత్తములకు పంచేంద్రియములతో సహా తర్పణము గావించు చురడెను. పలు జాతుల

పుష్ప వృక్షముల నుండి రాలిన వివిధ వర్ణములు గల పుష్పములతో నాచ్ఛాదితమైన యశోకవన తలభూమి, నానా భూషణాలంకృతయగు ప్రమదవలె కానవచ్చుచుండెను. పుష్పజ్యోతిర్గణ వ్యాప్తమైన అశోకవనిక, గ్రహ నక్షత్రాది జ్యోతిర్గణములతో భాసించు నాకాశమువలెను, చిత్ర - విచిత్రములగు పుష్పరత్న సమృద్ధమైన ఆ యశోకవనిక బహురత్న సమృద్ధమై ఐదవ సముద్రమువలెను కన్పట్టుచుండెను. ఇంకను ఆ యశోకవాటికలో గల పుష్ప ఫల వృక్షములు ఛత్రములు పట్టినట్లుగ చాలగు బురుగ నలముకొని యుండెను. ఆ వృక్షముల చుట్టును, వెండితోను, బంగారముతోను వేదికలు, అరుగులు నిర్మించబడి యుండెను. ఇక యక్కడ గల లతా నికుంజముల శోభయనిర్వచనీయము అక్కడి పుష్ప వృక్షములలో కులాయములు నిర్మించుకొని నివసించు విహగములు పైకెగిరినపుడు, వాని పక్ష నిర్గతములగు వాతములచే సమాహతములైన వృక్షములు పూల వానలు గురియుచుండెను. ఆ పూల జడులలో అశోకవన వృక్ష గుల్మములందు ప్రవేశించిన పవన తనయుడు పుష్పమయమగు కొండవలె కన్పట్టుచుండెను వృక్ష ఖండముల మధ్యగ పరిభ్రమించు, పుష్పావృత తనుయష్టిగల పావనిని చూచి సకల భూతములు వసంతమని భ్రమపడెను.

అటు పిమ్మట ఆ కపి ప్రవరుడు, కాంచన, రాజత, మణి భూములను దర్శించెను. ఆ తరువాత, మహార్హములగు మణి సోపానములతో నొప్పుచున్నవియు, ముక్తా ప్రవాళముల వర్ణములతో శోభించు సికతాయుక్తములును, చక్రవాకోప శోభితములును, నత్యూహ (కూకురుగిద్దంగి పిట్ట) రుత సంఘుష్టములును, హంస-సారస నినాదితములును, జలపూర్ణములును, వివిధాకృతులును గల పెక్కు దిగుడు బావులను చూచెను.

దీర్ఘములైన తీరజ వృక్షశోభితములును, అమృతోపమములగు స్వచ్ఛ జలములుగల నదులు, ఆ దిగుడు బావులలో నీరు నింపుచుండును. ఆ దిగుడు బావులు, లతా శతపరిగతములై, సంతాన (కల్పవృక్షములు) వృక్షపతితములగు పుష్పములచే నాచ్ఛాదితములై, గన్నేరు గుల్మములచే పరిగతములై, నానా గుల్మలతావృతములగువనావృతములై, చాల సుందరముగ నుండెను.

ఆ వనముననే మేఘమండలము నంటుచున్నట్లుగ నున్న శిఖరములతో నొప్పు చున్నదియు, బహుకూట మండితముననగు విచిత్రకూటమను పర్వతమును హనుమంతుడు చూచెను. పెక్కు శిలాగుహలతో నొప్పుచున్నదియు. నానా వృక్ష సమన్వితమునునై యా విచిత్రకూటగిరి తన పేరునకు తగినట్లుగ నుండెను. ఆ పర్వతముపై నుండి ఒక నది క్రిందకు పడుచుండెను ఆ నది కొంత దూరము, పర్వత తలమున ప్రవహించి తిర్గి పర్వతముదెసకు ప్రవహించుచుండెను. ఆ నదీతీరమున నదీ జలముల నంటు శాఖాగ్రములు గల పెక్కు తీరవృక్షములుండెను. ఆ నదిని చూచి, కవి హృదయములో మెదలిన, తత్కాల సామాజిక స్థితిని ప్రతిఫలించు నొక సుకుమార భావనకు, కవి స్పందించి చిత్రించిన ఈ సామాజిక భావ చిత్రమును దర్శించి వినోదింపుడు:

> ద దర్శచనగా త్తస్మాన్నదీం నిపతితాం కపిః।
> అంకా దివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్॥
> జలే నిపతి తాగ్రైశ్చ పాదపైరుప శోభితామ్।
> వార్యమాణా మివక్రుద్ధాం ప్రమదాం ప్రియబంధు భిః॥
> పునరావృత్తతో యాంచ దదర్శ సమహా కపిః।
> ప్రసన్నా మివ కాంతస్య కాంతాం పునరుపస్థితామ్॥
> (5/14/29-31)

తా॥ ఆ కపి ప్రవరుడు ఆ పర్వతమునకడి క్రిందకుపడు ఒక నదిని చూచెను ఆ నది, ప్రియుని యంకము (ఒడి) నుండి ఎగిరిపడిన ప్రియురాలి వలె నుండెను.

జలమునందు పడిన అగ్రభాగములు గల వృక్షములతో నొప్పు ఆ నది ప్రియ బంధువులచే, నివారింపబడుచున్న క్రుద్ధ (భర్తపై) రాలగు ప్రమద వలె నుండెను.

వృక్షాగ్ర భాగములతో వారితయై, వెనుకకు మరలి, కొండవైపు ప్రవహించు ఆ నది భర్తయందు ప్రసన్నురాలై, తిర్గి భర్తవద్దకు వచ్చిన ప్రమద వలె కన్పట్టు చుండెను.

వాల్మీకి కాలమున, భర్తపై స్త్రీలు అలిగి పుట్టినింటికి బయలుదేరుట, వారి ప్రియబంధువులు పుట్టినింటికి పోకుండగ, నయముననో, భయముననో వారించుట, తిర్గి వారు, కోపము తగ్గిన తరువాత భర్త వద్దకు మఱలి వచ్చుట యను ప్రథ సమాజములో ఉండవచ్చును. ఆ ప్రథనే, యీ నదీ దృశ్య వర్ణనమున వాల్మీకి చిత్రించి యున్నాడు ఆ పర్వత సమీపముననే, వివిధ పక్షి సంఘములతో నొప్పు పుష్కరిణులను హనుమంతుడు చూచెను. ఆ గిరికి సమీపమున, శీతల జలములు గలదియు, మణి ప్రవరములు పొదుగ బడిన మెట్లుగల్గినదియు, ముత్తెముల వలె స్వచ్ఛమైన ఇసుకలు కలదియనగు ఒక అందమైన దిగుడుబావి అట యుండెను. బహువిధ మృగ సంఘ నిషేవిత మును, వివిధ వృక్షములతో నొప్పు చిత్రకానన పరిగతమును, విశ్వకర్మ నిర్మితములగు సుందర ప్రాసాదములు, ఒడ్డున కలదియు, కృతిమ కానన యుక్తమును, ఛత్రాకారములైన ఫల, పుష్ప వృక్షముల క్రింద వినిర్మితమగు వితర్దికల (తిన్నెలు)తో నొప్పుచున్నదియునగు ఆ దీర్ఘిక చాల యందముగ నుండెను. తత్సమీపమున, పెక్కు లతా వితానములతో పరిగతమును, దట్ట మైన పత్రములతో నొప్పుచున్నదియు, హేమమయమగు వేదికా పరివృతము నునగు ఒక శింశపా వృక్షమును చూచెను ఆ శింశపా వృక్ష సమీపమున, బహువిధ పాదములు గల సెలయేరుల తీరములందు అందముగ కన్పించు సువర్ణ వృక్షములను చూచెను. సువర్ణకాంతులనీను, ఆ కాంచన వృక్షషండ మధ్యగతుడైన కనక సువర్ణ దేహయష్టిగల హరిప్రవరుడు తనను మేరుప్రభా సమావృతుడగు సూర్యుని బోలియున్నట్లు తలపోసెను. సుష్పితాగ్రమును, తరుణ పల్లవ నిబిడమై, రుచిరముగ నున్న ఆ శింశపా వృక్షముపై హను మంతుడెక్కి సీత కొఱకు, నలుదిక్కుల దృష్టిని బరుపసాగెను. తత్సమీ పముననే చందన, చంపక, వకుల వృక్షములు గలదియును, ద్విజసంఘ నిషేవితమును, సుందర కల్హార సుశోభితమునునగు నదిని జూచెను. సీతా దేవి యా వనముననే యున్న సంధ్యోపాసనకై యక్కడకు తప్పకరాగలదని యూహించి ఇతరుల కగపడకుండగ కూర్చొని యుండెను గుబురుగానున్న ఆ శింశపా వృక్షమున దాగియున్న హనుమంతుడు, సంతాన కలతల తోడను వివిధ వృక్ష గుల్మములతోను, మృగ పక్షి సంఘములతోడను రమ్యముగనున్న,

నందనవనమోయని యన్పించు ఆ యశోక వనిక యందు, రమ్యములగు హర్మ్య ప్రాసాదములను, కాంచనోత్పల సంఛన్నములగు దిగుడు బావులను, బహువిధ భూమి గృహముల, బహ్వాసన కుథలను, సర్వర్తు పుష్ప ఫల భారావనతములగు వృక్షములను, పుష్పితములగు అశోకములను, చిత్ర విచిత్ర వర్ణముల పుష్ప గుచ్ఛములతో తనరారుచు, శోకాపనోదకములై యొప్పు అనేక విధములగు అశోక వృక్షములను, వికసించిన కర్ణికారములను, పూచిన మోదుగులను చూచి చాల యానందించెను. ఆ వనము మత్త షట్పద ఝుంకారములతో నినదించుచుండెను.

ఆ వనమునందింకను పున్నాగ, సప్తపర్ణ, చంపకోద్దాలకాది వివిధ వృక్షములు విరియ బూచి కన్నుల పండువు చేయుచుండెను. ఆ యశోక వనిక యందు నీలాంజన ప్రసూనములను పూయు నీలాశోక వృక్షములు, వివిధ వర్ణముల పుష్పములను పూయు వేత్స్వేరు వర్ణముల యశోక వృక్షములు లెక్కకు మిక్కుటముగ నుండుట చేతనే, ఆ వనమున కశోకవనమని పేరు వచ్చెను. ఈ యశోక వనమునకు సౌందర్యమున, నందన, చైత్రరథాది దివ్యోద్యానములుగూడ దీటుగావు. వివిధ వర్ణములు గల పుష్పరాశులతో సంఛన్నమగు ఆ యశోక వనభూమి, నానారత్న సుశోభితమగు పంచమ సాగరమోయను నట్లుండెను. వివిధ పుష్ప సౌరభ సురభితమగు ఆ యశోక వనిక, ద్వితీయ గంధమాదనగిరియని యన్పించు చుండెను.

ఈ యశోక వనికా మధ్యముననే వెయ్యి స్తంభముల విశాల చైత్య ప్రాసాదము, కైలాసమువలె మిక్కిలి శ్వేతమై, ప్రవాళములతో నిర్మించబడిన సోపానములు, తప్తకాంచన నిర్మితములగు వేదికలు కల్గి, తన రోచిస్సులతో చూపరుల దృష్టులను మిరుమిట్లు గొల్పుచు, ఆకసమునంటు చున్నంత ఎత్తుగ నుండి చాల నిర్మలముగ నుండెను. ఈ భవనమందే లంకేశ్వరుడు సీతాదేవిని బంధించియుంచెను. ఈ భవనము తన వాస్తుకళచే చూపరులను ముగ్ధులను గావించు చుండెను.

నిజముగ నీ యశోక వనము రామాయణ కాలమున, రాక్షసుల మహోన్నతమగు ఉద్యానవన సంవర్ధన కళాప్రీతికి, నైపుణ్యమునకు, కళాదృష్టికి, సౌందర్య దృష్టికిని యుజ్జ్వలోదాహరణము.

చంద్రోదయ వర్ణనము :

హనుమంతుడు లంకానగరమున సీతాన్వేషణార్థమై రాత్రి సమయమున చంద్రోదయ వేళ ప్రవేశించెను.

చంద్రోదయము చేతన ప్రాణులకు మాత్రమేగాక, అచేతనములగు సముద్రాదులకు గూడ మిక్కిలి యుత్సాహప్రదము. ఏమియు నెఱుగని పసికందువులు గూడ చంద్రుని చూపినంతనే, కాలు చేతుల నెగుర వేయుచు తమ యుల్లాసమును ప్రకటింతురు. చంద్రుని యమృతమయమగు కిరణముల సంస్పర్శముచే, చెట్లు చేమలు, లతలు, పొదలు గూడ ఆనందమున పులకించును, సముద్రుడు పొంగి పోవును, పశు పక్ష్యాదులు ఆనంద పారవశ్యమందును. వేయేల, చరాచరాత్మకమగు ఈ ప్రకృతియంతయు నానంద పరవశమగును. కనుకనే వాల్మీకి ఈ సుందరకాండమునందు, సౌందర్య నిధియగు చంద్రుని వర్ణించి, పరవర్తి కావ్య నిర్మాతలు చంద్రోదయ వర్ణనము చేయుటకు మార్గమేర్పరచినాడు.

నిజముగ వాల్మీకి చేసిన ఈ చంద్రవర్ణనము వాల్మీకి సౌందర్య దృష్టికిని, కావ్యకళా వైదగ్ధ్యమునకును మచ్చుతునక.

హనుమంతుడు తారామధ్యగతుడైన చంద్రుని, నిర్మలాకాశమున దర్శించెను. ఆ చంద్రుడు తన సాంద్రమైన వెన్నెలయను చాందనీ వస్త్రముతో సకల భూమండలము నాచ్ఛాదించుచున్నట్లుండెను. తారా మధ్యగతుడగు చంద్రుడు గోగణ మధ్యగతమైన మత్త వృషభము వగిది కన్పట్టు చుండెను. అతడు సర్వలోక వ్యాప్తమైన పాపమును (అంధతర రూపమైన) తన ధవళ చంద్రికలతో వినాశము చేయుచు, తన యమృత కిరణ సంస్పర్శముచే సముద్రుని యుప్పొంగునట్లు చేయుచు, సకల భూతముల నాహ్లాదమున ముంచి తేల్చుచు, నీలాకాశ క్షితిజమునుండి మెల్లమెల్లగ పైకెగబ్రాకు చున్నట్లుగ నుండెను.

ప్రభాత వేళ రమ్యముగ కన్పట్టు మందగిరి శోభయు, ప్రదోషవేళ నేత్ర పర్వము గావించు సాగర శోభయు; పగటివేళ నిండు సరోవరమున పూర్ణముగ వికసించి, నయనానందమును గూర్చు పద్మముల సర్వాతిశాయి

యగు సౌందర్య లక్ష్మియును; రాత్రివేళల పరిపూర్ణకళలతో నింగిని చెన్నొందు చంద్రుని యందు గానవచ్చు చుండెను. గగన వీధిలో తన యమృత కిరణములతో వెల్గొందు చంద్రుడు వెండి పంజరములోనున్న హంసవలెను, మందరగిరి గుహలయందు ఠీవిగ వరుండిన సింహము వలెను, మత్తగజము నధిరోహించిన యుద్ధవీరుని వలెను, కడు శోభాయమాన ముగ నగుపించు చుండెను. అప్పటున, తన పూర్ణకళలతో నాకాశము ప్రకాశించు చంద్రుడు, తీక్ష్ణశృంగములతో నొప్పు మత్త వృషభము* వలెను, ఉత్తుంగ శిఖరములతో నయనాకర్షణము గావించు శ్వేత పర్వత శృంగము (కైలాస శిఖరము) వలెను, బంగరు తొడవులు తొడిగిన దంతములతో ముచ్చట గావించు మత్తగజము** వలెను కనులకింపు గల్గించు చుండెను. హరిణాంకితుడైన చంద్రుడు, శీతలజల, హిమ, పంకాది***సంసర్గ దోషరహితుడై, సూర్యకిరణ గ్రహణము మూలమున, అంధకార రూపమగు పంక సంస్పర్శము లేక, ప్రకాశలక్ష్మికి తావలమై, నిర్మలాంకుడై కడు మనోజ్ఞముగ తోచుచుండెను. నిర్మలమగు గగన తలమున రాచ ఠీవితో వెల్గొందు రేరాజు, శిలాతలముపై (తన గుహ ముంగిట) శయనించిన మృగరాజు వలెను, మహా రణరంగమున నున్న మత్తహస్తి వలెను, రాజ్యాభిషిక్తుడగు

---

1. "తతరిం సరు ధ్యంగిత మంశు మతం; జ్యోత్స్నా వితానం ముహు రుద్వమన్తమ్। దదర్శ ధీమాన్ భువి భానుమన్తం; గోష్ఠే వృషం మత్త వావ భ్రమన్తమ్॥ (సుం॥ కాం॥ ౫-1)

2. "స్థితః కకుద్మానివ తీక్ష్ణశృంగో; మహాచలః శ్వేత ఇవోర్ధ్వశృంగః। హస్తీవ జాంబూనద బద్ధ శృంగో; విభాతి చంద్రః పరిపూర్ణ శృంగః॥ (సుం॥ కాం॥, సర్గ ౫/౫)

3 "వినష్ట శీతాంబుతు పారపంకో; మహాగ్రహ గ్రాహ వినష్ట పంకః। ప్రకాశ లక్ష్మ్యాశ్రయ నిర్మలాంకో; రరాజ చంద్రో భగవాన్ శశాంకః॥ (సుం॥ కాం॥, స. 5/6)

రాజేంద్రునివలెను దర్శకులకు నేత్రోత్సవము గావించుచుండెను.* లంకా నగరమున, ప్రదోషకాలము, నిర్మలమైన చంద్రుని వెన్నెలచే, నష్టమైన తిమిరము గలదియై; ప్రవృద్ధులగు నక్తంచరుల పిశితాహారములచే దుష్టమై; కామినులయందు ఉద్రిక్తమైన కామాగ్నిచే సంధుక్షితమై; సర్వప్రాణి చిత్తముల నానంద పరవశత నొందించు నిర్మల చంద్రికార్చితమై తనరారెను. అటి యలతి రేఖలతో రామాయణ ఋషి నిర్మించిన ఈ చంద్ర సౌందర్య చిత్రములు, కావ్య శిల్ప నిర్మాణమునకు మచ్చు తునకలు, కావ్య భండార మున బహిరపరచ బడిన అనర్ఘ రత్నములు. ఇట్టి చిత్రముల నిర్మాణము ద్వారా రామాయణ ఋషి దృశ్యమానమగు భౌతిక జగత్తు మాటున తొణకిస లాడు అభౌతికమగు అనంత సౌందర్య సాగరము దెసకు పాఠకుల చిత్తములను పర్వెత్తించినాడు. పరిమితమగు భౌతిక జగత్తునందే ప్రాకులాడు మానుష మానసముల నపరిమిత దివ్య సౌందర్య జగత్తు దెసకు మళ్లించినాడు. త్రిలోకముల నావరించు ననంత సౌందర్య సాగరమున ముంచియెత్తినాడు. నింగిని భూమిని, తన సౌందర్య దృష్టితో నేకము గావించిన, రామాయణ ఋషి నిర్మించిన, పూర్ణచంద్రుని యీ యమర చిత్రమును గూడ కన్నులార చూచి, సౌందర్యామృతమును తనివితీర గ్రోలి యానందింపుడు:-

> "శంఖ ప్రభం క్షీర మృణాల వర్ణ ముద్గచ్ఛమానం వ్యవభాస మానమ్। దదర్శచన్ద్రం స, కపిప్రవీరః, పోప్లూయమానం సరసీవ హంసమ్॥" (సుందరకాండము 2/58)

శంఖమువలె స్వచ్ఛముగను, క్షీరమువలె మిక్కిలి తెల్లగను, తామర తూండ్లవలె నిర్మలమై, మిక్కిలి సుకుమారముగను, వెల్గొందుచు చంద్రుడు

1. "యా భాతి లక్ష్మీర్భువి మందరస్థా యథా ప్రదోషేషు చ సాగరస్థా।
తథైవ తోయేషుచ పుష్కరస్థా రరాజ సా చారు నిశాకరస్థా॥
" హంసో యథా రాజత పంజరస్థః స్సింహో యథా మన్దర కన్దరస్థః।
వీరో యథా గర్వితకుఞ్జరస్థ శ్చన్ద్రోఽపి బభ్రాజ తథాఽమ్బరస్థః॥
"శిలాతలం ప్రాప్య యథా మృగేన్ద్రః; మహారణం ప్రాప్యయథా గజేన్ద్రః
రాజ్యం సమాసాద్య యథా నరేంద్ర; స్తథా ప్రకాశో విరరాజ చన్ద్రః॥
(సుందరకాండము, 5/3, 4, 7)

మెల్లమెల్లగ నింగిని పైకెగ బ్రాకుచుండెను. మహా మనస్వియగు హను మంతుడు, పుష్కరిణిలో స్వచ్ఛందముగ విహరించు హంసవలె, గగన పుష్కరిణిలో సుకుమారముగ నీదుచున్న చంద్రునిజూచి పరమాహ్లాదము నొందెను.

ఈ చిత్రము; వర్ణ సౌందర్య, కాంతి సౌకుమార్య, తారళ్య, ప్రభా సాంద్రతలను మేళవించి, ప్రాచేతసుడు నిర్మించిన సౌందర్య చిత్రము క్షీరములు, మృణాళములు, శంఖములు, హంసలు, అనునవి నల్లు, లోక మున తమ స్వచ్ఛమైన తెలుపుతనమునకు ప్రసిద్ధములు. కాని క్షీరముల లోని వర్ణ సాంద్రత, తారళ్యములు దానికే పరిమితములు. శంఖములోని శుద్ధత దానికే పరిమితము. ఇక, వర్ణముతో బాటుగ సౌకుమార్యము మృణాళ తంతువుల వఱకే పరిమితము. ఇవి యన్నియు హంసయందు ప్రోవుపడి నట్లుండును. అట్టి హంస, పుష్కరిణిలో స్వచ్ఛందముగ వెన్నెల రాత్రులందు విహరించుచున్నచో, దాని వర్ణ సౌందర్యము, గతి సౌకుమార్యము, చంద్ర కిరణములలో తళుకు తళుకుమను దాని నిర్మల శ్వేతకాంతి మొదలగు వాని ద్వారా బహిర్గతమగు సౌందర్యమును చిత్తముతో నూహించ వలసినదేగాని, ఇదమిత్థమని చెప్పుటకు వాక్కులు సమర్థములుగావు. ఈ యన్ని గుణము లను, చంద్రునియందు ప్రదర్శించుటయే కాక, నిర్మలమగు గగన పుష్క రిణిలో, మానస పుష్కరిణిలో స్వచ్ఛందముగ విహరించు హంసవలె స్వచ్ఛందముగ నీదుచున్నట్లు ప్రదర్శించిన రామాయణ ఋషి సౌందర్య భావన, ధ్యానములో స్తరాళములకు పరివ్యాప్తమై, పాఠకుల (దర్శకుల) చిత్త మరాళములను నానంద సాగరమున నీదులాడించినది. పరిమితమగు భౌతిక జగత్తు మాటుని తొనకిసలాడు అనంత సౌందర్య సాగరమువైపు మానుష మరాళములను పర్వేత్తించి, అనంత దివ్య సౌందర్య దర్శనమును చేయించు టతో బాటుగ, స్థూల జగత్తునుండి, సూక్ష్మమును సర్వ జగదాధార భూత మును, శివైక మాత్రమును, అనంతమునునగు వస్తు (ఆత్మ) సందర్శనమును, పాఠకులకు కావించుటయే రామాయణ ఋషి ఇట్టి సుందర చిత్రములు నిర్మించుటలో గల యాంతర్యము.

అట్లే ప్రాభాతిక వేళ మందరగిరిపై నర్తించు లక్ష్మి యొక్క నాట్య శోభను; ప్రదోష సమయమున సాగరమున చెలొాందు లక్ష్మియొక్క చెల్వును

పగటివేళ నిండు పుష్కరిణుల యందు పరిపూర్ణముగ వికసించిన పుష్కర ములలో తనరారు సౌందర్యలక్ష్మి నిర్మలహాసమును, నింగిని వెల్గొందు పూర్ణచంద్రుని చంద్రికలలో ప్రదర్శించి సౌందర్యలక్ష్మి యననేమో, రామాయణ కవి, పాఠకుల కవగత మొనరించియున్నాడు

అంతేగాదు, పరిపూర్ణ కళలతో నాకసమున వెల్గొందు చంద్రునిలో, తనగుహ ముంగిట శిలా తలముపై పరుండిన మృగేంద్రుని ఠీవిని, మహా రణరంగములో నిర్భయముగ నిల్చియున్న మత్తవారణములోని మదమత్తతను, సింహాసనమున రాజ్యాభిషేకము చేయించుకొను నరేంద్రుని రాజసమును, ఉల్లాసమును గూడ చూపి తన చంద్ర చిత్రమును చైతన్యముతో నింపినాడు ఇట్టి యపురూపమగు సౌందర్య చిత్రములతో తన కావ్యమును నింపి, తన మహాకావ్యమును ప్రాచేతసుడు కావ్య జగత్తునకే తలమానిక మొనర్చి యున్నాడు.

భగవాన్ వాల్మీకి సుందరకాండలో చేసిన నగర, వన, చంద్రోదయ, గిరి నదీ దీర్ఘికా, సరోవర, సముద్రాది వర్ణనము, అభూత పూర్వము, అద్భుతము, అని వేఱుగ చెప్పనవసరములేదు. నగర వర్ణన సందర్భమున, రామాయణ కావ్య శిల్పి, కేవలము నగర నిర్మాణ సంబంధమగు వాస్తు సౌందర్య ప్రదర్శన మాత్రముతోనే తృప్తిపడక, తత్సౌందర్య సమృద్ధికొఱకై, ఆయా శిల్పులు, ప్రత్యేకించి ప్రదర్శించి వారి వారి కళలలో వారికి గల కళా నైపుణ్యమునుగూడ అద్దముపట్టి చూపినాడు. లంకానగరమును, ఒక బృహద్భవన సముదాయ మాత్రముగగాక, సర్వాలంకార సంశోభితయగు ప్రమదగా చిత్రించి చేర్శకుల చిత్తములందు రాగాత్మక వృత్తిని అతిశయింప చేసినాడు భౌతిక దృష్టితో చూచినను, ఆ నగరములోని యుత్తుంగ ప్రాసాదములు, వానిపైగల చంద్రశాలలు, వానిలోని ముక్తామణి కుట్టిమములు, కుడ్య చిత్రములు, శిల్పములు, స్వర్ణ సంపత్సమృద్ధి, మొదలగు విశేషములు, ఎవ్వరి హృదయములనైన యలరింపకమానవు. ఇక పుష్పక విమానము, అక్కాలమున, విశ్వమునకే ఒక క్రొత్త అద్భుతము! ఇక రావణుని పానశాల శిల్ప సౌందర్యము, సర్వ సమృద్ధిమత్త్వము, చిత్తమునకే గాక, పంచేంద్రియములకు గూడ సంతర్పణము గదా! ఇక యశోకవనిక, ఉద్యానకళలో నొక వినూత్న

ప్రయోగమే గాక, సౌందర్యమున, నందన, చిత్రరథాదిదేవోద్యానముల కీడు. ఆ యశోకవాటికలోని వివిధ జాతుల యశోక వృక్షముల పెంపు, కాంచన వృక్షముల సొబగు, లతా నికుంజముల రామణీయకత, భ్రమరముల ఝుంకారములు, కోయిలల కుహూ కుహూరావములు, విహగ కూజితములు, మృగముల నాదములు, పుష్ప సౌరభములు, సర్వర్తు పుష్ప ఫల సమృద్ధి, సహస్ర స్తంభముల చైత్యప్రాసాదము, కల్హారోత్పలాద్యాచ్ఛాదితములు, మణి సోపాన యుక్తములు, హంస సారసాది నిషేవితములగు సరోవరములు, దీర్ఘికలు, పుష్కరిణులు, గిరులు, వాని నుండి ప్రవహించు వాగులు, దారు పర్వతములు, దివాగృహక, రాత్రి గృహక, కామగృహాదులు, మణికుట్టిములతో తనరారు విశాలమగు మైదానములు, దర్శకుల హృదయములను దోచుకొనక మానవు సుందరకాండములోననేగాక, ఇతర కాండములయందు గూడ వాల్మీకి ఋతుగీత సందర్భమున చిత్రించిన ప్రాకృతిక చిత్రములు కావ్య కళా భండారమున నిక్షిప్తములగు అపూర్వ కావ్య కళా సౌందర్య నిధానములు, కావ్య లక్ష్మి ముకుట నిక్షిప్తములగు అనర్ఘ రత్నములు. హనుమంతుని సముద్రోల్లంఘనమునను, లంకానగర వర్ణన సందర్భమునను, రామాయణకవి, చిత్రించిన ప్రకృతి సౌందర్యము, అతని ప్రతిభకేగాక, కళావైదగ్ధ్యమునకు, భావుకతకు, సూక్ష్మానుశీలనకును తార్కాణము. ఈ సౌందర్యము నాస్యతో దర్శనీయము. సుందరకాండాంతర్గత ప్రకృతి చిత్రణములోని విశేషమేమి యన ఇచట ప్రకృతి కేవలమాలంబన విభావరూపముననే చిత్రితమైనది. ఇది కవియొక్క శుద్ధమైన ప్రకృతిప్రేమకు నిదర్శనము. ఈ ప్రకృతి సౌందర్యచిత్రణములోని మఱియొక విశేషమేమియన, ఇక్కడ, ప్రకృతి లేక లంకానగర సౌందర్యద్రష్ట హనుమంతుడు, అతడు రాగ ద్వేష సంస్పర్శ రహితమైన నిర్మలమైన చిత్తముగలవాడు. ఈ సౌందర్య దర్శనమున నతడు కేవలము సత్య దృష్టి లేక సాత్త్విక దృష్టితో, లంకానగర సౌందర్యమును అశోకవనికాది సౌంద్యమును చూచి, చాల ముగ్ధుడైనాడు. తత్సౌందర్యమును, శుద్ధమగు మనస్సుతో నాస్వాదించినాడు దానిని మెచ్చుకొనినాడు. అతని చిత్తమున, పరదారాపహర్తయగు రావణునికి, ఈ నగర ఉద్యానాదులతో గల స్వామిత్వసంబంధము మెదల్లియున్నను, లేక యతనిలో భోగదృష్టి యున్నను;

ఈ కళా ఖండములను దర్శించి యున్నచో నతనిలో హర్షమునకు బదులుగ ఈర్ష్యాసూయా ద్వేషాదులలో నేదియేని యొక భావముద్బుద్ధమై యుండెడిది. అట్లుగాక, వ్యక్తి సంపర్క రహితముగ, కేవలవస్తు సౌందర్య దృష్టిలో నతడు, నగరోద్యానాదులను దర్శించి, దానిని భావించినందు వలననే యతడు శుద్ధమైన ఆనందమును అనగా బ్రహ్మానంద సబ్రహ్మచారియగు కళాత్మ కానందము నాస్వాదించగలిగెను. ఇక్కడ వాల్మీకి సహృదయులగు భావుకులకు ధ్వని పద్ధతిలో వ్యంజింపచేసిన శాశ్వతిక సత్యమేమియన, కళను కళాత్మక దృష్టితోడనే, దేశ, కాల, పాత్రాది విశేష సంబంధములతో ముడిపెట్టక దర్శించు భావనాశక్తిగల సహృదయుడు మాత్రమే కళాఖండములను చూచినపుడు యధార్థమగు ఆనందమొందును. రాగ-ద్వేషాది దోషజుష్టమగు మనస్సుగల వారు మాత్రము శుద్ధ కళాత్మక దృష్టితో, నేకళాఖండమును చూడజాలరు. అందువలన వారు శుద్ధ కళానందమున కధికారులుగ నుండరు. అట్లే మనమీ సృష్టిని గూడ, శుద్ధమగు, అనగా రాగద్వేషాది దోష సంస్పర్శ శూన్యమగు తాత్త్వికదృష్టితోడనే దర్శింపవలెను. అట్టి దృష్టితో దర్శింప గల్గినపుడే, ఈ యనంతసృష్టిలోని యణువణువు చాటున నుండి తొంగిచూచు దివ్యసౌందర్యమును దర్శించి బ్రహ్మానందానుభూతి నొంద, గలము. అట్టి దివ్య సౌందర్య బోధకోజ్జకే ఆలంబన విభావన రూపమున మహాకవులు ప్రకృతి వర్ణనము గావింతురు. అట్టి శుద్ధ సౌందర్య దృష్టి భావుకునిలో నున్న యపుడే, యతడు, నామ-రూపాత్మకమగు జడప్రకృతి పరిధులలో నుండి. దివ్య సౌందర్య లోకమున ప్రవేశింపగల్గును. అట్టి శుద్ధము లేక దివ్య సౌందర్య దృష్టినే "శివ దృష్టి" యందురు. అట్టి శివదృష్టిని పాఠకులలో నున్మేషితమొనర్చుటయే సుందరకాండలోని సౌందర్య వర్ణన పరమార్థము.

# అధ్యాత్మ సౌందర్యము

మనమింత వఱకును సుందరకాండలో వాల్మీకి లోకము ముందు ప్రదర్శించిన భౌతిక సౌందర్యమును చూచి యుంటిమి. ఆధ్యాత్మిక సౌందర్యమును గూడ దర్శింతుదము గాక.

సంస్కృత భాషలో "ఆత్మన్" శబ్దము పలు అర్థములలో (శరీరము బుద్ధి, చిత్తము, స్వభావము, జీవాత్మ, పరమాత్మ, కేవలాత్మ, అన్తఃకరణము) ప్రయోగించబడినను, ప్రకృత సందర్భమున జీవుడు, పరమాత్మ, అన్తఃకరణము, మనస్సు అను అర్థములలో మాత్రమే ప్రయోగించబడినది.

"అధ్యాత్మము" అనగా ఆత్మ నిష్ఠమైన, (అధికరణము అను అర్థము నిచ్చు, "అధి" అను అవ్యయముతో సప్తమ్యంతమగు ఆత్మన్ శబ్దము సమసించుట వలన 'అధ్యాత్మము" అను శబ్దము నిష్పన్నమగు చున్నది) అని యర్థము. కనుక అధ్యాత్మ సౌందర్యము అనగా, ఆత్మ నిష్ఠమైన సౌందర్యము అని అర్థము.

మానవుని చిత్తము (అంతఃకరణము) జన్మజన్మాంతరీయములగు పలు శుభాఽశుభ సంస్కారములతో నిండి యుండుటయే గాక, మరణాంతరము, తత్తత్ సంస్కారాను రూపములగు జన్మలకు మూలమగుచున్నది. అందు వలననే మనువు ఇట్లు చెప్పినాడు:-

"యాదృశేనతు భావేన యద్యత్కర్మ నిషేవతే।
తాదృశేన శరీరేణ తత్తత్ఫల ముపాశ్నుతే॥

(మ॥ స్మృ॥ 12/8)

అనగా, మనుష్యుడు, సాత్త్వికి, రాజస, తామస భావములలో, నేభావముచే ప్రేరితమైన చిత్తముతో నాయా కర్మలు చేయునో, తత్తద్భావానుగుణమైన శరీరమును పొంది ఆయా కర్మల ఫలము ననుభవించు చుండును.

కనుకనే బృహదారణ్యకమున, ఆర్తభాగయాజ్ఞవల్క్యులిర్వురికి జరిగిన వాదోప వాదములలో మానవుడు చనిపోయిన పిదప, పంచభూతముల

వికారములు పంచ భూతములలో కలసిపోగా, అతనికి తిర్గి జన్మించుటకు హేతువేమి, అను విషయమును గూర్చి వారిరువురు ఏకాంతమున చర్చించి తేల్చిన పర్యవసానమేమియన, అతడు చేసిన కర్మయే (కర్మజనిత సంస్కారమే) యతని పునర్జన్మకు మూలము అని. ఈ క్రింది మంత్ర భాగమును చూడుడు:-

> తౌహోత్క్రమ్య మంత్రయాంచక్రాతే; తౌహయ దూచతుః కర్మహైవ తదూచతుః, అథయత్ప్ర శశంసతుః కర్మహైవ తత్ప్ర శశంసతుః, పుణ్యో వై పుణ్యేన కర్మణా* భవతి, పాపః పాపేనేతి॥
>
> (బృహ॥ ఉప॥ 111/2/13)

(తా॥ యాజ్ఞవల్క్య - ఆర్తభాగులను మునులిర్వురు జన సముదాయమును విడచి, ఏకాంతమున కూర్చొని పరస్పర మీవిషయమును గూర్చి తర్కవితర్కములు చేసి చివఱకు ఒక నిర్ణయమునకు వచ్చిరి. వారు ఏది జన్మకు మూలమను విషయమును గూర్చి చెప్పిరో, అది, "కర్మయే" యని పల్కిరి. వారు దేనిని గూర్చి ప్రశంసించిరో, అదియును, కర్మయే వారు చేసిన నిశ్చయమేమియన, పుణ్యకర్మల నాచరించుటవలన మానవుడు పుణ్యయోనియుక్తుడగును అని. కనుక "కర్మయే" జన్మమూలము, అని వారు ఉభయులు నిర్ధారణచేసిరి.

ఛాందోగ్యము గూడ ఈ విషయమునే నిర్ధారించుచు నిట్లు చెప్పినది:-

మం॥ తద్య ఇహ రమణీయ చరణా అభ్యాశో హయత్తే రమణీయాం యోని మాపద్యేరన్, బ్రాహ్మణ యోనిం వా క్షత్రియ యోనిం వా వైశ్య యోనింవా। అథయ ఇహ కపూయ చరణా అభ్యాశో హయత్తే కపూయాం యోనిమాపద్యేరన్॥ అని. (ఛాం॥ ఉప॥ 7/10/7)

---

1. ఈ క్రింది మంత్రమును గూడ చూడుడు -
యథాకారీ యథాచారీ తథాభవతి। సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ పాపోభవతి। పుణ్యఃపుణ్యేన కర్మణాభవతి, పాపఃపాపేన। అథో ఖల్వాహుః కామమయ ఏవాఽయం పురుష ఇతి। స యథా కామో భవతి యత్క్రతుర్భవతి తత్కర్మకురుతే, యత్కర్మ కురుతే తదభి సంపద్యతే॥ (బృ॥ ఉప॥ 4/4/5)

తా॥ ఎవ్వరు ఇహలోకమున ఉత్తమ ఆచరణమును కల్గియుందురో, అనగా శాస్త్ర విహితములగు పుణ్య కర్మలను (ధర్మమును) చేయుదురో, వారు బ్రాహ్మణ, క్షత్ర, వైశ్యాది పవిత్ర కులములందు జన్మింతురు. శాస్త్ర నిందితములగు పాప కర్మల నాచరించినవారు, తామసములగు జన్మల నెత్తుదురు, కావున జన్మకు మూలము కర్మ, అని సిద్ధాంతీకరించ బడినది

కేవలము శాస్త్ర విహితములగు యజ్ఞయాగాది దైవారాధన పరములగు కర్మల నాచరించినవారు దేవతా యోనులందు పుట్టుదురనియు, తీవ్ర తపము వ్రతాదులు ఆచరించిన వారు* బ్రహ్మలోకమును పొందుదురనియును, పుణ్య-పాపములు న్యూనాధికముగ నాచరించిన వారు మానవ జన్మ నెత్తుదురనియు పాప కర్మములను మాత్రమే చేసినవారు అసుర జన్మముల నెత్తుదురనియు మనువు వివరించి యున్నాడు.

ఈ క్రింది వచనమును చూడుడు -

శుభా శుభఫలం కర్మ మనో వాగ్దేహసంభవమ్।
కర్మజా గతయో నృణా ముత్త మాధమ మధ్యమాః॥
(మ॥ స్మృతి॥ 12/3)

తా॥ కర్మ రెండు విధములు. శుభకర్మలు, అశుభ కర్మలు, అని. శుభ కర్మల ఫలము శుభప్రదము. అశుభ కర్మఫలము అశుభకరము ఈ కర్మలు అనునవి మనస్సుతోను, వాక్కుతోను, శరీరముతోను చేయబడును ఈ మూడు సాధనములతో చేయబడిన త్రివిధములగు కర్మలు మనుష్యునకు ఉత్తమ, అధమ మధ్యములగు గతులను కల్గించును.

మనువు ఉత్తమాధమ మధ్యమ గతులకు మూలము ఉత్తమాధమ మధ్యమ కర్మలని పల్కుచు సత్త్వవృత్తితో జీవిత యాత్రను గడపిన వారలు దివ్య యోనులందు జన్మింతురనియు, రజఃప్రధానులు మధ్యమ యోనులందు (అనగా మానుష యోనులందు) జన్మింతురనియు; తమోవృత్తి గల వారలు, తామస యోనులందు (తిర్యగాది యోనులందు) జన్మింతురనియును పల్కినాడు, ఈ క్రింది వచనమును చూడుడు:-

---

1. "యజ్ఞైర్దేవత్వ మాప్నోతి తపోభిర్బ్రహ్మణః పదమ్।
దానేన వివిధా న్భోగాన్ జ్ఞానా న్మోక్ష మవాప్నుయాత్॥

"దేవత్వం సాత్త్వికా యాంతి మనుష్యత్వంచ రాజసాః।
తిర్యక్త్వంతామ సానిత్య మిత్యేషా త్రివిధా గతిః॥*

(మ॥ స్మృ॥ 12/40)

కర్మ సాధనములగు మనో, వాక్, కాయ కృతములగు పాపముల ద్వారా లభించు జన్మలను నిర్వచించుచు మనువు, శారీర పాపముల వలన స్థావర జన్మను, వాచిక పాపముల వలన, పక్షి, మృగాదులయందు జన్మను, మానస పాపములద్వారా హీన యోనులయందు జన్మింతుననియు; పల్కెను. **

మానవుడు ఆచరించిన శుభా శుభకర్మలు అతని యంతరాత్మ నాశ్రయించి యుండును. జ్ఞానము కలుగ నంతదనుక మనోనాశము కలుగక పోవుటచే జీవుడు తాను చేసిన పుణ్యాపాపకృతములగు, జన్మలనెత్తుచునే యుండును. అంత వఱకు, ఆయా కర్మల ఫల భోక్తృత్వమతనికి తప్పదు. కఠోపనిషత్తు, జీవునికి, శుభాఽశుభ కర్మఫల భోక్తృత్వమునకు మూలమును వివరించుచు, "భోక్త" యను శబ్దమును ఇట్లు నిర్వచించినది:-

శరీరము, ఇంద్రియములు, బుద్ధి, మనస్సు ఈ నాల్గింటితో కూడు కొనిన జీవుడు, "భోక్త"యని యనబడును:-

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు।
బుద్ధింతు సారధిం విద్ధి మనః ప్రగ్రహమేవచ॥
"ఇంద్రియాణి హయాశా హుర్విషయాంస్తేషు గోచరాన్।
ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహుర్మనీషిణః॥

(కఠ॥ ఉప॥ 1/3/3, 4)

---

1. ఈ క్రింది శ్లోకమును గూడ చూడుడు:-
శుభైః ప్రయోగై ర్దేవత్వం వ్యామిశ్రై ర్మానుషోభవేత్।
అశుభైః కేవలై శ్చైవతిర్యగ్యో నిషు జాయతే॥

2. శరీరజైః కర్మదోషై ర్యాతి స్థావరతాం నరః।
వాచికైః పక్షి మృగతాం మానసై రంత్య యోనితామ్॥

(మ॥ స్మృ॥ 12-9)

జీవుడు, శరీ మను రథమును ఎక్కి యిహ-పరలోక యాత్ర చేయును. కనుక అతడు కళేబరమను రథమునకు స్వామి (యజమాని) శరీరము ఈ యాత్రా సాధనమగుటచే రథము. నిశ్చయాత్మకమగు బుద్ధి ఈ రథమునకు సారథి. సంకల్ప-వికల్పాత్మకమగు మనస్సు సంకల్ప-వికల్పముల ద్వారా, ఆయా విషయముల సేవనమునకు లేక సేవించకుండ నుండుటకు ఇంద్రియములను ప్రవర్తింప చేయుటయో, ప్రవర్తింప చేయకుండగ నుండుటయో చేయును. అందువలన ఇంద్రియములకు కళ్లెమువంటిది. ఇంద్రియములు గుఱ్ఱములవంటివి. అవి జీవుని తత్తద్విషయముల దెసకు లాగుచుండును ఆ ఇంద్రియ విషయములగు అర్థములు (అనగా రూప, రస, గంధ, శబ్ద స్పర్శములు) ఆ హయములు నడచు మార్గము. కనుక, ఆత్మ (శరీరము), ఇంద్రియములు, మనసు, బుద్ధితోడను యుక్తమైన ఆత్మ చైతన్యమే జీవుడనబడును, ఈ నాల్గింటిని "పుర్యష్టక"మని వేదాంత శాస్త్రమున చెప్పబడినది. పుర్యష్టకమనగా జీవునిలోని, జీవ భావము పోనంతవఱకు, నిత్య సంసక్తములై (జీవించి యున్నపుడు, మరణానంతరము గూడ) యుండు ఎనిమిది పదార్థములు. అవి యేవియనగా

1. వాక్, పాణి, పాద, పాయోపస్థము లను ఐదు ఒక కూటము (కర్మేంద్రియ కూటము)

2. జ్ఞానేంద్రియ కూటము : త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా ఘ్రాణములు, అను ఐదు.

3 పంచ వాయువుల కూటము : ప్రాణా పాన వ్యానో దాన, సమాన వాయువులు అను ఐదు.

4. అంతః కరణ చతుష్టయము : మనో, బుద్ధి, అహంకార, చిత్తములు.

5. పంచభూత సూక్ష్మములు.

6. అవిద్య.

7. కామము

8. ధర్మాఽధర్మ రూపములగు కర్మలు.

ఈ యెనిమిదింటిని శ్రీ శంకర భగవత్పాదులు "పుర్యష్టకము" అని నిర్వచించిరి.* దీనినే "సూక్ష్మ శరీరము" అని గూడ అందురు.

ఈ పుర్యష్టకముతో జీవుడు సంయుక్తమై యున్నంత వఱకు జీవుడు, అవిద్యా, కామ, కర్మమయమగు సంసారమున ప్రవర్తిల్లుచు, సుఖ-దుఖాది సంవేదనమును పొందుచుండును. జ్ఞానము ద్వారా ఈ లింగ శరీరమందభిమానమును పూర్ణముగ త్యజించి, తాను శుద్ధమగు (కేవలమగు) ఆత్మను అను సత్యమును గ్రహించిన నాడే జీవుడు సంసారము నుండి విముక్తుడగును**

మనువు జీవుడీ లింగ శరీరము తోడనే ఇహలోక పరలోక యాత్ర చేయునని స్పష్టముగ తెల్పి యున్నాడు. బృహదారణ్యకమిట్లు చెప్పుచున్నది.

మం॥ తస్య హైతస్య హృదయ స్యాగ్రం ప్రద్యోతతే। తేన ప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి। చక్షుషోవా, మూర్ధ్నోవాఽన్యేభ్యోవా శరీర దేశేభ్య. స్తముత్క్రామతంతం ప్రాణోఽనూత్క్రామతి, ప్రాణమనూత్క్రామంతం సర్వేప్రాణా అనూత్క్రామన్తి. సవిజ్ఞానో భవతి। సవిజ్ఞానమేవాఽన్వవ క్రామతి। తం విద్యాకర్మణీ సమన్వారభేతే, పూర్వ ప్రజ్ఞాచ॥ (బృ॥ ఉ॥ 4/4/2)

---

1 వాగాది పంచ శ్రవణాది పంచ ప్రాణాది పంచాఽభ్రముఖాని పంచ। బుద్ధ్యాద్య విద్యాపిచ కామ కర్మణీ పుర్యష్టకం సూక్ష్మ శరీర మాహుః॥

(వివేక చూడామణి 98)

ఈ క్రింది శ్లోకమును గూడ చూడుడు:-

"భూతేంద్రియ మనోబుద్ధి వాసనా కర్మవాయవః।
అవిద్యా చాష్ట కంప్రోక్తం పుర్యష్ట మృషి సత్తమైః॥

(సనందనః)

తా॥ 1. భూత సూక్ష్మ పంచకము 2 పంచ కర్మేంద్రియ, పంచ జ్ఞానేంద్రియములు 3. మనస్సు 4. బుద్ధి 5. వాసన (కామము) 5 కర్మలు (ధర్మా ధర్మ రూపములగు కర్మలు) 7. వాయు పంచకము 8 అవిద్య, అనునవి పుర్యష్టకమని ఋషి సత్తములు పల్కిరి.

2. పుర్యష్టకేన లింగేన ప్రాణాద్యేన స యుజ్యతే।
తేన బద్ధస్యవై బంధో మోక్షో ముక్తస్యతేనతు॥

తా॥ మృత్యుసమయమున, హృదయాగ్ర భాగము చాల ప్రకాశవంతముగా నుండును. ఆ ప్రకాశమానమైన జ్యోతిరంశముతో గూడ, జీవుడు, నేత్రములు, మూర్ధ, లేక శరీరము యొక్క మఱి యే యితర ఛిద్రముం ద్వారా గాని బయటకు వెళ్లిపోవచ్చును. అతడు శరీరమును విడచు సమయమున, నతని వెన్వెంటనే ప్రాణవాయువు ఉత్క్రమించును. ప్రాణవాయువు నిష్క్రమణముతో బాటుగ ఇంద్రియవర్గము గూడ నిష్క్రమించును, ఆ తరువాత, ఆత్మ విశేష విజ్ఞానము కలది యగును. ఇక్కడ శంకరులీ విధముగ వ్యాకానించియున్నారు:-

"కర్మణా తూద్భావ్యమానేనాన్తఃకరణ వృత్తి విశేషా శ్రితవాసనాత్మక విశేష విజ్ఞానేన సర్వోలోక ఏతస్మిన్ కాలే సవిజ్ఞానోభవతి। స విజ్ఞానమేవచ గంతవ్యమన్వాక్రామతి = అనుగచ్ఛతి, విశేష విజ్ఞానోద్భాసిత మేవేత్యర్థః।" అని

ఆ సమయమున, విజ్ఞానాత్మలందరు (సకలజీవులు) కర్మద్వారా ఉద్భూతమైన అన్తఃకరణవృత్తి విశేషమును ఆశ్రయించి, వాసనాత్మక (సంస్కారాత్మకమగు) విశేష జ్ఞానమును కల్గియుందురు. ఈ విధముగ, విశేష విజ్ఞానముతో నుద్భాసితులగు జీవులు తమ గంతవ్య స్థానమునకు (దేహాంతర, లేక లోకాంతరమునకు) అనుగమింతురు, అని.

సారాంశమేమియన జీవులు దేహోత్క్రమణ సమయమున, తాము ఆచరించిన కర్మ జనిత సంస్కారములతోను, వాసనలతోనే యుత్క్రమింతురు. కనుకనే శ్రుతి యీ విషయమును స్పష్టీకరించుచు ఇట్లు పల్కుచున్నది: విజ్ఞానాత్మ ఒక శరీరమును విడచునపుడు, తన కర్మవాసనాయుక్తమగు విశేష విజ్ఞానముతోడనే యుత్క్రమించును. అట్లు నిష్క్రమించు విజ్ఞానాత్మతో గూడ, అతని విజ్ఞాన- కర్మలు, పూర్వ ప్రజ్ఞ (గత విషయానుభూతి యుక్తమగు జ్ఞానము) అనుసరించును, అని.

అందువలననే, ఆత్మస్వరూపులగుటచే, శుద్ధులు, ఏకరూపులేయైనను, ఆయా జీవులు, తమ తమ సంస్కారముల కనుగుణమైన శరీరములతోడను, తెలివితేటల తోడను, వేఱు అభిరుచులతోడను, శక్తులతోడను జన్మించుచు, తిరిగి, తమ సంస్కారముల కనుగుణముగ, ఆయా కర్మలను చేయుచు,

ఆయా విషయములను సేవించుచు, సుఖ-దుఃఖాది సంవేదనములకు లోన గుచు, పునః పునః జన్మలనెత్తుచు మరణించు చున్నారు. ఇట్టి అవిద్యా, కామ కర్మమయమగు సంసారమునుండి, తన యాత్మను విముక్త మొనరించు కొనుటకై ఋషులు సదాచారమును ఉత్కృష్ట సాధనముగ విధించి యున్నారు. మనువు ఆచారమును గూర్చి యిట్లు చెప్పి యున్నాడు:-

"ఆచారః పరమోధర్మః శ్రుత్యుక్తః స్మార్త ఏవచ।
తస్మాదస్మిన్సదా యుక్తో నిత్యం స్యాదాత్మవాన్ద్విజః॥

"ఆచారా ద్విచ్యుతో విప్రో నవేద ఫల మశ్నుతే।
ఆచారేణతు సంయుక్తః సంపూర్ణ ఫలమశ్నుతే॥

తా॥ ఆచారము, అనగా, అనాది పరమ్పరగా, పెద్దలచే అనుసరించ బడుతూవచ్చిన ఆయా కర్మల యాచరణ విధానము, పరమ ధర్మము అని చెప్పబడినది. ఆ ధర్మము శ్రుత్యుక్తమనియు, శ్రుతికి విరోధము లేకుండగ మన్వాది ప్రణీత స్మృతుల ద్వారా నిర్దేశించ బడినదనియు రెండు విధములు. అందువలన ఆత్మ హితమును కోరువాడు ఆ యుభయ విధమగు ధర్మమును నిత్య మాచరించవలెను. ఆచారము నుండి చ్యుతులైన విప్రులు (మేధావులు) శ్రేయః ప్రేయో రూపమగు వేదోక్తమైన ఉభయ ఫలమును పొందజాలరు. సదాచార సంపన్నులగు విప్రులు సమగ్ర ఫలమును పొందగల్గును. ఇక్కడ "ధర్మము"నకు "ఆచారమునకు" భేదమేమియను శంకలుగ వచ్చును. దానికి సమాధానము, "ధర్మము" అనగా శ్రుతి-స్మృతుల ద్వారా ఆయా వర్ణాశ్రమముల వారికి, శ్రేయః ప్రేయః ప్రాప్తి కొరకుపదేశించిన వేద విహిత కర్మలు. "ఆచార" మనగా పెద్దలు అనాది పరంపరగా, అనుసరించుచూ వచ్చిన ఉత్తమములగు జీవిత పద్ధతులు, ధార్మిక కృత్యముల అనుష్ఠానము, చారిత్ర (వ్యక్తిగత) నియమములు, మొ॥నవి. ఉదాహరణకు ఒకడు వేదోక్త కర్మలగు యజ్ఞయాగాది క్రతువుల ననుష్ఠించుచూ ఉండవచ్చును. వేదాధ్యయనముగూడ,చేయవచ్చును కాని తన వ్యక్తిగత జీవితములో, రాగద్వేషాది దోషములకు లోనై సాధువుల యాచరణమును త్యజించి సమాజమునకు, లోకమునకు, వినాశనమును కల్గించు ఆచరణ చేయుచుండవచ్చును. అందువలన

మానవుడు విధిగా ధర్మాచరణముతో పాటు సదాచారమును పాటించవలెను. ఈ యాచారము యొక్క ప్రాధాన్యమునందుకే వివరించుచు తైత్తిరీయోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది.

"అథయదితే కర్మవిచికిత్సా, వృత్త విచికిత్సా వాస్యాత్। యే, తత్ర బ్రాహ్మణాః సంమర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మ కామాస్స్యుః। యథాతే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః॥" అని.

(తై॥ ఉప॥ శిక్షావల్లి, అను 11)

నీకు ఒక వేళ శ్రౌతస్మార్త కర్మలలో గాని, సదాచార విషయమున గాని సంశయము వచ్చిన యెడల, నీవున్న, కాలమున గాని, దేశమున గాని, సదాచారవంతులును, ధర్మాధర్మ వైచక్షణ్యము కలవారును, ఆచార యుక్తులును, కర్మలయందు సతతయుక్తులును (అనగా అలసత లేని వారును), ఒకరు చెప్పినట్లు నడచుకొనక, స్వయముగా నిర్ణయము చేయగల సమర్థులును, సరల స్వభావులును, ధర్మాభి నివిష్టమతులును, కామాది దోషములకు లోనై ఆచార చ్యుతులుగాని బ్రాహ్మణులు ఎవ్వరు కలరో వారు ఈ విషయమున నెట్లు వర్తించిరో, వారి యా యాచారమును ప్రమాణముగ తీసికొని నీవు ఆయా కర్మలయందు వచ్చిన సంశయ ముడిగి ప్రవర్తించుము, అని.

గౌతమ మహర్షి ధర్మమునకు ఆచారమునకును గల భేదమును గమనించి ఈ క్రింది ధర్మసూత్రములను చెప్పియున్నాడు.

"తద్విదాంచ స్మృతిశీలే॥
"దృష్టో ధర్మవ్యతిక్రమః, సాహసంచ మహతాం॥
"అవర దౌర్బల్యాత్॥" అని. (గౌ॥ ధ॥సూ 1/2,3,4)

ధర్మ విషయములో వేదము ప్రమాణము అని నిర్వచించి, వేద వేత్తలగు మన్వాది మహర్షులు రచించిన స్మృతులు, మహర్షుల శీలము, అనగా ఆచారము గూడ ధర్మమున ప్రమాణములని పల్కినాడు. కాని, శీలమును ప్రమాణముగ నంగీకరించినచో వచ్చే యిబ్బందులను హరదత్తుడు వివరించుచు నిట్లు వ్రాసియున్నాడు:-

"యదిశీలం ప్రమాణమ్, అతి ప్రసఙ్గఃస్యాత్। కథమ్, కతక, భరద్వాజౌ వ్యత్యస్యభార్యే జగ్మతుః॥ వసిష్ఠశ్చాం డాలీ మక్షమాలామ్। ప్రజాపతిః స్వాం దుహితరమ్। రామేణ పితృ వచనాదవిచారేణ మాతుశ్శిరశ్ఛిన్న మిత్యాది సాహస మపి ప్రమాణం స్యాత్।" అని. అనగా, పెద్దల యాచారమును ప్రమాణమని యెంచినచో చాల యనర్థము వాటిల్లును. కతక భరద్వాజులను ఋషులు పరస్పరమొకరి భార్యలతో నొకరు సహవాసము చేసిరి. వసిష్ఠుడు హీన కుల మందు జన్మించిన "అక్షమాల" అను నామెతో సహవాసము చేసెను. ప్రజాపతి తన కూతురినే కామించెను. భార్గవరాముడు, తనతండ్రి చెప్పినాడు గదా, యని ధర్మాధర్మములను విచారించక మాతృవధ చేసెను కనుక యట్టి అధర్మములను ప్రమాణముగ తీసికొనినచో, మానవుడు దుర్గతిపాలగును. (హరదత్త) వ్యాఖ్య ఈ సంశయమును పరిహరించుచు గౌతమ మహాముని యిట్లు చెప్పియున్నారు.

ఇది మహాత్ముల సాహసము, కాని వారు ఆచరించినంత మాత్రమున ధర్మము కాజాలదు, ధర్మాతిక్రమణమే యగును, ఎందువల్లననగా, ఇది రాగ, ద్వేషముల మూలముగ చేసినది గనుక.

కాని యిట్టి మహాత్ముల ధర్మాతిక్రమణమును ఇతరులు ప్రమాణముగ తీసికొనరాదు, వారు తమ తపోబలముచే నిట్టి ధర్మాతిక్రమణ దోషములను, దానివలన వచ్చు అనర్థములను, పొందక యున్నను ఇతరులు ధర్మ వ్యతిక్రమమున తప్పక పతితులగుదురు, అని

ఆచారము యొక్క మహత్త్వమును వివరించుచు, శ్రీ వ్యాసులవారు ఇట్లు తెల్పియున్నారు:-

"సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పతే।
ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః॥ అని
(మహాభారతము, అను, శా.పర్వము)

సర్వ శాస్త్రములలోను మొదట అనాదిగ వచ్చు ఆచారము ధర్మ నిర్వచనమున కాధారముగ ఊహించబడుచున్నది. ఏలయన, ధర్మము గూడ

ఆచారము నుండి యుద్భవించినదియే, ధర్మమునకు ప్రభువు, అనగా ధర్మా చరణ పల్రప్రదాత అచ్యుతుడు, అని.

ఈ సదాచరణము ధర్మమునకు మూలమును విషయమును సదాచార ప్రాముఖ్యమును భగవాన్ వాల్మీకి గూడ జాబాలిమత ఖండనావసరమున ధర్మమూర్తియు, సదాచార సంపన్నుడునునగు రామునిచే వివరింపచేసి యున్నాడు.

"నిర్మర్యాదస్తు పురుషః పాపాచార సమన్వితః।
మానం న లభతే సత్సు భిన్న చారిత్ర దర్శనః॥
"కులీన మకులీనం వా వీరం పురుషమానినమ్,
చారిత్ర మేవ వ్యాఖ్యాతి శుచింవా యదివాఽశుచిమ్॥
"అనార్యస్త్వార్య సంస్థానః శౌచాద్ధీనస్తధా శుచిః।
లక్షణ్య వదలక్షణ్యో దుఃశీల శ్శీలవానివ॥
"అధర్మం ధర్మ వేషేణ యద్యహం లోక సంకరమ్।
అభిపత్స్యే శుభం హిత్వా క్రియాం విధి వివర్జితామ్॥
"కశ్చేత యానః పురుషః కార్యా కార్య విచక్షణః।
బహుమన్యేతమాం లోకే దుర్వృత్తం లోక దూషణమ్॥
"కస్య యాస్యామ్యహం వృత్తం కేనవా స్వర్గమాప్నుయామ్।
అనయా వర్తమానోఽహం వృత్త్యాహీన ప్రతిజ్ఞయా॥ అని.

(వా॥రా॥ 2/109/3-8)

తా॥ లోక-శాస్త్ర మర్యాదలను పాటించనివాడు, సాదు చారిత్రమును అనుసరించక, కామాది దోషవశుడై దురాచారమును లేక దురాచారుల యుప దేశములను పాటించినవాడు, పాపాచారి, సజ్జన సమాజములలో సమాదరించ బడడు. ఒకడు ఉత్తమ కుల సంజాతుడా, లేక తద్రహితుడా లేక, ధీరుడా, లేక బహిరంతస్సులతో శుద్ధుడా, లేక యపవిత్రుడా యను విషయమును గూడ, అతని చారిత్రమే చాటి చెప్పును (విద్యా, రూపాదులు కావు).

ఆర్యునివలె నటించుచు, అనార్య కృత్యములు చేయువాడు; శుచివలె నటించుచు, శౌచమును (అన్తర్బహిశ్శౌచమును) పాటించని వాడు; శిష్టునివలె

గన్పించుచు దష్టాచార పరుడు: శీలవంతునివలె కన్పించుచు శీలరహితుగ నున్నవాడు, సత్పురుషులచే గర్హించబడును సత్స సమాజమున సన్మానార్హతను కోల్పోయి ఉభయ లోకములకు చెడును. రాముడు జాబాలితో ఇంకను ఇట్లనుచున్నాడు:-

నేను ధార్మికుని వేషమును వేసికొని, లోక సాంకర్య హేతువగు అధర్మమును, శుభప్రదమును, శాస్త్రవిహితమును నగు కర్మను త్యజించి, శాస్త్రనిషిద్ధమగు కర్మాచరణమునకు పూనుకొనినచో, కార్యాకార్యముల నెఱిగిన, చేతనాయుక్తుడగు ఎవ్వడు, ఈ లోకమున సద్వృత్తమును త్యజించి, లోకమును దురాచారముచే పాడుచేయు నన్ను, గొప్పగా ఆదరించును?

కేవలము లోక నిందయే కాదు దురాచారము వలన నరకము గూడ సంప్రాప్తించునని వ్యతిరేక ముఖముగా గూడ చెప్పుచున్నాడు.

"ఓ జాబాలీ, నీవు చెప్పిన చొప్పున, నేను చేసిన ప్రతిజ్ఞను విడచి, హీనమైన వృత్తితో బ్రతుకుచు, మా పూర్వులలో (ఇక్ష్వాకు వంశీయులలో) ఎవ్వరి వృత్తమును అనుగమింతును? మిథ్యాచారుడనై అధర్మము నాచరించుచు, లోకమును దూషితముచేయు నేను, పరమ పురుషార్థముగ శాస్త్రము నిర్ణయించిన, స్వర్గమును నేసాధనముతో మరణానంతరము పొందగలను?

ఓ జాబాలీ, నేను, నీవు చెప్పిన ప్రకారము, శాస్త్రమును, పితృపితామహాదుల పవిత్ర వృత్తమును, సదాచారమును విడచి, కామమునకులోనై దుర్వృత్తమునే చేపట్టిన, నామూలమున ఈ లోకమంతయు నన్నే అనుసరించి ఉభయలోక విభ్రష్టమగును ఏలయన ఒక సాధారణ వ్యక్తి పాపాచారియైనచో యతని పాపమునకు, అతడో, అతని కుటుంబమో, లేక యతని యనుచరులో పాడై పోవుదురు. కాని ఒక దేశమును పాలించు శాసకుడు దురాచారి యైనచో మొత్తము దేశమే యతని మూలమున నాశనమై పోవును, అని

కనుకనే శ్రీరాముడు ఈ ప్రసంగముననే, కొంత ముందుకు సాగిన పిదప యిట్లనుచున్నాడు.

"వనవాసం వసన్నేవ శుచిర్నియత భోజనః।
మూల పుష్ప ఫలైః పుణ్యైః పితౄన్దేవాంశ్చ తర్పయన్॥

సంతుష్టపంచ వర్గో౽హంలోక యాత్రాం ప్రవాహయే।
అకుహశ్శ్రద్ధ ధానస్సన్ కార్యాకార్య విచక్షణః॥
"కర్మ భూమి మమాం ప్రాప్య కర్తవ్యం కర్మ యచ్ఛుభమ్।
అగ్నిర్వాయుశ్చ సోమశ్చ కర్మణాం ఫల భాగినః॥ అని.
(వా॥రా॥ 2/109/26-28)

తా॥ రాముడు ఇంకను ఇట్లనుచున్నాడు:-

నేను వనవాసము చేయుచునే, అంతర్బాహ్యశౌచములను పాటించుచు పవిత్రములైన కందమూలఫలాదులను నియతముగ భుజించుచు, దేవ, పిత్రాదితర్పణముల ద్వారా, వారిని తృప్తినొందించుచు, కపటమును త్యజించి కార్యాకార్య వైచక్షణ్యము కల్గి, ధర్మమందు శ్రద్ధకలిగి నా జీవిత యాత్రను నిర్వహించెదను.

మానవుడు, సత్కర్మల నాచరించుటకై యీ కర్మభూమిలో పుట్టుచున్నాడు అతనికి, సత్కర్మాచరణ విషయమున, అగ్ని, వాయు, సోములు అను దేవతలు ఆదర్శములుగ నుండతగిన వారు. ఏలయన వారు తాము ఆచరించిన సత్కర్మల ఫలితముగానే దివ్య యోనులయందు జన్మించిరి.

ఇక సదాచార విషయమున మహా తపస్వులగు పూర్వ ఋషుల వృత్తమును ప్రమాణముగ నుదహరించుచు రాముడిట్లనినాడు:-

"త్వత్తోజనాః పూర్వత రేద్విజాశ్చ శుభాని కర్మాణి బహూని చక్రుః।
జిత్వా స దేమంచ పరంచలోకం తస్మాద్ద్విజా స్స్వస్తి కృతం హుతఞ్చ॥

"ధర్మేరతా స్సత్పురుషైః స్సమేతా స్తేజస్వినో దాన గుణ ప్రధానాః।
అహింసకా వీత మలాశ్చలోకే భవన్తి పూజ్యాముసయః ప్రధానాః॥
వా॥రా॥ 2/109/36, 37)

తా॥ నీకంటె పూర్వులు, నీకంటెను జ్ఞానమునందు శ్రేష్ఠులునునగు ద్విజులు (తాము జీవించినన్ని దినములు) ఎన్నియో శుభకర్మలను చేసిరి. అట్టి శుభకర్మల పుణ్యఫలముగా ఇహ-పరలోకములు రెంటిని జయించియున్నారు. అందువలన సత్కర్మానుష్ఠానము శ్రేయః ప్రేయోదాయకమగుట

వలన శుభప్రదమగు కర్మలను, అగ్నిహోత్ర యజ్ఞయాగాది క్రతువులను, తపోదానాది కర్మలను చేయుచున్నారు.

ధర్మమందు నిష్ఠగలవారును, సత్పురుషుల సంగము చేయువారును, బ్రహ్మవర్చస్వులను అతిదాన శీలురును, హింసారహితులును, మల సంసర్గ రహితులుననగు, మునిసత్తములు, లోకపూజ్యతను గూడ పొందుచున్నారు.

దీనినిబట్టి తేలినదేమియన మనుష్యుడు సదాచార ధర్మానుష్ఠానరతుడై, ఉత్తమ చారిత్రమును గల్గి, యజ్ఞ-తపో-దానాది శుభకర్మల నాచరించుచు, ఇంద్రియ సంయమము కల్గి, శాస్త్ర విహితములైన భోగముల ననుభవించుచు కపట, దంభాదులను వర్జించి, రాగ-ద్వేషాది దోషములను దరిజేర నీయక, ఆహార-విహారములయందు సంయమము కలవాడై, ధర్మాచారానుష్ఠానముచే మానసిక దోషములను పోగొట్టుకొని, మానుష జీవిత లక్ష్యముగా నిర్ధారించబడిన స్వర్గమును పొందవలెను బ్రతికియున్ననాళ్లు లోకమున ఉత్తమ కర్మాచరణము ద్వారా సజ్జనుల మెప్పును పొందుచు ఆదర్శ జీవితమును గడపవలెను. సదాచారము లేని వానిని, వేదములు గాని అతని చదువు గాని రక్షింపజాలదు.[1]

ప్రకృతమనుసరామః

ఆధ్యాత్మిక సౌందర్యము అనగా, కేవలము శారీర సౌందర్యము మాత్రమే గాక, చిరకాలము నుండి మనస్సున పేరుకొని యున్న మలమును (పాపమును) దూరము చేసికొనుటకు సాధనభూతమైన సచ్చారిత్ర, సత్కర్మానుష్ఠాన, సదాచారానుసరణాది కర్మలతో పాటు, ఆత్మ గుణములను కల్గియుండుట, ఆదర్శముగ జీవించుట, ధర్మము కొఱకు సర్వ త్యాగమును చేయ కల్గుట, రాగ, ద్వేషాదిదోషములకు మనస్సున ఎడమీయకుండుట. సాంసారిక ప్రలోభనములకు లోనుగాక, ఎట్టి కష్టములనైనను ధైర్యముగ నెదుర్కొని ధర్మమును పాలించుట, వ్యక్తి ధర్మముతోపాటు సామాజిక

---

1. "ఆచార హీనం నపునన్తి వేదా యద్యప్యధీతాస్సహ షడ్భిరంగైః।
ఛందాం స్యేనం మృత్యుకాలే త్యజన్తి నీడం శకుంతా ఇవ పక్షి సంఘాః॥"

కర్తవ్యములను పరిపాలించుట, అన్నిటినిమించి, సర్వభూతముల యందు ఆత్మభావముతో మెలగుట (ఆత్మవత్సర్వ భూతాని) మొ॥లగు గుణములు ఆధ్యాత్మిక సౌందర్య వర్ధకములు తద్విపరీతాచరణము ఆత్మసౌందర్య విలోపకము.

కేవలము కళా వైదగ్ధ్యము, శాస్త్ర విజ్ఞానము, కార్యసాధన సామర్థ్యము మాత్రమే యాధ్యాత్మిక సౌందర్యమును వృద్ధి చేయజాలవు. అట్లే కొందరు శాస్త్ర నిర్దిష్టములగు కార్యములను యథావిధిగ చేయుచు, తాము గొప్ప వారము అని భావింతురు, కాని యిది చాల పొరబాటు. కార్యకౌశలము, ధర్మపాలనముతో బాటుగ, దయా, శౌచాది యాత్మ గుణములు లేని వారు కేవలము దాంభికులుగ మాత్రముగనే యెంచబడుదురు.

కనుకనే ప్రాచీన వైదికధర్మ ప్రవక్తయగు గౌతమ మహాముని, మానవుని యాంతర బాహ్య శుద్ధికొఱకు నలుబది సంస్కారములను తెల్పి (స్మార్త, శ్రౌత, ఉభయ విధములగు) ఆత్మగుణములు లేని యెడ యవి యన్నియును వ్యర్థములని పల్కినాడు. ఈ క్రింద గౌతమ ధర్మసూత్రమును చూడుడు:-

సూ॥ యస్యైతే చత్వారిం శత్సంస్కారాః, న చాష్టావాత్మ గుణా,

న, స బ్రహ్మణ స్సాయుజ్యం సాలోక్యం గచ్ఛతి॥ (1/8/25)

అనగా నలుబది శ్రౌత స్మార్త విధులను నిర్వహించినను, ఈ ఎని మిది ఆత్మ గుణములు లేనివాడు, బ్రహ్మ సాయుజ్యమునుగాని, బ్రహ్మలోక మునుగాని పొందజాలడు.

ఎనిమిది ఆత్మ గుణములు:

సూ॥ "దయా సర్వభూతేషు క్షాంతి రన సూయా

శౌచ మనాయాసో మఙ్గల మకార్పణ్యమ స్స్పృహేతి॥

(గౌ॥ ధ॥ సూ 1-8-24)

1. సర్వభూత దయ, 2. క్షమ - సుఖ దుఃఖాది ద్వంద్వములను ఓర్మితో సహించుట 3. అనసూయ - పరోత్కర్షా సహిష్ణుత 4. శౌచము - అంతర, బాహ్య శుద్ధి; 5. అనాయాసము, మనస్తాప జనకమగు కార్యమును

వర్జించుట, 6. మంగలము ప్రశస్తమైన ఆచరణము, అప్రశస్త త్యాగము 7 అకార్పణ్యము ఆపత్తులు వచ్చినను, ఎంతటి కష్టములు వచ్చినను దైన్యము చెందకుండుట, అస్పృహ - విషయ సంబంధమైన అసంతృప్తిని వర్జించుట, పరద్రవ్యముల కాశించక యుండుట అనునవి.

వీనిలో కొన్నియైనను లేనిది, కేవలము, వైదిక, స్మార్త కర్మల యాచరణము వలన బ్రహ్మ సాయుజ్యాది జీవిత ఫలమును పొందజాలదు.

మనము ఆధ్యాత్మిక సౌందర్యమును గూర్చి మఱికొన్ని విషయములను తెలిసికొనవలసి యున్నది. ఈ "సౌందర్య"మనునది ఏ ఒక్క వస్తువునకు పరిమితముగాక, చాల వ్యాపకమైనది.

ఒక మహా పురుషుని లోక కల్యాణ సంధాయకములగు కర్మలలో నీ యాత్మ సౌందర్యమును దర్శింపవచ్చును. ఒక మహాత్ముని ప్రసన్నములగు దృష్టులలోను, అమృతమయములగు వాక్కులలో గూడ దీనిని దర్శింపవచ్చును. అధర్మమును నివారించుటకై, ప్రాణ పణముతో పోరు వీరుని పరాక్రమమునందు దర్శింపవచ్చును. చేతన ప్రాణియొక్క స్వాభావిక చేష్టలందు దర్శింపవచ్చును. ఒక పతివ్రత యొక్క శీలమునందు దర్శింపవచ్చును పతి వియోగ కర్శితురాలగు సాధ్వీమణి వియోగ వ్యథయందు, శారీర కార్శ్యాదుల యందు, కన్నీళ్లయందు గూడ దర్శింపవచ్చును ఒక మహాత్ముని సుఖ-దుఃఖ ద్వంద్వ సహిష్ణుతయందు దర్శింపవచ్చును. కష్టములో నున్న వారిని రక్షించు మహాత్ముని ఉపకారమునందు దర్శింపవచ్చును. కష్టములో నున్న వారిని దర్శించి, హృదయము కరిగి అశ్రువులను రాల్చు సహృదయుని కన్నీటి కణములలో దర్శింపవచ్చును. ఈ విధముగ ఈ సౌందర్యమును ఏది "సత్తు" అనగా ఉత్తమమైనదియో దాని యందు సర్వత్ర దర్శింపవచ్చును. ఏది యసత్తో (ఉత్తమమైనది కాదో, అది ఎంత యందమైనదైనను దానిని భౌతికముగ సుందరమని చెప్పవచ్చును, గాని, ఆధ్యాత్మికముగ సుందరమని చెప్పజాలము. అట్లే, యెంతటి వీర కృత్యములు చేసినను, అవి ధర్మ విరుద్ధములైనచో నటి యాత్మ సౌందర్యమును దర్శింపజాలము. ఒక గారడీవాడు ఎంతటి సాహసకృత్యములు

చేసినను, వాని కృత్యములు ఒక మహావీరుని పరాక్రమములని యన్పించు కొనవుగదా! అట్లే ఒక వ్యక్తి ఒక దుర్ఘటనలో మరణము పాలైనగో, దానిని వీరమరణమని యనజాలము. చనిపోయిన వానిని మృతవీరుడని గూడ యనజాలము. కారణము, పరాక్రమము లేక వీర్యమని దేనిని యందుమో వీరమరణమని దేనిని గౌరవింతుమో, దాని వెనుక ఒక మహోన్నత భావము ప్రేరకముగా నుండును. గారడీవాని కృత్యములకు ప్రేరకముగా నట్టి మహోన్నత భావము కొఱవడి యుండుటచే దానిని గారడీయని యందుమే గాని మహావీర్యమని ప్రశంసించజాలము. అట్లే యొకని మృత్యువునకు దుర్ఘటన మూలమగుటచే దానిని వీర మరణమని గూడ చెప్పజాలము. ఈ దృష్టితో మనమిపుడు సుందరకాండలో వాల్మీకి ప్రదర్శించిన యాధ్యాత్మిక సౌందర్యము దర్శింతుముగాక।

సుందరకాండలో వాల్మీకి మహర్షి ప్రదర్శించిన చేతన సౌందర్యము అన్యాదృశము. చేతనగత సౌందర్యము గూడ ద్వివిధముగ నున్నది. శివము, అశివము అని. శుభవాసనలు లేక సంస్కారములు గల జీవులయందు మనము దర్శించు సౌందర్యము శివసౌందర్యము అశుభ వాసనలు గల జీవుల యందలి సౌందర్యము అశివసౌందర్యము. దర్శకులు గూడ రెండు విధములుగా నుందురు. శుద్ధదృష్టి యుక్తులు, మలినదృష్టి యుక్తులు, అని శివసౌందర్యము, ద్రష్టకు నిర్మలమైన ఆత్మానందమును కల్గించుటతో బాటుగ, ద్రష్టయొక్క మనస్సును నిర్మలమొనరించి, సర్వత్ర ఆత్మ సౌందర్యమును దర్శించుట యను సమదర్శనయోగ్యతను కల్గించును. ఈ సమదర్శియగు మహాత్ముడే ఆత్మ యోగియని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత యందు ప్రశంసించి యున్నాడు.* ఈ సమ దర్శనమును మనువు "ఆత్మయాగ" మనియు, ఇట్టి సమదర్శనమును సర్వత్ర చేయువాడే "ఆత్మయాజి" యనియు, అట్టి ఆత్మయాజియే, ఆత్మప్రాప్తి రూపమగు స్వారాజ్యమును

---

1. "సర్వ భూతస్థ మాత్మానం సర్వ భూతాని చాత్మని।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥

(భ॥గీ॥ 6/29)

పొందుననియును మనువు ఉపదేశించెను ** ఇట్టి సమదర్శనమే, మనస్సును ప్రసన్నమొనర్చును. ఇట్టి మనఃప్రసాదమే శివదృష్టి ఈ శివదృష్టిని, రాగ-ద్వేషములునకు*** లోను గాని, ఇంద్రియ విజేతయగు యోగి మాత్రమే పొందగల్గును. సర్వత్ర వ్యాప్తమైన ఆత్మసౌందర్యమే శివసౌందర్యము ఈ శివసౌందర్య దర్శనము వలన యోగి యాత్మానందమును ఈ లోకమున పొందు చుండును. కాని యట్టి దర్శనమునకు దర్శకునియందు అపేక్షితమైన యోగ్యత - ఇంద్రియ జయము, రాగద్వేషాది రాహిత్యము. ఉదారమైన మనస్సు, మనో నైర్మల్యము వెనుక చెప్పిన ఎనిమిది యాత్మ గుణములు ఉండ వలెను. భగవాన్ వాల్మీకి ఇట్టి శివదృష్టిని, హనుమంతుని యందును, సీతా-రాముల యందును త్రిజట యందును ప్రదర్శించి యున్నాడు. రాగద్వేషాది మనోమాలిన్యమును దరిజేర నీయక, ఇంద్రియములను తన స్వాధీనమున నుంచుకొని, ధర్మము కొఱకే జీవించు మహాత్ముల దృష్టి శివదృష్టి అట్టి జీవుల చారిత్రమునందు మనము శివ సౌందర్యమును దర్శింపగలము. శివదృష్టిని ధర్మదృష్టియనియు; శివసౌందర్యమును ధర్మసౌందర్యమనియును నుడువ వచ్చును.

ఇక యశివ సౌందర్యమును గూర్చి తెలిసికొందముగాక. అధర్మాత్ములు దుశ్చరిత్రులు, కేవలము భౌతిక భోగభాగ్యముల ప్రాప్తిచే జీవిత పరమార్థ ముగ భావించి, తత్ప్రాప్తి కొఱకై అహర్నిశములు శ్రమించువారు, పలు అకృత్యములను చేయుచు లోక శాంతిని హరించు జీవుల యందుగల సౌంద ర్యమే అశివ సౌందర్యము. వారి దృష్టి అశివదృష్టి లేక యధర్మ దృష్టి. వారు సర్వత్ర ఈ విశ్వమున గల చేతనాఽచేతన పదార్థముల యందు సమముగ వ్యాపించియున్న యాత్మను, తమ యశివ దృష్టి మూలమున

---

2. 'సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని।
సమం పశ్యన్నాత్మ యాజీ స్వారాజ్య మధిగచ్ఛతి॥
(మ॥స్మృ॥ 12-91)

3. "రాగద్వేష వియుక్తై స్తువిషయా నింద్రియై శ్చరన్।
ఆత్మవశ్యైర్వి ధేయాత్మా ప్రసాద మధి గచ్ఛతి॥ (భ॥గీ॥ 2/64)

దర్శింపజాలక, భోగదృష్టితో సర్వవస్తు దర్శనము చేయుదురు. ఇదియే విషమ దర్శనము లేక యశివ దర్శనము. ఇట్టి యశివ దర్శనము, ఆత్మ పతన హేతువు. ఆత్మతో బాటుగ, సమాజమునకు గూడ అనర్థప్రదము.

రామాయణ ఋషి యీ సుందరకాండమున శివదృష్టి యశివదృష్టుల తారతమ్యమును; సమదర్శన విషమదర్శనముల స్వరూపమును; ఆత్మ సౌందర్య - వస్తు సౌందర్య (శివ-అశివ సౌందర్యముల) మూల స్వరూపమును; రమణీయమగు కావ్యభాషలో వివరించియున్నాడు.

ఇక యీ సుందరకాండములోని ముఖ్యపాత్రలు. హనుమంతుడు, సీత, త్రిజట, విభీషణ, రావణులు, మొ॥లగు వారలు వారిలో గూడ ముఖ్యమైన పాత్రలు మూడు మాత్రమే. వారు హనుమ, సీత, రావణుడు అను వారలు.

పత్నీ వియోగ దుఃఖ కర్శితుడగు శ్రీరాముని దూతగా హనుమంతుడు సీతాదేవిని దర్శించి, ఆ యమ్మకు రామ సందేశమును విన్పించి యామెనోదార్చి, ఆమె ప్రతి సందేశమును శ్రీరాముని కందించుట ఇందలి ముఖ్యమగు ఇతివృతము దీనినిబట్టి హనుమ, రామ సందేశ వాహకుడగు రామదూత యని తేలినది కాని ఈ హనుమ సాధారణ సందేశ వాహకుడగు దూతకాదు. ఇతడు శివాంశ సంభూతుడు, వాయు పుత్రుడు, సకల విద్యావరిష్ఠుడు, ఆజన్మ బ్రహ్మచారి, వశ్యేంద్రియ మనస్కుడు. ఉదారుడు, మహావీరుడు, రాక్షస దర్పదలన శౌండీరుడు, మహా పరాక్రమశాలి, ధృతి, మతి, దాక్ష్య, దీర్ఘదృష్టి సంపన్నుడు. అతని వీర్య ప్రదర్శనముతోడనే, రామాయణ ఋషి, ఈ సందేశ ఖండికా కావ్యము నారంభించినాడు. అందువలన నట్టి శివ సౌందర్య సంపన్నుడగు హనుమంతుని సచ్చారిత్రమును, శివదృష్టితో దర్శింతముగాక:

## హనుమచ్చారిత్రము:

### హనుమంతుని దివ్య జనన వృత్తాంతము

శ్రీమత్సుందర కాండమున, హనుమంతుడు సీతాదేవికి తనయందు విశ్వాసమును కల్గించుటకై, తన జన్మ వృత్తాంతమును ఈ విధముగ తెల్పెను:

"నేను వానర రాజగు సుగ్రీవుని సచివుడను. హనుమంతుడను పేరుగల వానరుడను (5/34/38). దశరథపుత్రుడగు శ్రీరాముని దూతను,

(౯/౬౬/74) మాల్యవంతమను నొక యుత్తమగిరి రాజము కలదు. కేసరి యను పేరుగల వానర పుంగవుడు ఆ మాల్యవంతము పైననే నివసించువాడు. అతడు మాల్యవంతము నుండి, గోకర్ణమను పర్వతమునకు పోయెను. అక్కడ, దేవతల ప్రేరణ వలనను, ఋషుల ప్రేరణ వలనను, ఆ కేసరి, పవిత్రమగు సముద్ర తీర్థమున వసించు శంబసాదనుడను దుష్ట రాక్షసుని సంహరించెను అతని ప్రవాసకాలమున, ఆ కేసరి భార్యయగు అంజనాదేవి గర్భమున, వాయుదేవుని యనుగ్రహమున నేను జన్మించితిని. నేనుపుట్ట గనే యాచరించిన సాహస కృత్యమువలన, (ఉదయించు సూర్యబింబమును, ఫలమను భ్రాంతిచే మ్రింగుటకు, సూర్య మండలమున కెగురుటయను, సాహస కర్మ చేయుట వలన) కోపించిన, ఇంద్రుని యొక్క వజ్రముచే నిహతుడనై, భూమిమీద పడుటమూలమున, వామ హనువు భగ్నమగుటచే "హనుమంతు"డను విఖ్యాతి నొందితిని. వాయువు యొక్క ఔరస పుత్రుడనగు నేను ప్రభావమున వాయుదేవునితో సమానుడను." అని.

ఇక, జాంబవంతుడు, హనుమంతునికి అతని దివ్యాభిజనమును, మహాశక్తిని, బల-వీర్యములను గుఱుతు చేసి, యతనిలో సముద్రోల్లంఘనో త్సాహమును కల్గించుటకై యతని వృత్తము నిట్లు తెల్పెను:-

"వానరలోక విఖ్యాత వీర్యుడవగు ఓ హనుమా ! నీవు లోకమునగల్ల శాస్త్రవేత్తలందరిలోను శ్రేష్ఠుడవు. పరాక్రమమున వానరరాజగు సుగ్రీవునితో సమానుడవు. తేజో-బలములచే రామ-లక్ష్మణ తుల్యుడవు. గరుత్మంతుని పక్షముల యందుగల బలము, నీ బాహువుల యందు గలదు. వేగ-విక్రమము లలో నతని కేవిధముగను తీసిపోనివాడవు. బల, బుద్ధి, తేజో, విక్రమ ధైర్యము లందు సర్వోత్తముడవు. అప్సరసలలో శ్రేష్ఠురాలగు "పుంజిక స్థల", శాప వశమున "కపియోని" యందు "అంజన"గ "కుంజరు"డను కపివరునకు జన్మించెను. ఆ "యంజన" కామరూపిణి, ఆమెను, "కేసరి" యను వానర వీరుడు, వివాహమాడెను ఒక దినమున, నాయంజన, మానుష స్త్రీ రూప మును ధరించి, విచిత్రాభరణాలంకృతయై, పట్టుచీర ధరించి,. తానుండు పర్వత శిఖరముపై, విహరించు చుండెను. గాలి తాకుడు వలన ఆమె ధరించిన

పట్టుచీర, కొంచెము ప్రక్కకు తొలగగ, నామె సౌందర్యమును చూచి, వాయు దేవుడు, కామమోహితుడై, యామెను కౌగిలించుకొనెను. పతివ్రతయగు, ఆ వానరాంగన భయభ్రాంతయై, బిగ్గఱగా "నా పాతివ్రత్యమును భంగమొన రించు అనయమాచరించు దుష్టుడెవడు" అని అరచెను. అపుడు వాయుదేవు డిట్లనెను; "ఓ, సుశ్రోణి: నేను నీ పాతివ్రత్యమును భంగపరచుటలేదు. అందువలన, నీవు భయ పడకుము. నేను, నా యవ్యక్త రూపమున నిన్ను ఆలింగనము చేసికొని, మనస్సుతో నిన్ను సంగమించితిని. అందువలన, నీకు, వీర్యవంతుడును, బుద్ధిమంతుడును నగు పుత్రుడు జన్మింపగలడు. అతడు మహాసత్త్వ వంతుడు, మహా తేజస్వి. బల-విక్రమ సంపన్నుడు; లంఘన ప్లవనములలో, నాతో సమానమగు వేగముగల వాడుగను నగును, అని. ఆ తరువాత కొన్ని దినములకు, ఆ పర్వత గుహలో అంజన నిన్ను గనెను. నీవు, బాలుడుగ నుండగనే, ఆ పర్వతో పత్యకా కాననములో గుంద, నుదయించు, బాలభాస్కరుని చూచి, పండని భ్రమించి, ఆ పండును తిని యాకలి తీర్చుకొన నెంచి దివికెగిరితివి. నీ యీ సాహసమునకు వెఱగుపడి, నీ వాచరించు యనయమునకు కోపించి, ఇంద్రుడు నిన్ను వజ్రముతో గొట్టెను. ఆ వజ్రప్రహారముచే మూర్ఛపోయి శైలాగ్రమున్న పడిన, నీ, వామ హనువు భగ్నమగుటచే, "హనుమంతు"డని లోకమున విఖ్యాతుడవైతివి. మూర్ఛపోయి శైలాగ్రముపై పడియున్న, నిన్నుజూచి, నీ తండ్రి, కినుక వహించి, వీచుట మానివేసెను. దాని వలన ముల్లోకములు గగ్గోలుపడగ, భువనేశ్వరులగు దేవతలు, నీ తండ్రి ననునయించి ప్రసన్నుని చేసికొనుటకై, నీకు వేఱు వేఱు వరములను ప్రసాదించిరి. బ్రహ్మదేవుడు నీకు శస్త్రాస్త్రములచే నవధ్యత్వమును ప్రసాదించెను. ఇంద్రుడు, తన వజ్ర ప్రహారముచే గూడ మృతి చెందని, వజ్రాంగమును చూచి సంప్రీతుడై నీకు స్వచ్ఛంద మరణము ననుగ్రహించెను, అని, యతని జన్మవృత్తమును, సకల దేవతల యనుగ్రహమును వివరించి, యతనిని కార్యోన్ముఖుని చేయుచు నిట్లు పల్కెను: కనుక, ఓ మారుతీ, నీవు రామకార్యార్థమై విజృం భింపుము. సముద్రమును అవలీలగ దాటి, సీతమ్మజాడ నఱసి ప్రభు కార్య మును నెరవేర్పుము వానరులందరిని కృతార్థుల గావింపుము, అని

(వా॥ రా॥ 4/66/2-30)1

రామాయణ కావ్యము యొక్క యుత్తర కాండము గూడ హనుమ ద్వృత్తము వర్ణించబడినది. కాని, కిష్కింధా యుత్తరకాండములందు వర్ణిత ములైన హనుమంతుని వృత్తములలో చాల వఱకు ఏకవాక్యత యున్నను, కొంచెము భేదము గూడ కానవచ్చుచున్నది. తద్విశేష జిజ్ఞాసువులు, ఉ॥ కాం॥ లోని 35, 36 సర్గలను గాని, మేము వ్రాసిన "శ్రీమద్రామాయణ వైభవము"లోని "హనుమచ్చారిత్రము" అను వ్యాసమును గాని చూచుదురు గాక.

ఉత్తరకాండలోని హనుమచ్చారిత్ర విశేషములు: వాయుదేవుని సంతోష పరచుటకు ఆయా దేవతలు హనుమంతుని కిచ్చిన వివిధ వరముల వివరణము: ఇంద్రుడు - కాంచన కమలమాలను, ఇచ్చి, వజ్ర ప్రహారముచే నతనికి మృత్యువు కలుగదను వరమిచ్చెను. సూర్యుడు తన తేజమున శతాంశమునిచ్చి, యతనికి విద్యాగ్రహణయోగ్యమగు వయస్సు వచ్చిన తరువాత సకల విద్యలను నేర్పగల నను వరమిచ్చెను. వరుణుడు జలముల వలనగాని, వరుణ పాశము వలనగాని మృత్యువు ఉండదనియును; యముడు యమదండమువలన నవధ్యత్వమును, రోగ రాహిత్యమును, విషాద రాహిత్యమును; కుబేరుడు యుద్ధమునందవధ్యత్వమును, శంకరుడు తన ఆయుధ ముల వలన హింసాభావమును, బ్రహ్మ సర్వవిధ బ్రహ్మాస్త్రముల వలన మృత్యువు కలుగకపోవుటయును, వివిధ వరములనిచ్చిరి, తిర్గి బ్రహ్మదేవుడు వాయుదేవునితో నిట్లనెను:-

ఓ వాయుదేవా, నీ పుత్రుడు శత్రుభయంకరుడు, మిత్రములకభయ దాతయు, శత్రు-జేయుడును, కామరూపుడుగను, కామగమనముగలవాడుగను, కీర్తిమంతుడుగను, అవ్యాహత గతిగలవాడును కాగలడు. రామ ప్రీతికరము లగు పెక్కు మహాకార్యములను చేయగలడు. రావణుని యొక్క క్రూరులగు పెక్కుండ్రు రాక్షస వీరులను సంహరించగలడు. అతని వీరకృత్యములు, లోకమున, చిరస్మరణీయములుగ నుండ గలవు అని. ఈ విధముగ భువనే శ్వరులగు దేవతల వలన వివిధ వరములను పొందిన బాలమారుతిని, వాయు దేవు డంజనాదేవికి సమర్పించి యంతర్ధానమాయెను.

హనుమంతుడు, బాల్య చాపలముచే, మున్యాశ్రమములను ప్రవేశించి, మునులకు తన చిలిపిచేష్టల వలన బాధకలుగ చేయుటచే, వారతనికి, నీ, బల-పరాక్రమములు, నీ కితరులు గుఱుతు చేసిన గాని, నీకు స్ఫురణకు రాకుండు గాక, యని శాపమిచ్చిరి.

పై ఘటనలన్నియును, నతని దివ్యాంశ సంభూతత్వమును, నతని యందుగల దివ్యశక్తులను, సర్వ శస్త్రావధ్యత్వమును, స్వచ్ఛంద మరణ రూపముగు, దివ్యలక్షణములను వివరించుటకే వర్ణించబడినది.

హనుమంతుని దివ్యలక్షణములు ఆర్షవాఙ్మయమున పలుచోటుల వర్ణించబడి యున్నవి. స్థాలీపులాక న్యాయముగ కొన్ని యంశముల నిట యిచ్చుచున్నాను. విశేష వివరణము మా "రామాయణ వైభవము" (తెలుగు) నందు గాని, "శ్రీమద్రామాయణ మీమాంస" (సంస్కృతము), యందు గాని చదువుదురు గాక.

శివపురాణము, హనుమంతుడు సదాశివస్వరూపుడని పేర్కొనుచున్నది:

"ఆ దిత్యానాం వాసు దేవో, హనుమాన్వానరేషు చ॥"

(రుద్రసంహిత, యుద్ధఖండ-2/5)

ప్రాచీన దేవీభాగవతము, వాయు-రుద్రాంశ సంభూతుడని తెల్పు చున్నది:

"మహేశస్య తథాంశేన భూత్వా పవన నందనః।
హనూమానితి విఖ్యాతో మహాబల పరాక్రమః॥

స్కాందపురాణ మిట్లు చెప్పుచున్నది:

"యోవై చైకా దశో రుద్రో హనుమాన్స మహాకపిః।
అవతీర్ణ స్సహాయార్థం విష్ణో రమిత తేజసః॥

(మహేశ్వర, కేదార)

తా॥ పదకొండు రుద్రులలో పదునొండవ రుద్రుడే హనుమంతుడను మహా కపి. అమిత తేజస్వియగు హనుమ, విష్ణు సహాయార్థమై అవతరించెను.

ఆనంద రామాయణము:

"రుద్రావతార స్సంజజ్ఞే వాయు పుత్రః ప్రతాపవాన్॥

(సార 11/29)

వాయు పురాణము:

"ఆశ్వినస్యాఽసితే పక్షే స్వాత్యాం భౌమేచ మారుతిః॥
మేషలగ్నేఽఞ్జనా గర్భాత్ స్వయంజాతో హరశ్శివః॥

మఱియొక చోట:

"అంజనా గర్భ సంభూతో హనూమాన్పవనాత్మజః॥
యదా జాతో మహాదేవో హనుమాన్సత్య విక్రమః॥

తా॥ ఆశ్వయుజ కృష్ణ పక్షమున, స్వాతీ నక్షత్రమున, మేష లగ్నమున, మంగళవారమునాడు, స్వయముగ సర్వ దుఃఖహరుడగు శివుడే అంజనా గర్భమున నాంజనేయుడుగ జన్మించెను.

పవనానుగ్రహమున మహాదేవుడే, సత్య విక్రముడగు హనుమంతుడుగ అంజనా గర్భమున జన్మించెను.

తారసారోపనిషత్:

"మకాకరాక్షర' సంభూత శ్శివస్తు హనుమాన్ స్వయమ్॥

గోస్వామీ తులసీదాస్:

"జయతి మంగలాకార, సంసార భారాపహార,
వానరాకార, విగ్రహపురారీ"

ఇంకను వివరములు మేము సంస్కృతములో వ్రాసిన "శ్రీ మద్రామాయణ మీమాంస" యందు చూడనగును.

హనుమంతుడు సూర్యుని వద్ద సకల విద్యల నభ్యసించిన విధము గూడ నుత్తరకాండ యందు వివరముగ వర్ణించబడినది.

## హనుమంతుని అవయవ సంస్థాన గత సౌందర్యము.

హనుమంతుడు వజ్ర సదృశములగు అంగములు గలవాడు, అందు వలననే లోకమున "వజ్రాంగు"డని (వికృతి-బజ్రాంగ, బజ్ రంగ్ మొ॥) విఖ్యాతి నొందినాడు. (వజ్ర సంహననః కపిః-వాల్మీకి). విద్యుత్సంఘాతము వలె కన్నులు మిఱుమిట్లుగొల్పు పింగల వర్ణము గలవాడు. పింగాక్షుడు.

వజ్రాహత వామహను యుక్తుడు, అతని ముఖము తామ్ర వర్ణము* గలిగి. సంధ్యాకాలీన సూర్యమండలము వగిది, మిక్కిలి యాకర్షకముగ నుండును. అతడు నిడివైన లాంగూలము గలవాడు. తామ్రమైన స్నిగ్ధేశము గలవాడు. బాల భానుని వగిది ప్రకాశించు శరీరము గలవాడు (5/31/19) తెల్లని వస్త్రము ధరించువాడు (5/32/7). పుల్లాశోక పుష్పచ్ఛాయ** గలవాడు. తప్తచామీక రేక్షణుడు. వజ్రతుల్య దంత, నఖయుక్తుడు భీమ పరాక్రమము గలవాడు (5/37/38) మహా కాయుడు. మహా భుజయుక్తుడు కర్ణములందు కుండలములను ధరించినవాడు. అతని నేత్రములు సూర్య - చంద్రులవలె మిక్కిలి ప్రకాశించు చుండును. అతని తేజస్వంతమగు దివ్య రూపమును జూచి, మహా తేజస్వియగు రావణుడే ఆశ్చర్య చకితుడాయెను.

## హనుమంతుని దివ్య గుణ సౌందర్యము:

హనుమంతుడు సూర్య భగవానుని నుండి సకల వేదాధ్యయనమును, సకల విద్యాధ్యయనమును చేసిన మహా విద్వాంసుడు ఉత్తర కాండములోని ఈ పంక్తులను చూడుడు.

"నహ్యస్య కశ్చిత్సదృశోఽస్తి శాస్త్రే వైశారదే ఛందగ తౌతథైవ।
సర్వాసు విద్యాసు తపో విధానే ప్రస్పర్ధతేఽయంహి గురుం సురాణామ్॥
సోఽయం నవ వ్యాకరణార్థవేత్తా బ్రహ్మా భవిష్య త్యపితేప్ర సాదాత్"
(7/36/47)

తా॥ శాస్త్ర వైశారద్యమున, ఛందో విజ్ఞానమున, సర్వ విద్యా విజ్ఞానము నందు, తపమునందును దేవ గురువగు బృహస్పతికి దీటైనవాడు. నవ వ్యాకరణార్థ వేత్తయగు ఇతడు, నీ యనుగ్రహమున భవిష్యమున బ్రహ్మ కాగలడు.

---

1. ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్ర మాబభౌ।
సంధ్యయా సమభి స్పృష్టం యథా స్యాత్సూర్య మండలమ్॥
(5/1/90)

2. పుల్లా శోకోత్క రాభాసం తప్త చామీ కరేక్షణమ్॥ (5/32/2)

శ్రీరామునికి, అగస్త్యుడు హనుమంతుని దివ్య గుణములను విన్పించుచు నిట్లు పల్కెను:-

"పరాక్రమోత్సాహ మతి ప్రతాపై స్సౌశీల్య మాధుర్య నయాదిభిశ్చ।
గాంభీర్య చాతుర్య సువీర్య ధైర్యై ర్హనూమతః కోప్యధికో స్తిలోకే॥

తా॥ పరాక్రమ, ఉత్సాహ, బుద్ధి, ప్రతాప, సౌశీల్య, మాధుర్య, నయములలోను, గాంభీర్య, చాతుర్య, సువీర్య, ధైర్యాది గుణములలోను, హనుమంతుని మించిన వాడు మఱియొకడు లేడు.

## హనూమద్దౌత్యము

శ్లో॥ "రఘూత్తమస్య సేవకం నమామి లక్ష్మణప్రియం। దినేశ వంశ భూషణస్య ముద్రికా ప్రదాయకమ్। విదేహ జాఽతి శోక తాప హారిణమ్, సుసూక్ష్మ రూపధారిణమ్ నమామి దీర్ఘ రూపిణమ్॥

హనుమంతుని దౌత్య కౌశలమును, బుద్ధిమత్త్వమును, రాజనయ వైశారద్యమును వర్ణించుటకు ముందు యతని సకల విద్యా వేత్తృత్వమును, స్వర సౌందర్యమును, కార్య సాధన సామర్థ్యమును, నైపుణ్యమును కీర్తించుచు, స్వయముగ శ్రీరామ ప్రభువు లక్ష్మణునితో పల్కిన పల్కులను చూడుడు:-

"ఓ లక్ష్మణా, కపీంద్రుడగు సుగ్రీవునికి సచివుడగు, హనుమంతునితో నీవు స్నేహ యుక్తములగు వచనములతో భాషింపుము. ఈతని సంభాషణ వైఖరిని బట్టి, యతడు, ఋగ్, యజు, స్సామవేదములయందు విద్వాంసుడనియు, వ్యాకరణవేత్త యనియును విదితమగు చున్నది. ఇతడింత తడవు మాట్లాడినను, నొక యప శబ్దముగూడ దొరల లేదు. సంభాషించు సమయమున, నితని, ముఖ, నేత్ర, భ్రూ, లలాటాద్యంగములయందు, ఎట్టి దోషమును గన్పింపలేదు. ఇతని భాషణము, నాతి విస్తరమై, యెట్టి సంశయమునకును స్థానమీయక, చాల స్పష్టముగ నున్నది. ఇతని యుచ్చారణము గూడ దీర్ఘముగ నుండక స్పష్టముగ నున్నది. ఇతని కంఠస్వరము శ్రావ్యముగ నున్నది. ఇతడు, మధ్యమ స్వరము నాశ్రయించి, స్పష్టముగను, మధురము

కను భాషించినాడు. ఇతని వాక్కు శబ్ద సంస్కారము గలదియై హృద్యముగ నున్నది. త్రిస్థానాభి వ్యంజితమగు ఇతని వాణి, ఎవని చిత్తమును హర్ష నిర్భరము గావింపదు? విద్వాంసుడును, నయకోవిదుడును, కార్య సాధకుడునగు ఇట్టి దూత లభించిన, రాజు కార్యము, సఫలము కాక యెట్లుండును? (కిష్కింధ)

శ్రీమద్రామాయణ కథా మణిహారమునందు, హనుమద్దౌత్యము మధ్య మణిస్థానము నలంకరించు చున్నది. కనుకనే అనిలాత్మజుడగు హనుమంతుడు "రామాయణ మహా మాలా రత్నము"గ నుతింప బడినాడు. శ్రీమద్రామాయణ కథా మణిమాల, హనుమద్దౌత్య రూపమగు మాలాఘటక మధ్యమణి రహితమైనచో, విచ్ఛిన్నమై యుండెడిది. హనుమంతుని దౌత్య కౌశలము వలననే, రామ-సుగ్రీవులకు శాశ్వత మైత్రి యేర్పడినది. హనుమ దౌత్యము వలననే, పరస్పర వియుక్తులగు సీతా-రాముల పునర్మేలనము సంభవమైనది. హనుమద్దౌత్య కార్యము వలననే, ధర్మపరిపంథియగు రాక్షసవంశము వినాశము, రఘువంశ రక్షణయు జర్గినవి. శ్రీరామావతార ప్రయోజనములగు అధర్మ వినాశ, ధర్మ రక్షణ రూపములగు కార్యములు నిరాఘాటముగ కొనసాగినవి. హనుమంతుడే లేకున్న, సీతా - రాముల జీవితము, శాశ్వత వియోగ పర్యవసాయియై, శోకాంతముగ, అధర్మ విజయ పర్యవసానముగ ముగిసి యుండెడిది హనుమంతుడు, తనను, తన వంశమును, మహా వినాశము వాతపడకుండగ, రక్షించెనని, మనస్వియగు శ్రీరామ చంద్రుడంగీకరించుటయేగాక, యతని ఋణమును, తీర్చుకొన జాలనని స్వయముగ నంగీకరించి యున్నాడు *

---

1. "కృతం హనుమతా కార్యం సుమహద్భువి దుర్లభమ్।
మనసాపి యదన్యేన న శక్యం ధరణీతలే॥

"అహంచ రఘువంశశ్చ లక్ష్మణశ్చ మహాబలః।
వైదేహ్యా దర్శనే నాద్య ధర్మతః పరిరక్షితాః॥

"ఇదంతు మమదీనస్య మనో భూయః ప్రకర్షతి।
యదిహాస్య ప్రియాఖ్యాతుర్నకుర్మి సదృశం ప్రియమ్॥

(వా॥రా॥ 6-1/2, 11, 12

హనుమంతుడు రామ దూతగ లంకకు పోయి నిర్వహించిన కార్యము లద్భుతములు, ఆదర్శప్రాయములు, సజ్జన స్తుతి పాత్రములు, దేవతల మెప్పుసుగూడ పొందగల్గినవి. దౌత్యకార్యము యొక్క మహత్త్వమును తెలిసి కొనుటకు ముందు మనము దూత లక్షణముల నెఱుగవలెను. మనువు దూత లక్షణముల నీ క్రింది విధముగ తెల్పియున్నాడు:-

సర్వశాస్త్ర విశారదుడు, ఇంగితాకార చేష్టలను బట్టి పరుల హృదయమును తెలిసికొన గలవాడు, శుచి, ధీరుడు, దక్షుడు, ఉత్తమ కుల సంజాతుడు, ప్రభుభక్తి కలవాడు, స్మృతిమంతుడు, దేశకాల కోవిదుడు, మంచి శారీర సౌష్ఠవము గలవాడు, భయరహితుడు, వాక్కుశలుడు, ఐన వానిని, ప్రశస్తమైన దూతయని యెఱుగనగును.

కామందకీయ నీతిసారమిట్లు నిర్వచించినది.

"ప్రగల్భ స్స్మృతిమాన్ వాగ్మీ శాస్త్రే చాస్త్రే చనిష్ఠితః।
అభ్యస్త కర్మా నృపతే ర్దూతో భవితు మర్హతి॥
"తర్కేంగి తజ్ఞ స్స్మృతిమాన్ మృదుర్లఘుపరాక్రమః।
క్లేశాయాస సహో దక్ష శ్చార స్స్యాత్ ప్రతిపత్తిమాన్॥
(12/2/25)

తా॥ ప్రాగల్భ్యము గలవాడు, జ్ఞాపకశక్తి గలవాడు, వాగ్మి, శస్త్ర-శాస్త్ర పరినిష్ఠితుడు, నృప కార్యకరణమునందు మెలగినవాడు దూతగ నియమించనర్హుడు.

తర్కేంగితములను తెలిసినవాడు, స్మృతిమంతుడు, మృదు స్వభావము గలవాడు, లఘు పరాక్రముడు, క్లేశాయాస సహిష్ణువు, దక్షుడు, కార్య సాధన నైపుణ్యముగల వాడును దూతగ నుండ నర్హుడు.

శ్రీరామ ప్రభువు భృత్యుని యందుండ వలసిన లక్షములను నిర్వచించి, హనుమంతుని ఉత్తమ దూతగ ప్రశంసించుచు నిట్లు పల్కెను:-

"భృత్యకార్యం హనుమతా సుగ్రీవస్య కృతం మహత్।
ఏవం విధాయ స్వబలం సదృశం విక్రమస్యచ॥

"యోహి భృత్యో నియుక్త స్సన్ భర్త్రా కర్మణి దుష్కరే।
కుర్యాత్తదను రాగేణ తమాహుః పురుషోత్తమమ్॥
"యోనియుక్తః పరం కార్యం న కుర్యా న్నృపతేః ప్రియమ్।
భృత్యో యుక్త స్సమర్థశ్చ తమాహుర్మధ్యమం నరమ్॥
"నియుక్తో నృపతేః కార్యం నకుర్యాద్య స్సమాహితః।
భృత్యో యుక్త స్సమర్థశ్చ తమాహుః పురుషాధమమ్॥
(6/1/6-9)

తా॥ హనుమంతుడు, తన ప్రభువగు సుగ్రీవునిచే దూతగ నియుక్తుడై మహత్తర కార్యములను నిర్వహించినాడు. అతడు సాధించిన కార్యములు, అతని బలమునకు, విక్రమునకు తగినట్లుగనున్నవి.

ప్రభువుచే దుష్కరమగు కర్మయందు నియుక్తుడై, ఎవ్వడు ప్రభువు యందలి యనురాగముతో తన కప్పగించిన కార్యముతో బాటుగ, నితర కార్యమును సాధించునో యతడు ఉత్తమదూత.

ఎవ్వడు తనకు ప్రభువు అప్పగించిన కార్యమును మాత్రమే చేసి, సమర్థుడై యుండి గూడ, నృపతికి ప్రియమైన, ఇతర కార్యమును చెయడో యతడు మధ్యమ దూత.

తాను సమర్థుడు, యోగ్యుడై యుండిగూడ, ఎవ్వడు ప్రభుకార్యమును సంలగ్నతతో చేయడో, వాడధముడు.

## హనుమంతుడు లంకా యాత్రలో చూపిన మహాబల, బుద్ధిమత్వ, కార్య దీక్షాభినివేశాదులు

ఇక యిపుడు, హనుమంతుడు తన ప్రభువగు సుగ్రీవుడు. తనకు అప్పగించిన దౌత్యకార్యమును నిర్వహించుటయందు చూపిన, ఉత్సాహ, ప్రభుభక్తి. శక్తి, వీర్య, బల, నయ వేత్తృత్వాది గుణములను గూర్చి మనము తెలిసికొందుముగాక, శ్రీమద్రామాయణ కవి, హనుమంతుని సాగరోల్లంఘన సమయమున, నతడు ప్రదర్శించిన, కార్యోత్సాహమును, బల - వీర్య

ములను, బుద్ధిమత్త్వమును, సమీక్ష్యకారిత్వమును, చాల దక్కగా చిత్రించి యున్నాడు.

హనుమంతుడు, సముద్రమును లంఘించ బోవుటకు ముందుగ అభీష్ట కార్యసిద్ధికై సూర్యునికి, మహేంద్రునికి, వాయుదేవునకు, స్వయంభువునకు, భూతములకును నమస్కారము చేసి, తాను సముద్రమును దాటుటకై నిశ్చయించుకొనెను ఆ తరువాత ప్రాఙ్ముఖుడై, తన తండ్రియగు వాయుదేవునకు నమస్కరించి, దక్షిణ దిక్కుగ ఎగురబోవుటకు ముందు, తన శరీరమును బాగుగ పెంచి, యాకసములోని కెగిరెను. ఆ యెగిరినపుడు, మహేంద్రగిరి సముద్రములందు గలిగిన పెక్కు వికారములను, రామాయణకవి చాల రమణీయముగ వర్ణించినాడు. ఆ విషయమును పూర్వమే నిరూపించియుంటిమి. ఇపుడు సముద్రముపై నెగురబోవుటకు ముందు హనుమంతుడు చూపిన కార్యోత్సాహమును చూడుడు. తన తోటి వానరులతో హనుమంతుడిట్లనెను:-

"యథా రాఘవ నిర్ముక్త శ్శరశ్శ్వసన విక్రమః॥"

"గచ్ఛే త్తద్వ ద్గమిష్యామి లంకాం రావణ పాలితామ్।
నహిద్రక్ష్యామి యది తాంలంకాయాం జనకాత్మజామ్॥

"అనే నైవహి వేగేన గమిష్యామి సురాలయమ్।
యదివా త్రిదివే సీతాం నద్రక్ష్యామికృతశ్రమః॥

"బద్ధ్వారాక్షస రాజాన మానయిష్యామి రావణమ్।
సర్వథా కృత కార్యోఽహ మేష్యామి సహ సీతయా॥

"ఆనయిష్యామి వాలంకాం సముత్పాట్య సరావణామ్।

(5/1/39.42/1/43)

తా॥ వాయువేగముతో పోవు, శ్రీరామ బాణమువలె, రావణ పాలితమగు లంకకు నేను పోయెదను. జానకి లంకలో నాకగుపించనిచో, అదే వేగముతో సురాలయమునకు పోయెదను, ఇంత శ్రమపడి స్వర్గమునకు పోయినను సీత కన్పించనిచో, రాక్షస రాజగు రావణుని బంధించి తెచ్చెదను. ఏమైనను, నేను కార్యమును సాధించుకొనియే సీతతో కూడ వచ్చెదను లేదా రావణునితో సహా లంకను పెకలించి తెచ్చెదను.

ఈ వాక్యములలో హనుమంతుని కార్యోత్సాహముతో బాటుగ కార్య దీక్ష, మహా పరాక్రమ యుక్తత్వము ప్రభు భక్తియు స్ఫుటముగ వ్యక్తము చేయబడినవి ఇక హనుమంతుడు వాయు మార్గమున లంక దిశగా పోవు చున్న గతిమచ్చిత్ర సౌందర్యమును చూచి యానందింపుడు:-

"తస్యాం మ్బరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ।
పర్వతాగ్రాద్వి నిష్క్రాంతౌ పంచాస్యా వివ పన్నగౌ॥

"పిబన్నివ బభౌ చాపి సోర్మిజాలం మహార్ణవమ్।
పిపాసురివ చాకాశం దదృశే స మహా కపిః॥

"తస్య విద్యుత్ప్రభా కారే వాయు మార్గానుసారిణః।
నయనే విప్రకాశేతే పర్వత స్థావివానలౌ॥

"పింగే పింగాక్ష ముఖ్యస్య బృహతీ పరిమండలే।
చక్షుషీ సంప్రకాశేతే చంద్రసూర్యా వివ స్థితౌ॥

5/1/56-59)

తా॥ అతని యొక్క యాకసములోనికి చాచిన రెండు బాహువులు పర్వత శిఖరము పైన (తమ యలుగులో నుండి) బయటికి వచ్చిన ఐదు తలల పన్నగముల వలె నుండెను.

ఆ మహా వానరుడు, తరంగ మాలాసమావృతమైన సముద్రమును ఆపోశన పట్టివేయునేమో యనునట్లు కన్పించుచుండెను.

ఆకాసముపై పోవుచున్న ఆ హనుమంతుని యొక్క విద్యుత్కాంతు లను, వెదజల్లు నయనములు పర్వతముపై మండుచున్న రెండు మంటలవలె కన్పట్టుచుండెను.

పింగాక్షులలో ముఖ్యుడగు హనుమంతుని యొక్క పెద్ద పెద్ద పరి మండల యుక్తములగు పసుపుపచ్చని రంగుగల నేత్రములు చంద్రసూర్యుల వలె నగుపించు చుండెను. (56-59)

ఇక యతని యెఱ్ఱని ముఖము, ఎఱ్ఱని ముక్కుతో, సంధ్యాకాల సూర్యమండలము పగిది ప్రకాశించు చుండెను (1/60) ఆకాశములో నీదు

హనుమంతుని, నిట్ట నిలువుగ లేచిన లాంగూలము ఇంద్రధ్వజమును నిలబెట్టి నట్లుగ నుండెను. (1/61) చక్రాకారమైన లాంగూలయుక్తుడును, తెల్లని కోరలు గల వాడును, మహా ప్రాజ్ఞుడునునగు హనుమంతుడు, గూడు కట్టిన సూర్యునివలె తోచుచుండెను (1/62) ఎఱ్ఱని యతని పృష్ఠభాగము గైరికధాతు గిరి బద్ధమైనట్లుగ నుండెను (1/63) సముద్రమును దాటు హనుమంతుని బాహుమూలముల నుండి, వెలువడినగాలి, హోరుమని ధ్వని చేయు చుండెను. ఆకసముపై నెగురు హనుమంతుని, సముద్రముపై వ్యాపించిన నీడ, మారుతా విష్టమగు నౌకవలె నుండెను. దశయోజన విస్తీర్ణము, త్రింశద్యోజనము దీర్ఘ మగు నతని నీడ చాల సుందరముగ కన్పించు చుండెను. మహా కాయుడగు ఆ మహా కపి, ఆ సమయమున, ఆకసమున పోవు పక్షయుక్తమైన పర్వత, మన్పించు చుండెను. నూరుయోజనముల విస్తీర్ణమగు సముద్రము నుల్లంఘించు హనుమంతుని ఈ దుష్కర కర్మకు మిక్కిలి ప్రసన్నులై పుష్పవృష్టులను దేవగంధర్వ దానవులు, హనుమంతునిపై గురిపించిరి. రామ కార్యార్ధ సిద్ధి నుద్దేశించి నాకసమున పోవు హనుమంతునికి సూర్యుడు సంతాపమును కలుగ చేయడాయెను. వాయువుగూడ, శైత్య, మాంద్య, సౌగంధ్యాది గుణయుక్తుడై హనుమంతుని సేవించెను. ఋషులతనిని స్తుతించిరి. దేవగంధర్వులతనిని ప్రశంసించుచు గానములు చేసిరి. నాగ, యక్ష, రాక్షసులతని సాహసమును ప్రశంసించిరి.

## సముద్రుని ప్రేరణచే మైనాకుని యాతిధ్య ప్రార్థన

మానవత్వపు విలువలను, స్నేహశీలమును, మహాత్ములయందు గౌరవ భావనను, కేవలము మానవ సమాజమునకే పరిమితము గావించక, తిర్యగ్జంతు ములయందు గూడ ప్రదర్శించిన, రామాయణకవి, మహామానవత్వమునకు, దోసిలి యొగ్గకయే మానవుడుండగలడు. హనుమంతుడు సముద్రముపైగా, వాయు మార్గమున లంకకు పోవునపుడు వాల్మీకి ప్రదర్శించిన ఈ సన్నివేశ మును తిలకింపుడు:-

హనుమంతుడు తన పైన నెగిరిపోవు చుండుటను గమనించి, ఇక్ష్వాకు కులమానార్థియగు సముద్రుడిట్లాలోచించెను:-

"నేను, ఇక్ష్వాకు వంశ ప్రభువగు సగరుని మూలకముగ వృద్ధిని పొందితిని. ఈ వానరుడు, ఇక్ష్వాకు కుల సంజాతుడగు శ్రీరామునికి పరమ హితుడు. అందువలన ఈ సాగరోల్లంఘన రూపమగు దుష్కర కార్యమున సీతనికెట్టి శ్రమకలుగకుండ చేయుట నా విధి. ఈ సమయమున, ఈ మహాత్మునకు సాహాయ్యము చేయనిచో, అందరి దృష్టిలో నిందార్హుడనగుదును. అందువలన, నీతడు కొంచెము సేపు విశ్రాంతి తీసికొని ముందునకు పోవునట్లుగ చేయుట నా ధర్మము, అని యెంచి, తనయందు, దాగుకొనియున్న హిరణ్యనాభుడగు మైనాకుని హనుమదాతిథ్యమునకై ప్రేరేపించుచునిట్లనును:
"మహావీరుడగు హనుమంతుడు, రామకార్యార్థియై, సముద్రోల్లంఘన రూపమగు భీమ కార్యము నాచరించుచున్నాడు. కనుక ఆ మహాత్ముడు చేయు యీ శ్రమను జూచి పైకిలేచి, అతని కాతిథ్యమునిచ్చి, యతని శ్రమను హరింపుము. కాకుత్స్థుని, ఆ నృశంస్యమును, మైథిలి యొక్క పివాసమును చూచియైన నీవీ యాతిథ్యము నొసగుము! వెంటనే మైనాకుడు పైకిలేచెను. మహా వేగముతో పోవు హనుమంతుడు, ఆకాశ మార్గమున అడ్డముగ నిల్చిన మైనాకుని చూచి, తన కార్యమునకు విఘ్నరూపముగ భావించి, తన రొమ్ముతో క్రిందకు నొక్కి ముందునకు పోవసాగెను. అపుడా మైనాకుడు మానుష రూపమును ధరించి హనుమంతునిట్లు ప్రార్థించెను "ఓ వానరోత్తమా! నీవు ఇట్టి దుష్కర కర్మను చేయుచున్నావు. శ్రీరాముని పూర్వజులచే నీ యుదధి పరివర్ధితమైనది. రామ హితార్థమై యిట్టి సాహస కార్యము చేయు నీకు సత్కారము చేయుట ద్వారా తన కృతజ్ఞతను తెల్పుకొనదలచినది. పెద్దలు ఇట్లు వల్కుదురు: "కృతేచ ప్రతి కర్తవ్య మేష ధర్మ స్సనాతనః॥" (5/1/108) ఒకరు మన కుపకారము జేసిన, వారికి ప్రత్యుపకారము జేసి మన ఋణము తీర్చుకొనవలెను ఇది సనాతన ధర్మము. నీకాతిథ్యమొసగుటకై సముద్రుడు చాల యాదరముతో నన్ను ప్రోత్సహించినాడు. ఓ కపివరా! నేను, అర్పించు కంద, మూల, ఫలాదికమును గ్రహించి, కొంచెము విశ్రాంతి తీసికొని, ముందునకు సాగి పోవుదువు గాక! ఓ హనుమా! సముద్రుడు ప్రేరేచుటయే గాదు, నేను గూడ స్వయముగ నీకాతిథ్యమొసగి నా ఋణమును తీర్చుకొనదల్చు చున్నాను. ఎందులకందువా, వినుము "ఓ మహాత్మా, నీవు మారుత

నందనుడవు. నిన్ను పూజించిన, నీ తండ్రిని పూజించినట్లే యగును నీ తండ్రియగు వాయుదేవుని వలన నేను చాల యుపకారమును పొందియున్నాను. పూర్వము, కృత యుగమున, పర్వతములకు పక్షములుండెడివి. అవిగూడ పక్షులవలె, దశదిశల వేగముతో సంచరించుటను గాంచి, ఋషులతో సహా, దేవ సంఘములు, ఇతర భూతములు గూడ చాల భయపడసాగెను. అపుడు దేవరాజగు ఇంద్రుడు, తన వజ్రముతో వాని రెక్కలను నరికివేసెను. అతడు వజ్రము నెత్తుకొని, నా రెక్కలను గూడ నరకుటకురాగా, నీ తండ్రియగు వాయుదేవుడు, మహావేగముతో నన్ను సముద్రములో పడవేసి, ఇంద్రుని వజ్ర ప్రహారములకు గుఱిగాకుండగ కాపాడియున్నాడు. అందువలన నీకాతిథ్యమిచ్చుట ద్వారా నిన్నాదరించదలచు చున్నాను. నీ తండ్రితోగల సంబధమును బట్టి ని కాతిథ్య మొసగుట నా ధర్మము. కాగా ప్రాకృతుడైనను అతిథికి, విజ్ఞులుగూడ పూజ గావించవలెనని శాస్త్రీను శాసనము. ఇక నీ వంటి విశిష్టాతిథికి పూజ గావించుట విషయములో[1] చెప్పెడిదేమి. ఓ మారుత నందనా! నీ పూజ ద్వారా ప్రత్యుపకారము చేయు యవకాశము సంప్రాప్తించినందు వలన నేను నా యాతిథ్యమున స్వీకరింపుమని ప్రార్థించు చున్నాను. కనుక మా యాతిథ్యమును స్వీకరించి, శ్రమను పోగొట్టుకొనుము. మాకు ప్రీతిని గల్గింపుము.

హనుమంతుని కార్యదీక్ష - అనునయ చాతుర్యము:

మైనాకుని ప్రీతి యుక్తములగు పల్కులు విని, ప్రభు కార్యనిర్వహణ మున నెట్టి విలంబమును సహించని వాయునందనుడు మైనాకునికి ఖేదము కలుగ కుండుటకై యతనిని హస్తముతొ స్పృశించి యిట్లు పల్కెను:-

"ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యు రేషోఽప నీయతామ్॥"
(5/1/125)

ఓ హిరణ్య నాభా! నీ వాడిన పల్కులే నాకాతిథ్య మొసగినంత ప్రీతిని కల్గించినవి. నేను, నీవు కోరినట్లు, ఆగి, నీ యాతిథ్యమును స్వీకరింపలేదని, మనస్సున కోపము పెట్టుకొనకుము.

1. అతిథిఃకిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా।
ధర్మం జిజ్ఞాసమానేన, కింపునస్త్వాదృశో భవాన్॥ (5/1/114

ప్రొద్దుగ్రుంక పోవుచున్నది. నా ప్రతిజ్ఞననుసరించి, నేను మధ్యలో ఆగకూడదు. ఏమియు యనుకొనవద్దని ముందుకు వెడలిపోయెను. నిజముగ నీసన్ని వేశము, హృదయ మున్న వారికి కడు ముదమును గూర్చు నట్టిదనుటలో సంశయము లేదు. సముద్ర మైనాకులను కేవలము జడములుగా చిత్రించక, వారియందు కేవలము మానుష భావమును చూపుటతో తృప్తిపడక, వారియందు కృతజ్ఞత, స్నేహశీలము, అతిధి పూజా తత్పరత, మొదలగు మహోన్నత భావములను చూపిన వాల్మీకి యౌదార్యము, ధర్మనిష్ఠ, పూజ్యుల యందాదర భావము, మానవతా దృష్టియు కడు ప్రశంసార్హములు. హనుమ యందు, ప్రభుభక్తి, కార్యదీక్ష, ప్రభుకార్యమునందు, విలంబము నంగీకరించక పోవుటయను, మహాగుణములను ప్రదర్శించి, యింతటితో తృప్తి పడక, తన కాతిధ్యమొసగుట కువ్విళులూరు సముద్ర-మైనాకులకు, కష్టము కలుగకుండుటకై, వారిని కర స్పర్శతోడను, ప్రీతియుక్తములగు వచనములతోడను, తృప్తిపరచిన హనుమంతుని పరేంగిత జ్ఞానము, మృదుచిత్త వృత్తి, ఔదార్యము, చాల ప్రశంసనీయములు.

సముద్ర లంఘనము, మైనాకానునయ కర్మలను జూచి, సురలు, సిద్ధులు, ఋషులు మున్నగువారు హనుమంతని మిక్కిలి ప్రశంసించిరి. మైనాకుడు రామకార్యార్థమై యేగు హనుమంతుని పట్ల జూపిన ఆదర భావమునకు సంతుష్టుడై దేవేంద్రుడతనికి, తన వజ్ర ప్రహార భయములేకుండునట్లుగ అభయ ప్రదానము చేసెను.

## హనుమంతుని విఘ్న నిర్వారణ, కార్యనిర్వాహ సామర్థ్యములు

హనుమంతుని బల-పరాక్రమముల పరీక్షకై, పూర్వమే దేవతా ప్రేరితురాలైన నాగమాతయగు "సురస" కామ రూపిణి యగుటచే హనుమంతుని మ్రింగుటకై యాతని మార్గమున కడ్డముగ నిల్చి యతని కిట్లనెను:-

"నీవు దేవతలచే నా కాహారముగ నిర్దేశింప బడితివి. నేను నిన్ను భక్షింప నిచ్చగించుచున్నాను. నీవు నా ముఖమున ప్రవేశించి, నాకాహారము

కమ్ము, అని పల్కి నోరు తెఱచుకొని యతనిని మ్రింగుటకు సిద్ధపడగ. ప్రభు కార్య తత్పరుడగు హనుమంతుడు పల్కిన మాటలు, వజ్ర హృదయులను గూడ కరగించివేయును. ఈ క్రింది హనుమంతుని పల్కులాలింపుడు.-

"రామో దాశరథి ర్నామ ప్రవిష్టో దండకా వనమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా॥

"అన్య కార్య విషక్తస్య బద్ధ వైరస్య రాక్షసైః।
తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ॥

"తస్యా స్స కాశం దూతోఽహంగ మిష్యే రామ శాసనాత్।
కర్తు మర్హసి రామస్య సాహ్యం విషయ వాసిని॥

"అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్ట కారిణమ్
ఆగమి ష్యామితే వక్త్రం సత్యం ప్రతిశ్రుణోమితే॥

(5/1/152-55)

తా॥ దశరథుని పుత్రుడగు శ్రీరామచంద్రుడు, తన సోదరుడగు లక్ష్మణుని తోడను, భార్యయగు సీతతోడను దండకారణ్యమును ప్రవేశించినాడు.

రాక్షసులతో బద్ధవైరముగల శ్రీరామచంద్రుడు, అన్యకార్యాసక్తుడై యుండగ, యశస్వినియగు, అతని భార్య సీత, రావణునిచే నపహరించబడినది.

రామాజ్ఞపై, రామదూతగ నేను ఆమె వద్దకు పోవుచున్నాను. రామ విషయ వాసినియగు నీవు గూడ అతనికి సాయము చేయుట యుక్తము.

అందుకు, ఒప్పుకొనవేని, సీతను దర్శించి, అటుపిమ్మట ఆ క్లిష్టకర్ము డగు రాముని గూడ కలసికొని, నీ కాహారమగుదును. నేను యథార్థముగ నీకి వాగ్దానము చేయుచున్నాను.

నిజముగ హనుమంతుని యీ పల్కులందు, అతని ప్రభుభక్తి పరాయణత, సత్యనిష్ఠ, త్యాగ శీలము, పరదుఃఖ కాతర్యము హృదయ నైర్మల్యము గోచరించు చున్నవి.

హనుమంతుని యీ పలుకులు విని కామరూపిణి యగు సురస యతని కిట్లనెను: నాకు, బ్రహ్మ యిచ్చిన ఈ వరమును ఎవ్వరును అతిక్రమించ జాలరు. నీవు నా ముఖములో ప్రవేశించిన తరువాతనే ముందుకు పోగలవు, అని పల్కి తన విశాలమైన నోరును తెఱచుకొని హనుమ యెదుట నిలబడెను. అందులకు హనుమ కోపించి, నీవు నేను పట్టగలిగినంతగ నీ నోరు తెరవుము అనెను అపుడు సురస తన ముఖమును దశ యోజనముల పొడవుగ తెరువగ, హనుమంతుడు తన శరీరమును ఇరువది యోజనముల పొడవు పెంచెను. ఈ విధముగ, పది యోజనములు పూర్వముకంటె సురస పెంచుటయు, సురస ముఖముకంటె, తాను (హనుమంతుడు) పది యోజనములు పెంచుచు పోయెను. చివఱకు సురస తన ముఖమును నూరు యోజనములు పెంచగా, బుద్ధిమంతుడగు హనుమంతుడు, మేఘమువలె తన శరీరమును, కుంచించి, అంగుష్ఠ మాత్ర ప్రమాణము గావించి, ఆమె ముఖమునందు, ధడాలున ప్రవేశించి, ఆమె ముఖము మూయులోపలనే, ఆకసము పైకెగిరి, సురసతో నిట్లనెను: 'దాక్షాయణి! నీ కోరిక ననుసరించి నీ ముఖమున ప్రవేశించితిని. నీకు నమస్కారము. నేను వైదేహి నన్వేషించుటకు పోవుచున్నాను.' అనెను. ఆమెగూడ అతని బుద్ధిమత్త్వమును ప్రశంసించి, కార్యమును సాధింపుమని పల్కెను. అటు పిమ్మట, గరుడ సమవేగముతో హనుమంతుడు వాయు మార్గమున యాత్రను కొనసాగించెను. అపుడు 'సింహిక' యను ఛాయా గ్రాహిణియు, కామరూపిణియునగు రాక్షసి, విపులకాయుడగు హనుమంతుని, ఆకసముపై నెగిరిపోవు చుండుటను చూచి, ఇన్నినాళ్లకింతటి మహత్తరమైన జీవి యాహారముగ దొరకినందులకు, లోలోన చాల సంతోషించి, ఆకసమున పోవు హనుమంతుని, సముద్రముపై పడిన ఛాయ ఆధారముగ, నతనిని క్రిందికి లాగసాగెను. తన నెవ్వరో యగుపించకుండగ క్రిందికి లాగుటను గమనించి, మొదట యాశ్చర్యపడి, తరువాత వానరా రాజగు సుగ్రీవుడు, ఛాయాగ్రహిణియగు రాక్షసిని గూర్చి చెప్పిన మాటలు గుఱుతుకురాగ, తన కాయమును బాగుగ పెంచసాగెను. అది చూచి, ఆ సింహిక పాతాళాంబరములు నిండునట్లుగ తన నోరు తెఱచి మేఘ గర్జనము నేయుచు హనుమంతుని వెంటాడెను. మేధావియును వజ్ర సంహననుడునునగు మారుతి, ఆమె

విశాల కాయమును, ఆమె మర్మస్థలములను చూపరికించి, హఠాత్తుగ తన కాయ మును సంక్షేపించి, ఆమె ముఖ గహ్వరములోనికి దుమికెను. లోపల ప్రవే శించి, వజ్రాంగుడగు మారుతి, తన వాడియగు గోళ్లతో, ఆ సింహిక మర్మ ములను ఛేదించి, తిర్గి యాకాశమున కెగిరెను. ఆ తరువాత తన కాయమును పూర్వమునందు వలె పెంచి, ముందునకు కొనసాగెను. సింహికను కడు చాతుర్యముతో హననమొనర్చిన వజ్ర సంహననుడగు మారుతి, ధైర్య, చాతుర్య, పరాక్రమాదుల నాకాశచారులగు భూతములు ప్రశంసించి, యత నితో నిట్లనెను; "ఓ హనుమ! నీవు మహత్తరమైన కార్యమును చేసితివి. ఈ సింహికాహనము చాల దుష్కరమైనది. నీవు, స్వాభీప్సిత కార్యమును సాధించుటకు పొమ్ము. ఓ వానరేంద్రా! ఎవరిలో నీకు వలె, ధైర్యము, సూక్ష్మ దృష్టి, మేధ, కార్య సామర్ధ్యము, అను నాల్గు గుణములుండునో వారెంత దుష్కర కార్యములను చేపట్టియు, అసాఫల్యము నొందరు." ఈ విధముగ ఆకాశ చారులగు భూతముల ప్రశంసల తోడను, శుభాశంసన ముల తోడను మహా వేగముతో తన యాత్రను కొనసాగించి హనుమంతుడు దక్షిణోదధి తీరమున త్రికూట పర్వత శిఖరమును చేరుకొనెను.

హనుమంతుడు, తన యీ సముద్రోల్లంఘన రూపమైన దుష్కర కార్యనిర్వాహ సందర్భమున, తన శక్తి-సామర్థ్యములను, బుద్ధిమత్త్వమును. శీఘ్రకారిత్వమును, ప్రభు భక్తిని, కార్యవిలంబాసహన రూపములగు, మహ త్తర గుణములను బ్రదర్శించుటయే గాక, అణిమ మహిమ, యను సిద్ధులను గూడ ప్రదర్శించెను అష్టసిద్ధి సంపన్నుడును, రుద్రాంశ సంభూతుడును, వాయు పుత్రుడునగు హనుమంతుని యీ వీరకృత్యములు భక్తజన ప్రమోదకరములు. ఇ(క రామకార్యమును నెరవేర్చి సురసకు తన శరీరము నాహారముగ సమర్పింతునని హనుమంతుడనిన మాటలు, అతని నిర్మోహత్వ మును, పరదుఃఖ కాతరత్వమును, పరఃదుఖ నివారణకై, తన శరీరమును ఆనందముతో త్యజించుటయను, లోకోత్తర త్యాగ లక్షణమును చాటుచున్నది. ఈ మాటలు, గుర్వాజ్ఞపై, కామధేను సేవను చేయు దిలీప మహారాజు, గురు హోమధేనువును మ్రింగుటకై వచ్చిన సింహమునకు తన మేనును, ధేనువు శరీరమును భుజించుటకు మారుగ, భుజించి, ఆకలి తీర్చుకొనుమని ప్రతిమ

లాడుచు, చెప్పిన ఈ క్రింది పల్కులను గుఱుతు తెచ్చుచున్నవి.

"ఏకాంత విధ్వంస సిషు మద్విధానాం పిండేష్వనాస్థాఖలు భౌతికేషు॥"

(రఘువంశము 2/57)

తా॥ నియతమగు నాశ స్వభావముగల భౌతిక శరీరములందు మాకెట్టి వ్యామోహము లేదు. (కావున నా యీ శరీరమును భుజించి నీ యాకలి తీర్చు కొనుము, అని తాత్పర్యము.)

ఇది, మన భారతీయ సనాతన వైదిక సంస్కృతి. పరుల దుఃఖ నివారణమునకై, తమ ప్రాణములను సంతోషముతో త్యజించుటయను గుణము లోకోత్తరమగు దివ్యగుణము. ఇట్టి మహత్తరమైన దివ్యలక్షణమును, హనుమ యీ సందర్భమున ప్రకటించి, భారతీయ సంస్కృతి మహత్త్వమును లోకమునకు చాటిన మహానుభావుడు హనుమ.

## హనుమంతుని లంకా ప్రవేశోద్యోగము:

హనుమంతుడు, "లంక"లోని రక్షణ వ్యవస్థను గమనించి, తానింతటి బృహచ్ఛరీరముతో లంకను ప్రవేశించి, దౌత్యకార్యము విఫలమగునని తలచి మార్జార మాత్ర ప్రమాణమగు శరీరమును ధరించి, రాత్రియైన పిదప లంకలో ప్రవేశించి, సీతనన్వేషించుట క్షేమతరమని భావించి సూర్యాస్తమయము కొఱకు, త్రికూట శిఖరముననే యుండి, నిరీక్షింపనాగెను ప్రదోషకాలమైన తరువాత, ఆలస్యము చేయకుండగ. త్రికూట శిఖరమునుండి లంకలోనికెగిరి దూకెను. లంకానంగరమును పాలించు "లంక" యను నగర దేవత, యతని యెదుట ప్రత్యక్షమై యతనిని లంకలో ప్రవేశింపకుండగ నిరోధించి, పెద్దగ గర్జించుచు ఆతనితోనిట్లు పలికెను: 'ఓ వానరా! నీ, వెవ్వడవు? ఏ కార్యముపై నిటకు వచ్చితివి? ప్రాణములు బొందిలో నుండగనే యథార్థమును తెల్పుము" అని గర్జించి యడుగగ, ధీర హృదయుడగు హనుమంతుడు, అదరక, బెదరక, యామెతో, నీవెందులకు నాపై గర్జితచు చున్నావు? అసలు, నీవెవ్వరవో తెల్పుమని యడిగెను. అపుడామె, తాను రావణుని యాజ్ఞాకారిణియగు లంకానగర పాలికయగు "లంక"ననియు, ఆమెను తిరస్కరించి, యెవ్వరును లంకలో ప్రాణములతో లంకా

నగరములో ప్రవేశింప జాలరని బదులుపల్కెను. అపుడు మేధావియు, బలవంతుడునునగు హనుమంతుడామె కిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. పెద్ద పెద్ద భవనముల తోడను, ప్రాకారాదుల తోడను నొప్పు పరమ రమ్యమగు ఈ లంకా నగరమును చూచు వేడ్కతో వచ్చితిని. ఈ నగర రామణీయకమును దర్శించిన యనంతరము వచ్చిన వాడను, వచ్చినట్లుగ తిర్గి పోవుదును.

అందుకు "లంక" యతనికి కినిసి, భయంకరముగ గర్జించుచు, తన యరచేతితో హనుమంతుని ఒక చరపు చరచెను. అందులకు కోపించి, హను మంతుడు గూడ, పెద్దగ గర్జించుచు, వెఱ్ఱికోపము, రాగా, "లంక "స్త్రీ"యని చియతలచి, ఎడమ చేతిని బిగించి ఒక గ్రుద్దు గ్రుద్దెను. అపుడామె ప్రాణ ములు క్రిందుకు-మీదుకు కాగా, విహ్వలయై గద్గద స్వరమున హనుమంతున కిట్లనెను.

"ప్రసీద సుమహా బాహో, త్రాయస్వహరి సత్తమ।
సమయే సౌమ్య తిష్ఠంతి, సత్త్వవంతో మహాబలాః॥
(5/3/44)

తా॥ మహా బాహువగు ఓ హరిసత్తమా! నాకు ప్రసన్నుడవై నన్ను రక్షింపుము. (చంపకుము) మహాసత్త్వులగు వీరులు మర్యాదను కాపాడుదురు.

ఓ మహావీరా నీవు నన్ను విక్రమముచే జయించితివి. నాకు పూర్వము బ్రహ్మ యిచ్చిన వరమును చెప్పెద, వినుము. ఎప్పుడు, ఒక వానరుడువచ్చి పరాక్రమముచే నిన్ను లొంగతీయునో యప్పుడే రాక్షసులకు వినాశ మాసన్న మైనదని తెలిసికొనుము.* ఓ సౌమ్యదర్శనా! ఇపుడా సమయము వచ్చినది. దీనినెవ్వరు తప్పింపజాలరు. ఈ నా పల్కులు వినుము:-

"సీతా నిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః॥
రక్ష సాంచైవ సర్వేషాం వినాశ స్సముపాగతః॥
(5/3/49)

---

1. "యదాత్వాం వానరః కశ్చి ద్విక్రమా ద్వశమానయేత్।
తదా త్వయాహి విజ్ఞేయం రక్ష సాం భయమాగతమ్॥
(5/3/47)

ఓ హరిశ్రేష్ఠా! సీత మూలముగ, దురాత్ముడగు రావణునికిని, రాక్షసులకును, వినాశ కాలము దాపరించినది (5/3/49). కావున నీవు లంకలో ప్రవేశించి, సీతాన్వేషణము చేయుము: అని.

ఈ విధముగ లంకా దేవతను నిగ్రహించి, శత్రువిజయము నభిలషించి, హనుమంతుడు, ప్రాకార ద్వారము గుండ లంకను ప్రవేశింపక, ప్రాకారమును లంఘించి. లంకలో సవ్యపాదమును ముందుగనుంచి ప్రవేశించెను.

హనుమంతుని లంకా ప్రవేశమును ఆలంకారిక శైలిలో వర్ణించుచు భగవాన్ వాల్మీకి యిట్లు వ్రాసినాడు:-

"ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజ హితఙ్కరః
చక్రేఽథ పాదం సవ్యంచ శత్రూణాం సతు మూర్ధని॥
(5/4/3)

కపిరాజగు సుగ్రీవునికి హితమును గూర్చ, హనుమంతుడు లంకలో, ఎడమ పాదము ముందుగ పెట్టి ప్రవేశించెను. అతడు తన ఎడమ పాదమును లంకలో పెట్టుటయన, తన శత్రువుల తలపై పాదము పెట్టుటయేయని, కవి తాత్పర్యము.

సీతాన్వేషణము

ఆ తరువాత యతడు లంకానగరములో ప్రవేశించి, రాక్షస భవనము లన్నింటిని సీత కొఱకై గాలింప సాగెను. లంకాభరణమని చెప్పదగిన, రాక్షసేంద్రుని భవనమును గూడ వెదకెను. లంకలోగల ఉద్యాన వనము లన్నింటిని వెదకెను. ఒక గృహమునుండి మఱియొక గృహమునకు పోవుచు, లంకలోని గృహములనన్నిటిని వెదకెను. ఆ తరువాత, ప్రహస్త, మహాపార్శ్వ కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి, బహుదంష్ట్ర, శుక, సారణ, ఇంద్రజి, జంబుమాలి, రశ్మికేతు, సూర్యశత్రు, వజ్రకాయ, ధూమ్రాక్ష, సంపాతి, విద్యుద్రూప, భీమ, ఘన, విఘన, శుకనాభ, చక్ర, శఠ, కపట, హ్రస్వకర్ణ, దంష్ట్ర, లోమశ, యుద్ధోన్మత్త, మత్త, ధ్వజహ్వ, హస్తిముఖ, కరాల, విశాల, శోణితాక్షాది రాక్షస ప్రముఖుల భవనము లన్నియును గాలించెను. రాక్షసేంద్రుని రాజ భవనమును, శయన

శాలను, పానశాలను, విమాన గృహమును, పుష్పక విమానమునుగూడ పరిశీలించి చూచెను. తరువాత రావణుని శయనశాలలో, నొక ప్రదేశమున బంగరు మంచముపై నిద్రించు మండోదరిని చూచి, సీత యనుకొని, సీతను చూచితినను ఆనందమును పట్టలేక యా కపి ప్రవరుడు చేసిన ప్రకోతి చేష్టలు సహృదయులకు మోదమును కల్గించక మానవు. ఈ క్రింది, ఆనంద పరవశ ములగు కపుల స్వాభావిక చేష్టలను చూచి వినోదింపుడు:-

"గౌరీం కనకవర్ణాభామిష్టా మన్తఃపురేశ్వరీమ్।
కపి ర్మందోదరీం తత్ర శయానాంచారు రూపిణీమ్॥

"సతాం దృష్ట్వా మహాబాహు ర్భూషితాం మారుతాత్మజః।
తర్కయా మాస సీతేతి రూపం యౌవన సంపదా।
హర్షేణ మహతా యుక్తో ననన్ద హరి యూథపః॥

"ఆస్ఫోటయా మాస చుచుంబపుచ్ఛం ననన్ద చిక్రీడ జగౌ జగామ।
స్తంభానరోహన్ని పపాత భూమౌ, నిదర్శయన్ స్వాంప్రకృతిం కపీనామ్॥ వా॥రా॥ 5/10/52-54)

హనుమంతుడు బంగారు ఛాయగల తను యష్టితో నొప్పు రావణుని యంతఃపురేశ్వరియగు మండోదరిని చూచెను. రావణుని సమీపమున నిద్రించు, చారురూపిణియును, సర్వాలంకార శోభితురాలును, నిండు యౌవనమున వెల్గొందు మండోదరిని చూచి సీతయని యనుకొని పట్టరాని యానందముతో నుప్పొంగిపోయెను. ఆ యానందమును పట్టలేక యతడు తన తోకను ముద్దు పెట్టుకొనెను. పకపక నవ్వెను అటు నిటు యెగిరెను. కూనిరాగములు తీసెను. స్తంభములపై నెక్కెను. ధఢాలుమని క్రింద పడెను. ఇట్టివెన్నియో స్వాభావిక చేష్టలు చేసెను. స్వాభావికములగు ఈ కపి చేష్టలు భౌతికములే యైనను హనుమయొక్క యాంతరమగు ఆనందమున కభివ్యంజకములు. ఇట్టి చేష్టలు? నిజముగ సహృదయుల కానందసంధాయకములు

అస్తు ఈ యానంద మతని కెక్కువ కాలము నిలువలేదు కాని లంకేశ్వరి వృత్తమును చూచిన పిదప యతనికా భ్రమ తొలగెను. అతడీవిధముగ తన మనస్సులో తలపోసెను:-

పరమ పతివ్రతయగు సీత రామునితో వియోగమును పొంది సుఖముగ నిద్రింప జాలదు. భుజింపదు. అలంకరించు కొనదు. మద్యమును సేవింపదు. రామునివంటి మహాత్ముడు దేవతలలో గూడ అరుదు, అను విశ్వయమునకు వచ్చి క్రమఱల సీతాన్వేషణముచేయుటకై నిశ్చయించు కొనెను. రావణుని యంతఃపుర మంతయును తిర్గి గాలించుట మొదలిడెను. ఆ యంతఃపురమున మైమఱచి, ఒంటిమీద నున్న వస్త్రములు తొలగి యున్నవో, లేదో గూడ తెలియకుండగ తప్ప త్రావి పడియున్న రావణుని యందమగు అంగనావ్రతమును అతడు సీతకొఱకై పరికించి చూచెను. కాని యెక్కడను సీతాదేవి కానరాలేదు. సీత కన్పించక పోవుటచే ఖిన్నుడైన నిష్కలంక బ్రహ్మచారియగు హనుమంతునికి ధర్మసాధ్వస భయము కల్గెను. అతడు తనలో నిట్లనుకొనెను. "బ్రహ్మచర్య ధర్మమును పాటించు నేను నిద్రపోయిన పర కాంతలను చూచుట ధర్మమునకు విరుద్ధము. అంతేగాదు పరదార పరిగ్రహము చేసిన రావణుని గూడ చూచితిని. ఇది నేనాచరించిన ధర్మమును నశింప చేయును, యని యనుకొని తిర్గి తాను ఈ సమయమున చేసినది తప్పుగాదను నిశ్చయమునకు వచ్చెను. ఏలయన, నేను, కావలెనని పరదారలను చూడలేదు. ఏ జంతువును ఆ జాతిలో వెదుకవలెను. స్త్రీలను స్త్రీజాతిలోనే వెదకవలెను, గాని అడ మృగముల యందన్వేషింపము గదా! కనుక ఇక్కడ స్త్రీ దర్శనము ముఖ్యముగాదు, సీతా ప్రత్యభిజ్ఞానము ముఖ్యము. అందువలన నేను చేసిన ఈ పరదార నిరీక్షణము కామ మూలకము కదు గనుక నాకు దోషములేదు. కేవలము శుద్ధ దృష్టితో స్త్రీలను దర్శించుట పాపముగాదు, మనస్సు ప్రధానము. కావుననే నా మనస్సులో సుందరమగు అంగనా వ్రాతమును చూచినను కామ వి_రము కలుగలేదు కనుక దోషమూలము మనస్సు కాని, దర్శనము కాదు, అని నిర్ధారణ చేయుచు హనుమంతుడిట్లు తనలో తాననుకొనెను:-

"మనోహి హేతుస్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే।
శుభాఽశుభాస్వవ స్థాసు తచ్చమే సువ్యవస్థితమ్॥
(వా॥రా॥ 5-11-42)

శుభాశుభ కార్యముల యందు ఇంద్రియములను ప్రవర్తింప చేయునది మనస్సు. కనుక నా మనస్సు ఎట్టి వికారమునకు సుందరమగు స్త్రీలను చూచి

నను, ఎట్టి వికారమునకు లోనుగాక పవిత్రతను కోల్పోనక యున్నదిగాన నా బ్రహ్మచర్య ధర్మమున కెట్టి లోపము గలుగలేదని నిశ్చయించుకొని, ఆ పానశాలను త్యజించి తిర్గి సీతాన్వేషణమును కొనసాగించెను.

అతడు సీత కొఱకై వెదుకని ప్రదేశములు, చూడని భవనములులేవు. అతడు లంకలోని పానశాలలు, లతా గృహములు, నిశాగృహములు, పుష్ప గృహములు, చిత్రశాలలు, క్రీడాగృహములు, గృహోద్యాన వీధులు, విమాన గృహములు, భూమి గృహములు, ఒకటేమిటి మొత్తము నగరమంతయు, అంగుళము - అంగుళము వెదకి చూచెను. ఈ విషయమును వర్ణించుచు రామాయణ కవి యిట్లు వ్రాసినాడు:-

"చతురంగుల మాత్రోపినాఽవ కాశ స్స విద్యతే।
రావణాంతఃపురే తస్మిన్యం కపిర్నజగామసః॥
"ప్రాకారాంతర వీథ్యశ్చ, వేదికాశ్చైత్య సంశ్రయాః॥
శ్వభ్రాశ్చ పుష్కరిణ్యశ్చ, సర్వంతేనాఽవలోకితమ్॥
(5/12/17-18)

తా॥ ఆ మహాకపి, రావణుని యంతఃపురమున నాల్గు అంగుళముల ప్రదేశమును గూడ విడువకుండగ చూచెను. ప్రాకారాంతర వీధులను, చైత్య వృక్షముల క్రింద నిర్మించబడిన అరుగులు, గర్తములు, పుష్కరిణు లను గూడ చూచెను. (11/7-184)

హనుమన్నిర్వేదము :

రావణుని యంతఃపుర కాంతలందరినిగూడ, పరిశీలించి, మారుతి, చూచెనని తెల్పియుంటిమి. కాని యెక్కడను వైదేహినిగానక, వానరుల సీతా న్వేషణ యత్నము, తన సాగరలంఘనము, తన శ్రమయంతయు వృథా ఐపోయినందులకు మారుతి చాల విషాదమును పొంది తనలో తానిట్లు వితర్కించు కొనెను:-

"శ్రీరామునికి, ప్రియము చేయుటకై, లంకయంతయు నిఃశేషముగ, గాలించితిని. కాని సీతను కనుగొనలేక పోయితిని. మఱి, సీత లంకలో

లేకున్న, గృధ్రరాజగు సంపాతి, "సీత" రావణుని భవనమున బందీగానున్న దని యెందుకు చెప్పును ? పోనీ, ఇతర రాజకన్యల వలె, వైదేహి, రావణుని యైశ్వర్యమునకు, పరాక్రమమునకును, ఇతర ప్రలోభములకును, లోనై యతనికి వశమై యుండునని యనుకొనుటకు వీలులేదు. ఏలయన, జనకుని, నిర్మలమగు వంశమున జన్మించి, లోకనాథుడగు శ్రీరామునకు పత్నియై, సర్వానవద్య సౌందర్యయుక్తయైన సీతాదేవి, రావణునికెట్లు వశమగును?* అసంభవము.

ఒక వేళ, రామబాణ భీతుడగు రావణుడు, హడావిడిగ సీతను తీసికొని, పైకెగిరి, వాయు మార్గమున పోవుచున్నపుడు, రావణుని పట్టు విడిపించుకొనుటకై పెనగులాడుచు, మార్గ మధ్యమున నెక్కడనైన, పడిపోయి యుండునా ? లేక, యతడు, సాగరము మీదుగ లంకకు పోవునపుడు, భీమమును, ఉత్తాల తరంగ యుక్తమునునగు సముద్రమును చూచి, ఆమె గుండె యాగిపోయి యుండునా ? లేక రావణుడు తన కర్కశ బాహువులచే గట్టిగ బంధించుకొని, తీసికొని పోవుచుండగ, ఉక్కిరి - బిక్కిరియై - ప్రాణములు త్యజించి యుండునా ? స్వశీల సంరక్షణ తత్పరయును, ఆర్యపథ నిష్ఠురాలును నగుటచే, ఈ కటిక రాక్షసుడు, తనకు సీత లోబడమింజేసి, నిర్దయగ వధించి యుండునా ? లేక వికృతాకారలగు రాక్షసరాజ భార్యలను చూచి భయముతో ప్రాణములు విడచియుండునా ? లేక యతని భార్యలే యీసున భక్షించి యుందురా ? లేనిచో, దూర బంధువును, తపస్వినియును, ఉత్తమ శీల సంపన్నురాలును నగు సీతాదేవిని, క్షుద్రుడగు రావణుడే భక్షించి యుండునా ?** అని పరి పరివిధముల తర్కించి యనంతమగు విషాదమును పొందెను. సీత మృతిచెంది యుండునను భావము మనస్సున నుదయింపగనే మనస్వియును, పరదుఃఖ కాతరుడును నగు హనుమంతుడు, అంతులేని దుఃఖ

---

1. జనకస్య కులే జాతా రామపత్నీ సుమధ్యమా।
కథ ముత్పల పత్రాక్షీ రావణస్య వశం వ్రజేత్?॥"
(5/13/14)

2 అహో క్షుద్రేణ చానేన రక్షస్త్రీ శీలమాత్మనః।
అబంధు ర్భక్షితా సీతా రావణేన తపస్వినీ॥ (5/13/110)

మును పొంది తనలో తానిట్లు తలపోసెను: "పాపము! ఆ వైదేహి, అత్యంత దైన్యభావము నొంది, మృత్యు ముఖగహ్వరమున పడి, పూర్ణచంద్రుని బోలిన ముఖముగల వాడును, పద్మ పత్రములవలె విశాలమగు నేత్రములు గల వాడునునగు, శ్రీరాముని ముఖచంద్రుని మనస్సులో ధ్యానించుచు, రామా, అయ్యో లక్ష్మణా, ఓ అయోధ్యా నగరమా! యని, పరి పరివిధముల విల పించుచు, ప్రాణములను త్యజించి యుండునా! నిజముగ రామాయణకవి, హనుమంతుని పేశల హృదయమును, ఇక్కడ, కడు కరుణముగ చిత్రించి నాడు. తిర్గి యతడిట్లు తలపోసెను, లేదా, యిక్కడనే రావణుని గృహమున, నేమూలనో బంధించబడి, పంజరములోని గోరువంకవలె విలపించు చుండ వచ్చును! ఒకవేళ, ఆమె మరణించియే యుండినను, ప్రియభార్యుడగు రామునికీ దుర్వార్త నెట్లు తెలుపుదును? తెలుపక యున్న కర్తవ్యోల్లంఘనము వలన మహాపాపము వచ్చునుగదా![1] ఈ విధముగ సంశయ విమూఢ మన స్కుడై, హనుమంతుడు, సీతకు సంబంధించిన దుర్వార్తను, తెలియ చేయుట వలన, లేక తెలియ చేయక పోవుటవలన వచ్చు అర్థానర్థములను గూర్చి యిట్లు వితర్కించెను: నేను సీతను చూడకుండగ, కిష్కింధవ మరలి పోవుదునేని, యింత శ్రమపడి, యేమి సాధించినట్లు? కాగా, సీతను చూడకుండగ తిర్గిపోయి, నామీద, ఆశ పెట్టుకొని యెదురుజూచు, జాంబవ, దంగదాది హరివీరుల కేముఖము చూపించెదను? వానర రాజగు సుగ్రీవుడు, నాయందే కార్య వినిశ్చయము గల్గి యున్నవాడు. అతడేమియనునో గదా! కాగా, లంకలో గూడ సీత కన్పించలేదని చెప్పిన, భార్యాయత్త ప్రాణుడగు శ్రీరాముడు తప్పక ప్రాణములు త్యజించును. అతనినినే, తన సర్వస్వముగ భావించి, మాతా-పితృ-పత్నీ-సుహృదాది పరివారమును, సకల రాజ్యభోగములను సైతము త్యజించి, కానలకతని యనుగమించిన లక్ష్మణుడు; శ్రీరాముడు ప్రాణములను త్యజించిన తాను మాత్ర మెట్లు బ్రతుకును? బ్రతుకుట యసంభవము. వీరిరువురు ప్రాణ ములను త్యజించిరను వార్తను విని, వారియందే ప్రాణములు పెట్టుకొని

1. "నివేద్యమానే దోషస్స్యా ద్దోషస్స్యాద నివేదనే।
కథంను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతిమే॥ (5/13/16)

వారి పునరాగమమునకై తపము సల్పు భరత శత్రుఘ్నులు గూడ ప్రాణములు విడతురు. పుత్రులందరీ విధముగ దుర్మృత్యువు పాలైన విషయమును చూచి, వారి తల్లులు గుండెపగిలి చనిపోవుదురు. తన ప్రాణమిత్రమగు శ్రీరాముడీవిధముగ పంచత్వము నొందగ వానరులకు కలుగబోవు దుర్గతిని గూర్చి వాపోవుచు నిట్లు తలపోసెను:-

"కృతజ్ఞ స్సత్య సంధశ్చ సుగ్రీవః ప్లవగా ధిపః
రామం తథాగతం దృష్ట్వా తత స్త్యక్ష్యతి జీవితమ్॥
(5/13/26)

తా॥ కృతజ్ఞుడును, సత్యసంధుడును, వానర ప్రభువునగు సుగ్రీవుడు, రాముడు ఇట్టి దుఃస్థితిని బొకదుట చూచి తన జీవితముచు తప్పక త్యజింపగలడు॥

సుగ్రీవుడు, మరణింపగ, పతివ్రతయగు రుమ కూడ తన జీవితమును త్యజింపగలదు. ఈ విషయమును చూచి, తార ప్రాణములు విడచును. తల్లి తండ్రుల మరణమును, సుగ్రీవ మరణమును చూచి అంగదుని హృదయము ప్రిదిలిపోవును. ప్రభుమరణ దుఃఖాభి భూతులగు వానరులు, తమ ప్రభు వినాశ దుఃఖమును భరింపజాలక, హస్త తలములతోను, పిడికిళ్లతోను, తలలు బ్రద్దలుకొట్టుకొనియో, శైలాగ్రములనుండి, సమ, విషమ స్థలములలో పడిగాని, విషపానము చేసిగాని, ఉరివేసికొని గాని, అగ్నిప్రవేశము చేసి గాని, లేదా శస్త్ర ప్రహారము చేసికొని గాని, ప్రాణములను విడువగలరు. పర్యవసానముగ ఇక్ష్వాకు-వానర, ఉభయ కుల వినాశము జరుగగలదు. కనుక నేను, ఈ దుర్వార్తను తెలుపకున్నచో, ఎప్పటికైన, సీతాదేవి కుశల వార్త తెలియగలదను, ఆశతో* రామ-లక్ష్మణులు; సుగ్రీవాది వానరులు గూడ జీవించగలరు. కనుక, విఫలుడనై తిరిగివెళ్లి, యంతమంది వినాశమును కల్గించుటకంటె, ఇక్కడనే యుండి, హస్తాదాన, ముఖాదానములతో జీవించుచు, నియతేంద్రియుడనై, వృక్షమూలముల నాశ్రయించి వానప్రస్థ

1. * శయాచ ధరిష్యేతే, వానరాశ్చ తరస్వినః॥ (5/13/27)

జీవితమును గడుపుట యుక్తము** కాని, యీ విధముగ నుండుటలో గూడ నొక యధర్మము గూడ నాకు కలుగును. ఎట్లన, జీవించియుండి, ప్రభు కార్యము చేయకుండగ, తదుల్లంఘనము చేయుట వలన, ధర్మమే నంప్రాప్త మగును. కనుక ఇదియును యుక్తము కాదని యనుకొని, విపత్కర స్థితులలో ప్రాణత్యాగము చేయుటను, శాస్త్రము గూడ సమ్మతించుచున్నదను ఆలోచన మనస్సునకు రాగా శాస్త్రదృష్టములైన ప్రాణత్యాగోపాయములను స్మరించుచు, తనలో తానిట్లనుకొనెను:-

"సాగరా నూపజే దేశే బహుమూల ఫలోదకే।
చితిం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధ మరణీ సుతమ్॥
"ఉపవిష్టస్యవా సమ్యక్ లింగినం సాధయి ష్యతః।
శరీరం భక్షయిష్యంతి వాయ సా శ్వాపదానిచ॥
"ఇదమ ప్యృషి భిర్దృష్టం నిర్యాణ మితి మేమతిః।
సమ్యగా పః ప్రవేక్ష్యామి నచేత్ప శ్యామి జానకీమ్॥
(5/13/39-42)

తా॥ బహుమూల ఫలోదక యుక్తమగు, సాగర తీర ప్రదేశము నందు, చితి పేర్చుకొని, అగ్నిని ప్రజ్వాలిత మొనర్చి, అందు ప్రవేశింతును.

లేక, ఆమరణ మనశన దీక్షబూని, మృత్యువు నిచ్ఛగించు వారు ధరించు చిహ్నములను ధరించి యొకచోటున కూర్చొనిన, క్రూర జంతువులు గాని, కాకులుగాని, నన్ను భక్షింపగలవు.

సీత, కన్పించక యుండిన, జలములలో మునిగి మరణించెదను. ఇది గూడ ఋషులంగీకరించిన నిర్యాణ పద్ధతి.

---

2. హస్తాదానో ముఖాదానో నియతో వృక్ష మూలికః।
వానప్రస్థో భవిష్యామి అదృష్ట్వా జనకాత్మ జామ్॥ (15/13/38)
"తాపసోవా భవిష్యామి నియతో వృక్షమూలికః।
నేతః ప్రతి గమిష్యామి తామ దృష్ట్వాఽసితే క్షణామ్॥
(15/13/43)

అంతేగాదు, సీతయొక్క జాడ తెలియకుండగ తిరిగి పోవుటకంటె, మరణించుటయే మేలని యన్పించు చున్నది. కాని ఈ విధముగ నిరాశోప హతుడనై ప్రాణములను త్యజించుట మాత్రమేమి పురుషార్థము। పెద్దలిట్లు పల్కుచున్నారు:-

"వినాశే బహవో దోషా జీవన్ ప్రాప్నోతి భద్రకమ్।
తస్మాత్ప్రాణాన్ధ రిష్యామి ధ్రువో జీవతి సంగమః॥
(5/13/45)

తా॥ జీవిత వినాశమునందు బహుదోషములు గానవచ్చు చున్నవి. జీవించియున్న బహు శుభములను బడయ వచ్చును. అందువలన నేను ప్రాణ ధారణము చేసెదను. బ్రతికియున్న తప్పక సీతాదేవి కన్పించగలదు.

హనుమంతుని యశోకవన ప్రవేశము:

సీత కన్పడక పోవుటచే ధైర్యము సడలిన మనస్సును దిటవుపరచు కొని తిర్గి హనుమ యిట్లాలోచించెను. "రావణుడు సీతను అపహరించిన దుష్కృత్యమునకు ప్రతీకారముగ రావణునే వధించిన, కొంత మనస్సు ఊరటపొందును లేదా, ఈ పరదారా పహర్తయగు రావణునే ఎత్తుకొని వెళ్లి, పశువును పశుపతి కర్పించిన యట్లు శ్రీరాముని కప్పగించిన, ఆ ప్రభువే ఇతనినేమి చేయవలెనో యాలోచింప గలడు. ఒకవేళ సంపాతి చెప్పిన మాట లను బట్టి, శ్రీరామ ప్రభువునే, యిక్కడకు తీసికొని వచ్చిన, ఆతని భార్య ఒకవేళ యిక్కడ లేకున్నచో, శ్రీరాముడు తన కోపాగ్నితో సర్వవానరులను దహించివేయగలడు. అందువలన నిక్కడనే నియతేంద్రియుడనై, సీత కన్పించుదనుక నియతాహారుడనై యుండుటమేలు, ఈ విధముగ, ఎన్నియో విధముల నాలోచించి, చివఱకు, నిర్వేదము నొందుట ఉత్తమ పురుష లక్షణముకాదని భావించి* తిర్గి లంకలో సీతను వెధకుటయే యుక్తము, చేతులు

---

1 "అనిర్వేద శ్శ్రియోమూల మనిర్వేదఃపరం సుఖమ్॥
(5/12/10, 1/2)

"అనిర్వేదో హిసతతం సర్వార్థేషు ప్రవర్తకః।
కరోతి సఫలం జంతోఃయచ్చ కర్మ కరోతిసః॥ (2/12/11)

ముడుచుకొని కూర్చుండుటకా పురుషలక్షణమని యెంచి, రావణుని రాజభవన ప్రాకారమునే ఆనుకొనియున్న, అశోక వనిక నింతవఱకును వెదకలేదు, గనుక దీనిని గూడ వెదకుట, మంచిదను నిర్ణయమునకు వచ్చి, అశోక వనికలో ప్రవేశించుటకు ముందు, తన యభీష్ట సిద్ధికై ముందుగ గురుదేవతా నమస్కారమును గావించుచు నిట్లు వల్కెను:-

"నమోఽస్తు రామాయ స లక్ష్మణాయ దేవ్యైచ తస్యై జనకాత్మజాయై।
నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రాగ్ని మరుద్గణేభ్యః॥
(5/13/59)

ఈ విధముగ, సీతా, రామ, లక్ష్మణులకు, రుద్రేంద్ర, యమానిలులకు, చంద్ర, అగ్ని, మరుద్గణములకును ముందుగ నమస్కార మాచరించి తరువాత తన ప్రభువగు సుగ్రీవునకు గూడ నమస్కరించి, తరువాత, కార్య సిద్ధిని యనుగ్రహింపుమని తత్తద్దేవతల నీవిధముగ ప్రార్థించును.

"సిద్ధిం దిశంతుమే సర్వే దేవాస్సర్షి గణాస్త్విహ॥

"బ్రహ్మా స్వయం భూర్భగవాన్ దేవాశ్చైవ తపస్వినః॥
సిద్ధి మగ్నిశ్చ వాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్॥

"వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవచ।
అశ్వినౌచ మహాత్మానౌ మరుత స్సర్వ ఏవచ॥

"సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవయః ప్రభుః।
దాస్యంతి మమ యేచాన్యే హ్యదృష్టాః పథిగోచరాః॥
(5/13/63-65)

ఈ విధముగ, ఋషి గణములను, దేవతలను, స్వయంభువగు బ్రహ్మను, తపస్వులను, పాశహస్తుడగు వరుణుని. సోమాదిత్యులను, అశ్వినీ దేవతలను, మరుద్దేవతలను, సకల భూతములను, సకల భూతముల ప్రభువులను ధ్యానించి, ఇంకను, అదృష్టములగు ఇతర దేవతలు, తనకు కార్య సిద్ధిని కలుగచేయుదని ప్రార్థించి, రావణుని, రాజభవనము నుండి యశోకవన ప్రాకారముపైకి దూకెను. ఆ తరువాత అక్కడి వృక్షవాటికను దాటి వన మధ్యమున ప్రవేశించి, యక్కడ, ఒక సుందరమగు దీర్ఘిక (దిగుడుబావి)

తీరమునగల, గుబురుగ నున్న, ఒక శింశపా వృక్షమున దాగుకొని, నలు దిక్కుల సీతాదేవిని కనుగొనుటకై తన దృష్టిని బరపెను.

## సీతా దర్శనమునకై అశోకవనమున హనుమంతుని ప్రతీక్ష

ఆ సమీపముననే ద్విజ సంఘ నిషేవితమును, రమ్యమగు పద్మములతో శోభిల్లుచున్నదియు, నగు నదిని చూచి, వన సంచార ప్రియురాలును, రామచింతా సుకర్శితయును, రామ వియోగ సంతప్తయును, సంధ్యోపాసన తత్పరురాలుననగు సీతాదేవి సంధ్యోపాసన* కొఱకైనను, ఈ నదికి ఈ సంధ్యా కాలమున జీవించియుండిన తప్పక రాగలదని భావించి, యామె దర్శనముకై తన దృష్టిని నలుదిక్కుల బరువసాగెను. ఆ విధముగ చూచుచుండగ, సమీపముననే, ఒక, విశాలమగు, వేయి స్తంభములపై నిర్మించబడిన, కైలాస శిఖరమువలె మహోన్నతమైన చైత్య ప్రాసాదమును దర్శించెను. ఆ చైత్య ప్రాసాద సమీపముననే మలిన వస్త్రములను ధరించి, దీర్ఘ దీర్ఘతర నిశ్వాసములను విడచుచు, రాక్షస స్త్రీ పరిగతయై, దైన్యము మూర్తీభవించి నట్లుగనున్న సీతాదేవిని హనుమంతుడు చూచెను, జడగట్టిన కేశపాశముగల్గి, అశ్రుధారలు చెక్కిళులనుండి ప్రవహింప, భయకంపితమైన దృష్టులతో నటునిటు చూచుచు, దుఃఖించు, రామవిరహిణియగు సీతాదేవిని చూచి, ఆమె లక్షణములను బట్టి యామెను రామ మహిషిగ నిర్ధారించి, తన శ్రమ సఫలమైనందులకు నమితానందమును పొంది; నిర్మల చిత్తుడును, మహా మనస్వియునగు, హనుమంతుడు, జానకీదేవి సౌభాగ్యమును, ఆమె యందు శ్రీరామునికి గల వాత్సల్యమును సంభావించుచు, తనలో తానిట్లను కొనెను:-

"ఇయం కనక వర్ణాంగీ రామస్య మహిషీ ప్రియా।
ప్రణష్టాపి సతీయస్య మనసో నప్రణశ్యతి॥

---

1. "రామ శోకాభి సంతప్తా సాదేవీ వామ లోచనా।
వనవాసరతా నిత్య మేష్యతే వనచారిణీ॥ (5/14/47)
"సంధ్యాకాలమనాశ్యామాధ్రువ మేష్యతి జానకీ।
నదీం చేమాం శుభజలాం సంధ్యార్థేవర వర్ణినీ॥ (5/14/49)

"ఇయం సాయత్కృతే రామశ్చతు ర్భిరి హతప్యతే।
కారుణ్యేనాఽనృశంస్యేన శోకేన మదనేనచ॥

తా॥ బంగారమువలె మెఱయు శరీర వర్ణముగల ఈ యమ్మయే, రాముని ప్రియ మహిషి. రాముని దేవేరియగు సీతాదేవి, తన ప్రియునికగు పించక యున్నను, అతని మనోఫలకము నుండి చెఱిగిపోక శాశ్వతముగ నిల్చియే యున్నది.

శ్రీరాముడీమె మూలముగనే నాల్గు విధములుగ దుఃఖము ననుభవించు చున్నాడు. భార్యను కాపాడుకొనలేక పోయితినను దుఃఖమువలన, తదైక మాత్ర యాశ్రయయైన సీత శత్రువుపాలైనదేయను దయవలనను, భార్యా వియోగ జనితమగు శోకమువలనను, ప్రియాస్మరణ జన్యకామాగ్ని సంతా పము చేతను ననంత వ్యథ ననుభవించు చున్నాడు.

సీతారాముల పరస్పర సారూప్యమును గూర్చి తన మునమున తలపోసి, వారి యనురూపమగు దాంపత్యమును మెచ్చుకొనుటతో బాటుగ, యట్టి పతి పరాయణయగు సీత యవహృతురాలు కాగా రాముడుజీవించి యుండుటయే చాల యాశ్చర్యమని తలపోయుచు హనుమంతుడు పల్కిన మాటలను చూడుడు:-

"దుష్కరం కృతవాన్ రామోహీనో యదన యా ప్రభుః।
ధారయత్యాత్మనో దేహం న శోకే నావ సీదతి॥
(5/15/54)

తా॥ సీతాదేవి లేకుండగ, రాముడు, దుఃఖముతో నశింపక, శరీర ధారణము చేయుటద్వారా చాల దుష్కరమైన కర్మ చేయుచున్నాడు

## సీతారాముల - యనురూప దాంపత్య ప్రశంస

ఆ తరువాత సీతా-రాముల పరస్పర ప్రణయమును సంభావించి, సీత వంటి పతివ్రతయగు భార్యను పొందిన శ్రీరాముని భాగ్యమును హనుమ

మనసార ప్రశంసించెను.* ఈ విధముగ వారి యనురూప దాంపత్యమును చాల మెచ్చుకొని, పరమ సాధ్వియగు సీతాదేవి కిట్టి విపత్తు వచ్చినందులకు మనస్వియగు హనుమంతుడు విలపించెను.** తరువాత, ఎంతటి వారికైనను కష్టములు తప్పవనియు, కాలము దురతిక్రమమైనదియను త్రైకాలిక సత్యము మనస్సునకు తట్టగ హనుమంతుడిట్లను కొనెను:-

"మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా।
యది సీతాహి దుఃఖార్తా కాలోహి దురతిక్రమః॥
(5/16/3)

తా॥ గుర్వాజ్ఞాకారియును, గురు భక్తుడునునగు లక్ష్మణుని గురువగు రామునికి భార్యయగు సీతయే దుఃఖార్తయైన, నితరుల సంగతి చెప్పెడిదేమి? కాలము, ఎంత వారికిని అనుల్లంఘనీయము కదః ఐనను ఇంతటి దుఃఖమును ఈమె భరించుటకు తగిన కారణముండవలెను. ఆ కారణమును గూర్చి నేనిట్లను కొందును "ధీమంతుడగు లక్ష్మణుని యొక్కయు, శ్రీరాముని యొక్కయు వ్యవసాయము నెఱిగినది యగుటచే, సీతాదేవి, మేఘముల యాగమమునకు గంగ కలుషితము కాని యట్లుగ, కలతనొందుటలేదు. అని యనుకొని, ఈ దేవి, శీల, వృత్తాభిజన వయస్సులను బట్టి శ్రీరామునికి, సర్వ విధముల తగిన భార్యయను; రాముడు గూడ నామెకు సర్వ విధముల తగిన భర్తయేయని. యనుకొనుచు. శ్రీరాముడీ సాధ్విని పొందుటకు ప్రయత్నములు స్మరణకురాగా, తిరిగి యిట్లనుకొనసాగెను:-

ఈ దేవినే కనుగొనుటకు ఏమి శ్రీరాముడు చేయలేదు? ఈమెను పొందుటకే శ్రీరాముడు, వాలిని వధించినాడు. జనస్థాన వాసులగు ఖర, దూషణాది

---

1. "ఏవం సీతాం తథా దృష్ట్వా హృష్టః పవన సంభవః।
జగామ మనసా రామం ప్రశశంస చతం ప్రభుమ్॥
(5/15/54)

2. "సముహూర్తమివ ధ్యాత్వా బాష్ప పర్యాకు లేక్షణః।
సీతా మాశ్రిత్య తేజస్వీ హనుమా న్విలలాపహ॥ (5/16/2)

చతుర్దశ సహస్ర రాక్షసులను పరిమార్చినాడు. క్రూర కర్ములగు కబంధ విరాధుల నంతమొందించినాడు. ఈమెను పొందుటకే, సుగ్రీవుని వానర రాజ్యమున నభిషిక్తుని గావించినాడు; అని. ఇట్లు పరి పరివిధములుగ తలపోసి, యీ మె కొఱకు రాముడేమి కావించినను నదియుక్తమేయని, మనస్సున నిరూపించు కొనుచు నిట్లు అనుకొనినాడు:-

"యది రామ స్సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్।
అస్యాః కృతే జగచ్చాపి యుక్త మిత్యేవ మేమతిః॥
"రాజ్యంవా త్రిషు లోకేషు సీతావా జనకాత్మజా।
త్రైలోక్య రాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్కలామ్॥
"ఇయం సాధర్మ శీలస్య జనకస్య మహాత్మనః।
సుతా మైథిల రాజస్య సీతా భర్తృ దృఢవ్రతా॥
(5/15/13-15

తా॥ రాముడు, ఈమె కొఱకు। సముద్రాంతమగు ఈ భూమినే తల క్రిందులు చేసిన నదియును నుచితమేయగును॥ సీతాదేవి గొప్పదా లేక త్రైలోక్య రాజ్యము గొప్పదాయను ప్రశ్నమునకు నా సమాధాన మేమియన, త్రైలోక్య రాజ్యము మొత్తము, సీతాదేవి యొక్క, ఒక్క కళకు గూడ సమముగాదు (జీవుడు పదునారు కళలు గలవాడు అని శ్రుతి చెప్పు చున్నది)॥ ఈ యమ్మ, ధర్మశీలుడును, మహాత్ముడును, మిథిలాధిపతియును నగు జనకుని కూతురు। భర్తారాధనమును దృఢవ్రత నిష్ఠురాలు॥

ఈ విధముగ నామె లోకోత్తర సౌందర్యమును, ఆమె ఉత్తమాభిజనమును, ఆమె పాతివ్రత్యమును మనసార ప్రశంసించి, అట్టి సాధ్వికి యింతటి ఘోర దుఃఖము కల్గుటకు కారణములను తలపోయుచు తిర్గి యిట్లనుకొనును:-

"ఇయం సాదయితా భార్యా రాక్షసీ వశమాగతా।
సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృ స్నేహ బలాత్కృతా॥
"అచింతయిత్వా కష్టాని ప్రవిష్టా నిర్జనం వనమ్।
సంతుష్టా ఫలమూలేన భర్తృ శుశ్రూషణా పరా॥
(5/15/19-20)

రాముని దయితయగు సీతాదేవి ఇపుడు రాక్షస స్త్రీలకు వశురాలై దుఃఖించు చున్నది. ఈమె, (భర్త వనమునకు బయలుదేరు చుండుటనుచూచి) భర్తృస్నేహ వివశతచే రాజ్యభోగముల నన్నిటిని త్యజించి భర్తతో గూడ, వనములో కలుగు కష్టములనైన నాలోచింపక, నిర్జన వనమును ప్రవేశించినది. భర్త యిచ్చిన ఫల-మూలములకే యానందపడుచు, భర్తృసేవలో సంతోషముగ కాలము గడపిన పరమసాధ్వియీమె॥

ఇట్టి యామెను, క్రూర కర్ముడగు రావణుడు, ఆమె భర్తను వంచించి యపహరించినాడు. ఇట్టి సీతాదేవిని తిర్గిపొందినపుడు, రాజ్య పరిభ్రష్టుడగు రాజునకు తిర్గి తన రాజ్యము సంప్రాప్తమైన యపుడెంత యానందము కల్గునో, అంత యానందము తప్పక కల్గును. కామభోగములను త్యజించి నదియు, బంధుజన విరహితయునునగు, ఈమె ఎన్నటికైన, భర్తను తిర్గి కలియకపోదునా, యను నాశతో ఈ కష్టములన్నిటిని భరించి, జీవితధారణము చేయు చున్నదని, హనుమంతుడు తలపోసెను. (5/15/23-24) శ్రీరాముడు గూడ ఇట్టి పతివ్రతయగు భార్యను కోల్పోయి, యిట్టి యాశ తోడనే, జీవిత ధారణమను దుష్కర కార్యము నాచరించు చున్నాడు, అని. ఈ విధముగ సీతా రాముల, అనురూప్యమును, వారికి వచ్చిన కష్టములను తలపోయుచు, సీతాదేవికి రామ సందేశమును విన్పించుటకు, రాక్షస స్త్రీలకనుకూలామి; తగిన యదను కొఱకెదురు జూచు చుండెను. ఇట్లు చింతించుచుండగనే, రాత్రి యాఖరుజాము కావచ్చెను. అపుడతనికి, వేద ఘోషలు, మంగళవాద్య ఘోషలు విన్పించెను. ఆ ఘోషలతో బాటుగ రావణుడు నిద్రనుండి మేల్కాంచి, సీతను గూర్చి తలపు, మనస్సులో మెదలగ, కామావిష్టుడై, అంగనాశత పరివృతుడై, హళ్ల-పెళ్లగ, అశోక వనమునకు వచ్చెను. అతనిని చూడగనే, హనుమంతుడు, రాజభవన శయన శాలయందు, నారీ సహస్ర మధ్యమున, తప్పత్రాగి, ఒడలు తెలియక నిద్రించుచున్న వాడితడే యనుకొని కిక్కురు మనకుండగ, ఏమి జరుగునో చూచునుత్కంఠతో, కదలక-మెదలక, ఆ శింశపా వృక్షము ఆకుల మాటున మణగి యుండెను.

## అశోకవనికకు రావణుని యాగమనము; సీతానునయము;

క్రూర కర్ముడగు రావణుడు, తానున్న స్థానమునకు వచ్చుటను చూచి, సీత, వ్యాఘ్రమును చూచిన లేడివలె, కుంచించుకొని పోయి, ఊరువులతో శరీరమును బాహువులతో వక్షమును గప్పుకొని విలపింప సాగెను. కామాత్ముడగు రావణుడు, సీతను వశపరచుకొనుటకై, నయగారపు మాటలు పలుకుచు, తన యైశ్వర్యము, ప్రతాపము, మొదలగు వానిని గూర్చి గొప్పగ నుగ్గడించి, రాముడు, ఏవిధముగ చూచినను, తనతో దీటు గాడని పల్కి, వనవాసియును, సంశయగ్రస్త జీవితముగల, రామునిపై, వ్యర్థమగు వలపుతో తన జీవితమును, యౌవనమును పాడుచేసికొనక, తనను వలచి, యనంతైశ్వర్యమును భోగించుచు, తన యౌవనమును సార్థకము చేసికొనుమని బ్రతిమిలాడెను దానికి సీత యగ్గిగుగ్గిలమై, రాముని కాలిగోటికి గూడ నీవు పోలవనియును, అతడు, రామునికంటె ప్రతాపవంతుడవేయైన, నతనిని జయించి తననపహరింపక, దొంగచాటుగ నేల తన నపహరించితివని, రావణుని నిందించి, బంధు, మిత్ర, పరివారముగ సుఖముగ జీవించదలచిన, శ్రీరాముని శరణుపొందుమనియు, తే చో శ్రీరాముడు మొత్తము లంకనే తన బాణాగ్నిలో దగ్ధము చేయగలడనియు నెచ్చరించెను. దానితో రావణుడు, కోపోదగ్రుడై యామెకీ యెచ్చరిక చేసెను:-

"ద్వౌమాసౌ రక్షితవ్యౌ మే యోఽవధి స్తేమయాకృతః।
తతశ్శయన మారోహ మమ త్వం దర వర్ణిని॥
"ద్వాభ్యా మూర్ధ్వంతు మాసాభ్యాం భర్తారం మామ నిచ్ఛతీమ్।
మమత్వాం ప్రాతరాశార్థే సూ దాశ్ఛేత్స్యంతిఖండశః॥

(5/22/8, 9)

తా॥ ఓ సుందరి, నీకు నేనిచ్చిన గడువులో నింక రెండు మాసములే యున్నవి. ఈ లోపలనే, మా శయనమధిరోహింపుము.

రెండు మాసములు దాటినను, నన్ను భర్తగ నంగీకరింపకున్న, నా వంటవాండ్రు, నా ప్రాతః కాలాశనమునకై, నిన్ను ముక్కల క్రింద నరికి వేయుదురు.

## రావణుని పరిచారికల వేధింపు, త్రిజట యాశ్వాసనము:

ఇట్లు దారుణముగ బెదరించి, రావణుడు లంకకుపోయిన పిదప, అతని పరిచారికలు, త్రిలోకేశ్వరుడగు రావణుని భర్తగ నంగీకరింపుమని, పలువిధముల, అదలింపులతోను, బెదరింపులతోడను వేధింపసాగిరి. వారి వేధింపులను, బెదరింపులను, హనుమంతుడు స్వయముగ చూచి చాల వ్యథపడెను. వారి శల్యములవంటి మాటలు, రావణుని బెదరింపులు హృదయమును గాయపరచగ, ఆమె నిరాశోపహతయై తన దురదృష్టమును, పలువిధముల నిందించుకొని, వేఱు-వేఱు తలపులు మనస్సున మెదలగ, చాలసేపు విలపించెను. ఆమెను బెదరించు రాక్షస స్త్రీలకు వెఱపు కల్గించుటకును, సీతాదేవిని సమాశ్వాసించుటకును త్రిజట తానా రాత్రి చూచిన స్వప్న వృత్తాంతమును చెప్పి, ఆ స్వప్న ఫలము శ్రీరాముని యభ్యుదయమును, రాక్షసేశ్వరుని వినాశమును, సూచించుచున్నదని తెల్పి, ఇకనుండి రాక్షసకాంతలు సీతను బెదరించుటకు స్వస్తిచెప్పి, సీతాదేవిని శరణు పొందుట ద్వారా తమ జీవితములను కాపాడుకొననగు* ననియు, లేనిచో త్రిలోకనాథుడగు శ్రీరాముడు, సీతను వేధించు వారలను ప్రాణములతో విడువడని, హితవు పల్కెను.** త్రిజట యొక్క స్వప్న వృత్తాంతమును విని సీత తాత్కాలికముగ ఆశ్వస్తురాలాయెను. కాని తరువాత, త్రిజట యటనుండి నిష్క్రమించిన పిదప సీత తన దురదృష్టమును తలచుకొని చాల తడవు కరుణముగ విలపించి, తాను ఇన్నినాళ్ల నియమ పూర్వకముగ సేవించిన ధర్మము గూడ తనను రక్షింపలేక పోయినందులకు మిక్కిలి ఖేదపడి. తననీ మహాదుఃఖాంబుధి నుండి కాపాడువారు లేరని, నిరాశా - నిస్పృహలకులోనై ప్రాణత్యాగమున కొడిగట్టెను.

---

1. ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా।
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్॥
(సుం॥ కాం॥ 27/46)

2. ప్రియాం బహుమతాం భార్యాం వనవాస మను వ్రతామ్।
భర్త్సితాం తర్జితాం వాపినానుమంస్యతి రాఘవః॥
(సుం॥ కాం॥ 27/42)

## హనుమంతుని సీతా సమాశ్వాసన నిశ్చయము:

హనుమంతుడు సీతాదేవి యాత్మహత్యా యత్నమును చూచి, ఇపుడు తానామెనోదార్చక మిన్నక యున్న మూల ఘాతము జర్గునని భయపడి, ఆమె నోదార్చుటకై తానేమి చేయవలెనను విషయమును గూర్చి తనలో తానిట్లు వితర్కించుకొనెను:-

ముందుగా జీవితముపై విరక్తి చెందిన సీతాదేవిని ఓదార్చుటకై, తానే భాషలో నామెతో మాట్లాడవలెనను విషయమును గూర్చి వితర్కించుకొనెను. తాను సంస్కృతములో మాట్లాడిన, తననాదేవి, క్రోతి రూపములో రావణుడే వచ్చి యుండునని, శంకించి తనతో మాట్లాడుట కిష్టపడదు. కనుక సూక్ష్మమగు రూపమును ధరించిన తాను శబ్ద సంస్కార యుక్తమగు మానవ భాషలో మాట్లాడుట యచితమను నిశ్చయమునకు వచ్చెను. అట్లు మాట్లాడినచో నుప్పతిల్లు అనర్థములను గూర్చి యిట్లు తలపోసెను.

తాను సంస్కృతము మాట్లాడిన రావణుడనుకొని భయపడి పెద్దగ కేకలు వేయవచ్చును. అది విని, ఆమెను కాపలాకాయు వారలు నన్ను పట్టుకొనుటకు యత్నింతురు. ఆత్మ రక్షణమునకై వృక్షముల మాటుగా పర్వెత్తు నన్ను చూచి రాక్షసస్త్రీలు గూడ అరచెదరు. వారి యరపులు విని, వివిధాయుధములు ధరించిన రక్షకభటులు కూడ నన్ను బంధించుటకై చుట్టుముట్టగలరు. సీతకు రామ సందేశమును విన్పించకుండగ పారిపోవుట యుక్తము కాదు. పారిపోకుండగ చిక్కిన, హింసారతులగు రాక్షసులు నన్నుగాని, నా మూలమున సీతాదేవిని గాని హింసింపగలరు. నేనెదుర్కొనిన రాక్షసులకు, నాకున్నూ, పెద్ద యుద్ధము జరుగును. ఆ యుద్ధములో నేనే గెల్వగలనని యెట్లు చెప్పగలను, ఏలయన:-

"అసత్యా నిచ యుద్ధాని సంశయో మే న రోచతే।
కశ్చనిః సంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞస్స సంశయమ్॥
"ఏష దోషో మహాన్హి స్యాన్మమ సీతాభి భాషణే।
ప్రాణ త్యాగశ్చ వైదేహ్యా భవేద నభిభాషణే॥
(5/30/35, 36)

## రావణుని పరిచారికల వేధింపు, త్రిజట యాశ్వాసనము:

ఇట్లు దారుణముగ బెదరించి, రావణుడు లంకకుపోయిన పిదప, అతని పరిచారికలు, త్రిలోకేశ్వరుడగు రావణుని భర్తగ నంగీకరింపుమని, పలువిధముల, అదలింపులతోను, బెదరింపులతోడను వేధింపసాగిరి. వారి వేధింపులను, బెదరింపులను, హనుమంతుడు స్వయముగ చూచి చాల వ్యథపడెను. వారి శల్యములవంటి మాటలు, రావణుని బెదరింపులు హృదయమును గాయపరచగ, ఆమె నిరాశోపహతయై తన దురదృష్టమును, పలువిధముల నిందించుకొని, వేలు-వేలు తలపులు మనస్సున మెదలగ, చాలసేపు విలపించెను. ఆమెను బెదరించు రాక్షస స్త్రీలకు వెఱపు కల్గించుటకును, సీతాదేవిని సమాశ్వాసించుటకును త్రిజట తానా రాత్రి చూచిన స్వప్న వృత్తాంతమును చెప్పి, ఆ స్వప్న ఫలము శ్రీరాముని యభ్యుదయమును, రాక్షసేశ్వరుని వినాశమును, సూచించుచున్నదని తెల్పి, ఇకనుండి రాక్షసకాంతలు సీతను బెదరించుటకు స్వస్తిచెప్పి, సీతాదేవిని శరణు పొందుట ద్వారా తమ జీవితములను కాపాడుకొననగు* ననియు, లేనిచో త్రిలోకనాథుడగు శ్రీరాముడు, సీతను వేధించు వారలను ప్రాణములతో విడువడని, హితవు పల్కెను.** త్రిజట యొక్క స్వప్న వృత్తాంతమును విని సీత తాత్కాలికముగ ఆశ్వస్తురాలాయెను. కాని తరువాత, త్రిజట యటనుండి నిష్క్రమించిన పిదప సీత తన దురదృష్టమును తలచుకొని చాల తడవు కరుణముగ విలపించి, తాను ఇన్నినాళ్ల నియమ పూర్వకముగ సేవించిన ధర్మము గూడ తనను రక్షింపలేక పోయినందులకు మిక్కిలి ఖేదపడి. తననీ మహాదుఃఖాంబుధి నుండి కాపాడువారు లేరని, నిరాశా - నిస్పృహలకులోనై ప్రాణత్యాగమున కొడిగట్టెను.

1. ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా।
   అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్॥

(సుం॥ కాం॥ 27/46)

2. ప్రియాం బహుమతాం భార్యాం వనవాస మను ప్రతామ్।
   భర్త్సితాం తర్జితాం వాపినాఽను మంస్యతి రాఘవః॥

(సుం॥ కాం॥ 27/42)

## హనుమంతుని సీతా సమాశ్వాసన నిశ్చయము:

హనుమంతుడు సీతాదేవి యాత్మహత్యా యత్నమును చూచి, ఇపుడు తానామెనోదార్చక మిన్నకి యున్న మూల ఘాతము జర్గునని భయపడి, ఆమె నోదార్చుటకై తానేమి చేయవలెనను విషయమును గూర్చి తనలో తానిట్లు వితర్కించుకొనెను:-

ముందుగా జీవితముపై విరక్తి చెందిన సీతాదేవిని ఓదార్చుటకై, తానే భాషలో నామెతో మాట్లాడవలెనను విషయమును గూర్చి వితర్కించుకొనెను. తాను సంస్కృతములో మాట్లాడిన, తననాదేవి, క్రోతి రూపములో రావణుడే వచ్చి యుండునని, శంకించి తనతో మాట్లాడుట కిష్టపడదు. కనుక సూక్ష్మమగు రూపమును ధరించిన తాను శబ్ద సంస్కార యుక్తమగు మానవ భాషలో మాట్లాడుట యచితమను నిశ్చయమునకు వచ్చెను. అట్లు మాట్లాడినచో నుప్పతిల్లు అనర్థములను గూర్చి యిట్లు తలపోసెను.

తాను సంస్కృతము మాట్లాడిన రావణుడననుకొని భయపడి పెద్దగ కేకలు వేయవచ్చును. అది విని, ఆమెను కావలాకాయు వారలు నన్ను పట్టు కొనుటకు యత్నింతురు. ఆత్మ రక్షణమునకై వృక్షముల మాటుగా పర్వెత్తు నన్ను చూచి రాక్షసస్త్రీలు గూడ అరచెదరు. వారి యరపులు విని, వివిధాయుధములు ధరించిన రక్షకభటులు కూడ నన్ను బంధించుటకై చుట్టుముట్టగలరు. సీతకు రామ సందేశమును విన్పించకుండగ పారిపోవుట యుక్తము కాదు. పారిపోకుండగ చిక్కిన, హింసారతులగు రాక్షసులు నన్నుగాని, నా మూలమున సీతాదేవిని గాని హింసింపగలరు. నేనెదుర్కొనిన రాక్షసులకు, నాకున్నూ, పెద్ద యుద్ధము జరుగును. ఆ యుద్ధములో నేనే గెల్వగలనని యెట్లు చెప్ప గలను, ఏలయన:-

"అసత్యా నిచ యుద్ధాని సంశయో మే న రోచతే।
కశ్చనిః సంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞస్స సంశయమ్॥
"ఏష దోషో మహాన్హి స్యాన్మమ సీతాభి భాషణే।
ప్రాణ త్యాగశ్చ వైదేహ్యా భవేద నభిభాషణే॥
(5/30/35, 36)

తా॥ యుద్ధ విజయములు సత్యములు కావు, అనగా నియతములు లేక యసందిగ్ధములు కావు. నాకు సంశయ మభిమతము కాదు. ప్రాజ్ఞుడగు వాడె వ్వడును, అసందిగ్ధమగు కార్యమును, సంశయగ్రస్తము గావింపడు॥ సీతతో మాట్లాడిన ఇంత ప్రమాదము కలదు. మాట్లాడకుండ తిరిగిపోయిన ఆమె ప్రాణ త్యాగమే చేయును॥

అని మనస్సున విచారించి, ఒకవేళ, రాక్షసులకును, తనకును జరుగు యుద్ధములో, తానే నిహతుడనైన, వానరులలో, మహోదధిని దాటి వచ్చి, మఱలిపోగల వాడింకొకడు లేడు గద! ఒకవేళ, తానే రాక్షసులను హతమార్చి నను, తాను తిరిగి క్షేమముగ వెళ్లగలనను నమ్మకమాత్రమేమి యున్నది? అని పరి పరివిధముల తర్కించుకొని, దూతల వైక్లబ్యము (చిత్త చాంచల్యము) వలన నెట్లు సిద్ధములగు కార్యములు గూడ చెడిపోవునో, "దూత"యను వాడు తన కార్యనిర్వహణము పట్ల ఎంత జాగరూకతతో మెలగవలెనో, గుఱుతు చేసికొనుచు నిట్లనుకొనును:-

"భూతాశ్చార్థా విరుద్ధ్యన్తి దేశకాల విరోధితాః।
విక్లబం దూత మాసాద్య తమ స్సూర్యోదయే యథా॥
"అర్థాఽనర్థాంతరే బుద్ధి ర్నిశ్చితాపి నశోభతే।
ఘాతయంతిహి కార్యాణి దూతాః పండిత మానినః॥

(5/30/38 39)

తా॥ అవివేకియు, చిత్తచాంచల్యము గలవాడునైన దూత మూలముగ సిద్ధమైన కార్యములు గూడ, సూర్యోదయము వలన, చీకటి వినాశమైనట్లు, దేశకాల విరోధము వలన కార్యములు నాశమైపోవును॥

తామే పండితులమనుకొను మూర్ఖులగు దూతలు, తమ కప్పగించిన కార్యములను, తమ యవివేకముచే వినాశమొనర్తురు. పండితులమనుకొను దూతలు, తమ మిథ్యాభిమానము వలన, అర్థానర్థ నిర్ణాయకమగు బుద్ధిని కల్గియున్నను, కార్య సాధనము చేయజాలరు॥

కనుక తానట్టి మిథ్యాభిమానమునకు లోను గాకుండగ, తానెట్టి చిత్త చాంచల్యమునకు లోబడక, తన సముద్రలంఘనము వ్యర్థము గాకుండగ

తన దూత కార్యమును సవ్యముగ నిర్వహించుట తన విధియని భావించి, సీత తన మాటలను విని ఉద్వేగ పడకుండగ, తనను విశ్వసించుటకు ఏమి చేయవలెనో ముందుగ నిశ్చయించుకొనెను.

## హనుమంతుడు సీతాదేవి నోదార్చుటకై సీతారామ కథను విన్పించుట:

తన దూత కార్యమును సవ్యముగ నిర్వహించుట, తన విధియని భావించి, సీత యుద్వేగము పొందకుండగ నుండునట్లు మాట్లాడి, ఆమెను సుముఖురాలినిగ ముందు చేసికొనిన గాని, తన కార్యము సఫలము గాదని నిశ్చయించుకొనెను. ఆ తరువాత, అక్లిష్ట కర్ముడును, ధర్మాత్ముడును నగు శ్రీరాముని స్తుతిని తాను చేసిన, సీతకు తనయందు శ్రద్ధకలుగునని భావించి, మృదు మధుర స్వరమున, ఇక్ష్వాకువంశ ప్రభుడగు దశరథు నుల్లేఖించి, యతని జ్యేష్ఠ పుత్రుడును, మహా ధానుష్కుడును, స్వవృత్త, స్వజన, స్వధర్మ రక్షకుడును, సకల జీవలోక రక్షకుడును నగు శ్రీరాముడు, తన తండ్రి యొక్క సత్యవ్రతమును కాపాడుట కొఱకు, భార్యానుజ సమేతముగ, దండకలను ప్రవేశించుటయును, జనస్థాన వాసులగు ఖరదూషణాది పదునాల్గు వేలమంది రాక్షసులను, ధర్మ రక్షణకై వధించుటయును, దానికి కినిసి, ప్రతీకారేచ్ఛతో, లంకేశ్వరుడగు రావణుడు, మాయా మృగము ద్వారా, శ్రీరాముని వంచించి, సీతాదేవి నపహరించుటయును, శ్రీరాముడు తన భార్యయగు సీతను వెదకుచు, తన తమ్మునితో గూడ, ఋష్యమూక సమీపమునకు వచ్చుటయును, తన భార్యను తిర్గి పొందుటకై, సుగ్రీవునితొ మైత్రి చేసికొని, అతని అన్నయగు వాలిని వధించి యతనిని వానర రాజ్యమున పట్టాభిషిక్తుని చేయుటయును; ఆ సుగ్రీవుడు, సీతను వెదకుటకై, నాలుగు దిక్కులకు వేలాది హర్యృక్ష వీరులను పంపుటయును, దక్షిణ సముద్ర తీరమునకు వచ్చిన వారలలో, తాను, సంపాతి చెప్పిన ప్రకారము, సీత, లంకలో నున్నదని తెలిసికొని, నూరు యోజనముల సముద్రమును దాటి లంకకు వచ్చుటయును, రాఘవుడు, సీతాదేవిని గూర్చి చెప్పిన లక్షణములుగల, అతని దయితయగు సీతాదేవిని, తానిక్కడ కనుగొనుటయును, సంభవించినది, అని, వృత్తాంతము వలుకుగ్గడించి మౌనము వహించెను.

సీతాదేవి గూడ. ఆ పల్కులువిని, విస్మయమునొంది, త్రికరణము లతో శ్రీరామునే స్మరించుచు, నీ మాటలెవరు పల్కి యున్నారని నలు దిక్కుల కలయజూచెను. సీతాదేవి తనకు సమీపముననే యున్న శింశపా వృక్షమును, పైకి, క్రిందకును, అడ్డముగనుచూచి, బాలభానుని పగిది ప్రకాశించు వానరుడగు హనుమంతుని దర్శించెను. ఆ వానరుడు తెల్లని వస్త్రమును ధరించి, మెఱపు పిండువలె దుర్నిరీక్ష్యమగు, కాంతి పుంజముల నీనుచు పింగళ వర్ణము గల్గి యుండెను. ఇట్టి మహా తేజస్వియగు హనుమంతుని, ఆకుల మాటున దాగియున్న వానిని, చూచి సీత చలితమానసయై, కడు విస్మయమంది, తనలో తాను ఇట్లను కొనెను:-

## హనుమంతుని గూర్చిన సీతాదేవి వితర్కము:

అయ్యో! వానర జాతికి చెందిన, ఈ మృగము చాల భయంకరము గను, దుర్నిరీక్ష్యముగను, దురాసదముగ నున్నదనుకొని, కొంచెము తెలివి తప్పినదాయెను. తిర్గి, తెలివి వచ్చిన తరువాత గూడ "రామా, రామా" యని పల్కుచు మిక్కిలి కరుణముగ విలపించెను. ఆ తరువాత, ఈ వానర దర్శ నము, స్వప్నమేమోయని, యనుకొని, స్వప్నములో వానర దుర్శనము, అశుభ హేతువు, కాన. రామ, లక్ష్మణులకు, తన తండ్రియగు జనకునకును, "స్వస్తి" యగుగాక, యని యాశాసించెను. కాని, తిర్గి. దుఃఖ-శోకగ్రస్తు రాలనై, నిద్రయే పోవని నాకు స్వప్నమెట్లు వచ్చును? కనుక ఇది స్వప్న మునాగోవదను నిశ్చయమునకు వచ్చి, తనకి కథను విన్పించినవాడు నిజ ముగ వానరుడేయని యనుకొని, వాచస్పతికిని, దేవేంద్రునకును, స్వయంభువు నకును, హుతాశనునకును నమస్కారములు చేసి, యితడు చెప్పునది సత్యమే యగుగాక, యని యాశాసించెను. అపుడు బ్రాహ్మముఖుడగు హనుమంతుడా శింశపా వృక్షమునుండి, దిగివచ్చి, వినయ వినమిత శిరముగలవాడై, శిర మున, నంజలి ఘటించి, యామెనిట్లడిగెను: "ఓ తపస్వి! నీవు, ఎవరికొఱకో, దుఃఖించు చున్నట్లగుపించు చున్నావు, ఒక వేళ, నీవు, జనస్థానము నుండి, మోసముచేసి, రావణుడపహరించిన శ్రీరాముని యిల్లాలగు సీతవు, కావు, కద! అమెయే, నీవైనచో, నీకు శుభమగుగాక! నీ దైన్యమును, అలౌకిక

రూపమును, తాపసీ వేషమును బట్టి, నిశ్చయముగ నీవు రామ మహిషివే, యని, యనుకొను చున్నాను; అనెను. శ్రీరామ సంకీర్తన హృష్టురాలగు సీత, తాను దశరథుని పెద్ద కోడలననియు, మహాత్ముడగు జనకుని కూతురననియు ధీమంతుడగు శ్రీరామునకు భార్యననియును తెల్పి, భర్తతో పన్రెండు సంవత్సరములు సుఖముగ నుంటిననియు, పదమూడవ సంవత్సరమున, దశరథుడు రామునకు యౌవరాజ్యాభిషేకమును తలపెట్టగ, కైకేయి యతనిని రెండు వరములడిగినదనియు, ఆ వరములను ఇచ్చిన తన తండ్రి సత్య వ్రతమును కాపాడుటకై, శ్రీరాముడు, తనకీయదలచిన రాజ్యమును, తమ్ముడగు భరతునకు వదలి, తాను, భార్యయగు నాతోడను, తమ్ముడగు లక్ష్మణుని తోడను, అడవులను పట్టెననియును, చెప్పి, శ్రీరాముని లోకోత్తర గుణములను కీర్తించుచు సీతాదేవి హనుమతో నిట్లనెను:-

"దద్యాన్న ప్రతి గృహ్ణీ యాత్ సత్యం బ్రూయాన్నా చాఽనృతమ్।
అపి జీవిత హేతోర్హి రామస్సత్య పరాక్రమః॥ (5/33/25)

తా॥ సత్య పరాక్రముడగు రాముడు దానము చేయుటయే గాని ప్రతిగ్రహ మెఱుగడు. సత్యమే పల్కునుగాని, ప్రాణరక్షణమునకైనను అనృత మాడడు, అని.

ఈ విధముగ పల్కి, ముష్కరుడగు రావణుడు పెట్టు బాధలను వేధింపు చర్యలను వివరముగ తెల్పి, తనకు రావణుడు రెండు మాసముల కాలము మాత్రమే జీవించుట కవకాశమిచ్చినాడనియును, ఈలోగా తనను రాముడు వచ్చి రక్షించక యున్న తాను తన జీవితమును త్యజించ గలననియు, చెప్పెను.

సీతాదేవి పల్కిన ఈ కరుణతో నిండిన పల్కులువిని, హనుమగూడ మిక్కిలి వ్యధపడి ఆ దేవికి రాముడిచ్చిన సందేశమును విన్పించెను.

## హనుమంతుడు సీతాదేవికి రామసందేశమును విన్పించుట

సీతాదేవి యొక్క దారుణ దుఃఖమునుపశమింప చేయుచు హనుమంతుడు శ్రీరామ సందేశమును నాయమ్మకు ఈ విధముగ విన్పించెను:-

"అహం రామస్య సందేశాద్దేవి దూత స్తవాఽఽగతః॥
వైదేహి, కుశలీ రామ స్స్వత్వాం కౌశల మబ్రవీత్॥
"యో బ్రాహ్మ మస్త్రం వేదాంశ్చ వేద, వేద విదాంవరః॥
సత్వాం దాశరథీ రామో దేవి కౌశల మబ్రవీత్॥
"లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽను చరః ప్రియః॥
కృతవాఞ్ఛోక సంతప్త శ్శిరసాతేఽభి వాదనమ్॥ అని
(సుం॥ కాం॥ 34/2-4)

తా॥ ఓ దేవి, నేను శ్రీరామ సందేశమును నీకు తెల్పుటకై, రామ దూతగ నీ యొద్దకు వచ్చితిని. ఓ వైదేహి రాముడు క్షేమముగ నున్నాడు. అతడు నీ క్షేమ సమాచారమును గూర్చి యడిగినాడు.

బ్రహ్మాస్త్రము నెఱిగిన వాడును, సకల వేద వేత్తయు, వేద కోవిదు లలో శ్రేష్ఠుడును, దశరథ పుత్రుడునునగు రాముడు నీ క్షేమవార్త నడిగినాడు. మహా తేజస్వియును, నీ భర్తకు ప్రియమైన అనుచరుడునునగు లక్ష్మణుడు, నీ యపహరణ శోకముచే సంతప్తుడై, నీకు శిరసా అభివాదనము చేయుచున్నా నని తెలుపుమని చెప్పినాడు, అని॥

హనుమంతుని వలన శ్రీరామ-లక్షణుల క్షేమవార్తయు, శ్రీరామ సందే శమును విని సీతకు పట్టరాని సంతోషము కల్గెను. అపుడామె మిక్కిలి యాశ్వస్తయై హనుమంతుని కిట్లనెను; ఓ హనుమ, పెద్దలు పల్కిన ఈ నానుడి నాకు సత్యముగ తోచుచున్నది. అది యేమియన, జీవించి యున్నచో వంద సంవత్సరాలకైనా తప్పక మేలు కల్గును, అని (5/34/6)

ఆ తరువాత పరస్పర విశ్వాసముతో చాలసేపు సంభాషణము, వారి ద్దవురు గావించిరి. కాని యిట్లు మాట్లాడుకొను చుండుటను ఎవ్వరైన వినిన, కార్య విఘాతము కల్గునని యెంచి, హనుమ, తమ సంభాషమును ఇతరులు వినకుండగ నుండుటకై యామె సమీపమునకు రాసాగెను. దీనివలన, నతనిని రావణుడని ఆమె శంకించి, యింతవఱకు తాను పట్టుకొని యున్న అశోక వృక్ష శాఖను విడచి, శోకసంతప్తయై నేలపై చతికిలంబడి పోయెను. ఆమె హను

మంతునిపై తన సందేహమును వెలిబుచ్చుచు నిట్లనెను: ఓ వానరా, నీవు నేను సందేహించిన విధమున నిజముగ మాయావివగు రావణుడవేయైన, ఉప వాసకృశయై, మిక్కిలి సంతాపమున గుందు ఒక మగ నాలిని బాధించుట పాడి గాదు కానిచో, నీకు భద్రమగు గాక, నా మనస్సులో నిన్ను చూచినదాదిగ ప్రీతి కల్గినందువలన నీవు నిజముగ వానరుడవేయని యనుకొనుచున్నాను. నాకు రామకధ యనిన చాల యిష్టము. నీవు నాకు శ్రీరాముని దివ్యగుణ ములను విన్పింపుమన, ఆ హరి ప్రవరుడు శ్రీరాముని రూప లావణ్యములను కల్యాణ గుణములను, అవయవ సంస్థానాదులను, బలపరాక్రమములతో బాటు, శ్రీలక్ష్మణుని శుభ లక్షణములను విన్పించి ఆ యమ్మతో నిట్లనెను:-

ఇక నర-వానరుల సమాగమ్మమెట్లు జరిగినదను సీతాదేవి ప్రశ్నకు సమాధానమిచ్చుచు ఇట్లు పల్కెను. శ్రీరాముడు తన సోదరుడగు లక్ష్మణునితో గలసి, నిన్ను వెదకికొనుచు ఋష్యమూక పర్వత ప్రాంతమునకు వచ్చెను. అక్కడ తన యన్నచే నిర్వాసితుడును, హృతదారుడును, తన యన్న మూలమున ప్రాణభయార్తుడును ప్రియదర్శనుడునునగు సుగ్రీవుని వారు చూచిరి. మేము, ఆ సుగ్రీవుని పరిచారకులము. నార చీరలను ధరించి, ధనుర్బాణ ములు చేత బట్టుకొని ఋష్యమూక గిరి యొద్దకు వచ్చిన ఆ వీరులను చూచి సుగ్రీవుడు భయవిహ్వలుడై ఋష్యమూకము శిఖరమునకు పారిపోయి, వారిని గూర్చి తెలిసికొనుటకు నన్నే పంపినాడు. నేను కృతాఞ్జలినై వారిని సమీ పించి, వారచటికి వచ్చిన కారణము నరసి, నా భుజస్కంధములపై వారిరు వుర నెక్కించుకొని సుగ్రీవుని యొద్దకు తీసికొనిపోయి విషయమంతయు ఉన్నది ఉన్నట్లుగా నివేదించితిని. ఆ తరువాత రామ-సుగ్రీవులిర్వురు పర స్పర సంభాషణము గావించిరి. దాని వలన వారికి పరస్పరము ప్రీతి కలి గెను. లక్ష్మణాగ్రజుడు, వాలిచే నపహృతదారుడగు సుగ్రీవుని యోదార్చెను. లక్ష్మణుడు వానరేంద్రుడగు సుగ్రీవునికి, శ్రీరాముని భార్యాపహార వృత్తమును నివేదించెను. అపుడు రాముడు పొందిన దైన్యమును చూచి, సుగ్రీ సుగ్రీవుడు తన పరిచారకులను, ఋష్యమూక పర్వతముపైన ఒకస్త్రీ (సీతచే) పడవేసిన నగల మూటను తెచ్చి చూపించుడని యాజ్ఞాపించెను. వారా మూటను తెచ్చి రామునికి చూపిరి ఆ యాభరణములన్నిటిని ఒడిలో పెట్టుకొని వానిని

కన్నీర్చుక చూచుచు శ్రీరాముడు చాల కరుణముగ విలపించుచు భూమిపై పడిపోయినాడు. దుఃఖార్తుడగు ఆ మహాత్ముని పలు ఆశ్వాసన వాక్యములచే తిర్గి స్వస్థుని చేయగ ఆ మహాత్ముడు ఆ యాభరణముల మూటను సుగ్రీవుని కప్పగించినాడు, ఓ యార్యురాలా, నీవియోగాగ్నిచే రాముడు నిరంతరము దంద్యహ్యమానుడగుచు నిద్రాహారములను త్యజించి, నీకొఱకు, అడవులు, కొండలు, కోనలు, నదులు, వాగులు అన్నియు వెదకుచు చాల దుఃఖించుచున్నాడు. మిత్ర పుత్ర, బంధుసమేతముగ రావణుని వధించి, ఓ జానకీ, త్వరలోనే శ్రీరాముడు నిన్ను కలసికొనగలడు. రామ-సుగ్రీవులిర్వురు బాస చేసికొనినారు. దాని ప్రకారము, శ్రీరాముడు వాలిని సంహరించి, యతనిని వానర రాజ్యాభిషిక్తుని చేయవలెను. సుగ్రీవుడు, నిన్ను వెదకి, నిన్ను తిర్గి పొందుటలో శ్రీరామునికి సాయము చేయవలెను. తానిచ్చిన వాగ్దానమును రాముడు చెల్లించి, వాలిని చంపి, సుగ్రీవుని వానర రాజ్యాధిపతిని చేసినాడు. ఈ విధముగ నర-వానరులకు (రామ-సుగ్రీవులకు) మైత్రి కుదిరినది. నేను వారి దూతయగు హనుమంతుడను.

సుగ్రీవుడు వానర రాజ్యమునకు ప్రభువైన పిమ్మట, ఈ భూమండలమునగల వానరులనందరను కిష్కింధకు రావించి, నిన్ను వెదకుటకై వేలాది వానరులను, దశదిశలకు పంపినాడు మహాబలులును, మహోన్నతకాయులును నగు వేలాది వానరవీరులు ఈ భూమండలమంతయు నీ కొఱకై గాలించుచున్నారు. వాలి పుత్రుడగు అంగదుని నాయకత్వమున మేము దక్షిణదిగ్భాగములందు నిన్ను వెదకుటకై బయలు దేరినాము. మేము వింధ్యశ్రేణియందు నిన్ను వెదకుచు తెరవుగానక చాల దినములు అందు చిక్కుపడి నిన్ను కనుగొనలేక మిక్కిలి వ్యధచెందితిమి. నిన్ను కనుగొందుమను ఆశ యుడిగి, సుగ్రీవుడిచ్చిన గడువు (నెల) ముగియుటచే, నతని కఠోర దండమునకు భయపడి, ప్రాణ త్యాగమునకై సిద్ధపడితిమి. ఆ తరువాత, ఆ పర్వత శిఖరమునకు చేరి (స్వయంప్రభాదేవి సహాయమున) ప్రాయోపవేశము చేయ సమకట్టితిమి. మా యీ ప్రాయోపవేశ యత్నమును చూచి అంగదుడు బిట్టుగా రోదనము చేసెను. మనస్వియగు అంగదుడు, నీ జాడ తెలియక పోవుటను, తన తండ్రియగు వాలి యొక్క వధను, మా ప్రాయోపవేశమును, జటాయు

మరణమును, కార్య నైరాశ్యము వలన ప్రాణ త్యాగము చేయుటకై మేము తలపెట్టిన ప్రాయోపవేశమును, స్మరించి మిక్కిలి విలపించెను. తన పనిమీద అచటికి వచ్చిన సంపాతి, అక్కడకు వచ్చి, తన సోదరుడగు జటాయువు మరణమును విని కోపావిష్టుడై జటాయు మరణము ఎట్లు జరిగినదని యడుగ, జన స్థానములో సీతాపహారమును నిరోధించుటకు తలపడగ రావణుడతనిని వధించెనని తెలుప, అరుణాత్మజుడగు సంపాతి మిక్కిలి దుఃఖపడి, నీవు లంకలో నుంటివని చెప్పెను సంపాతి మాటలను విని అంగద నేతృత్వమున దక్షిణ దిశను వెదకుటకు వచ్చిన మేమందరము, వింధ్యశ్రేణిని (సహ్యగిరి శ్రేణికి నామాంతరము) దాటి, నిన్ను కనుగొనగలమను ఆశతో సముద్ర తీరమునకు వచ్చితిమి కాని విస్తీర్ణమును, పెద్ద పెద్ద తరంగములతో భయమును గొల్పు సముద్రమును చూచి వానరవీరులు హతోత్సాహులైరి. అపుడు వారి భయమును నివారించుచు, నూరు యోజనముల సముద్రమును దాటి, రాత్రివేళ, రాక్షసావాసమగు లంకానగరమును ప్రవేశించితిని. లంకయంతయు వెదికితిని తుదకు శోకపరిప్లుతురాలగు నిన్నీ యశోక వనమున గాంచితిని కాన, ఓ దేవి, నిన్ను కనుగొనుటకై రామదూతగ, రామకార్యార్థినై వచ్చిన, నాతో సంశయముడిగి సంభాషింపుము నేను సుగ్రీవ సచివుడను. వాయుదేవుని పుత్రుడను. రామదూతనని నమ్ముము. లోకమున గల శస్త్రధారులలో మేటియగు నీ ప్రాణవల్లభుడగు శ్రీరాముడు కుశలముగ నున్నాడు. శుభలక్షణ సంపన్నుడగు లక్ష్మణుడు, అతనికి నిత్యము పరిచర్య చేయుచు సతనిసారాధించుచునే యున్నాడు. సుగ్రీవుని యాజ్ఞచే, కామరూపియగు నేను సముద్రమును దాటి, నీవు కన్పట్టమి దుఃఖించు వానరుల సంతాపమును పోగొట్టుటకై లంకలో ప్రవేశించి, నిన్నిచట కనుగొనినాను. నా సముద్రోల్లంఘనము దైవకృపచే, వ్యర్థము కాలేదు. నిన్ను కనుగొనిన కీర్తి నాకు దక్కినది. మహావీర్య సంపన్నుడగు కాకుత్స్థుడు, మిత్ర, పుత్ర, బంధ్వాది సహితముగా రావణుని వధించి త్వరలోనే నిన్ను పొందగలడు. అని పల్కి, తన జన్మ వృత్తాంతమును గూడ ఆ దేవికి విశ్వాసమును కల్గించుటకై తెల్పి, తాను వాయుపుత్రుడననియు, ప్రభావములోగూడ వాయువుతో సమానుడననియును తెల్పెను.

**హనుమంతునిచే రామాంగుళీయక సమర్పణము:**

హనుమంతుని పల్కులు విని పరమానందమును పొందిన, సీతాదేవి నేత్ర కమలములనుండి, ఆనంద బాష్పములు రాలెను. ఆమె నావరించిన దుఃఖ మేఘములు చెదరిపోయెను. రాహుముక్తమైన చంద్రబింబము వగిది, ఆమె ముఖమండలము ఉజ్జ్వలముగ కన్పించెను. ఆ దేవికి, తనయందు పూర్ణవిశ్వాసము కల్గించుటకై, శ్రీరాముడు, సీతా ప్రత్యాయార్థమై, తనకర్పించిన అంగుళీయకము నామె కర్పించుచు నిట్లనెను:-

"రామ నామా జ్కితం చేదం పశ్య దే వ్యంగులీయకమ్।
ప్రత్యయార్థం తవానీతం తేనదత్తం మహాత్మనా॥
సమాశ్వసిహి భద్రంతే క్షీణ దుఃఖ ఫలాహ్యసి॥
(5/36/3)

తా॥ ఓ దేవీ, రామ నామాజ్కితమైన ఈ యంగులీయకమును చూడుము. నీకు, నాయందు విశ్వాసము కల్గించుటకై, మహాత్ముడగు శ్రీరామచంద్రుడు నీ కర్పించుటకై, దీనిని నాకు సమర్పించినాడు. నీవింత వణకుచు, దుష్కర్మ ఫలముగ, అనుభవించిన దుఃఖము అంతమైనదని తెలిసికొని యూరడిల్లుము, నీకు భద్రమగుగాక!

**హనుమంతుని వాక్కౌశలమునకు ప్రీతురాలైన సీతాదేవి శోక-సంతోషములు**

హనుమంతుని యమృతపు గుళికలవంటి యీ మాటలు విని, మహానందము చెంది, ఆ దేవి, హనుమంతుని ప్రశంసించుచు నిట్లుపల్కెను:- ఓ హనుమా! నీవు మహావిక్రమశాలివి, సమర్థుడవు. ప్రాజ్ఞుడవు, కానిచో నసహాయముగ, శతయోజన విస్తీర్ణమగు సముద్రము నవలీలగ దాటి, యెట్లు రాగలవు? నిన్ను నేనొక ప్రాకృత వానరునిగ తలంచుట లేదు. క్రూరకర్ముడగు రావణునికి, కించిత్తుగూడ భయపడని, నీవు, సామాన్యుడ వెట్లగుదువు? ఓ హరి ప్రవరా: నీవు, నాతో సంభాషించుటకు, సర్వధాతగి యున్నావు, దుర్ధర్షుడైన శ్రీరాముడు నిన్ను పరీక్షించ కుండగ, నీ యర్హతను తెలిసికొనకుండగ నిన్ను తన దూతగ నావద్దకెట్లు పంపును? ధర్మాత్ముడును, సత్యసంగరుడును

నగు రాముడు, సుమిత్రానంద వర్ధనుడగు లక్ష్మణుడున్నూ, కుశలముగ నున్నారుగదః నాకదియే చాలును. ఆ కాకుత్స్థప్రవరుడు, క్షేమముగనున్న, యతనికి లంక యొక లెక్కయా? అతనికి కోపమే వచ్చిన, సాగరవేలా పరిగతమగు నీ భూమండలమునే తన కోపాగ్నిచే దహించి వేయగలడు. రామ-లక్ష్మణులిర్వురు, దేవతలను నిగ్రహించగల సామర్థ్యము గలవారే యైనను, నా దురదృష్టము వలన, నింతదనుక, ఏమియు, చేయలేక పోయి నారని యనుకొనుచున్నాను, అని పల్కి, తనపైన శ్రీరామునికి, పూర్వపు ప్రేమ, యున్నదో, లేదో తెలిసికొననెంచి, తదనుగుణముగ హనుమంతుని ప్రశ్నించెను. అందుకు సమాధానము, శ్రీరామునికి, సీతా వియోగమువలన కల్గిన దారుణ దుఃఖమును తెల్పి, ఏకపత్నీవ్రతుడగు రాముడు, సీతా వియోగము వలన, అనంత సంతాపమును పొందుచున్నాడనియు, నిత్యమామెనే స్మరించు చున్నాడనియును, ఆమె వియోగము వలన నతడు నిద్రలేని రాత్రులనే గడుపుచున్నాడనియు నిరంతరము సీతాగత మనస్కుడై యన్య మును చింతింపక, దినములను చాల కష్టముతో గడుపు చున్నాడనియును, శరీరమును గూర్చిన స్మృతిగూడ నతనికి లేదనియును, నిరంతరము, ఆమెను తిర్గి కలసికొనుట యెట్లా, యయేని యాలోచించు చున్నాడనియును బదులు చెప్పెను. హనుమంతుని పల్కులను, విని, తన భర్త తనయందే, లగ్న మనస్కుడై, యన్యమును చింతింపక, తననే నిచ్చలు స్మరించుచు, తనను తిర్గి పొందుటకే యత్నించు చున్నాడని, చాల యానందమును, భర్తకు కల్గిన వియోగ దుఃఖమునకు చాల మనోవ్యథయును, చిత్తమున గుబురుకొనగ సీత హనుమతో నిట్లనెను:-

"అమృతం విష సంపృక్తం త్వయా వానర భాషితమ్।
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోక పరాయణః॥
"ఐశ్వర్యేవా సువిస్తీర్ణే వ్యసనే వాసు దారుణే।
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి॥
"విధిర్నూన మసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ।
సౌమిత్రిం మాంచ రామంచ వ్యసనైః పశ్య మోహితాన్॥
(5/37/2-4)

తా॥ ఓ వానరుడా, రాముడు అన్య మనస్కుడు కాడని, శోకములో మునిగి యున్నాడని, నీవు చెప్పిన మాట, విష మిశ్రితమైన, అమృతమువలె నున్నది॥ గొప్ప ఐశ్వర్యములో, లేదా దారుణమగు కష్టములో నున్నను, దైవము పురుషుని త్రాడితో కట్టినట్లు లాగుకొని పోవును॥ ఓ ప్లవగోత్తమా, ప్రాణులెవ్వరును దైవమును తప్పించుకొనజాలరు. దానికి ఉదాహరణముగా, సౌమిత్రిని, శ్రీరాముని, నన్నూ చూడుము॥

రాముడీ వియోగాంబుధి నెట్లు దాటగలడో! రాక్షసులను, రాక్షసేశ్వరుని, వధించి, లంకను సర్వనాశనము చేసి, నన్నెపుడుద్ధరించగలడో!, కాని, నీవు, నా రామునితో త్వరపడుమని చెప్పుము. ఎందుకన, రావణుడు నన్నిక్కడకు తీసికొనివచ్చిన వరువాత, తనను ప్రేమించుటకు ఒక సంవత్సరము గడువు పెట్టినాడు. అందులో పదినెలలు గడచిపోయినవి. ఇపుడు పది మాసముల కాలమే మిగిలియున్నది. అతని సోదరుడగు విభీషణుడు, నన్ను, నా భర్త కప్పగించుమని, రావణునికి పలుమాఱులు విజ్ఞప్తి చేసినాడు, కాని యతడు వినుటలేదని, విభీషణుని కూతురగు "కల" నాతో చెప్పినది. అతనికి మృత్యువు, ఆసన్నమై యుండగ, విభీషణుని హితవు, ఎట్లు రుచించును? రావణుని హితైషియును, ధృతిమంతుడును, మేధావియును, వృద్ధుడునైన అవింధ్యుడు అను రాక్షసుడు గూడ, రావణునికి, నన్ను రాముని కప్పగించి, రాక్షస కులము నాశము గాకుండగ రక్షింపుమని హితవు చెప్పెననియు, నతడు వినుట లేదనియు వింటిని. నీ మాటలు వినిన తరువాత, రాముడు తప్పక, నన్ను ఉద్ధరించగలడను విశ్వాసము నాకు కల్గుచున్నది. ఇది నా యంతరాత్మ ప్రబోధము. ఇది తప్పక జరుగును (అంతరాత్మాహి మేశుద్ధః) శ్రీరాముడు గూడ మహాగుణ సంపన్నుడు. ఉత్సాహము, పౌరుషము, సత్త్వము, ఆనృశంస్యము, కృతజ్ఞత, విక్రమము, మహాప్రభావము, మొదలగు, సద్గుణములకాకరమగు శ్రీరాముడు, నన్ను, ఉద్ధరించకుండగ నెట్లుండగలడు? పదునాల్గు వేల రాక్షసులను, జనస్థానములో, ముహూర్త మాత్ర కాలములో హతమార్చిన మహావీరుడగు శ్రీరాముని పరాక్రమము నెఱిగిన వాడెవ్వడు, శాంతముగ నుండగలడు? పురుషర్షభుడగు శ్రీరామునితో మఱియొకడు పోల్చదగినవాడు లేడు. అతని విక్రమ-ప్రభావముల నేనెఱుగుదునని

పల్కినప్పుడు ఆ తల్లి కంఠము గద్గదమాయెను. కన్నులనిండ నీరు క్రమ్మెను.

## హనుమ సహృదయత్వము: పరదుఃఖ కాతరత్వము

సీతయొక్క దుర్భరమగు దుఃఖమును చూచి, కలగిన చిత్తముగల హనుమంతుడు తన సహృదయత్వమును ప్రకటించుచు ఆ దేవి నోదార్చుచు నామెతో నిట్లనెను:-

ఓదేవీ, నీ భర్తయగు రాముడు, నీవిక్కడ నున్నట్లు, నా వలన వినినది తడవుగనే, హర్యృక్ష గణములను వెంటబెట్టుకొని, లంకకు రాగలడు లేదా ఇప్పుడే క్రూర కర్ముడగు రావణుని చెరనుండి, నీకు విముక్తి కలిగించెదను. అనిందిత చారిత్ర సముపేతురాలగు ఓ జానకీ! నీవు నా వీపుపై నెక్కుము. నిన్నిపుడే, ప్రస్రవణగిరి యందున్న, శ్రీరాముని యొద్దకు; తనలో నుంచిన హవ్యమును, అగ్ని, ఇంద్రునకంద జేయు విధమున తీసికొని వెళ్లి అప్పగించెదను.* ఇపుడే లక్ష్మణ సహితముగ రాముని దర్శింతువు గాక! నీ దర్శనమునకై యుత్కంఠితుడగు రాముని, ఐరావత పృష్ఠముపైనున్న ఇంద్రుని వలె, దర్శింతువుగాక! నా మాటలనుపేక్షింపకుము. నీవిపుడే కార్య వినిశ్చయమును చేయుము నీకిది సమ్మతమేని చంద్రుని యోగమునుగోరు రోహిణి చంద్రుని కలసికొన్నట్లు, నీ భర్తను, నీవిపుడే కలసికొనగలవు! దీనిని బట్టి హనుమంతుని పరదుఃఖ కాతరత్వము, సహృదయత్వము, నిర్మల చిత్తత్వము, బాగుగ వెల్లడి యగుచున్నవి.

ఈ మాటలువిని, సీత, యిదియే యతని వానరత్వమని తలపోసెను. ఏలయన, అల్పకాయుడగు, ఆ వానరుడు, తనను వీపుమీద ఎక్కించుకొని యెట్లు తీసికొని పోగలడని సంశయించెను. హనుమంతుడు దేవి సంశయమును విని, ఇది, నాకు నూతనముగ జరిగిన పరాభవమని యెంచి, సీత చూచుచుండగనే, మేరు; మందర పర్వతముల యంత యెత్తుగ తన శరీరమును పెంచి, దీప్తానలస ప్రభుడై వెల్గొందుచు సీతతో నిట్లనెను: ఓ దేవి, నిన్నేగాదు,

---

1. "అహం ప్రస్రవణ స్థాయ రాఘవాయాద్య మైధిలి!
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుత మివానలః॥ (5/37/221)

వన, పర్వత, సౌధ, ప్రాకార తోరణముగు లంకనే రావణు సహితముగ, పెకలించి తీసికొనిపోవు శక్తి నాకు కలదు. కావున నా శక్తిని గూర్చి సంశయింపకుమని పల్కెను

## సీతాదేవి అనన్య పాతివ్రత్య నిష్ఠ:

అపుడు సీత, హనుమంతుని యలౌకిక శక్తి సామర్థ్యముల నంగీకరించి, పతివ్రతయగు తాను, అతనిని బుద్ధిపూర్వకముగ స్పృశింపజాలననియు, అతనితో వచ్చుట తనకు ఉచితముగాదనియును తెల్పి యతనితో, వీపుపైనెక్కి వచ్చుటలోగల సాధక-బాధకములను వివరించుచు నిట్లు చెప్పెను: నేను, నీ వీపుపైనెక్కి వచ్చినచో, నీ గమన వేగమును, తట్టుకొనజాలక, తల తిరిగి, సముద్రములో పడిపోవచ్చును, లేదా, నీవెంట వెళ్లుచున్నట్లు, రావణునికి తెలిసిన, భీమ విక్రములగు రాక్షసులను పంపి నిన్ను నిగ్రహించిన, నీవు వారితో యుద్ధము చేయుట, నన్ను రక్షించుట యను రెండు కార్యములను చేయజాలవు. నీవు రాక్షసులతో యుద్ధము చేయు సమయమున, నేను భయపడి క్రిందపడిపోయినచో, క్రూరకర్ములగు రాక్షసులు, నన్ను తీసికొనిపోయి తప్పక వధింపగలరు. లేదా వారి యరపులకు భయపడి, నేనే ప్రాణములు విడువవచ్చును. ఏ విధముగ చూచినను, మేలు జరుగకపోగా, మూలఘాతమువలన, కీడే సంభవించునని తెల్పి, యింకను నిట్లనెను:-

"కామం త్వమసి పర్యాప్తో నిహన్తుం సర్వ రాక్షసాన్।
రాఘవస్య యశోహీయేత్త్వయా శస్తైను రాక్షసైః॥
"భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర।
నాహంస్ప్రష్టుం స్వతో గాత్ర మిచ్ఛేయం వానరోత్తమ॥

ఓ వానరోత్తమా, నీవొక్కడవే, రాక్షసుల నందరను వధింగల శక్తి గల వాడవు. కాని, నీవే రాక్షసులను చంపి, నన్ను తీసికొనివెళ్లిన, శ్రీరామునికి యశో హాని కల్గును. అంతేగాదు, రాముని యందనన్య నిష్ఠగల నేను, బుద్ధిపూర్వకముగ, రామునికంటె, వేఱగు వారి నెవ్వరిని స్పృశించజాలను॥

ఇక రావణుని ఎట్లు స్పృశించితినందువా, అది నేను బుద్ధిపూర్వకముగ చేసిన పనిగాదు, కనుక నా నిశ్చయమును వినుము:-

"యది రామో దశగ్రీవ మిహహత్వా సరాక్షసమ్।
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశంభవేత్॥
(5/37/64)

తా॥ రాముడు స్వయముగ, రాక్షస కుల సహితముగ రావణుని చంపి తీసికొని వెళ్లినచో నది యతనికి తగిన కార్యము.

సీతాదేవి యొక్క పతిభక్తిని, భర్తృ గౌరవమును, స్వాభిమానమును, మనస్సులో మిక్కిలి మెచ్చుకొని, పరగుణ గ్రహణ పటువగు హనుమంతుడు, ఆమె పల్కిన పల్కులు, ఆమె పాతివ్రత్యమునకు, స్త్రీ ప్రకృతికిని అనురూపముగనున్నట్లు పల్కి, యామెను మిక్కిలి ప్రశంసించి, శ్రీరాముని గుఱుతు కొఱకేదియేని యభిజ్ఞానమును ప్రసాదింపుమని కోరెను.

సీతా దర్శన ప్రత్యభిజ్ఞానము కొఱకు, సీతాదేవి హనుమంతునికి చెప్పిన రహస్య వృత్తాంతము-

అపుడామె, పూర్వము తన భర్తతో తాను చిత్రకూటము యొక్క ఈశాన్య భాగమున, మందాకినీ తీరమున, నాశ్రమములో నివసించు చున్నపుడు, ఇంద్ర పుత్రుడగు జయంతుడు కాక రూపమును ధరించి, తన స్తనాంతరమున రక్తము కారునట్లుగ, ముక్కుతో పొడచుటయును, అతని యవినయమునకు కోపించి శ్రీరాముడు, దర్భను మంత్రించి, యతనిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించుటయును, దానికి భయపడి, ప్రాణరక్షణమునకై ముల్లోకములు తిరుగ, శ్రీరాముని కోపమునకు వెఱచి యెవ్వరును, నతనికాశ్రయ మొసగనందున, తిర్గి శ్రీరామునే శరణుపొంది, రక్షింపుమని వేడుటయును, శ్రీరాముడు, అతనిపై దయతలచి, బ్రహ్మాస్త్రము, వృధాయగుటకు వీలులేనందున, నతని, ఒక కన్నును పోగొట్టి ప్రాణములతో విడచుటయు, నను వృత్తాంతము నభిజ్ఞానముగ శ్రీరామునికి విన్నవింపుమని పల్కి, తిర్గి యిట్లు పల్కెను:-

"మత్కృతే కాక మాత్రేపి బ్రహ్మాస్త్రం సముదీరితమ్।
కస్మాద్యోమాఽహరత్త్వత్తః క్షమ సేతం మహీపతే॥
(5/38/37)

కా॥ నా కొఱకు, ఓ ప్రభూ! నీవు పూర్వము కాకిపైననే బ్రహ్మాస్త్రమును ప్రయోగించితివి, నన్ను మోసముచేసి యపహరించిన రావణుని నీ వెందుకు క్షమించుచున్నావు?

మానవతా ధర్మము ననుసరించియైనను నన్ను రక్షించుట యుక్తము నీవే "ఆ నృశంస్యము పరమధర్మ"మని పలుమార్లు చెప్పుచుండుటను నేను స్వయముగ విని యుంటిని. కాన, వెంటనే వచ్చి, నన్ను రక్షింపుమని తెల్పుము. లేదా లక్ష్మణుడైనను, తన యన్న యాజ్ఞను పొంది, నన్ను ఏల రక్షించుటకు రాలేదని యడ్గితినని తెల్పుము. వాయు, ఇంద్ర సమతేజస్వులగు రామ-లక్ష్మణులు, నన్నెందుకుపేక్షించు చున్నారో, నాకు తెలియుట లేదు, ఇది నా దుష్కృతమే తప్ప, వేఱొక కారణము లేదని, కన్నులనిండ నీరునింపెను.

అపుడామెను హనుమంతుడు పెక్కు సాంత్వన వచనములచే నోదార్చి రాముడు, అచిరకాలములోనే వచ్చి, సీతను రావణుని చెఱనుండి విడిపించగలడనియు, ఆమెను తిర్గి పొందుటకు రాముడు ఒక్క లంకనేగాదు, సర్వ లోకములను భస్మీపటలము చేయగలడనియు, కావున, రాముడామెను రక్షించు విషయమున, సందేహించ వలదనియును పల్కెను.

## సీత ప్రతిసందేశము:

శ్రీరామునికి ప్రతి సందేశమ్మని హనుమంతుడు ప్రార్థించెను. అపుడా దేవి ప్రతిసందేశమొసగి తన యీ మాటను శ్రీరామునికి తెల్పుమని పల్కెను.

"జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ।
ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమితే॥
రావణేనో పరుద్ధాం మాం నికృత్యా పాప కర్మణా।
త్రాతు మర్హసి, వీర, త్వం పాతాలా దివకౌశికీమ్॥
(5/38/65-66)

ఓ దశరథాత్మజా, నేను ఒక్క మాసము మాత్రమే (నీకై యెదురు జూచుచు) జీవితమును ఎట్టులో చిక్కబట్టి బ్రతుక గలను. అంతకంటె పైన బ్రతుకజాలను. ఇది నిజము॥ పాప కర్ముడగు రావణునిచే లంకలో బంధించ

బడిన నన్ను, పాతాళము నుండి, ఇంద్రలక్ష్మిని, విష్ణువు రక్షించిన విధముగ నుద్ధరించి రక్షింపుము॥

ఈ విధముగ పల్కి, తన చీరకొంగున, ముడివేసి, యింత పఱకును, భద్రముగనుంచిన, దివ్యమగు చూడామణిని, నభిజ్ఞానముగ హనుమంతునికి సమర్పించెను. ఆ చూడామణిని రెండు చేతులతో గ్రహించి, వ్రేలికి తొడుగుటకు యత్నించి, కుదరక. సీతాదేవికి, ప్రణామమాచరించి, మహా హర్షభరితుడై, అట్టి యన్యన్య పరాయణయగు భార్యను కల్గియున్నందులకు, శ్రీరామునకు, ఆమెయందు మాతృ భావము నేయు లక్ష్మణునకును, మనసార నమస్కరించి, తిర్గి వెడలి పోవలెనని హనుమంతుడనుకొనెను.

అపుడు, సీతాదేవి యా చూడామణి వృత్తాంతము తెల్పి, తన యీ యనంత దుఃఖమును, రామ-లక్ష్మణులకు తెల్పి తనకీ దుఃఖమునుండి వెంటనే విముక్తి కల్పించుమని ప్రార్థించినట్లుగ పునఃపునః, తెల్పి, రామలక్ష్మణులను కపిరాజగు సుగ్రీవుని అతని అమాత్యులను ఇంకను వృద్ధులగు హరిప్రవీరులను కుశల మడిగితినని తెల్పుమని పల్కి తిర్గి దీనముగ నిట్లు పల్కెను:-

"యథాచ సమహాబాహుర్మాం తారయతి రాఘవః॥
అస్మాద్దుఃఖాంబు సంరోధా త్త్వం సమాధాతు మర్హసి॥
(5/39/12)

తా॥ మహా బాహువగు శ్రీరాముడు నన్నీ దుఃఖాంబుధి నుండి యెట్లు శీఘ్రముగ రక్షించునో యా విధముగ నతనికి నచ్చజెప్పుము.

అపుడామెను హనుమంతుడు శ్రీరాముని బలపరాక్రమముల నుగ్గడించి అతడామెను తనను, రక్షింపగలడను విశ్వాసమును పాదుకొల్పి ఆమెను రక్షించుటకై, విశాలమగు హర్యృక్ష సేనతో వచ్చి లంకను జయించి యామె నుద్ధరించగలడనియు రామబాణములకు గతి రోధము లేదనియు ఆమె నిమిత్తముగ రాముడు సకల భూమండల విజయమును జేసి మహత్తరమైన కీర్తిని పొందగలడనియును పల్కెను. కాని రాముడు విశాలమైన హర్యృక్ష సేనను తీసికొని సముద్ర తీరమునకు వచ్చినను నూరు యోజన

ముల సముద్రమును దాటి లంకకెట్లు రాగలడను సంశయము నామె వెలి బుచ్చెను. అపుడామెను ఓదార్చుటకై హనుమంతుడు వానర వీరుల బల-పరాక్రమములను గూర్చి యిట్లు తెలిపెను.

ఓ దేవీ! మహా విక్రమ సంపన్నులు మహా తేజస్వులునగు వానర వీరుల గమనమునకు భూమిపైగాని ఆకాశమునగాని నదీ సముద్రములపైన గాని అడ్డులేదు. ఎంతటి కష్టములందైనను వారు విషాదమును పొందరు. మహోత్సాహ సంపన్నులగు వారు పెక్కుమారులు సాగరాంబరయగు ఈ భూమండలమునే ప్రదక్షిణము చేసి యున్నారు. వారందరు నాకంటె గొప్ప వారలు లేదా నాకు సమానమగు వారలే కాని నాకంటె తక్కువ వాడొక్కడును వారిలో లేరు. నేనే యిక్కడకు రాగా వారలీ సముద్రమును దాటి వచ్చుట వారికొక లెక్కయా? సాధారణముగ ఇట్టి యపాయ యుక్తములగు దౌత్య కార్యములలో నుత్కృష్టులగు వారిని రాజులు పంపరు. తక్కువ వారినే పంపుదురు. (5/15/41-45) కనుక నేను నీ క్షేమవార్త తెలుపుటయే తడవుగా వారు వచ్చి నిన్ను రక్షింపగలరు. నీ కష్టములు గట్టెక్కినవి, ఇక నీకీ చెఱయుండదని పల్కెను. సీతాదేవిని యోదార్చుటకు నతడాడిన పల్కులు అతని యుచితజ్ఞతను తెల్పుచున్నవి.

అతని మాటలకు సమాశ్వస్తురాలై, హనుమంతుని ప్రియవకృత్వమును మిక్కిలి మెచ్చుకొని, సీత మఱియొక యభిజ్ఞానముగ నీక్రింది ఘటనను గూడ తెల్పుమని హనుమంతునితోననెను.

పూర్వము నా గండ పార్శ్వమునగల తిలకము చెఱగిపోగా, శ్రీరాముడు మనశ్శిలాద్రవముచే నాగండ పార్శ్వమున తిలకమును దిద్దెను, ఇది మా యిద్దరకే తెలియును.

హనుమంతుని దౌత్యకార్యము:

"సరాజ పుత్ర్యా ప్రతివేదితార్థః కపిః కృతార్థః పరిహృష్టచేతాః।
తదల్పశేషం ప్రసమీక్ష్య కార్యం, దిశంహ్యుదీచీం మనసాజగామ॥"

(5/40/25)

ఆ తరువాత కృతార్థుడును, హర్షనిర్భర చిత్తముగలవాడును, సీతా ప్రతిసందేశ గ్రహీతయునగు, హనుమంతుడా ప్రదేశమును బాసి మనోవేగ ముతో నుత్తరదిక్కున కరిగి యిట్లాలోచించెను. రామసందేశమును సీతాదేవికి వినిపించు కర్తవ్యము పూర్తియైనది. కాని దౌత్యకార్యమింకను పూర్తికాలేదు ఎందుకన, తాను, తన బలముచే రాక్షసులకు వెఱపు కల్గించి, రాక్షసేంద్రు డగు రావణునికి గూడ శ్రీరామ పరాక్రమమును వినిపించుట ద్వారా భయ మును పుట్టించి, ఏదియో విధముగ, లంకయంతయు పగలు తిర్గి, లంకా రక్షణవ్యవస్థను, రాక్షస సైనిక వ్యవస్థను, అందలి గుణ-దోషములను, రాక్ సుల సైనికుల శక్తి-సామర్థ్యములను తెలిసికొనుటతో బాటుగ, రావణుని యతని కొలువులో చూచి, సీతావిషయమున యతని చిత్తమునెఱిగి, అతడు చేసిన యకృత్యమును దర్బారులో కుండ బ్రద్దలుకొట్టినట్లుగ బహిర్గతమొనర్చి, వారిలో గూడ, నతనిని గూర్చి వైరస్యము నుత్పాదము చెసినగాని ప్రభుకార్యము పూర్తి గాదని తలంచి, యందుకై తనలో తానిట్లాలోచించెను.

> "నసామ రక్షః సుగుణాయ కల్పతే, నదాన మర్థోపచితేషు యుజ్యతే।
> నభే దసాధ్యా బల దర్పితా జనాః, పరాక్రమస్త్వేషమమే హరోచతే॥
> "నచాస్య కార్యస్య పరాక్రమాదృతే వినిశ్చయః కశ్చిదిహోప పద్యతే।
> హత ప్రవీరాశ్చరణే తురాక్షసాః కథంచి దీయుర్య దిహాద్య మార్దవమ్॥
> "కార్యే కర్మణి నిర్వృత్తేయో బహూన్యపి సాధయేత్।
> పూర్వ కార్యా విరోధేన సకార్యం కర్తు మర్హతి॥ (5/41/3-5)

తా॥ రాక్షసుల విషయములో సామోపాయము గుణకారిగాదు. ధన వంతులగుట వలన "దానము" అను ఉపాయము గూడ పనిచేయదు. బలదర్పి తులగు రాక్షసులయందు భేదనీతిగూడ పనికిరాదు. ఇక మిగిలినది దండము. దానికి నేను పరాక్రమించుటయే మంచిదనిపించుచున్నది.

నేననుకొనిన కార్యసిద్ధి కొఱకు పరాక్రమము తప్ప మఱియొక యుపా యము పొసగదు. యుద్ధమున కొంతమంది వీరులను హతమార్చిన రాక్షసులు తప్పక మెత్తపడగలరు.

చేయవలసిన పని, పూర్తియైనపుడు, పూర్వకార్యమునకు విరోధము లేకుండగ పెక్కు పనులు సాధింపగలవాడే ఒక కార్యమును సాధింపగల్గును

అల్పమైన కార్యము సాధించునపుడు గూడ, ఒక్క హేతువును గూర్చి మాత్రమే యాలోచింపక, తత్సాధన హేతువులనన్నిటిని, బహువిధములుగ ఆలోచించి, యెవ్వడు ఆ కార్యమును సాధించుటకు పూనుకొనునో, యతడే నిజముగ కార్యకరణ సమర్థుడు. కనుక, సీతాప్రాప్తికి ఉపాయము కేవలము సీతాదర్శనము మాత్రమే కాదు. సీతాప్రాప్తి రూపమగు రామకార్యము నెన్ని విధముల సాధించుటకు వీలగునో, వానినన్నిటిని యనుష్ఠించుట నీతి సమ్మతము. కనుక నేను, శత్రురహస్యముల నెఱుగుటతో బాటుగ, శత్రువులకు వెఱపు పుట్టించి, సుగ్రీవసన్నిధికి మఱలిపోవుట వలన, సుగ్రీవశాసనమును పూర్ణముగ నెరవేర్చినట్లగునని నిశ్చయించి అశోకవనమును ధ్వంసము చేయుటతో, తన కార్యమును హనుమంతునారంభించెను.

## హనుమంతుని బలపరాక్రమములు

హనుమంతుడు, సీతా ప్రాప్త్యుపాయ భూతముగ నాలోచించిన పరాక్రమించుటయను కార్య సాధనమునకై ప్రమదావనమును విధ్వంసము చేయుచు' అడ్డము వచ్చిన, తద్వనపాలగణమును చావమోది, ప్రమదావన ప్రాకార సింహద్వారముపై గూర్చుండెను. అపుడు ఆ వనమును, కాపలాకాయు కొంత మంది రాక్షస స్త్రీలు, జానకి వద్దకు వెళ్లి, యశోకవన విధ్వంసకుడగు ఆ వానరుడెవ్వడని యడిగిరి. అపుడామె వారికిట్లు బదులు పల్కెను:-

"రక్షసాం కామరూపాణాం విజ్ఞానే కా గతిర్మమ॥
యూయమేవాఽస్య జానీత యోఽయం యద్వా కరిష్యతి।
అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః॥
4/52/6-3)

తా॥ కామరూపులగు రాక్షసుల మాయలను తెలిసికొనుటకు, నాకెట్లు చేతకాను మీకే. యితడెవ్వరో, ఏమి చేయునో, మీకే తెలియును.

పాముయొక్క పాదములను పామే యెఱుగును, ఇతరులెఱుగరు ఇది యథార్థము॥

కాన, అతనిని గూర్చి నాకేమి తెలియును, మీకే తెలిసి యుండవలెను. నేను గూడ మీ వలెనే యతనిని చూచి చాల భయపడుచున్నానని, సీతాదేవి పల్కెను.

సీత యీ సమాధానము చెప్పగనే, యా రాక్షస స్త్రీలు, రావణుని వద్దకు వెళ్ళి, ఒక వానరుడు, అశోక వనమునకు వచ్చుట, సీతతో మాట్లాడుట, తరువాత అశోక వనమును విధ్వంసము చేయుట, మొదలుగా గల, సమాచారమును తెల్పిరి.

అపుడు రావణుడు, తన ప్రమదావనమును, విధ్వంసము చేయుటకు సాహసించిన. ఆ వానరముపై మిక్కిలి కోపించి, యతనిని నిగ్రహించుటకై కింకరులను, బలవంతులగు రాక్షసుల నాజ్ఞాపించెను మహాబల సంపన్నులును ఘోరాకారులును నగు కింకరులను రాక్షసులు, ధనుర్బాణ, ప్రాస, తోమర, ముద్గర, పట్టిశాది వివిధాయుధములు తీసికొని, మహోత్సాహముతో, ప్రమదావన సింహద్వారము వద్దకు పోయి హనుమంతుని చుట్టుముట్టిరి. వారిని చూడగనే, యుద్ధోత్సాహము పొంగి పొరలగ, హనుమంతుడు, తన శరీరమును చాల యున్నతముగ పెంచి, తన తోకను భూమిపై గొట్టి, లంకయంతయు ప్రతిధ్వనించునట్లు, ఘోర గర్జనము చేసి యీ విధముగ తన విజయోద్ఘోషమును చేసెను:-

"జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాఽభి పాలితః॥
"దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాఽక్లిష్ట కర్మణః।
హనుమా ఞ్ఛత్రు సైన్యానాం నిహంతా మారుతాత్మజః।
"న, రావణ సహస్రంమే యుద్ధే ప్రతిబలం భవేత్।
శిలా భిశ్చ ప్రహరతః పాదపైశ్చ సహస్రశః॥

"అర్దయిత్వా పురీం లంకా మభివాద్యచ మైథిలీమ్।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వ రక్షసామ్॥
(5/42/34-38)

సుందరకాండకు, హనుమంతుని ఈ విజయోద్ఘోషము, ప్రాణము వంటిది. దీనియందు, హనుమంతుడు, శ్రీరామ-లక్ష్మణుల మహాబల పరాక్రమముల నుగ్గడించుటతో బాటుగ, శ్రీరామ ప్రభుని సర్వోత్కర్షమును, ఉద్ఘోషించుటతో బాటుగ, నాయనచే పరిరక్షింపబడు వారి మహోత్కర్షమును గూడ నుద్ఘోషించి, తన ప్రభువగు, రామ పాలితుడగు సుగ్రీవునికి జయమును పల్కె. తరువాత, తాను, అక్లిష్ట కర్ముడగు శ్రీరామచంద్రునకు దాసుడనని యుద్ఘోషించెను. ఇంకదు, మారుతాత్మజుడును, కోసలేంద్రుని దాసుడును నగు, తాను, శ్రీరామ ప్రభుని ప్రతాపము వలన శత్రు సైన్యములను చంపి వేయుటకు వచ్చినట్లుగ, నిర్భయముగ, ప్రకటించెను. అంతేగాదు, వృక్ష' శిలాప్రహరుణుడగు తనముందు, ఆ శ్రీరామప్రభుని, యనంత పరాక్రమ స్మరణము మూలమున తన యందు విజృంభించిన, శత్రు ప్రధృష్యమైన వీర్యము ముందు, వెయ్యిమంది రావణులైనను నిలబడజాలరని, లంకావాసులకు చాటిచెప్పెను. ఇక తాను సంకల్పించిన కార్యమును ప్రకటించుచు, నిట్లు పల్కెను: నేను లంకా పురమును రాక్షసులందరు చూచుచుండగనే ధ్వంసము చేసి, మైథిలికి నమస్కరించి, సమృద్ధార్థుడనై తిరిగి పోవుదును. ఈ హనుమంతుని విజయోద్ఘోషము, లోకనాథ శిఖామణియగు, శ్రీరామ ప్రభుని యధర్మ నాశకమును, ధర్మ ప్రతిష్ఠా పరతంత్రమునునగు సత్యపరాక్రమ విజయోద్ఘోషయే. ఈ యుద్ఘోషము నెవ్వరు నిరంతరము చేయుచుందురో వారు గూడ,అధర్మవినాశ-ధర్మప్రతిష్ఠా సమర్థమగుపరాక్రమ సంపన్నులగుదురనియును, వారిని ముల్లోకములలో నేశక్తియు నడ్డుకొనజాలదనియు, దానికి తానే నిదర్శనమని గూడ చాటి చెప్పెను. అంతేగాదు శ్రీరామ ప్రభుని, ఈ ధర్మ ప్రతిష్ఠా వ్యవసాయమున, సహధర్మచారిణిగ నిల్చిన మైథిలికి అభివాదమొనరించుట వలననే, నిర్విఘ్నముగ, అభీష్ట కార్యసిద్ధి యగునని, రామదాసుడగు హనుమంతుడుద్ఘోషించినాడు. కనుకనే ఉపాసనా సంప్రదాయవేత్తలు, సర్వకార్య సిద్ధిప్రదమగు సుందరకాండపారా

యణ చేయు వారలు ప్రతి సర్గాంతమునను, హనుమంతుని యీ సీతారామ విజయోద్ఘోష మంత్రమును పఠించినందు వలన, నిర్విఘ్నముగ కార్యసిద్ధి కల్గునని చెప్పుచున్నారు. హనుమంతుని, సీతారాముల, ఈ విజయోద్ఘోష మంత్రమును, నిరంతరము స్మరించు భక్తులకు, ఏకార్యము నందును, అవ సాదము కలుగదనియు, ఎట్టి విఘ్నములెదురైనను, వారు సులువుగ వాని నెదుర్కొని, కార్యసిద్ధిని పొందగలరని గూడ రామోపాసకులందురు.

అస్తు, ఈ విధముగ, ధర్మస్వరూపులగు సీతా - రాములకు, ధర్మై మార్గగామియగు సుగ్రీవునికిని, విజయోద్ఘోషమునుచేసి సింహద్వారపరిఘను చేత ధరించి కింకరులను రాక్షసులపై హనుమంతుడు విరచుకొనిపడెను. ఇంద్రుడు వజ్రమును చేత ధరించి రాక్షస సంహారము గావించినయట్లు, ఆ యినుప గుదియతో, కింకరులను, వారితో యుద్ధమునకు వచ్చిన ఎనుబదివేల మంది రాక్షస భటులను హనుమంతుడు మట్టుబెట్టెను.*

కింకరులను హతమార్చి, యశోక వనములో గల వెయ్యి స్తంభముల చైత్య ప్రాసాదమును గూడ విధ్వంస మొనర్చుటకు సంకల్పించి చైత్యపాలు రకు వెఱపు కల్గించుటకై ఘోరనాదము చేసెను. ఆ ఘోరనాదమును విని, ఆ చైత్య ప్రాసాదపు కావలావారు, ప్రాస, ఖడ్గ, పరశ్వాది ఆయుధములు తీసికొని హనుమంతుని చుట్టుముట్టిరి. అపుడు హనుమంతుడు, ఆ చైత్య ప్రాసాద సంబంధమగు శతధారలుగల, ఒక విశాల స్తంభమును పెకలించి, దానిని చేతధరించి, గిరగిర త్రిప్పసాగెను. ఆ స్తంభ భ్రమణ వేగమున జనించిన భీకరాగ్ని, విశాలమగు ఆ చైత్య ప్రాసాదమును పూర్తిగ దగ్ధము చేసి వేసెను. ఆ తరువాత ఆ ప్రాసాదమున కావలాకాయు నూరుగురు రాక్షసు లను గూడ చంపి, ఆకాశగతుడై, మహావీరుడగు హనుమంతుడిట్లు ఘోషించెను.

"దశ గజ, శత గజ, సహస్ర గజ, బలముగల వేలాది మావంటి సుగ్రీవుని యనుచరులు ఈ భూమండలమంతయు, సీతాదేవి కొఱకై గాలించు చున్నారు. అర్బుదాది సంఖ్యలోగల నట్టి వీరుల మహా సేనను తీసికొని, వానర రాజగు సుగ్రీవుడు ఈ లంకపై దాడిచేసిన, నీలంకయునుండదు, మీరుండరు.

మీ ప్రభువగు రావణుడు గూడ ఉండడు. మహాత్ముడైన ఇక్ష్వాకు వీరుడగు శ్రీరాము ప్రభువుతో వైరముగొని తెచ్చుకొనిన లంకేశ్వరుడు జీవించుట కల్ల"

1. తేషా మశీతి సాహస్రం కింకరాణాంతరస్వినామ్।
నిర్యయుర్భవ నాత్తస్మాత్ కూటముద్గర పాణయః॥
(5/42/25)
"సతం పరిఘ మాదాయ జఘానరజ నీచరాన్॥ (5/42/40)

జంబూమాలి వధ :

కింకరులను రాక్షసులను, వారి యనుచరులను మట్టుబెట్టి, తిర్గి ప్రమదావన సింహద్వారముపై మూర్తీభవించిన వీర రసమువలె, యుద్ధాకాంక్షియై, మహావీరుడగు హనుమంతుడు కూర్చుండెను. ఈ వార్తను విని, రావణుడు ప్రహస్తుని పుత్రుడగు జంబుమాలిని పిల్పించి హనుమంతుని నిగ్రహించుటకై పంపెను. సమరదుర్జయుడగు జంబుమాలి రక్త వర్ణములగు మాల్యములను, వస్త్రములను ధరించి, మెడలో పూలమాలలు వేసికొని, రుచిరములగు కుండలములను చెవులకు పెట్టుకొని ఇంద్రధనుస్సువలె పెద్దదియగు ధనుస్సును, రుచిర సాయకములను తీసికొని, వజ్రాశని వంటి, ఘోరమగు ధనుష్టంకారమును చేయుచు, విశాలమగు సేనను తీసికొని యుద్ధోత్సాహ మెదలో సందడింప, గాడిదలు పూన్చిన రథమెక్కి యశోక వనమునకు వచ్చెను. వచ్చుచునే, సింహ ద్వారముపై నిలబడిన హనుమంతుని ముఖముపైన అర్ధచంద్ర బాణములను, శిరస్సుపై కర్ణయుక్త బాణములను, బాహువులపైన తీక్ష్ణములగు, పది నారాచములను ప్రయోగించెను. దానికి మిక్కిలి కోపించి, హనుమంతుడు, తన ప్రక్కనే పడియున్న ఒక విశాలమగు శిలను పెకలించి, జంబుమాలిపై విసరెను. జంబుమాలి పది బాణములతో నా శిలను పడగొట్టగ, ఒక పెద్ద మద్దిచెట్టును పెరికి, అతనిపై వేయుటకు హనుమంతుడు గిరగిర త్రిప్పసాగెను. ఈ లోపున జంబుమాలి, నాల్గు బాణములు వేసి, ఆ మద్దిచెట్టును విఱుగగొట్టి, మఱియొక యైదు బాణములు భుజముల పైనను, ఇంకొక వాడి బాణమును వక్షమునను, స్తనాంతరమున పది బాణములను కొట్టెను. జంబుమాలి ప్రయోగించిన బాణములచే పీడితుడైన హనుమంతునికి

జంబుమాలిపై చాల కోపము వచ్చెను. అప్పుడు తిర్గి హనుమంతుడు, సింహ ద్వారపు ఇనుప గుదియను చేత ధరించి, వేగముగ త్రిప్పి, జంబుమాలి రొమ్ముపైన బలముగ విసరి వేసెను. ఆ పరిఘాపాతముచే, శరీరమంతయు నుగ్గు నుగ్గైన జంబుమాలి ప్రాణములు విడచెను. ఆ పరిఘా ఘాతముచే, నుగ్గు నుగ్గై జంబుమాలి తలగాని, బాహువులు గానీ, జానువులు గాని, బాణములు గాని, రథాశ్వములుగాని, ఏవియు నగపడలేదు. ఈ విధముగ జంబుమాలిని చంపి, యతని సైనికులను గూడ నాశము చేసి, తిర్గి, అశోకవన ప్రాకార సింహద్వారమును హనుమంతుడాశ్రయించెను.

సప్తమంత్రి పుత్రుల వధ :

"కింకరు"లను రాక్షసులు, మహాబలుడగు జంబుమాలి, అతని వెంట వెళ్లిన, మహాబలులగు రాక్షస భటులు హనుమంతానిచే నిహతులైనట్లు విని రావణుడు, సప్తమంత్రి పుత్రులను, యుద్ధమునకు పంపెను. సప్తార్చి (అగ్ని) వలె వెల్గొందు సప్తమంత్రి పుత్రులు పరస్పరము పోటిపడి, జయాకాంక్షతో విశాలమగు సేనను తీసికొని యుద్ధమునకు బయలుదేరిరి. వారు స్వర్ణజాల యుక్తములును, ఎత్తైన ధ్వజ-పతాకాయుక్తములు, మేఘ గంభీర ఘోషములును, ఉత్తమాశ్వములు పూన్చినవియునగు రథములనెక్కి, కాంచన చిత్రములగు విల్లులను ధరించి యుద్ధమునకు బయలుదేరిరి. వారు వెళ్లుచునే సింహ ద్వారముపైన, యుద్ధాకాంక్షతో నిలబడిన హనుమంతునిపై బాణవర్షములను కురిపించసాగిరి. ఆకుచరుడగు హనుమంతుడు వారి బాణములు తనకు తగలకుండగ తప్పించుకొనుచు, ఇంద్రధనుస్సుతో నొప్పు మేఘములతో క్రీడించు వాయుదేవునివలె, ధనుర్ధారులగు ఆ సప్తమంత్రులతో క్రీడింపసాగెను. ఈ విధముగ కొంతసేపు వినోదించి, ఆ రాక్షస సేనను భయపెట్టుచు, ఘోర గర్జనము చేసి, ఆ రాక్షసుల నాక్రమించెను శత్రుతాపకుడగు హనుమంతుడు కొందరు రాక్షసులను, అరచేతులతో చఱచియు, మఱికొందరిని పాదములతో తన్నియు, మఱికొందరిని పిడికిళులతో గ్రుద్దియు, కొందరిని గోళ్లతో చీల్చియును చంపివేసెను. మఱికొందరిని, రొమ్ముతో నణచియు, కొందరిని తొడలతో నొక్కియు నులిమివేసెను. కొందరతని ఘోరగర్జనకే భయపడి

క్రిందికొరిగిరి. ఈ విధముగ సప్తమంత్రులు హనుమంతునిచే నిహతులుకాగా, చాల మంది వీరులు మట్టికరవగ, మిగిలిన సైనికులు భయార్ధితులై దశదిశలకు పారిపోయిరి. అపుడు, గజ-వాజులు వికృత స్వరముణ జేయుచు నేల కొరిగి యసువులబాసెను. విరిగిపోయిన ఆసనముల తోడను, ధ్వజచ్ఛత్రి రథముల తోటను రణరంగమంతయు నిండిపోయెను. యుద్ధభూమియందు సైనికుల క్షత-విక్షత శరీరములనుండి స్రవించు రక్తము ఏరులైపారెను.

## పంచ సేనాగ్రనాయకుల వధ :

సప్తమంత్రి పుత్రులుగూడ యుద్ధమున నిహతులైనట్లు విని, రావణుడు. విరూపాక్ష, యూపాక్ష, దుర్ధర్ష, ప్రఘస, భాసకర్ణులను ఐదుగురు మహా వీరులను పిలిపించి, నయకోవిదులును, యుద్ధదుర్మదులును నగువారిని మహా బలముతో, హనుమంతుని, నిగ్రహించుటకు పంపుచు. వారికిట్లు ఎచ్చరిక చేసెను : "ఆ వానరుని విక్రమములను గూర్చి విచారించగ, అతడు సాధారణ వానరుడుగ కన్పించుటలేదు, ఇంత మంది రాక్షసవీరుల నవలీలగ హత మార్చిన యితడు ప్రాకృత వానరుడు మాత్రముకాదు. మనలను నాశము చేయుటకై, ఇంద్రుడు తన తపోబలమున నిట్టి మహాభూతమును, సృజించి యుండవచ్చునను శంక కలుగుచున్నది. మన మింతకు పూర్వము, పలువురు, నాగ, యక్ష, గంధర్వ, దేవ, అసుర, ఋష్యాదులను జయించితిమి గదా ! వారు మన వినాశము కొఱకే మహా భూతమును సృజించి యుందురు ! కావున మీరు చతురంగ బలములతో పోయి. వీర పరాక్రముడగు, ఆ వానరుని. అవమానింపక. యదుపులోనికి తెండు, నేనుగూడ పూర్వము, వాలి, సుగ్రీవ, నీల. ద్వివిద. జాంబవవాది మహావీరులగు వానరులను చూచితిని. కాని, వారిలో నిట్టి తీవ్రవేగమును గాని, తేజోబలోత్సాహ పరాక్రమములనుగానిచూడలేదు. ఇదియేదియో మహాసత్వ సంపన్నమగు భూతము కపిరూపమున వచ్చినది. కాని, మీరుగూడ సాధారణ యుద్ధభటులు కారు. మీ యెదుట. యుద్ధములో దేవతలుగాని, అసురులుగాని మఱియింక నెవ్వరుగాని నిలబడజాలరు. ఐనను, యుద్ధములలో విజయము నిశ్చితముగాదు. కావున సావధానతతో నావానరమును నిగ్రహింపుడు".

ఈ విధముగ లంకేశ్వరునిచే నెచ్చరికలు చేయబడి పంచ సేనాగ్ర నాయకులు మహోత్సాహముతో యుద్ధమునకు పోయి హనూమంతుడున్న తోరణము (సింహద్వారము) వద్దకు పోయి యతనిని చుట్టుముట్టి యతనిపై బాణ వర్షములు కురిపించిరి. ముందుగ హనూమంతుడు తనపై శరములను వర్షించు దుర్ధరుని తన హుంకారముతో నిల్వరించి, భయంకరమైన గర్జనము చేసి తన శరీరమును బాగా పెంచి ఆకాశములో బాగుగ ఎత్తున కెగిరి, పర్వతముపై పిడుగుపడిన విధమున నతనిరథముపై బడగ, ఆ రథమునకు పూన్చిన ఎనిమిది గుఱ్ఱములు రథముతోసహా నుగ్గునుగ్గై పోయెను. దుర్ధరుడు రథముపై నుండి క్రిందపడి ప్రాణములబాసెను. దుర్ధరుని దుర్మృత్యువును జూచి శతృవుల కప్రధృష్యులును మహాబల సంపన్నులును నగు విరూపాక్ష యుపాక్షులు ఆకాశములోని కెగిరి గదలతో హనూమంతుని కొట్టిరి. హనూమంతు వెంటనే వారి వేగమునడ్డుకొని, మహావేగముతో భూమిపైన దిగి ఒక విశాలమైన మద్ది చెట్టును పెకలించి విరూపాక్ష - యూపాక్షుల నిద్దరను హతమార్చెను. ఇది చూచి ప్రఘస - భాసకర్ణు లిద్దరు చెఱియొక దెసనుండి హనూమంతునిపై దాడిచేసిరి. ప్రఘసుడు పట్టిశముతో హనూమంతుని కొట్టగ భాసకర్ణుడు శూలముతో ప్రహరించెను. ఆ యస్త్రాఘాతముచే హనూమంతుని శరీరము గాయముకాగ ఆ గాయములనుండి రక్తము స్రవింపసాగెను. దానితో హనూమంతుడు మహా క్రోధముతో హరించి ఒక పెద్ద పర్వత శిఖరమును పెకలించి వారిద్దరిపైన విసరగ వారిద్దరును తిలశః ఖండితులై మరణించిరి. ఈ విధముగ పంచ సేనాగ్ర నాయకులను నిహతులనొనర్చి హనూమంతుడు గుఱ్ఱములను చేతిలోనికి గ్రహించి. గుఱ్ఱములను. ఏనుగులతో ఏనుగులను సైనికులతో సైనికులను రథములతో రథములను ఢీకొట్టి ఇంద్రుడు రాక్షస వధ చేసినవిధముగ రాక్షససేనలను సంహరించెను. మృతులగు రాక్షస వీరుల శవములతో యుద్ధభూమి యంతయు కప్పబడిపోయెను.. ఈ విధముగ శతృ సంహారముచేసి హనూమంతుడు ప్రజాసంహారమున కుద్యమించిన కాలమువలె అశోకవన ప్రాకారసింహ ద్వారముపై గూర్చొని భావిసంహారమున కెదురుజూడ సాగెను.

**అక్షకుమార వధ :**

అనుచర సహితముగ ఐదుగురు సేనాపతులు హనూమంతునిచే నిహతులైనట్లు విని రావణుడు సమరోద్ధతుడైన అక్షకుమారుని దెసకుచూచెను. ప్రభువు యొక్క దృష్టి పాతప్రేరితుడై. కాంచన మయమగు ధనుస్సును చేతబూని హవిః ప్రజ్వలితాగ్నివలె ప్రతాపోజ్జ్వలుడైన అక్షకుమారుడు నిష్టప్తస్వర్ణ నిర్మితమగు రథమునెక్కి హనూమంతుని నిగ్రహించుటకై ప్రమదావన ప్రాకారతోరణమువద్దకు బయలుదేరెను. అక్షకుమారుని యుద్ధసన్నాహమునుచూడుడు అతడెక్కిన రథము స్వర్ణజాలావృతము. రత్నములు చెక్కిన ఉన్నతమగు ధ్వజము దానిపై నెగురు పతాకముగలదియు ఎనిమిది మనోజవములగు అశ్వములు పూన్చినదియు. సురాసురుల కప్రధృష్యమును మెఱపువలె మిఱుమిట్లు గొల్పుచున్నదియు ఆకాశ సంచారయుక్తమును తూణయుక్తమును ఎనిమిది చంద్రహాసములతోసుశక్తితోరములతో దను సజ్జితమును సకలయుద్ధోపకరణయుక్తమైనదియును. మహాతపస్సంచయార్జితమును దివ్యప్రభలనీనుచున్నదిగను నుండెను. ఇట్టి యారధము నెక్కి అశోకవన ప్రాకారతోరణము వద్దకు పోయి దానిపై సింహమువలె క్రోధమును వెళ్ళగ్రక్కు కన్నులుగల వాడును ప్రజాక్షయకరమగు యుగాంత కాలాగ్నివలె భయంకరుడును నగు హనూమంతుని బహుమాన పూర్వకముగ చూచెను. మహా వీరుడగు హనూమంతుని వేగమును శత్రువులపై నతడుచూపిన భీమపరాక్రమములను స్మరించి యక్షకుమారుడు ప్రళయకాల సూర్యునివలె ప్రతాపవహ్నితో వెల్గొందెను అనంతరము విల్లు నమ్ములను ధరించి మూర్తీభవించిన యుద్ధోత్సాహమును బోలిన హనూమంతునిపై తీక్షములగు మూడుబాణములను తలపైగొట్టెను. ఆ బాణక్షతములనుండి కారురక్తములో మునిగిన నేత్రములుగల హనూమంతుడు అప్పుడే ఉదయించిన సూర్యునివలె అరుణ కాంతులను విరజిమ్ముచుండెను. వీరుడగు అక్షకుమారుని జూచి. మహావీరుడగు హనూమంతుని హృదయము యుద్ధోత్సాహముతో పొంగిపొరలెను. అప్పుడు ధనురారోపణమునను బాణప్రయోగముననుకుశలుడైన అక్షకుమారుడు పర్వతాకార శరీరముగల హనూమంతునిపై నిరంతరమగు బాణవర్షమునుకురిపించెను అతని బాణప్రయోగ లాఘవమును చూచి. మహాహర్షముతో హనూమంతుడు ఘోరగర్జనము చేసెను అక్ష

కుమారుడు తనపై ప్రయోగించు బాణవర్షములను తప్పించుకొనుచు పుంఖాను పుంఖములుగ శరములను ప్రయోగించి ఆకాశమును నిరవకాశముగ చేయు అక్షకుమారుని వైపు బహుమాన దృష్టితో మారుతనందనుడొక్క పరిజూచెను. మహావీరుడును అవిషహ్య ప్రతాపయుక్తుడును మహాయోద్ధయునునగు అక్షకుమారుని చంపుటకు మనస్సు తటపటాయించగ హనూమంతుడు తన మనస్సులో నిట్లనుకొనెను ;—

" పరాక్రమోత్సాహ వివృద్ధమానసః సమీక్షతేమాం ప్రముఖోగ్రత స్థితః ॥
పరాక్రమోహ్యస్య మనాంసి కంపయే. త్సురాసురాణామపి శీఘ్రకారిణః ః
5/47/25

(తా॥ పరాక్రమోత్సాహములచే ప్రవృద్ధ చిత్తముగల ఈ అక్షుడు నాయెదుట నిలబడి నన్నే చూచు చున్నాడు. శీఘ్రకారియగు ఇతని పరాక్రమము సురాసురుల మనస్సులను గూడ భయకంపితములుగ చేయగలదు.

కాని యిట్టి వీరుని నేను ఉపేక్షించిన నన్నే లొంగదీయునుగద ః వర్ధమానమైన శౌర్యాగ్నిగల ఈ రాక్షసవీరుని ఉపేక్షింపతగదు అని తిర్గి నిశ్చయించుకొని హనూమంతుడు విజృంభించెను. ముందుగ సుశిక్షితములును మహాభార సహములును నగు రథమునకు పూర్చిన ఎనిమిది మహాశ్వములను ఆకాశముపై నుండి ధడాలునుని రథముపైబడి అరచేతి చరపిడులతో అంతమొందించెను. అటు తరువాత రథమును భగ్నముచేసి సారథిని చంపెను రథము భగ్నముకాగా అక్షకుమారుడు తన యాసనము నుండి క్రిందకు పడిపోయెను, అపుడు మహారథుడగు అక్షుడు. ధనుస్సును, ఖడ్గమును ధరించి ఆకసము లోని కెగిరెను, అపుడు హనూమంతుడు అతని రెండు పాదములను పట్టుకొని వేగముగ గిరగిర త్రిప్పి నేలపై కొట్టెను. ఈ విధముగ నేలపై బలముగకొట్టబడిన, అక్షుని బాహువులు ఊరువులు కటిప్రదేశము వక్షము భగ్నముకాగా ఎముకలు. నేత్రములు చూర్ణమైపోగా సంధిబంధములు విడిపోగా రక్తము గ్రక్కుకొనుచు ప్రాణములు విడచెను. హనూమంతుని ఈ వీర విక్రమము

లను చూచి దేవేంద్రాది దేవతలు, ఋషులు, యక్షులు, పన్నగులు మొదలగు వారందరు సంభ్రమాశ్చర్యములలో మునిగిపోయిరి. ఈ విధముగ అక్షుని, అతని యనుచరులను క్షయమొనర్చి పవనసుతుడు ప్రాకారతోరణముపై ప్రజా సంహారమునకు పూనుకొనిన మహాకాలమువలె, దుర్నిరీక్ష్యుడై కూర్చుండెను.

## ఇంద్రజిత్పవనసుత సంగ్రామము ;

అక్షకుమారుడు హనూమంతునిచే 'నిహతుడైనట్లువిని', మనస్సు నెట్లో దిటవుపరచుకొని, రావణుడు ఇంద్రజిత్తునకు కబురుపెట్టి పిలిపించెను. ఇంద్రజిత్తు పరాక్రమములను రావణుడు ముందుగ ప్రశంసచేయుట కుపక్రమించెను. "నీవు సర్వాస్త్రకోవిదుడవు శస్త్రకోవిదుడవు. శస్త్రధారులలో గూడ వరిష్ఠుడవు, దేవాసురులకు గూడ శోకప్రదాతవు దేవేంద్రాది దేవతలచేపరాక్రమమున మించినవాడవు. పితామహారాధనముచేసి. వివిధములగు అస్త్రములను పొందినవాడవు నీయస్త్రబలము ముందు దేవేంద్రాది దేవతలుగాని అతనికి సహాయకులగు మరుద్గణములుగాని నిల్వజాలకపోయిరి మహాబాహుబలయుక్తువును తపోభిరక్షితుడవును నగు నీవు బుద్ధిమంతుడవు దేశకాలకోవిదుడవు, నీ వీరోచితకర్మలచే సాధింపబడనిది లేదు. నీ మంత్రణమమోఘము. నీ యస్త్రబలము విశ్వవిఖ్యాతము, తపమునను, వీర్యమునను, నాతో సమానుడవు నీవు శత్రువిజయమునకై బయలుదేరినపుడు నామదినెన్నడును ఖేదమందదు హనూమంతుడను వానరుడువచ్చి ప్రమదావనమును విధ్వంసమొనర్చి చైత్యప్రాసాదమును తత్ప్రాసాద పాలురను నాశనముచేసి. కింకరులను జంబుమాలిని వీరులైన సప్తామాత్య పుత్రులను పంచ సేనాపతులను అక్షకుమారుని గూడ శస్త్రాస్త్రసజ్జితమైన సేనతోగూడ పరిమార్చినాడు. కనుక నీయందే నేను అన్ని ఆశలు పెట్టుకొనినాను నీవు నాకన్నివిధముల తగిన సుతుడవు మహత్తరమైన రాక్షసబల వినాశమును ఆ వానరుని ప్రభావ - పరాక్రమములను ఆత్మబలమును విచారించి నీ బలమునకు తగిన తీవ్రయత్నమునుచేసి యా వానరుని నిగ్రహింపుము. నీవు తొందరపడక స్వ - పరబలములను బాగుగ సమీక్షించి యుద్ధమున విజృంభింపుము సేనలను మాత్రము తీసికొని వెళ్ల

పము వారు భయపడి గుంపులు - గుంపులుగ పారిపోవుదురు. సారవత్తమ మగు వజ్రమునుగూడ తీసికొని పోవద్దు. ఏలయన అగ్నిసమాన తేజస్వి యగు హనుమంతునిపై ఏ యస్త్రములును పనిచేయవు. నివు నీ ధనుర్బలము పైననే పూర్తిగ ఆధారపడి యాకపిని నిగ్రహింపుము. తండ్రి పల్కిన హిత వచనములను విని తన తండ్రికి ప్రదక్షిణముచేసి, పర్వకాలమున నుప్పొంగు సముద్రమువలె యుద్ధోత్సాహదూ పొంగులు వారగ ఇంద్రజిత్తు హనూమంతుని నిగ్రహించుటకై వెడలిపోయెను. మహా యుద్ధోత్సాహముతో, ధనుర్బాణములను ధరించి ఇంద్రధ్వజయుక్తమగు దివ్య రథమారోహించి ఇంద్రజిత్తు యుద్ధమునకు బయలుదేరగ దిక్కులన్నియు కలుషితములాయెను క్రూర మృగములు ఆర్తనాదములు చేసెను. హనుమదింద్రజిత్తులకు జరుగ బోవు లోమహర్షకమగు యుద్ధమును చూచు వేడ్కతో నాకసమున నాగ, యక్ష, మహర్షులు, నక్షత్రవాసులగు సిద్ధులుగూడ గుమిగూడిరి. ఇంద్రజిత్తు ఇంధ్రధ్వజముగల రథముపై తనతో యుద్ధముచేయుటకు వచ్చుటనుగాంచి హనూమంతుడు సింహనాదముచేసెను. వారివురును తీక్షవేగముతో గొంకు జంకులులేక సురా-సురేంద్రులవలె తీవ్రముగ ఒకరితోనొకరు యుద్ధముచేయ సాగిరి. మహావీరుడగు హనూమంతుడు తన శరీరమును పెంచి ఇంద్రజిత్తు తనపై ప్రయోగించు శరములను ధ్వంసముచేయుచు వాయుపథమున సంచ రించసాగెను. ఇంద్రజిత్తు సువర్ణపుంఖములగు దాడిములుకులను ఎడతెఱిపి లేకుండగ హనుమంతునిపై కురిపించెను. హనూమంతుడు అతని బాణముల కెదురు నిలబడి ప్లే నిలబడి, బాణములు ధనుర్ముక్తములైన వెంటనే బాహు వులు చాచుకొని ఎగిరిపోవసాగెను. వేగసంపన్నులును రణకర్మ విశారదు లును నగు వారివురు చాల మనోజ్ఞముగ చాలతడవు యుద్ధముచేసిరి. వారివురి యుద్ధవీర్యములను ప్రశంసించుచు వాల్మీకి వ్రాసిన ఈ క్రిందిపంక్తులను చూచి యానందింపుడు :-

'హనూమతో వేద రాక్షసో ఽ న్తరం; నమారుతి స్తస్య మహాత్మ నో న్తరమ్। పరస్పరం నిర్విషహా బభూవతు స్సమేత్య తౌదేవసమాన విక్రమౌ ॥

(తా ॥ హనూమంతు నియంతరమును ఇంద్రజిత్తుగాని ఇంద్రకీడంత రమును. మారుగాని తెలిసికొనలేక పోయిరి. దివ్య పరాక్రమోపేతులగు వారిరువురు పరస్పరమణచుటకు సమర్థులుగా నుండిరి,

తాను ప్రయోగించిన అమోఘయలగు బాణములన్నియును హనూమ ద్విషయమున నిరుపయోగములుకాగా ఇంద్రజిత్తు హనూమంతుడు ఎట్టి యస్త్రి శస్త్రములవలనను వధ్యుడుగాదని యెఱిగి యతనిని నిగ్రహించుటకై బుద్ధి యత్నముగ బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. బ్రహ్మాస్త్రముచే బంధించ బడిన హనూమంతుడు నింగినుండి నిశ్చేష్టుడై క్రిందపడెను ఆ తరువాత తెల్వివచ్చి బ్రహ్మయిచ్చిన వరమును స్మరించి యెట్టియుద్వేగమును పొందక నిశ్చింతగనుండి తనలో తానిట్లు చింతించెను. బ్రహ్మదేవుని ప్రభావమువలన బ్రహ్మాస్త్రి బంధమును విడిపించుకొనుటకు వీలులేదు. తాను బ్రహ్మ వరప్రి భావమువలన నాయస్త్రిమునుండి విముక్తిపొందగల శక్తి తనకున్నను బ్రహ్మ కుతనపైగల మహానుగ్రిహమును స్మరించియు స్వకార్య సాదనకై మారుతి బ్రిహ్మాస్త్రిమునకు కట్టుబడియేయుండెను,

అపుడు రాక్షసభటులు నిశ్చేష్టుడుగ భూమిపై పడియున్న హనూమం తుని వద్దకు వచ్చి. అతనిని జనపనారతోను: చెట్లనారతోను, నారత్రాళ్లతోను. నారబట్టల పేలికలతోను గట్టిగ బంధించి యతనిని పీడింపసాగిరి. అపుడు హనూమంతుడు పెద్దగా అరచెను. బ్రహ్మాస్త్రిప్రభావము నెఱుగని రాక్షసులు జనపనార త్రాళ్లతో హనుమంతుడుని కట్టివేసినందులకు ఇంద్రజింత్తు చాల చింతనొందెను, ఏలయన. బ్రహ్మాస్త్రబంధము ఇంకొక బంధమువలన విడి పోవును. అందువలన తాను ప్రయోగించిన బ్రహ్మాస్త్రిము నిరుపయోగమై నందులకు ఇంద్రజిత్తు చింతించెను. కాని హనుమంతుడు బ్రహ్మాస్త్రిబంధము నుండి విముక్తుడై నను. స్వకార్య సాధనకై విముక్తుడు కానట్లుగనే యుండెను. అపుడు రాక్షసభటులు త్రాళ్లతోకట్టిన హనుమంతుని వినోదముగ ఇటునటు లాగుకొని పోవుచు పిడికిళ్లతో గ్రుద్దుచు, తిట్టుచు తీసికొనిపోయి నిండు కొలువులోనున్న రావణునికెదురుగా నిలబెట్టిరి. ద్రుమచీరబద్ధుడైన ఆ మహావానరుని చూచి సభాసదులగు కొందరు రాక్షసులు కోపోద్రిక్తులై తమలో

టాము ఇతనిని చంపుడని కొందరును కాల్చివేయుడని కొందరును తిని వేయుడని మఱికొందరును ఇతరులు వినకుండగ పల్కిరి. వికృతాకారులైన రాక్షసులచేలాగుకొని రాబడిన వానరసత్తముని. మహాతేజస్సంపన్నుడగు రావణుడును తేజోబల సమాయుక్తుడగు రావణుని హనుమంతుడును పరస్పరము చూచితివి.

రావణుని కొలువులో హనుమంతుడు :

హనుమంతుడు నిండు పేరోలగమున వేంచేసియున్న తేజోబలయుక్తుడును మధ్యాహ్న సూర్యునివలె దుర్నిరీక్ష్యుడనునగు రావణునిజూచెను. రావణుడు బంగారు కిరీటమును పెట్టుకొని పట్టువస్త్రములను ధరించి రక్తచందనమలదుకొని చిత్ర - విచిత్ర రచనాలంకృతమగు మేనుగల్గి. ఎఱ్ఱనికన్నులతో తీక్ష్ణములగు మహాదంష్ట్రిలు కల్గి వ్రేలాడు పెదవులతో, దశశిరములతో నొప్పుచు స్ఫటిక సింహాసనముపై గూర్చొనియుండెను. కంఠమున మహార్ఘమగు హారమును వేసికొని బాహువులయందు కేయూరములను ధరించి, కాటుకరాశివలె సింహాసనముపై కూర్చొనియుండెను. అలంకృతలగు రాక్షసస్త్రీలు. వింజామరలతో వీచుచుండిరి. మంత్రతణపటువులగు. దుర్ధర. ప్రహస్త మహాపార్శ్వ నికుంభులను నలుగురు మంత్రులు ఆతని సమీపమున తమతమ యాసనములపై గూర్చొనియుండిరి. అతని మహాతేజస్విత్వమున కచ్చెరువంది హనుమంతుడు తనలో తానిట్లనుకొనెను.

" అహోరూప మహోధైర్య మహోసత్త్వ మహోద్యుతి ॥
అహోరాక్షస రాజస్య సర్వలక్షణయుక్తతా ॥
" యద్యధర్మో నబలవాన్ స్యాదయం రాక్షసేశ్వర ః।
స్యాదయంసురలోకస్య సశక్రస్యాపి రక్షితా ॥
5/49/17-18

తా ॥ ఏమియితనిరూపము, ఏమిబలము ఏమి తేజస్విత్వము ః ఇతడు సర్వవిధములగు రాజలక్షణములతో నొప్పుచున్నాడు। ఇతనియందు అధర్మమే లేకుండిన నితడు, సేంద్రమగు దేవలోకమును గూడ రక్షింప సమర్థుడు.

ఇదియే హనుమంతుని మనస్వితత్వము శుద్ధచిత్తత్వము గూడ. శుద్ధచిత్తుడుగనుకనే గుణములను గుణములుగను. దోషములను దోషములుగను గ్రహించి, గుణములను ప్రశంసించి, దోషములను నిరసించినాడు. ఇదియే హనుమన్నిష్ఠమగు శివత్వము.

అట్లు, రావణునిచూచిన తదవుగనే హనుమంతుని చిత్తమున రావణుని గూర్చి తాను వినిన విషయములు మెదలాగెను. అతడిట్లనుకొనెను; ' ఈ రాక్షసుడు చేసిన క్రూరములును కుత్సితములును, దారుణములును నగు కర్మలు దేవదానవులకు గూడ భయంకరములు, ఇతనికి కోపమువచ్చిన ఈ జగమునంతను సముద్రములో కలిపివేయగలడు ఇతడు చేయలేని కార్యమే మియున్నదని యనుకొనెను. రావణుడుగూడ, తనయెదుటనే నిలబడిన పింగాక్షముఖ్యుడగు హనుమంతుని చూచి మహారోషావిష్టుడయ్యెను. మహాతేజస్సమావృతమగు నతని ముఖమండలమును గాంచి సంశయాకులిత చిత్తుడై తనలో తానిట్లనుకొనెను ;—

"నేను పూర్వము కైలాసమున నందీశ్వరుని పరిహసించితిని, అందువలన నాకు కినిసి నన్ను శపించిన నందీశ్వరుడే యీవానర రూపమును ధరించి లంకావిధ్వంసమునకై వచ్చినాడా, లేక మహా పరాక్రమ యుక్తుడగు బాణుడు, ఈ రూపమున నన్ను పరీక్షించుటకు, వచ్చినాడా ? యని తలపోసి తన మంత్రియగు ప్రహస్తుని తనయెదుట నున్న వానరుని సమాచారమును, అతడు లంకకువచ్చిన కార్యమును రాక్షసులతో తలపడుటకుగల కారణములను అడుగుమని యాజ్ఞాపించెను.

ప్రహస్తుడు హనుమంతు నిట్లడిగెను. నిన్ను ఇంద్ర, వరుణ, యమ కుబేర విష్ణ్వాదులలో నెవ్వరు పంపిరోతెల్పుము. సత్యముచెప్పుము. భయపడకుము నీ రూపము మాత్రమే వానరము. కాని, నీ తేజము వానరులలో నుండుట యసంభవము, నిజముచెప్పిన విడచిపుత్తుము. అనృతమాడిన ప్రాణములతో బయటపడవుసుమా, నీవు లంకకు ఎందుకు వచ్చితివి ? రాక్షసుల నెందుకుచంపితివి ?

హనుమంతుని సమాధానము. మీరనుకొనిన విధమున నేను దిక్పాలురు గాని, విష్ణువుగాని పంపగా రాలేదు. నేను జన్మచే వానరుడను. రాక్షసేశ్వరుని చూచు కోరికతో ప్రమదావనమును నాశముచేసితిని, నన్ను గ్రహించుటకు వచ్చిన రాక్షసవీరులను ఆత్మరక్షణమునకై వధించితిని. పితామహవరమునుబట్టి బ్రహ్మాస్త్రబంధమును స్వచ్ఛందముగ వరించితిని. నేను ఏయస్త్రముల చేతను బంధించబడను. నేనొక రామకార్యమునుద్దేశించి లంకకువచ్చితిని.నేను అమిత తేజస్కుడగుశ్రీరాముని దూతను. నాకు ప్రభువును నీకు భ్రాతృసముడును నగు సుగ్రీవుడు నిన్ను కుశలమడిగినాడు ధర్మార్థయుక్తమగు వానరరాజగు సుగ్రీవుని సందేశము వినుము। దశరథుడను మహారాజు జ్యేష్ఠపుత్రుడగు రాముడు భార్యయగు సీతతోను. సోదరుడగు లక్ష్మణునితోను: పిత్రాజ్ఞపై దండకలను ప్రవేశించెను. శ్రీరాముడు మహాతేజస్వి. ధర్మమార్గగామి వైదేహుడగు జనకుని కూతురగు సీత. యతనిభార్య. ఆమె జనస్థానములో తనభర్తతో వసించు సమయమున తప్పిపోయినది. ఆమెను వెదకుచు రామలక్ష్మణు లిర్వురు ఋష్యమూకమునకు వచ్చినారు. వానరరాజగు సుగ్రీవుడు సీతాన్వేషణకార్యమునందు శ్రీరామునకు సాయము చేయుదునని బాసచేయగా, రాముడు దానికి బదులుగ. కపిరాజ్యమును వాగ్దానముచేసి యున్నాడు. వానరరాజగు వాలిని. నీవు, పూర్వమే యెఱుగుదువు. ఆ వానరవీరుని శ్రీరాముడు ఒక్కబాణముతో వధించి వానర రాజ్యమునందు. తన మాటప్రకారము రాజ్యాభిషిక్తుని చేసినాడు. సుగ్రీవుడు గూడ తానిచ్చిన మాటకుకట్టుబడి సీతాన్వేషణమునకై వాయువేగయుక్తులగు కోట్లాదివానరవీరులను. భూమికి నాల్గుచెఱగుల పంపినాడు నేను మారుతుని ఔరసపుత్రుడగు హనుమంతుడను వానరుడను. సీతను వెదకుచు, నూరుయోజనముల దక్షిణోదధిని దాటి. లంకలో ప్రవేశించి, లంకానగరమునంతను వెదకివెదకి- నీ గృహమునకు సమీపముననే యున్న ప్రమదావనమున, జానకిని చూచితిని. నీవు ధర్మాఽధర్మములను బాగుగ నెఱిగినవాడవు. మహాతపః పరిగ్రహుడవు. అట్టినీకు పరదారలను బంధించియుంచుట అనుచితము. నీవంటి బుద్ధిమంతులు బహ్వాపాయ యుక్తములును. మూలవినాశకములునగు దుష్కర్మలను చేయరాదు, రామకోపానువర్తులును లక్ష్మణముక్తములును నగు బాణముల వేగమును. దేవాఽసురులలో నెవ్వరును

సహింపశక్తులుగారు. రాఘవునికి అపరాధమాచరించి. యెప్పుడును ఈభూమిపై సుఖముగ మనజాలడు. కనుక త్రికాల హితమును, అర్థయుక్తమును. ధర్మ యుక్తమును నగు నామాటను మన్నించి, సీతాదేవిని శ్రీరాముని కప్పగించి, సుఖముగనుండుము, సీతాదేవిని దర్శించితిని. దుర్లభమైన నీదర్శనము చేసితిని. ఇక ముందు చేయవలసిన కార్యభారము శ్రీరామునిది. సీత నీగృహమున నన్యాయముగ బంధించబడి మహాశోకము ననుభవించినది. ఆమెను అబలగ తలంపకుము, నీ మరణమునకై నీ యింటనున్న ఐదుతలల త్రాచుపాముని ఎఱుగుము. ఆమెను నాశముచేయుట, దేవాసురులకు గూడ నసాధ్యము, మహాతపముచేసి మహైశ్వర్యము నార్జించితివి, అట్టి యైశ్వర్యమును, జీవితమను శ్రీరామునితో విరోధముపెట్టుకొని నాశమొనరించు కొనకుము. నీవు దేవతలకవధ్యుడ వగుటకు కూడ కారణము నీ మహాతపస్సేగదా! కాని వానరుడగు సుగ్రీవుడు, నీవు ఎవరిచే చావురాకుండగ వరమును పొందితివో వారలలోని వాడుకాడు, మానవుడగు రాముడుగూడ నట్టివాడే. మఱియానర-వానరుల బారినుండి నీవెట్లు ప్రాణములను రక్షించు కొందువు? నీవింతవఱకును ధర్మఫలమను భవించితివి, కాని నీవు చేసిన యధర్మము, నిన్ను విడువదనియు, ఆ యధర్మఫలముగూడ నచిర కాలములోనే చవిచూడ గలవని చెప్పుచు రావణునికి హితము నుపదేశించును ;-

" నతు ధర్మోవసంహార దుధర్మఫలం సంహితమ్ ।
తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాఽధర్మనాశనః ॥
" ప్రాప్తం ధర్మఫలంతావత్, భవతానాత్ర సంశయః ।
ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే ॥
(5/51/28-29)

(తా ॥ ప్రబలమైన అధర్మ మాచరించినవాడు. కొంత ధర్మసంగ్రహముచేసినను అధర్మఫలమే యనుభవించును. కాని యధర్మముకంటె ప్రబలమైన ధర్మము చేసినచో, అధర్మమునశించ వచ్చును ॥ నీ వింతవఱకును ధర్మఫల మనుభవించితివి. సంశయములేదు. కాని చాల యధర్మమునుచేసితివను సత్యమును మఱువకుము. కనుక, చేసిన యధర్మఫలమును గూడ

తంరలోనే యనుభవింపగలవు॥ అని ధర్మాధర్మ ఫలవ్యవస్థను వివరించి యింకను హనుమంతుడిట్లు పల్కెను ;—

జనస్థానములో రాముడు చేసిన రాక్షస సంహారమును. వాలి వధను రామ—సుగ్రీవ సఖ్యమును, బాగుగ నాలోచించి, నీవు, ఏవిధముగ నాచరించిన నీకును, నీవారలకును మేలగునో తెలిసికొని ప్రవర్తింపుము. నీవుచేసిన పాపములకొఱకు దండించుటకు రాముడే రానవసరములేదు. నేనే చాలు' నీ చతురంగసేనను, నిన్నూ నాశముచేయుటకు; కాని రఘునాథుడు. కపుల్క పీరులముందు; సీతను బలాత్తుగ నపహరించిన దుష్టులను స్వయముగ వధించెదనని ప్రతిజ్ఞచేసి యున్నాడు శ్రీరాముని పరాక్రమమును గూర్చి నేను చెప్పు పత్యమును వినుము ;—

"అపకుర్వ న్హిరామస్య సాక్షాదపి పురందరః।
నసుఖం ప్రాప్నుయాదన్యః కింపున స్త్వద్వి ధోజనః॥ (5/33/51)

(తా॥ రామునికి అపకారముచేసిన వాడు సాక్షాత్తు పురందరుడేయైవను సుఖముగ మనజాలడనిన, ఇక నీవంటి వాని (అధర్మాత్ముని) లెక్కయేమి ?

నీవు సీతగ నే దేవిని చూచుచున్నావో, ఆమె లంకానగరమును సర్వ వినాశము గావించుటకు లంకకు తీసికొనిరాబడిన "కాలరాత్రి'యని యెఱుగుము అట్టి కాలపాశము, నీ భుజస్కంధాన లగ్నమైయున్నది, సీతయొక్క పవిత్ర తేజముచే దగ్ధమై, రామకోప ప్రదేపితమైన లంకానగర మంతయు దగ్గమైపోవుచున్నట్లు నేను చూచుచున్నాను. కనుక హితాఽహితముల నాలోచించుకొని, వ్యర్థముగ, మిత్ర, జ్ఞాతి, సుత, భ్రాతృ, దార, భోగాదులను నాశమొనర్చుకొనకుము, ఆత్మవినాశమును రామునితో వైరము వహించి తెచ్చిబెట్టుకొనకుము. రామదాసుడను, రామదూతయునునగు నేను చెప్పు హితమును వినుము. శ్రీరాముని సాధారణమనుష్యునిగ నెంచకుము ; విష్ణుతుల్య పరాక్రముడగు శ్రీరామప్రభుని యతిలోకశక్తి - సామర్థ్య ములను, వినుము :—

" సర్వాంల్లోకాన్సుసంహృత్య సభూతాన్స చరాచరాన్ ॥
పునరేవతథాస్రష్టుం శక్తోరామో మహాయశాః॥
" దేవాసురనరేంద్రేషు పతత్త్రిషుచ సర్వత ః।
సర్వత్రసర్వభూతేషు సర్మకాలేషు నాస్తి, సః॥
" యో రామం ప్రతియుద్ధ్యేత విష్ణుతుల్య పరాక్రమమ్।
సర్వేలోకేశ్వర స్యేహ కృత్వా విప్రియమీదృశమ్॥
రామస్వరాజ సింహస్య దుర్లభం తవజీవితమ్॥ (5/5/39-42)

(తా॥ శ్రీరాముడు సర్వభూత సహితములును చరాఽచరాత్మకము లును నగు సర్వలోకముల నవలీలగ త్రుంచి, తిర్గి ఉన్నవానిని ఉన్నటుల సృజింపగల మహాశక్తిసంపన్నుడు. మహాయశస్వి.

దేవాఽసురనరేంద్రులలో గాని, పతగపక్షులలోగాని, మఱి యేయితర భూతములయందు గాని, ఇక్కడగాని, మఱియొకచోటునగాని. ఇప్పుడుగాని, మఱియొకప్పుడుగాని, ఏకాలమునందును విష్ణుతుల్య పరాక్రముడగు శ్రీరాముని యుద్ధములో నెదిర్చగలవాడు లేడని నమ్ముము. సర్వలోకేశ్వరుడును, రాజ సింహుడును నగు రాముప్రభువున కింత యప్రియమును చేసి, నీవు జీవించుట దుర్లభమని యెఱుగుము. అంతేగాదు, దేవదైత్య గంధర్వ విద్యాధర, నాగ యక్ష వీరులలో నెవ్వడును రాముని యెదుట యుద్ధమున నిలబడజాలరని నమ్ముము. అంతేగాదు, బ్రహ్మ. రుద్రేంద్రాదులు గూడ శ్రీరామునితో యుద్ధ మున తలపడుటకు సాహసింపజాలరని పల్కుచు నిట్లుపదేశించెను :-

"బ్రహ్మస్వయంభూ శ్చతురాననో వా రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకోవాః
ఇంద్రోమహేంద్రస్సుర నాయకోవాస్థాతుం నశక్తా యుధి రాఘవస్య॥

(తా॥ చతురాననుడును స్వయంభువగు బ్రహ్మయేగాని, త్రిపురాంత కుడును త్రినేత్రుడగు రుద్రుడేగాని, సురనాయకుడు, మహేంద్రుడను విఖ్యాతి నొందిన ఇంద్రుడేగాని, రాఘవునియెదుట యుద్ధమున నిలబడజాలరు.

హనుమంతుని కర్ణశల్యాయమానము లగు ఈ పలుకులువినీ, క్రోధమున ఒడలుమఱచి, హనుమంతుని వధింపుమని లంకేశ్వరు డాజ్ఞాపించెను. అప్పుడు విభీషణుడు రావణునకు, అతని, శాస్త్రవిపశ్చిత్త్వమును లోకవిఖ్యాతిని గుఱుతుచేసి శాస్త్రగర్హితమగు దూతవధనుమాని హనుమ యవినయమునకుతగిన మఱియొక శిక్షయేదయిన విధింపుమని పదేపదే విజ్ఞప్తిచేసెను. అదియును గాక, ఇతనిని వధించిన రామలక్ష్మణులకు సీతజాడను తెల్పువారుండరు. అందువలన వారిచటికి వచ్చుయవకాశమే లేకపోవును వారిచటికి వచ్చిన వారిని వధించినచో రావణుని పరాక్రమము లోకమునకు వెల్లడియగును. వారిని వధించిన సీతగూడ అతనికి శాశ్వతముగ దక్కును, అని విభీషణుడిచ్చిన ఈ సలహా రావణునికి నచ్చెను. విభీషణుడు దూతకు విహితములైన వివిధ దండములను గూర్చి యిట్లు తెలిపెను :-

" వైరూప్య మంగేషు కశాభిఘాతో మౌండ్యం తథాలక్షణసంనిపాతః।
ఏతాన్హి దూతే ప్రవదంతి దండాన్వధస్తు దూతస్యన నశ్శ్రుతోఽస్తి॥
(5/52/15)

(అనగా, అంగవైరూప్యము, కొరడాలతో గొట్టుట. బుఱ్ఱగొరిగి యవమానించుట. దాస్యచిహ్నములను శాశ్వతముగ అపరాధికివేయుట మున్నగునవి. దూతలకు విహితములగు దండములు, దూతవధశాస్త్రములలో నున్నట్లు మేము వినలేదు,

దానిపై రావణుడాలోచించి, క్రోతులకు తోకచాలయిష్టము గనుక, దానికి నిప్పంటించుడని యాజ్ఞాపించెను, హనుమంతుడు అంగవైరూప్యము కల్గినందులకు సిగ్గుపడుటయేగాక, పరమదైన్యమునంది, జ్ఞాతి, మిత్ర, బంధువుల పరిహాసమునకు పాత్రమై నిత్యము కృశించుగాక, యనిపల్కెను,

లంకాదహనము :

రావణుని యాజ్ఞనువిని కోపకర్కశులగు రాక్షసులు హనుమంతుని తోకకు ప్రాతగుడ్డలు చుట్టుట మొదలిడిరి. హనుమంతుడు తనశరీరమును

బాగుగ పెంచుటమొదలిడెను. రాక్షసులు లంకలోనున్న ప్రాతగుడ్డలన్నియు తెచ్చి- యెట్టులో హనుమంతుని తోకకు చుట్టి తైలముతో తడిపి నిప్పు అంటిం చిరి. హనుమంతుడు రోషతామ్రాక్షుడై, ఆ మండుచున్న తోకతో రాక్షసులను చావ మోదెను. వారందరు, తిర్గి యతికష్టముతో యతనిని బంధించి శంఖ భేర్యాదివాద్యములు వాయించుచు లంకవీధులలో నతనిని త్రిప్పసాగిరి, ఆ రాక్షసులచే లంకానగరమంతయు త్రిప్పబడుచు మండుచున్న తోకగల హను మంతుడు లంకానగరగుప్తి ప్రకారమును, కీలకస్థానములను దర్శించెను. రాక్షసుల కలకలమువిని, సీతను కావలాకాయు రాక్షసస్త్రీలు, హనుమంతుని తోకకు నిప్పంటించి పురవీధులలో త్రిప్పుటలు చూచి, మను సంతోషముతో సీతకీవార్త తెలిపిరి. అపుడు సీత, యగ్నిదేవుని హనుమంతుని దహింపవల దని ప్రార్థించెను, ఆమె ప్రార్థనకు ప్రసన్నుడైన వహ్ని ప్రళయానలమువలె మండుచున్నను హనుమంతునికి మాత్రము తుషారచయ శీతలత్వమును కల్గిం చెను. ఈ మార్పును గమనించి ఇది సీతాదేవి తపోమహిమ, శ్రీరాముని పరా క్రమము, మఱియు తనతండ్రితో అగ్నిదేవునికి గల మైత్రివలన జరిగియుండ వచ్చును, అని మారుతి భావించెను.

ఇంక వానరులు తనపట్ల చూపిన దౌష్ట్యమునకు తగిన ప్రతీకారం మాచ రించవలెనని సంకల్పించి. హనుమంతుడు తనను బిగించిన త్రాళ్లను, ఒక్క సారిగాత్రెంచి. ఘోరమగు నాదముచేసి, నింగికెగిరి, లంకానగర పురద్వార ముపై కూర్చుండెను, తనకు సంతాపముకలుగ చేయకుండగ. మహాజ్వాల లతో మండు అగ్నిదేవునకు గూడ తర్పణముచేయుట న్యాయ్యమని తలంచి ప్రదీప్తమగు లాంగూలముతో హనుమంతుడు ప్రహస్త మహాపార్శ్వ వజ్ర దంష్ట్రి. శుక, సారణ, ఇంద్రజి జంబుమాలి. సుమాలి, కుంభకర్ణ ,మక రాక్ష, నరాంతక, కుంభ, నికుంభ, విద్యుజ్జిహ్వ ద్విజిహ్వాది రాక్షసవీరుల భవనములకు, వరుసగా ఒక్కొక్కదానికి నిప్పంటించి లంకలోగల గృహ ములపై నెగురుచు, ఒక్కొక్క యింటికి నిప్పంటించుచు, నగరమునగల భవనములతోపాటు, ఉద్యానవనములను గూడ దహించి రావణ గృహము నకు గూడ నిప్పంటించెను. లంకలోని గృహములన్నియు పెటపెట ధ్వను

లతో రుద్రుని నేత్రాగ్నిచే త్రిపురములు దగ్ధములైనట్లు, పైకెగయుజ్వాలలతో దగ్ధముకాజొచ్చెను ఆ భవనములలో నివసించు, స్త్రీ, బాల, వృద్ధులు, తదితరులును, హాహాకారములిడుచు ప్రాణములు దక్కించుకొనుటకై యిటు-నటు పారిపోవుచు విలపింపసాగిరి. లంకానగరమంతయు నీవిధముగ దారుణముగ కాలిపోయినందులకు మిక్కిలియానందము పొందినను, తనయ సమీక్ష్యకారిత్వమును స్మరించుకొని హనుమంతుడు భయభ్రాంతుడాయెను. ఈ లంకాదహనమునకు సీతగూడ ఎటియై దగ్ధమైనచో ఏమిచేయవలెను. ఎంత పొరపాటుచేసితిని; సీతనుగూడ దగ్ధమొనర్చిమూలఘాతముచేసిన. నా కపిస్వభావము నేమనవలెనని. పరి పరివిధముల తన్ను, తాను నిందించుకొనసాగెను.కాని యీవిధముగనతడు దుఃఖించు సమయమున నతనికి శుభనిమిత్తములు తోచుటచే కొంచెమాశ్వస్థుడై తిరిగియిట్లనుకొనెను: తన పాతివ్రత్య తేజముచే రక్షితురాలగు సీతను దహింపగలశక్తి యగ్నికెక్కడిది: ఆ తల్లి సుకృతము వలన, శ్రీరామ ప్రభావమువలననే గదా, నన్నీవహ్ని దహించకుండగ నున్నాడని తలపోసి తనలో తానిట్లనుకొనెను ;—

" అథవాచారుసర్వాంగీరక్షితా స్వేన తేజసా।
న నశిష్యతి కల్యాణీ నాఽగ్నిరగ్నౌ ప్రవర్తతే। 5/55/22
" త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతాచయా:
రామస్య చమనః కాంతాసా కథం వినశిష్యతి॥ (5/55/25)

భరతలక్ష్మణ శత్రుఘ్నులచే నారాధించబడు దేవతారూపిణి యును, శ్రీరాముని పత్నియునగు సీత అగ్నిద్వారా నశింపజేయబడుట యసంభవము అమితతేజస్వియగు శ్రీరామప్రభువునకు భార్యయును స్వచారిత్రాభిగుప్త యునునగు సీతాదేవిని, అగ్ని దహించుటయా? స్పృశింపజాలదుగూడ మనస్సును దిటవుపరచుకొనెను, ఆమెను దహించకుండుటకు గల కారణములను హనుమంతుడింకను ఇట్లూహించెను :—

" తపసాసత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి।
అసౌవినిర్దహే దగ్నిం నతామగ్నిః ప్రధక్ష్యతి॥ (5/55/24)

( తా ॥ ఆమెలోగల తపోనిష్ఠవలన, ఆమెపాలించు సత్య వచనము వలన, భర్త యందామెకుగల యనన్య నిష్ఠవలనను, ఆమె యగ్నినిదహించ గలదు గాని. అగ్ని యోమెను దహింపఁజాలదు, ఈ విధముగ సీతాదేవి చారిత్రశీలములను తపోనిష్ఠను. పాతివ్రత్యతేజమును గూర్చి హనుమంతుడు తలపోయుచు, ఆకాశచారులగు చారణులు హనుమంతుని లంకాదాహరూప మైన అద్భుతకర్మను ప్రశంసించుచు, లంకలోని పెద్దపెద్ద భవనములు. ఉద్యానాదులు దగ్ధమై పోయినను, జానకి మాత్రము దగ్ధురాలుగాక యక్షత ముగ నుండుట నాశ్చర్యమని, పల్కిన పలుకులువిని, సీత యక్షతముగ నున్నందులకు హనుమంతుడమితానందము నొంది ప్రత్యక్షముగ నాదేవిని దర్శించిన తరువాతనే తిర్గి పోవలెనని నిశ్చయించుకొనెను. తన లాంగూలా గ్నిని సముద్రములో దూకియార్చెను. తదనంతరము. అశోకవనములో నక్షతముగనున్న సీతను దర్శించి, యామెను తిర్గిపోవుటకు సెలవువేడెను. ఆమెతిర్గి తన దుఃఖగాథనంతయు విన్పించి తనను శ్రీరాముడు, వెంటనే లంకకువచ్చి. యీదుఃఖసాగరము నుండి, ఉద్ధరించునటుల చేయుమని దీన ముగ వెడుకొనెను, అపుడు హనుమంతుడు బహువిధముల నోదార్చి చివ ఱకు ఇట్లుపల్కెను :--

" క్షిప్రమేష్యతికాకుత్ స్థోహర్యృక్షప్రవరై ర్యుత ః
యస్తే యుధివిజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి ॥ (5/56/21

ఓ దేవీ ! కాకుత్‌స్థుడు హర్యృక్ష ప్రవరులతోసహ వచ్చి నీకు దుఃఖ ముకల్గించిన రాక్షసులను యుద్ధమునజయించి, నీశోకమును పోగొట్టగలడు నా మాటలునమ్ముమని పల్కి ఆమెకభివాదముసేసి లంకనుండి తిర్గి స్వదేశము నకు పోవుటకై సముద్రతీరమునకు చేరుకొనెను.

హనుమంతుని తిరుగు ప్రయాణము ;

హనుమంతుడు సీతాదేవియొద్ద సెలవుగైకొని దక్షిణసముద్ర తీరమున గల 'అరిష్టపర్వత' ము నెక్కియక్కడనుండి ఉత్తరతీరమునకు పోవుటకై సముద్రముపైకి ఎగిరెను, అతని పాదపీడనమున కాపర్వతము భూమితో

సమాన మాయెను. ఆతడు జాగా వేగముతో సముద్రపై నెగురుచు మహేంద్ర గిరి సమీపించుట తోడనే సింహనాదము చేసెను ఆతని నాదమును విని ఉత్తర మున నతనికై యెదురుచూచున్న వానరులందరు అమితానందము నుండి యతడు కృతకృత్యతనందియే తిర్గివచ్చు చున్నాడని యెరిగి కందమూల, ఫలములు హస్తములతో గ్రహించి యతనికి స్వాగతము పల్కిరి. హనుమంతుడు ఉత్తరము నదిగి జాంబవదాదులకు నమస్కరించి వారిచేత వారిసిత సత్కార ములనంది, మేఘ గంభీరస్వరమున నిట్లు పల్కెను. "అశోక వనికాసంస్థా దృష్టా సాజ కాత్మజా" యని ముందు సీతను దర్శించితినని చెప్పి, వానరుల యుత్కంఠోపశమనముగావించి ఆ తరువాత, తాను మహేంద్రగిరి నుండి బయలుదేరిన దాదిగ, తిర్గి వచ్చిన దనుక జేరిన సకలవృత్తాంతమును సంగ్ర హముగ వినిపించెను ఆ తరువాత వానరులందరు, హర్షధ్వానములు చేసికొనుచు కిష్కింధకు మరలిరి కిష్కింధకు సమీపమున గల మధువనము దగ్గరకు రాగానే వారందరకు మధుపానము చేయవలెనను బుద్ధిపొడమెను. వారంగదుని యనుమతిని వేడిరి. హనుమంతుడు అంగులకంగీకరించెను. అపుడు వారందరు వనపాలురు వారించినను, నరకు చేయక, మధువనమును ప్రవేశించి, యదే చ్ఛముగ మధువును తావి ఆ మధువన రక్షకుడగు దధిముఖుడు, తనయును చరులతో వారిని వారింప బోగా, అతనిని చావమోది, ఆవనము నంతను ఓటి త్సము చేసిరి అపుడు దధిముఖుడు రోషముతో ప్రస్రవణ గిరికి పోయి వాన రుల యవినయమును, వానర రాజగు సుగ్రీవునికి నివేదించెను. అపుడు లక్ష్మణుడు గూడ సుగ్రీవుని సమీపముననే ఉండెను. సుగ్రీవుడు దధిముఖుడు వానరులను గూర్చి చేసిన ఫిర్యాదును. లక్ష్మణునకు తెల్పి వారు కృతకృత్యులు గానిచో వారే యవినయమాచరింపరను, నిర్ణయమునకు వచ్చి వారి నేమియు యనకుండగ, తానువెంటనే ప్రస్రవణగిరికి, మధువనములో గల వానరుల నందరిని, రమ్మని చెప్పుమని దధిముఖుని కాజ్ఞయిచ్చెను. దధిముఖుడు శర వేగమున పోయి, యంగదాదులకు, సుగ్రీవుని యాజ్ఞను వినిపింప, వారు కిలకిలా రావములు చేయుచు, మీదు వనమునుండి యెగిరి ప్రస్రవణ గిరిపైన సుగ్రీవుని చెంత వాలిరి. అవుడు మహాబలము వగు హనుమంతుడు రాఘవునికి దండ ప్రణామము లాచరించి, సీతాదేవి నిరపాయముగ లంకలో నున్నదని నివేదించెను.

అమృతోపమమైన ఈ వార్త విని రామ-లక్ష్మణులు, వానరరాజగు సుగ్రీవుడు, అమితానందము చెందిరి. ముందుగనే హనుమంతుని యందే కార్యసిద్ధిని గూర్చి నిశ్చితమతియగు సుగ్రీవుని వైపు లక్ష్మణుడు సబహుమానముగా చూచెను. ఆ తరువాత శ్రీ రాముడు హనుమంతుని వైపు సబహుమానముగ దృష్టిని బరుప, హనుమంతుడు చేతులు జోడించి తాను మహేంద్రగిరి నుండి శత యోజన విస్తీర్ణమగు మహోదధిని దాటి, లంకలో ప్రవేశించి, లంక యంతయు వెదకి సీతను గానక, చివరకు, రావణుని ప్రమదా వనమగు అశోక వనమున సీతను దర్శించిన వృత్తాంతమును, రాక్షస స్త్రీల వేధింపులను రావణుని వలన, ఆమె, నిత్యముపొందు, తర్జన-భర్జనలను, ఆమె దైన్యమును యధావత్తుగ తెల్పి, తానా దేవిని యోదార్చిన విధమును గూడ తెల్పి, తాను శ్రీ రాముడిచ్చిన యంగుళీయకమును సమర్పించితిననియు, ఆమెను ప్రత్యభిజ్ఞానమును శ్రీ రామునికి సమర్పించుట కేదియేని, ఈయ వలసినదని వేడగ చిత్రకూట పర్వతమున తాము నివసించు సమయమున, ఇంద్ర పుత్రుడగు జయంతుడు, కాక రూపమును ధరించి తనయెడ యాచరించిన యవినయమును దానికి శ్రీరాముడు విధించిన దండ వృత్తాంతమును; మనశ్శిలా తిలక వృత్తాంతమును తెల్పి, తన వెంతగల సీతాదేవి రామునికి సమర్పింపుమని యిచ్చిన చూడామణిని సమర్పించెను. ఆ చూడామణిని హృదయమునకు హత్తుకొని శ్రీరాముడు కడుదీనముగ విలపించెను. శ్రీరాముడు, సీతాదేవి, తనకేమి చెప్పుమనినదని గ్రుచ్చి గ్రుచ్చియడుగ, ఉచితజ్ఞుడగు హనుమంతుడు ఆమె దైన్యమును, వియోగ వ్యధను వివరించుచు ఆపతి ప్రాణయగు సీతాదేవి, రామునికి చేసిన విన్నపమును ఈ విధముగ విన్పించెను:

"యథాచ సమహా బాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాః బుసంరోధాత్త్వం సమాధాతు మర్హసి॥

"ఇమంచ తీవ్రం మమశోకవేగం రక్షోభి రేభిః పరిభర్త్సనంచ।
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం శివశ్చతేఽధ్వాస్తు హరిప్రవీర॥

(సర్గ 67, సుందరకాండ)

(తా॥ ఓ వాయునందన, మహాబాహువగు హనుమంతుడు ఈ దుఃఖాంబుధి నుండి శీఘ్రమే యెట్లుద్ధరించునో, ఆ విధముగ శ్రీరాముని ఒప్పింపుము.

హాఁవీరా, నాతీవ్రశోకమును. రాక్షసుల బెదరింపులను శ్రీరామునకు విన్పింపుము. నీ మార్గము మంగళమయమగుగాక :

ఈ విధముగ అతని తిరుగు ప్రయాణము మంగళమయమగుగాక, యని యాశాసించి, వెంటనే రామ-లక్ష్మణులు లంకకువచ్చి. దుష్టుడగు లంకేశ్వరుని, అతనియనుచరులను శిక్షించి తనను వెంటనే రక్షించుటకు తగిన యుద్యోగముచేయునట్లు. చేయుమని, నాతోచెప్పినదనియును. తానావెను, ఆమె ప్రతిసందేశమును వినినవెంటనే శ్రీరామ లక్ష్మణులు, సుగ్రీవుడు విశాలమగు హర్యృక్ష సైన్యముతోవచ్చి లంకేశ్వరుని వధించి ఆమెనుద్ధరించ గలరని. ఓదార్చితి ననియును చెప్పి యూ అకుండెను.

## హనుమంతుని శివ స్వరూపము

హనుమంతుడు ప్రాకృత వానరుడుగాదని, దివ్యాంశసంభూతుడని, వాల్మీకి, వ్యంగ్యమర్యాదలోను, వాచ్యముగాను, తెల్పియున్నాడు. అతని విక్రమములు శత్రుదలన నిర్వర్తకములు, ధర్మపథ ప్రవర్తకములు, కామాద్యరిషడ్వర్గ మత్తమాతంగ కుంభ విస్ఫోటకములు, భక్తజనాభయఙ్కరములు. లోకకల్యాణ సంధానసమర్థములు. అతని బ్రహ్మచర్యనిష్ఠ, శీలసౌందర్యము, త్యాగనిరతి నిష్కామసేవ. ప్రభుభక్తి. ఆత్మవిశ్వాసము, విషయవితృష్ణ-బలవీర్యములు, నిర్భయత్వము, కార్యతత్పరత, విశ్వమున కాదర్శభూతములు. ఆతడు, మృత్యుభయ, కామభయ. భూతప్రేత భయాది సకలభయములకు ధూమకేతువు. భక్తి, జ్ఞాన, వైరాగ్య, అభయాది దివ్యగుణ సంపత్ప్రదాత, దీనజనావనదక్షుడు. నిష్కలంకుడు. మహాధీరుడు, మహావీరుడు గూడ.

అందువలననే శివ, స్కాంద, వాయ్వాది మహాపురాణములయందు, ఆయన శివస్వరూపుడుగను. రుద్రాంశసంభూతుడుగను వర్ణించబడియున్నట్లు, పూర్వమే నిరూపించియుంటిమి. ఈ నిబంధమునందు, హనుమంతుని శీల

చారిత్రగత సౌందర్యముతో బాటుగ, నతని శివతత్త్వమును. రుద్రాంశసము ద్భూతత్వమును వివరించెదము.

ఆత్మోపలబ్ధికిలేక సత్యసాక్షాత్కారమునకు, శివదృష్టితోబాటు, త్రికరణ ములయందు సత్యనిష్ఠగూడ ఆనివార్యము, ఈ యనంత విశ్వములోని, యణు వణువు నుండి, తొంగిచూచు, అనంతసౌందర్యనిధానమగు పరమేశ్వరుని సౌందర్యాంశమును గ్రహించగల్గిననాడు గాని, సాధకుడు. ఔపనిషదసిద్ధాంత భూతమైన "సర్వత్ర సమదర్శన" మనుసిద్ధిని బడయజాలడు, ఇట్టి సమదర్శ నముగల్గిన మహాత్ముడు మాత్రమే, యవిద్యా. కామ, కర్మమయమగు సంసా రము నుండి. తనయాత్మను విముక్తమొనరించు కొనగల్గును. ప్రాకృతిక దృష్టితొలగి, సర్వత్ర సమదర్శనరూపమగు, అప్రాకృతికదృష్టి లేక దివ్య దృష్టిని పొందగల్గిన మహాత్ముడే యాత్మానందానుభవమున కధికృతుడు,

బృహదారణ్యకములోని ఈ మంత్రమును చూడుడు ;—

"తదేతద్బ్రహ్మపూర్వ మన పర మనన్తర మబాహ్యమయమాత్మా
బ్రహ్మసర్వానుభూరిత్యను శాసనమ్ ॥" (6-2/ బ్రా-5/మం : 19 )

(తా ॥ ఈ బ్రహ్మ కారణ, కార్యరహితము. విజాతీయద్రవ్యరహితము, బాహ్యవస్తురహితము ఆ నిరంతరమగు బ్రహ్మయే యీయాత్మ. అనగా ద్రష్టయును, శ్రోతయును, మన్తయును, బోద్ధయును, సర్వానుభవితయును నగు ప్రత్యగాత్మయే ఆ యాత్మ. ఇదియే సర్వవేదాంతోపదేశము, కైవల్యో పనిషత్తు "సర్వత్రసమదర్శన" మనుసిద్ధిని పొందుటయే యాత్మ సాక్షాత్కా రమను నామాంతరముగల బ్రహ్మసాక్షాత్కారమని, యసందిగ్ధముగ ప్రవ చించుచున్నది, ఈ పంక్తులుగూడుడు ;—

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని ;
సంపశ్యన్ బ్రహ్మపరమం యాతినాన్యేనహేతునా ॥

(తా॥ ఆత్మను సర్వభూతములయందును, సర్వభూతములను ఆత్మ యందునుచూచుట యను సమ్యగ్దర్శనము ద్వారానే పరబ్రహ్మప్రాప్తి కల్గును.

ఈ సమదర్శనరూపమగు సాధనము కంటె పరబ్రహ్మ ప్రాప్తికి మఱియొకటి యేదియు కారణముగాదు.

మనువుపై విషయమునేస్పష్టీకరించుచు ఈ క్రింది విధముగ 'సమదర్శన' స్వరూప వివరణముతో బాటుగ, సమదర్శనమును "ఆత్మయాగ" మనియు, తత్ఫలము. స్వారాజ్యము. అనగా స్వరాడ్భావము. (అనగా స్వాతంత్ర్యము) అ నియును పేర్కొనియున్నాడు ;--

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని।
సమంపశ్యన్నాత్మ యాజీస్వారాజ్యమధిగచ్ఛతి ః
(మ 11 స్మృ॥ 12/91

(తా॥ ఆత్మను సర్వభూతములయందును ; సర్వభూతములను. ఆత్మయందును చూచుటయే సమదర్శనము. ఈ సమదర్శనమునే ఆత్మయాగమందురు. ఇట్టియాత్మయాజి సమదర్శనరూపమగు యాగఫలితముగ 'స్వారాజ్య' సిద్ధిని పొందును.

* గీతలుగూడ పైవిషయమును సమర్థించియున్నవి.

ఇట్టి సమదర్శన సిద్ధికి యోగముగ, అనగా ఉపాయముగ. సర్వత్ర ఆత్మసౌందర్యదర్శన మంగీకరించబడినది. సర్వత్ర సౌందర్యదర్శనసిద్ధి, భావనాయోగ సాధ్యము. జాగతికమైన భావనను, ఆత్మోన్ముఖ మొనర్చుటయే యీభావనాయోగము, లేక సగుణోపాసనము. ఈ సగుణోపాసనమున, ధర్మపాలన మనివార్యము. 'ధర్మము' అనగా. అధర్మవర్జన పూర్వకముగ, ధర్మమును పాలించుట. అధర్మపరిహారమునకు రుద్రదృష్టియు, ధర్మపాలనమునకు శివదృష్టియు సపేక్షితములు. అందువలననే సగుణబ్రహ్మయందు గూడ ఈ రెండుదృష్టులు ఉన్నట్లు వర్ణించబడుచున్నది. గీతలయందు భగవదవతార హేతువులీక్రిందివిధముగ పేర్కొనబడియున్నవి :—

---

* "సర్వభూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని।
ఈక్షతేయోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥
(భ॥గ॥ 6 29)

"యదా యదాహి ధర్మస్యగ్లానిర్భవతిభారత।
అభ్యుత్థానమధర్మస్యతదాత్మనం సృజామ్యహమ్॥

"పరిత్రాణాయసాధూనాం వినాశాయచదుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥
(భ. గీ॥ 4/7 8)

పరమేశ్వరుని సగుణరూపగ్రహణము. ధర్మసంస్థాపనముతో బాటుగ, అధర్మవినాశము, దుష్టనిగ్రహము కొఱకు గూడ ఐయున్నది. ధర్మపాలనము లేక సాధుపరిత్రాణమునకు శివదృష్టియు, అధర్మ వినాశము అనగా దుష్కర్మకారుల వినాశము కొఱకు రుద్రదృష్టియు అవసరము. అనగా పరమేశ్వరునియందుగల శివదృష్టి, పాలనాత్మకము. రుద్రదృష్టివిధ్వంసాత్మకము. ఈ రెండు దృష్టులను కల్గియుండుటయే యవతార రహస్య హనుమంతునియందు. ఈ రెండు దృష్టులూ యుండుటచే నతడు, శివావతారము గను, రుద్రావతారముగను, ఆయా పురాణముల యందు, కీర్తింపబడియున్నాడు

హనుమంతుడు, రుద్రాంశ సంభూతుడు వైదిక సిద్ధాంతము ననుసరించి, రుద్రులు మధ్యమలోకస్థానీయ దేవతలు. వాయువు, అంతరిక్షలోకాగ్నికి మాఱురూపము. సూర్యుడు ద్యులోకాగ్ని. వేదములు ముగ్గురుదేవతలను ముఖ్యదేవతలుగ నంగీకరించి యున్నవి వారు. సూర్య. వాయు, అగ్నులు. ఒకేయగ్ని. ద్యులోకమునందు. సూర్యుడుగను. అంతరిక్షలోకమున వాయురూపమునను. భూమియందు. పార్థివాగ్నియనియును వ్యవహరింపబడుచున్నాడు:-

"తిస్ర ఏవదేవతా ఇతి నైరుక్తాః ॥
"అగ్నిః పృథివీస్థానో. వాయుర్వేన్ద్రోవా అంతరిక్షస్థానః. సూర్యోద్యు.
స్థానః॥" (నిరుక్తమ్. దైవతకాండమ్. అ-7.పా-2. ఖం-5)

హనుమంతుడు అంజనా-వాయుదేవుల తనూజుడు, ఈ యంజనభూమికి ప్రతీకము. ఆమెయందు. మధ్యమాగ్నిరూపమైన రుద్రుని అనగా వాయువు యొక్క అంశమువలన జన్మించినవాడు హనుమంతుడు. కనుకనే సీతాదేవి హనుమంతుని ప్రభావమును శ్లాఘించుచు పల్కిన ఈ పల్కులను చూడుడు.-

"వాయోరివ గతిశ్చాపి తేజశ్చా గ్నేరివాఽద్భుతమ్ ॥ (5/జి7/62

(తా॥ నీవు వాయువుతో సమానమగు వేగము, అగ్నిని బోలిన అద్భుత తేజస్సు. కల్గినవాడవు.

అట్లే హనుమంతుడు గూడ సీతాదేవికి తనపరిచయమిచ్చు సందర్భమున నిట్లు వల్కినాడు :-

"తతోఽస్మి వాయుప్రభవోహిమైధిలి ప్రభావత స్తత్ప్రతిమశ్చ వానరః॥" (5/35/20)

(తా॥ నేను ఆకారణమువలన వాయుపుత్రుడను. ప్రభావముచేగూడ నతనితో సమానుడను॥

శ్రుతి. రుద్రుని అగ్నిరూపునిగ వర్ణించియున్నది : "యవైషరుద్రస్స ఉ అగ్నిః॥" అని.

కావున నంజనయందు. వాయ్వంశచే నుదయించిన హనుమంతుడు రుద్రరూపుడగు అగ్నియే. ఈ యగ్ని రుద్రరూపము, శివరూపముగూడ. కనుకనే యతడు సూర్యునివలన సకలవిద్యాధిగమము నొందినట్లును, సూర్య పుత్రుడగు సుగ్రీవుని యంటిబెట్టుకొని యున్నట్లును రామాయణము వర్ణించి యున్నది. సూర్యోపాసనముచే నతడు తదాత్మకుడు గూడ నగుచున్నాడు. అందువలననే, యతడు త్రిలోకములయందు అప్రతిహతగతిగల వాడుగను. సకల దుఃఖతిమిర వినాశకుడగు మహాతేజస్విగను. నుపాసింపబడుచున్నాడు. ఈ విధముగ త్రిలోకపరిపాలకమగు, సూర్య, వాయు. అగ్నిరూపమగు దేవ తయే హనుమంతుడు. ఇది యతని ఆధ్యాత్మికరూపము. ఇక యతని యాధి దైవికరూపమును గూడ తెలిసికొందముగాక. హనుమంతుడు మహాశక్తిసంప న్నుడు. కనుకనే మహావీరుడుగ నుతింపబడుచున్నాడు. హనుమంతుడు శక్త్యా ధికృతుడగు శివుడు. శక్త్యాశ్రితుడగు శివుడుగాడు. ఈ రెండు రూపములలో గల సూక్ష్మభేదమేమియన, శక్తిపై అధికారముగల శివుడే. శక్తుడు. హనుమం తుడు శక్తుడు. అనగాశక్తిగను, శక్తుడుగను, ఉభయరూపమున తానేయున్నవాడు. శక్తి ఆశ్రితుడగు శివుడు, శక్తిసహకారముతో తనకార్యమును నిర్వహించును అనగా శక్తితో విడివడిన. లేక శక్తియును తానును విడి విడిగానున్న,

రూపస్వయయుక్తుడు. ఈ విధముగ హనుమంతుడు శక్తిరూపమే యగుచు,
న్నాడు. కనుకనే యగస్త్యుడు శక్తియందతనికి తుల్యులులేరని పల్కినాడు
హనుమంతుడు స్వయముగ తనశక్తినిగూర్చి జానకీదేవికిట్లు చెప్పియున్నాడు.

"శక్తిరస్తిహి మేవోఢుం లంకామపిసరావణామ్ ॥ (5/37/22)
(తా॥ రావణసహితముగ లంకను మోసికొని పోగలశక్తి, నాకున్నది॰
అంగదుడుగూడ నతనిశక్తి నీవిధముగ ప్రశంసించినాడు:-

"సత్త్వే,వీర్యే, న, తే కశ్చిత్సమో వానరవిద్యతే "। (5/57/45)
(సత్త్వమునను. వీర్యమునను నీతో సమానుడు మఱియొకడులేడు.)
హనుమంతుడు రావణునికి తన శక్తినీవిధముగ వివరించును:-

"కామంఖల్వహ మప్యేకస్సవాజి రథకుంజరామ్ ।
లంకాంనాశయితుం శక్త స్తస్యైషతు న నిశ్చయః ॥ 5/51/31

(తా॥ నేనొక్కరుడనే. రథాశ్వ గజబలయుక్తమగు లంకను నాశము
గావించుటకు శక్తుడను. కాని రాముడు నేను లంకను నాశనముచేయు నిశ్చయము కలవాడుకాడు. అనగా నేను లంకా వినాశముచేయుట యతనికభిమతముకాదు. తాను స్వయముగ లంకావినాశము చేయవలెనను నిశ్చయములో నున్నవాడు।

పైవచనములను బట్టి యితడు శక్త్యధికృతుడగు శక్తుడని స్పష్టము శక్తి-శక్తిమతోరభేదః "అనిగదా, సంప్రదాయము. అందువలన హనుమంతుడు శక్త్యభిన్నుడగు శక్తిమంతుడు. కనుకనే యామహాత్ముని పరా-అపర రూపమైన ద్వివిధప్రకృతి (చేతన-జడరూపిణియైన ద్వివిధప్రకృతి) యామహాత్మునియందు, "రాగ" రూపమైన భావవికారమును కల్గింపజాలక పోయెను. అతని మహావీర్యము, స్వస్వభావరూపమైనది, అనగా శుద్ధమైనది. కనుకనే యతడు మహావీరుడుగను, శుద్ధశక్త్యాశ్రయుడు గను సంభావింపబడుచున్నాడు. "కామ" మతని ముందునిలబడజాలదు. దానికి కారణము అతడు ఆత్మారాముడు. ఎవరు ప్రాకృతస్థితిలో నిమగ్నమై జీవితయాత్రను కొనసాగింతురో వారిని "కామము" లోబఱచుకొనును. కామమునకు లోబడిన వారిని "కామోపహతు" లనియందురు. ఆత్మారాములగు వారి ఛాయనుగూడ

"కామము" స్వప్రశంసప్రజాలము. అట్టి యాత్మారాములే కామవిజేతలు. గోస్వామీ తులసీదాసజీ మహారాజా, ఈ విషయమును చాలసుందరముగ వర్ణించియున్నారు.

"జహాఁకామతహాఁ రామనహీఁ; జహాఁరామతహాఁ నహికామ ।
ఏకసంగ నివసతనహీఁ । తులసీహుఛాయఘామ్ ॥

(తా ॥ కామమున్న చోటుల రాముడుండడు. రాముడున్నచోటుల కాముడుగూడ ఉండడు. కామ-రాములు వెలుగునీడలవలె, నొక్కచోటున నుండరు.

అనగా, ప్రకృత్యారాములు కామునకుదాసులు. ఆత్మారాములు కామవిజేతలు, వెలుగు ఉన్నచోటుల చీకటియుండని చందమున, నాత్మారాముల యెదుట కామమునిలబడజాలదు. ప్రకృత్యారాములగు ప్రాకృతుల చిత్తములందే కామము పూర్ణమున విజృంభించి, తన సామ్రాజ్యమును విస్తరింపచేయును. హనుమంతుడు, రావణునివలె ప్రకృతిదాసుడుగాడు, కనుకనే హనుమంతుడు అశోకవన ప్రధ్వంసానంతరము చైత్యప్రాసాదమును గూడ ప్రధ్వంసము చేయనెంచి, గిరినిభమగు ఆప్రాసాదము నధిరోహించి లంకావాసులగు రాక్షసులకు వెఱపుకల్గించుటకై, తననుగూర్చి యిట్లుచాటుకొనినాడు ;-

"జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజాజయతి సుగ్రీవోరాఘవేణాభిపాలితః ॥
"దాసోహం కోసలేంద్రస్యరామస్యాక్లిష్టకర్మణః ।
హనుమాఞ్ఛత్రుసైన్యానాం నిహన్తామారుతాత్మజః ॥
"న రావణ సహస్రంమే యుద్ధేప్రతిబలంభవేత్ ॥
(సుం ॥కాం॥ 43/8,9)

అట్లే రావణునికి తన పరిచయము నిచ్చుసందర్భమున గూడ తనను "రామదాసు" డనని చెప్పుకొనినాడు ;-

"సత్యంరాక్షస రాజేంద్ర శృణుష్వ వచనంమమ ।
రామదాసస్య దూతస్య వానరస్యవిశేషతః ॥ అని
(సుం ॥ కాం ॥ 51/అర)

## ప్రాకృత - శివదృష్టుల తారతమ్యము

రావణుడు ప్రకృత్యారాముడు. అనగా దృశ్యమానమగు సృష్టినే సతతీ మనినమ్మి, మనస్సును ఇంద్రియములను ఆయావిషయ భోగములద్వారా పరితృప్తినొందించుటయే జీవితపరమార్థమని భావించి, విషయ భోగము కొఱకు నిత్యము ఆరాటపడినప్రాకృతుడు. కాని. త్రిగుణాత్మకమైన ప్రాకృత స్థితినిదాటి, త్రిగుణాతీతమగు దివ్య క్షేత్రాంచలముల పరిధిని గూడ నెన్నడును బుద్ధితోనైన యూహించ జాలనంతటి యజ్ఞాన తిమిరలోకము కొట్టుమిట్టాడు ప్రాకృతజీవి. కనుకనే సీతాదేవిప్రాకృత సౌందర్యమును చూచి మోహపడి నాడు తననువలచి తన జీవితమును సార్థకముచేయుచు, ఆమెయౌవనమును గూడ సార్థకముచేసికొనుమని సీతాదేవిని ప్రాధేయపడినాడు.

కాని హనుమంతుడట్లుగాదు. అతడు రుద్రాంశసంభూతుడు. శివ స్వరూపుడు, రామ (ఆత్మారామ) దాసుడు. కనుకనేయతడుగూడ రావణు నివలె సీతాదేవియొక్క త్రిజగన్మోహన సౌందర్యమును చూచినను, మోహ పడక ఆయమ్మ త్రిజగన్మోహన సౌందర్యమును, ప్రాకృతాంశముగ నెంచక దివ్యమగు పరాశక్తి సౌందర్య ముగ సంభావించి, రెండు చేతులెత్తి నమస్క రించినాడు. ఏలయన హనుమంతునిది సర్వత్ర ఆత్మనుదర్శించు సమమగు శివదృష్టి.

కనుకనే శ్రీశంకర భగవత్పాదుల వారు ఆజ్ఞాచక్రోపరి తలమున నమృతాసారములను కురిపించు జ్యోతిర్మయియగు ఆత్రిపురసుందరియొక్క కల్పనాతీతమగు, వాక్కులకు విషయముకాని దివ్యసౌందర్యమును తదుపాస నాఫలమును, వర్ణించుచు నిట్లు వ్రాసినారు.

"త్వదీయంసౌందర్యం తుహినగిరికన్యేతులయితుం,
కవీంద్రాః కల్పన్తేకథమపి విరిఞ్చిప్రభృతయః।
యదాలోకౌత్సుక్యా దమరలలనా యాన్తిమనసా,
తపోభిర్దుష్ప్రాపామపి గిరిశసాయుజ్యపదవీమ్ ॥

(సౌందర్యలహరి శ్లో॥ సం-12)

(భావార్థము, ఓహిమగిరిపుత్రికే, బ్రహ్మాదికవీంద్రులు, నీయతిలోక సౌందర్యమును పోల్చిచెప్పుటకై యెట్లోపలుతిప్పలు పడినను కృతకృత్యులు

కాలేకపోవుచున్నారు. నీ దివ్యసౌందర్యాలోకోత్సుక్యమువలన అమరకాంతలు. నీ దివ్యసౌందర్యోపాసనను జేయుచు కఠినతపములవలన గూడ పొందరాని గిరిశసాయుజ్యపదవిని. పొందుచున్నారు. అనగా, దేవకాంతలు, ఆ హిమగిరి కన్యక యొక్క సర్వాతిశాయియైన దివ్యసౌందర్యమును నిరంతరము మనసాభావనచేసి, ఈ సకల విశ్వవ్యాప్తమైన సౌందర్యలహరి, ఏ గిరిశుని ఆశ్రయించిన సచ్చిద్రూపమగు మహామాయ యనబడు ఆ జగజ్జననిద్వారా ప్రసారితమై తనధారుచున్నదో, యట్టి సచ్చిద్రూపమగు జగజ్జననినాశ్రయించి సాధకులు సహస్రారపద్మకందో పరితలమున తనరారు గిరీశునితో సాయుజ్యమునంది. బ్రహ్మానందానుభూతి నొందుచున్నారు, దీనిని మఱియొక విధముగ చెప్ప వలెనినిన చిద్రూపుడగు యోగి, సద్రూపమైన మహాసృష్టియందు వ్యాప్తమైనమహామాయ యనబడు ఆ జగజ్జనని దివ్యసౌందర్యోపాసనము ద్వారా ఆనందస్వరూపమగు గిరిశసాయుజ్యమును పొందును.

కనుక శివదృష్టిగల (అనగా సత్త్వైకప్రధానమైన చిత్తవృత్తిగల) యోగి. నిఖిలచరాచర జగద్వ్యాప్తమైన సౌందర్యమును చూచి, దానియందు మోహమునుపొందక, తద్భోగకామనను చేయక. ఆ సౌందర్యలహరిని, ఆత్మసాయుజ్యముకొఱకు. మహాశక్తిచే అఖండసద్రూపమైన జగత్తునందు ప్రసారితమైనదిగా భావించి తన్మూలమగు సచ్చిదానంద బ్రహ్మమును సచ్చిద్రూపమగు మహామాయ లేక పరాశక్తి. నాశ్రయించి, అనగా శక్తిరూపమైన కుండలినినాశ్రయించి, సకలతత్త్వముల* నతిక్రమించి (అనగాపృథివ్యప్ తేజో

---

1. ఈ షట్ తత్త్వములు మానవశరీరమునందు ఆరుస్థానములందు కేంద్రీకృతములై సూక్ష్మతత్త్వరూపమున ఈ శరీరమను విశ్వమును (పిండాండమును) ధారణచేయుచున్నవి. అందువలచెనే వానిని శక్తికేంద్రములనిరి.

ఈ షట్చక్రములు శరీరముయొక్క మేరువును (వెన్నెముకను) ఆశ్రయించి యున్నవి: వానిస్థానములు- కేంద్రీకృత తత్వములు ఈ క్రింద ఈయబడినవి.

1. మూలాధారచక్రము-పృథ్వీతత్త్వ కేంద్రము-స్థానము: మేరువుఅధోభాగము
2. స్వాధిష్ఠానము- జలతత్త్వ " " యోనిపృష్ఠభాగము.
3. మణిపూరము : అగ్నితత్త్వ " " నాభిపృష్ఠస్థానము
4. అనాహతము : వాయుతత్త్వ " " హృదయము
5. విశుద్ధచక్రము : ఆకాశతత్త్వ " " కంఠములేకతాలువులు
6. ఆజ్ఞాచక్రము ; మనస్తత్వకేంద్రము" " భ్రూమధ్యము

వాయ్వాకాశ మనోరూపములగు షట్‌తత్త్వముల) సహస్రారమను పరమవ్యో మమున వెల్గొందు సదాశివునితో సాయుజ్యము నొందుటద్వారా బ్రహ్మానంద మునను భవించును. అనగా తానే ఆనందరూపముగ మిగిలిపోవును. అనగా సదాశివుడేయగును,

యోగసాధనద్వారా మూలాధార స్థితమగు కుండలినిని జాగృతము నర్చి ఈ యారుచక్రములను దాటిన యోగి ప్రకృతిపరిధులనుదాటి, పరమ వ్యోమమని పఠింపబడు మస్తకమంధలి సహస్రారపద్మమునుచేరి, నచట వెల్గొందు సదాశివుని సాయుజ్యమునంది బ్రహ్మానందమున నోలలాడును.

ఈ యారుతత్త్వములయతిక్రమణముచే జీవునియందలి జీవతత్త్వము తొలగి జీవుడు సదాశివస్వరూపమును పొందును.

ఈ సహస్రార ప్రవేశమే తంత్ర యోగశాస్త్రములు చెప్పు దివ్యలోక ప్రవేశము.

ప్రకృత్యుపాసకులు, అనగా ప్రకృతినే సేవించువారలు, ప్రకృతిపరి ధిలోనున్నవారలు. ఇందేపుట్టుచు, చచ్చుచు, త్రిగుణాత్మకములగు ప్రాకృతి కవస్తువుల భోగమునందు నిమగ్నులై, అవిద్యా, కామ, కర్మములమైన సంసారములోతగుల్కొని, కామ-క్రోధాదులకులోనై నిత్యము శాంతిలేక పరి తపించుచుందురు.

అందువలన జీవుడు త్రిగుణాత్మకమైనదియు, సుఖ-దుఃఖ మోహస్వ భావముగలదియునగు సంసారపరిధుల నతిక్రమించిననాడు గాని, త్రివిధతాప ములకు లోనుగాకుండగ నుండజాలడు. సంసారపరిధుల నతిక్రమించిన వాడే దివ్యలోకమున ప్రవేశింపగలడు- త్రివిధతాపముల కతీతమైన మహా సుఖములేక శాంతిస్వరూపమైన దివ్యలోకప్రవేశము, ఆత్మారాములైన వారే పొందగలరు. ఆత్మోపాసనము లేక ఆత్మదృష్టియే శివదృష్టి. ఆత్మోపాస నములేక యాత్మదృష్టియనగా శాస్త్రములందు సర్వత్రసమదృష్టిలేక యాత్మ దృష్టినికల్గి సర్వము ఆత్మకంటె వేఱుగాదనిగాని లేక యాత్మకంటె వేఱుగ ఇంకొక వస్తువు తాత్త్వికముగలేదని గాని నిరంతరము సంభావించుట. ఇది

యీశివదృష్టి: కనుక హనుమంతుడు తనను "రామదాసోస్మి సంమతః" అని
యుద్ఘోషించు కొనుటద్వారా తాను ప్రకృతిపరిధులలోనుండక షట్త్రిత్త్వముల
నతిక్రమించి దివ్యలోకములందు నిత్యము విహారముసేయు శివుడనని తెల్పి
యున్నాడు, అట్టిశివస్థితి, ప్రకృతిదాస్యమును విడచి, ఆత్మదాస్యముచేయుట
ద్వారా లభించినదనియు, రామదాస్య మట్టిస్థితిప్రాప్తికి సాధనమనియును తెల్పి
యున్నాడు. లోకములో దాస్యము అనునది సాధారణముగ హీనార్థమును
సూచించును. కాని ఇక్కడ పరమార్థమున నుపయోగించబడినది. అనగా
దాస్యము అనగా- తనయునికికి మూలమగు దేహాత్మసంఘమునందు జీవుడు
నిరంతరము చేయుచుండు "నేను" అనుభావము దీనినే అహంకారమందురు.
మాయావిస్తారితమగు సృష్టిలోని పదార్థములయందు (దీనినే శాస్త్రములలో
"ఇదమ్" అంశమందురు, నాదియనుభావమును పరమేశ్వరునికి సమర్పిం
చుట. (Self - surrender) దీనివలన ఏమిజరుగును ? జీవునియందలి జీవ
త్వభావనకు మూలము, నేను, నాది యనుభావము. ఈ రెంటిని విడచుటవలన
జీవునిలోని జీవత్వము శాశ్వతముగ మాసిపోవును. బంగారములోని. మాలి
న్యము అగ్నిలోదహించుటవలన, భస్మముకాగా, శుద్ధమగు బంగారమే మిగి
లినట్లు, ఆత్మోపాసనద్వారా, లేక ఆత్మార్పణము (అనగా జీవభావత్యాగము
చేయుట) ద్వారా జీవునిలోని దుఃఖము. అశాంతి మొ॥ వానికిని, జనన, మర
ణాదిభావములకును మూలమగు జీవత్వమును త్యాగముచేయుట ద్వారా. సకల
దుఃఖమూలమగు అజ్ఞానమను. మలము భస్మమై పోవును. దాన జీవుడనువాడు
శుద్ధాత్మయగును. ఈ శుద్ధాత్మతనే శాస్త్రములు స్వారాజ్యమనియు. మోక్ష
మనియును; పురాణములు విష్ణుసాయుజ్య, శివపదప్రాప్తి. విష్ణుపదప్రాప్తియను
పెక్కు పేర్లతో వ్యవహరించియున్నవి. శ్రీశంకరభగవత్పాదుల వారు ఈయ
నంతవిశ్వములోని సౌందర్యోపాసనము ఆనందధామమగుశ్రీపరమవ్యోమ రూప
మైనశివపదమును చేర్చుటకు తపోవ్రతాదులకంటె నుత్కృష్టమైనసాధనముగ.
పై శ్లోకమున నిరూపించి యున్నారు. ఇందలివిశేష మేమియన, ఈసౌందర్యో
పాసన, చిద్దృష్టిప్రధానమైనది. ఈసౌందర్యము సచ్చిద్రూపమైన ఆత్మాశ్రి
తము. ఇట్టిదివ్యసౌందర్యలహరీ సమవగాహము, శివదృష్టిసమన్వితమై శివసా
యుజ్యమును కలుగచేయునను విషయమును నిరూపించుటకె సౌందర్య

లహరిని భగవత్పాదులు రచించిరి. రామాయణఋషి అన్వయవ్యతిరేకముల ద్వారా ఈ సౌందర్యసముపాసనవిధమును, ఫలభేదమును చాల రమ్యముగ సుందరకాండలో ధ్వనింప చేసియున్నారు. అణువణువున వ్యాపించిన సౌందర్యమును ప్రకృతిసౌందర్య రూపమున సంభావించి, దానిననుభవించగోరు వాడు ప్రాకృతుడనియును, దానినాత్మసౌందర్యముగ భావించి యానందించు వాడు అప్రాకృతుడనియు మహాత్ముడనియును వ్యవహరించబడును. దీనికి మూలము దృష్టిభేదము ఈ దృష్టిభేదమువలననే ఫలభేదము కల్గుచున్నది. ప్రాకృతదృష్టికి ఫలము- మృత్యువు, ఆత్మదృష్టికిఫలము. అమృతత్వప్రాప్తి

ఈ దృష్టిభేదమును హనూమద్రావణులను, పాత్రలద్వారా రామాయణ కవిసుందరకాండమున చాల సుందరముగ నిరూపించియున్నాడు, రావణుని ప్రాకృతదృష్టి "రావణదర్శనము" అను విషయచర్చయందు వివరించబడును. ఇక్కడ హనుమంతుని శివదృష్టినిగూర్చి సుందరకాండమున వేదవేత్తయగు వాల్మీకి మహర్షియిట్లువివరించియున్నారు :-

హనుమంతుడు అశోకవనమందలి శింశపావృక్షమునాశ్రయించి. సంధ్యా సమయమగుటచే- సీతాదేవి యశోకవనముననున్నచో తప్పక సంధ్యోపాసనకై రాగలదని, ఆమెదర్శనమునకై కడు ఉత్కంఠతతో ఎదురుచూడసాగెను. అట్లుచూచుచుండగా ఆ యశోకవన మధ్యమున ఒకయున్నతమగు చైత్యప్రాసాదమగపడెను. ఆతరువాత ఆ చైత్యప్రాసాద సమీపమున నొకయశోకవృక్షముక్రింద వియోగదుఃఖ సంతప్తురాలగు సీతాదేవి యతనికి కన్పించెను.

మలిన వస్త్రధారిణియును, ఉపవాసముచే కృశించిన తనుయష్టిగల్గి నదియు, శుక్లపక్షాదిన నగుపించు చంద్రరేఖవలె క్షీణించినను, నిర్మలతను కాంతియుక్తయును, మాసిపోయిన పీతవస్త్రమును దరించినదియును, శరీర మునలంకరించుకొననిదియు, రాక్షస స్త్రీ పరిగతయును, దుఃఖసంతప్తురాలును పూర్ణచంద్రుని బోలిన మోముతో సకల లోకమునకు ప్రియమును గూర్చుచున్నదియు, దీర్ఘతరనిః శ్వాసములను విడచుచున్నదియు, భయకంపితయును నగు సీతాదేవి కటిక నేలపై కూర్చొని యుండెను, ఆమె మహత్తరమగు శోక జాలముచే నావరించబడియుండెను. రామసాన్నిధ్యమునకు దూరమై, రాక్షస

స్త్రీల, వాక్చల్ముషులచే నిరంతరము పీడింపబడుచు, అశ్రుపూర్ణ నయనములతో నటునిటు చూచుచు కడుదీనముగ నున్న ఆమె, సీతయే యని హనుమంతుడను కొనెను. శ్రీరాముడు ఆమె కేయేయాభరణములుగలవని ఆమె ఋష్యమూకమున జారవిడచిన మూటను చూచి కీర్తించెనో వానిలో అక్కడ పడవేసినవి దక్క మిగిలినవి ఆమె ధరించి యుండెను. మలిన మైన పీత వస్త్రమును ధరించి యున్నను, నగలమూటకు కట్టిన వస్త్రఖండము, ఆమె ధరించిన వస్త్రమునకు సంబంధించినట్లే కాంతి వంతమై యుండెను. అట్టి పతి వియోగ సంతప్తురాలును, ఏకాకినియు, పతిధ్యానపరాయణురాలునునగు సీతను చూచి హనుమ తనలోతానిట్లనుకొనెను

> "అస్యాదేవ్యాయథా రూపమంగ ప్రత్యంగ సౌష్ఠవమ్।
> రామస్యచ యథారూపం తస్యేయమసి తేక్షణా॥
> "అస్యాదేవ్యా మనస్తస్మిం స్తస్యచాస్యాం ప్రతిష్ఠితమ్।
> తేనేయం సచధర్మాత్మా ముహూర్తమపి జీవతి॥
> "దుష్కరంకృత వాన్రామో హీనోయదనయా ప్రభుః।
> జగామమనసారామం ప్రశశంస చ తం ప్రభుమ్॥
> (సు॥ కాం॥ 15/51-54

తా॥ శ్రీరామ చంద్రుడు ఎంత సుందరమైన వాడో, ఈయమ్మ గూడ నంతసుందరమైనది. ఈత్రిజగన్మోహిని, "ఆ జగదేక సుందరునకు తగిన భార్య". వీరివురిదే యథార్థమగు దాంపత్యము! ఏలయన ఈయమ్మ నిచ్చలు తన మనస్సు శ్రీరామ చంద్రుని యందే లగ్నము చేసి ధ్యానించుచున్నది. శ్రీరాముని మనస్సు గూడ నిరంతర మీమె యందే లగ్నమై ఉన్నది. ఇట్టి యనన్యప్రేమమూలముననే శ్రీరాముడింకను జీవించి ఉన్నాడు. నిజముగ నిట్టి పతి పరాయణ యగు భార్యా వియోగముతో శ్రీరాముడు కృశించి నశించకుండగనుండుట, యంతసులభము గాదు మిక్కిలి దుష్కరము. ఈ విధముగ వియోగదుఃఖపీడితురాలగు సీతను చూచి హనుమ మిక్కిలి ప్రసన్నుడాయెను. వెంటనే ఇట్టి సాధ్విని భార్యగా పడయ గల్గిన శ్రీరాముని గూర్చి తలచి ఆయన యదృష్టమును ఎంతగానో కొనియాడెను.

కాని విరహ సంతప్తురాలును- పతియోగ కర్శితయును. నగు ఆ సాధ్విని చూచి రావణుడు ఆమెను తన మాటలతో మురిపించుచు ఇట్లను చున్నాడు.

ఇదంతే చారు సంజాతం యౌవనం హ్యతివర్తతే।
యద తీతం పునర్నైతి స్రోతః స్రోతస్వినామివ॥(5-20-12

"త్వాంసమాసాద్య వైదేహి రూప యౌవనశాలినీమ్।
కఃపునర్నాతివ ర్తేత సాక్షాదపిపితామహః (5-20-14

'క్లిష్టకౌశేయ వసనాంతన్వేమప్య నలంకృతామ్।
త్వాం దృష్ట్వా స్వేషుదారేషురతింనోపల భామ్యహమ్॥ (30)

తా॥ నీ యీ సౌందర్య వర్ధకమగు పొంగులువారుయౌవనము క్రమముగా క్షీణించు చున్నది. పోయిన యౌవనము, నదీ జలముల వలె తిరిగి మఱలిరాదు గదా! నీ వంటి రూపయౌవనశాలిని యగు సుందరిని చూచిన తరువాత, ఏ పురుషుడు సాక్షాత్తుగ పితామహుడేయగు గాక, మర్యాద నతి క్రమించ కుండగ నుండగలడు? మాసిన పీతవస్త్రమును ధరించినను, నేయలంకారము చేసి కొనక పోయినను మిక్కిలి కృశించి ఉన్నను, నిన్ను చూచిన "తరువాత నా భార్యలందు నాకు వలపు పోయినది".

కనుక రాముని యందలి వ్యర్థమగు ప్రేమను త్యజించి నన్ను ప్రేమించుము. వైరాగ్యమును త్యజించి శరీరమునలంకరించుకొని, నీ యౌవనమును సార్థకము చేసికొనుము (5 20-21) హనుమ రావణుల యందు సీతాదర్శనము వలన కల్గిన దృష్టి భేదము- స్పష్టము, రావణు నిది కామ దృష్టి, హనుమంతునిది శివదృష్టి. కనుకనే సీతాదర్శనా నంతరము హనుమ, పరమానందమునొందినాడు-అతని కన్నుల నుండి ఆ నందాశ్రువులు జాలువారినవి. ఆ జగజ్జనని రాముని కనన్య భూతయును, తచ్ఛక్తి స్వరూపిణియు నైన ఆదేవిని దర్శించిన, హనుమ మనః ఫలకమున రామ ప్రభువు గోచరింపగ, ఆ ప్రభువునకు రెండు చేతులు యెత్తి నమస్కరించినాడు ఆటుపిమ్మట ఆప్రభువును నిచ్చలు సేవించుచు, నతని నెడబాయక

ననుసరించు తత్పరాంశ భూతుడగు లక్ష్మణ స్వామి యనుసరించినాడు. రామప్రభువు దాస్యమునే, జీవితలక్ష్యముగా నెన్నుకొని, సర్వమును త్యజించి, రాముని నీడవలె ననుసరించు మహాత్యాగి, తపోవ్రతనిష్ఠుడు, శుద్ధాత్ముడు, రామ కింకరుడునగు ఆలక్ష్మణ స్వామికి గూడ నంజలి ఘటించి ఆశింశ పా వృక్షమున సంవృతుడై, రామదాసుడగు హనుమంతుడు, పత్ర పుష్పముల మాటున నొరులకు కన్పడ కుండ నొదిగి ఉండెను.

దీనిని బట్టి మనకు తేట తెల్లమగు విషయమేమియన హనుమంతుడు శివ దృష్టికలవాడగుటచే, ఆ దివ్య సౌందర్య జ్యోతియగు సీతాదేవిని చూడ గానే, భక్తిభావము పొంగి పొరలినది. రామాశ్రిత యగు, ఆ దేవి దివ్య సౌందర్య దర్శనము రామప్రభువుస్ఫురణ రామదాసునకు కల్గించినది. కనుక శివదృష్టి గల శుద్ధాత్ములు, శక్తి సౌందర్యమును కామ దృష్టితో గాక భక్తిదృష్టితో సముపాసింపగ, ఆ జగజ్జనని వారి మనస్సు నావరించి ఉన్న మాయాయవనికనుతొలగించును. అపుడు ఆత్మదర్శనము లేక శివ సాక్షాత్కా రమగును, ఇదియే శక్తి సౌందర్య సముపాసనా ఫలము. అపుడు శక్తిసము పాసకుడు, శివ-శివా లేక శివ-శక్తి సౌందర్యములను సంభావించి యానంద పరవశుడగును. అతని మనస్సు ఆనందమయ మగును.

కనుకనే హనుమ తాత్త్విక దృష్టితో సీతా దేవి దివ్యసౌందర్యమును సంభావించి, ఇట్లు తన మనమున తలపోసినాడు.

"అస్యాదేవ్యా యథా రూప మంగ ప్రత్యంగ సౌష్ఠవం।
రామస్య చయథా రూపం తస్యేయ మసితే క్షణా॥
అస్యా దేవ్యా మనస్తస్మిం స్తస్య చాస్యాం ప్రతి ష్ఠితం
తేనేయం స చధర్మాత్మాముహూర్తమపి జీవతి॥
దుష్కరంకృత వాన్ రామోహీనో యదనయా ప్రభుః।
ధారయత్యాత్మనో దేహం నశోకేనా వసీదతి ॥
(సుం॥కాం॥ 15/51—53)

తా॥ ఈ దేవి ఎంత యందమైనదో, రామ ప్రభువు గూడ అంత యందమైనవాడు ఈమె యెట్టి అంగప్రత్యంగ సౌష్ఠవమున నలరాడు

చున్నదో, యట్టి యంగ ప్రత్యంగ సౌష్ఠవమును రామ ప్రభువు కూడ కల్గి ఉన్నాడు అందువలన వారివురొకరికి తీసి పోకుండగ, ఒకరికి దీటుగా మరియొక రున్నారు కనుక ఈ దేవి ఆ రామ ప్రభువునకే తగిన ఇల్లాలు, రావణుడీమెను చెట్ట పట్టుట కనర్హుడు ఇక ఈమె నిరంతరమా ప్రభువునే ధ్యానించుచు తన చిత్తము నాప్రభుని యందే లగ్నము చేసి తదాయత్తచిత్తయై జీవించు చున్నది, రామ ప్రభువు గూడ ఈమె యందే నిరంతరము చిత్తమును లగ్నము చేసి యుండుట వలన ఇంతవఱకు జీవించి ఉన్నాడు, లేనిచో ముహూర్తకాలము గూడ యతడు జీవించుట పొసగదు. ఈమె తన చెంత లేకుండగ రామ ప్రభువు శరీరధారణము చేయుట యన, కానిపని నిజముగ రామప్రభువు శోకమున నశించకుండగ, శరీరమును ధరించి ఉండుటయే చాల దుష్కరము ను కార్యము. కాని ఈమె ధ్యానము మూలమున రామప్రభువు శరీర ధారణము చేయుట న్యాయ్యము. ఏలయన ఈమె సౌందర్యమట్టిది.

"రాజ్యంవా త్రిషులోకేషు సీతావా జనకాత్మజా।
త్రైలోక్య రాజ్యం సకలం సీతాయానాప్నుయాత్కలామ్॥

తా॥ : త్రైలోక్య రాజ్య మొక దెస, సీతాదేవి యనవద్య సౌందర్య మొక దెస యుంచి, ఈరెంటిలో యేది గొప్పయని యడిగిన సీతాదేవి సౌందర్య లవమునకు గూడ త్రైలోక్య రాజ్యము సాటిగాదని నేనందును. అని హనుమయభిప్రాయము.

కాని హనుమంతునికి ప్రాకృతదృష్టియేలేదా? అనిన, లేకయేమి, పుష్కలముగానున్నది. కాని యది శుద్ధ ప్రాకృత దృష్టిగాదు. దానినతిక్రమించిన శివదృష్టిలేక తత్త్వదృష్టి. తత్త్వదృష్టి యనగా, ఉన్న దానిని యున్నట్లుగ సాక్షి భావమున చూచుట. కనుకనే యతడు సీతాదేవి దివ్య సౌందర్యమును తత్త్వదృష్టితో తిలకించి మిక్కిలి శ్లాఘించినాడు. ప్రాకృత స్వభావము నాశ్రయించి యాపతివ్రతా శిరోమణికి కలుగనున్న ఈ విపత్తును కన్నులారగాంచి విలపించినాడు.

ఈ క్రింది పంక్తులను చూడుడు. -

సుముహూర్తమివధ్యాత్వా బాష్ప పర్యాకులేక్షణః సీతామాశ్రిత్య

తేజస్వీహనుమాన్విలలాపహ 5/16/2 తేజస్వియగు హనుమంతుడు ముహూర్తకాలము ఆ దేవి భర్తృ విరహితమై యశోకవనమును పొందు యిడుమలను కన్నులారగాంచి కన్నుల నిండ నీరు గ్రమ్మలోలోన విలపించినాడు. ఆమె ప్రాతివ్రత్యమును శ్లాఘించినాడు.

ఇది యతని ప్రాకృతదృష్టికి సహృదయత్వమునకు నిదర్శనము. ఇదియే హనుమలోని శివ దృష్టికి గూడ నిదర్శనము.

కాని రావణుడట్లుగాక విరహసంతప్త యును పతివియోగ వ్యధి తయును దీనురాలునునగు సీతాదేవిని చూచి కామము చిత్తమున గుబురుకొనగ తబ్బిబ్బైపోయి నోటికి వచ్చినట్లువదరుటయేగాక, తన వాల్లభ్యము నొల్లని, యా దేవిని, నాశము చేయుదురని బెదరించినాడు. ఇదియే యతని ప్రాకృత దృష్టిలేక జాగతిక దృష్టి.

## 18. రావణ దర్శనము

రావణుడు శుద్ధ భౌతికవాది (Materiailst). అనగా ఇక్కడ నా యుద్దేశ్యము, అతడు నాస్తికుడు అని కాదు అతడు దైవమును నమ్మను. కావుననే (మహా తపః పరిగ్రహః) అని వర్ణించబడినాడు. అంతేగాదు, ఏషోహి తాగ్నిశ్చ మహా తపాశ్చ- వేదాంతగః, కర్మ సుచాగ్ర్య శూరః॥* అనిగూడ వర్ణించబడియున్నాడు. ఇంకను, అతడు నిత్యాగ్నిహోత్రి యని గూడ యుద్ధకాండమున చెప్పబడినది. అతడు నిత్యాగ్నిహోత్రియైనను, క్రూర కర్ముడనియును, రాక్షసుడనియును వాల్మీకిచే, వర్ణించబడినాడు. కారణము: అతడు అసుర గుణములు కలవాడు. అతని కర్మలు లోక కంటకములు, ధర్మవిరుద్ధములు.

అతడు ఉత్తమాభిజనముగలవాడు. పులస్త్యుని మనుమడు, విశ్రవసుని పుత్రుడు. వైశ్రవణుని సవతి సోదరుడు. కాని తల్లి పక్షము రాక్షస వంశము.

---

1. శ్రీమద్రామాయణము, యుద్ధకాండ, సర్గ - 109/23

అతని తల్లి "సుమాలి"యను రాక్షసుని పుత్రికయగు కైకసి. అతడు మహా వీరుడైయెనను, ఔదార్యము లేనివాడు. అహంభావి, స్మయ దూషితుడు, యుక్తా యుక్త వైచక్షణ్యము లేనివాడు. అతడు చేయని కుకృత్యము లేదు. కామాత్ముడు. జీవితమున అర్థకామములను మాత్రమే పాలించినవాడు. అతడు మహా తపము చేసెను, అనేక యజ్ఞములు గూడ చేసెను ? ఎందుకు? శక్తి సంచయము కొఱకు. శక్తి యెందులకు ? లోకములను జయించుటకు ? లోకములను జయించిన వచ్చు లాభమేమి ? లోకములలోని సంపదనంతయు దోచుకొని, భౌతిక సుఖములనుభవించవచ్చును. కనుకనే యతడు త్రైలోక్య వసులోక్త, త్రైలోక్యోద్వేగదుడు, లోకపాల విజేత (6/111/48) లోకక్షోభకుడు, సాధు, భూత విదారణుడు (6/111/49) ధర్మవ్యవస్థాభేత్త (6/111/52 క్షేమకర్ముడు (6/111/54) గను వర్ణించబడినాడు. అతని భోగలంపటత జుగుప్సను కల్గించునంత తీవ్రస్థాయికి చేరుకొనినది.** అతడు కరేణు మధ్యగత మత్తగజముగను, *** గోమధ్యగత వృషభముగను**** వర్ణించబడినాడు.

కాని అతని శాసనమున లంకానగరము, అన్ని విధముల చాల ఉన్నత దశను పొందినట్లు, సుందరకాండములోని లంకానగర వర్ణనమును పరికించిన మనము గ్రహింపవచ్చును. శిల్ప, వాస్తు, నృత్య, సంగీత, ఉద్యానపాలనాది కళలు చాల యున్నత దశనందినట్లు మనము గమనించగలము అతనిలో సౌందర్యదృష్టి, లలిత కళాభిరుచి లేకున్న యవి యున్నతదశయందుండుటకవకాశములేదు. కాని యతడు ప్రత్యక్షమును మాత్రమే విశ్వసించువాడుగ కన్పట్టుచున్నాడు. పరోక్షమును గూర్చి యతనికి విశ్వాసమున్నదని చెప్ప జాలము. కావుననే యతడు, శక్తి సంచయమును ధన సంచయమును, ప్రత్యక్షమగు జీవితములో సర్వసుఖములనుభవించుటకు మాత్రమే చేసెను.

---

2. పౌలస్త్య వంశ ప్రభవో రావణో నామ రాక్షసః॥ (1-20- 6)
"రాక్షసో రావణో మూర్ఖో వీర్యోత్సేకేణ బాధతే॥ (1-15 22)
3. "కరేణుభిర్యథారణ్యే పరికీర్ణో మహాద్విపః॥ (5/11/12,
4. "గోష్ఠే మహతి ముఖ్యానాంగవాం మధ్యేయథావృషః (5/11/11)

అతని "దర్శనము" లేక "జీవిత సిద్ధాంత"మునకు మూలమిదియే. అనగా, ఇంద్రియములను దమించుటకు సమర్థుడు కాడు. కావుననే యతని సిద్ధాంతమును లౌకిక జీవన సిద్ధాంతము (ధర్మ సంస్పర్శరహితమగు) అని చెప్పవచ్చును. ఈ లౌకిక జీవన సిద్ధాంతమునకతడు ద్రష్ట (Founder) అని చెప్పవచ్చును. ధర్మ విరహితమగు లౌకిక జీవన సిద్ధాంతము యొక్క భయంకర స్వరూపమును వాల్మీకి సుందరకాండమున చాల మార్మికముగ చిత్రించినాడు.

రావణుడు తన యీ "అర్థకామైక పరాయణమగు, లౌకిక జీవన సిద్ధాంతమును, రామవిరహ దుఃఖితయగు సీతాదేవికి నచ్చచెప్పి, యామెను లోబరచుకొనుటకై ప్రతిపాదించి యుండెను.

రావణునికి, హనుమంతుడు లంకలో ప్రవేశించిన దినము తెల్లవారు జామున సీతయొక్క స్మరణరాగా, కామోన్మాదము చెలరేగెను. అతడు సర్వాభరణముల నలంకరించుకొని తన కాంతలను వెంటనిడుకొని అశోక వనమునకు బయలుదేరి వచ్చెను.[1] విచిత్రాభరణుడును, శంకువువలె నిక్క పొడుచుకొనిన కర్ణములు గలవాడును, రాక్షస స్త్రీ పరివృతుడును, కామా సక్తుడునునగు రావణుని చూచి, పతివ్రతయగు సీతాదేవి పెనుగాలి వీచు నపుడు కంపించు కదళీ స్తంభమువలె తీవ్రముగ (గజ గజ) వణకుచు, ఊరువులతో వక్షమును, బాహువులతో వక్షోజములను కప్పుకొని బిట్టుగ విలపించసాగెను. బిట్టుగ విలపించుచున్నదను జాలియైన లేక రావణుడు తన కామమును వెళ్ళగ్రక్కుచు, రాక్షసుల యర్థకామమయ జీవిత సిద్ధాంతములను అట్టి జీవితయాపనము వలన కల్గు సుఖ రూపమగు ఫలమును నిరూపించుచు సీతతో నిట్లు పల్కెను:-

కరికరములవలె వర్తులోరువులతో నొప్పు ఓ సుందరి! ఏల నన్ను చూచి భయ పడుచున్నావు? నాకు నీ శరీరమును కన్పింప కుండునట్లు యత్నము సేయుచున్నావు? ఓ సర్వాంగ సుందరి! విశాలాక్షి! నేను నిన్ను

---

1. సచ కామ పరాధీనః పతిస్తాం సాంమహా బలః
సీతాసక్తమనా మందో మందాచిత గతిర్బభౌ॥ (5/1819)

కామించుచున్నాను. నన్ను ఆదరింపుము. ఇది లంకా నగరము ఇక్కడ నీకు ఎవ్వరును ఎగ్గు సేయజాలరు నేను నిన్ను బాధపెట్టుదునని తలంచి భయ పడకుము. నన్ను కామించి, నా త్రైలోక్యైశ్వర్యమును అనుభవింపుము. అయ్యో! పరాంగననైన నేను నిన్నెట్లు కామింతునను ఆలోచనను మనస్సున రానీయకుము. అంతేగాదు, పరాంగననైన నేను నీకెట్లు భోగ్యురాలనను సందియము గూడ నీ మనమున రానీయకుము. మీ సమాజమున, పరాంగనా గమనము నిషిద్ధము కావచ్చును. కాని మా రాక్షస సమాజమున, పరదార గమనము నిషేధింపబడలేదు. మేము పరాంగనల ననుభవింతుము వారు మా సంగమము నంగీకరింపకయున్న వారిని అపహరింతుము. మా పొందు నంగీ కరించునంత వఱకు వారిని వేధింతుము. ఇది యిక్కడ దోషముగాదు. నా యీ మాటలు వినుము:-

"స్వధర్మో రక్షసాం భీరు సర్వదైవ, న, సంశయః॥
గమనం వా పర స్త్రీణాం హరణం సంప్రమథ్యవా॥
(5/20/5)

తా॥ ఓ భీరు స్వభావముగలదానా? పర స్త్రీ గమనము వారిని హరిం చుట, వారిని బలాత్కరించుట, ఇది రాక్షసుల స్వధర్మము. ఇందు సందే హము లేదు.

ఇక్కడ రావణుని తాత్పర్యము : పర స్త్రీ గమనము రాక్షస ధర్మ మగుటచే, స్వధర్మమునే యవలంబించు నన్ను ద్వేషింపకుము, అని.

అస్తు, లోకమున ప్రతియొక్కరును సుఖమును వాంఛించియే, వివిధ ములగు లౌకిక వైదిక కర్మలను చేయుదురు. దుఃఖమునెవ్వరును కోరికోరి కావలెనని దుఃఖమునకు దారి తీయు కర్మలను చేయరు. కాని నీవు మాత్రము బాలిశవై స్వతః ప్రాప్తములైన సుఖములను దూరముగ త్రోసిరాజని దుఃఖము లను వరించుచున్నట్లు కన్పించుచున్నావు లేనిచో, శరీర సంస్కారమునే యేల త్యజింతువు? కేశములను దువ్వుకొనవు! వస్త్రములను ఉదుకుకొనవు, ఉపవాసములు సేతువు, కటిక నేలపై శయనింతువు, నిరంతరము చింతలో

మునిగి యుందువు: ఇవి యన్నియు దుఃఖమునకు దారితీయునవియే గద, నా యీ యుపదేశమును వినుము:

"ఏక వేణీ అధశ్శయ్యా ధ్యానం మలిన మంబరమ్।
అస్థానే೭ప్యుప వాసశ్చ నైతా న్యౌపయికాని తే॥ (5/20/8)

తా॥ జడలు గట్టిన కేశపాశము, కటిక నేలపై శయనము, చింతలో మునిగి యుండుట, వ్యర్థముగ ఉపవాసము చేయుట నీకు ఉపయుక్తములు కావు.

పరస్థానములో నున్న నేను సుఖముల నెట్లనుభవించగలనని తలపోయకుము. ఎవ్వరో భాగ్యహీనురాండ్రగు స్త్రీలు, పరస్థానమున నట్టి బాధలు పడుట యుక్తము. కాని నీవట్లుగాదు. నా యీ మాటలు వినుము:

"స్త్రీరత్న మసి, మైవంభూః కురుగాత్రేషు భూషణమ్।
మాం ప్రాప్యహి కథం వాస్యా స్త్వ మనర్హా సువిగ్రహే॥
(5/20/11)

తా॥ ఓ సుందరి! నీవు, స్త్రీ రత్నమువు. ఈ విధముగ శోకింపకుము ఆభరణముల నలంకరించుకొనుము. నన్ను ప్రియుడుగా పొందిన తరువాత నీవు అలంకరించుటకు గాని, సుఖములనుభవించుటకు గాని యనర్హురాల వెట్లగుదువు?

ఓ మైథిలి నాకు భార్యవగుము. రాముడు వచ్చి నిన్ను రక్షించునను మోహమును విడువుము. నా యంతఃపురమునగలనా కాంతలందరికిని రాణివై, సర్వసుఖములనుభవింపుము. (5/20/6) నన్ను భర్తగా నంగీకరించుట వలన నీవు దేవదుర్లభములగు సుఖములన్నియు నీలోకముననే యనుభవింపవచ్చును. విచిత్రములైన పుష్పసారములు, చందనములు, అగురులు, వివిధ వస్త్రములు, దివ్యాభరణములు, చాల విలువైన పాన ద్రవ్యములు, శయనములు ఆసనములు, గీత, నృత్య, వాద్యములిటగలవు. నీవు వానినన్నిడని, ఆనందముగ ననుభవింపుము. నీవు నన్ను వలచినచో, నేను ఆయా లోకములనుండి ఆయాలోకవాసులను బాధించి తెచ్చిన అసర్వములగు రత్నములనన్నిటిని

నీకు సమర్పించెద. ఒక. రత్నములేమి? నా రాజ్యమునే నీకు ప్రధానము చేసెదను. (5/20/17). నా యీ యుపదేశము నాలింపుము.

"అన్తఃపుర నివాసిన్యః స్త్రియ స్సర్వ గుణాన్వితాః।
యావత్యో మమ సర్వాసా మైశ్వర్యం కురు జానకి॥
"మమహ్యా సిత కేశాంతే త్రైలోక్య ప్రవరాః స్త్రియః।
తాస్త్వాం పరిచరిష్యంతి శ్రియ మప్సరసో యథా॥
"యాని వై శ్రవణే సుభ్రు రత్నానిచ ధనానిచ।
తాని లోకాంశ్చ సుశ్రోణి మయా భుంక్ష్వ యథా సుఖమ్॥
(5/20/31-33)

తా॥ సర్వగుణ సంపన్నురాండ్రగు, నా యంతఃపుర కాంతలందరి పైనను నీవు శాసనము చేయుము.

ఓ నీలవేణి, త్రిభువన సుందరులగు నా భార్యలు, అప్సరలు లక్ష్మీ దేవిని కొల్చినట్లు, నిరంతరము నిన్ను సేవింపగలరు.

హే సుభ్రు! నేను, కుబేరుని వద్ద నుండి లాగుకొనిన, ధనములను, రత్నములను నీకిచ్చెదను. నేను అన్ని లోకములను జయించితిని. వానిలో గల సర్వసుఖములననుభవింపుము.

ఈ ప్రసంగము వలన రావణుని జీవిత సంబంధమైన సిద్ధాంతము తేట తెల్లమగుచున్నది. జీవితములో నెంతయర్థము నొకడు కూర్చుకొన గల్గునో, అంత సంపదను కూర్చుకొని, ఎన్ని, భౌతిక భోగముల ననుభవించ దగునో యన్ని భోగములననుభవించుటయే జీవిత పరమార్థము. ప్రపంచములో ప్రతి యొక్కరును కోరుకొనునది సంపద, అధికారము, భోగము, ఈ మూడు తనను ప్రియునిగ అంగీకరించిన లభించునని, రావణుడు సీతకు స్పష్టముగ చెప్పినాడు. తన ప్రేమనంగీకరించిన, ముల్లోకముల నుండి తానపహరించిన సంపదను, ఆమెకు వశము చేయగలనని రావణుడు పల్కినాడు. నా యంతఃపురేశ్వరివై, నన్ను నా యంతఃపురమును శాసించుమని పల్కి, అధికారపు ప్రలోభమును చూపినాడు. తన వాల్లభ్యము నంగీకరించుట

వలన, లంకలోని భోగ్యవస్తువులేగాక ముల్లోకములలో గల భోగ్యవస్తువుల ననుభవించ వచ్చునని పల్కినాడు. ఇక తాను, తన సర్వసంపద, శాసనాధి కారము సర్వలోక విషయభోగ ప్రదానము సీతకు చేయుటకుగల కారణముల నిటు పేర్కొనినాడు:

"నహిరూపోవమాహ్యన్యా తవాస్తి శుభదర్శనే॥ (5/2/13)

తా॥ ఓ శుభ దర్శనురాలా, ఈ ముల్లోకములలోను, నీ వంటి యంద మైన వనితను చూడలేదు. నీ యందమును చూచి, నేనే మోహ పోవుటగాదు, నిన్ను సృజించిన బ్రహ్మయైనను మోహమునకు లోనుగాక యుండజాలడు. నీ యందమును వర్ణింప వాక్కులు చాలవు. ఏలయందువా వినుము?

"యద్యత్పశ్యామితే గాత్రం శీతాంశు సదృశాననే!
తస్మిం స్తస్మి న్పృథుశ్రోణి చక్షు ర్మమ నిబధ్యతే॥
(5/20/15)

తా॥ ఓ పృథుశ్రోణి! ఓ చంద్రముఖి! నీ యందము నెట్లు వర్ణింతును? నేను నీ గాత్రమునకు సంబంధించిన, నే యే యవయమును చూచుచున్నానో యందే నా దృష్టి నిబద్ధమై, కదలలేక పోవుచున్నది!

నా యీ మాటలు వినుము నిన్ను చూచిన తరువాత నా భార్యల యందలి వలపే నాకు పోయినది!* ఏమి చేతును? నీవు నా మనస్సును** దొంగిలించితివి? ఇందునా యపరాధమేమి యున్నది. అందువలన నన్ను వలచి నీవు సుఖింపుము, నన్ను సుఖపెట్టుము.

---

1. క్లిష్ట కౌశేయ వసనాం తన్వీ మప్య నలంకృతామ్!
త్వాం దృష్ట్వా స్వేషు దారే ష్వరతింనోపలభామ హమ్॥
(5/20/30)

2. చారు స్మితే, చారుదతి, చారునేత్రే విలాసిని!
మనోహరసి, మే, భీరు సుపర్ణః పన్నగం యథా॥
(5/20/29)

ఇక రాముని యందుగల వలపును పోగొట్టుటతో బాటుగ, నతడు తనను రక్షించునని యాశ నున్మూలించి, యతని బల-పరాక్రమముల మీద నామెకుగల విశ్వాసమును సమూలముగ నున్మూలించిన గాని, యామె తనకు వశము కాదని భావించి రావణుడు చేసిన ప్రసంగము:

"యుద్ధమునందు నేను దేవాఽసురుల నందరిని ఓడించినాను. సురాఽసురులలో నెవ్వరును యుద్ధరంగమున నా ముందు నిలబడజాలరు ఇక యట్టి దశలో, యుద్ధవ్యవసాయమునే త్యజించినవాడు, గతశ్రీకుడు, అడవుల బట్టినవాడును, అడవులలో పలుదుఃఖముల ననుభవించుచు, నెట్టులో జీవితము గడుపు రాముడు, సముద్ర మధ్యమున గల లంకకు వచ్చి నా పట్టునుండి, ఆమెను రాముడెట్లు విడిపింపగలడు? ఇంద్రహస్తగతమైన కీర్తిని హిరణ్యకశిపుడు తిర్గి కైవసము జేసికొనజాలనియట్లు, ఆమెను గూడ వనవాసియును నిస్సహాయుడును, దుఃఖితుడునునగు రాముడు తిర్గిపొందుటకల్ల! ఆమెను తిర్గి పొందుట మాట యటుంచి చూడనైన చూడజాలడు! కాగా, రాజ్యభోగముల ననుభవించిన రాముడు అడవులనుపట్టి, వనవాస దుఃఖమున, పంచత్వమొందుటలో ఆశ్చర్యమేమి యున్నది? అందువలన, నెవడు జీవించెనను నమ్మకము కూడ లేదో యట్టివానిపై నాశపెట్టుకొనుట తెలివి తక్కువతనము గాక మరియేమి? కాగా ఈ ముల్లోకములలో తనకు ప్రతియగు వీరుడే మరియొకడు లేడు.*** రాముడు గూడ తనతో నేవిషయమునను "తుల"గాడని చెప్పుచు నిట్లనును:-

శ్లో॥ ఓ దేవి, రాముడు, తపస్సులో గాని, బలములోగాని, పరాక్రమములందు గాని, ధనములోగాని. కీర్తిలోగాని నాకు సమానముగాడు.

---

3. "నేహ పశ్యామి లోకేఽస్మిన్ యోమే ప్రతిబలోభవేత్।
పశ్యమే సుమద్వీర్య మప్రతి ద్వంద్వ మాహవేః
(5/20/19)
"న రామ స్తపసాదేవి, న, బలేన, న, విక్రమైః
న, ధనేన, మయాతుల్యః; స్తేజసా, యశసాపివా॥
(5/20/34)

ఇక యట్టి గతశ్రీకుడును, నిక్షిప్త విజయుడునునగు రామునిపై నతడెప్పుడో తనను వచ్చి యుద్ధరించునని యాశను విడచి, తన యౌవనమును సార్థకము చేసికొనుమని యుపదేశించుచు, అర్థ-కామ పరాయణుడగు రావణుడు సీతతో నిట్లనును..

శ్రీరాముడామెను, తన పట్టునుండి విడిపించుకొనుట వట్టి భ్రమ. రెండు: ఎప్పుడో సుదూర భవిష్యమున విడిపించునని యనుకొనినను, ఆమె పొందు ప్రయోజనమేమి? రాముడామెను విడిపించుదనుక, యామె యౌవనము జారిపోకుండగ నుండదుగద! యౌవనము జారినవెనుక భోగములు లభించినను వాని ననుభవించు యోగ్యత యుండదుగద! వార్ధకమున రాముడు సంప్రాప్తించినను, లేక రాజ్యము లభించినను వానివలన సుఖము లేకపోగా దుఃఖమే మిగులును. యౌవనమనునది "నదీ ప్రవాహము" వంటిది. ముందుకుపోయిన జలప్రవాహము తిర్గి వెనుకకు మఱలనట్లు, కాలప్రవాహమువ శరీరావయవములపై పొంగారిన యౌవనశోభ, కాలానంత ప్రవాహమున మనకు తెలియకుండగనే యవయవములనుండి జారిపోవును. యౌవనముండగనే, యెవ్వరైన విషయ భోగముల ననుభవించుటకు వీలగునుగాని, యౌవనము జారిపోయినపిదప విషయభోగము విషతుల్యము, ఈ త్రైకాలిక భౌతిక సత్యమును వివరించుచు రావణుడిట్లనును:

"ఇదంతే చారు సంజాతం యౌవనంహ్యాతి వర్తతే।
యదతీతం పునర్నైతి స్రోతః స్రోతస్వినా మివ॥
(6/20/12)

తా॥ ఇదిగో నీ రమణీయమగు యౌవనము జారిపోవుచున్నది. ఇది యొక ప్రవాహము వంటిది. నదుల ప్రవాహమువలె గత యౌవనము తిర్గిరాదు.

కనుక తెలివిగలతనమేమియన, ఆ యౌవనము శరీరము నుండి జారిపోకముందే, భౌతిక భోగముల ననుభవించవలెను

కనుక దేవదుర్లభమగు సౌందర్యమును వరప్రసాదముగ పొందిన, ఓ దేవి నన్ను వలచి, నీ యౌవనమును సార్థకము చేసికొనుమని చెప్పి "యావ

నమును" సార్థకముచేసికొను ప్రక్రియ నుపదేశించు చున్నాడు:

> "ఇచ్ఛమాం క్రియతామద్య ప్రతికర్మ తవోత్తమమ్।
> సుప్రభాణ్యేవ సజ్జన్తాం తవాఙ్గే భూషణానిచ॥
> "సాధు పశ్యామి తేరూపం సుయుక్తం ప్రతికర్మణా।
> ప్రతికర్మాభి సంయుక్తా దాక్షిణ్యేన వరాననే॥
> "భుంక్ష్వ భోగాన్యథా కామం పిబ, భీరు, రమస్వచ॥
> (5/20/21-22,23 1/2)

తా॥ నన్ను ప్రేమింపుము, లేక పతిగా అంగీకరింపుము. ఇపుడే చక్కగా నలంకరించుకొనుము. నీ యంగములపై కాంతులను వెదజల్లు ఆభరణములను ధరింపుము॥ నీవు నగలు పెట్టుకొనిన చాల యందముగా నుండును. అందువలన, ఓ చారుముఖి! కర్కశత్వమును త్యజించి, దాక్షిణ్యముతో చక్కగ నలంకరించుకొనుము॥ స్వేచ్ఛగా భోగములను తనివితీర ననుభవింపుము. ఓ భీరు, హాయిగ పానము చేసి, సర్వసుఖములు అనుభవింపుము.

విషయభోగములను తనివితీర యనుభవించవలెనని, యౌవన ముండుట మొదటి షరతు. మాదక ద్రవ్యములను (మద్యములను) సేవించుట రెండవ షరతు. మద్యపానాదులకు తగినంత సంపద యుండుట మూడవ షరతు.

మద్యపానము వలన కామేచ్ఛ, భోగానుభవ శక్తి పెరుగుటతోపాటుగ ధర్మాఽధర్మ వివేకము గూడ పోవును. ధర్మాఽధర్మ వివేకము, విషయ భోగమునకొక ముఖ్య ప్రతిబంధకము. అందువలన భోగవాదులు మద్యపానమును విషయ భోగముతోపాటుగ అవసరమని నొక్కి చెప్పుదురు. కేవలమర్థకామములనే జీవిత లక్ష్యములుగా నంగీకరించు వారందరు రావణుని యీ ప్రసిద్ధ సిద్ధాంతములనే రావణుని కాలమునుండి నేటివరకు వల్లెవేయుచున్నారు. భోగవాదియగు ఉమర్‌ఖయ్యాము గూడ త్రాగుము, తినుము, రమింపుము, అను మూడు సిద్ధాంతములను ప్రతిపాదించియున్నాడు. ఈ సిద్ధాంతములు

గూడ ప్రాచీనములుగనే కన్పించును. "భౌతిక భోగ వాద"మునకు ఈ మూడు సిద్ధాంతములు ఆధార స్తంభముల వంటివి. కనుకనే రావణుడీ సిద్ధాంతములను సీతాదేవికి వివరించుచు నిట్లు పల్కెను -

పిబ, విహర, రమస్వ భుంక్ష్వ భోగా,
న్ధనిచయం ప్రదిశామి మేదినీంచ,
మయి లల లలనే యథా సుఖంత్వం,
త్వయిచ సమేత్య లలంతు బాంధవాస్తే॥ (5/20/35)

తా॥ ఓ లలనా, నేను, నీకు పెక్కు ధనరాశులను, భూమిని ప్రదానము చేయగలను. హాయిగా త్రాగుము (తినుటగూడ ఉపలక్షణము) విహరింపుము. రమింపుము. విషయ భోగముల ననుభవింపుము. నన్ను ప్రేమింపుము. నన్ను ప్రేమించుట వలన నీవేగాదు, నీ బంధువులుగూడ నీవలె సర్వసుఖములనుభవించ వచ్చును.

సారాంశమేమియన కేవల మర్థకామపరులగు వారి జీవిత సిద్ధాంతమేమియన, ధర్మముతో నిమిత్తము లేకుండగ, సర్వసంచయము చేయుట, మద్యపానము చేయుట, నిత్యము, నూతన కాంతలను వెదకి వారిననుభవించుట, వారితో విహారయాత్రకేగుట. ఈ విషయమునే స్పష్టపరచుచు, మరియు రావణుడిట్లు పల్కెలాడు:-

"కుసుమిత తరు జాలసంతతాని, భ్రమరయుతాని సముద్రతీరజాని।
కనక విమల హార భూషితాంగీ, విహరమయా సహభీరు కాననాని॥
(6/20/36)

తా॥ ఓ భీరు: మంచి బంగరు హారములను ధరించి, పుష్పించిన తరువులతో వ్యాపించియున్న, సముద్ర తీరములందు గల, భ్రమరముల ఝంకారములతో నినదించు వనములందు నాతోగూడ విహరింపుము అనగా విహరించుచు, నీ యౌవనమును సార్థకము చేసికొనుము.

ఈ విధముగ, తనను ప్రేమించుట వలన జీవితములో సర్వసుఖములనుభవించవచ్చునని తెల్పి తన యనుగ్రహమున, సీతాదేవి తల్లిదండ్రులు

బంధువులు వారి యభిమాన పాత్రములగు వారు కూడ, సర్వసుఖములు అనుభవించుటకు కావలసిన ధన, కనక, వస్తు వాహనాదులను భూ-రాజ్యాదులను పొందవచ్చునని యాశగూడ చూపినాడు.

ఈ లౌకిక జీవిత సిద్ధాంతమునకు మూల స్తంభములు, అర్థకామములు కేవల మర్థకామములనే జీవిత గమ్యములుగ నంగీకరించుట వలన, సామాజికముగను, రాజనైతికముగను, దైహికముగ గూడ పెక్కు యనర్థములుప్పతిల్లుటయేగాక; పవిత్రత, సంయమము, బ్రహ్మచర్యము, శాంతి మొదలగు నుత్తమ గుణములు లోపించి, లోకము ప్రగాఢమగు అంధతమోవృతమై శాశ్వతముగ సర్వనాశమునందును. మానవుడు తన మానవత్వము నుండి చ్యుతుడై, రాక్షసత్వమునో, పశుత్వమునో పొంది, అర్థకామ పిశాచమువలె బ్రతుకుచు, తన జీవితములోని సుఖ-శాంతులను వినాశమొనరించు కొనుటతో దాటుగ, లోకమునగూడ సుఖ-శాంతులకు నిల్వ నీడలేకుండగ చేసి, యీభూతలముపై నరకమును స్థాపించును. ఈ విషయము రాక్షస వృత్తముద్వారాను, తదధిపతియగు లంకేశుని వృత్తముద్వారాను, వ్యంగ్యపద్ధతిలో వాల్మీకి బోధించియేయున్నాడు:

మానుష జన్మనెత్తిన ప్రతియొక్కరును, తన జీవితమును సుఖశాంతిమయ మొనరించుకొనుటకు; ఇంద్రియ, మనస్సంయమ పాలన మవసరమని చెప్పుచు మనువు ఇట్లు వ్రాసియున్నాడు:-

"ఇంద్రియాణాం ప్రసఙ్గేన దోషమృచ్ఛత్య సంశయమ్।
సంనియమ్యతు తాన్యేవ తతస్సిద్ధిం నియచ్ఛతి॥ (మ॥స్మృ॥ 2/93)

"ఇంద్రియాణాంతు సర్వేషాం యద్యేకం క్షర తీంద్రియమ్।
తేనాస్యక్షరతి ప్రజ్ఞా దృతేః పాత్రాదివోదకమ్॥

(మ॥ స్మృ 2/99)

"వశే కృత్వేంద్రియ గ్రామం సంయమ్య చమన స్తదా।
సర్వాన్సం సాధయేదర్థా నక్షిణ్వన్ యోగత స్తనుమ్

(మ॥ స్మృ॥ 2/100)

తా॥ ఇంద్రియములు విషయములందు ప్రసక్తములగుటవలన తప్పక దృష్టాఽదృష్ట దోషములుదయించును. వానిని, నియమించుటవలన, సకల పురుషార్థ సిద్ధిరూపమగు ఫలము లభించును"

పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములలో, నే యొక్క యింద్రియముపై సంయమము లేకున్నను, ఆ యింద్రియము ద్వారా యతని ప్రజ్ఞ, బెజ్జము పడిన కుండ యందలి నీరువలె క్రమముగ భ్రష్టమగును.

అందువలన, దశేంద్రియములను, తత్ప్రేరకమగు మనస్సును సంయతమొనరించుకొని సర్వపురుషార్థములను, సాధించుకొనవలెను. ఉపాయముతో దేహమును పీడించకుండగ పురుషార్ధ సాధనము చేయవలెను.

గీతలలో శ్రీకృష్ణ భగవానుడు గూడ నిట్లుపదేశించి యున్నాడు:-

"కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహవైరిణమ్॥
(భ॥ గీ॥ 3/37)

"ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్య వైరిణా।
కామ రూపేణ కౌంతేయ దుష్పూరేణాఽనలేనచ॥ (3/39)

తస్మాత్త్వ మింద్రియాణ్యా దౌనియమ్య భరతర్షభ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన-విజ్ఞాన నాశనమ్॥ (3/41)

తా॥ ప్రాణులు పాపములు చేయుటకు కారణము, సర్వాఽనర్థ మూలము కామమే. రజోగుణ ప్రాదుర్భూతమగు, ఈ కామమే క్రోధముగ (కామము, అసఫలమైనపుడు) మారుచున్నది. ఈ కామము ఒక ప్రచండమగు అగ్నివంటిది. ఇది యెంత విషయ భోగరూపమగు ఆహారము నిచ్చినను శాంతింపదు. ఈ కామముచె ప్రేరితులైన మానవులు మహాపాపము లాచరించుచున్నారు. కావున కామముకంటె, వేరు మహా శత్రువు లేదు.

ఈ కామము జ్ఞానమునకు ప్రబల శత్రువు. ఈ కామము అనునది నిత్యము ప్రజ్వలించు యగ్ని. జ్ఞానము, దీనిచే నావరింపబడును.

కనుక, నీవు, మొదట ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అను ఈ మూడింటిని సంయత మొనరింపుము. శాస్త్ర జ్ఞానమును, అనుభవ జ్ఞానమును, ఈ రెంటిని నశింపచేయు పాపరూపమైన కామమును త్యజింపుము. అపుడు గాని యే పనిని యథావిధిగా చేయజాలవు.

అర్థాసక్తి గూడ కామ మూలకమే. ఈ కామమును, ధర్మము ద్వారా సంయత మొనరించుట చేతకానిచో, మానవుడు తన కామాగ్నికి దావణాదుల వలె, తానే యింధనమై నశించును. కామమును ధర్మాచరణముచే సంయత మొనరించవలెను, అనగా, ఏది ధర్మమో దానినే యాచరించుచు, అధర్మ కృత్యములను త్యజించుట ద్వారా, కామము సహజముగనే సంయతమగును. కామమును నియమించ లేనివాడు, శారీరేంద్రియ బలమును కోల్పోయి, చివ ఋకు ఎందుకు పనికిరాక తన జీవితము నాశము చేసికొనును. కనుకనే శ్రీమద్రామాయణమిట్లుపదేశించు చున్నది:-

> "హిత్వా ధర్మం తథాఽర్థంచ కామం యస్తు నిషేవతే।
> సవృక్షాగ్రే యథాసుప్తః పతితః ప్రతి బుద్ధ్యతే॥ (4/38/21)

తా॥ ధర్మార్థములను త్యజించి కేవలము, కామమును సేవించువాడు, సర్వ పురుషార్థముల నుండి చ్యుతుడై, వృక్షాగ్రమున నిద్రించువాడు క్రింద పడిన తరువాత మేల్కొని పశ్చాత్తాప పడునట్లు తన యవివేకమునకు మిక్కిలి దుఃఖపడును.

కనుక ధర్మమును విడచి, అర్థ-కామములను సేవించువాడు, సమాజ శోషకుడు, కంటకుడునునై, తన యర్థప్రాప్తికి లోకమునంతను పీడించును, కామ పరితోషమునకు, పతివ్రతలగు స్త్రీలను బలిచేసి తాను పతితుడై, సమాజమును పతితముగావించును. ధర్మము సకల కల్యాణ సాధకము, అభ్యుదయ నిఃశ్రేయస ప్రాప్తికి హేతువు. సర్వ జగద్రక్షకము. అది మానవుని చిత్తమును శుద్ధ మొనరించును. మానవుని చిత్తములోగల మలిన వాసనలను వినాశ మొనరిందును. అది సమాజమును, అభ్యుదయపథము వెంట నడిపించును. దుర్బలులను; ధనవంతులు, లేక శక్తిమంతుల యుత్పీడనము

నుండి ధర్మమే కాపాడును. ఎవరి ధర్మమును వారు నిర్వహించుటవలన సమాజమున నుత్పీడన భావము తొలగుటయేగాక, సామాజిక సుఖ-శాంతులు వృద్ధిపొందును. లోకమున, ధర్మాత్ములగు వారలే మహత్తరములగు కార్యములను చేసిరి. మహత్తరమైన త్యాగములు చేసిరి ధర్మమునకు కట్టుబడినవారే. సామాజికైక్యభావము వృద్ధినొందును. ధర్మాచరణము చేయువారినే శిష్టులనియును, సచ్చారిత్రులనియును అందురు. అట్టి ధర్మమును లోకప్రతిష్ఠ కొఱకు సామాజికాభ్యుదయము కొఱకు, పరలోక సాధనమునకు, ఆత్మశాంతికి, నిఃశ్రేయసము కొఱకును మేధావులాచరింతురు. కనుకనే సీతాదేవి రామునికి, ధర్మమహత్త్వమును, గుర్తు చేయుచు నిట్లు పల్కినది:-

"ఆత్మానం నియమైస్తైస్తైఃకర్శయిత్వా ప్రయత్నతః।
ప్రాప్యతేని పుణైర్ధర్మో నసుఖాల్లభ్యతే సుఖమ్॥ 3/9/3) అని.

తా॥ ఆయా నియమములను సదా పాలించుచు, తన శరీరమును కృశింప చేయుట ద్వారా, మేధావులు ధర్మమును పాలింతురు. శారీర సుఖమును కోరి, ధర్మమును పాలింపనివారు సుఖమును పొందజాలరు.

కావుననే శ్రుతి యిట్లు పల్కినది:-

మం॥ ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా। లోకే ధర్మిష్ఠం ప్రజా ఉపసర్పన్తి। ధర్మేణా పాపమ పనుదతి। ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్। తస్మాద్ధర్మం పరమం వదన్తి॥

తా॥ సమస్త జగత్ప్రతిష్ఠకు ధర్మమే మూలము. లోకమునందు గూడ ప్రజలు ధర్మిష్ఠుని యొద్దకు వత్తురు. అతనినే విశ్వసింతురు. ధర్మాచరణము చేతనే పాపములు తొలగిపోవును. సమస్తలోకము ధర్మమునందే ప్రతిష్ఠితమై యున్నది. అందువలననే ధర్మమన్నిటికంటె గొప్పది.

కనుక ధర్మ విరహితమైన యర్థకామ సేవనము సర్వానర్థమూలము లోకమున నశాంతికి, ఉత్పీడమునకును మూలము. ఇహపరలోక దుఃఖదాయకము. మానవుని సర్వ విధమగు ప్రగతికిని యవరోధము. కేవలము కామమును సేవించు వాడు పశువుకంటెను జఘన్యుడు, కనుకనే కామాత్ములగు రాక్షసులకు అధర్మాచరణము వలన మహోత్పాతము కల్గునని *తెలియదు. ధర్మ మహత్త్వము గూడ తెలియదు.

---

1. "అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతిహి సాంప్రతమ్।
నైతే ధర్మం విజానంతి రాక్షసాః పిశితాశనాః॥ (5/26/34)

## 19. అశోకవనములో సీతాదేవి

శ్రీ మద్రామాయణమునకు నాయికా - నాయకులగు సీతా - రాములకు ... ప్రాధాన్యమిచ్చుచు, తన కావ్యమునకు భగవాన్ వాల్మీకి, "శ్రీమద్రా ...యణ"మనియు, "సీతాయాశ్చరితం" అనియు నామకరణము చేసినాడు. ...నుకనే హనుమంతుడు వారిద్దరి శీల-వృత్త సమత్వమును వానరులకు వివరించుచు, నిట్లు పలికినాడు:-

"సఫలో రాఘవో ద్యోగ స్సుగ్రీవస్య చ సంభ్రమః।
శీల మాసాద్య సీతాయా మమచ ప్రీణితం మనః॥

"ఆర్యాయా స్సదృశం శీలం సీతాయాః ప్లవగర్షభాః।
తపసా ధారయేల్లోకాన్ క్రుద్ధావా నిర్దహేదపి॥ (5/59/2,3)

తా॥ శ్రీరామచంద్రుని ప్రయత్నము, సుగ్రీవుని సంభ్రమమున్నూ సఫలములు. సీతాదేవి శీలమును చూచిన తరువాత నా మనస్సు చాల ...యానంద పడినది.

ఓ ప్లవగర్షభులారా! పూజ్యురాలగు సీతాదేవి యొక్క శీలము, ఆమె ...వమునకు తగినట్లుగ నున్నది ఆమె తన తపోబలముచే నన్ని లోకములను ధరించగలదు కోపముచే భస్మము చేయగలదు గూడ.

అస్తు. సీతాదేవి చారిత్రము మహామహిమోపేతము. ఆమె, శ్రీరాముని ధర్మప్రతిష్ఠా వ్యవసాయమున సహభాగిని ఆమె చారిత్రము విశ్వములోని ...కల నారీలోకమున కాదర్శము కాదగినది. ఆమె సర్వానవద్యమగు సౌందర్యము, అనన్యస్యమగు పతినిష్ఠ, పెద్దల యెడ గౌరవము, ధర్మనిష్ఠ, వినయ ...వివేక, సౌశీల్యాది సద్గుణములు, కష్టసహిష్ణుత, అపకారులయందు గూడ ...షరాహిత్యము, కరుణ, నిర్మలప్రేమ, త్రికరణశుద్ధి, పరగుణ గ్రహణ ...కృతజ్ఞత, సౌమనస్యము, పరదుఃఖ కాతరత, ధైర్యము, మమత, ...యత వాత్సల్యము, ఇది యది యననేల, ఆమె, సకల సద్గుణములకు పె...ధానము.

శ్రీమద్రామాయణ కవి, సుందరకాండలో సీతాదేవి. శీల-చారి సౌందర్యమును వర్ణించుటతో బాటుగ, ఆమె దివ్యాభిజనమును గూడ నుల్లేఖించి యున్నాడు అశోకవనికలో రాక్షస స్త్రీల మధ్యమున, భర్తృవియోగ కర్శితయగు సీతాదేవిని చూచి, యామె దివ్యాభిజనము ను స్మరించుచు, హనుమంతుడు పల్కిన ఈ క్రింది పల్కులు చూడుడు:

"ఇయం సా ధర్మశీలస్య జనకస్య మహాత్మనః।
సుతా మైథిల రాజస్య సీతా భర్తృ దృఢవ్రతా॥
"ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే।
పద్మరేణు నిభైః కీర్ణా శుభైః కేదార పాంసుభిః॥
"విక్రాంతస్యార్య శీలస్య సంయుగేష్వని వర్తినః।
స్నుషా దశరథస్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ॥
"ధర్మజ్ఞ స్యకృతజ్ఞస్య రామస్య విదితాత్మనః।
ఇయం సా దయితా భార్యా రాక్షసీ వశమాగతా॥

(5/16/15-18)

తా॥ ఈమె ధర్మశీలుడును, మహాత్ముడును, మిథిలాధిపతియునునగు జనక మహారాజు కూతురు. ఈమె భర్తృదృఢవ్రత.

హల ముఖక్షతమగు క్షేత్రమునుండి (దున్నిన భూమినుండి) భూమిని భేదించుకొని, పద్మకింజల్కములను బోలిన, కేదార పాంసువులతో నవ సంఛిత్రమగు శరీరముతో నీమె యావిర్భవించినది.

పరాక్రమ సంపన్నుడును, ఉత్తమ శీల సంపన్నుడును, యుద్ధములలో వెనుదిరుగని వాడునునగు దశరథ మహారాజు యొక్క, యశస్వినియగు (సద్గుణముల మూలమున) పెద్దకోడలు, ఈమె.

ధర్మజ్ఞుడును, కృతజ్ఞుడునునగు శ్రీరామచంద్రుని దయితయ ఈమె (కాలవశమున) రాక్షస స్త్రీలకు వశమైనది!

ఆమెకు తన మామగారియందు, అత్తగార్లయందుగల గౌరవమును, వారికామెయందుగల వాత్సల్యమును; అట్లే యామెకు, తమమ్ముదుల

యందుగల పుత్రనిర్విశేషమగు వాత్సల్యమును, వారికి తమ యందుగల పూజ్య భావమును వాల్మీకి చిత్రించి యామెశీల సౌందర్యమున పరిమళములను గుబాళింప చేసినాడు.

ఇక యామె భర్తృభక్తిని ఆమె శీలసంపదను, భర్తృవిరహిణియగు ఆమె తపస్వినీత్వమును వాల్మీకి ఉపమాన శైలినాశ్రయించి, బాలమార్మికముగ చిత్రించినాడు. ఈ క్రింది పంక్తులను చూడుడు:-

"సర్వాన్ భోగాన్పరిత్యజ్య భర్తృ స్నేహ బలాత్కృతా।
అచింతయిత్వా కష్టాణి ప్రవిష్టా నిర్జనంవనమ్॥

"సంతుష్టా ఫలమూలేన భర్తృ శుశ్రూషణా పరా।
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా॥

"సేయం కనక వర్ణాంగీ నిత్యం సుస్మిత భాషిణీ।
సహతే యాతనా మేతామ నర్థానా మభాగినీ॥

(5/ 6/19-21)

తా॥ భర్తృ స్నేహ వివశయై, సర్వభోగములను పరిత్యజించి, కష్టములను పరిగణించక, ఈ దేవి భర్తతోగూడ నిర్జనారణ్యమును ప్రవేశించినది.

(భర్త తెచ్చియిచ్చు) ఫలములతోనే తృప్తిపడి, భర్తృ శుశ్రూషా పరురాలై. వనములో నుండి గూడ (భర్తృవాల్లభ్యము మూలమున) రాజభవనమునందు (అయోధ్యలో) నున్నపుడెంత సంతోషముగ నుండెడిదో, యంత సంతోషమునే వనమునందుగూడ పొందుచున్నది.

బంగరు దేహవర్ణముగల ఈ దేవి, నిత్యము సుస్మిత పూర్వకముగ మాట్లాడుచు, పూర్వమెట్టి దుఃఖమునెఱుగక యిపుడు (విధివశమున) రాక్షస స్త్రీలు పెట్టు ఈ యమయాతన ననుభవించుచున్నది.

ఇక హనుమంతుడు, ఒక మహార్హమగు శయనముపై, గాఢముగ నిదురించు మందోదరిని చూచి, సీతయని భ్రమపడి, తిర్గి యామె సీతగాదను నిశ్చయము చేయుటలో చూపిన ఈ క్రింది హేతువులను చూడుడు:-

"న రామేణ వియుక్తా సా స్వప్తుమర్హతి భామినీ।
న భోక్తుం నాప్యలంకర్తుం న పానముపసేవితుమ్॥

"నాఽన్యం నరముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్।
న హి రామసమః కశ్చిద్విద్యతే త్రిదశేష్వపి॥

"అన్యేయమితి నిశ్చిత్య భూయస్తత్ర చచార సః॥

(5/11/2,3 4 1/2)

తా॥ రామ వియుక్తురాలగు సీత నిద్రపోదు, ఆహారమును భుజింపదు, అలంకరించుకొనదు. పానమున కిచ్ఛగింపదు॥

పరపురుషుని, అతడు దేవతలకధిపతియే యగుగాక, సేవింపదు. దేవతలలో గూడ రామునికి సముడులెడు. కనుక, ఈమె సీత, కాదను నిశ్చయమునకు వచ్చి, తిర్గి తన యన్వేషణమును కొనసాగించెను.

ఇక సీతాదేవియొక్క యనవద్య సౌందర్యమును దర్శింపుడు:

ఆమె శతపత్రనిభేక్షణ (పద్మపలాశాక్షీం) 5-35.31) మృగశాబాక్షి. ఆమె నేత్రములు విమలములు, రక్తాంతములు. ఆమె కనుపాపలు కృష్ణవర్ణము గలవి (విశాలే, విమలే, నేత్రే, రక్తాంతే, కృష్ణతారకే(3/46/18) ఆమె మోము పూర్ణచంద్రునివలె, నాహ్లాదకములగు, సుధామయ కాంతిపుంజముల నీనుచుండును (పూర్ణేందు సదృశాననా, పూర్ణచంద్రనిభాననా, కోమలగాత్ర, కనకవర్ణాంగి (5 16/21; 5/15/49) సమములు, కొనలు తేలినవి, స్నిగ్ధములు, ధవళములు, సుందరములునగు దంతములు గలది (సమాశిఖరిణః స్నిగ్ధాః, పాండురాః) బింబోష్ఠి లేక తామ్రోష్ఠి (5/11/29; 2/24/29) నల్లనివియు, సూక్ష్మములును, సుందరములు, నిడుదలునగు కేశములు గలది (నీల నాగాభయా వేణ్యా (5/9/28) అందమైన కనుబొమలు. సుందరమగు ముఖము, చారు, వృత్త, పయోధరోత్సేధము గలది (పూర్ణచంద్రాననాం సుభ్రూం, చారు వృత్తపయోధరామ్॥ (5-15-31) నీల కంఠి, సన్నని నడుము గలది, చక్కని యవయవ సంస్థానము గలది (తాం నీలకంఠీం బింబోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితాం (4/15/18) చారుహాసిని. సుస్మితముతో నొప్పు ముఖము కలది, మధుర భాషిణి, అందమగు నాసిక గలది (సునాసా), పల్లవములవలె కోమలములగు బాహువులు గలది (బాహూ,

పల్లవ కోమలో) విస్తీర్ణ జఘన (విస్తీర్ణ జఘనాం, పృథుశ్రోణీం, విశాల జఘనం పీనం బిభ్రతా) కదళీ. కరికరోపములును, వృత్తములునగు ఊరువులు గలది; పల్లవములవలె కోమలములగు చరణములు గలది, సువిభక్తాంగి (సువిభక్తాంగీం (4-17-30), సమవిభక్తాంగీం (29-31-37), పీతకౌశేయ వాసిని, చారువిలాసిని, అనవద్యాంగి, ఉత్తమగుణ శోభిత, ఉత్తమాభిజనము గలది, ఉత్తమ శీల చారిత్ర సంపన్నురాలు, నిరుపమ సౌందర్య శోభిత (సాసు శీలా, వపుఃశ్లాఘ్యా, రూపేణాఽప్రతిమాభువి) సకలనారీ వరిష్ఠ (వరిష్ఠా సర్వనారీణాం). తన దేహకాంతులచే దిక్కులను తిమిర రహితములుగ చేయు మహాతేజో విరాజిత (కుర్వతీం ప్రభయాదేవీం సర్వావితిమిరాదిశః (5-15-29) దివి నుండి భువికవతరించిన దేవత (దివి దేవతా) వేయేల, సకల కల్యాణగుణ శోభితురాలు.

ఇక యామెయందు సాముద్రిక శాస్త్రమునందు వర్ణించబడిన, స్త్రీలయందపేక్షితములగు సర్వశుభ లక్షణములు గలవని వాల్మీకి యుద్ధకాండమున వర్ణించియున్నాడు

భగవాన్ వాల్మీకి యామె సర్వానవద్యమగు ప్రాకృత సౌందర్యముతో బాటుగ, నప్రాకృత దివ్యసౌందర్యమును గూడ నచటచట యుల్లేఖించియున్నాడు:-

'త్రైలోక్యరాజ్యం సకలం సీతాయానాప్నుయాత్కలామ్॥ (5/16/14) "వరిష్ఠా సర్వనారీణా మేషాచదివి దేవతా॥) పౌర్ణమా సీమివనిశామ్, పూర్ణేందు సదృశాననామ్, శాంతామగ్ని శిఖామివ (5/19/5); ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచంద్ర ప్రభామివ (5/15/29 క్షీణపుణ్యాం చ్యుతాంభూమౌ, తారాం నిపతితా మివ్య మో॥ పంక్తులు, ఆమె దివ్య సౌందర్యద్యోతకములు.

ఇక యామె శీలవృత్త సౌందర్యమును పలుతావుల నాది కవి మార్మికముగ చిత్రించినాడు;-

"యధాశచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి।
అరుంధతీ వసిష్ఠంచ రోహిణీ శశినంయధా॥

"లోపాముద్రా యథాగస్త్యం సుకన్యా చ్యవనం యథా।
సావిత్రీ సత్యవంతంచ కపిలం శ్రీమతీయథా॥
"సౌదాసం మదయన్తీవ కేశినీ సగరం యథా।
నైషధం దమయన్తీవ భైమీపతిమనువ్రతా॥
"తథాహ మిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా॥

(5/24/10-13)

తనను రావణుని భర్తగానంగీకరించి, యతనితో సుఖింపుమని బాధించు రాక్షస స్త్రీలకు, తన పత్యనువ్రతత్వమును తెల్పుచు సీత యిట్లు ఘోషించెను; మహా భాగ్య సంపన్నురాలగు శచీదేవి, దేవేంద్రుని, అరుంధతి-వసిష్ఠుని, రోహిణి-చంద్రుని, లోపాముద్ర-అగస్త్యుని, సుకన్య-చ్యవన మహర్షిని, సావిత్రి-సత్యవంతుని; శ్రీమతి-కపిలమహర్షిని, మదయంతి-సౌదాసుని, కేశిని-సగరుని, నిషధాధిపతి యగు నలుని-భీమరాజు కూతురగు దమయంతియు నెట్లు సర్వాత్మనా యను వర్తింతురో, యట్లే నాపతిని నేను సర్వాత్మనాయను వర్తింతును.

ఆమె వృత్తశీల సంపన్నమును, శిక్షాచార సంపన్నమును, ధార్మికమునునగు కులములో పుట్టినది యనియు; స్వయముగ శీల, వృత్త అచార సంపన్నురాలనియు, ధర్మాత్మురాలనియు, ప్రాణములు పోయినను అధర్మము నాచరింపదనియు, పతిపరాయణయనియును వాల్మీకి పలుతావుల నుల్లేఖించి యున్నాడు.

అనురక్తాహి వైదేహీ రామే సర్వాత్మనా శుభా।
అనన్య చిత్తా రామేణ పౌలోమీవ పురందరే॥ (5/59/23

తా॥ సర్వ శుభ లక్షణ యుక్తురాలగు సీతాదేవి, రామునియందు సర్వాత్మనా యనురక్తురాలు. ఆమె శచీదేవి, దేవేంద్రుని యందెట్లు, అనన్య చిత్తయో యట్లే సీతాదేవి గూడ.

వారి యానురూప్యమీయనన్య చిత్తతకు హేతువని గూడ, వాల్మీకి ధ్వనింప చేసినాడు:-

"అస్యాదేవ్యా యథారూప మంగ ప్రత్యంగ సౌష్ఠవమ్।
రామస్యచ యథారూపం తస్యేయ మసితేక్షణా॥

"అస్యాదేవ్యా మనస్తస్మిం స్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్।
తేనేయం సచ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి॥

(5/15/51,52)

తా॥ ఈ దేవి రూపము, అంగప్రత్యంగ సౌష్ఠవము, రాముని రూపము, అంగప్రత్యంగ సౌష్ఠవమునకు తగినట్లునున్నది. ఈ కాటుక కన్నులు గల దేవి రామునికి సర్వథా తగిన భార్య.

ఈ దేవి మనస్సు సర్వాత్మనా రామునియందు, రాముని మనస్సు సర్వాత్మనా, ఈ దేవి యందును ప్రతిష్ఠితమై యుండుట వలననే, ధర్మాత్ముడును, మహాత్ముడునునగు రాముడు ముహూర్తకాలమైన జీవించుచున్నాడు.

కనుకనే, శారీరముగ రాముని కగుపించక పోయినను, శ్రీరాముని మనస్సున ఈ దేవి, శాశ్వతముగ నిల్చియున్నది: ఇదియేగద ప్రేమయొక్క పరాకాష్ఠ! ఈ క్రింది పంక్తులను చూడుడు:-

"ఇయం సా కనక వర్ణాంగీ రామస్య మహిషీ ప్రియా।
ప్రణష్టాపి సతీయస్య మనసో న ప్రణశ్యతి॥ (5 15/48)

తా॥ బంగరుమేని కాంతిగలదియును, రామునికి దేవేరియును, ప్రియురాలునునగు సీత శ్రీరాముని కంటికగుపించకయే యున్నను, అతని మనస్సున మాత్రము చెరిగిపోక, స్థిరముగ నిల్చియే యున్నది.

కాని యిట్టి ధర్మాత్మురాలు, సర్వశుభలక్షణ సంపన్నురాలునునగు సీతాదేవి, విధివశమున రావణునిచే నపహృతురాలై, లంకానగరమున గల యశోకవనికలో రాక్షసీ మధ్యమున గుప్తయై: పతి వియోగ దుఃఖముచే, వ్యథితయై, నిత్యము దుఃఖమయమైన జీవితమును వెళ్లబుచ్చుచు, ఎప్పటికైన, రామునితో కలియకపోదునా యను మిణుకు-మిణుకుమను నాశతో, యెట్టులో ప్రాణములను చిక్క-బట్టుకొని, పలుయాతనములకు లోనగుట యెట్టి వజ్ర హృదయములనైన, కరుగ చేయకమానదు. కాలమెట్టి వారికినైన యనుల్లం

ఘ్నముకదాయని, దాంపత్య భావము నెరుగని హనుమంతుడు గూడ, మన స్సులో ననుకొని, మిక్కిలి దుఃఖించెను *

రామాయణకవి, సీతా-రాముల దాంపత్య ప్రణయము యొక్క యగాధత్వమును, చూపుటకు, వారి వియోగ జీవితమును చాల గాఢముగ చిత్రించి యున్నాడు. వియోగాగ్ని పుట పాకమున, దాంపత్య ప్రణయములోగల, మాలిన్యము (కామ సంస్పర్శ రూపమగు) భస్మమై, పరస్పర శారీరాకర్షణముతో నారంభమైన కామము, భోగవాసనయు దగ్ధముకాగా, శుద్ధప్రణయరూపమును బొంది, దంపతుల యాత్మలయందు శాశ్వతముగ ప్రతిష్ఠితమై యమరత్వము నందును. అనగా జన్మ-జన్మల కనుస్యూతమగును, ఇట్టి శుద్ధప్రేమ నాశ్రయించియే, ప్రేమికులు, శారీరస్థితినుండి, పైకిలేచి, మనోమయ సామ్రాజ్యమున ప్రవేశించి, శుద్ధ ప్రణయామృతము నాస్వాదింతురు, స్థూలమగు శరీరస్థితి (స్థూల భౌతికస్థితి) నుండి; సూక్ష్మమగు భావలోకమున లేక భావ సామ్రాజ్యమున ప్రవేశించుటకు సాధనమగుట చేతనే, యీ శుద్ధప్రేమ, ప్రేమికులకే గాక, యుపాసకులకు గూడ సంసేవ్యమై, ఋషులచే సంస్తుతమైనది. ఇట్టి విరహ నిష్టప్తమగు శుద్ధప్రేమనే శ్రీమద్భాగవతకారుడు చదువురాని గొల్లల యందును గొల్లతలయందును చూపి, వారి మహాభాగ్యమును శ్రుతిధరుడగు బ్రహ్మదేవునిచే స్తుతింపచేయుటతో** పరితోషమందక; శ్రీకృష్ణుని కంతరంగ సఖుడును, జ్ఞానఖనియునగు నుద్ధవుని ద్వారా గొల్లతల శుద్ధ

---

1. "మాన్యాగురు వినీతస్య, లక్ష్మణస్య గురుప్రియా।
యది సీతాహి దుఃఖార్తా, కాలోహి దురతిక్రమః॥

"స, ముహూర్తమివ ధ్యాత్వా బాష్ప పర్యాకులేక్షణః।
సీతామాశ్రిత్య తేజస్వీ హనుమాన్విలలాపహ॥

(5/16/3 : 5/16/2)

2. "అహో భాగ్య మహోభాగ్యం నందగోప వ్రజౌకసామ్।
యన్మిత్రం పరమానందం పూర్ణం బ్రహ్మ సనాతనమ్॥

(శ్రీమద్భాగ 10/14/32)

ప్రేమను ప్రశంసింపజేసి, వారి పాదరజమునకు ఉద్ధవునిచే వందన మాచరింపజేసి, శుద్ధప్రేమ యొక్క మహత్త్వమును లోకమునకు చాటి యున్నాడు, ఈ క్రింది పంక్తులను చూడుడు:-

"వందే నందవ్రజ స్త్రీణాం పాదరేణుమభీక్ష్ణశః।
యాసాం హరికథోద్గీతం పునాతి భువనత్రయమ్॥
(శ్రీమద్భాగవత, 10/47/64)

తా॥ నందవ్రజమున నివసించు గొల్లతల పాదరేణువునకు పదే పదే నమస్కారము చేయుచున్నాను. వారి హరికథోద్గానము భువనత్రయమును పావనము గావించుచున్నది.

ప్రేమస్వరూపుడగు భగవానుని కథామృతమే, విరహసంతప్తులగు జీవుల జీవన సర్వస్వము. అది శ్రవణ మంగళప్రదము అనంతమైనది. నీ ప్రేమకథను గానముచేయు, మహాత్ములే, భూరి ప్రదాతలు.* వారు లోకమునకు నీ శుద్ధ ప్రేమనిచ్చి, ఓ కృష్ణా, నిన్ను పొందుటకు తోడ్పడుచున్నారు. కనుకనే నీ శుద్ధ ప్రేమామృతము సకల కలుషాపహము. కనుకనే కవులచే (విద్వాంసులచే) నిత్యము గానము చేయబడుచున్నది.

శ్రీమద్భాగవతకారుని ఈ యమర ప్రేమగీతము నీ క్రిందివిధముగ గూడ నన్వయించ వచ్చును: విరహసంతప్తులగు ప్రేమికుల సంతప్తజీవనమే, అమృతరూపమైన శుద్ధ ప్రేమకథ. విరహ సంతప్తుల విరహగీతములే, మానసములగు సకల వాసనలను దహింపజేసి, ప్రేమాస్పదమగు పరమాత్మ యందు కేంద్రిత మొనర్చును కనుకనే ప్రేమికుల, సర్వకలుష భంజకమగు విరహసంతాపమును ఋషులు గూడ స్తుతింతురు. ఈ విప్రలంభ ప్రేమగాథ యనంతము, అనాది గూడ, అందువలననే యుగ సృష్ట్యాది నుండి నేటి వరకు వ్యాప్తమై ప్రేమికులచే సుపాసితమగు చున్నది. ఇట్టి, విరహనిష్టప్తమైన శుద్ధ ప్రేమగీతములను గానము చేయువారు. నిజముగ ధన్యులు. వారు లోకమునకు

---

1. "తవకథామృతం తప్తజీవనం, కవిభిరీడితం కల్మషాపహమ్।
శ్రవణమంగలం శ్రీమదాతతం। భువిగృణన్తితే భూరిదాజనాః॥
(శ్రీమద్భాగ 10/31/9)

తమ విరహ గీతముల ద్వారా తమ యాత్మనే ప్రసాదించి యాత్మప్రాప్తికి తోడ్పడు చున్నారు, అని.

సంస్కృతభాషలో, శ్రవణ మంగళమగు అనంతమైన, ఈ విరహ వ్యధను గీతిరూపమున వెలయించిన, మొదటి విశ్వకవి భగవాన్ వాల్మీకి. సుందరకాండలో సీతా-రాముల వియోగ వ్యధను సుందరముగ చిత్రించి- భగవాన్ వాల్మీకి, ప్రేమలోని దివ్య సౌందర్యము నీకాండముద్వారా నాస్వాద యోగ్యమొనరించి, ఈ కాండకీ నామమును అన్వర్థమొనరించినాడు. ఇపుడు మనము సీతాదేవియొక్క వియోగ వ్యధలోని ప్రగాఢత్వమును దర్శింతుము గాక:

శ్రీరామ వియోగ వ్యధతో గుందు సీతాదేవి, శరీర మనస్సంతాపకర మగు విరహ సంతాపముతో బాటుగ, దాన నామె పొందు దైన్యమునుగూడ ఆది కవి చాల మార్మికముగ చిత్రించినాడు:-

అశోక వనములో సీత :

1. "మలినేనతు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్।
సంవృతాం మృగ శాబాక్షీంద దర్శహనుమాన్కపిః॥
(5/17/26)

2. "పీతేనైకేన సంవీతాం క్లిష్టేనోత్తమవాస సా।
సపంకా మనలంకారాం విపద్మామివ పద్మినీమ్॥ (5/15/21)

3. "లక్షయామాస లక్ష్మీవాన్ హనూమాఞ్జనకాత్మజామ్।
నిష్ప్రభాం శోకసంతప్తాం మలసంకుల మూర్ధజామ్॥
(5/ 7/19)

4. "నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా।
"నీలయా నీరదా పాయే వనరాజ్యామహీమివ॥ (5/17/25)

5. "అశ్రుపూర్ణముఖీం దీనాం కృశామనశనేనచ।
శోకధ్యాన పరాందీనాం నిత్యం దుఃఖపరాయణామ్॥ (5/15/23)

6. "ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ।
పరిక్షీణాం కృశాం దీనా మల్పా హారాం తపో ధనామ్॥ (5/19/20)

7. "రామోపరోధ వ్యథితాం రక్షో గణని పీడితామ్।
అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తత స్తతః॥ (5/15/35)

8. "బాష్పాంబు పరిపూర్ణేన కృష్ణ వక్రాక్షి పక్ష్మణా।
వదనేనాఽప్రసన్నేన నిఃశ్వసంతీం పునఃపునః॥ (5/15/36)

9. "మలపంక ధరాం దీనాం మండనార్హామ మండితామ్।
ప్రభాం నక్షత్ర రాజస్య కాలమేఘైరివాఽఽవృతామ్॥ (5/15/37)

10. "స దదర్శ తతస్సీతాం పూర్ణచంద్ర నిభాననామ్।
శోకభారైరివ న్యస్తాం భారైర్నావ మివాఽమ్బుసి॥ (5/17/3)

తా॥ వానరుడగు హనుమంతుడు, మలినమైన ప్రాత వస్త్రమును గట్టుకొని మృగశాబకమువలె, భయత్రస్తమైన నేత్రములతో నటునిటు చూచు సీతను చూచెను.

2. మాసిన, పచ్చని పట్టువస్త్రమును సీత ధరించియుండెను. నగలు ధరింపక, విపద్రూపమైన బురదలో కూరుకొనిపోయి; పంకములోనున్న, పద్మములు లేని పద్మినివలె ఆమె శోభ దఱిగియుండెను

3. దుమ్ముకొట్టుకొనిన కేశములతో, వన్నె దఱిగి; శోకముతో నిత్యమును కుందు సీతాదేవిని హనుమంతుడు చూచెను.

4. జఘన పర్యంతము వ్యాపించిన, నల్లని త్రాచుపామువలె దీర్ఘమైన అడగట్టిన కేశములుగల వేజిగల్గి, మేఘములు పోయిన పిదప, స్పష్టముగ కన్పించు వృక్షపంక్తితో నొప్పు భూదేవివలె, ఆమె ఉండెను.

5. భోజనము చేయకపోవుటచే మిక్కిలి కృశించినదియు, కన్నీళ్లతో నిండిన మోముగలదియు, చింతా శోకములలో మునిగియున్నదియు, దీనురాలును, నిత్యము దుఃఖించుచున్నదియునగు సీతను చూచెను.

6 ఉపవాసములు చేయుట వలనను, శోకముచేతను, చింతచేతను, భయముచేతను మిక్కిలి కృశించినదియు, దీనురాలును, అల్పాహారయు, తపస్వినియునగు సీతను చూచెను.

7. రామసేవయందు ప్రతిబంధముగల్గుటచే నిరంతరము వ్యధితచిత్త యును, రక్షోగణముచే నిరంతరము పీడితయు, మృగశాబకమువలె బిత్తర-బిత్తర చూపులతో నలువైపుల చూచుచు, నిత్యము ఆపత్తును శంకించుచున్న దియునగు సీతను చూచెను.

8. కన్నీటితో నిండినదియు, నల్లని వన్నెగల్గి వక్రములై యొప్పు కనుబొమ్మలు గల మోముతో దీర్ఘ-దీర తరములైన నిశ్వాసములు విడచుచు, అప్రసన్నమైన ముఖముతో నున్న సీతను చూచెను.

9. మలపంకముతో గప్పబడిన తను యష్టిగల్గి, యలంకార రహితయై దైన్యమును ప్రకటించుచు, అలంకారధారణ యోగ్యమగు తనువు గల్గియు నలంకరించుకొనక; నల్లని మేఘములచే నావృతమగు, చంద్రప్రభనుబోలిన సీతాదేవిని చూచెను.

10. పూర్ణచంద్రుని బోలిన సుందరమగు మోముగల్గి, మితిమీరిన భారముతోనున్న నావ యంచుల వఱకు నీటిలో మునుగునట్లు, శోకభారముచే దుఃఖ సముద్రమున పీకవఱకు మునిగిన సీతాదేవిని హనుమంతుడు చూచెను.

విరహిణియగు సీతాదేవియొక్క కరుణామయమగు యాకృతిని, దైన్యమును, భౌతిక భోగానాసక్తిని, జీవిత విరక్తిని, మూర్తివంత మొనరించుచు రామాయణకవి నిర్మించిన ఈ విరహిణీరూప చిత్రములు నిరంతర దర్శనీయములు. వీనిలోని శిల్పమును సావధానముగ చూచుటతో బాటుగ, ఇందు ప్రదర్శితమగు కళావైదగ్ధ్యము భావుకులకు మనన యోగ్యము.

ఇక తన బంధువులకును, భర్తకును దూరము చేయబడి రాక్షసస్త్రీల మధ్యమునవసించు సీతాదేవి యొక్క యసహాయ స్థితిని, దీనమగు మానస స్థితిని, అభివ్యంజించుటకై నిర్మించిన ఈ శబ్ద చిత్రములను దర్శింపుడు:-

1. "భూషణై రుత్తమైర్హీనాం భర్తృ వాత్సల్య భూషితామ్॥
రాక్షసాధిప సంరుద్ధాం బంధుభిశ్చ వినా కృతామ్॥ (5/17/21)

2. "వియూథాం సింహసంరుద్ధాం బద్ధాంగజవధూమివ।
చంద్రరేఖాం పయోదాన్తే శారదా భ్రైరివావృతామ్॥ (5/17/22)

3. "గృహీతాం ఆడి తాం స్తంభేయి-ధపేన వినా కృతామ్।
నిఃశ్వసన్తీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ॥ (5/19/19)

4. "రాక్షసీభిః పరివృతాం శోక సంతాప కర్శితామ్॥
మేఘరేఖ పరివృతాం చంద్రరేఖేవ నిష్ప్రభామ్ (5/19/22)

5 "ప్రియంజన మపశ్యన్తీం పశ్యన్తీం రాక్షసీగణమ్।
స్వగణేన మృగీం హీనాం శ్వగణే నావృతామివ॥ (5/15/24)

6. "అశోక వనికా మధ్యే శోక సాగర మాప్లుతామ్।
తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్॥
దదర్శ హషూమాం స్త్రతలతా మకుసుమామిద॥ (5/17/24)

తా॥ 1. మంచి. నగలను ధరించకున్నను, భర్తృవాత్సల్యమను భూషణమును ధరించినదియు, రాక్షసేశ్వరునిచే బంధించ బడినదియు, బంధువులు దగ్గర లేకుండగ చేయబడినదియును, 2. తన యూధమునకు దూరము చేయబడి సింహముచే సంరుద్ధమై ఇటు నటు కదలుటకు వీలు లేకుండునట్లుగ బలమైన గొలుసుతో బంధింపబడిన కరిణినిబోలినదియు; వర్షఋతువు గడచిన పిదప, శారద మేఘముల పిండుచే నావరించబడిన చంద్రరేఖను పోలినదియు, 3. యూథపతిచే వేఱుచేసి స్తంభమునందు కట్టివేసి తాడనముచే మిక్కిలి బాధించబడిన గజరాజ వధువువలెను, రాక్షసస్త్రీల తర్జన-భర్జనలకు లోనై, దీర్ఘ దీర్ఘతరములగు నిఃశ్వాసములను విడచుచు, మిక్కిలి దుఃకార్తయును; 4. రాక్షస స్త్రీ పరిగతయును, శోక సంతాప కర్శితయును, మేఘరేఖ పరివృతమైన చంద్రకళను బోలినదియు, 5. తన ప్రియజనమును చూడకపోగా నిరంతరము రాక్షసీ గణమునే చూచుచున్నదియు, స్వగణముచే వేఱుచేయబడి, వేటకుక్కలు చుట్టుముట్టిన లేడి చందమున నున్నదియు,

6. శోక సాగరమున మునిగి పోయినదియు, క్రూరగ్రహాక్రాంతమైన రోహిణి వలె క్రూరురాండ్రగు రాక్షస స్త్రీలచే పరివేష్టిత యును, పుష్పహీనయగు లతవలె, మోడువారినట్లున్నదియు శ్రీ హీనయునగు సీతాదేవిని హనుమంతుడు చూచెను

పై చిత్రములన్నియును బంధువులకు దూరము చేయబడి, రాక్షసేశ్వరునిచే బందీగా కొనిపోబడి, క్రూర స్వభావముగల రాక్షస స్త్రీలచే నిరంతరము బాధించబడు సీతయొక్క దయనీయమగు దశను కొట్టవచ్చినట్లుగ చిత్రించిన విరహిణి చిత్రములు

తన భర్తచే సంరక్షింపబడుచు, నిత్య సంతోషముతో జీవితమును గడపిన, సీతాదేవి, భర్తచే వేరుచేయబడిన పిదప, తన శోభనంతనుగోల్పోయి పొందిన దయనీయస్థితిని తెల్పు ఈ క్రింది శబ్ద చిత్రములను చూడుడు:-

1. "క్లిష్ట రూపామ సంస్పర్శాదయుక్తామివ వల్లకీమ్।
సతాం భర్తృహితే యుక్తామయుక్తాం రక్ష సాంవశే॥
(5/17/23)

2. "పతి శోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ।
పరయా మృజయా హీనాం కృష్ణపక్షేనిశామివ॥
(5/19/16)

3. "సుకుమారీం సుజాతాఙ్గీం రత్న గర్భ గృహోచితామ్।
తప్యమానా మివోష్ణేన మృణాళీ మచిరోద్ధృతామ్॥
(5/19/17)

4. "అసంవృతాయా మాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్।
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివా వనస్పతేః॥
(5/19/5)

5. "క్షితిక్షమా పుష్కర సంనిభేక్షణా, యారక్షితా రాఘవ లక్ష్మణాభ్యామ్।
సారాక్షసీభి ర్వికృతేక్షణాభిః, సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే॥
(5/16/29)

6. "హిమహత నలినీవ నష్ట శోభా, వ్యసన పరమ్పరయా నిపీడ్యమానా
సహచర రహితేవ చక్రవాకీ, జనకసుతా కృపణాందశాం ప్రపన్నా॥
(5/16/30)

తా॥ 1. తమ యుత్సంగముననిడుకొని, వ్రేళులతో మీటుచు, వాయించు వారు లేక, దుమ్ముకొట్టుకొని పోయిన వీణవలె, మిక్కిలి దయనీయ స్థితిని పొందినదియు, పతిహిత తత్పరురాలును, రాక్షసుల వశమున నుండుట కయోగ్యురాలును:

2. పతిశోకాతురయు, అటునిటు, జలములను పారునట్లు చేయుటచే క్షీణధారయగు నదిని బోలి శుష్కించినదియు, నలుగు మొదలగు శరీర సంస్కారములేక, కృష్ణపక్ష నిశవలె దినదినమునకు వన్నె తఱిగిపోవు చున్నదియు,

3. సుకుమారియును, చక్కని యవయవ సౌష్ఠవము గలదియు, రత్న జటితమగు రాజభవనమున నివసించతగినదియు, అప్పుడే పెరకి, ఒడ్డున వేయబడి. సూర్యునివేడి కిరణముంచే, వాడిపోయిన, మృణాళినిని బోలి నదియు;

4 కటికనేలపై కూర్చొని యున్నదియు, కఠినమగు పతివ్రతమును అనుష్ఠించునదియు, మహా వృక్షమున సంలగ్నమైన కొమ్మను నరికి భూమిపై వేయగా, దుమ్ముగొట్టుకొని దయనీయముగ కన్పించు వృక్షశాఖవలె నున్న దియును,

5. పృథ్వీ దేవతను బోలిన క్షమ (ఓర్పు), గలదియును, కమలనేత్రయు' రాఘవ - లక్ష్మణులచే సంరక్షితురాలునునగు సీత, యిపుడు రాక్షస స్త్రీ పరి గతయై వృక్షమూలమున నివసించుచున్నది.

6. హిమధ్వస్తయగు కమలినివలె నష్టశోభయును, వ్యసన పరంపరచే పీడితురాలును, సహచర రహితయగు చక్రవాకి వలె కడు దైన్యమును పొందిన సీతాదేవిని హనుమంతుడు చూచెను.

ఈ యారవ ఛందమొక్కటి చాలును, విరహిణియగు సీతాదేవి యొక్క విరహవ్యథను, ఆమె యొక్క రాళ్లనుగూడ కరుగ చేయు యాంతర వ్యథను, ఆ విరహవేదన వలన నామె పొందిన దైన్యమును, దాని ప్రగాఢ ప్రభావమును వ్యంజించుటకు. కావ్యకలాదృష్టితోనిది, అత్యుత్తమమగు విరహ చిత్రము. ఆమె, ఒక దుఃఖము చేతనేగాదు. వ్యసన పరమ్పరచే పీడితురాలు వనమున పడుఃష్టములు చాలవన్నట్లు ప్రాణప్రియునితో విరహము, ఇన్ని కష్టములను, ఏ ప్రియుని సాహచర్యమునకై యామెవడెనో, యట్టిప్రియుని సాహచర్యమును కూడ ఆ కఠిన దైవము లేకుండగ చేసినాడు: దానివలన ఆమె క్రుంగిపోయినది. ఆమె సౌందర్యమంతయు, హిమధ్వస్తమైన కమలిని వలె ఐపోయినది: మఱల ఈ సర్వ విధ్వంసమునుండి ఆమెకోలుకొను యాశ లేదు. కనుక జీవించవలసిన యవసరముగూడ లేదు, కాని ఏమో ఏదైవము దుర్దినములారంభమైనప్పుడు తనను భర్తనుండి వేఱుచేసెనో, యా దైవమే దుర్దినములు గడచిన పిమ్మట, తనను ప్రియునితో కలుపునేమో: ఈ యాశ తోనే జీవించుచున్నది. కాని యీ రాక్షస స్త్రీల మధ్యమున, పతికి దూరముగ, సముద్ర మధ్యమున నున్న లంకలో బందీగ నుంచబడిన, సీతాదేవికి యాలంబమేమి? పతినామము, కాని సహచరరహితమగు చక్రవాకివలె ప్రియునితో మిలనముకై పరితపించుచు, "ప్రియా, ప్రియాయని" రాత్రిం బవళ్లు, బిట్టుగనరచుచు, పరమ దయనీయ స్థితిలో నామె ఇంక, యెంతకాలము గడపవలెనో: అస్తు, వియోగిని పొందు దైన్యము నంతను రామాయణకవి "సహచర రహితేవ చక్రవాకీ" యను రేఖయందు కుప్పబోసినాడు.

ఇంకను విరహిణియగు సీతయొక్క విరహ దుఃఖమును, శత్రుపీడను, ఆమె యనంతమగు విరహ సంతాపమును నభివ్యంజించు భావ చిత్రములను గూడ దర్శింపుడు:-

1. "భూమౌ సుతను మాసీనాం నియతామి వ తాపసీమ్।
నిఃశ్వాస బహులాం భీరుం భుజగేంద్ర వధూమివ॥
(5/15/31)

2. "శోక జాలేన మహతా వితతేన నరాజతీమ్।

నిఃశ్వాస బహులాం భీరుం భుజగేంద్ర వధూమివ॥
(5/15/32)

3. చేష్టమానా మథాఽఽవిష్టాం పన్నగేంద్ర వధూమివ।
ధూప్యమానాం గ్రహణేవ రోహిణీం ధూమకేతునా॥
(5/19/9)

4. పౌర్ణమాసీ మివ నిశాం తమోగ్రగ్రస్తేందు మండలామ్।
పద్మినీ మివ విధ్వస్తాం హతశూరాం చమూమివ॥
(5/19/13)

5. "ఉత్కృష్ట పర్ణ కమలాం విత్రాసిత విహఙ్గమామ్।
హస్తి హస్త పరామృష్టామాకు లా మివ పద్మినీమ్॥
(5/19/15)

6. "శుష్యన్తీం రుదతీ మేకాం ధ్యానశోక పరాయణామ్।
దుఃఖస్యా న్త మపశ్యన్తీం రామాం రామమను వ్రతామ్॥
(5/19/8)

7. "దహన్తీ మివ నిఃశ్వాసై ర్వృక్షా న్పల్లవ ధారిణః॥
సంఘాతమివశో కానాం దుఃఖసోర్మి మివోత్థితామ్॥

ప్రభావాత్మక దృష్టితో ఇవి యత్యుత్తమ చిత్రములు. పసిపట్టిన యూత త్రాచు, ధూమజాల సంసక్తమగు అగ్నిజ్వాల, ధూమ్రవర్ణ కేతు గ్రస్తమై నందురోహిణి, గ్రహణగ్రస్తేందు మండలముగల పూర్ణిమ రాత్రి, హస్తిహస్త పరామృష్టమై చెల్లాచెదురై పోయిన పద్మ సరసి ఇవి యన్నియు, విరహ వ్యథను, చిత్త వ్యాకులతను, శారీర సంతాపమును, శారీర ప్రభావిధ్వంస మును నభివ్యంజించు చున్నవి ఇక యేడవ పద్యము నామె విరహ సంతాప తీవ్రత. దుఃఖ తీవ్రతల యొక్క వ్యాపకతతో పాటు ఘనత్వపుగూఢ మూర్తి మంత మొనరించు చున్నవి. పై శ్లోకముల భావార్థమును పరిశీలింపుదు:-

తా॥ 1. కటిక నేలయందు కూర్చున్నదియును, సుందరమైన దేహ పుష్టిగలదియును, నియమపరాయణయగు తాపసి వలె. ఒరకొఱకు తపించు

నదియును, భీరు స్వభావము గలదియు, అరణ్యాచువలె (శోకత్రోక్కున) దీర్ఘ నిశ్వాసములను విడచుచున్నదియును; 2 మహత్తరమును, విస్తృత మునునగు శోకజాలముచే నావృతురాలును. ధూమజాలముచే నావృతమగు అగ్నిశిఖవలె నున్నదియును; 3. మణి మంత్రాదులచే సంఖ్యాతమై కదలుటకు వీలులేక తీవ్రవ్యథతో కొట్టుకొను అరణ్యాచును పోలినదియును, కేతుగ్రస్తయైన రోహిణివలె సంతాపమును పొందునదియును; 4 గ్రహణ గ్రస్త చంద్ర మండల యుక్తమగు పౌర్ణమిరాత్రి వలెనున్నదియు, విధ్వస్తమగు పద్మినివలె విధ్వస్త సౌభాగ్యయు, చచిపోయిన శూరులుగల సేనవలె నున్నదియును; 5. పెరికివేయబడిన పర్ణములు, కమలములుగల పద్మినివలె నున్నదియును, భయపెట్టబడిన విహంగములు కల శాఖనుబోలినదియు, ఏనుగుల తొండము లచే శాఖ మొనర్చబడి చెల్లాచెదురుగనై పోయిన పద్మసరసివలెనున్నదియును 6. శోక వ్యథను తప్పుకోనలేక నిత్యము విలపించు చున్నదియు, ధ్యాన శోక పరాయణురాలును, కనుచూపుమేఅలో హద్దులు కానరాని యనంతదుఃఖ సాగరము మున్గికదియు, శ్రీరామచంద్రుని సర్వాత్మనా నిత్యమనుసరించు చున్నదియును, వృక్ష పల్లవములను తన వేడి నిట్టూర్పులచే దహించు చున్నట్లుగనున్నదియును, శోకములు ప్రోగుపోసినట్లుగ నున్నదియును, శోక సాగరమున పైకి ఉవ్వెత్తున లేచిన, దుఃఖతరంగమువలె నున్నదియునగు సీతను హనుమంతుడు కనుగొనెను.

పతితో కలసియుండగ నున్న మహత్తరమగు సుఃస్థితినుండి, రావణునిచే నపహృతురాలై, హీన స్థితిని పొందిన విరహిణియగు సీతయొక్క హీనదశను అభివ్యంజించుటకై, కవి నిర్మించిన మూర్తములు, అమూర్తములగునుపమానము లతో శోభితములగు ఈ శబ్ద చిత్రములను గూడ చూడుడు:-

1. "క్షీణపుణ్యాంచ్యుతాం భూమౌతారాం నిపతితా మివ।
చారిత్ర వ్యప దేశాఢ్యాం భర్తృదర్శన దుర్గతామ్॥
(5/17/20)

2. "సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితామ్॥
ప్రజ్ఞామివ పరిక్షీణామాశాం ప్రతి హతామివ॥ (5/19/11)

3. "ఆయతీ మివ విధ్వస్తామాజ్ఞాం ప్రతిహతామివ।
దీప్తామివ దిశంకాలే పూజా మపహతామివ॥ (5/19/12)

4. "ప్రభామివ తమోధ్వస్తా ముపక్షీణా మివాపగామ్।
వేదీమివ పరామృష్టాం శాంతా మగ్నిశిఖా మివ॥ (5/19/14)

5 "తాంస్మృతీ మివ సందిగ్ధా మృద్ధిం నిపతి తామివ।
విహతామివ చ శ్రద్ధా మాశాం ప్రతి హతామివ॥ (5/15/33)

6. "సోపసర్గాం యథాసిద్ధిం బుద్ధిం స కలుషామివ।
అభూతేనా పవాదేన కీర్తిం నిపతితామివ॥ (5/15/38)

7 "అమ్నాయా నామ యోగేన విద్యాం ప్రశిథిలామివ॥
(5/15/38)

8. "దుఃఖేనబు బుదేసీతాం హనుమాననలంకృతామ్।
సంస్కారేణ యథాహీనాం వాచమర్థాంతరం గతామ్॥
(5/15/39)

9. "స్వాపకృత్యే వతప్వంగీ తద్వియోగాచ్చ కర్శితా।
ప్రతిపత్పాఠ శీలస్య విద్యేవతనుతాం గతా॥ (5/59/31)

తా॥ 1. పుణ్యము క్షీణించుటచే భూమికి రాలిన నక్షత్రమును బోలినదియును, చారిత్ర్యమున పేరుగాంచినదియును, భర్తృ దర్శనమునకు నోచుకొనదియును, 2. క్షీణమైన మహాకీర్తివలెను, అవమానమును పొందిన శ్రద్ధవలెను, క్షీణించిన ప్రజ్ఞవలెను, భగ్నమైన ఆశను బోలినదియును; 3. నష్టమైన ధనప్రాప్తివలెను, పాలింపబడని జ్ఞవలెను, ఉత్పాతకాలమున మండుచున్న దిశలవలెను, నష్టమైన దేవపూజవలె నున్నదియును; 4. అందకారముచే నష్టమైన కాంతివలెను, ఎండిపోయి సన్నగా జాలువాఱు నదివలెను. అపవిత్ర పదార్థ సంసర్గముచే దూషితమైన అగ్నివేది వలెను, శాంతమైన అగ్నిశిఖవలె నున్నదియును; 5. సందిగ్ధార్థమునిచ్చు స్మృతిని బోలినదియును, క్రిందపడిపోయి సమృద్ధివలెను; దెబ్బతినిన శ్రద్ధవలెను, భగ్నమైన ఆశవలెనున్నదియు. 6. విఘ్నయుక్తమగు సిద్ధివలెను, కలుషితమైన బుది

వలెను, లేనిపోని యపవాదముచే పతితయైన కీర్తివలె నున్నదియు; 7. ఆమ్నాయము లేక పోవుటచే శిథిలమైన విద్యవలె నున్నదియు; 8. సంస్కారములేమిచే నర్థాంతర గతమైన వాక్కువలె నున్నదియును నలంకారరహితయును 9, సహజముగనే తన్వంగియునగు (సన్నని గాత్రయష్టిగల) సీతాదేవి, పాడ్యమినాడు అధ్యయనము చేయువాని విద్యవలె మిక్కిలి కృశించి గుఱుతు పట్టుటకు వీలులేకుండగ నుండెను.

పైన ఇచ్చిన ఛందస్సులలో మొదటిది నాల్గవది మినహాయించి, మిగిలిన అన్నిటియందును అమూర్తోపమానములు, గతవైభవయగు సీతయొక్క పతనదశను సూచించుటకుపయోగించబడినవి. నిజముగ మూర్తగతమగు ఒక స్థితిని సూచించుటకు, అమూర్తోపమాన ప్రయోగము అపూర్వము, అద్భుతము గూడ. ఈ పద్ధతికి శ్రీకారము చుట్టినవాడు గూడ రామాయణ కవియేనని చెప్పవచ్చును.

ఇక యశోకవనికలో నున్న విరహిణియందు. ఆమె ప్రాణ ప్రియునికి సంబంధించిన తదేకధ్యానమును చిత్రించుచు వాల్మీకి చిత్రించిన ఈ శబ్ద చిత్రములను చూడుడు:-

1. "సమీపం రాజ సింహస్య రామస్య విదితాత్మనః।
సంకల్ప హయ సంయుక్తై ర్యాన్తీమివ మనోరథైః॥ (5/19/7)
2. "నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్ప ఫల ద్రుమాన్।
ఏకస్థ హృదయా నూనం రామమేవాఽనుపశ్యతి॥ (5/16/25)
3. "దుఃఖార్తా రుదతీసీతా వేపమానాతపస్వినీ।
చింతయన్తీ వరారోహా పతిమీవ పతివ్రతా॥ (5/21/2)

తా॥ 1. విదితాత్ముడును, రాజసింహమునునగు, శ్రీరామచంద్రుని వద్దకు, సంకల్పములను హయములను పూన్చిన, మనోరథములనారోహించి, వెళ్ళుచున్నట్లున్న సీతను రావణుడు చూచెను

2. ఆమె రామునియందే తన చిత్తమును నిల్పి యుండుటచే, ఎదురుగా కూర్చొనియున్న రాక్షస స్త్రీలనుగాని, తనకెదురుగ, పుష్పించి, ఫలించి

నేత్రపర్వ మొనరించు, వృక్షములనుగాని చూచుటలేదు.

3. దుఃఖనిపీడితయు, రోదనము చేయుచున్నదియు, తపస్వినియు, భయకంపితయును, సుందరమైన కటి ప్రదేశముతో నొప్పు పతివ్రతయగు సీతాదేవి, భర్తృధ్యానైక పరాయణయై, యశోకవనమున కూర్చొనియుండెను.

ఇక్కడ వాల్మీకి, విరహిణియగు సీతాదేవియొక్క విరహ చిత్రముల ద్వారా; ఆమె, శారీర, మానస స్థితులను, అనంతమైన దుఃఖమును, అపారమైన విరహ సంతాపమును, నిరంతర పతిధ్యానమును, ప్రతిబింబించుటతో బాటుగ, విరహ కృశయును, మహాతపస్వినియగు సీతాదేవి యొక్క తపస్తేజమును, ఆమె ముఖమండలముపై గోచరించు, సుప్రాప్తమగు ఆత్మదీప్తిని, ఆమె పవిత్రతను గూడ చిత్రించెను. ఈ చిత్రములు, కేవలము రూప చిత్రములే గాక భావచిత్రములు గూడ, ఈ క్రింది రూప-భావోభయ వ్యంజక చిత్రములతో సంభృతమైన రూప-భావోభయ సౌందర్యమును చూడుడు:-

1. "ఉపవాస కృశాందీనాం నిఃశ్వసన్తీంపునః పునః
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్॥
(5/15/19)

2. "మంద ప్రఖ్యాయమానేన రూపేణ రుచిర ప్రభామ్।
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః॥ (3/5/15/20)

3. "ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘైరి వావృతామ్॥ (5/15/20) ఇత్యాదులు.

వీనిలో, మొదటి ఛందస్సునందు, ఆమె శారీర కార్శ్యముతో బాటుగ, వియుక్తుడైన పతి యొక్క వియోగముచే నామె పొందిన దైన్యము, దుఃఖము, సంతాపము, అశాంతి, మొ॥వానిని చిత్రించుటతో బాటుగ, ఆమె మానసిక నైర్మల్యము, శారీర కార్శ్యముతో బాటుగ, ఆమె, ముఖమండలమున గోచరించు, ధ్యాన దీప్తిగూడ చిత్రించబడినది.

రెండవ చిత్రమున, ఆమెను "అగ్నిశిఖ"తో బోల్చి, ఆమె పవిత్రత్వమును, ఆమె వియోగ తీవ్రతను, చిత్రించుటతో బాటుగ, "ధూమజా ల

న్నతో యను విశేషణ ప్రయోగముద్వారా. భర్తృవియోగ దుఃఖమున నామె ముఖము నావరించిన, విషాదచ్ఛాయలుగూడ చిత్రించబడినవి.

మూడవ చిత్రమున, కాల మేఘములవలె దట్టముగ నావరించిన మహా విషాదముతో బాటుగ, ఆమె సహజ సౌందర్యము, భర్తృ చింతనమున నామె పొందు యానందముగూడ చిత్రించబడినది.

అస్తు, సాధారణముగ, విరహ వర్ణనము, ప్రవసితుడగు పతి, స్వగృహమునన్న, విరహిణియగు నాయికను గూర్చి పొందు వియోగ వ్యథకు సంబంధించినదిగ నుండును. కాని సుందరకాండ యీ కోవకు చెందదు. ఇక్కడ భార్యాభర్తలిద్దరు ప్రవసితులే, కాని, పదమూడువత్సరములు, ఈ ప్రవాస సమయమున గూడ కలసియే యుండిరి. కాని తమ నగరము నుండి ప్రవసితులై యరణ్యముల పాలైన, దంపతులగు సీతా-రాములలో, సీతను లంకేశ్వరుడు ఛలముచే నపహరించినాడు. ఇది చాల భయంకరమగు ఘటన. పురుషుడు, భార్యతో వియుక్తుడై యన్య దేశములను పట్టినచో నతనికి నాహ్యా విరహవ్యథ మాత్రమే యుండును. కాని, స్త్రీ, యపహృతయై శత్రువుల చేజిక్కినపుడు, ఆమెకు కేవలము భర్తృవియోగ వ్యథయేగాక, దుష్కరులగు శత్రువుల నుండి, తన శీల సంరక్షణము చేసికొనుట యను దుష్కర కార్యము గూడ నుండును. ఇక్కడ, సీత నపహరించిన రావణుడు చాల దుష్కర్ముడు, త్రిలోక విజేత, అనేకమంది స్త్రీలను, తన వలెనే చెఱబట్టి వారికి మానభంగము గావించిన లంపటుడు, కామాత్ముడు. పైపెచ్చు రాముని పై పగబట్టినవాడు. కాగా, అతడామెనపహరించి, లంకలో బందీగా నుంచినాడు. లంకలోని రాక్షసులందరు, రావణునికి సర్వవిధముల యనుచరులు, అధర్మాత్ములు, పాప భయము లేనివారు. తనకు సానుభూతి తెల్పువారు గూడ అటలేరు తానో, అసహాయురాలు, అబల, ఇట్టి విషమ పరిస్థితులలో తన శీలమును నెట్లు కాపాడుకొనెనో- నిరంతరము, తన శీల రక్షణము కొఱకు ప్రాణములను గుప్పిటలో బెట్టుకొని యెట్లు సంవత్సర కాలము గడపెనో. యని, యాలోచించినచో మతిపోవును. దీనికి రామాయణర్షి యీ విధముగ సమాధానమిచ్చినాడు:-

"తాం దేవీం దీన వదనా మదీనాం భర్తృతేజసా।
రక్షితాం స్వేన శీలేన సీతామసితలోచనామ్॥ (5/17/27)

"పరిక్షీణాం కృశాం దీనా మల్పాహారాం తపోధనామ్॥ (5/19/20)

"అసంవృతాయా మాసీనాం ధరణ్యాం సంశిత వ్రతామ్॥
(5/19/5)

తా॥ దైన్యముట్టిపడు ముఖముతో నున్నను, భర్తృతేజః స్మరణమున మానసికముగ దైన్యమును పొందనిదియు, కాటుక కన్నులు గలదియు, తన శీలమాత్రైక రక్షితయునగు సీతను హనుమ చూచెను (5/17/27)

చిక్కిన శరీరము గలదియు, దీనురాలును, అల్పాహారయ, తపోధనయునగు సీతను చూచెను (5/19/20)

కటికనేలపై కూర్చొనినదియును, తీవ్ర వ్రతనిష్ఠురాలునునగు సీతను హనుమ దర్శించెను. (5/19/5)

వాల్మీకి సీతా వియోగమును కేవలము, శారీర సంతాపము. మానస క్షోభమునకు సంబంధించినదిగ మాత్రమే చిత్రించలేదు. అవి సాధారణముగ నాయికా-నాయిక నిష్ఠమగు రతిని తీవ్రతర మొనర్చుటకు వర్ణించండుము. సీత, తన వియోగ కాలమును, సర్వాత్మనా పతిని ధ్యానించుటయను మహా వ్రత పాలనమునకే వినియోగించినది అందువలననే యామె, అల్పమగు ఆహారమును తీసికొనుచు కటిక నేలపై కూర్చొని, పతి సాన్నిధ్యప్రాప్తికై తీవ్రమైన పతిధ్యానమును గావించెను. కనుకనే, రామాయణ కవి యామెను తపస్విని (5/20/1) యనియు, తపోధనురాలనియు, సంశిత వ్రతయనియు గూడ వర్ణించినాడు. ఆమె తపమునకు లక్ష్యము పతి సాన్నిధ్య లాభము. ఈ కార్యసిద్ధికి ఆమె నెవరిని ధ్యానించెను? తన పతియగు రామునే ధ్యానించెను (రామా, రామ మనువ్రతామ్॥ (5/19/18) ఆమె చేయు యీ తపమును రావణుడు గూడ గుర్తించి, యౌవన శోభాపకర్షకము, కామ వినాశకమగు తపమును విడచి నన్ను కామింపుమని యామెకు నచ్చచెప్పుటకు యత్నించినాడు.*

1. 'ఏక వేణీ అధశ్శయ్యా ధ్యానం మలినమంబరమ్। అస్థానేప్యుపవాసశ్చ నైతాన్యౌపయికానితే॥ (5/20/8)

భారతీయ జన సమాజము, కష్టములలో తగుల్కొనినను, నిరాశపడక, ఆ కష్టములను, మంచి రోజులు వచ్చునను యాశతో సహించును. ఆ యాశకు మూలము, 'దైవమందు లేక యదృష్టమునందు వారికి గల ప్రగాఢ విశ్వాసము. మనుష్యుడు దైవముచే ప్రేరితుడై మంచినిగాని, చెడునుగాని చేయుననియు, దైవశక్తిముందు మానవుడు తలవంచి, తనకు వచ్చిన కష్ట సుఖములను కిక్కురుమనకుండగ ననుభవించవలసినదే యనియు వారి విశ్వాసము. ఈ దైవ విశ్వాసమును, రాముడు గూడ వనవాస సందర్భమున దృఢముగ ప్రతిపాదించియున్నాడు వివరములు మేము వ్రాసిన రామాయణ వైభవమున"గాని "శ్రీమద్రామాయణ మీమాంస"యందు గాని చూడనగును:-

ఇక యామె వృత్తశౌటీర్యమును, రావణ నిరసన సందర్భమున, వాల్మీకి చాల దృఢముగ నిరూపించి యున్నాడు రావణుని, అర్థకామైక ప్రధానములగు కుత్సిత జీవిత సిద్ధాంతములతోపాటు, అతని కామాత్మత్వ మును, అధర్మాభిరుచిని ఖండించుటచుచు, సీతాదేవి తన పతిభక్తిని, ధర్మ మహత్త్వము నుగ్గడించుచు, రావణునితో పల్కిన పల్కులు ధర్మరతులగు వారికేగాక, మానవమాత్రునకు సదామననయోగ్యములు. అందువలన నట సీత రావణుని కిచ్చిన సమాధానము సంగ్రహించ బడుచున్నది:-

సీత తెల్పిన, ధర్మార్థ కామరూపములగు మూడు పురుషార్థములతో సమన్వితమగు స్వస్థమగు వైదిక జీవితముయొక్క సిద్ధాంతసారము:

"రౌద్రకర్ముడును, కామార్తుడును, వాచ్యావాచ్యముల నెరుగని, రావ ణుని, పరుసములును, ధర్మవిరహితములునునగు పలుకులు విని, తపస్విని యగు సీతాదేవి దుఃఖార్తయై భావావేశమున కంపించుచు, తన వృత్త శౌటీర్య మును చాటుటకు, తన ముందొక గడ్డిపోచనుంచుకొని, రావణునికి హితవు పల్కుచు నిట్లనెను. సందర్భము: రావణుడు, అశోకవనమున భర్తృ విరహ వ్యథతో నిరంతరము దుఃఖించు సీతతో, దాపరికము లేకుండగ "కామ యేత్వాం విశాలాక్షి!" నిన్ను కామించుచున్నాననియు, నా వాల్లభ్యమునంగీ

కరించి సర్వసుఖముల ననుభవింపుమనియును, ఆమెను చూచిన పిదప తన యంతఃపుర కాంతలయందు తనకు వలపుపోయిన దనియును పల్కెను

అపుడతనికి సీత యిచ్చిన సమాధానము : ఓ రావణా, నా నుండి నీ మనస్సును మఱల్చుకొని, నీ యంతఃపుర కాంతలయందే నీ వాత్సల్యమును చూపి సుఖింపుము. (నివర్తయ మనోమత్తః, స్వజనే ప్రియతాంమనః" (5/21/3) దానికి మొదటి కారణము : పర భార్యయగు తనను కామించుట నతనికి యుక్తముకాదు, పాపాత్ముడగు వాడు తపస్సిద్ధిని బడయజాలని యట్లు, కామాత్ముడును, పరదారా రమణ రూపమైన పాపపు తలంపుగల రావణుడు: పతివ్రతయును, పూతాత్మురాలునునగు తనను పొందుట యసంభవము (5/21/4) రెండవ కారణము: ధర్మ విరహితమగు కామము, మానవుని పాపగర్తమున త్రోచి యతనిని వినాశమొనరించును. అందువలన రావణుడు సాధువృత్తమును ప్రమాణముగ తీసికొని పరదార రమణ రూపమైన తుచ్ఛమగు కామమును తన మనస్సునుండి గెంటివేసి ధర్మమును పాలించవలెను. అంతేగాదు, "ఆత్మవత్సర్వ భూతాని" యను సనాతన, ధార్మిక సిద్ధాంతమును అతడనుసరించుట, లోకముచే ననుసరింప చేయుట, రాజుగ నతని విధి తాను స్వదార పరిరక్షణ మెట్లుచేయునో యట్లే పరదారల శీల సంరక్షణము చేయుటగూడ అతని విధియై యున్నది. తన దారలను పరులు పరిభవించుటగాని, ధర్షణము చేయుటగాని, యతడెట్లంగీకరింపడో, యట్లే యితరులు గూడ నుందురని తెలిసికొని, తన భార్యలనే ప్రేమించవలెను. ఈ క్రింది సీతాదేవి వచనములను చూడుడు:-

"యథా తవ, తథాఽన్యేషో దారా రక్ష్యా నిశాచర।
ఆత్మానముపమాం కృత్వాస్వేషు దారేషు రమ్యతామ్॥ (5/21/7)

తా॥ నీ భార్యలు నీకెట్లు రక్షింపతగినవారో, యట్లే యితరుల భార్యలు గూడ రక్షింపతగి యున్నారు. నీ భార్యలయందు నీకుగల ప్రవృత్తి నాదర్శముగ గొని యితరులుగూడ తమ భార్యల విషయమున నట్టి ప్రవృత్తినే కల్గియుందురని గ్రహించి, నీ భార్యలయందే రమింపుము.

ఈ విధముగ సమాధానమిచ్చి, భారతీయ జన సమాజమున, మగవాండ్ర సహజ ప్రవృత్తిని, మనస్తత్త్వమును తెల్పుచు సీత యట్లు పల్కెను:

అతుష్టం స్వేషు దారేషు చపలం చపలేంద్రియమ్।
నయన్తి నికృతి ప్రజ్ఞం పరదారాః పరాభవమ్॥ (5/21/8)

తా॥ తన భార్యలయందు పరితోషమునొందని వానిని, చపల స్వభావముగల వానిని, సజ్జనులు, ఛీ, యని, ఈసడించుచు, దుష్టబుద్ధిగల్గి తన ఇంద్రియముల నదుపులో పెట్టుకొనలేని కామాత్ముని పరదారలు పరాభవింతురు.

ఇక మూడవ కారణము: పతివ్రతయును, పరభార్యయునగు ఆమెను కామించుట యయుక్తము. ఆమె యెవరికి భార్యయో వారినే కామించునుగాని, పరపురుషులను ఒల్లదు గనుక, యతనికి భార్యగ నుండజాలదు. పతివ్రతయగు తాను పరపురుషుని కామించుటవంటి జఘన్య కార్యమును చేయరాదు (అకార్యం నమయా కార్యమేక పత్న్యా విగర్హితమ్॥ (5/21/4) దీనివలన లోకమున ననయముప్పతిల్లి, సమాజము పతితమై పోవును. ఇక మన సత్త్వమునుబట్టి చూచినను, పరపురుషుని ప్రేమించుట తనకయుక్తము. (అట్లే, రావణునికి పరస్త్రీని కామించుటగూడ నయుక్తమే.) ఎందుకన, ఒక పురుషుని వివాహమాడి యతనికి మనసిచ్చి, యతనినే తన మనస్సున ప్రతిష్ఠించుకొని, జీవించు పతివ్రత, పరపురుషుని కామించుటగాని, పరపురుషుని, తన మనస్సున ప్రతిష్ఠించుటగాని, జీవించియుండగ సంభవించు కార్యముగాదు (5/21/16 కనుక ఆమె, వ్రతస్నాతుడగు విప్రునికి విద్యవలె, విధిపూర్వకముగ వివాహమాడిన రామభూపతి వశమునే తానంగీకరించును గాని యితరుల వశము సంగీకరింపదు

ఇక వైదిక విధిననుసరించి వివాహమాడబడిన స్త్రీ భర్తకంటె వేఱుగాదు. భార్యా-భర్త లిద్దరుపైకి వేఱు-వేఱు శరీరములతో గన్పించుచున్నను, వారు, సూర్యుని నుండి, వెలుగును వేఱు చేయుటకు వీలులేనట్లు విడదీయుటకు వీలులేనివారు (5/21/17). కనుక రావణుడామె శరీరమును శ్రీరాముని నుండి, అపహరించి తెచ్చినను, ఆమె యాత్మ నిరంతరము రామునియందే సంలగ్నమై యుండును. అట్టి శ్రీరామ సంలగ్నమైన తన యాత్మను, శ్రీరాముని నుండి విడదీయుట రావణునికే గాదు, సృష్టికర్తకుగూడ సాధ్యపడదు. అందువలన దుఃఖితురాలగు తనను తన భర్తవద్దకు చేర్చి తాను ఆచరించిన

సాధుగర్హితము, ధర్మాపేతమునైన పరదార చౌర్యరూపమైన మహా పాపము నుండి తనను రక్షించుకొనుట యతనికి అన్ని విధముల శ్రేయస్కరము. అట్లుకానిచో నన్ని విధముల నతనికి వినాశము తప్పదు అపుడు రావణుడు, తనకు బందీగా పట్టుబడిన సీతను తిరిగిపొందుట యసంభవమనియును, అతడు తపముచేగాని, బలములోగాని, పరాక్రమములందుగాని తనతో సమానముగాదని పల్కిన రావణుని స్మయమును ఖండించుచు, సీత యతనితో నిట్లు పల్కెను:-

"శ్రీరామునితో నీవు మైత్రి చేసికొనుట మంచిది. శరణాగత వత్సలుడగు రాముని, నీవు జీవించ దలచితిచో శరణు పొందుము లేనిచో ఘోర ఇంద్ర నిపాతిత మగు ఆపదను పొందగలవు. నిన్ను, ఒకవేళ వజ్రము విడచిన విడచుగాక, లేక మృత్యువు నిన్ను కొంతకాలము చంపకుండగ విడచిన విడచునుగాక కాని శ్రీరామునికి కోపము వచ్చిన నిన్ను విడువడు. నీవు రామునికంటె గొప్ప వీరుడనని, నీవు పల్కితివి. వీరుడవైనచో జన స్థానము, రామునిచ్చే పూర్తిగ నిర్మూలించబడినపుడు, రామునికెట్టి ప్రతీకారమును చేయజాలక రామ లక్ష్మణులను బలముచే వంచించి జఘన్యమగు పరదార చౌర్యరూపమను మహాపాపము నాచరించితివి. నీకును, రామలక్ష్మణులకును పోలికయేమి? ఇక నీ యైశ్వర్యమును చూచి, నీ యధికారమును చూచి నేను నీకు లోబడుదునని* యనుకొనకుము. నీవంటి చపలచిత్తుడును, అనయరతుడునగు రాజు మూలమున, రాజేగాక, అతడు పాలించు రాష్ట్రము, నగరములు, అన్నియును పూర్తిగ నాశమగును. నీవంటి పాపాత్ముల వినాశమునకు లోకము దుఃఖపడదు సరిగదా, సంతోషించును. మఱి నీవు చేయు యీ యకృత్యములను నీకు తెల్పు ధర్మాత్ములు నీ నగరముననే లేరా, లేక- ఒకవేళ యున్నను. వారి సదుపదేశములను నీవు చెవినిబెట్టవా?"

అపుడు రావణుడు క్రోధోద్రిక్తుడై యామెను చంపుదునని బెదరించెను. ఇంకను ఇట్లనెను: నీకింకను రెండు మాసముల గడువునిచ్చితిని. ఈ గడువు లోపల నన్ను ప్రేమించనిచో నా వంటవాండ్రు, నిన్ను ముక్కలు ముక్కలుగా ఖండించి నా ప్రాతఃకాల భోజనమునకై, వండి పెట్టెదరు!"

ఈ తపశ్శక్తి యామె యందుండుటవలన రావణుడు, ఆమెను స్పృశించుటకు భయపడినాడు. కనుక బంధువులకు దూరము చేయబడిన ఆమె. తన శీలమును, తన తపశ్శక్తితో కాపాడుకొనినదను విషయమును హనూమన్ముఖమున వాల్మీకి ధ్వనింప చేసినాడు ఈ క్రింది పంక్తులను చూడుడు:-

"నతదగ్ని శిఖాకుర్యాత్ సంస్పృష్టా పాణినాసత్।
జనకస్య సుతాకుర్యాత్ యత్క్రోధ కలుషీకృతా॥ (5/59/5)

"తపసాధార యేల్లోకాన్, క్రుద్ధావానిర్దహేదపి॥ (5/59/8)

తా॥ సీతాదేవికి కోపము వచ్చినచో, ఆమె చేయు వినాశము, అగ్నిశిఖ కూడ, (చేతితో తాకినపుడు మాత్రమే తాపమును కల్గించగల) చేయజాలదు. ఆమె తన తపశ్శక్తిదే త్రిలోకములను కాపాడగలదు, కోపమువచ్చిన దహించి వేయగలదు.

కాని; మనస్సు దుర్బలముగ నున్నచో యామె తపమెట్లు చేయును? కాగా, రావణుని భోగ-భాగ్యములను, ఐశ్వర్యమును చూచి మోహపడి యితర స్త్రీలవలె ఆమెగూడ రావణునికి లోబడినచో కథయేలేదు. కాని సీత రావణుని యైశ్వర్యమునకు, భోగ భాగ్యములకు లోబడకుండుటకు కారణము? సనాతన మగు ధర్మమునందు ఆమెకుగల యచంచల విశ్వాసమేగదా? ఆమె ధర్మ పరాయణతయేగదా! ఎట్టి పరిస్థితిలోను, ఆమె తన ధర్మమును విడువ కుండుటకుగల కారణము ఆమెలోగల శీల-చారిత్రములే!

దీనినిబట్టి తేలినదేమియన, సీతాదేవి తపశ్శక్తి, కష్ట సహిష్ణుతకు, ధర్మనిష్ఠకు, మూలము ఆమె శీల చారిత్రములు. వానివలననే ఆమె, కామాత్ముడగు రావణుని బారినుండి, తనను కాపాడుకొన గల్గినది.

సాధారణముగ, వియోగ కావ్యములయందు, నాయకుడనుభవించు విరహవ్యథయో; లేక నాయికాగతమగు విరహవ్యథయో వర్ణించబడి, ఒకరు తమ ప్రేమపాత్రగతమగు వియోగవ్యథ నూహించుట చిత్రింపబడును. కాని సుందరకాండమందు, నాయికా - నాయకోభయ గతమగు విరహవ్యథ, చాల మార్మికముగను, కళాత్మకముగను చిత్రింపబడినది.

భగవాన్ వాల్మీకి సీతా-రాముల నిర్వురను, పరస్పరము సమముగ నాబద్ధమగు ప్రేమగలవారుగను, పరస్పరాయత్త జీవితులుగను చిత్రించినాడు. ఈ విరహ చిత్రణములోని విశేషమేమియన, తమ వియోగ కాలమున వారిరువురు, పరస్పర ప్రవృత్తులను తెలిసికొనుటకు గూడ యత్నించుట, అందులకు కారణము, వారు విప్రయోగ దుఃఖమునను భవించుటయు, జీవించుటయు నవసరమా, కాదా. యని తెల్సుకొనుటకు, రామునికి సీతయందు, పూర్వపు వలపు తగ్గినచో, ఈ లంకలో రాక్షస స్త్రీలు పెట్టు బాధలను సహించుచు, రావణుడు దుర్భాషలను వినుచు, ఆమె జీవించుట యనవసరముగదా. కనుకనే శ్రీరాముని నుండి, తనకు సందేశముగొనివచ్చిన హనుమంతుని, సీతాదేవి యిట్లడుగును:-

"రాముడు నాకొఱకు వెత చెందుచున్నాడా? సంతాప పడుచున్నాడా? తాను ఒక పనిని చేసి, దాని తరువాత చేయవలసిన పనులను క్రమముతప్పక చేయుచనే యున్నాడా? మిత్రముల విషయమున, సామ - దాన రూపమగు ద్వివిధోపాయమును; శత్రువుల విషయమున, దాన, భేద, దండ రూపమైన త్రివిధోపాయమును, ప్రయోగించు చున్నాడా? మిత్ర సంగ్రహ యత్నము చేయు చున్నాడా? మిత్రములెవ్వరైన నతని వద్దకు వత్తురా? దేవతల యనుగ్రహ ప్రాప్తి నాశాసించుచు నేమియైన చేయుచున్నాడా? దైవ, పురుషకారములను రెంటిని ఆశ్రయించునా? నేను ప్రవాసమున నుండుటచే, నా విషయమున పూర్వమతనికిగల ప్రేమ తగ్గలేదుగద! కష్టముల నెఱుగని రాముడు ఇపుడు ష్టమేమియైన పడుచున్నాడా? నన్నుగూర్చి యతడు శోకముచే కుందుట లేదుగద! అతడన్య మనస్కుడుగ నుండుట లేదుగద! అతడు నన్ను రక్షించునందువా? భరతుడు నన్ను రక్షించుటకు తన యక్షౌహిణి సేనను పంపునందువా? వానరాధిపతియగు సుగ్రీవుడు, తన వానరసేన తోనన్ను రక్షించుటకు వచ్చునా? లక్ష్మణుడు, తన శర జాలముచే రాక్షసులను సంహరించునా? శ్రీరాముడు, రావణుని, సమిత్ర-పరివారముగ సంహరించునా? అతని ముఖపద్మము, నేను లేనందువలన, దైన్యమున, శుష్కించుట లేదుగద[2] ధర్మవ్యాజమున, స్వరాజ్యమును విడచి, నన్ను తీసికొని పదాతియై యరణ్య

మునకు బయలుదేరిన సమయమున గూడ మనస్సులో శోక - భయముల కెడమీయని రాముడు, ఇపుడుగూడ సజీవుడై యున్నాడా? అతని తల్లి-తండ్రులు గాని, మరియొకరు గాని, నాకంటె ఎక్కువ ప్రియమైనవారుగ గాని, లేదా సమానముగ గాని ప్రియముగ లేరుగద! నా కీవిషయమును ముందు తెల్పిన తరువాత గాని నేను జీవించవలెనో, లేదో నిర్ణయించుకొన జాలను.

ఇక్కడ భగవాన్వాల్మీకి భారతీయ సమాజములోని స్త్రీల సహజ మనో వృత్తిని గూడ, సీతాదేవి మనోవృత్తి నిరూపణ సందర్భము నాధారము చేసి కొని వర్ణించియున్నాడు. భారతీయ సమాజమునందు స్త్రీ-పురుషులందు వివాహ సంస్కారము ద్వారా యేర్పడు, దాంపత్య భావము పరమ పవిత్రమైనది. ఎంత వరకు స్త్రీ-పురుషులిర్వురు, జీవించియుందురో యంతవరకే గాక, జన్మ-జన్మాంతరములకు (జన్మనివృత్తికానంత వరకు) గూడ ఈ సంబంధ మనుస్యూతమగునని వారి విశ్వాసము. ఈ దాంపత్య భావసూత్రమును, త్రైలోక్యస్థితమగు శక్తియును విచ్ఛిన్న మొనరించజాలదు. ఇక్కడి పతివ్రతయగు స్త్రీ, తన భర్తకొరకు తన సర్వస్వమును, చివరకు తన జీవి తమును గూడ సంతోషముతో సమర్పించును. కాని యన్యులు తన స్థానమును (భర్తృ హృదయమునందు) ఆక్రమించుట నామె సహింపజాలదు. ఆమె, ప్రపంచ సంబంధమైన సుఖములకుగాని, భర్తయొక్క భోగభాగ్యములకు గాని, ఎక్కువ ప్రాధాన్యమీయదు. ఐహిక, ఆముష్మిక సుఖములకంటెగూడ భర్తృవాత్సల్యమునకే ప్రాధాన్యమిచ్చును. ఆమె భర్తృవాత్సల్యమునే వాంఛిం చును, దాని కొరకే జీవించును. అది పోగొట్టుకొని యామె జీవించుటకుగూడ ఇచ్ఛగింపదు, కావుననే ఆమె, తన భోగ భాగ్యములను, త్రైలోక్యైశ్వర్య మును ఉగ్గడించి, తనను భర్తగ వరించి సుఖముగ నుండుమని ఉపదే శించిన రావణునకిట్లు సమాధానము నిచ్చినది:-

"దీనో వా రాజ్య హీనో వా యోమే భర్తా స మేగురుః।
తం నిత్య మను రక్తాస్మి యథా సూర్యం సువర్చలా॥
(5/24/9)

తా॥ దీనుడుగాని, రాజ్యహీనుడుగాని, ఎట్టివాడైనను సరియే, నా భర్తయే నాకారాధ్యుడు. సూర్యుని, నిత్యము, సువర్చలయను గమించినట్లు

యాతనిని విడచి, యుందునటు నేను గూడ శ్రీరామునియందే, నిత్యమను రక్తురాయుందును. అతనిని విడచి, మరియొకనికి నా హృదయమునందు స్థానముండదు. మనసా, వాచా, కర్మణా నేను అతనిని వాంఛింతును అని. అపుడు హనుమంతుడు శ్రీరాముని విరహవ్యథను, సీతాయత్త చిత్తతను, విరహ వ్యాకులతను, అనంతమగు దుఃఖమును గూర్చి వర్ణించి చెప్పగ, సీత, తాను జీవించుట వ్యర్థముగాలేదను యాశ్వాసమును పొందియు, శ్రీరాముడు తన వియోగము మూలమునపొందు సంతాపమును, దుఃఖమును గూర్చి విని తన వియోగ వ్యథచే మిక్కిలి దుఃఖము నొందు శ్రీరాముని దుఃఖముచే మిక్కిలి దుఃఖితయై హనుమంతునితో నిట్లనును:-

"అమృతం విషసంపృక్తం, త్వయా వానర భాషితమ్।
యచ్చ నాన్యమనారామో, యచ్చ శోక పరాయణః॥

"ఐశ్వర్యేవా సువిస్తీర్ణే వ్యసనేవా సుదారుణే।
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి॥

"విధిర్నూన మసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ।
సౌమిత్రిం, మాంచరామంచ వ్యసనైః పశ్య మోహితాన్॥
(సు/37/4)

తా॥ ఓ వానరా, రాముడు, అన్యమనస్కుడు కాడనియు, శోకమున మునిగి యున్నాడనియు పల్కిన నీ పలుకు విషమిశ్రితమగు అమృతమువలె నున్నది.

దైవము, ప్రతిప్రాణిని, ఐశ్వర్యము వైపుగాని, లేక యాపత్తుదెసకు గాని, త్రాడుతో కట్టి, నడిపించును.

ఓ ప్లవగోత్తమా, ప్రాణులకు దైవము తప్పించుకొనుటకు వీలులేనిది. సౌమిత్రిని, రాముని, నన్ను చూడుము, ఎట్లు వ్యసనములలో చిక్కుకొని యుంటిమో!

అపుడామె తన వృత్త శౌటీర్యమును ప్రకటించుచు నిట్లనెను: "ఓ రాక్షసాధమా! రామునివంటి ధర్మాత్మునకు పత్నియును, తద్గత మానస నగు, నన్ను నీవంటి నీచులు తప్ప మఱియెవ్వరును, మనస్సులో గూడ కామించ జాలరు. నీవు నన్ను కామముట్టిపడు చూపులతో చూచినను నీ కన్నులెందుకు ప్రేలిపోవుటలేదో, అవాచ్యములు పల్కినను, నీ నాలుక ఎందులకు ఊడి క్రింద పడదో నాకర్థమగుట లేదు, నన్ను అపహరించగల శక్తి ఈ ముల్లోకములలో నెవ్వరికి గలదు? కాని విధి నీవంటి పాపాత్ముని వధించుటకై, యీ విధానము నేర్పాటు చేసి యుండును** నా యీ మాటలు వినుము నేను తలచుకొనిన, నా తపస్తేజముతో నిన్ను భస్మము చేయగలను, కాని నా భర్త యగు రాముని యాజ్ఞ లేకపోవుటచేత తపోవ్రతనిష్ఠురాల నగుటచేతను నావి ముగ చేయక నిన్ను విడచుచున్నాను.*

అట్లే రాక్షసస్త్రీలు రావణుని వాల్లభ్యమునంగీకరించి సర్వసుఖములను భవింపుమని, ఆమెను వత్తిడిచేయగ సీతాదేవి యిచ్చిన యీ సమాధానమును చూడుడు:-

" న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి।
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వోవచః॥ (5/24/7)

తా॥ మనుష్య స్త్రీ రాక్షసునికి భార్యగ నుండుట కుదురదు. కావున నన్ను తినివేసిన తినివేయుడు, కాని మీరు చెప్పిన ప్రకారము నేను చేయను.

ఇక యామె, రావణుని బెదరింపులు, రాక్షసస్త్రీల వత్తిడులకును తట్టుకొనలేక రాముడు రక్షించునను ఆశ క్రమముగ క్షీణింపగ, జీవితముపై విరక్తిచెంది యిట్లు తలపోయును.

---

1. "శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధ నేన వా॥ (5/21 15)

2. "నావ హర్తు మహం శక్యా తస్య రామస్య ధీమతః।
విధి స్తవ వధార్థాయ విహితో నాత్ర సం శయః॥ (5/22/21)

"నహిమే జీవితేనార్థో నైవార్థై ర్నచ భూషణై॥
వసంత్యా రాక్షసీ మధ్యే వినారామం మహారథమ్॥
"అశ్మసార మిదంనూన మథ వాప్యజరాఽమరమ్॥
"హృదయం మమయే నేదం నదుఃఖేన విశీర్యతే॥
"ధిజ్మా మనార్యా మసతీం యాఽహంతేన వినాకృతా।
ముహూర్తమపి జీవామి జీవితం పాపజీవికా॥"
(5/26/5-7)

(తా॥ ఈ రాక్షస స్త్రీల నడుమ, శ్రీరామచంద్రుడు లేకుండగ నివసించు నాకు జీవితము వలన కలుగు ప్రయోజనమేమి? నగలతో నేమి ప్రయోజనము? ధనములతో మాత్రము కలుగబోవు ప్రయోజనమేమి? నా యీ హృదయము ఏల యింత సంతాపమును భరించుచున్నది? ఎందువలన నింత సంతాపము నను బ్రద్దలుగాదు? ఇది లోహమయమో లేక యజరామరమో అయియుండును. నేను చాల* యనార్యను, అసాధ్విని. కాకపోయినచో రాముని చే వేరుచేయబడిన పిదప ముహూర్తకాలము గూడ జీవించగూడని నేను, ఎందుకు జీవించు చున్నట్లు? నాకంటె పాప జీవితము గలవారు మరియెవ్వరుందురు?

ఈ విధముగ తన జీవితమును తానే రోసి, చివరికొక నిశ్చయమునకు ఆ సాధ్వి వచ్చెను నేను నా యెడమ పాదముతో నైనను రావణుని స్పృశింపను. అట్టియెడ యతని కామించుటనుగూర్చి** ప్రశ్నయేమి? ఇట్లు నిర్ణయించు కొని, లోకవిద్విష్టములును, ధర్మసమ్మతములును కాని పల్కులు పల్కు రాక్షస స్త్రీలకు తన నిశ్చయమును తెల్పుచు నిట్లు పల్కెను:

ఛిన్నా భిన్నా ప్రభిన్నా దీ ప్తావాగ్నౌ ప్రదీపితా।
రావణం నోపతిష్ఠేయం కింప్రలాపేన వశ్చిరమ్?
(5/26/10

---

1. అసందేశాత్తు రామస్యతపసశ్చానుపాలనాత్।
నత్వాంకుర్మి దశగ్రీవ భస్మభస్మార్హ తేజసా॥ (5/22/20)
2. చరణేనాపి సవ్యేన నస్పృశేయంనిశాచరమ్।
రావణాంకింపునరహంకామయేయం నిశాచరమ్॥ (5/26/8)

(తా॥ నన్ను నరికినను, ముక్కలు ముక్కలు చేసినను, అగ్నిలో కాల్చినను, రావణుని నేను సేవింపను మీరు వ్యర్థముగ నోటికి వచ్చినట్లు యేల మాట్లాడెదరు? కనుక మీ ధర్మవిరుద్ధమగు ప్రసంగమును మాని వేయుడు.

అప్పుడు సీత, రావణుని కామాత్మత్వమును నిరసించుచు, ధర్మమును త్యజించుట వలన లోకమున నుత్పత్తిల్లు అనర్థములను వివరించుచు చేసిన ఈ ప్రసంగము, ఆమె పాతివ్రత్యశౌటీర్యమును, శీల చారిత్ర సంపన్నతను, పతి భక్తిని, ధర్మాభినివేశమును, సామాజిక కళ్యాణ భావనను, ఇంకను ఉత్తమాభి జనమును చాటుచున్నది. ఆమె రావణుని, యర్థ కామప్రధానమైన, లౌకిక జీవిత విధానమును నిరసించిన తీరును, సనాతన వైదిక ధర్మమువట్ల చూపిన శ్రద్ధను, భారతీయ దాంపత్య భావ మహత్త్వమును గూర్చి పల్కిన పలుకులు భారతీయ సాహిత్య భండార గృహమున శాశ్వతముగ నిల్చియుండు ఉత్కృష్ట రత్నములు. ఆమె, అర్థకామములను రెంటినే సేవించు, లంపటుల నీచత్వ మును, వారి జీవిత విధ్వంసక, లోకవినాశక సిద్ధాంతముల కుత్సిత స్వరూప మును బట్టబయలు చేయుటతో చాటుగ, అందరును ధర్మమును పాటించుటకు "ఆత్మవత్సర్వభూతాని" యను సార్వజనీన, సార్వకాలిక సిద్ధాంతము నంగీకరించి తదనుగుణముగ సంచరించుటయొక్క యవసరమును గూర్చి చెప్పిన మాటలు, విశ్వమానవాళికి శిరోధార్యములు.

లంకేశ్వరుడగు రావణుడేకాక, లంకానగరములోని రాక్షసులందరు, ఒకరిద్దరిని మినహాయించి, ధర్మ నిరపేక్షమగు జీవిత పద్ధతి ననుసరించు వారలే. కనుకనే రాక్షసులను గూర్చి సీతాదేవి చెప్పిన ఈ మాటలను చూడుడు: "అకార్యం, యే, నజానన్తి, నైఋతాః పాపకారిణః॥"; "నైతే ధర్మం విజానన్తి రాక్షసాః పిశితాశనాః॥" మఱి, వారినిగూర్చి ఒక శంక కలుగు చున్నది. అదియేమన, రాక్షసులకు, సమాజమునంతను, ఏకసూత్రమున బంధించు ధర్మమే లేదు? మరియపుడు వారు ఐకమత్యముతో నెట్లు తమ మనుగడను కొనసాగింపగల్గిరి? అనినచో, వారికిగూడ, వారినందరను కలిపియుంచగల ఒక రాక్షస ధర్మమున్నది. అది ఏదియును లోకములను దోచుకొని తినుట. పర స్త్రీల నపహరించి, వారిని భోగించుట. ఈ సూత్ర

ముతోడనే వారందరు ఏకమత్యముకల్గిన తమ మనుగడను కొనసాగించి- ఇక వారు, తమ వద్దనున్న ధనముతో తప్పత్రాగి, నిత్యము, క్రొంగొత్త కాంత లతో రమించుచు పశుతుల్యమగు ప్రవృత్తి కల్గి జీవితమును నడుపుచుండిరి. ధర్మాత్ములను పీడించుచు, పరహింసయందు పరమరతి కల్గియుండిరి.

రాక్షసజాతికి లలితకళాభిరుచియున్నట్లు, లంకానగర వర్ణన సందర్భ మున వాల్మీకి పలుతావుల వర్ణించియున్నాడు. మనము దేనిని 'నాగరికత' యని వ్యవహరించుచున్నామో, ఆ నాగరికతలో గూడ, రాక్షసజాతిని మించిన వారులేరు. వారి విశాలములగు ఏడెనిమిది యంతస్తుల భవనములు, వానిపై గల, ఆకసమునొరయు చంద్రశాలలు, గృహములలోని మణిమయ కుట్టి ములు, రత్నమయ స్తంభములు బంగరు అరుగులు, శుకశారికాదుల పాల నము, ఉద్యానవనములు, క్రీడాగృహములు, దివాగృహములు, రాత్రి గృహ ములు, క్రీడా సరస్సులు, దిగుడు బావులు, దారుమయములగు కృత్రిమ పర్వతములు, చందన, అగురు, వాస చూర్ణాదులు, పురాణ మద్యములు, సంస్కారయుక్తములగు మాంసౌదనములు, మొదలగునవి యన్నియు వారి భోగమయ జీవితమునే గాక, వారి కళాభిరుచిని గూడ తెలియచేయుచున్నవి. రావణుని యంతఃపుర కాంతలలో నందరు నృత్య॥గీత- వాద్యాదులయందు పరమ నిపుణులుగ వర్ణించబడియున్నారు. స్త్రీ-పురుషులు సమానముగనే మద్యము సేవించుచుండెడివారు. వారు ధరించు వివిధాభరణములు, సన్నని వలిపెములు, అంగలేపనములు, కేశ సంస్కారములు, స్నాన-పాన-భోజనా దులు వారి సంస్కృతికి ప్రతీకములు.

కాని ఇవి యన్నియు వారిలో నుత్తమ సంస్కారమును, మృదుత్వ మును, సభ్యతను, స్వచ్ఛములగు విచారములను, సహృదయత్వమును, దయా దాక్షిణ్యములను, సర్వభూత దయను, పెంపొందించజాలక, వారిని క్రూరు లుగను, లంపటులుగను, లోక కంటకులుగను, రాక్షసులుగను మార్చివేసినవి!

మరి లోపమెక్కడయున్నదని యాలోచించిన, ధర్మమందు వారికి శ్రద్ధలేక పోవుటయేయని, భగవాన్ వాల్మీకి నిరూపించియున్నాడు. ధర్మవిరహి తములగు, అర్థ-కామములు, మానవుని దానవునిగను, లేక పశువుగను మార్చి వేయును. సత్యనిష్ఠ, ధర్మనిష్ఠ, తపస్సు, ఇంద్రియ సంయమము, సర్వ

భూత దయ. లోక కళ్యాణ భావన, విహిత కర్మలు చేయుట. ధర్మ సమ్మతము లైన భోగములననుభవించుట, ఆత్మ వత్సర్వ భూతాని, యను ఉదార భావనను జీవితములో ననుసరించుట వలననే మానవ సమాజము సుఖశాంతులననుభవించుటతోబాటుగ, మానవత్వమునుండి దివ్యత్వ దిశగ పయనింప సమర్థమగును. ఇదియే వైదిక సిద్ధాంత రహస్యము. సీతాదేవి ప్రసంగ సారముగూడ- ఇక సీతాదేవియందు భగవాన్ వాల్మీకి ప్రదర్శించిన పాతివ్రత్య తేజమును, సత్యనిష్టను, ఆమె యనిందిత చారిత్రమునందు ఆమెకు గల పరిపూర్ణ విశ్వాసమును, హనుమంతుని తోకకు నిప్పు అంటించి, రాక్షసులు వినోదించు సమయమున, వెల్లడించియున్నాడు :—

రాక్షస స్త్రీలు, హనుమంతుని తోకకు లంకా నగరములోగల నార పీలికలు, ప్రాత గుడ్డ పీలికలు, అన్నియును ప్రోగుచేసి వానిని చుట్టి వానిపై తైలము పోసి, నిప్పు అంటించి, నాల్గు వీధులలో త్రిప్పుచు క్రూర వినోదము చేయుచున్నట్లు, రాక్షస స్త్రీల వలన విని. సీతాదేవి యగ్నిహోత్రుని 'శీతోభవ' యని ప్రార్థించిన సమయమున గూడ, తన పాతివ్రత్యము, తన స్త్రీవ్రతపము, పతి శుశ్రూష శీలవృత్తములు రామునికి తనయందు గల దయ, వాత్సల్యము. మొ॥లగు తన సద్గుణములనే పణముగ నిడి, పైన చెప్పిన పవిత్రతలలో నుండవలసిన సద్గుణములు తనయందున్నచొ చల్లబడవలసినదనియు హనుమంతునికి సంతాపమును కలుగచేయవలదనియును అగ్నిదేవుని ప్రార్థించెను. ఇదియామె పతి యందలి యనన్య నిష్ఠకు, పతికి తనయందుగల వాత్సల్యమునకు' వియోగ కాలమున రామ ప్రాప్తికై యామె చేసిన తపమునకు, నియమ పాలనమునకును దృఢమైన ప్రమాణము, ఆమె హనుమంతునికి సంతాపము కలుగచేయవలదని, అగ్నినిగూర్చి చేసిన ఈ క్రింది స్తోత్రమును చూడుడు :—

యద్యస్తిపతి శుశ్రూషాయదస్త్యి చరితంతపః।
యదివాత్వేక రుత్నిత్వం శీతోభవహనుమతః॥
యదికించిదనుక్రోశ స్తస్యమయ్యస్తి ధీమతః।
యదివాభాగ్యశేషోమే శీతోభవహనూమతః॥
యదిమాంవృత్త సంపన్నాంతత్స మాగమలాలసామ్।
సవిజానాతి ధర్మాత్మా శీతోభవహనూమతః॥

యదిమాంతారయేదార్య స్సుగ్రీవస్సత్య సంగరః।
అస్మాద్దుఃఖంబు సంరోధాచ్ఛీతో భవహనూమతః॥

తా॥ నేను పతి శుశ్రూష చేసియున్నచో, తపము నాచరించినచో, పాతివత్యమును పాలించుచున్నచొ హనుమంతునికి శీతలుడవు కమ్ము.

ధీమంతుడగు రామునికి నాయందు కొంచెమైన దయయున్న, నా యదృష్టమింకను శేషించియున్న హనుమంతునికి చల్లబడుము.

నన్ను సచ్చారిత్రను, భర్తృ సమాగమ లాలసురాలనుగ ధర్మాత్ముడగు రాముడు తెలిసికొనునేని హనుమంతునికి చల్లబడుము.

సత్య సంగరుడగు సుగ్రీవుడు ఈ దుఃఖసాగరమునుండి నన్ను ఉద రించునేని హనుమంతునికి శీతలుడవు కమ్ము.

హనుమంతుడు లంకనంతయును దహించి, సీతనుగూడ దహించివేసితి నేమోయని పశ్చాత్తాపపడుచుండగ. నతనికి శుభనిమిత్తములు పొడచూపగ కొంచెమూరడిల్లి. ఆ దేవి ప్రభావమును గూర్చి తలపోయుచు హనుమంతుడను కొనిన ఈ మాటలను చూడుడు :—

1. అథవా చారు సర్వాఙ్గీ రక్షితా స్వేనతేజసా।
నవశిష్యతి కల్యాణీనాఽగ్నిరగ్నౌ ప్రవర్తతే॥

2. నహిధర్మాత్మ న స్తస్య భార్యామమితతేజసః।
స్వచారిత్రాభి గుప్తాంతాం స్ప్రష్టు మర్హతి పావకః॥

3. నూనంరామ ప్రభావేణ వైదేహ్యాస్సు వృతేనచ।
యన్మాందహన కర్మాఽ యంనాఽ దహద్ధవ్యవాహనః॥

4. త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాందేవతాచయా।
రామస్యచ మనఃకాన్తా సాకథం వినశిష్యతి॥

5. తపసాసత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి।
అసౌవినిర్దహేదగ్నిం నతామగ్నిః ప్రధక్ష్యతి॥
(5/55/22-25; 58)

(శ్లో॥ 1) సర్వాంగ సుందరియగు సీత తన పాతివ్రత తేజముచే శోభితురాలు. అట్టి యీ దేవిని అగ్ని యెట్లు కాల్చును అగ్ని అగ్నినే యెట్లు కాల్చును ?

2) అమిత తేజస్కుడును, ధర్మాత్ముడునునగు, శ్రీరామునికి భార్యయును, స్వచారిత్రాభిగుప్తయును నగు సీతను అగ్ని స్పృశింపనుగూడ స్పృశింపలేదు.

3) నిశ్చయముగ, రాముని ప్రభావమువలనను, వైదేహియొక్క సుకృతబలము వలనను, దాహక స్వభావముగల అగ్ని నన్ను దహించలేదు.

4. భరతుడు మొదలుగాగల మువ్వురు సోదరులకు నారాధ్య దేవతయును, శ్రీరామునికి హృదయపల్లభయునునగు సీత యెట్లు నశించును ?

5. తపముచేతను, సత్యవచనము చేతను, భర్తయందు అనన్యభావము గల్గియుండుట చేతను ఈ మెయే, యగ్నిని, దహించగలదు. ఈమె నగ్ని దహింపజాలదు.

పై యైదు శ్లోకములతో "సీత" సర్వనారీవరిష్ఠగ నెందుకు భావించబడినదో తెల్పుటతోపాటుగ, భగవానే వాల్మీకి యామె ప్రభావమును, నామె యాంతర సౌందర్యమును, మూసలోపోసి మూర్తిమంత మొనరించియున్నాడు. ఆమెలోనున్న దివ్యగుణములు :

1) సర్వానవద్యమగు శారీర సౌందర్యము, 2) ఆత్మ తేజము, 3) ఏకపత్నీత్వము 4) ఉత్తమ చారిత్రము 5) ఉత్తమ కర్మాచరణము 6) శ్రీరామ వాల్లభ్యము 7) తీవ్రతపము 8) సత్యవచనము 9) రామునియందు అనన్యమగు నిష్ఠ అనునవి.

ఈ తొమ్మిది గుణములు, అమె ఆత్మను కుందనశుద్ధ మొనరించి చేవి. వీనివలననే యామె యాత్మతేజము ఉద్దీప్తమైనది. అందువలననే యగ్ని యామెను తాకుటకుగూడ శక్తిలేనివాడైనాడు.

ఈ వర్ణనములోని మఱికొన్ని విశేషములు : భారతీయ సమాజమున పతివ్రతయగు స్త్రీ, మునులకు సైతము పూజ్యురాలు. పాతివ్రత్యమహాత్మ్యము,

రామాయణమునందేగాదు, ఆర్ష వాఙ్మయమున సర్వత్ర నుతింపబడినది. స్త్రీకి పాతివ్రత్యముకంటె నుత్తమమగు వ్రతము లేదు కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతములద్వారా, తపోనిష్ఠులెట్లాత్మశక్తిని ప్రవృద్ధమొనర్చుకొందురో యట్లే పాతివ్రత్య నిష్ఠచే, స్త్రీ తన యాత్మతేజమును ప్రవృద్ధమొనరించుకొనును. కనుకనే శ్రీరాముడు, వనమునకు, తనతోగూడ వచ్చుటకు సిద్ధపడిన తన తల్లికి పాతివ్రత్య మహిమను వివరించుచు నిట్లు పల్కెను.

భర్తు శ్శుశ్రూషయా నారీలభతే స్వర్గముత్తమమ్।
అపియా నిర్నమస్కారా నివృత్తా దేవపూజనాత్॥

శుశ్రూషా మేవకుర్వీత భర్తుః ప్రియహితేరతా।
ఎష ధర్మః స్త్రియానిత్యో వేదేలోకేశ్రుతః స్మృతః॥ అని॥

(రామా 2/24/26-27)

(తా॥ భర్తృ శుశ్రూషయను ధర్మమును పాటించుటవలన స్త్రీ స్వర్గమునకు పోవును. పెద్దలకు నమస్కరించకయున్నను, యజ్ఞములద్వారా దేవతల నారాధించక పోయినను పాతివ్రత్య ధర్మపాలనమువలన స్త్రీలు స్వర్గమునకు పోవుదురు.

భర్తకు ప్రియము చేయుట, భర్తృహితమందు సంలగ్నమగుట, భర్తృ శుశ్రూష చేయుటయను కర్మలు స్త్రీ యాచరించవలసిన ధర్మము. ఈ ధర్మమామెకు నిత్యముగ వేదమున ప్రతిపాదించబడినది స్మృతులయందు స్మరించబడినదిగూడ.

ఇక్క తమ ధర్మపాలనయందు సత్యనిష్ఠ, ఉత్తమ చారిత్రము, నియమ పాలన రూపమగు తపము, ఈ మూడు పురుషులకును స్త్రీలకును సమానములు. స్త్రీగూడ భర్త్రారాధన వ్రతమున ఈ మాటను తప్పక పాటించవలెను.

భారతీయనారి, స్వర్గసుఖము కంటె పతి సాన్నిధ్యమున కెక్కువ ప్రాధాన్యమిచ్చును. ఈ విషయమును వనవాసమునకు బయలుదేరబోవుటకు ముందు సీత రామునికి తెలియచేసినది.*

---

1 సుఖంవనే నివత్స్యామి యథైవభవనే పితుః।
అచింతయంతీ త్రీంల్లోకాంశ్చింతయన్తీ పతివ్రతమ్॥ (2/27/12)
స్వర్గే పిచవినావాసో భవితాయది రాఘవ।
త్వయావినానరవ్యాఘ్ర నాహం తదపిరోచయే॥ (2/27/10)

ఇక 'తపము' అను కర్మ పతివ్రతయగు స్త్రీ భర్తృ ప్రవాసమున చేయును. మహాతపోనిష్ఠులగు మహాత్ములు తపము సల్పు సమయమున నేయే నియమములను పాటింతురో పతివ్రతలుగూడ భర్తృప్రవాససమయమున నాయానియమములను తప్పక పాటింతురు. ఆ నియమ సంస్మరణము వెనుక చేయబడినది. మునులు, అధశ్శయ్య, అల్పాహారము మొదలగు నియమములను పాటించుచు, శారీరకృత్యములకును, నిద్రాదులకును కావలసిన సమయమును విడచి, భగవద్ధ్యానమును చేయుదురు ధ్యానతీవ్రతపై తపస్సిద్ధియాధారపడి యుండును. పతివ్రతలగు స్త్రీలు భగవంతుని స్థానమున, భర్తను ప్రతిష్ఠించి, ఇరువదినాలుగు గంటలు భర్తృధ్యాన నిమగ్నురాండ్రై యుందురు. ధ్యానము మునులకును - పతివ్రతలకును ఇరువురకును, సమానము కాని భర్తృవియోగ కర్శితలగు స్త్రీల భర్తృధ్యానమునందలి తీవ్రత మునుల ధ్యానమందుండుట కష్టము అందువలననే భక్త్యాచార్యులు, మహర్షులు, ధ్యానతీవ్రత విషయమున విరహిణీస్త్రీలనుదాహరణముగ తీసికొందురు, ఈధ్యాన తీవ్రత వలన, మనోమాలిన్యము నశించి, యాత్మతేజము జాజ్జ్వల్యమానయగును. ధ్యానశక్తి యట్టిది కావుననే వాల్మీకిమహర్షి సీతా-రాముల వియోగమును. కేవలము, కామతీవ్రతగ పరిగణింపక, ధ్యానతీవ్రతగ నిరూపించి, తీవ్ర ధ్యానమువలన నిరంతరము వృద్ధిపొందు ఆత్మతేజమును సీతారాములయందు చూపినాడు. ఇదియే సీతాదేవి విరహసమయమున చేసిన మహత్తరమగు తపము. ఈ తపశ్శక్తివలననే రావణుడామెను తాకుటకుగూడ సాహసము చేయలేకపోయినాడు. ఈ తపశ్శక్తివలననే మహా తపఃపరిగ్రహుండగు రావణుని తాను భస్మముచేయగలనని సీత బెదిరించినది వాల్మీకి స్పష్టముగ నీవిషయమును వాచ్యముగ చెప్పినాడుసత్వాంకుర్మి దశగ్రీవ భస్మ, భస్మార్హ, తేజసా॥ ఇక్కడ తేజః పదమును వాల్మీకి కావలెననియే ప్రయోగించినాడు. ఈ తపశ్శక్తివలననే యగ్ని, లంకాదహ సమయమున నామెను దహించకపోగా, హనుమంతునిగూడ దహించుటను మానివేసినాడు. ఆమెయందుగల ఈ తపశ్శక్తినే హనుమంతుడు వానరులకు వివరించి చెప్పినాడు.* ఈ తపశ్శక్తిని హనుమంతు డామెయందు

1. తవ సాధారయేల్లోకాన్ క్రుద్ధావా నిర్దహేదపి॥ (5/59/3)

చూచియే "నాగ్నిరగ్నౌ ప్రవర్తతే"॥ యని ఉగ్గడించినాడు. అందువలననే సీతాదేవి మహిమను చాటుచు, ప్రథమ కారణముగ పైన ఇచ్చిన శ్లోకములో తపముచు వాల్మీకి పేర్కొనియున్నాడు. ఇక యామె శీల చారిత్రములు అనన్య సాధారణములు. సీతాదేవి యందుగల పతినిష్ఠయే సుందరకాండమందు సర్వత్ర నిరూపించబడినది. ఆమెయందు పతిగల వాత్సల్యము శ్రీరామ వియోగనిరూపణ సందర్భమున నిరూపించబడును. భక్తాదులకు ఆమె యారాధ్యదేవత యని వాల్మీకి చెప్పినాడు. ఇట్లు చెప్పుటలో వాల్మీకి తాత్పర్యమేమి? ఈ విషయమును పరిశీలింతము.

భారతీయ జనసమాజము. పారివారిక జీవితమునకు ప్రాధాన్య మొసగును. పరివారమనగా అత్తమామలు, మరదులు, ఆడబిడ్డలు, ఇంకను ఇతర బంధువులును ఉందురు. ఒక పరివారమునకు కోడలుగ వచ్చిన స్త్రీ, భర్తృసేవతోబాటుగ, పైన చెప్పిన వారందరిని తన సౌజన్యమువలనను, స్నేహభావముతోడను, సేవలతోడను సంతోషపెట్టినగాని, వారి వలన శాంతి నెలకొనదు. పరివారములో శాంతిలేనపోయిన గార్హస్థ్య జీవితానందము సంభావము గాదు. సీతాదేవి తన సేవలద్వారా భర్తృవాత్సల్యమును, అత్త-మామలు మొదలగు పూజ్యుల వాత్సల్యమును చూరగొనుటయేగాక, తన యావచ్ఛీల-చారిత్రములవలన, సుగుణములవలన, వాత్సల్యభావమువలన, సేవలవలన తన మరదులచే పరమపూజ్య భావమున నారాధింపబడినదని కవి హృదయము.

సారాంశ మేమియన వియోగము, భార్యాభర్తలందుగల శారీర భోగాసక్తిలోని, భోగవాసనను దగ్ధమొనరించి, "కామవాసనను," "శుద్ధప్రేమగ" పరిణత మొనరింపగల ఒక యపూర్వమగు పుటపాకముగ వాల్మీకి ప్రతిపాదించియున్నాడు. ఇదియే యీ సుందరకాండ ప్రతిపాదితమగు భార్యాభర్తృగతమగు ప్రేమ యొక్క దివ్యత్వము. ఇట్టి దివ్యప్రేమకు పాత్రములగు దంపతులు, భౌతికమగు భోగలోకమునుండి, దివ్యమగు ప్రేమలోకమున ప్రవేశించి దివ్యప్రేమామృతమును తాము గ్రోలుటచే సమర్థత్వమంది. యట్టి ప్రేమామృతమును లోకమునకు పంచియిచ్చి యట్టి యమృతత్వ ప్రాప్తికి తోడ్పడుచున్నారు. కనుకనే వాల్మీకి మహర్షి సీతారాముల దివ్యప్రేమను

సుందరకాండమను రత్నజటితమగు సువర్ణచషకముద్వారా సర్వలోక సులభ మొనరించినాడు. ఇదియే సుందరకాండ మహత్త్వము.

## 20 సీతాదేవి నిర్వేదము త్రిజటాస్వప్నాఖ్యానము

సీతాదేవి జీవితమందు నిరాశచెందెను. రావణుని బెదరింపులను స్మరించి చాల దుఃఖపడి, రావణుని క్రూర స్వభావమును, కాత్మత్వమును నిందించుచు తనలో తానిట్లనుకొనెను: ఇతడు క్రూరుడు, కామాత్ముడు. లేనిచో నన్ను తన వాల్లభ్యమునంగీకరింపుమని యెట్లు కోరును? వానికి సిగ్గులేదు. నేనతని కోరికనెంత తిరస్కరించినను, తెలిసికొనజాలక యున్నాడు. తానేమిటో, తానే కులమున జన్మించినాడో, తానేమి యాచరించుచున్నాడో గూడ కామాంధుడు తెలిసికొనలేని స్థితిలోనున్నాడు. విశ్రవస మహర్షికి పుత్రుడై, వైశ్రవణునికి భ్రాతయైయుండిగూడ, పరదార ప్రధర్షణమును నీచకార్యమున కొడగట్టినాడు. ఏమిచేయుదును? నా భర్త మహాప్రతాపి-జనస్థానమును ఒక్క ముహూర్తకాలములో హతస్థానము గావించినాడు. అట్టివాడు తలచుకొనిన, తన యమోఘము లగు బాణములతో నీలంకను నాశనము చేయలేడా? మరి యెందుకని, నిరంతర మతనికై తపించు నన్ను రక్షించుటకు పూనుకొనడు? అతనికి, నేనిక్కడ నున్నట్లు తెలియక పోవచ్చును. మహాపరాక్రముడును, దేవాసురులకు నైత మప్రధృష్యుడునై యుండిగూడ, ఈపాపిని ఏల శిక్షించుటకు పూనుకొనడు? ఇతని ప్రాగల్భ్యమెందులకు సహించుచున్నాడు. నేనిక్కడ నున్నట్లతనికి తెలిసినచో, నతడు ఈ లంకలోనేగాదు, ముల్లోకములోనున్న రాక్షసులనుగూడ హతమార్చగలడు. లంకనుమాత్రమేగాదు, ఈ లంకను చుట్టియున్న సముద్రమునుగూడ దహించివేయగలడు. నీచుడగు రావణుని పేరుప్రతిష్ఠలను శాశ్వతముగ నాశనము చేయగలడు.* అపుడు రాక్షసస్త్రీలు నావలె రామబాణములచే

1. "యది మామిహ జానీయాద్వర్తమానాంహి రాఘవః।
అద్య, బాణై రభిక్రుద్ధః కుర్యాల్లోక మరాక్షసమ్॥ (5/26/18)
"నిర్దహేచ్చపురీం లంకాం నిర్దహేచ్చ మహోదధిమ్।
రావణస్యచ నీచస్య కీర్తిం నామచనాశయేత్॥ (5/26/19)

నిహతులైన తమ భర్తలకొరకు ఇంటింటా విలపించెదరు. రామ-లక్ష్మణులు నేనిక్కడ ఉన్నట్లు ఎరిగినచొ, ఈ లంక ఎక్కడ ఉన్నదో వెదకి నాశనము చేయగలరు. వారి కంటపడిన శత్రువు ముహూర్తకాలమైన జీవింపజాలడు. ఈ లంకలో అశుభలక్షణములు గన్పించుచున్నవి. కొద్దికాలములోనే ఈ నగరము రామబాణములచే దగ్ధమైపోగలదు. కాని ఈ రాక్షసుని యింటిలో, నేనున్నట్లు నా రామునికి తెలియవలయునుగదా? ఈ రావణుడు కటికవాడు. నృశంసుడు ఎట్టి యకార్యమైనను చేయుటకు వెనుకాడడు వాడు నాకు బ్రతుకుటకు రెండుమాసముల గడువునే యిచ్చినాడు అదిగూడ సమీపించుచున్నది. పాపకారులగు రాక్షసులకు చేయరాని కార్యమేముండును.** వారు స్త్రీహత్యను చేయుటకుగూడ సంకోచించరు. ఈ దుష్టరావణుడు తనకోరికను చెల్లించనిచొ, నన్ను తప్పక వధించును. ఈ జీవితము నారాముని చూడకుండగ, బంధువులు గూడ చెంతలేకుండగ, ఈ లంకలో ఈ విధముగ అంతము కావలసినదేనా? రాముడు నన్నుగూర్చి వెదకక యూరకుండునా? కాని, నా వియోగ దుఃఖమున శోకించుచు, ప్రాణములు విడువలేదుగద? అతడు తప్పక నా వియోగ శోకమును భరింపలేక, తన తనువును త్యజించి స్వర్గమునకు పోయియుండును! నిజముగ, ఆ స్వర్గమున వసించు దేవ, గంధర్వ, సిద్ధ, పరమర్షాదులు ఎంత దురదృష్టవంతులు! వారందరకు నా రామదర్శనము చేయు భాగ్యము కల్గును? లేదా, బలికియున్నను నన్ను అపహరించిన తరువాత, కాలక్రమమున నిరాశచెంది మఱచిపోయియుండవచ్చును. లోకమున నెవ్వరైనను కనబడుచున్నంతవరకే యభిమానింతరు. కనిపించని వారియందు స్నేహము నిలబడదు కాని, నారాముడట్లు చేయడు కృతఘ్నులు మాత్రమే స్నేహమును మఱచిపోదురు నా రాముడు కృతజ్ఞుడుగాని కృతఘ్నుడు మాత్రముకాడు.* నాయందేమి, దుర్లక్షణములుకలవో, లేనిచొ నాకిదుర్గతియేల పట్టును! ఇది యంతయు నా దురదృష్టము! నేను రామునినుండి వేరుచేయబడిన

1. "దృశ్యమానే భవేత్ప్రీతిః, సౌహృదం నాస్త్య దృశ్యతః
నాశయంతి కృతఘ్నాస్తు "న" రామోనాశయిష్యతి॥ (5/26/39)

2. "అకార్యం యేనజానన్తినైఋృతాః పాపకారిణః॥ (5/26/32)

తరువాతగూడ జీవించియున్నాను. ఇదియే నాదురదృష్టము. మహాత్ముడగు శ్రీరామచంద్రునితో విరహితయగునేను జీవించుటకంటె మరణించుటయే శ్రేయస్కరము. రామలక్ష్మణులు నన్ను రక్షింతురనుకొనుట అడియాసయే యగును. కంద, మూలఫలాశనులగు వారలు శస్త్రత్యాగము చేసియుండవచ్చును లేదా, దురాత్ముడును, మాయావియునగు రావణుడే, మోసముచె వారిని హతమార్చియుండవచ్చును. నాకు బ్రతుకుమీద నెట్టి యాశయును లేదు. కాని భగవంతుడు నాకు మృత్యుయోగమును నొసట వ్రాసియుండకపోవచ్చును విదితాత్ముడగు శ్రీరాముని విడచి బ్రతకుట వ్యర్థము అని పలువిధముల తలపోసి పరమదుష్టుడగు రావణునికి బందీనై యిన్ని యిడుములు పడుటకంటె ప్రాణములను విడచుటయే మంచిదను నిశ్చయము చేసికొనెను. ఆమె యీనిశ్చయమెరిగి కొందరు రాక్షసస్త్రీలు రావణునికీ వార్త యెఱిగించుటకుపోగా, కొందరామెను తమ పలుకుములుకులతో వేధింపసాగిరి. రాక్షస స్త్రీ లేవిధముగ సీతను బాధించుటచూచి త్రిజటయను రాక్షసి, సీతను వేధించు రాక్షసస్త్రీలతో నిట్లు పలికెను.

## త్రిజటాసమాశ్వాసనము

అనార్యులగు ఓ రాక్షసకాంతలారా! మీరు సీతను భక్షించెదమని పదేపదే బెదరించుచున్నారు. మీరు సీతను భక్షింపజాలరు. అంతకా లెనన్నచొ మిమ్ములను మీరే భక్షించుకొనుడు ఆమె జనకుని కూతురు, దశరథుని కోడలు, శ్రీరాముని కిల్లాలు ఆమెను మీరేమి చేయజాలరు. నేనీరాత్రి చివరి యామమున బాల దారుణమైన ఒడలు జలదరించు దుఃస్వప్నమును చూచితిని. ఈ స్వప్నము రాక్షసులకు వినాశమును, ఈమె భర్తకు అభ్యుదయమును సూచించుచున్నది, అని పల్కి, ఆ రాక్షస స్త్రీలడుగగ తన స్వప్న వృత్తాంతమునిటు వివరించెను:-

"మొదట నాకు లక్ష్మణసహితముగ రాముడు, గజదంతముతో నిర్మించబడినదియును, వెయ్యి గుర్రములు పూన్చినదియు, ఆకాశగతమునునగు ఒక

దివ్యమైన శిబికను (పాలకీని) శుక్లవర్ణములైన పుష్పహారములను, వస్త్రములను ధరించి, యెక్కినట్లుగ కన్పించినాడు. అపుడు సీతాదేవి శ్వేతవస్త్రమును ధరించి, శ్వేతపర్వతముపైన శ్రీరామునిగూడ కన్పించినది తిరిగి రాఘవుడు, లక్ష్మణ సహితముగ, నాలుగుదంతములుగల మహాగజము నధిరోహించి, తెల్లని పుష్పహారములను, వస్త్రములను ధరించి, సూర్యునివలె వెల్గొందుచు సీతవద్దకు వచ్చెను. తిరిగి, ఆ శ్వేత పర్వత శిఖరముపైన, ఆకాశమునందు నిలబడిన ఏనుగుపై రాముడు గూర్చుండి, ఆ గజముయొక్క స్కంధముపై సీతను కూర్చుండజేసి యామెను పట్టుకొనియుండెను. అపుడు కమలలోచన యగు సీత, తన భర్తఒడిలోనుండి ఎగిరి, సూర్య-చంద్రులను తన హస్తముతో నిమురుచున్నట్లగుపించినది సీతారామలక్ష్మణు లధిరోహించిన. ఆ యుత్తమగజము లంకపైన నిలబడి కన్పించినది. తెల్లని యెనిమిది ఋషభములు పూన్చిన రథముపై తన భార్యయగు సీతతో రాముడు ఒక్కడే యచటకు వచ్చినట్లు కన్పించినాడు. ఆటు తరువాత శ్రీరాముడు, సీతాలక్ష్మణులతో గూడ పుష్పక విమాన మధిరోహించి యుత్తరదిక్కుగా పయనమైనట్లు స్వప్నమున చూచితిని.

ఇక రావణుడు, ముండితమస్తకుడై, తైలసిక్తుడై. యెర్రని వస్త్రములు ధరించి. మద్యపానమత్తుడై, గన్నేరుపూలనుధరించి, పుష్పకమునుండి నేల బడుచు కన్పించినాడు. తరువాత తిరిగి నల్లవస్త్రములను ధరించి, ఒక స్త్రీచేత లాగుకొనిపోబడుచున్నట్లు కన్పించినాడు. ఎర్రనిపూల మాలను ధరించి, రక్త చందనమలదికొని, గాడిదలు పూన్చిన రథముపై రావణుడు తిరిగి కన్పించినాడు. అతడు తైలమును త్రావుచు. వికటముగ నవ్వుచు, ఆడుచు, వికటమైన చిత్తేంద్రియములుగల్గి, గార్దభమునెక్కి దక్షిణదిగా పోవుచుకన్పించెను.

మరల ఆ గార్దభముపైనుండి. బోర్లభొక్కలగాపడి, భయముచే వణకుచు నాకగుపించినాడు. హఠాత్తుగ భూమిపైనుండి లేచి గాబరాపడి. భయార్తుడై, పానమదవిహ్వలుడై, పిచ్చివానివలె, నోటికి వచ్చినట్లు, పదరుచు, నాకు కన్పించినాడు, అతడు, దుఃసహమగు దుర్గంధ పూరితమైన, నిబిడాంధకారముచే నరకతుల్యమగు మలపంకమునందు, దిగి, అందేమునిగిపోయినట్లు

కన్పించినాడు. ఆ తరువాత దక్షిణదిక్కుగా పోవుచు కన్పించెను. అతడు పంక రహితమైన ఒక కొలను ప్రవేశించెను. ఒక స్త్రీ, ఎర్రని వస్త్రము ధరించి, ఒడలంతయు బూడిదపూసికొని, కృష్ణవర్ణముతో నొప్పుచు రావణుని కంఠ మునకు త్రాడు బిగించి, దక్షిణ దిశగా లాగుకొనిపోవుచు కన్పించినది. అట్లే కుంభకర్ణుడుగూడ నాకు కన్పించినాడు. రావణుని కొడుకులందరు, తలలు గొరిగించుకొని, నూనె పూసుకొని కన్పించినారు. రావణుడు వరాహముపైనను ఇంద్రజిత్తు మొసలిపైనను, కుంభకర్ణుడు ఒంటెపైనను ఎక్కి దక్షిణ దిశగా పోవుచు కన్పించిరి. అక్కడ నాకు నలుగురు మంత్రులతో గూడ ఆకాశములో కెగిరి, తెల్లని ఛత్రము ధరించిన విభీషణుడు కన్పించినాడు

ఇంక ఎఱ్ఱని పూలమాలలు, వస్త్రములు ధరించి, మద్యము త్రావిన రాక్షసుల వాద్యఘోషలు గీతధ్వనులుగూడ వింటిని వాజి, గజ రథములతో శోభిల్లు లంక పడిపోయిన గోపురములతోను బహిర్ద్వారములతోను సముద్రము లో మునిగిపోయినట్లగుపించినది రాక్షస స్త్రీలందరు, నూనె త్రావి, ప్రమత్తలై వెడనవ్వులు నవ్వుచు దుమ్ము పైకిలేచు లంకలో పెద్దగా యరచుటను చూచితిని కుంభకర్ణాది రాక్షస వీరులు ఎర్రని వస్త్రములు ధరించి పెద్ద లోతైన పంకమున మునిగిపోవుచున్నట్లు నగుపించిరి.

ఈ స్వప్నమును మీరు వింటిరి గదా దీనిని బట్టి రాఘవుడు తిరిగి సీతా దేవిని పొందగలడనియు విభీషణుడు. అతని మంత్రులు, అనుచరులు పక్క మిగిలిన రాక్షసులందరు, లంకతో సహా వినాశకాధురను విషయము ఈ స్వప్నము సూచించు చున్నది కనుక సీతను బాధ పెట్టుట మాని, ఆవలకు పొందు తన ప్రియురాలిని బాధ పెట్టినట్లు తెలిసిన రాముడు, మిమ్ములను వధింపక మానడు, అపని జరుగక ముందే మనము చేసిన అపరాధములను క్షమింపుమని ఆయమ్మనిపుడే వేడుకొందము ఆమె చాల దయగలది, శరణాగత వత్సల మన తప్పిదములను తప్పక క్షమించ గలదు.

ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా।
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్॥ (5/27/59

తా॥ జనకాత్మజ యగు మైథిలిని శరణు పొందిన, ఆమె తప్పక మనకు ప్రసన్నురాలు కాగలదు. ఆమె రాక్షస స్త్రీలను మహత్తరమైన భయమునుండి రక్షించుటకు సమర్థురాలు.

ఈ త్రిజటా స్వప్న వృత్తాంతమునును విని, సీతాదేవి తాత్కాలిక ముగా కొంత యూరడిల్లెను. కాని యది స్వప్నమగుటచే, దాని వలన కల్గిన యూరట యెక్కువ కాలము నిల్వక తిర్గి దట్టమైన విషాదచ్ఛాయలామె నల ముకొనగ తిర్గి అంతులేనిని ఖేదమును పొంది, తన దురదృష్టమును నిందించు కొనుచు బాలదుఃఖించెను ఆమె తిర్గి తనలో తానిట్లను కొనెను: అయ్యో! కోరుకొ న్నను అకాలమున చావుగూడరాదు నాకాలమృత్యుర్భవతి (51/ 8/3), దుఃఖనిబిడమై, సుఖస్పర్శ గూడలేని, యీనికృష్టజీవితమును గడుపుచు, అనంతవేదనకు గురియై యిట్టి తుచ్ఛమగు బ్రతుకుటకైన నోచుకొంటిని గాని ప్రాణములుత్యజింప లేక పోవుచున్నాను? శ్రీరాముడు రావణుడిచ్చిన గడువు లోపల రాకున్న, నాగతి యేమగును? నేనిపుడు తుఫానులోచిక్కుకొనిన ఓటి నావచందమునను న్నాను. కాలమే, లేడి రూపమున వచ్చి, నన్ను మోసగించిన ది. మూఢురాలైన నేను రాబోవు నాపద యెఱుగక, చెంతనున్న లక్ష్మణుని గూడ దుర్భాశలాడి దూరముగా పంపివేసితిని గదా: ఓ రామా! జీవలోకహితం కారుడవగు నీవు, నీ ప్రియురాలగు సీత రాక్షసుల చేజిక్కి దుర్మరణము పాలు గాబోవుచున్నదని యెఱుగవు గద! నేను నిన్ను కలియగోరి కఠిన వ్రతము చేయుచున్నానే, కఠిన నేలపైన పడుకొనుచు, కఠోర నాశతో తపము చేయుచున్నానే: నా పాతివ్రత్యము నాకఠోర నియమపాలనము నేను చేయు వ్రతోపవాసములు నాధర్మనిరతి, ఇవియన్నియు నన్నే విధముగ కాపాడగల్గి నవి? ఇవియన్నియు వ్యర్థమైపో వలసినదేనా? ఈ విధముగ తన ధర్మాత్మత్వ మును గూర్చి గుడ నిరాశపడి, చెదిరినమనస్సుతో ధైర్యమును కోల్పోయి రాముని గూర్చి ఇట్లు తలపోసెను. రాముడు గూడ నేనతనిని పొందుటకెట్లు తహతహ లాడుచున్నానో యట్లే యుండునను నిశ్చయమేమి? అతడు తన వనవాసమును ముగించుకొని అయోధ్యకు తిరిగి వెళ్ళి, రాజ్యాభిషిక్తుడై, ఇతర భార్యలను చేపట్టి సుఖముగా నుండి యుండవచ్చును గద! అపుడు నాయవసరమేమి? ఓ రామా! నేను నీయందే సర్వాత్మనా మనస్సు పెట్టుకొని అనన్యమైన ప్రేమ

వ్రతమును పాలించుచు, వ్యర్థముగ తపోవాసాదులాచరించుచు, దిక్కులేనిదిగ మరణించుచున్నాను ఎంత యభాగ్యురాలను: కాని నేనెందుకు బ్రతుకుచున్నానో నాకే తెలియదు! ఎవ్వరైనాకీ యాపత్సమయమున, ఈ యాతనామయమైన, నరక ప్రాయమైన జీవితము నుండి శాశ్వతముగా విముక్తి చెందుటకు ఎవ్వరైనా శస్త్రమునుగాని, విషమునుగాని యిచ్చినచో యెంత బాగుండును కాని, నా దురదృష్టమేమని చెప్పుదును! ఈ రాక్షస భవనమున, ప్రాణములు తీసికొనుటకు తోడ్పడు పుణ్యాత్ములు గూడ కానరారు! అని పలు పలు విధములుగ శోకించి, తన జడను చేత బట్టుకొని, దానితో నశోక శాఖకురి బోసికొనుటకు నిశ్చయించుకొని, యట్టి ప్రాణత్యాగ సమయమున గూడ, తన ప్రాణ ప్రియుడగు రాముని, నతని యనుచరుడగు లక్ష్మణుని, అత్తలను తలచుకొనుచు నిట్టుగ నిటు విలపించెను.

హా రామ, హా లక్ష్మణ, హా సుమిత్రే, హా రామమాత, స్సహ మే జనన్యః।
ఏ షా విపద్యామ్యహ మల్పభాగ్యా, మహార్ణవే నౌరివ మూఢవాతా॥
(5/28/8.

తా॥ ఓ రామా, ఓ లక్ష్మణా, ఓ సుమిత్రా, ఓ రామమాతా, ఓ నా తల్లులారా! అల్పభాగ్యురాలగు నేను మహాసముద్రమున పెనుగాలిలో చిక్కుకొనిన నావ వలె శాశ్వతముగ మున్గి పోవుచున్నాను

ఈవిధముగా నశోక వృక్ష శాఖకు ఉరిపోసికొనుటకుద్యమించిన సీతకు అనిమిత్తముగ నిట్టిశుభ నిమిత్తములు తోపవు గనుక, తాను తొందరపడి ప్రాణత్యాగము చేయుట మంచిది గాదని, భావించి యాసాధ్వి తన ప్రయత్నమును విరమించెను.

## 21. శ్రీ రామునిలోని ఉత్తమ గుణములు :

అర్చిష్మంతుడు, సర్వజనార్చితుడు, బ్రహ్మచర్య వ్రత నిష్ఠుడు, (5/35/12), జ్ఞానవంతుడు, శీలసంపన్నుడు, వినీతుడు, పరంతపుడు (5/35/13), యజుర్వేద వినీతుడు, వేదవిత్పూజితుడు, వేద-వేదాఙ్గ-ధనుర్వేద నిష్ణితుడు, సర్వవిద్యాస్నాతుడు, (5/3/14) రాజనీతియందు

సుశిక్షితుడు. బ్రాహ్మణోపాసకుడు (5/15/13), రూపదాక్షిణ్య సంపన్నుడు (5/35/8) తేజస్వి. క్షమా సంపన్నుడు, మహాబుద్ధిశాలి, యశస్వి (5/35/9) రాజర్షులలో గుణశ్రేష్ఠుడు; తపస్వి (5/31/2), బలమున పురందర సముడు, అహింసారతుడు, ఉదారుడు, దయావంతుడు, సత్య పరాక్రముడు, ఇక్ష్వాకు వంశలక్ష్మీ వర్ధనుడు సకల శోభానిలయుడు(5/31/4). పుణ్యశీలుడు, మహాకీర్తి సంపన్నుడు, మహా యశస్వి (5/31/2) సకల భూమండల విశ్రుతుడు, సుఖప్రదాత, సుఖి (5/31/5), మహైశ్వర్య సంపన్నుడు (5/34/28) విక్రమమున విష్ణుతుల్యుడు, సత్యవాది, మధురభాషి 5/34/29), స్థాన క్రోధప్రహర్త, శత్రువులను దండించువాడు, మహారథుడు (5·31/31), చాతు ర్వర్ణ్య సమాజరక్షా దీక్షితుడు, లోక మర్యాదకర్త (5/35/11) సాధు సమా శ్రయుడు, వైదికకర్మ ప్రచారకుడు, వైదికకర్మానుష్ఠాత(5/25/12) చక్రవర్తి కులసంజాతుడు (5/31/4); జీవలోక రక్షకుడు, స్వజన, స్వవృత్త రక్షకుడు ధర్మ రక్షకుడు, శత్రుతాపనుడు (5/35/10), సకలలోక రక్షాదక్షుడు (5/31/31), లోకనాథుడు ప్రాజ్ఞుడు, కృతజ్ఞుడు, సానుక్రోశుడు, జితేంద్రి యుడు. సద్వృత్త సచ్ఛీల సంపన్నుడు, (5/26/11) మహా తేజస్వి ; సర్వ ధర్మజ్ఞుడు, ధర్మాత్ముడు, శరణాగత వత్సలుడు (5/21/29) ; స్నేహశీలి (5/21/19). మహాధానుష్కుడు (5/27/14) సత్యాభిసంధుడు (5/31/7) సత్య పరాక్రముడు, (5/35/21), సత్య ధర్మరతుడు, (5/31/35) ధర్మ మార్గాశ్రితుడు (5/51/6) సర్వభూతశరణ్యుడు, ఏకపత్నీవ్రతుడు, కృతజ్ఞుడు ఇంకను, దేశ కాలవిభాగజ్ఞుడు.

ఇక యతని ఔదార్యమును వర్ణించుచు సీతాదేవి హనుమంతునితో పల్కిన ఈ పల్కులు చూడుడు:—

దద్యాన్న ప్రతిగృహ్ణీయాత్సత్యం బ్రూయాన్నచాఽనృతమ్ ।
అపి జీవితహేతోర్హి రామస్సత్య పరాక్రమః ॥ (5/33/25)

తా॥ రాముడు దానదుచ్చును గాని, ప్రతిగ్రహము చేయడు, సత్యము పల్కునుగాని, స్వప్రాణ రక్షణమునకైన, ననసత్యమాడడు, సత్య పరాక్రముడు

అతని యన్యగుణములు :- ఆతడు అప్రధృష్య పరాక్రముడు, త్రిలోకములలో నెవ్వరును యుద్ధమున నతనిముందు నిలబడ జాలరు. వాయ్వింద్ర సమతేజస్కుడు, బ్రహ్మ, రుద్ర, మహేంద్రాది దేవతలు గూడ నతని ముందు నిలబడ జాలరు. ఆతడు సర్వలోకములను ముహూర్త కాలముగ భస్మము చేసి, తిరిగి యధావత్తుగ సృజింప సమర్థుడు, విష్ణుతుల్య పరాక్రముడు, శరణాగత వత్సలుడు, విదితాత్ముడు, మహామనస్వి, అక్లిష్ట కర్ముడు, శత్రుతాపనుడు, తన బాణములకు ముల్లోకములలో గతిరోధము లేనివాడు. అతని మనస్విత్వమున కుదాహరణముగ, సీత యొక్క గండ పార్శ్వ మందుగల తిలకము చెరిగిపోగా, తిరిగి మనశ్శిలా ద్రవముతో నతడు తన ప్రియురాలి గండ పార్శ్వమున తిలకముంచిన ఘటన నియవచ్చును.

ఇంక యతడు కోపించిన త్రిలోకములు జంకి పోవును. అతనికెగ్గు చేసిన వానికి లోకములలో నెవ్వరును; ఇంద్రాది దేవతలు గూడ ఆశ్రయ మిచ్చుటకు సాహసింపరు. దీని కుదాహరణముగ జయంతుని కథ నీయ వచ్చును. ఆతడు రామ కోపమునకు పాత్రమై, బ్రహ్మాస్త్రమును శ్రీ రాముడు ప్రయోగింప ముల్లోకములను తిర్గి, యెవ్వరు నాశ్రయమీయక పోవుటచే తిర్గి శ్రీ రాముని వద్దకే వచ్చి శరణు పొందినాడు. రాముడు మిక్కిలి సహృదయుడు. శత్రువులైనను శరణు పొందిన మన్నించి వదలువాడు. కావున, సీత రావణునికి, రామునితో సంధి చేసికొని, లంకను, తన పరివారమును, తనను, కాపాడు కొనుమని సలహా యిచ్చుచు నిట్లు పల్కినది :

"మిత్ర మౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా ॥ (5/21/19)

"విది తస్సర్వ ధర్మజ్ఞ శ్శరణా గత వత్సలః ॥ (5/21/20)

"ప్రసాదయస్వ తం చైనం శరణా గత వత్సలమ్ ॥ (5/21/21

తా ॥ లంకను రక్షింప నెంచిన శ్రీ రాముని మిత్రముగ చేసికొనుట యుకము.

"సర్వ లోక విదితుడగు రాముడు సర్వ ధర్మజ్ఞుడు శరణాగత వత్సలుడు.

"నీవు శరణాగత వత్సలుడగు రాముని ప్రసన్నుని చేసికొనుము.

పై పద్యమును బట్టి శ్రీరామునియందు, పురుషోత్తమత్వము సుప్రతిష్ఠితమైయున్నదనియు, నతనితో పోల్చదగిన పురుషుడు మఱియొకడు లేడనియును స్పష్టము.

## 22. శ్రీరామ విరహచిత్రణము

శ్రీరాముడు సీతావియోగము వలన పొందిన దుఃఖమును, దైన్యమును చాల గాఢముగ రామాయణ కవి చిత్రించినాడు. సీతా-రాములిర్వురు విరహ దుఃఖముతో చాల తపించినట్లు చిత్రించుట ద్వారా వారి ప్రగాఢప్రేమను వాల్మీకి లోకమునకు చాటినాడు. హనుమంతుడు సీతా వియోగము వలన శ్రీరాముడు పొందు వ్యథను ఈ విధముగ తెలియజేసినాడు :—

“రాముడు నిత్యము నిన్నె స్మరించుచున్నాడు. అతడు, నీ వియోగమువలన పొందు సంతాపము మిక్కుటము కాగా, అగ్ని పర్వతము వలె నంతులేని సంతాపముతో తపించి పోవుచున్నాడు (5/35/45). నీ విరహము మూలమున, నిద్రలేమి, శోకము, చింత యనునవి ; యతనిని, అగ్న్యగారమును, త్రేతాగ్నులు తపింప చేయునట్లు నిత్యము తపింప చేయుచున్నవి. (5/3/16) నీ యదర్శనముచే నతడు భూకంపము వచ్చినపుడు భూమి చలించినట్లు, శోకావేగముచే తీవ్రముగ కంపించుచున్నాడు. సింహ స్మరణ మాత్రముచే వెత నొందు గజముపలె, నీ స్మరణము చేయుచు, రాముడు శోకార్దితుడై శాంతి లేకుండగనున్నాడు. నీవు, అపహరించ బడిన పిదప, శ్రీరాముడు మాంసమును భుజించుట లేదు మధువును గ్రోలుటలేదు. వన్యమైన కందమూల ఫలాదికములను గూడ ఐదవపొద్దున కొంచెముగ తీసికొనుచున్నాడు. నిరంతరము నీయందే యాయత్తమైన చిత్తము గలవాడై, యన్యమనస్కుడై యుండుటవలన, తన శరీరముపై వాలిన దోమలను గాని, ఈగలను గాని తోలుకొనుట లేదు శరీరముపై కీటకములు ప్రాకినను, పాములు ప్రాకినను, అతనికి తెలియుట లేదు. అతడు నిత్యము. నిన్నే ధ్యానించుచు, నిన్ను గూర్చి తలపోసి శోకించుచున్నాడు. నీ విరహముచే పీడితుడగు రాముడు మ యొక విషయమును గూర్చి యాలోచించుట లేదు అతడు నీవపహరింప బడిన నాటినుండి, నిద్రయనునది యెరుగడు, ఒకవేళ ప్రయత్నించి, ఒక్క క్షణము కన్నుమూసినను, మరుక్షణమే ‘హా సీతా,’ యని

పల్వరించుచు నేత్రాంనును. నీకు ప్రియమును పూర్వము గూర్చిన, ఫల-పుష్పములు గాని, మఱియితరమగు ఏ వస్తువు గాని కన్పించినపుడు "హా ప్రియే" యని, యుచ్చరించుచు, దీర్ఘనిఃశ్వాసములు విడచును ఆతడు రాత్రింబవళ్లు నన్నే స్మరించుచు, ధ్యానించుచు, నీ శోకమున విలపించుచు, నీ దర్శనమునకై యుత్కంఠ, నొందుచు, చాల కష్టముగ, దినములు గడుపు చున్నాడు.

ఇంక యతనికి సీతయందు గల ప్రీతికి, పరాకాష్ఠను రామాయణ కవి హనుమంతుడు లంక నుండి తిర్గివచ్చిన తరువాత సీతా క్షేమ వార్తా శ్రవణానంతరము చూపియున్నాడు అతని మనస్వితత్వము గూడ ఇక్కడే మనకు గోచరించును హనుమంతుడు లంక నుండి తిర్గి వచ్చి సీతయొక్క క్షేమ వార్తను తెల్పి యామె నతనికిచ్చిన "చూడామణి"ని శ్రీ రామునకు సమర్పింపగ, దానిని హృదయమునకు హత్తుకొని యిట్టుగ విలపించినాడు (5/66/1) ఆ తరువాత కొంతసేపటికి తెప్పరిల్లి, ఆ చూడామణి ని దర్శించి నందు వలన తనకు కల్గిన ప్రేమానుభూతిని వర్ణించుచు శ్రీ రాముడిట్లనును :-

"అయంహి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః ।
అస్యాద్య దర్శనేనాఽహం ప్రాప్తాం తామి వచింతయే ॥
(5/66/7)

తా॥ ఈ చూడామణి, నా ప్రియురాలగు సీతయొక్క పాపట యందు ప్రకాశించు చుండెడిది, ఇన్ని నాళ్లకు దీనిని నేను చూడ గల్గితిని. దీనిని చూచునపుడు, నా సీత, నా చెంతనే నిల్చియున్నట్లు నా కన్పించు చున్నది

ఇట్టి యానుభూతినే శ్రీ రామనామాఙ్కిత మగు అంగుళీయకమును హనుమంతుడు సమర్పించి నపుడు, విరహిణియగు సీత పొందినట్లు వాల్మీకి చిత్రించి యున్నాడు. దీనిని బట్టి వారిలో గల ప్రేమాతిశయము. భావ సాదృశ్యము, ఏక హృదయత్వము విదిత మగుచున్నవి.

ఆ తరువాత హనుమంతుని ద్వారా తన ప్రియురాలిచ్చిన సందేశమును విని, ఎంత వినినను తనివి తీరక, ,నాసీత, నాకింకేమని చెప్పు మనిన

దని హనుమంతుని గుచ్చి గుచ్చి యడుగును, ఈ క్రింది పంక్తులు చూడు

కి మాహ సీతా హనుమంస్త త్త్వతః కథ యస్వమే ।
ఏతేనఖలు జీ విష్యే భేషజే నాతు రోయథా ॥ (5/67/19)

(ఓ హనుమ ! సీత యింకేమి యేమి నాకు చెప్పు మనినదో నాకు చెప్పుము. ఆమె పలుకులను విని, మందు వలన రోగి, రక్షితుడైనట్లు. విరహ వ్యథ నుండి రక్షణ పొందెదను.

సీత, శ్రీ రాముని ప్రవృత్తిని గూర్చి తెలిసికొనిన తరువాత, తాను జీవించుట విషయములో నిర్ణయము తీసి కొనుటకు సంకల్పించినట్లు, శ్రీ రాముడు గూడ, తన ప్రియురాలి ప్రవృత్తిని గూర్చి హనుమంతుని ఇట్లు అడుగును:-

'మద్వి హీనా వరారోహా హనూమన్ కథ యస్వమే ।
దుఃఖాదుఃఖ తరం ప్రాప్య కథం జీవతి జానకీ ॥ (5/66/15)

తా ॥ నేను దగ్గర లేకుండగ, నా ప్రియురాలు, అంతులేని దుఃఖము నకు లోనై యెట్లు జీవించుచున్నదో తెల్పుము.

హనుమంతుడుచిత రీతిని శ్రీ రాముని ప్రశ్నలకు సమాధాన మిచ్చి, యామె వారియందరి కుశల మడిగినట్లు చెప్పి యామె ప్రతి సందేశమును విన్పించి, ఆమె రాక్షసీ మధ్యమున పడు యాతనలను, తెల్పి, రావణుడామెను పెట్టు బాధలను తెల్పి, రావణుడు ఆమె కిచ్చిన జీవితా వధికాలమును తెల్పుచు, మాసము కంటె యామె జీవింపజాలదని తెల్పినదని తెల్పగ సీతా వియోగ తప్తుడగు రాముడిట్లనును :—

"చిరంజీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి ।
క్షణం వీర న జీవేయం వినా తా మసితే క్షణామ్ ॥ (5/66/10)

(ఓ హనుమంతా ! సీత ఒక మాసము దాక, ప్రాణములు చిక్కబెట్టు కొని నా కొఱకెదురు జూచుచు, నెటులో జీవింతునని చెప్పినదంటివి. ఆమె నెల రోజులు జీవించినచో, చాల కాలము జీవించుచున్నట్లే. కాని నేను మాత్ర

మా మెను చూడకుండగ క్షణకాలమైన జీవించజ్జాలను, కావున ఓ హనుమంతా నా యీ ప్రార్థనను వినుము. ఆమెను నీవెక్కడజూచితివో వెంటనే నన్ను గూడ అక్కడకు తీసికొనిపొమ్ము అమెను చూడకుండగ నేను క్షణకాలమైన, ఆమె పలానా చోటున ఉన్నదని తెలిపిన తరువాత గూడ, చూడకుండగనుండ జాలను *

సీతారాము వియోగమును వాల్మీకి చాల ప్రగాఢముగ వర్ణించెను. నాయికా నాయకులయందు ప్రగాఢమగు ప్రణయములేనిచో, వియోగ వ్యథగూడ తీవ్రతను పొందజ్జాలదు. రససిద్ధుడగు రామాయణ కవి, సీతారాములలో తుల్య ప్రణయమును వర్ణించుటయే గాక, వారి విరహతీవ్రతను గూడ తుల్యముగనే నిరూపించెను. కావుననే సీతా-రాముల ప్రణయము లోకమున కాదర్శభూత మైనది దంపతుల మధ్యగల ప్రణయమును వైధప్రేమ యందురు. భక్త కవులు, ప్రణయమందలి, ప్రగాఢత్వ. తీవ్రత్వ నిరూపణము కొఱకు, వైధ ప్రేమకంటె యవైధప్రేమకు ప్రాధాన్యమిత్తురు, కాని వేద ధర్మనిరతుడగు ప్రాచేతసుడు, అవైధ ప్రేమలో భక్తకవులు నిరూపించు తీవ్రత్వమును, ప్రగాఢత్వమును, వ్యాపకత్వమును, వైధ ప్రేమయందే నిరూపించి, ప్రేమయుక్క పవిత్రతను గూడ నిరూపించినాడు. ప్రేమ యందు పవిత్రత లేకున్న, అనగా శాస్త్రానుమతి లేకున్న, దానివలన సమాజమున కలుగు అనర్థములు చాల తీవ్రముగ నుండును. అవైధ ప్రేమ సామాజిక పతనమునకు దారి తియను. అందువలన సామాజిక దృష్టియు, శాస్త్రపరినిష్ఠిత మతియునుగల ప్రాచేతసుడు, వైధ ప్రణయముమ, సీతారాముల యందు చూపి, దానినొక తవముగ లోకము ముందుంచి దాని పవిత్రతను, తీవ్రప్రభావమును, గూడ లోకమునకు చాటినాడు. దానితో బాటుగా. శూర్పణఖ, అయోముఖ్యాదుల యందు అవైధప్రేమను చూపి, దానికి తగిన దండమును గూడ విధింపచేసి యున్నాడు. అంతేగాదు, శుద్ధమైన ప్రేమను, అశుద్ధమైన కామ వాసనకుగల వ్యత్యాసమును, గూడ, రామ-రావణుల నాధారముగ తీసికొని చాల చక్కగ

---

1. నయ మామపి తం దేశం యత్ర దృష్టామమ ప్రియా ।
నతిష్ఠేయంక్షణమపిక్షిప్రవృత్తి ముపలభ్యచ ॥ (5/66/11)

నిరూపించియున్నాడు. ఈ సుందరకాండమున ప్రాచేతసుడు ఏకపత్నీ వ్రతముయొక్క మహత్త్వమును, దానివలన, పతి-పత్నులు పొందు ఆనందముతో బాటుగ, వారిలోనుజ్జ్వలించు, ఆత్మతేజమును, తత్త్వభావమును గూడ తెల్పి తదనుసరణమునకై లోకమును ప్రోత్సహించియున్నాడు.

## 23. సీతారాముల ద్వివిధ ప్రకృతి

ఇంత వరకును సీతా-రాముల లో కొత్తరమైన ప్రణయమును, వారి యాదర్శ దాంపత్యమును, వారి యతిలోక సౌందర్యమును, వారి యభయ విధమగు స్వభావమును, వారి ధర్మనిష్ఠతను గూడ తెలిసి కొనియంటిమి. ఇప్పుడిక్కడి వారియందు సుప్రతిష్ఠతమైన శివత్వముగూర్చి తెలిసికొందుము గాక : ముందుగ సీతాదేవి యొక్క శివత్వ ధర్మమును తెలిసికొందము.

శివత్వమునకు రెండు పక్షములుండునని పూర్వమే సాకల్యముగ హనూమచ్ఛివత్వ నిరూపణమున చెప్పియుంటిమి. అవి : రుద్రత్వ, శివత్వములు, ఈ రుద్రత్వశక్తి, శివశక్తికి పూరకము అని గూడ తెల్పియుంటిమి అధిదైవికముగ, ఆమె, అగ్నికనప్య భూతమగు 'స్వాహా' శక్తి, ఆ స్వాహా శక్తియే, ఇంద్రునికి సహకారము చెయునపుడు "శచి" లేక "ఇంద్రాణి" లేక "ఐంద్రి" యని పిల్వబడును. ఈ విషయమును పలుతావులందు వాల్మీకి, సంకేత భాషలో తెల్పియున్నాడు. ఈ క్రింది పంక్తులను చూడుడు:—

సన్నద్ధాం ధూమజాలేన శిఖమివ విభావసోః ॥

(భా ॥ దూమ జాలముచే నావరించబడిన అగ్నిశిఖవలెనున్న సీత)

"కుర్వతీం ప్రభయా దేవీం సర్వావితి మిరాదిశః ॥

(తన ప్రభచే దిక్కులయందు వ్యాపించియున్న చీకటిని నశింపచేయు సీతాదేవి)

"క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌతారాం నిపతితామివ ।

(పుణ్యము క్షీణించుటచే భూమిపైరాలిన, తార వంటిది.

"శాంతామగ్ని శిఖామివ" ॥
(నిశ్చలమైన అగ్నిశిఖ వలెనున్నది.
"అగ్నేఃస్వాహా యథాదేవీ శచీ వేంద్రస్య శోభనే ॥
(అగ్నికి, స్వాహాదేవివలె, ఇంద్రునికి శచీదేవి వలె శక్తిస్వరూపిణి.

కనుకనే యామె, మహాతపః పరిగ్రహుడును, త్రిలోకేశ్వరుడును నగు రావణుని భస్మము చేయగలనని యతనిముందే పలుకగల్గినది ఈ విషయము పూర్వమే నిరూపించబడినది.

అట్లే, లంకనంతయు దహించివేసిన, శ్రీ హనూమద్వాలా శ్రితమగు అగ్ని లంకనంతను దహించినను ఆమెను దహించనట్లు వర్ణించబడినది. దానికి కారణమును వాల్మీకి యీ విధముగ నిర్దేశించినాడు. ఈ క్రింది వచనములను చూడుడు :—

"అద్రవాచారు సర్వాంగీ రక్షితాస్వేనా తేజసా ।
న నశిష్యతి కల్యాణీ నాఽగ్ని రగ్నౌ ప్రవర్తతే ॥
"నహి ధర్మాత్మనః పత్నీం భార్యామమిత తేజసః ।
స్వచారిత్రా భిగుప్తాం తాంస్ప్రష్టు మర్హతి పావక ః ।
తపసాధార యేల్లోకాన్ క్రుద్ధావానిర్ద హేదపి ॥
"న తదగ్ని శిఖాకుర్యాత్సం స్పృష్టాపాణి నా సతీ ।
జనకస్య సుతా కుర్యాద్యత్క్రోధ కలుషీకృతా ॥
"అసౌ వినిర్దహే దగ్నిం నతామగ్నిః ప్రదక్ష్యతి ॥

(అట్లు కానిచో, చారుగాత్రయగు సీత, తన తేజముచేతనే రక్షితురాలగుటచే, ఆమె నశించలేదు. అగ్ని మరియొక అగ్నియందు ప్రవర్తించదు.

అమిత తేజస్వియును, ధర్మాత్ముడునగు రామునికి పత్ని (శక్తిరూపిణి) యగు, స్వచారిత్రాభిగుప్త. ఆమెను అగ్ని స్పృశింపను గూడ స్పృశించజాలదు.

ఆమె తన తపముచే లోకములను ధరింపగలదు. కోపము వచ్చిన భస్మము చేయగలదు.

సీతకు కోపము వచ్చినపుడు చేయు హానిని, చేతితో స్పృశించనను, అగ్నిశిఖ చేయజాలదు.

ఈమె యగ్నినే దహించగలదు. అగ్ని యామెను దహించజాలదు.

సీతలో గల ఈ సంహారాత్మక శక్తి, ధర్మ ప్రతిష్ఠా రూపమగు శివత్వ ప్రతిష్ఠకు పూరకము, లేక సహకారి శక్తిగ వర్ణితము ఈ విషయము గూడ వాల్మీకిచే సంకేత మొనర్చబడినది. ఈ క్రింది వచనములను చూడుడు :—

"కాల రాత్రీతి తాం విద్ధి సర్వలంకా వినాశినీమ్॥"
"సీతా యా తేజసా దగ్ధాం రామకోప ప్రదీపితామ్ ।
దహ్యమానా మిమాం పశ్య నష్ట ప్రాకార తోరణామ్ ॥

(ఆమెను సర్వలంకా వినాశిని యగు కాలరాత్రిగ తెలిసికొనుము.

"సీత యొక్క తేజముచే దగ్ధమై, రామకోప ప్రదీపితమై, యీ లంక నష్ట. ప్రాకార, తోరణముగ, తగలబడి పోవుచున్నది. ఓ రావణా, నీవు దీనిని చూడుము (ఇది హనుమద్వచనము).

ఇక ఆమె యీ సంహారాత్మక శక్తి, ధర్మ ప్రతిష్ఠకు మూలమగుట చేతనే హనుమంతుడు తన వీపుమీద ఎక్కి ప్రస్రవణ గిరికి తీసికొని వెళ్ళెదు నని పలుక, తానట్లు రానని పల్కుచు, తన సంకల్పమునిట్లు తెలియ బరచును.—

"యదిరామో దశగ్రీవమిహ హత్వాసరాక్షసామ్ ।
మామితో గృహ్య గచ్ఛేత్తత్తస్య సదృశంభవేత్ ॥ అని ॥
ఇక రావణునితో ఆమె ఇట్లనును :—
"నాపహర్తు మహం శక్యా తస్యరామస్యధీ మతః ।
విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః ॥

---

1 "బలైస్తుసంకులాం కృత్వా లంకాంపర బలార్దనః ।
మాంనయేద్యదికాకుత్ స్థస్తత్తస్య సదృశంభవేత్ ॥
(5/393/0)

(తా॥ రాముడు రాక్షస సహితముగ దశగ్రీవుని చంపి, నన్ను తీసికొని వెళ్ళిన నదియతనికి తగినట్లుగ యుండును (సీత హనుమంతునితో)

ఓ రావణా, ధీమంతుడైన రాముని భార్యనగు నన్ను నపహరింప నీవు శక్తుడవు కావు. దైవము నిన్ను వధించుటకే యీ పని చేయించినది. ఇందు సందేహము లేదు (సీత-రావణునితో)।

కనుక సీతయొక్క సంహారశక్తి, ధర్మ విరోధులగు రాక్షసులను వారి ప్రభువగు లంకేశ్వరుని వధింప చేయుటద్వారా, శివత్వ ప్రాప్తికి. అనగా ధర్మాచరణమునకు, లోకమున సుఖశాంతులు వెలయుటకును తోడ్పడినది.

ఇక సీతయందలి శివ ప్రకృతిని ద్యోతన చేయు సంకేతములు :

"న రామేణవియుక్తా సాస్వప్తుమర్హతి భామినీ ॥

"ఆర్యపథే పరేస్థితా ॥

"అనురక్తాహి వైదేహీ రామే సర్వాత్మనా శుభా ॥

"త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్కలామ్ ॥

"సంతుష్టా ఫలమూలేన భర్తృ శుశ్రూషణాపరా ॥

"సదదర్శతత స్సీతాం పూర్ణచంద్రనిభాననామ్ ॥

భూమౌ సుతనుమా సీనాం నియతామివ తాపసీమ్ ॥

"రామాంరామ మనువ్రతామ్ ॥

'స[illegible] రాజసింహస్యరామస్య విదితాత్మనః ॥

"సంకల్పహయ సంయుక్తైర్యాన్తీమివ మనోరథైః ॥

"ఏకస్థహృదయానూనం రామమేవా నుపశ్యతి ॥

"చింతయంతీ వరారోహా [illegible]తిమేవ తపస్వినీ ॥

పైన నుదహరించబడిన వాక్యములు, సీతాదేవి యొక్క పతిభక్తిని, ధర్మాత్మత్వమును, రామైక నిష్ఠను, దివ్యత్వమును, సర్వలోక మంగళకామనను, తపమును. వ్రతనిష్ఠను, నిరంతర రామచింతన, ధ్యానములను తెల్పుచున్నవి. ఈ లక్షణములన్నియు నామెయొక్క 'మంగళ మయ రూపమును, లోకకల్యాణకామనను, ఆమె దివ్యత్వమును, ఆమె శుభ స్వరూపమును,

తెలియ చేయుచున్నవి. కావుననే ఆమెయందు గల మంగళమయ మగు పాల నాత్మక శక్తిని గూర్చి సంకేతము చేయుచు, త్రిజట రాక్షస స్త్రీల కీవిధముగ నుపదేశించినది :—

"ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీజనకాత్మజా ।
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్ ॥

(జనకాత్మజ యగు మైథిలి, ప్రణిపాతముచే, (సాష్టాంగ ప్రణామము మాత్రమున) భక్తులకు ప్రసన్నురాలగును. ఆమె రాక్షస స్త్రీలను, మహత్తర మగు భయమునుండి రక్షింప సమర్థురాలు.

సారాంశమేమియన, ఆధిదైవికముగ నామె పరమేశ్వరుని కనన్య భూత యగు విద్యాశక్తి. (అనన్యా రాఘవేణాహం భాస్కరేణయథా ప్రభా ।) ఆమె నాశ్రయించిన, మానవుని యొక్క బుద్ధి నావరించిన అవిద్యను, తొల గించి, సృష్టి స్థితి, కారణమగు సగుణ బ్రహ్మము, అనగా సకల కల్యాణ గుణ యుక్తమును, ఇంద్రియ విషయమును నగు రామ రూపమైన సగుణ బ్రహ్మ సాక్షాత్కారమునకు తోడ్పడును,

ఇక శ్రీ రాముని యందు గల శివ సౌందర్యమును గూడ దర్శింతుము గాక :

శ్రీరాముని రౌద్ర శక్తిని, అనగా పాలకత్వ రూపమగు శివత్వమునకు పోషకమగు సంహారశక్తిని సర్వత్ర సుందరకాండలోను, ఇతర కాండలలో గూడ వాల్మీకి సంకేతించి యున్నారు :—

"వర్ధయే ద్వ జముత్సృషం వర్ధయేదంతకశ్చిరమ్ ।
త్వద్విధం నతుసంక్రుద్ధో లోకనాథస్స రాఘవః ॥
'రాక్షసేంద మహాసర్పాన్ స రామగరుడో మహాన్ ।
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్ ॥
"అపనేష్యతి మాం భర్తా త్వత్తః శ్రీఘ్రమరిందమః ।
అసురేభ్యశ్శ్రియం దీప్తాం విష్ణుస్త్రిభిరి వక్రమైః ॥

"తస్యత్వం ధనుషశ్శబ్దం శ్రోష్యసిత్వం మహాస్వనమ్ ।
శతక్రతు విసృష్టస్య నిర్ఘోష మశనేరివ ॥
"తోయ మల్పమి వాదిత్యః ప్రాణానాదాస్యతేశరైః ॥
"గిరీశం కుబేరస్యగతోఽధవాలయం, సభాగంతోవా వరుణస్య రాజ్ఞః ।
అ సంశయం దాశరథేర్వ మోక్ష్యసే మహాద్రుమః కాలహతోఽశనేరివ॥
"వ్యవసాయ సమాయుక్తం విష్ణుం దైత్యవదేయథా ॥
నిర్దహేచ్చపురీం లంకాం నిర్దహేచ్చమహోదధిమ్ ।
రావణస్యచ నీచస్య కీర్తిం నామచ నాశయేత్ ।
"రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసా నాముపస్థితమ్ ॥

ఇంద్రుడు విడచిన వజ్రము నిన్ను చంపకుండ విడచిన విడచుగాక, మృత్యువు, కాలము వచ్చినను నిన్ను చంపకుండ కొంత కాలము విడచుగాక కానీ సంక్రుద్ధుడైన రాముడు నిన్ను చంపకుండ విడువడు

గరుత్మంతుడు పాములను చంపినట్లు, రామ రూపుడగు గరుడుడు గూడ రాక్షసవీరులను మహాసర్పములను నాశనము చేయగలడు.

"అసురుల నుండి దీప్తమగు లక్ష్మిని మూడు అడుగులతో విష్ణువు హరించినట్లు అరినాశకుడగు నా భర్త నన్ను శీఘ్రముగానే నీ నుండి విడిపించ గలడు ఇంద్రనిర్ముక్తమగు అశని పాతధ్వనివలె భీకరమగు శ్రీరామ ధనుశ్శబ్దమును నీవు కొద్దికాలములోనే వినగలవు".

కొంచెము జలమును ఆదిత్యుడు తనవేడి కిరణములతో స్వల్పసమయము లోననే హరించి నట్లు రాముడు త్వరలోనే మీ యందరి ప్రాణములను (రాక్షసుల ప్రాణములు) తీసివేయ గలడు.

కైలాసగిరికి పోయినను వరుణుని సభలో దాగుకొనినను వర్షాకాలమున పడిన పిడుగు మహాద్రుమములను నైతము నామరూపములు లేకుండగా చేసి నట్లు నీవు రామబాణాశని పాతమున ధ్వంసమై పోగలవు. దానిని తప్పించు కొనజాలవు.

దైత్య వధయందు మగ్నమైన విష్ణువును బోలిన శ్రీరాముని దైత్యవధో ద్యమమును త్వరలోనే చూడగలవు.

రాముడు లంకను కాల్చివేయును, సముద్రమును ఇంకునట్లు చేయును నీచుడైన రావణుని కీర్తిని పేరును గూడ నాశము చేయును

రాక్షసులకు రాఘవుని వలన ఘోరభయము తటస్థించినది.

ఇక యతని పాలన శక్తిని అనగా శివత్వమును సూచించు, ఈ క్రింది వచనములను చూడుడు :-

విక్రమేణోపపన్నశ్చ యథా విష్ణుర్మహాయశాః
సర్వాంల్లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్।
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః॥
రామస్య లోకత్రయనాయకస్య।
బాహుచ్ఛాయా మవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః

మహాయశస్వియగు విష్ణువవలె విక్రమ సంపన్నుడు. సర్వభూత యుక్తములు, సచరాచరములును నగు సర్వలోకములను సంహరించి తిరిగి యథావత్తుగ సృజింప సమర్థుడు.

లోకత్రయ నాయకుడగు రాముడు. మహాత్ముడగు ఏరాముని బాహు చ్ఛాయందు ప్రతిష్ఠితమై లోకము క్షేమముగ నున్నదో,

కనుకనే విభీషణుడు, సర్వలోకశరణ్యుడగు రాముని శరణు పొందు చున్నాను అనియును (6-17-17) అట్లే శ్రీరాముడు గూడ "అభయం సర్వ భూతేభ్యో దదామ్యేతద్వ్రతంమమ" సర్వభూతములకు నేనభయమొసగు చున్నాను, అనియును. అట్లే వాల్మీకి శ్రీరాముని సర్వలోకేశ్వరుడనియు, శరణాగతవత్సలుడనియు, సాధు సంశ్రయుడనియు, ఆర్తరక్షకుడనియు దీనానుకంపియనియు పదే పదేయుటంకించి యున్నాడు.

అదిదైవికముగా సీతారాములు, లక్ష్మీ-విష్ణుస్వరూపులనివాచ్య పద్ధతిలో నే వాల్మీకి, సీతాదేవియగ్ని పరీక్షా సమయమున, బ్రహ్మదేవునిచే "సీతాలక్ష్మీ

ర్భవాన్ విష్ణుః అని శ్రీరామునికి చెప్పించినారు. బ్రహ్మ సృష్టి కర్త, సర్వజ్ఞుడు గనుకనే యతనిచే సీతా-రాములు లక్ష్మీ-విష్ణుస్వరూపులని ప్రకటింప చేయుట తో చాలయౌచిత్యము గలదు. పౌరాణిక మతమునుసరించి. ఈ విష్ణువు, ఇంద్రావరజుడు, రాక్షస సంహారకుడు పాలన కర్త ఈ పాలన కార్యమున, అయన పాలనాత్మక కార్యసహకారిణియగు శక్తి లక్ష్మి ఇక వైదిక మతము ననుసరించి, ఈ విష్ణువు ద్వాదశాదిత్యులలో నొకడు, అగ్ని స్వరూపుడు. అతని శక్తి స్వాహాదేవి. సారాంశ మేమియన, అధిదైవికముగ, రాక్షస సంహారము కొఱకవతరించిన లక్ష్మీ-విష్ణువులే సీతారాములు. వారి శివత్వయుక్తమగు స్వరూప ధ్యానమున భక్తుడు దివ్యానందమును పొందుచు; వారి కృప వలన తనచిత్తము నావరించిన మాయతొలగగ, పరతత్త్వసాక్షాత్కారము కల్గి బ్రహ్మానందము ననుభవించును వారిద్వారి యధ్యాత్మిక స్వరూపము "త్రిజటా స్వప్నము"న వివరించబడగలదు

సుందరకాండమున త్రిజటా స్వప్నవృత్తాంతమును స్థూలముగ పూర్వమిచ్చి యుంటిమి. ఉపాసనా సంప్రదాయవిదులు ప్రతీకాత్మక భాషలో త్రిజటా స్వప్నమును విస్తృత ముగావించినట్లు భావించు చున్నారు. ఇందు. ఆరాముని పరబ్రహ్మరూపమును సంకేతమొనర్చిరని వారు తెల్పుచున్నారు. ఆవిషయమునిందు సంగ్రహముగా నిరూపింతుము.

## 24. త్రిజటా స్వప్న ప్రతీకాత్మకత :

త్రిజట రాక్షస స్త్రీయే యైనను, ధర్మాత్మురాలు, సత్యభాషిణి, శిష్టాచార తత్పర, స్నేహమయి, పర దుఃఖకాతర. కావున సీతాదేవిని తిని వేయుదుమని అదుగద్దునకు బెదిరించు రాక్షస స్త్రీలకు తన స్వప్న వృత్తాంతము వినిపించి యీ స్వప్నము, రాక్షసవినాశమును, శ్రీరామ విజయమును సూచించు చున్నది. గాన సీతాదేవిని క్షమార్పణ వేడుకొని ప్రాణములు కాపాడుకొనుమని యుద్బోధించి నట్లు చదివి యుంటిమి, ఇపుడు ఆ స్వప్నము యొక్క ప్రతీకాత్మతను నిరూపించెదము.

మొట్టమొదటిసారి త్రిజట, శ్రీరాముడు గజదంత నిర్మితమును హంస సహస్రయుక్తమును, ఆకాశ స్థితమునునగు శిబికను, లక్ష్మణునితో గూడ

ఎక్కి, శుక్లమాల్యాంబరములను ధరించి వచ్చినట్లు తన స్వప్నమున చూచినది సీతాదేవి, శుక్ల మాల్యాంబరములను ధరించి, సాగర పరిగతమైన శ్వేత పర్వతమునధిరోహించి కన్పించినది. ఆ శ్వేత పర్వతమునందే, భాస్కరుని వలె దివ్యతేజముతో వెల్గొందు శ్రీరామునితో గూడ కన్పించినది.

ఇక్కడ రాముని వాహనముగ హంససహస్రముచే మోయబడు "శిబి." గజదంతమయమని వర్ణించ బడినది. ఇక్కడ "గజ" శబ్దము, "అష్ట" సంఖ్యకు సంకేతము "దంత' శబ్దము 'ముప్పదిరెండు సంఖ్యను సూచించును. గాయత్రీ మహామంత్రములో నాల్గుపాదములు గలవు ఒక్కొక్క పాదమున ఎనిమిది అక్షరములు కలవు. నాల్గుపాదములున్నవి. దీనిని బట్టి త్రిజట గాయత్రీ మహామంత్ర రూపమైన, హంస సహస్రములు అనగా వేలాదిజ్ఞానులు ఉపాసించు శిబికనారోహించి వచ్చిన రామరూప బ్రహ్మమును దర్శించెను. శ్వేత పర్వతము నారోహించిన సీత, అపరబ్రహ్మకు, నిత్యాశ్రితయగు విద్యాశక్తి. శ్వేతాశ్వతరోపనిషత్తు అపరా శక్తిని గూర్చి యిట్లు చెప్పు చునది:-

తే ధ్యాన యోగానుగతా అపశ్యన్, దేవాత్మ శక్తిం స్వగుణైర్ని గూఢామ్'

తా॥ బ్రహ్మవేత్తలు ధ్యానయోగముచే మహేశ్వరాశ్రితయగు. స్వకార్యములగు గుణములు) పృథివ్యాది భూతములకు మూలముగ పరా ప్రకృతిని దర్శించిరి.

"గజదంతమయీం దివ్యాం శిబికామంతరిక్షగామ్ ।
యుక్తాం హంససహస్రేణస్వయమాస్థాయరాఘవః ।
శుక్లమాల్యాంబర ధరోలక్ష్మణేన సహాఽఽగతః ॥
స్వప్నేహ్యద్యమయా దృష్టా సీతా శుక్లాంబరావృతా ।
సాగరేణపరిక్షిప్తం శ్వేతపర్వతమాస్థితా ॥
రామేణసంగతా సీతా భాస్కరేణ ప్రభాయథా ॥ (5/27/9-11)

(తా॥ గజదంత మయమైనదియు, హంస సహస్రయుక్తమును, అంతరిక్షగతమును నగు శిబికను, శుక్లమాల్యాంబరధరుడగు రాముడు, లక్ష్మణునితో సహా యధిరోహించి వచ్చినాడు. సీత గూడ, శుక్లాంబరమును ధరించి,

శ్వేతపర్వతము నధిరోహించి యక్కడనే సూర్యునితో సంగతమైన ప్రకటవతె ధామ సంగతురాలై కన్పించినది.

ఇక రెండవ దృశ్యమును చూడుడు.

"రాఘవశ్చ పునర్దృష్టశ్చతుర్దంతం మహాగజమ్ ।
ఆరూఢశ్శైల సంకాశం చకాస సహలక్ష్మణః ।
తతస్తుసూర్యసంకాశౌ దీప్య మానౌ స్వతేజసా ॥

శుక్లమాల్యాంబర ధరౌజానకీం పర్యుపస్థితౌ ।
తతస్తస్య నగస్యాగ్రేహ్య కాశస్థస్యదంతినః ॥

భర్త్రాపరిగృహీతస్య జానకీస్కంధమాశ్రితా ।
చంద్రసూర్యౌ మయా దృష్టాపాణిభ్యాం పరిమార్జతీ ।
తతస్తాభ్యాం కుమారాభ్యామాస్థితస్స గజోత్తమః ।
సీతయాచ విశాలాక్ష్యాం లంకాయా ఉపరి స్థితః ॥
(5/27/12)

(తా॥ తిర్గి రాఘవుడు, లక్ష్మణ సహితముగా, నాల్గు దంతములుగల మహాగజము నధిరోహించి ప్రకాశించుచు, కన్పట్టినాడు. ఆ తరువాత, ఆత్మ తేజముచే సూర్యుని పగిది వెల్గొందు రామలక్ష్మణులిర్వురు, శుక్లమాల్యాంబరము లను ధరించి జానకి వద్దకు వచ్చిరి. తిర్గియావర్వత శిఖరముపైన, ఆకాశము నందు నిలబడిన, శ్రీరామచంద్రుడధి రోహించిన, గజముయొక్క, స్కంధము పై సీతాదేవి కూర్చొనియుండెను, ఆ తరువాత సీతాదేవి భర్తయొడి నుండి, ఎగిరి చంద్రసూర్యులను తన చేతులతో తుడుచు చున్నట్లగుపించెను. ఆ తరువాత కుమారులగు (నవయౌవనులగు) రామలక్ష్మణులు, సీతాదేవియునధి రోహించిన ఆ గజము లంకపైన నిలబడియున్నట్లు అగుపించెను.

ఈ వర్ణనములో చివటి పద్యమున, శ్రీ రాముడు గజమునధిరోహించి లంకపైన నున్నట్లు వర్ణించబడినది. ఈ గజము, గాయత్రీ మహామంత్రరూప మైన గజమే. రామలక్ష్మణు లిర్వురు శుక్లమాల్యాం బరధరులుగను, సూర్యుని

వలె దేదీప్యమానమైన నాత్మతేజముతో వెల్గొందుచున్నారని గూడ వర్ణించబడి నది. ఇక్కడ మనము గమనించ వలసినది యేమన, ఈ వర్ణనమున, ప్రధానముగ ఉపలక్షితుడు రాముడు. అతడు ఆత్మరూపుడు, అనగా పరబ్రహ్మ రూపుడు. స్వతేజమున వెల్గొందు పరబ్రహ్మ స్వరూపుడు. అతనితో సహ ఉన్నవాడు లక్ష్మణుడు, ఈ 'సహ' అను అవ్యయము వ్యాకరణ శాస్త్రమునను సరించి, యప్రాధాన్య రూపమగు అర్థమును సూచించును. అనగా, అస్వాతంత్ర్యమును సూచించును. కావున లక్ష్మణుడు. అస్వతంత్రుడును, ప్రధానాశ్రితుడును, పరబ్రహ్మకు, పరాప్రకృతి రూపుడునగు జీవుడు. ఇతడు గూడ ఆత్మస్వరూపుడే గనుక, ఆత్మవలె నిత్యయౌవనుడు, నిత్యప్రకాశ స్వభావము గలవాడు. అనగా, అజరము, అమరము, ఏకరస స్వరూపమైనవాడు. ఇక సీతాదేవి, భగవదాశ్రితమైన, భగవదనన్య భూతయైన దేవాత్మశక్తి. ఆ వాదేత్మ శక్తియే భగవత్ప్రేరణ వలన, త్రిగుణాత్మక ప్రకృతి రూపమున. ఆత్మనుండి వేఱుగ రూపొంది సృష్టి స్థితిలయ రూపములగు కార్యములను గావించును. ఇక్కడ సూర్యుడు, రామ రూపమగు పరబ్రహ్మము. ఆపరబ్రహ్మ యొక్క పరా ప్రకృతి 'లక్ష్మణ' రూపుడగు జీవుడు. సీత యా బ్రహ్మాశ్రితమైన బ్రహ్మకు అనన్య భూతయగు విద్యాశక్తి. తేలిన సారాంశమేమియన, జీవసృష్టికి కారణభూతమైన దేవాత్మశక్తి కాశ్రయ భూతమగు రామ పరబ్రహ్మమును, ఈ దృశ్యమున త్రిజట చూచెను. ఇదియే పూర్వదృశ్యము కంటె నిందలి విశేషము. ఇక, యింకొక రహస్య మేమియన, నిక్కడ చంద్రస్థానీయుడు లక్ష్మణుడు, చంద్రుడు, సూర్యాశ్రితమైన ప్రకాశము, కనుక జీవుడు. పరబ్రహ్మాశ్రితుడైన ప్రకాశయుక్తుడు, పరబ్రహ్మపరతంత్రుడు, ప్రకాశలక్షణముచే పరబ్రహ్మతో నభిన్నుడైనను, ఉపాధిగ్రహణముచే పరతంత్రుడు, ఇక దేవాత్మ శక్తియగు 'సీత' సూర్యచంద్రులను హస్తములతో పరిమార్జనము చేయుచున్నట్లు వర్ణించబడినది. ఇక్కట "పరిమార్జనము" అనగా "పరిమితత్వ"ము అనునర్థమును గ్రహించవలెను. అనంతము, అపరిమితమునగు పరబ్రహ్మయందు, విద్యారూపమైన మాయ, అపరబ్రహ్మనావరించి, దానికి పరిమితత్వమును కల్పించి, సగుణబ్రహ్మ, జీవత్వములను కల్పించుటతో

బాటుగ తనయందు గల విక్షేపశక్తిద్వారా (ఇదియే తర్తయంకము నుండి సముత్పతనము) అపరబ్రహ్మయందే యీ సృష్టిని కల్పించుచున్నది. ఈ విధముగ సృష్టి, జీవ, శక్తి రూపమున నగుపించు పరబ్రహ్మమే గాయత్రీ మహ మంత్రముచే నుపాసించబడు రామ రూప పరబ్రహ్మమని సంకేత భాష ద్వారా సూచితము.

ఇక త్రిజట తన స్వప్నమున చూచిన మూడవ దృశ్యము :

"పాండురర్షభయుక్తేన రథేనాష్టయుజాస్వయమ్ ।
ఇహోపయాతః కాకుత్స్థః సీతయాసహభార్యయా ॥ (5/27/17)

(తా॥ తెల్లని యెనిమిది ఋషభములు పూన్చిన రథముపై, ఆకాకుత్ స్థుడు, తన భార్యయగు సీతతో వచ్చినాడు.

ఇక యి మూడవ దృశ్యమున ఎనిమిది వృషభములను పూన్చిన రథమునెక్కి సీతతో రాముడు వచ్చినట్లు రాముడు వర్ణింపబడినాడు. ఇక్కడ "వృషభ" శబ్దము "ఓంకార" మునకు ప్రతీకము, పరబ్రహ్మకు ప్రతీకమగుటచే, నీయోంకారము, శుద్ధసత్త్వమయము. అందువలన నిది "పాండుర" వర్ణము (తెలుపు) గలదిగ వర్ణించబడినది, ఈ ఓంకారములు "గాయత్రీ మహా మంత్రము"న ఎనిమిది గలవు (ఒక కల్పము) భూర్భువరాది సప్తవ్యాహృతులతో నుచ్చరింపబడు సప్త ఓంకారములు, మూల మంత్రము (తత్సవితుర్వరేణ్యం)తో నుచ్చరింపబడు ఒక ఓంకారము, మొత్తము కలసి ఎనిమిది ఓంకారములతో కూడుకొనిన రథము గాయత్రి మహామంత్రము (త్రిపాన్మత్రము). ఈ త్రిపాన్మంత్రముచే నుపాసింపబడు శక్తిశబలిత బ్రహ్మము) షడ్గుణసమన్విత దేవుడు తేక మాయా శబలిత బ్రహ్మమిందు సంకేతితమగుచున్నది.

ఇక త్రిజట తన స్వప్నమున చూచిన నాల్గవ దృశ్యము :

తతోఽన్యత్రమయాదృష్టః రామస్సత్య పరాక్రమః ।
లక్ష్మణేనసహభ్రాత్రా సీతయాసహవీర్యవాన్ ।

ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్య సన్నిభమ్ ॥
ఉత్తరాందిశమా లోక్య ప్రస్థితః పురుషోత్తమః ।
ఏవంస్వప్నే మయా దృష్టో రామో విష్ణు పరాక్రమః ॥

(5/27/18 1/2-20)

(తా॥ ఆ తరువాత, సత్యపరాక్రముడును, మహావీర్య సంపన్నుడును నగు రాముడు, భ్రాతయగు లక్ష్మణునితోను. సీతతోడను, సూర్య సన్నిభ మగు, దివ్యమైన పుష్పక విమానమునెక్కి ఉత్తర దిక్కుగా పయనమైనాడు. ఈ విధముగా, విష్ణుతుల్య పరాక్రముడును, పురుషోత్తముడునునగు శ్రీరాముని స్వప్నమందు నేను చూచితిని.

ఈ నాల్గవ దృశ్యమున రాముడు పురుషోత్తముడనియును, సూర్యసం నిభమైన దివ్యపుష్పక రూపమైన సూర్యుని అధిరోహించినవాడును, సూర్య మండలాంతర్గతుడును, నిత్య, సత్యస్వరూపుడును, శుభ సంస్కారము గల జీవులచే నుపాసితుడును, విద్యాశక్త్యాశ్రయుడును నగు నారాయణుని స్వరూప మేయనియు, నా సూర్యమండలాన్తర్గతమగు నారాయణ రూపమే, గాయత్రీ మహామంత్రముచే నుపాసితమగు చున్నదనియును స్పష్టీకరించబడినది.

ఈ స్వప్నములో గాయత్రీ మహామంత్రలక్ష్యమగు, పరబ్రహ్మము నాల్గుసార్లు నాల్గు వాహనముల నధిరోహించి, నాల్గుసార్లు త్రిజటచే చూడబడి నట్లు వర్ణించబడినది. ఈ చతుర్విధములుగ చేయబడిన దర్శనము, మంత్ర శాస్త్రములోని నొకక్రమము ననుసరించి వర్ణించబడినది. అది యెట్లన :-

గాయత్రీ మహామంత్రము, త్రిసంధ్యలయందు నుపాసించబడును. ఉదయ కాలమున నామె బ్రాహ్మీయని చెప్పబడును. ఆమె వాహనము హంస అందువలన గాయత్రీ మహామంత్రలక్ష్య భూతమగు శ్రీరామ పరబ్రహ్మము, హంసచే మోయాబడు విమానము నధిరోహించినట్లు వర్ణించబడినాడు. మధ్యా హ్నమున సావిత్రరూపము. సావిత్రి ఇంద్రీశక్తిగ గూడ సముపాసింప బడును. తద్వాహనము ఐరావతము. అందువలన రెండవ సారి గజారూఢుడు

గకన్పడినట్లు వర్ణించబడినది. ("ఐంద్రీహ్యైరావ తారూఢా చైహికాముష్మికప్రదా యని దేవీ భాగవతము)" సాయంకాలమున, గాయత్రి, సరస్వతీరూపమున నుపాసించబడును. ఆమె రౌద్రీశక్తి గూడ. తద్వాహనము వృషభము. అందు వలన వృషభారూఢురుగా మూడవ పర్యాయమగుపించెను. ఇక నాల్గవ పర్యాయము, అనిర్వచ నీయమగు జ్యోతిర్మండల రూపమగు విమానమునారో హించినట్లు వర్ణించబడినాడు. అనగా గాయత్రీ మహామంత్రము నాల్గవ పాద ములచేలక్షితమగు, అనంతము, అఖండము. రాక్షరాతీతము, సత్యము, జ్ఞానమయమునగు పరబ్రహ్మరూపముగ, వర్ణించబడినాడు. ఈ విధముగ గాయత్రీ మహమంత్ర లక్ష్యమగు పరబ్రహ్మగా శ్రీరాముడు త్రిజటా స్వప్నము లోసంకేతము ద్వారా నిరూపించబడియున్నాడు,

## 25. శ్రీరాముని పురుషోత్తమత్వము

శ్రీ రాముడు పురుషోత్తముడు (తవార్యేసద్గుణైర్యుక్తః సుపుత్రః పురు షోత్తమః (2/44/25) సత్య ధర్మములమహిమను లోకమున చాటుటయే కాక తానాచరించి, లోకముచేనాచరింప చేసిన ధర్మాత్ముడు. కనుకనే రామ వనవాసమునకు దుఃఖించు కౌసల్య నోదార్చుచు సుమిత్ర పల్కిన ఈ మాటల చూడుడు.

కీర్తి భూతాం పతాకాంయో, లోకే భ్రామయతి ప్రభుః।
ధర్మస్సత్య వ్రతపరః కింనప్రాప్తస్తవాత్మజః (2/44/7)

తా॥ శ్రీ రాముడు ధర్మసత్యవ్రతపరుడు, తన కీర్తి పతాకనులోకమున నెగురవేయును. నీపుత్రుడగురాముడు పొందని పురుషార్థమేమియున్నది?

అట్టి సత్యవ్రతుడును, ధర్మాత్ముడునునగు శ్రీరామ చంద్రుడు తన శీల- చారిత్రములచేతను, లోక కల్యాణ కరములగు కర్మల చేతను, సర్వ లోకముల కారాధ్యుడైనాడు. అతడు గుణములచే నెంత సుందరుడో రూపమున

గూడనట్టి వాడే. అతనినిగూర్చి రామోపాసకు లిట్లు పల్కుచున్నారు: "పుంసాం మోహన రూపాయపుణ్య శ్లోకాయ మంగళమ్" అని. శ్రీరాముని దివ్య సౌందర్యము పురుషులను గూడ మోహ పెట్టును. అతని పవిత్ర చారిత్రమును కీర్తించిన పుణ్యము వచ్చును. వాల్మీకి గూడ నతని దివ్య సౌందర్యమును గూర్చి యిట్లు వర్ణించి యున్నాడు:-

యశ్చరామంన పశ్యేత్తుయం చరామోన పశ్యతి।
నిందితస్సభవేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే॥

తా॥ ఎవ్వడు శ్రీ రాముని చూడలేదో, యెవనిని రాముడు చూడడో యతడు లోకనిందను పొందును. ఆతని యాత్మగూడ నతనిని నిందించును మహాత్ములు పుట్టుకతోడనే సకల దివ్యగుణములతో జన్మింతురు. వారి కల్యాణ గుణములకు తగిన, సర్వసులక్షణముగల శారీర సంస్థానమును గూడ కల్గియుందురను సత్యమును వాల్మీకి శ్రీరాముని అవయవ సంస్థానము, కల్యాణ గుణముల వర్ణనము ద్వారా నిరూపించి యున్నాడు. సుందరకాండమున శ్రీరాముని సుందర శారీర సంస్థానముతో బాటుగ, శ్రీరాముని కల్యాణ గుణసౌందర్యము గూడ వర్ణించ బడినది. ఇంత విపులముగ నితరకాండలములందు శ్రీ రామ శారీర గుణ సౌందర్యములు వర్ణించ బడలేదు, అస్తు, భగవాన్ వాల్మీకి సుందరకాండమున చేసిన శ్రీరాముని జగన్మోహక శారీర సౌందర్యమును తిలకింపుడు:-

శ్రీ రాముడు కమల దళాయత నేత్రుడు, పూర్ణచంద్రుని బోలిన ఆననుడు (5/35/87), కంబుగ్రీవుడు, ఎఱ్ఱని కాంతితో నొప్పు నేత్రములు గలవాడు (5/35/57) దుందుభిస్వనము వలె గంభీరమగు కంఠధ్వని గలవాడు (5/35/16) విశాల వక్షుడు, విపులమగు భుజస్కంధములు గలవాడు, మహా బాహువు, గూఢ జత్రువు (5/35/5) వృషస్కంధుడు, నీలోత్పల శ్యాముడు సుందరమగు కేశములు గలవాడు, సింహవిక్రాంతగామి, పండిన దొండపండు వలె ఎఱ్ఱని పెదవులు గలవాడు. సుందరములును, సమములును, సమవిభక్తములును నగు అంగములు గలవాడు (5/35/16) ఆదిత్యుని వలె

మహాతేజస్వి, చంద్రునివలె సర్వ ప్రియదర్శనుడు (5/34/28) మహా శోభా సంపన్నుడు, కందర్ప సమసౌందర్యముగల వాడు (5/31/31/7) ఇంక హనుమంతుడు, సీతా ప్రత్యయనిమిత్తమై శ్రీరాముని మహా సుందరమును, సర్వశుభలక్షణ యుక్తము నగు అవయ సంస్థానమును వర్ణించుచు నిట్లు పల్కినాడు.

"ఊరు, మణి బంధ, ముష్టుల యందు స్థిరత్వము (త్రిస్థిరః) భ్రూ,వృషణ, బాహువులయందు ప్రలంబత్వము (త్రిప్రలంబః), కేశాగ్ర, వృషణ, జాను వులయందు సమత్వము ( త్రిసమః;, నా భ్యన్తవక్షః కుక్షు ల యందున్నతత్వము (త్రిషుచోన్నతః) నేత్ర, నఖ పాణి. అంఘ్రితలముల యందు తామ్రత్వము (త్రితామ్రః) పాదరేఖా, కేశ, లింగముఖులయందు స్నిగ్ధత్వము (త్రిషు స్నిగ్ధః) నాభి, స్వర, గతులయందు గాంభీర్యము (గంభీర స్త్రిషు;)ఉదర, కంఠముల యందు మూడు రేఖలు గలవాడు (త్రివళీమాన్:)పాద తల రేఖా స్తన చూచుకములయందు నిమ్నత్వము గలవాడు, (త్ర్యవనత:) గ్రీవా ప్రజనన, పృష్ఠ జంఘలయందు హ్రస్వత్వము గలవాడు (చతుర్వ్యంగః) మూర్ధమునందు ఆవర్తత్రయము గలవాడు (త్రిశీర్షవాన్) లలాటమందు చతుర్వేద ప్రాప్తి సూచకములగు చతుర్లేఖలుగలవాడు (చతుష్కలః): తొంబది యారు అంగుళముల శారీరోత్సేధము గలవాడు (చతుష్కిష్కు:) బాహు ఊరు, జాను, గండ స్థలముల యందు సమత్వము గలవాడు [చతుస్సమః] రెండుకను బొమలు, రెండు నాసా పుటములు, రెండు నేత్రములు, రెండు కర్ణములు, రెండు పెదవులు, రెండు చూచుకములు, రెండు మోచేతులు, రెండు మణి బంధములు, రెండు జానువులు, రెండువృషణములు, రెండుకటి భాగములు. రెండుకరములు, రెండు పాదములు, రెండు స్ఫిక్ప్రదేశములు (పిరుదలపైని యున్నత ప్రదేశములు) అను పదునాల్గుఅవయవ ద్వంద్వముల యందు సమత్వము అను ధర్మము గలవాడు,రెండు దంత పంక్తులయందును స్నిగ్ధత్వ, ఘనత్వ తీక్ష్ణత్వ ధర్మముగల రెండు-రెండు దంతములుగలవాడు (చతుర్దంష్ట్రః) సింహ, శార్దూల గజ వృషభములవలె దర్పముగ నడచువాడు (చతుర్గతిః) ప్రశస్తములగు పెదవులు, మాంసలములగు హనువులు, దీర్ఘోన్నత

రుచిరమగు నాసికయును కలవాడు; వాక్ వక్త్ర నఖ లోమత్వక్కులను ఐదింటియందున్నూ స్నిగ్ధత్వము గలవాడు (పంచ స్నిగ్ధః) వెన్నెముక హస్త, పాద, అంగుళి, నాసిక, నేత్ర, కర్ణ, ప్రజననములను, ఎనిమిది అవయములయందు ధీర్ఘత్వము గలవాడు (అష్టవంశవాన్) ముఖ నేత్ర, ఆస్య, జిహ్వా, తాలు, ఓష్ఠ, స్తన, నఖ, కర, పాదములను పదింటి యందును పద్మాకారత్వము గలవాడు (దశ పద్మః) ఉరము, శిరము, లలాటము, కంఠము, బాహువులు, భుజస్కంధములు, నాభి, పాదములు, పృష్ఠము, కర్ణములను పదింటియందును వైశాల్యము గలవాడు (దశ బృహత్) శ్రీ, యశ, తేజములచే, లోకమున విఖ్యాతుడు, (త్రిభిర్వ్యాప్తః) శుద్ధము లగు మాతా = పితృవంశములు గలవాడు, (ద్విశుక్లవాన్)కక్ష (చంకలు), కుక్షి, వక్షః, ఘ్రాణ, స్కంధములను, ఆరింటి యందు ఉన్నతత్వము గలవాడు (షడున్నతః), వ్రేలికణువులు, కేశ, రోమ, నఖత్వక్, శిశ్న, శ్మశ్రు, దృష్టి, బుద్ధులయందు సూక్ష్మత్వము గలవాడు (నవతనుః); ధర్మార్థ కామములను యథాకాలమున సేవించు వాడును (త్రిభిర్వ్యాప్తః) అయి యున్నాడు.

## వైదిక ఋష్యుపజ్ఞసౌందర్య దర్శనము

భగవాన్ వాల్మీకి శ్రీ రామాయణ మహాకావ్యమును విశేషించి సుందర కాండమునందు, గానించిన, దివ్యసౌందర్యాభివ్యక్తికి మూలము నిచట యన్వేషింతముగాక. ప్రాచేతనసుకి సౌందర్యాభివ్యంజన ప్రేరణ తన పూర్వ జులును, వేద ఋగ్ద్రష్టలును సౌందర్యోపాసకులునునగు, వసిష్ఠ, భరద్వాజ ప్రస్కణ్వకాణ్వ, కుత్సఅంగిరస. కక్షీవద్దీర్ఘతమసాద్యృషుల దివ్య సౌంద ర్యానుభూతి దర్శనము వలన కలిగియుండవచ్చునని యూహింపవచ్చును.

### వైదిక ఋషులు సౌందర్య దర్శనము

ఋషి, కవి, విప్ర ఆదిపదములు, మేధావత్త్వమును, తత్త్వదర్శన, అభివ్యంజ నాపటియస్త్వమును తెలియజేయును. వైదిక ఋషులందరు ఈ

బ్రహ్మవర్చమునసే జన్మించి, ఈ బ్రాహ్మీదేవత ఒడిలోనసే కన్నులు విప్పి త్రిజగజ్జననియగు దేవాత్మ శక్తి యనుగ్రహము వలననే సర్వత్ర ఆ దేవాత్మ శక్తిచే నింపబడిన దివ్య దీప్తిని లేక సౌందర్యమును గాంచి ముగ్ధులై, తమో వినాశకమును, తత్త్వ దర్శినియునగు, ఆ సావిత్రిని దివ్యవాక్కులలో నుతించియున్నారు. వారు గానము చేసిన ఆ దివ్యసౌందర్య స్తుతులు ఉషో దేవతానుతులై, లోకుల యుల్లములను పల్లవింపజేయుటతో బాటుగ, వారికి తత్త్వదర్శనోత్కంఠను, భావోద్దీప్తిని దివ్యానందానుభూతిని కల్గించి, దివ్యసౌందర్య సముపాసనా మార్గమును సుగమమొనరించినవి. వైదిక ఋషుల ఈ దివ్య సౌందర్యసముపాసనమే, క్రమక్రమముగ పరిఢవిల్లి తాంత్రిక సౌందర్య సముపాసన, ప్రాకృతిక సౌందర్యాభివ్యంజన, మను ద్వివిధ సంప్రదాయములను ప్రవర్తిల్ల జేసినది. వీనిలో మొదటిది తాంత్రికో పాసనా దర్శనమును విస్తరింపజేయగా, మఱియొకటి కావ్య సౌందర్య దర్శనమును భారతీయ వాఙ్మయక్షేత్రమున పరిఢవిల్ల జేసినది. తాంత్రిక సౌందర్యో పాసనమును గౌడపాదాచార్య శంకర భగవత్పాదాద్యాచార్యులు దర్శనముగ రూపొందింప, కావ్యసౌందర్య దర్శన రూపమున భామహ అభినవ గుప్త, ఆనంద వర్ధనాద్యాచార్యులు పరిఢవిల్లజేసిరి.

పైన తెల్పిన ఉభయ సంప్రదాయములకు మూలము వైదిక ఋష్యుపజ్ఞ మగు సౌందర్య దర్శనమే.

వైదిక ఋషులు అగ్న్యుపాసకులు-అగ్న్యుపాసనమువలన ముఖ్యముగ సిద్ధించు ప్రయోజనములు రెండు-:

ఒకటి : తమోనివృత్తి, అనగా, అజ్ఞాన, అంధకారాదినివృత్తి.

రెండవది : వస్తు దర్శనము.

ఈ వస్తుదర్శనము - బాహ్యవస్తుదర్శనము. తత్త్వ దర్శన రూపమున ద్వివిధము.

పరిణామము : తమస్సులో నుండి వెలుగులోనికి వచ్చుట, తన్మూలమున, శాంతి, ఆనందముల ప్రాప్తి-కనుకనే వైదిక ఋషులు పలుతావులందు,

తమో నివృత్తి, పూర్వక జ్యోతిః ప్రాప్తి కొఱకు ఆయా దేవతలను నుతించిరి. "తమసో మా జ్యోతిర్గమయ" యను, వైదిక ఋషుల చిరంతన ఆశాసన వచనము (బృహదారణ్యకము (3/3/27)) ఇప్పటికిని భారత భూమిలో నాల్గు చెఱగులలో నినదించుచునేయున్నది.

వైదిక ఋషులు ఈ పవిత్ర భారత భూమాత గర్భముననే జన్మించి యామె యుత్సంగములోననే కన్నులు విప్పి ఈ లోకమును దర్శించినారు. వారు మొదట దర్శించిన దృశ్యములు సూర్యోదయ సూర్యాస్తమయములు. (చంద్రోదయ చంద్రాస్తమయములు గూడ). కాని యగ్న్యుపాసనము వలన నివృత్త తమస్కులును, ఉన్మీలిత అంతరచక్షువులు గల ఋషులు, సూర్యోదయ సూర్యాస్తమయములను, శ్రద్ధగ నవలోకించి, యనేక సృష్టిరహస్యములను గుఱుతించిరి.

వారికి సూర్యుడొక అగ్నిపిండముగ మాత్రమేగాక, సవితగ (సర్వలోక సృష్టికర్తగ), సర్వఫల ప్రదాన సమర్థుడుగ, కాలకర్తగ, సర్వజగన్నియామకుడుగ, గన్పించి యతనినే ప్రత్యక్ష దైవతముగ, అనగా సృష్టి, స్థితి, లయకర్తగ, నుపాసించినారు.* దానివలన అన్ని యభద్రములు తొలిగి వారికి, ఆయు, రన్న, ప్రజా, పశు, సస్యాది భద్రములయొక్క ప్రాప్తితో బాటుగ జ్ఞానోదయముగల్గి, తత్త్వ సాక్షాత్కారము కల్గినది. సకల సృష్టి రహస్యములవగతములైనవి. ఈ సకల సృష్టి అఖండ చైతన్య రూపమగు ఆత్మ సాక్షాత్కారము కొఱకే విస్తరింప చేయబడినదను రహస్యము గూడ బోధపడినది.**

---

1. "ఉద్యంత మస్తంయన్త మాదిత్య మభిధ్యాయన్ కుర్వన్ బ్రాహ్మణో విద్వాన్సకలం భద్రమశ్నుతేఽ సావాదిత్యోబ్రహ్మేతి; బ్రహ్మైనసన్, బ్రహ్మాప్యేతి యఏవంవేద। అసావాదిత్యో బ్రహ్మ॥

2. "రూపం రూపం ప్రతిరూపోబ భూవతదస్య రూపం ప్రతి చక్షణాయ। ఇంద్రోమాయాభిః పురురూప ఈయతేయుక్తా హ్యస్యహరయశ్శతాదశ॥" (ఋ. వే.)

సూర్యుడుదయించక పూర్వము సకల లోకములు తమోగ్రస్తములై, ఆత్మవిస్మరణమున జడసదృశముగ పడియుండును. సూర్యోదయము కాగానే తిరిగి వాటు గాఢనిద్ర లేక మోహము నుండి మేల్కాంచి, యాత్మస్మరణము గల్గి తమ తమ కార్యముల యందు ప్రవర్తిల్లుచు ఈ జగ ద్వ్యాపారమును ముందుకు కొనిపోవుచున్నారు. ఇట్లు "దిన" సమయమున స్వస్వవ్యాపారరతమగు లోకము రాత్రిరాగానే తిర్గి తమోవృతమై నిశ్చేతనమై పడియుండుటను నిత్యము గమనించిన వైదిక ఋషి జగత్సృష్టి స్థితిలయముల రహస్యమును గుఱుతించినాడు. రాత్రియే ప్రళయము, సూర్యోదయమే-సృష్ట్యారంభము - దినమంతయు - లోకస్థితి లేక లోకవ్యాపార ప్రవర్తకము. కాని వీనిని కల్గించు సవిత తమోఽతీతుడు (వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్; పురుష సూక్తము). కాని రాత్రి కాలము నంతము చేయును, దినమున కారంభకమగు, సంయోజక తత్త్వ మొకటి యుండవలెనుగదః అట్లే, దినక్షయముతోబాటు కాళరాత్ర్యారంభక సంయోజక తత్త్వమొకటి యుండవలెనుగదః అదియేమి యను విషయమును పర్యాలోచన చేయగ "సంధ్య" (సంయోజక తత్త్వము) యని గోచరించినది. ఈ "సంధ్య" కాల స్వరూపిణియే గాక, సృష్టి స్థితి లయకారిణియగు మహాదేవిగ వారు తమ జ్ఞాన నేత్రములో దర్శించిరి. ప్రళయానంతరము సృష్టిని ఈ సంధ్యా దేవియే చేయును. సృష్టికి స్థితినిగూడ ఈ సంధ్యా దేవియే చేయును. ప్రళయమును గూడ ఈమెయే చేయుచున్నది. కాని సృష్ట్యారంభవేళ ఈ సంధ్యాదేవి బ్రాహ్మీ దేవిగను (ఉషాదేవి-రజోగుణ (ప్రధానము) మధ్యయందు అనగా స్థితివేళ సావిత్రి లేక వైష్ణవిగను, అంతమందు అనగా ప్రళయమున కాళరాత్రిలేక రౌద్రీ శక్తిగను ఈ సంధ్యాదేవియే మూడు రూపములను దాల్చి ఈ మూడు వ్యవహారములను (సృష్టి స్థితి లయలను) చేయుచున్నట్లు వారు గమనించిరి.

ఈ "సంధ్యా" దేవిని, దేవాత్మ శక్తిగ ఋషులు దర్శించిరి. ఈ దేవి, రజోగుణ ప్రాధాన్యముచే "ఉషా" దేవి రూపమున, సూర్యునికి ముందుగ నావిర్భవించి తన యరుణరోచిస్సులను ఆకాశము నందంతట నింపవచ్చు

మాతృరూపమున భువిపై దిగి నిద్రించు ప్రాణిలోకమున. తల్లివలె ప్రేమతో తట్టి, తన చైతన్యవంతములగు కరముల మృదు స్పర్శచే జాగృత మొనర్చి వారికి నవస్ఫూర్తి నొసగి తమతమ వ్యాపారముల యందు ప్రవర్తిల్ల జేయుచున్నది. ఈ సమయమున నీమె తన రజోగుణము నుద్బుద్ధము గావించును. ఇక మధ్యాహ్నవేళ సవితృ దేవుని, నిజ విద్యాశక్తి రూపిణియగు ఈ దేవి, తనలోని సత్వ గుణము నుద్బుద్ధము గావించి జగత్తును స్వస్వ వ్యాపారముల యందు ప్రవర్తిల్లచేసి జగత్ స్థితిని శుద్ధము చేయును. అపుడామె సావిత్రియని నుతింపబడును. సాయంసమయమున తనలోని తమోగుణము నావిష్కరించి సూర్యుని ఆవరించి సకల లోకములలోని గాఢ తమమును వ్యాపింపచేసి రాత్రిని కలుగచేయుచు జగత్తును మోహముద్రిత మొనర్చి, తమస్సులో లీనము గావించును. అపుడీమె 'రౌద్రి' యనిపిల్వబడును. కాని ఈ మూడు స్థితులలో నేది జరుగకున్నను ప్రళయము ముందునకు కొనసాగదు. రాత్రి లేక కేవలము దినము మాత్రమే ప్రవర్తిల్లిన లోకము, విశ్రామములేక నాశనమగును. దినము లేకున్న వ్యాపార నిరోధము ద్వారా జగత్ స్థితికే ముప్పు వాటిల్లును. రాత్రి, మాతవలె, స్వవ్యాపార ఖిన్నమగు లోకమును మోహముద్రిత మొనర్చి తన యొడిలోననే హాయిగ నిద్రవుచ్చి, నిరంతర వ్యాపార ఖిన్నమగు లోకముయొక్క దుఃఖము నపనయించి, నూత్న స్ఫూర్తి నిచ్చి కాపాడుచున్న మాత యీ సంధ్యా మాతయే గదః

మఱియొక రహస్యమేమియన, ఈ సంధ్యాదేవి సూర్యుని కనన్యభూత. ఈమె సూర్యుని యావరించి సౌరతేజతేజము లోకమును దగ్ధము చేయకుండగ నివారించుటతో ఆయనను మూడు వేళల యందావరించి, సృష్టి, స్థితి, లయ వ్యాపారములు నిరంతరాయముగ జరుగుటకు తోడ్పడుచున్నది. అందువలననే యీమెను ఋషులు దేవాత్మ శక్తిగ ఋషులు వర్ణించిరి (దేవాత్మ శక్తిం స్వగుణైర్నిగూఢామ్॥ శ్వేత ఉప)॥

కాని ఈ సంధ్యాదేవి యుషః కాలమున, శుభ్రమగు తేజోమయ వస్త్రములను ధరించి, తన యరుణరోచిస్సులతో నిండు యౌవనము

పొంగారగ సూర్యునికి ముందే తన రథము నెక్కి హిరణ్య వర్ణము గల సుందర తనువుతో లోకమునకు దర్శనమిచ్చును. ఏయమ్మ సకల లోక జాగరణ కర్త్రియో, ఏ జగజ్జనని యనుగ్రహమున ఋషులు జగద్దర్శనముతో బాటు తత్త్వ దర్శనము చేయగల్గిరో, ఏయమ్మ రూపము సకల జగన్మోహకమో యట్టి యుషోదేవి సౌందర్యముతో బాటుగ, ఆమె యావిర్భావమును ఋషులు సమాధిభాష లేక రహస్య భాషలో (Mistic Language)లో కడు రమ్యములగు ఋక్కులలో నభివర్ణించియున్నారు. ఈ యుషో దర్శనమే విశ్వ సౌందర్య సముపాసమునకు, సౌందర్యదర్శన ప్రవర్తనమునకు నాందిని పల్కినదని నిస్సందేహముగ చెప్పవచ్చును. ఆయా వైదిక ఋషులు ఉషోదేవి యావిర్భావ దర్శనమును తన్మయతతో వర్ణించిన ఈ రమ్యములగు ఋక్కులను తిలకింపుడు.

1. "వ్యుషా ఆవో దివిజా ఋతేనాఽఽవిష్కృణ్వానా మహి-
మాన మాగాత్। అపద్రుహస్తమ ఆవరజుష్ట మఙ్గిరస్తమా
పథ్యా అజీగః॥ (ఋ వే. 7-75-1)॥

2. "ఏషాస్యాయుజానా పరాకాత్ పంచక్షితీః పరిసద్యోజిగాతి।
అభిపశ్యన్తీవయునా జనానాందివోదుహితా భువనస్యపత్నీ॥
(7-75-4)

3. "ఉద్ జ్యోతిరమృతం విశ్వజన్యం విశ్వానరస్సవితా దేవో
అశ్రేత్। క్రత్వాదేవానామజనిష్ట చక్షురావి రకర్భువనం విశ్వముషాః॥
(ఋవే, 7-76-1)॥

4. "తఇద్ దేవానాంసధమాద ఆసన్నృతా వానః కవయః
పూర్వ్యాసః।గూళ్హం జ్యోతిః పితరోఽన్వవిందన్సత్యమంత్రా
అజనయన్నుషాసమ్॥ (ఋ.వే. 7-76-4)॥

5. "ఉషోరురుచే యువతిర్నయోషా విశ్వం జీవం ప్రసువన్తీచరాయై।
అభూదగ్నిః సుమిధేమానుషాణామకర్జ్యోతిర్బాధమానా తమాంసి॥
(7-77-1)

6. "దేవానాంచక్షుః సుభగావహన్తీ శ్వేతం నయన్తీసుదృశీక మశ్వం।
ఉషా అదర్శ్మిభిర్వ్యక్తా చిత్రామఘా విశ్వమను ప్రభూతా॥ (7-77-3)॥

7. "యాంత్వాదివో దుహితర్వర్ధయన్త్యుషః సుజాతే మతిభిర్వసిష్ఠాః॥
సాస్మాసుధారయి మృష్వం బృహంతం యూయంపాత
స్వస్తిభిః సదానః॥ (7-77-6)॥

8. "ప్రతికేతవః ప్రథమా అదృశ్రన్నూర్ధ్వా అస్యా అఞ్జయోవిశ్రయన్తే।
ఉషో అర్వాచా బృహతారథేన జ్యోతిష్మతా వామమస్మభ్యం వక్షి॥
(ఋ.వే. 7-78-1)॥

9. "అచేతి దివోధుహితా మఘోనీ విశ్వేపశ్యన్త్యుషసం విభాతీమ్।
అస్థాద్ రథం స్వధయా యుజ్యమాన మాయ మశ్వాసః
సజుషో వహన్తి॥ (7-78-4)

10. "వ్యఞ్జతే దివో అన్తే ష్వక్తూన్ విశోనయుక్తా ఉషసోయతన్తే।
సంతేగావస్తమ ఆవర్తయన్తి జ్యోతిర్యచ్ఛన్తి సవితేవ బాహూ॥
(ఋ వే. 7-79-02)

11. "ప్రతిస్తోమేభి రుషసం వసిష్ఠా గీర్భిర్విప్రాసః ప్రథమా అబుధ్రన్।
వివర్తయంతీం రజసీ సమన్తే, అవిష్కృణ్వతీం భువనాని విశ్వా॥
(7-80-1)

12. "ఏషాస్యానవ్య మాయుర్దధానా, గూఢ్వీతమో జ్యోతిషోసా అబోధి।
అగ్రపతి యువతి రహ్రయాణా ప్రాచికితత్ సూర్యం యజ్ఞమగ్నిమ్॥
(7-80-2)

13. "ఉచ్ఛన్తీ యాకృణోషి మంహనా మహిప్రఖ్యై దేవి స్వర్దృశే।
తస్యాస్తేరత్నభాజ ఈ మహేవయం స్యామ మాతుర్న సూనరీ॥
(7-81)

భావార్థము .

1. ఉషోదేవి ద్యులోకము నుండి సాక్షాత్కరించినది. ఈ దివోదుహిత తన తేజము ద్వారా తన మహిమను లోకమునకు వెల్లడి జేయుచు వచ్చుచున్నది ఆమె వచ్చుచునే లోకమునకు మిక్కిలి యప్రియమును లోకము నంతను ఆవరించినదియు, లోకులను తమస్సుచే మోహపెట్టు నదియునగు తమస్సు అను శత్రువును తృటిలో వినాశ మొనరించి, సకల ప్రాణులను, తమతమ వ్యవహారములను యథావత్తుగ నిర్వహించుటకై మేల్కొలుపు చున్నది.

2. సర్వ భువనముల పాలకురాలగు ఈ దివోదుహిత దూరదేశమున నున్నను, సర్వజనులయొక్క ప్రజ్ఞానములను సాక్షిరూపముగ నుండిచూచును. పంచ జనులను ఆవరించిన గాఢ తమస్సును వినాశమొనర్చుటకై వారివద్దకు వచ్చుచున్నది.

3. అమృత నిహితమును, సర్వజన హితకరమునునగు దివ్యజ్యోతిని, విశ్వనేతయగు సవిత, ఊర్ధ్వ దేశమున నాశ్రయించును. ఆయన దేవతల నుద్దేశించి యాగానుష్ఠానము కొఱకై ఉదయించును. దేవతలకు చక్షుః స్థానీయమైన ఉషస్తేజముగూడ, తమో వినాశము ద్వారా లోకావిర్భావము కొఱకై యావిర్భవించినది.

4. ఋతప్రతులును, ప్రాక్తన కవులునగు అంగిరోగణములే, ఋషిగణములలో దేవతతో సమానముగ నానందానుభవముగలవారు. సర్వపాలకులగు వారే తమస్సునందు నిగూఢమైన సౌరతేజమును తమ మంత్రబలమున పొందియుండిరి. సత్యమంత్రయుక్తులగు వారు, ఉషోదేవిని లోకపాలనము కొఱకు తమ మంత్ర ప్రభావముచే లోకమునకావిష్కరించిరి.

5) యువతియగు భార్యవలె ఉషోదేవి సర్వాలంకార శోభితయైనవోత్సాహముతో సూర్యుని సమీపమున విరాజిల్లుచున్నది. ఆమె లోకమునావరించిన సకల తమస్సులను పోకార్చుచు, తన జ్యోతిస్సులను లోకమున నావిర్భూత

మొనర్చి, లోకులను తిరిగి తమ తమ వ్యాపారములను కొనసాగించుటకై మేల్కొలుపుచున్నది. జనులకు అగ్ని సమింధన (అగ్ని హోత్రానుష్ఠానము) సమయమని గూడ తెల్పుచున్నది.

6) దేవతలకు చక్షుస్థానీయమగు తేజమును వహించుచు, సౌందర్యోపేత యగు ఉషోదేవి, తన కిరణములతో నలరారుచు, చిత్రధనోపేతయై, లోకము కొఱకు ముందుగా జాగృతయై, సుందరమును, శ్వేతవర్ణమునగు అశ్వమును అధిరోహించి ఈ లోకమున సాక్షాత్కరించుచున్నది.

7) ఓ దివోదుహితా, శోభానాభిజనా, ఉషోదేవి, నిన్ను వాసిష్ఠ కవులు తమ సుందరములగు ఋక్కులచే నుతియొనర్చుచున్నారు. వారికి ప్రసన్నురాలవై, ప్రదీప్తము, బృహత్తరమునగు సంపదను ప్రసాదింపుము. మీరు మాకు సకల శ్రేయముల నొసగి రక్షింపుడు.

8. ఉషోదేవత యొక్క ప్రథమ రశ్మలు లోకమున నామె యాగమనమును సూచించుటకై యవతరించుచున్నవి. ఈ యుషః కిరణములు ఊర్ధ్వముఖములై విరాజిల్లుచున్నవి. ఓ ఉషోదేవి, జ్యోతిష్మంతమగు, రథము నధిరోహించి మాకభిముఖముగ వచ్చి, మాకు భజనీయమగు ధనమునిచ్చుచున్నావు.

9) దివోదుహితయగు ఉషోదేవత సకల ధనస్వామిని యని అందరెఱుగుదురు. సకల జనులు లోకమున నిజ దీప్తితో ప్రకాశించు ఉషోదేవతను నిత్యము దర్శింతురు. ఆమె సుయోజితమును, అభిమత ప్రదేశ ప్రాపకమును నగు సుందరమును, స్వధా (అన్నము) సంభృతమునునగు రథమునెక్కి యీ లోకమున సాక్షాత్కరించుచున్నది.

10) ఉషస్సులు తమ దివ్యరోచిస్సులను ద్యులోకాంచలముల యందు ప్రకాశింప చేయుచున్నవి. పరస్పర సంగతితమైన ప్రజ శత్రు వినాశము గావించుచున్నట్లు తమోవినాశోద్యోగమునుషఃకిరణములు చేయును. ఓ ఉషోదేవి, నీ కిరణములు తమోవినాశము గావించి, సవితృబాహువుల వలె జ్యోతిస్సులను సర్వత్ర వ్యాపింపచేయుచున్నవి.

11) మేధావులైన (విప్రులు) వాసిష్ఠులు, ఇతర ఋక్కర్తలందరికి పూర్వమే, అనగా సర్వప్రథమముగ, ద్యావా పృథ్వ్యలయందు, ఏకీభూత ప్రాంతములైన వానియందు వ్యాప్తమైన పెనుచీకట్లను పోగొట్టి, సకల భువనములను తన దీప్తిచే నావిష్కరించు ఉషోదేవిని తమ స్తోమముల చేతను, స్తుతులతోను, వాక్కులతోను మేల్కొలుపుచు కీర్తించియున్నారు.

12. ఉషోదేవి నవ్యమను ఆయుస్సును కలుగచేయుచు, తమస్సును తిరోహితమొనర్చి తన దీధితులను విరజిమ్ముచు లోకమును మేల్కొల్పుచున్నది. ఈమె నవయువతివలె నిర్భయముగ సుర్యుని యెదుట నిల్చి, సూర్య, అగ్ని, యజ్ఞములను లోకులను గుణింపచేయుచున్నది.

(6-70-2)

13) ఓ మహాదేవి, ఉషోదేవతా, నీవు తమస్సులను పోకార్చుచు, మహామహిమోపేతవై సర్వజగత్ప్రబోధముగావించుచు, సర్వజగత్తునకు దర్శనమిచ్చుచున్నావు. తల్లి తన బిడ్డలను వలె మమ్ము ప్రేమించు, ఓ జగజ్జనని, మాకు నీవద్దనున్న మేలు రత్నములనిచ్చి, మమ్ములను సుఖపెట్టుము.

2) భరద్వాజుడు ఉషోదేవతను గానముచేసిన ఋక్కులలో ఒకటి రెండు ఋక్కులను చూడుడు :—

1) "ఏషాస్యానో దుహితాదివోజాః క్షితీరుచ్ఛన్తీ మానుషీరజీగః॥
యాభానునా రుశతారామ్యా స్వజ్ఞాయి తిరస్తమసశ్చిదక్తూన్॥

2) "పితద్ యయురరుణయుగ్భిరశ్వైశ్చిత్రం భాన్త్యుషసశ్చంద్రరథాః॥
అగ్రం యజ్ఞస్య బృహతోనయన్తీర్విభా బాధన్తే తమఊర్మ్యాయాః॥

3) ఉచ్ఛాదివోదుహితః ప్రత్నవన్నో భరద్వాజవద్ విధతేమఘోని॥
సువీరం రయిం గృణతేరిరీ హ్యురుగాయ మధి దేహిశ్రవోనః॥

(ఋ. వే. 6-65-172)

4) "భద్రాదదృక్ష ఉర్వియా విభాస్యుత్తే శోచిర్భానవో ద్యామపప్తన్।
ఆవిర్వక్షః కృణుషే శుంభ మానోషోదేవి రోచమానా మహోభిః॥
(ఋ.వే. 6-64-2)॥

భావార్థము :

1. ఈ దివోదుహిత, మా కొఱకు తమస్సులను పోగొట్టి, మనుష్యులను మేల్కొల్పుచున్నది. ఈ యుషోదేవి, దేదీప్యమానమగు కిరణజాలముతో కూడుకొని, రాత్రుల యందు, నక్షత్రాదీతర తేజస్సులను, చీకటులను నంతర్హితము గావించుచు లోకముచే చూడబడుచున్నది.

2. కాంతి రథముల నధిరోహించిన ఉషస్సులు, ప్రాతః కాలములందు బృహత్తరమైన యజ్ఞముల సంపాదనము గావించుచు, విస్తీర్ణము లగుచున్నవి. రాత్రుల చీకటులను బాధించుచు, అరుణ వర్ణములుగల గుఱ్ఱములను పూన్చిన రథములనెక్కి ఈ లోకమున నవతరించి చిత్రముగ ద్యోతమానములగుచున్నవి.

3. ఓ దివోదుహితా, సర్వప్రాచీనులమగు మా కొఱకు చీకట్లను పోగొట్టుము. ఓ ధనవతి, భరద్వాజునివలె నీ పరిచర్య చేయుచు, నిన్ను స్తుతించుచు నాకు- సువీర యుక్తమగు ధనమును, బహుజన స్తోత్రపాత్రమగు, అన్నమును ప్రసాదింపుము.

4. ఓ ఉషోదేవి, నీవు భద్ర దర్శనవు. చాల విస్తారము గలదానివి. నీ ప్రకాశవంతములగు కిరణములను కేతనములు అంతరిక్షము పైకెగురుచున్నవి నీవు, స్వదీప్తులతో ప్రకాశించుచు, నీ వక్షమును (సౌందర్యమును) లోకమున ప్రకటించుచున్నావు.

ఇటులనే దివ్యతేజో విరాజితయును, లోకోపరంజన కారియును, తమోపహారిణియు, తేజః ప్రదాయినియు, సూర్యుని పత్నియును, సకల సృష్టిపాలనకర్త్రియును, రజోగుణ బాహుళ్యముచే బ్రాహ్మియై, లోకమును కాలో,

న్ముఖము గావించు ఉషోదేవి దివ్య సౌందర్యమును వైదిక ఋషులు, భావసమున్నతములును, లలిత పదమంజులములునగు ఋక్కులతో నుతించుట ద్వారా తదుపాసనము గావించి, తత్ఫలముగ, ఆంతర, బాహ్య తమస్సుల నుండి, తమ యాత్మలను శాశ్వతముగ విముక్తమొనరించి; ఆ జగజ్జనని యనుగ్రహమున; నారాయణ రూపమును, సవితృ మండలాన్తర్వర్తియునగు భర్గమును (ఆత్మ తత్త్వము) సాక్షాత్కరించుకొని, దివ్యానందము ననుభవించి లోకము గూడనట్టి యానందానుభూతిని ఉషోదేవి సౌందర్యోపాసనము, ఉషస్సౌందర్య దర్శనముల ద్వారా పొందుటకై, తమ దివ్యానుభూతులను, తమ లలిత మంజులములగు ఋక్కులం భద్రపరచి, అనూచాన కవి పరంపరకందించియున్నారు.

ప్రచేతః కాలోద్భవుడగు, వాల్మీకి మహర్షి తనకు జ్యేష్ఠ సోదర సదృశుడైన వశిష్ఠుని నుండి, ఇతర ఋషుల నుండి, అనూచాన పరంపరలోని సౌందర్యోపాసనను హృదయఙ్గమ మొనరించుకొని సుందరకాండను నిర్మించియుండెనని నిస్సంశయముగ నుడువవచ్చును. ఈ సుందరకాండ ద్వారా వైదిక దేవతా సౌందర్యమును భూమ నిష్ఠ సౌందర్యముగ ప్రాచేతసుడు ప్రదర్శించి సౌందర్య మహత్త్వమును లోకమునకు ప్రకటించినాడు.

"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్।
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే॥"

(ఈశా వ్యాసము, 15.)

## 27. సత్యం-శివం-సుందరం

ఆత్మ సత్య స్వరూపము. అదియేతాత్త్వికము. ఆ పరతత్త్వ రూపమగు సత్యము, ఏకము, అద్వితీయము, ("సదేవ, సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్॥ ।ఛాం॥ ఉ ప. 8-2-1), అదియఖండ చైతన్యరూపము, నిరంజనము, నిత్యము, నిరవయవము, సర్వశక్తిమంతము, సర్వాధిష్ఠానము విద్యా

శక్తియను, మాయనధిష్ఠానముగ చేసికొని సగుణబ్రహ్మముగ మారును, ఆదియే శివము, భక్తులకు పాస్యము. ఆ మాయాశక్తి లేక దేవాత్మశక్తి, (శుద్ధవిద్య) భగవత్సాన్నిధ్యవశమున, భగవత్ప్రేరణచేత త్రిగుణాత్మకమైన, స్వాభిన్నమైన, ప్రకృతిని సక్రియ మొనర్పగా, సర్వసృష్టిని తనయందే లీన మొనర్చుకొనిన ఆమూల ప్రకృతి, ఈ బ్రహ్మాండమును తిర్గి యావిర్భవింపచేయును, అనగా విస్తరింపచేయును. సర్వాధిష్ఠానమగు పరమాత్మ తన యంతః ప్రవేశము ద్వారా జడ ప్రకృతిని సక్రియ మొనర్చును. ఈ విశ్వము యొక్క యునికికి మూలము (సత్తకు, Existence) సూత్రాత్మ. ఈ విశ్వము యొక్క నామ రూపములు (Name & Form) ప్రకృతికి సంబంధించినవి. ప్రాకృతికములగు నామరూపముల యునికి సూత్రాత్మపై ప్రతిష్ఠితమైయున్నది. కనుక ఈ నామరూపముల మాటుననుండి, ఆయాత్మ చైతన్యమే సౌందర్య రూపమున నభివ్యక్తమగుచుండును.

1. శ్రీరామసాన్నిధ్య వశాజ్జగదానంద దాయినీ ।
ఉత్పత్తి స్థితి సంహారకారిణీ సర్వదేహినామ్ ।
సాసీతా భవతిజ్ఞేయా మూల ప్రకృతి సంజ్ఞితా ॥
(రామోత్తర తాపిన్యుపనిషత్ "3"

2. "తత్సృష్ట్వాత దేవానుప్రావిశత్ ॥ (తై ॥ ఉప, ఆనందవల్లి.)

ఈ సృష్టియంతయు నాత్మాభివ్యక్తిని గూర్చియే జరిగినదని వేద ఋషుల యభిప్రాయము. ఎట్లు ఒక చిత్రకారుడు తనలోని సౌందర్యానుభూతిని, చిత్రముల ద్వారాను, విగ్రహ శిల్పముల ద్వారాను అభివ్యక్తము చేయునో, యట్లే యా విశ్వశిల్పియగు ప్రజాపతి, శివమూర్తి, నిజసౌందర్యమును ఈ విశ్వరూపమున నభివ్యక్తము చేయును. శుభసంస్కారములుగల, మనస్వియగు జీవుడు ఈ విశ్వములోని యణువణువున గోచరించు ఈ యనంత సౌందర్యమును చూచి మిక్కిలి యానందించును. దీని కాశ్రయమగు ఈ విశ్వమును స్వాయత్తము చేసికొని, తనమలినమైన కామవాసనను, అజ్ఞానుల

వలె తృప్తినొందించుటకొఱకు ప్రయత్నము చేయదు. నిర్మల బుద్ధి గలసహృదయులగు జీవులు ఈ విశ్వ సౌందర్యమునకు మూలమును అన్వేషించి, అది యఖండ చైతన్య ప్రతిచ్ఛాయ యని గ్రహించి, అట్టి సౌందర్య మూలము, అఖండ చైతన్యరాశి, విద్యాశక్త్యాశ్రయమగు "శివ" స్వరూపమునుపాసించి, తత్సాక్షాత్కార, తదనుగ్రహములను పొంది, శివానుగ్రహముచే; తన్మూలమును, సత్యస్వరూపమును, అఖండ అద్వయచిన్మాత్ర స్వరూపము నగు పరమాత్మ యందు తమ చిత్తములను లయించి తత్స్వరూపులే, స్వతాత్మలే అగుచున్నారు. ఈ యాత్మ ప్రాప్తియే సృష్టి రహస్యము. "సత్యం-శివం-సుందరమ్" అను ఆధ్యాత్మిక త్రిపద సూత్రము గూడ ఈ సృష్టి రహస్యమునే ప్రకటించుచున్నది. సౌందర్యోపాసము ద్వారా శివప్రాప్తి ; శివోపాసన ద్వారా సత్యప్రాప్తి అను లక్ష్యమును నిరూపించుటకే వాల్మీకి మహర్షి సుందరకాండము, తరువాత శ్రీ శంకర భగవత్పాదులు "సౌందర్యలహరి"ని రచించి యున్నారు.

1. "రూపం రూపం ప్రతిరూపోబ భూవతదస్యరూపం ప్రతిచక్షణాయ॥" అని శ్రుతి. (ఋ వే. 6-47-8)

(అనగా పరమేశ్వరుడు తన నిజ తత్త్వమును (అఖండా ద్వయ చైతన్య మయమగు దివ్యరూపమును) ప్రకటించుటకే లోకమున గల సకల మూర్త రూపములలోను (ఇంద్రియములచే గ్రహించుటకు వీలగు) చైతన్య స్థివమున ప్రవేశించుచున్నాడు. లోకములో లేక ఈ విశ్వములో గోచరించు కల నామ రూపాత్మక వస్తువులనుండి, ఆయాత్మ యఖండ చైతన్యమే యభివ్యక్తమగు చున్నదని దీని తాత్పర్యము.

సుందరకాండలో నభివ్యక్తము చేయబడిన చేతనాఽ చేతన జగద్గతమగు సౌందర్య మంతయు విద్యోపాధికుడగు సగుణ బ్రహ్మ ద్వారా, ఆత్మానుప్రవేశము ద్వారా నభివ్యక్తము చేయబడిన యఖండ చైతన్యమునకు మాఱురూపమే. ఈ రహస్యమును శుద్ధహృదయుడు, శుభ సంస్కార యుక్తుడు

రుద్ర రూపుడగు హనుమంతుడు గ్రహించినాడు. విద్యోపాధికుడగు శివుడు ఈ సుందరకావ్య ఖండికలో రాముడే. అతని విద్యాశక్తియే సీత. సీత శ్రీరాముని యందు ఆహ్లాదమును కల్గించు ఆహ్లాదినీ శక్తి. తద్విరహము వలననే రాముడు తన యాహ్లాదమును గోల్పోయి విరహ వ్యథను చెందినట్లు వర్ణించబడినది. శ్రీ రామ సాన్నిధ్య వశముననే సీత జగదాహ్లాద కారిణిగ నుండును. లేనిచో అవిద్యారూపమున, త్రిగుణాధీనమై, తమః ప్రధాన ప్రకృతిగ, దుఃఖసాగరోత్థితమగు తరంగము వలె కరుణామూర్తిగ నుండును. సీతాదర్శనానంతరము, హనుమ, తదాశ్రయుడగు రాముని నిజరూప మెఱుగ సమర్థుడాయెను. శక్తి-శివ రూపులగు సీతారాముల, నిజరూపమును ప్రకటించుతో పాటుగ, రామ శక్తియగు సీత యనుగ్రహమును, తదుపాసనమున పొంది- విద్యోపాధికుడగు రాముని (శివుని) ఉపాసించి, తదనుగ్రహమును పొందుటయను, లక్ష్యమును, శివశక్తుల యైక్యరూప మగు తత్త్వమును మధురమగు కావ్య శైలిలో "సుందరకాండము" అను కావ్య ఖండిక ద్వారా వాల్మీకి నిరూపించి యున్నాడు. అట్టి శివ-శక్తి విషయక తత్త్వజ్ఞానము వలననే జీవుడు యథార్థమైన శాంతిని ఆత్మానందము ననుభవించ గల్గును. ఇదియే సుందరకాండ లక్ష్యము.

స్వస్తి సన్మంగళాని భవంతు-విష్ణోర్బలం వర్ధతామ్-
లోకాస్సమస్తాస్సుఖినో భవంతు

-ఓం తత్సత్-

49714